వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఆది పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఆది పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ-మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ఆది పర్వం - 1

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి 2010)

18 సంపుటాల వెల : రూ. 720/-

C 27435

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 96351
హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

ఆది పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ వైద్యుల కృష్ణారావు, డాక్టర్ నిష్ఠల వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని

మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజు; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

ఆయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం – వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. అనుక్రమణికాపర్వము - 1	
1.	గ్రంథారంభము. (275+2)*	15
	2. పర్వసంగ్రహ పర్వము - 1	
2.	సమంతపంచక, అక్షౌహిణీప్రమాణములు-భారత శ్రవణఫలము. (396)	32
	3. పౌష్యపర్వము - 1	
3.	సరమకథ - అయోదధౌమ్యుని శిష్యులు - ఉత్తంకచరిత్రము. (188)	50
	4. పౌలోమ పర్వము - 9	
4.	కథా ప్రారంభము. (12)	64
5.	భృగుని ఆశ్రమమునకు పులోముడను రాక్షసుడు వచ్చుట. (34)	65
6.	చ్యవనుడు పుట్టుట- భృగువు అగ్నికి శాపమిచ్చుట. (14)	67
7.	కోపించిన అగ్ని మాయమగుట- బ్రహ్మ అతనిని ప్రసన్నుని చేయుట. (29)	68
8.	రురు ప్రమద్వరల వృత్తాంతము -ప్రమద్వర మరణించుట. (27+$\frac{1}{2}$)	70
9.	రురు ప్రమద్వరల వివాహము. (23+1)	71
10.	రురు డుండుభ సంవాదము. (8)	73
11.	డుండుభము రురునకు అహింస నుపదేశించుట. (19)	73
12.	సర్పయాగమును గురించి రురుడు తండ్రిని అడిగి తెలిసికొనుట. (6)	75
	5. ఆస్తీక పర్వము - 46	
13.	జరత్కారుడు పితరుల ఆజ్ఞతో వివాహమునకు అంగీకరించుట. (32)	75
14.	జరత్కారుని వివాహము. (7)	77
15.	ఆస్తీకుని జన్మవృత్తాంతము. (11)	78
16.	కద్రూ వినతలు పుత్రులను పొందుట. (25)	78
17.	అమృత మథనము. (13)	80
18.	విష్ణుమూర్తి మోహినీ రూపమును ధరించి అమృతమును రక్షించుట. (46+2$\frac{1}{2}$)	80
19.	దేవ దానవ యుద్ధము. (31)	83
20.	కద్రూ వినతల పందెము - కద్రువ తన పుత్రుల శపించుట. (16+3)	85
21.	సముద్ర వర్ణనము. (18)	86
22.	సర్పములు ఉచ్చైఃశ్రవము తోకను నల్లగాచేయుట. (12)	87

* బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
23.	వినత కద్రువకు దాసియగుట-గరుడుని పుట్టుక. (27)	87
24.	అనూరుడు సూర్యరథసారథి యగుట. (20)	90
25.	కద్రువ సూర్యుని, ఇంద్రాదులను స్తుతించుట. (17)	91
26.	ఇంద్రుడు వర్షముకురిపించి సర్పాలను తేర్చుట. (8)	92
27.	తల్లి దాస్యనివృత్తి గురించి గరుడుడు సర్పములను అడుగుట. (16)	93
28.	గరుడుడు అమృతమును తెచ్చుటకు వెళ్లుట. (21)	94
29.	గజ కచ్ఛపముల వృత్తాంతము. (44)	95
30.	గరుత్మంతుడు రౌహిణశాఖను నిర్జన పర్వతముపై విడచుట. (52)	98
31.	ఇంద్రుడు వాలఖిల్య మహర్షులను అవమానించుట - అరుణుడు, గరుత్మంతుడు పుట్టుట. (35)	101
32.	గరుడుడు యుద్ధం చేసి దేవతలను ఓడించుట. (25)	103
33.	గరుడుడు అమృతమును అపహరించుట. (25)	104
34.	ఇంద్ర గరుడుల స్నేహము, మాతృదాస్యవిముక్తి. (26)	106
35.	ముఖ్యమగు సర్పముల నామములు. (19)	107
36.	శేషుని తపస్సు - బ్రహ్మ వరములిచ్చుట. (25+1)	108
37.	వాసుకి మొదలగువారు సమాలోచనము చేయుట. (34)	110
38.	ఏలాపత్రుని అభిప్రాయము. (19)	112
39.	జరత్కారునికై వాసుకి అన్వేషణము. (14)	114
40.	పరీక్షిదుపాఖ్యానము. (32)	115
41.	శృంగి పరీక్షిత్తుకు శాపమిచ్చుట. (33)	117
42.	శమీకుడు గౌరముఖుని ద్వారా పరీక్షిత్తుకు శాపవిషయము తెలుపుట. (41)	119
43.	తక్షకుడు కాశ్యపుని మరలించి పరీక్షిత్తును చంపుట. (36)	122
44.	జనమేజయుని రాజ్యాభిషేకము - వివాహము. (11)	124
45.	జరత్కారుడు పితరులను దర్శించుట. (34)	125
46.	వాసుకి జరత్కారులు కలిసికొనుట. (23)	127
47.	జరత్కారుడు జరత్కారువును వివాహమాడుట. (43)	128
48.	ఆస్తీకుని జననము. (22)	131
49.	పరీక్షిత్తు వేటకు వెళ్లుట - శమీకుని అవమానించుట. (31)	132
50.	పరీక్షిత్తు మరణించుట - జనమేజయుని ప్రతీకారము. (54)	134
51.	జనమేజయుడు సర్పయాగము చేయుట. (17)	138

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
52.	సర్పయాగములో సర్పములు నశించుట. (10)	139
53.	తక్షకుడు ఇంద్రుని ఆశ్రయించుట. (26)	140
54.	ఆస్తీకుడు సర్పయాగమునకు వచ్చుట. (30)	141
55.	ఆస్తీకుడు చేసిన ప్రశంస. (17)	143
56.	జనమేజయుడు ఆస్తీకునకు వరమిచ్చుట. (26)	145
57.	సర్పయాగములో ఆహుతి అయిన ప్రధానసర్పములు. (24)	147
58.	సర్పయాగ సమాప్తి - ఆస్తీకునకు వరప్రాప్తి. (32)	148
	6. అంశావతరణ పర్వము - 6	
59.	మహాభారత కథా ప్రారంభము. (10)	151
60.	భారతకథానుబంధము. (24)	151
61.	కౌరవ పాండవుల మధ్యభేదము - యుద్ధ వృత్తాంతము. (53+2)	153
62.	మహాభారత మహత్త్వము. (53+11 $\frac{1}{2}$)	156
63.	ఉపరిచరమహారాజు చరిత్ర - వ్యాస జననము. (127+4 $\frac{1}{2}$)	159
64.	దేవతలను తమ అంశలతో భూమిపై అవతరించుమని బ్రహ్మ ఆదేశించుట. (54)	166
	7. సంభవ పర్వము - 75	
65.	మరీచి, మున్నగు మహర్షుల, దక్ష కన్యకల వంశ వివరణము. (56)	169
66.	మహర్షుల - కశ్యపపత్నుల సంతానము. (72+4 $\frac{1}{2}$)	172
67.	దేవతల, దైత్యుల అంశావతారముల వర్ణన. (164)	176
68.	దుష్యంతుని అద్భుత శక్తి - రాజ్యపాలన సామర్థ్యము. (15)	183
69.	దుష్యంతుడు వేటకై వనమునకు వెళ్లుట. (31)	184
70.	దుష్యంతమహారాజు కణ్వాశ్రమమున ప్రవేశించుట. (51)	185
71.	దుష్యంతమహారాజు శకుంతలతో సంభాషించుట. (42+14 $\frac{1}{2}$)	188
72.	శకుంతలా జననము. (19+5 $\frac{1}{2}$)	191
73.	శకుంతలా దుష్యంతుల గాంధర్వ వివాహము. (34+19 $\frac{1}{2}$)	193
74.	భరత జననము - రాజసభలో శకుంతల తన నిర్దోషితను సమర్థించుట. (133+89 $\frac{1}{2}$)	195
75.	దక్ష వైవస్వతమనువుల ఉత్పత్తి - నహుష యయాతుల చరిత్ర. (58)	207
76.	కచుడు శుక్రుని దగ్గర మృతసంజీవనీ విద్య పొందుట. (72+2)	210
77.	దేవయాని కచుని వివాహమాడగోరుట - కచుడు తిరస్కరించుట. (23)	215
78.	దేవయానీ శర్మిష్ఠల కలహము. (41+13)	216
79.	శుక్రాచార్యుడు దేవయానిని సముదాయించుట. (13+10 $\frac{1}{2}$)	219

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
80.	శర్మిష్ఠ దేవయానికి దాసి యగుట. (27+5 $\frac{1}{2}$)	221
81.	యయాతి దేవయానిని వివాహమాడుట. (38+3)	223
82.	దేవయానికి పుత్రుడు జన్మించుట - యయాతి శర్మిష్ఠలు ఏకాంతముగ కలిసికొనుట. (27+11)	226
83.	శుక్రాచార్యుడు యయాతిని వృద్ధుడవు కమ్మని శపించుట. (42+4 $\frac{1}{2}$)	228
84.	యయాతి పూరునికి తన ముసలితనమునిచ్చి అతని యౌవనమును గ్రహించుట. (34+1 $\frac{1}{2}$)	231
85.	యయాతి పూరునకు రాజ్యాభిషేకము చేసి వనమునకేగుట. (35+3 $\frac{1}{2}$)	233
86.	యయాతి స్వర్గమును పొందుట. (17)	235
87.	యయాతి పూరున కిచ్చిన ఉపదేశము. (13+4 $\frac{1}{2}$)	236
88.	యయాతి స్వర్గమునుండి పడుట - అష్టకుడతనిని ప్రశ్నించుట. (13)	237
89.	అష్టక యయాతుల సంవాదము - 1 (23)	238
90.	అష్టక యయాతుల సంవాదము-2 (27)	240
91.	యయాతి అష్టకుల ఆశ్రమధర్మ సంవాదము. (18)	243
92.	అష్టక యయాతి సంవాదము. (19)	245
93.	ఉత్తర యయాతి చరిత్ర. (28+20 $\frac{1}{2}$)	246
94.	పూరువంశ వర్ణనము. (64)	250
95.	పూరు, భరత, పాండు వంశముల వర్ణనము. (90)	253
96.	మహాభిష, వసు శాప వృత్తాంతము. (23)	258
97.	శాంతనూపాఖ్యానము. (32+6)	259
98.	భీష్ముని పుట్టుక. (24+4 $\frac{1}{2}$)	261
99.	వసిష్ఠోపాఖ్యానము. (49+2)	263
100.	సత్యవతీ లాభోపాఖ్యానము - (భీష్మ ప్రతిజ్ఞ) (103+13 $\frac{1}{2}$)	265
101.	చిత్రాంగద వృత్తాంతము. (14+3)	272
102.	విచిత్రవీర్య వృత్తాంతము. (73)	273
103.	భీష్మ సత్యవతీ సంవాదము. (26)	276
104.	వ్యాసుడు సత్యవతి ఆజ్ఞను పాటించుట కంగీకరించుట. (54+2)	278
105.	ధృతరాష్ట్ర - పాండు - విదురుల జననము. (32)	281
106.	అణీమాండవ్యోపాఖ్యానము. (17)	282
107.	మాండవ్యుడు యమధర్మరాజును శపించుట. (19)	283

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఆది పర్వం - 1

1. గ్రంథారంభము - మహిమ.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

పూర్వం ఒకప్పుడు కులపతి అయిన శౌనకుడు నైమిశారణ్యంలో ద్వాదశవార్షిక యాగం (12 ఏళ్లపాటు చేసే యజ్ఞం) చేస్తున్నాడు. అచ్చట వ్రతదీక్షాపరు లయిన బ్రహ్మర్షులు సుఖాసీనులయి ఉన్నారు. వారి దగ్గరకు లోమహర్షణుని పుత్రు డయిన ఉగ్రశ్రవు డనే పౌరాణికుడు వినయంతో వచ్చాడు. నైమిశారణ్యవాసులంతా ఆ ఉగ్రశ్రవుని నుండి చిత్రకథలు వినటానికి అతని చుట్టూ చేరారు. ఉగ్రశ్రవుడు ఆ మునులందరికీ నమస్కరించి "మీ తపస్సు నిర్విఘ్నంగా కొనసాగుతోందా'? అని అడిగాడు. వారంతా ఉగ్రశ్రవునికి స్వాగత సత్కారాలు చేసి, కూర్చున్న తరువాత వారు వేసిన ఆసనం మీద ఉగ్రశ్రవుడు వినయంతో కూర్చున్నాడు. విశ్రాంతి తీసుకొంటున్న ఉగ్రశ్రవసుని చూసి, ఒక ముని ప్రస్తావనాత్మకంగా ఇలా అడిగాడు. 'సూతపుత్రా! మీరు ఎక్కడి నుండి వస్తున్నారు? ఎక్కడెక్కడ ఎంతెంత కాలం ఉన్నారు? వివరంగా చెప్పండి.' ఇలా అడిగిన మునితో, మహర్షులతో నిండిన ఆ సభలో రౌమహర్షణి వచన రచనా చతురుడై ఇలా అన్నాడు.

'రాజర్షి అయిన జనమేజయుడు సర్పయాగం చేస్తున్నాడు. వ్యాసమహర్షి చెప్పిన వివిధ కథలను వైశంపాయనుడు అక్కడ చెప్పాడు. ఆ కథలన్నీ పుణ్య ప్రదాలు- మహాభారతానికి సంబంధించినవి - విచిత్ర మయిన అర్థాలున్నవి. వాటిని విని... (ఇక్కడకు వచ్చాను).

చాలా పుణ్యతీర్థాలు తిరిగి, విప్రసేవిత మయిన శమంతపంచకం అనే పుణ్యప్రదేశానికి వెళ్లాను. పూర్వం అక్కడే కురుపాండవులకూ, మహారాజులందరకూ యుద్ధం జరిగింది. అక్కడ నుండి మీ దగ్గరకు వచ్చాను. మీరంతా పెద్దలు - బ్రహ్మభూతులని నా అభిప్రాయం. ఈ యజ్ఞంలో మీరు సూర్యుని వలె, అగ్నిహోత్రులవలె ప్రకాశిస్తున్నారు. విప్రులారా! మీరంతా స్నానంచేసి, శుచులై, జపం చేసుకొని, అగ్నికార్యాలు తీర్చుకొని, స్వస్థమనసుతో కూర్చున్నవారు. మీకు నేనేమి వినిపించాలి? మహాత్ములయిన రాజుల చరిత్రలు, మహర్షుల చరిత్రలు, ధర్మార్థాలతో కూడిన పుణ్యపురాణకథలు చెప్పుదునా?' అనగానే ఋషులు ఇలా అన్నారు. కృష్ణద్వైపాయన మహర్షి చెప్పిన భారత మనే ఇతిహాసం వినాలనుకొంటున్నాము. పూర్వం దాన్ని దేవతలూ, బ్రహ్మర్షులూ విని పూజించారట. అది విచిత్రమైన పదవిన్యాసాలతో కూడిన ఉత్తమకథ యట. సూక్ష్మార్థాలతోను, న్యాయాలతోను కూడినది. వేదార్థాలతో నిండినది. పుణ్యప్రదం, గ్రంథార్థాలతో కూడినది. సంస్కార యుత మయిన వాగ్విశేషాలతో, అనేక శాస్త్రవిశేషాలతో నిండినది- జనమేజయుని యాగంలో ఆ భారతాన్ని వ్యాసమహర్షి ఆజ్ఞతో శిష్య డయిన వైశంపాయనుడు విధియుక్తంగా చెప్పాడట. అలా చతుర్వేద విశేషాలతో వ్యాసమహర్షి పరమాద్భుతంగా వ్రాయగా, పుణ్యప్రదమై, పాప భయాలను పోగొట్టే ఆ భారతసంహితను వినాలని కోరుతున్నాం.'

వెంటనే ఉగ్రశ్రవుడు ఇలా అన్నాడు. 'ఆదిపురుషునకు నమస్కారం. ఆ ఆదిపురుషుడే సర్వేశ్వరుడు- యజ్ఞాలలో ఆయనను గురించియే హోమం చేస్తారు- ఆయననే ఆహ్వానం చేస్తారు. సత్యస్వరూపుడు అతడు. ఏకాక్షర స్వరూప మయిన బ్రహ్మ అతడే- వ్యక్తా వ్యక్తరూపుడు - సనాతనుడు- సత్తు, అసత్తుల రూపమై వీనికి మించిన వాడై - స్థూల సూక్ష్మ జగత్తులను అతడే సృష్టిస్తాడు. చాలా పూర్వుడు. తరగని వాడు- శుభప్రదుడైన శుభరూపుడు. అంతటా వ్యాపించి ఉండేవాడు. శ్రేష్ఠుడు, దోషరహితుడు. శుచియై ఇంద్రియాలను అదుపు చేసేవాడు. చరాచర ప్రపంచానికి గురువు. ఆ శ్రీహరికి నమస్కరించి వ్యాసమహర్షి మనసునుండి ఉద్భవించిన శ్రీ మహాభారతాన్ని మీకు చెపుతాను' అని రోమహర్షణి మరల ఇలా ఆరంభించాడు. 'ఈ ఇతిహాసాన్ని ఈభూమిపై చాలామంది కవులు పూర్వం చెప్పారు. ఇప్పుడూ కొంతమంది చెపుతున్నారు. ఇంకా చాలామంది ముందు చెపుతారు. **మూడు లోకాల్లోనూ ఉన్న విజ్ఞానమంతా ఇందులో ప్రతిష్ఠితమై ఉంది.** దీన్ని త్రివర్ణాల వారూ విస్తార రూపంగానూ, సంక్షేపరూపంగానూ చెప్పుకొంటారు. ఈ మహాభారతం శుభశబ్దాలతో అలంకృత మయింది. దివ్య, మానుష సంకేతాలతో (ఆచారాలతో) నిండి ఉంది. అనుష్టుప్పు మొదలయిన ఛందస్సులతో, వృత్తాలతో విద్వాంసులకు ప్రీతిని కలిగిస్తూ

ఉంటుంది.

(వ్యాసమహర్షి హిమవత్పర్వతపాదంలో ఉన్న ఒక గుహలో దర్భాసనం మీద కూర్చున్నాడు. స్నానాదికంతో శరీరాన్ని పరిశుద్ధి చేసుకొని కూర్చున్నాడు. నియమంతో శాంతాత్ముడై, తపోనిష్ఠలో ధర్మదృష్టితో భారత ఇతిహాసంయొక్క గమనం అంతా చూశాడు. యోగంలో ప్రవేశించి, జ్ఞానంతో చివరిదాకా చూశాడు.)

సృష్టికి పూర్వం ఇదంతా చీకటితో నిండిపోయి ఉంది. వెలుగులేదు. ఆ సమయంలో ఒక పెద్ద అండం ఉద్భవించింది. అది ప్రజల సృష్టికి తరగని బీజ మయింది. యుగాదికి ఆ దివ్య మయిన అండమే కారణమయింది. దానిలోనే సత్యస్వరూపమూ, జ్యోతీరూపమూ, సనాతనమూ అయిన బ్రహ్మ అంతర్యామి రూపంగా ప్రవేశించింది. ఆ బ్రహ్మము అద్భుత మయినది- భావింపశక్యం కానిది. అంతటా సమత్వం పొందినది. అవ్యక్తమూ, సూక్ష్మమూ, కారణరూపమూ అయినది. సదసదాత్మకం అయినది. దానినుండియే హిరణ్యగర్భుడు పుట్టాడు. అతడు ప్రథమ దేహధారి. ప్రజాపాలకు డయిన ప్రభువు. తరువాత త్రిగుణప్రధాను లయిన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు ఉద్భవించారు. తరువాత (బ్రహ్మ యొక్క సృష్టికార్యం కోసం) మనువు, ప్రజాపతి, పరమేష్ఠి, ప్రాచేతసుడు, దక్షుడు, దక్షపుత్రు లేడుగురు పుట్టారు. ఆ తరువాత ఇరవై ఒక్క మంది ప్రజాపతులు పుట్టారు.

ఋషు లందరికీ తెలిసిన అప్రమేయు డయిన పురుషుడు, విశ్వేదేవులు, ఆదిత్యులు, వసువులు, అశ్వినీదేవతలు పుట్టారు. యక్షులు, సాధ్యులు, పిశాచులు, గుహ్యకులు, పితృదేవతలు, శిష్టులై విద్వాంసులైన బ్రహ్మర్షి సత్తములూ పుట్టారు. సర్వలక్షణలక్షితులైన ఎంతో మంది రాజర్షులు ఉద్భవించారు. నీరు, ఆకాశం, భూమి, వాయువు, అంతరిక్షం, దిక్కులు ఉద్భవించాయి. సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, దివారాత్రాలు క్రమంగా లోకసాక్షికా లయిన అన్నీ ఉద్భవించాయి. పూర్వం ఉండి, ఇపుడు కనపడే స్థావర జంగమాత్మక మయిన జగత్తు అంతా యుగాంతంలో మళ్లీ లీనమయిపోతుంది. కొత్త ఋతువు వచ్చేసరికి కొత్త చిహ్నాలు (వసంత ఋతువులో చెట్లు చిగిరించడం మొదలయిన చిహ్నాలు) కనపడినట్లే ఆయా యుగాల మొదట్లో పూర్వయుగాల చిహ్నాలే కనపడతాయి. ఇలా ఆదీ, అంతమూ లేకుండా ప్రాణులన్నిటి సంహారానికీ కారణమవుతూ ఆదీ, అంతమూలేని లోకచక్రం ప్రవర్తిస్తూ ఉంటుంది. ఇలా దేవతల సృష్టి ముప్పది మూడువేలు అనీ, ముప్పదిమూడు వందలనీ, ముప్పదిమూడు అనీ సంక్షేప లక్షణంగా చెప్పబడుతుంది.

దివఃపుత్రుడు, బృహద్భానుడు, చక్షుడు, ఆత్మ, విభావసుడు, సవిత, ఋచీకుడు,

అర్కుడు, భానుడు, ఆశావహుడు, రవి - పూర్వం ఈ శబ్దాలన్నీ సూర్యుని గురించే చెప్పబడేవి. వీరిలో చివరి 'రవి' శ్రేష్ఠుడు. మహ్యుడు. (మహిలో - భూమిలో గర్భస్థాపనం చేసేవాడు) ఆ రవికి కొడుకు దేవభ్రాట్టు- వాని కొడుకు సుభ్రాట్టు. సుభ్రాట్టుకు ముగ్గురు కొడుకులు. వారంతా సంతాన వంతులు- చాలా శాస్త్రాలు చదివినవారు- ఆ కొడుకులు 1. దశజ్యోతి 2. శతజ్యోతి 3. సహస్రజ్యోతి అనేవారు. అందులో మహాత్ము డయిన దశజ్యోతికి పదివేలమంది కొడుకులు. అతనికి పదిరెట్లు అనగా లక్షమంది కొడుకులు శతజ్యోతికి. సహస్రజ్యోతికి ఇంకా పదిరెట్లు అనగా పది లక్షలమంది కొడుకులు. వారినుండే ఈ కురువంశమూ, యదువంశమూ, భరతవంశమూ, రాజర్షులయిన యయాతి, ఇక్ష్వాకు వంశాలూ, ఇలా చాలా వంశాలు ఉద్భవించాయి. అపుడే ప్రాణుల సృష్టిపరంపర ఎంతో విస్తరించింది. వ్యాసమహర్షి తన జ్ఞాన దృష్టితో ప్రాణులన్నిటి నివాస స్థానాలూ; ధర్మం, అర్థం కామం - వీటి భేదాలు, రహస్యాలు; వేదాలు, విజ్ఞాన సహిత యోగం, ధర్మార్థ కామసహితాలైన వివిధ శాస్త్రాలు; లోకయాత్రావిధానం- అంతా చూశాడు. అందులోనే ఈ మహాభారత గ్రంథమూ వ్యాఖతో కూడిన ఇతర ఇతిహాసాలూ, వివిధ శ్రుతులూ- అన్నీ కనిపించాయి. ఈ గ్రంథ లక్షణం కూడా చెప్పబడింది. ఈ మహావిజ్ఞానమంతా వేదవ్యాస మహర్షి విస్తరించీ చెప్పాడు, సంక్షేపంగానూ చెప్పాడు. ఇలా విస్తరంగానూ, సంక్షిప్తంగానూ రెండు విధాలా చెప్పడం (అప్పటి) పండితలోకానికి ఇష్టంగా ఉండేది. కొంతమంది విప్రులు ఈ శ్రీ మహాభారతాన్ని మనువు దగ్గరనుంచి చదివేవారు. మరికొందరు ఆస్తీకచరితం దగ్గరనుంచి చదివేవారు. ఇంకా కొందరు ఉపరిచరవసువు కథనుంచి చక్కగా పఠించేవారు. ఈ భారత సంహితలోని వివిధ విజ్ఞానం అంతా ధీమంతులు అనేక విధాల వెలుగులోకి తెచ్చేవారు. కొంతమంది నేర్పుగా వ్యాఖ్యానం చేసేవారు. కొంతమంది శ్లోకాలను కంఠస్థం చేసి చెప్పేవారు.

తపస్సుచేతను, బ్రహ్మచర్యం చేతనూ సనాతనమయిన వేదాన్ని వింగడించి/ వ్యాసం చేసి సాత్యవతేయుడు పుణ్యప్రద మయిన ఈ ఇతిహాసాన్ని చేశాడు. పరాశరుని కొడుకయిన వ్యాసమహర్షి దీక్ష వహించి ఉత్తమ మయిన ఈ భారతకథను చెప్పాక "దీన్ని శిష్యులకు ఎలా బోధించాలి?" అని ఆలోచించాడు. వ్యాసమహర్షి మనసు తెలుసుకొని లోకగురువయిన బ్రహ్మదేవుడు వ్యాసునికీ, లోకానికంతకూ, ప్రీతీ, హితమూ చేకూర్చాలని స్వయంగా అక్కడకు వచ్చాడు. ప్రత్యక్షమయిన బ్రహ్మను చూసి ఆశ్చర్యంతో అంజలించాడు వ్యాసమహర్షి. వెంటనే మునులందరితో కలిసి పితామహునికి ఆసనం కల్పించాడు. ఆ ఉత్తమాసనం మీద కూర్చున్నాడు హిరణ్యగర్భుడు. అతనికి ప్రదక్షిణ చేసి సమీపంలో

కూర్చున్నాడు వ్యాసమహర్షి. పరమేష్ఠి అయిన బ్రహ్మ వ్యాసమహర్షిని అనుమతించాక సంతోషంతో ఆయనకు దగ్గరగా కూర్చున్నాడు వ్యాసుడు. అపుడు మహాతేజస్వి అయిన వ్యాసమహర్షి బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు. 'మహాత్మా! పరమ పూజ్య మయిన ఈ కావ్యం నాచేత రచింపబడింది. పితామహా! ఇందులో వేదరహస్యమూ, వేదాంగాల, ఉపనిషత్తుల సారమూ, విస్తారంగా స్థాపింపబడినాయి. ఇతిహాస పురాణాల సారమంతా ఈ కావ్యంలో ప్రతిష్ఠింపబడింది. మూడు కాలాలకూ సంబంధించిన విశేషాలన్నీ ఉన్నాయి ఇందులో. జరామరణాలు, భయాలు, వ్యాధులు వీని సత్యాసత్య (నిత్యానిత్య) నిశ్చయాలు, వివిధ ధర్మాలూ, ఆశ్రమాలు వీని లక్షణాలూ చెప్పబడినవి. నాలుగు వర్ణాల విధానం, పురాణా లన్నిటి సారమంతా, చెప్పబడింది. తపస్సు యొక్క, బ్రహ్మచర్యం యొక్క విధానమంతా చెప్పబడింది. భూమి, సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు, తారలు – వీటి ప్రమాణాలు, యుగప్రమాణాలు చెప్పబడినవి. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధ్యాత్మవిద్య అన్నీ చెప్పబడినవి. న్యాయం, శిక్ష, చికిత్స, దానం, పాశుపతం, చెప్పబడ్డాయి. దివ్య, మానవ జన్మల కారణాలు వివరించబడినవి. పుణ్యతీర్థాలు, దేశాలు, నదులు, పర్వతాలు, అరణ్యాలు, సముద్రాలూ ... వీని వర్ణన లున్నాయి. దివ్యనగరాలు, దుర్గాలు మొదలయిన వాని నిర్మాణాలు, యుద్ధకౌశలాలు, వీని వర్ణనలు ఉన్నాయి. వేర్వేరు భాషల, జాతుల విశేషా లున్నాయి. లోకవ్యవహార క్రమాలన్నీ ఉన్నాయి. లోకంలో ఉపకరించే సర్వ వస్తువర్ణనలూ ప్రతిపాదించబడినవి. కాని దీనిని వ్రాయటానికి తగిన లేఖకుడు మాత్రం ఈ భూమి మీద కనపడటంలేదు.'

వ్యాసుని ఈ మాటలు విని బ్రహ్మ ఇలా అన్నాడు. 'మహర్షీ! నీకు గుప్తమయిన జ్ఞానమంతా తెలుసును. తపోవిశిష్టుడవు– మునులందరికంటే విశిష్టుడవు. అందుకే నిన్ను మహర్షి శ్రేష్ఠుడ వని నేను భావిస్తున్నాను. నీవు పుట్టినప్పటి నుండి నిన్ను బ్రహ్మవాదిని అయిన వాణి ఆశ్రయించి సత్యభాషణం చేయిస్తోంది. నీవు నీ రచనను కావ్య మని అన్నావు కదా! అందుచేత ఇది కావ్యమే అవుతుంది. ఈ కావ్యాన్ని ఇంతకంటె విశేషించి ఎవరూ చెప్పలేరు. మిగిలిన మూడు ఆశ్రమాల కంటె గృహస్థాశ్రమం శ్రేష్ఠ మయినట్లే కావ్యాలన్నిటికంటె శ్రీ మహాభారతం శ్రేష్ఠమయింది. అందుచేత ఈ కావ్యాన్ని వ్రాయటానికి గణేశుని స్మరించు.' రోమహర్షణి ఇలా అన్నాడు. ఇలా చెప్పి బ్రహ్మ తన లోకానికి వెళ్లిపోయాడు. వెంటనే వ్యాసమహర్షి గణేశుని స్మరించాడు. భక్తుల మనోరథాన్ని తీర్చే విఘ్నేశ్వరుడు వ్యాసుడున్న చోటికి వచ్చాడు. వ్యాసుడు అతనిని యథావిధిగా పూజించాడు. గణాధిపుడు సుఖాసీను డయ్యాక వ్యాసు డిట్లా అన్నాడు. 'గణాధిపా! నేను మనసులో

భావిస్తూ చెప్పే ఈ భారతానికి నీవు లేఖకుడవు కావాలి.' ఆ మాట విన్నవెంటనే విఘ్నేశ్వరుడు "నా లేఖిని క్షణకాలం కూడ ఆగకుండా చెప్పితే అపుడు నేను లేఖకుడను అవుతాను" అన్నాడు. వ్యాసుడు వెంటనే గణాధిపునితో "అర్థం తెలియకుండా ఎక్కడా వ్రాయకు" అన్నాడు. 'సరే!' అని వినాయకుడు లేఖకుడయ్యాడు.

వ్యాసమహర్షి ప్రతిజ్ఞచేసి చెప్పడంతో, ఉద్దేశపూర్వకంగా గ్రంథగ్రంథిని కూర్చేవాడు, (గూఢమైన అర్థం ఉండేటట్లు ముడులతో వ్రాసే పద్ధతి గ్రంథగ్రంథి). అటువంటి శ్లోకాలు ఎనిమిదివేల ఎనిమిది వందలున్నాయి. ఆ శ్లోకాలకు అర్థం నాకు తెలుసు- శుకుడికి తెలుసు- సంజయుడికి తెలుసునో లేదో... గూఢంగా దృఢంగా కూర్చిన, ఆ శ్లోకాల సముదాయానికి అర్థం వివరించటానికి ఇప్పటికీ ఎవరికీ శక్యం కాదు. అవి అన్నీ గూఢార్థాలు, యోగార్థాలు, యోగగూఢాలు కలవి. వాటి అర్థం తెలుసుకొనటానికి గణేశుడు క్షణకాలం ఆలోచించేవాడు. అంతలో వ్యాసుడు చాలా శ్లోకాలు చెప్పేవాడు. **అజ్ఞాన మనే చీకటిలో కనులు మూసుకుపోయిన లోకానికి జ్ఞాన మనే కాటుక పుల్లలతో కనులు తెరిపిస్తుంది, వెలుగుల నిస్తుంది శ్రీమహాభారతం.** అలాగే ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలతో విస్తారంగానూ, సంక్షిప్తంగానూ చెప్పిన ఈ మహాభారతం అనే సూర్యుని చేత లోకాల చీకట్లు పటాపంచలయ్యాయి. పురాణ మనే పూర్ణిమాచంద్రుని చేత వేదాల వెన్నెలలు విరిశాయి. దానితో మానవుల మనసులనే కలువలకు ప్రకాశమూ, వికాసమూ కలిగింది. **అజ్ఞాన మనే ఆవరణాన్ని పోగొట్టే ఈ ఇతిహాసం అనే దీపం లోక మనే గర్భాలయాన్ని పంపూర్ణంగా ప్రకాశింపజేసింది.**

ఈ మహాభారత మనే మహావృక్షానికి సంగ్రహాధ్యాయం విత్తనం. పౌలోమపర్వం, ఆస్తీకపర్వం మూలం. సంభవపర్వం విస్తరించిన మాను. సభాపర్వం, అరణ్యపర్వం పక్షులుండే తొట్టి. అరణీపర్వం అందమైన రూపం. విరాటోద్యోగ పర్వాలు ఈ చెట్టుకు సారభూతమైనవి. భీష్మపర్వం అనేది పెద్దకొమ్మ. ద్రోణ పర్వం ఆకుల గుబురు. కర్ణపర్వం, తెల్లని పుష్పాలు. శల్యపర్వం వాని సువాసనలు. స్త్రీ పర్వం, ఇషీకపర్వం అనేవి చెట్టు నీడలు. శాంతి పర్వం గొప్ప ఫలం- (మహాఫలం = మోక్షం). అశ్వమేధ పర్వం అమృత రసం. ఆశ్రమవాస పర్వం స్థిర మయిన ఆశ్రయం. మౌసల పర్వం సంక్షిప్త వేదం. అది శిష్ట లయిన ద్విజులచే సేవింపబడుతుంది. ప్రాణు లన్నిటికీ మేఘం జీవనప్రదాత. అలాగే మహాకవులందరికీ ఈ భారత మహావృక్షం ప్రధానాశ్రయం అవుతుంది. ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు. ఆ వృక్షాన్ని గురించి చెపుతాను. దానికి ఎల్లప్పుడూ పూలూ పండ్లూ ఉదయిస్తూ ఉంటాయి. ఆ ఫలాల రసం చాలా ఆస్వాదయోగ్యంగా ఉంటుంది, శుచియైనది.

ఆ వృక్షాన్ని అమరులు కూడ నరుకలేరు.

తల్లియైన సత్యవతి ఆజ్ఞతోనూ, ధీమంతుడయిన భీష్ముని అనుజ్ఞతోనూ ధర్మాత్ముడయిన వ్యాసుడు విచిత్రవీర్యుని క్షేత్రాలలో మూడగ్నులవలె ముగ్గురు పుత్రులను కలిగించాడు. వారు ధృతరాష్ట్రుడు, పాండుడు, విదురుడు. తరువాత వ్యాసుడు మళ్లీ తపస్సు చేసుకొనటానికి ఆశ్రమానికి వెళ్లిపోయాడు. వారు పెద్దవాళ్లయి పరమగతిని పొందాక ఈ లోకంలో మహర్షి భారతం చెప్పాడు. జనమేజయుడూ, బ్రాహ్మణులూ అడిగితే వ్యాసమహర్షి తన సమీపమందున్న శిష్యుడు వైశంపాయనుని "భారతం చెప్పు"మని ఆదేశించాడు. ఆ వైశంపాయనుడు యజ్ఞంలో సదస్యులు మళ్లీ మళ్లీ అడిగితే యజ్ఞకర్మల మధ్యలో భారతం వినిపించాడు. కురువంశం విస్తరించడం, గాంధారి యొక్క ధర్మశీలం, విదురుని ప్రజ్ఞ, కుంతీదేవి ధైర్యం, వీని అన్నిటినీ వ్యాసమహర్షి భారతంలో చెప్పాడు. శ్రీకృష్ణుని మాహాత్మ్యమూ, పాండవుల సత్యనిష్ఠ, ధార్తరాష్ట్రుల దుష్ప్రవర్తన అన్నీ వ్యాసుడు చెప్పాడు. పుణ్యాత్ములకు ఈ భారతం ముందుగా చదువదగింది. ఇది ఉపాఖ్యానాలతో సహా లక్ష శ్లోకాలతో కూడినది. ఉపాఖ్యానాలు లేకుండా భారత సంహితను 24000 శ్లోకాలుగా బుధులు చెప్పేవారు. దానికంటె కూడా సంక్షేపంగా మహర్షి నూట ఏబది శ్లోకాల్లో చెప్పాడు. అన్ని పర్వాల కథతో కూడిన ఈ అనుక్రమణికాధ్యాయం వ్యాసుడు తన పుత్రు డయిన శుకునికి బోధించాడు.

అరవై లక్షల శ్లోకాలతో మరో సంహితను చేసి అనురూపులైన ఇతర శిష్యులకు ఇచ్చాడు వ్యాసుడు. ముప్పది లక్షల శ్లోకాలు దేవలోకంలో ప్రతిష్ఠింపబడినవి. పితృలోకంలో పదిహేను లక్షల శ్లోకాలు, గంధర్వ లోకంలో పదునాల్గు లక్షల శ్లోకాలు విస్తరించాయి. ఒక లక్షశ్లోకాలు మనుష్యలోకంలో ప్రతిష్ఠించారు. నారదుడు దేవలోకంలోను, అసితు డయిన దేవలుడు పితృలోకంలోను వినిపించారు. శుకుడు గంధర్వయక్ష రాక్షసులకు వినిపించాడు. ఈ మనుష్య లోకంలో వ్యాస శిష్యుడూ, సర్వవేదవేత్త, ధర్మాత్ముడూ అయిన వైశంపాయనుడు చెప్పాడు. ఇపుడా లక్ష శ్లోక పరిమితమయిన భారతం నేను చెపుతాను వినండి. **దుర్యోధనుడు క్రోధాసూయాత్మక మయిన మహావృక్షం. అందులో కర్ణుడు స్రామ- శకుని దాని కొమ్మలు- దుశ్శాసనుడు పూలూ, పండ్లూ- బుద్ధిలేని ధృతరాష్ట్రమహారాజు మూలం.* ధర్మరాజు ధర్మమయ మయిన మహావృక్షం- అర్జునుడు స్కంధం- భీమసేనుడు కొమ్మలు- నకుల సహదేవులు పూలూ,**

* దుర్యోధనో మన్యుమయో మహాద్రుమః స్కంధః కర్ణః శకునిస్తస్య శాఖాః ।
దుశ్శాసనః పుష్పఫలే సమృద్ధే మూలం రాజా ధృతరాష్ట్రోఽమనీషీ ॥ 110

పండ్లూ- కృష్ణుడు, వేదాలూ, బ్రాహ్మణులూ మూలం.*

తెలివితోనూ, పరాక్రమంతోనూ పాండురాజు చాలా దేశాలు జయించి, వేటమీది ఆసక్తితో అరణ్యాలలో మునులతో కలిసి నివసించేవాడు. రతిక్రీడలో ఉన్న మృగాన్ని చంపి పాండురాజు చాలా పెద్ద కష్టం తెచ్చుకొన్నాడు. అయినా పుట్టడం దగ్గరనుండి పాండవులకు ఆచార విధులన్నీ సక్రమంగానే జరిగాయి. ధర్మరహస్యాన్ని గురించి తల్లుల అనుగ్రహం ఉండటం చేతనూ, యమధర్మరాజు, వాయు, దేవేంద్రుల యొక్కయు, అశ్వినీ దేవతల యొక్కయు అనుగ్రహం వల్లనూ (ఆచార విధులన్నీ నిర్దోషంగా సాగాయి). (భర్తకు ప్రియమైన కుంతి ధర్మరహస్యాలు తెలుసుకొని పుత్రకాంక్షతో ధర్మ, వాయు, దేవేంద్రులను ఆహ్వానించింది. అలాగే కుంతి ఇచ్చిన మంత్రం ఉపయోగించి, మాద్రి అశ్వినీ దేవతలను ఆహ్వానించింది. వారివలన పాండవులుద్భవించారు.) వారిని తల్లులు రక్షించారు. శుచియైన అరణ్యాల్లో, పుణ్యాశ్రమాల్లో తాపసులు పెంచారు. (పాండురాజు చనిపోయాక) మహర్షులు పాండురాజు పుత్రులను కౌరవుల దగ్గరకు స్వయంగా తీసుకువచ్చి అప్పజెప్పారు. అపుడు పాండవులు జడలు దాల్చి బ్రహ్మచారులై ఎంతో అందంగా చూడముచ్చటగా ఉన్నారు. 'మీకు పుత్రులూ, సోదరులూ, శిష్యులూ స్నేహితులు అయిన పాండవులు వీరు' అని చెప్పి మహర్షులు అంతర్ధాన మయిపోయారు. పాండవులను చూసి కౌరవులు, మిగిలిన పౌరులూ ఎంతగానో సంతోషంతో గంతులు వేశారు. అయితే వీరు పాండురాజు పుత్రులు కారని కొంద రన్నారు. పాండుపుత్రులే అని మరికొంద రన్నారు. పాండురాజు ఎపుడో చనిపోయాడు, వాని కిపుడు పుత్రు లేమిటి? అని కొందరన్నారు. "భాగ్యవశాత్తు పాండురాజు కుమారులను చూడగలిగాము. చాలా సంతోషం వీరికాక- వీరికి స్వాగతం చెప్పండి" అనే మాటలు అంతటా వినిపించాయి. ఈ శబ్దాలు తగ్గిన తరువాత దిక్కులన్నీ ప్రతిధ్వనిస్తూ అదృశ్యదేవతల శబ్దాలు విశేషంగా వినవచ్చాయి. పరిమళయుత మయిన పూలవాన కురిసింది. పాండవుల ప్రవేశసమయంలో శంఖ దుందుభిస్వనాలు మ్రోగాయి. అదంతా చాలా ఆశ్చర్యకరంగా జరిగింది.

పాండవుల మీద ఉన్న ప్రీతితో పౌరులంతా సంతోషించి చేసిన శబ్దాలు మిన్నుముట్టాయి. పాండవులు అఖిలవేదాలూ, శాస్త్రాలూ చదువుతూ అక్కడ నిర్భయంగా సన్మానార్హులై ఉన్నారు. దేశంలోని ప్రజలందరూ ధర్మరాజు యొక్క శుచిత్వంతో ప్రీతిచెందేవారు- భీమసేనుని ధైర్యానికీ, అర్జునుని పరాక్రమానికీ, నకుల సహదేవుల

* యుధిష్ఠిరో ధర్మమయో మహాద్రుమః స్కంధోఽర్జునో భీమసేనోఽస్య శాఖాః ।
మాద్రీసుతౌ పుష్పఫలే సమృద్ధే మూలం కృష్ణో బ్రహ్మ చ బ్రాహ్మణాశ్చ ॥ 111

గురుశుశ్రూషకూ, సహనానికీ, వినయానికీ ఎంతగానో సంతోషించారు. పాండవుల పరాక్రమానికి లోకమంతా సంతోషించింది. అర్జునుడు రాజులందరి సమక్షంలో దుష్కరమైన (మత్స్యయంత్రం కొట్టి) కార్యం చేసి, స్వయంవరంలో నిలిచిన కృష్ణను (ద్రౌపదిని) గ్రహించాడు. అప్పటినుండి అర్జునుడు ధనుర్ధారు లందరిలోను పూజ్యుడయ్యాడు. యుద్ధాలలో అర్జునుడు సూర్యునివలె తేరిపార చూడరాని వాడయ్యాడు. అర్జునుడు పెద్దసైన్యం ఉన్న మహారాజు లందరినీ జయించి ధర్మరాజు చేత రాజసూయ యాగం చేయించాడు. శ్రీకృష్ణుని రాజనీతితోను, భీమార్జునుల బలపరాక్రమాల తోను, జరాసంధుని చంపించి, బలగర్వితుడయిన శిశుపాలుని చంపించి, ధర్మరాజు రాజసూయ మహాక్రతువు చేశాడు. అతడు రాజసూయంలో భూరిదక్షిణ లిచ్చి అందరినీ భోజనతృప్తులను చేశాడు. ఆ యజ్ఞంలో రాజులందరూ భూషణాలు, మణులు, బంగారం, రత్నాలు, గోవులు, గుర్రాలు, ఏనుగులు విచిత్రమయిన వస్త్రాలు, పరదాలు, శిబిరాలు, కంబళ్లు, మృగచర్మాలు, గొఱ్ఱె చర్మాలతో చేసిన మృదు వయిన తివాచీలు ఇచ్చారు. ఆ బహుమతు లన్నిటినీ దుర్యోధనుడు స్వీకరించేవాడు. సమృద్ధమైన పాండవుల సంపదను చూసి దుర్యోధనునికి ఈర్ష్య కలిగింది. దానితో దుర్యోధనునికి వారిపై చాలా అసహనమూ, కోపమూ కలిగాయి. మయుడు నిర్మించి, పాండవుల కోసం తెచ్చిన విమానం లాంటి సభా భవనాన్ని చూసి దుర్యోధనుడు చాలా పరితపించాడు. ఆ సభాభవనంలోనే తొందరపాటుతో పడి దుర్యోధనుడు పరిహసింపబడినాడు. అపుడే కృష్ణుని ఎదుట భీముడు తెలియని వాని నాక్షేపించినట్లు దుర్యోధనుని పరిహసించినాడు.

ఆ దుర్యోధనుడు వివిధ భోగాలు అనుభవిస్తూ ఉన్నా, రత్నాభరణాలు ధరిస్తున్నా తాను పాలిపోయి కృశించిపోతున్నట్లు ధృతరాష్ట్రునితో చెప్పాడు. తరువాత పుత్రవ్యామోహంతో ధృతరాష్ట్రుడు ద్యూతానికి అనుమతించాడు. అది విని వాసుదేవునికి చాలా కోపం వచ్చింది. ధృతరాష్ట్రుని మనస్సుకూ సంతోషం కలగలేదు. వివాదాలను అనుమోదించాడు. ద్యూతం దగ్గరనుండి ఎన్నో ఘోరకృత్యా లన్నీ ఉపేక్షించాడు. విదురునీ, భీష్మునీ, కృపద్రోణులనూ కాదని యుద్ధంలో పరస్పరం కొట్టుకొన్నారు. పాండవులు జయిస్తున్నారనే అప్రియవార్త విని, కర్ణ, శకుని దుర్యోధనుల అభిప్రాయం గ్రహించి, ధృతరాష్ట్రుడు చాలా ఆలోచించి సంజయునితో ఇలా అన్నాడు. 'సంజయా! నేను చెప్పేదంతా విను. నన్ను తప్పు పట్టకు. నా మీద కోప్పడకు. నీవూ పండితుడవు- మేధావివి- బుద్ధిమంతుడవు- ప్రాజ్ఞసమ్మతుడవు. నాకు యుద్ధమంటే ఇష్టంలేదు- కులక్షయంతో నాకు ప్రీతి కలుగదు. నా కొడుకుల మీద, పాండవుల మీద నాకు భేదభావం లేదు- కానీ పెద్దవాడినయిన నామీద క్రోధవశులై పుత్రులు దోషం ఆరోపిస్తున్నారు. నేనా కనులు లేనివాడను. దీనభావంతోను, పుత్ర

వ్యామోహంతోనూ కొంత అన్యాయాన్ని సహిస్తూవచ్చాను. మందబుద్ధి అయిన దుర్యోధనుడు తాను అజ్ఞానంతో మునిగిపోతున్నాడు. వాడితో నేనూ మునిగిపోతున్నాను. రాజసూయయాగంలో శక్తిశాలి అయిన ధర్మరాజు యొక్క సర్వోచ్చసంపదను చూసీ, ఆ మయసభను చూస్తూ పరిహసింపబడి సహింపలేకపోయాడు దుర్యోధనుడు. పాండవులను స్వయంగా యుద్ధంలో జయించలేక, సుక్షత్రియు డయినా ఉత్సాహం లేక శకునితో కపటద్యూతం ఆడటానికి ఆలోచించాడు. ఆ విషయాలు ఎప్పుడెప్పుడు నాకు ఎలా తెలిశాయో సంజయా చెపుతాను విను.

సూతపుత్రా! బుద్ధియుక్తములయిన నా మాటలు విని నన్ను ప్రజ్ఞాచక్షువుగా నీవే గ్రహిస్తావు. సంజయా! విల్లు ఎక్కుపెట్టి, చిత్ర మయిన లక్ష్యాన్ని (మత్స్యయంత్రాన్ని) నేల గూల్చి, రాజులు అందరూ చూస్తూ ఉండగా ద్రౌపదిని అర్జునుడు చేపట్టినట్లు విన్నప్పుడే నేను విజయం మీద ఆశ వదులుకొన్నాను. ద్వారకలో యాదవవీరుల నెదిరించి సుభద్రను అర్జునుడు ఇంద్రప్రస్థానికి తీసుకొనిపోయినట్లూ, తరువాత బలరామకృష్ణులు కూడా ఇంద్రప్రస్థానికి వెళ్లినట్లు విన్నప్పుడే నాకు విజయం మీద ఆశ పోయింది. దేవేంద్రుని వర్షాన్ని దివ్యబాణాలతో ఆపి, ఖాండవవనాన్ని అర్జునుడు అగ్నికి ఆహుతి చేశాడని విన్నప్పుడే విజయం మీద ఆశలు పోయాయి. సంజయా! లక్కయింటినుండి కుంతితో పాండవు లందరూ విడివడి తప్పించుకొన్నారనీ ఆ పనిలో విదురుడు కూడా తోడ్పడినాడనీ విన్నప్పుడే నాకు విజయం మీద ఆశ పోయింది. అర్జునుడు రంగమధ్యంలో లక్ష్యాన్ని (మత్స్యయంత్రం) భేదించి, ద్రౌపదిని స్వీకరించాడనీ, శూరు లయిన పాంచాలురతో పాండవులు కలిసిపోయారనీ విన్నప్పటినుండి నాకు విజయం మీద ఆశ లేదు. సంజయా! రాజుల మధ్య వెలిగిపోయే వాడు మగధరాజు జరాసంధుడు. భీమసేనుడు వెళ్లి వానిని ఏ ఆయుధమూ లేకుండా బాహుబలంతో చంపాడని విన్నపుడే నాకు విజయం మీద ఆశపోయింది.

పాండుపుత్రులు దిగ్విజయం చేసి రాజులను వశపరచుకొన్నారనీ, ధర్మరాజు రాజసూయ యాగం చేశాడనీ విన్నపుడే విజయం మీద ఆశపోయింది. సంజయా! భర్తలున్నా లేనిదానివలె ద్రౌపది విలపిస్తూ ఉన్నా, ఏకవస్త్రయై, రజస్వలయై ఉన్నా సభలోకి లాగుకొని రాబడింది. అది విన్నప్పుడే విజయం మీద ఆశ పోయింది. కితవుడు, మందబుద్ధి, అయిన దుశ్శాసనుడు ద్రౌపదీ వస్త్రాలను చివరి దాకా లాగలేక పోయాడనీ వస్త్రాలరాశి అక్కడ ఏర్పడిందనీ విన్నాక నాకు విజయం మీద ఆశ పోయింది. ఊహించలేనంత పరాక్రమవంతు లయిన తమ్ముళ్లతో ధర్మరాజు శకునిచేత జూదంలో ఓడిపోయి, రాజ్యం పోగొట్టుకొన్నాడని విన్నపుడే నాకు విజయాశ పోయింది. సంజయా! ధర్మాత్ములయిన పాండవులు వివిధ చేష్టలు

చేస్తూ, బాధపడుతూ కూడా అన్నగారి మీది గౌరవంతో అడవికి వెళ్లారని విన్నపుడే నేను విజయం మీద ఆశ వదులుకొన్నాను. సంజయా! అడవిలో ఉన్నా వేలకొద్దీ స్నాతకులు ధర్మరాజును అనుసరించి ఉన్నారనీ, భిక్షాటనం చేసుకొంటూ ఉన్న మహాత్ము లయిన బ్రాహ్మణులు అతనిని సేవిస్తున్నారనీ విన్నపుడే నాకు విజయాశ పోయింది. కిరాత రూపంలో వచ్చిన మహాదేవుని యుద్ధంలో సంతృప్తి పరచి, అర్జునుడు పాశుపత మహాస్త్రం గ్రహించాడని విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా!

(అరణ్యవాసం చేస్తున్నపుడు కూడా పాండవులను చాలామంది ప్రాచీన మహర్షులు వచ్చి, ఉపాసించే వారని తెలిసినపుడే విజయం మీద ఇక ఆశపెట్టుకోలేదు.)

అర్జునుడు స్వర్గాన్ని అధిరోహించి ఇంద్రుని నుండి ప్రత్యక్షంగా యథావిధిగా దివ్యాస్త్రాలు నేర్చుకొని ప్రశంసలు పొందాడని, సత్యప్రతిజ్ఞు డయ్యాడని విన్నపుడే నాకు విజయాశ నశించింది. వర గర్వితులై, దేవతలకు కూడా జయింప శక్యంకాని కాలకేయులను, పౌలోములను అర్జునుడు జయించాడని విన్నపుడే నాకు విజయం మీద ఇక ఆశ పోయింది. రాక్షసవధకోసం శత్రునాశకు డయిన అర్జునుడు వెళ్లాడనీ చరితార్థుడై, ఇంద్రలోకం నుండి వచ్చాడనీ విన్నపుడే విజయం మీద ఆశ పోయింది.

(తీర్థయాత్రలు చేయాలనుకొంటున్న ధర్మరాజు దగ్గరకు లోమశ మహర్షి వచ్చి చెప్పిన అర్జునుని దివ్యాస్త్రలాభం, విన్నపుడే నాకు విజయాశ నశించిపోయింది. సంజయా!)

భీమసేనాది పాండవులు మనుష్యులకు ప్రవేశింపశక్యం కాని ప్రదేశానికి వెళ్లి కుబేరుని కలిసి వచ్చారని విన్నపుడే నాకు విజయాశ పోయింది.

కర్ణునిప్రోత్సాహంతో ఘోషయాత్రకు వెళ్లిన నా పుత్రులను గంధర్వులు బంధించారనీ, అర్జునుడు విడిపించాడనీ విన్నపుడే నాకు విజయాశ పోయింది. యక్షుని రూపంలో వచ్చి యముడు ధర్మరాజును కొన్ని ప్రశ్నలు అడిగాడనీ, వానికి ధర్మరాజు చక్కగా సమాధానాలు చెప్పాడనీ విన్నపుడే నాకు విజయాశ పోయింది. విరాటనగరంలో ద్రౌపదితో సహా పాండవులు మారు వేషాల్లో నివసిస్తున్నారని నావాళ్లు తెలుసుకోలేక పోయారని విన్నప్పుడే నాకు విజయాశ లోపించింది.

(నూట అయిదుగురు తమ్ముళ్లతో సహా కీచకుని ద్రౌపదికోసం భీముడు చంపాడని విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా!)

నా వీరు లందరూ అసహాయు డయిన అర్జునుని చేతిలో ఉత్తరగోగ్రహణంలో ఓడిపోయారని విన్నపుడే నాకు విజయాశ నశించింది సంజయా! మత్స్యరాజు విరాటుడు తనకూతురు ఉత్తరను అర్జునునికి ఇస్తానన్నాడనీ, కానీ అర్జునుడు తనకొడుకు అభిమన్యునికి చేసుకొన్నాడనీ విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా! జూదంలో ఓడిపోయి,

నిర్దమడై తనవారినందరినీ వదిలి అడవుల పాలయిన ధర్మరాజుకు ఏడు అక్షౌహిణుల సైన్యం చేరిందని విన్నపుడే నాకు విజయం మీద ఆశపోయింది. ఈ భూమినంతటినీ ఒక్క కాలితో ఆక్రమించిన (వామనావతారంలో) వాసుదేవుడు నిండు మనస్సుతో పాండవుల కార్యసిద్ధిలో తత్పరు డయ్యాడని విన్నప్పటి నుండే నాకు విజయాశ పోయింది. నర నారాయణులే ఈ కృష్ణార్జునులనీ, నేను వారిని బ్రహ్మలోకంలో చక్కగా చూశాననీ నారదుడు చెప్పుతుంటే విన్నపుడే నాకు విజయం మీద ఆశ చచ్చింది- సంజయా!

సంజయా! లోకకళ్యాణం కోసం కృష్ణుడు సంధికోరి కౌరవుల దగ్గరకు వచ్చి, సంధి చేయడంలో విఫలుడై వెళ్లిపోయాడని విన్నపుడే నేను విజయాన్ని ఆశించడం మానేశాను. కర్ణదుర్యోధనులు కేశవుని బంధించాలని నిశ్చయించు కొన్నారని విన్నప్పుడూ; అపుడు కృష్ణుడు విశ్వరూపాన్ని చూపుతున్నపుడూ నాకు విజయం మీద ఆశ పోయింది. వాసుదేవుడు తిరిగి వెళ్లిపోతూ ఉంటే ఆర్తురాలై నిలిచిన కుంతిని కేశవుడు ఓదార్చాడని విన్నపుడే నేను విజయం గురించి ఆశించడం మానేశాను. మంత్రి అయిన వాసుదేవుడూ, భీష్ముడూ, ద్రోణుడూ పాండవులకు ఆశీస్సు లిస్తున్నారని విన్నపుడే ఇక విజయాశ పోయింది సంజయా! "నీవు యుద్ధం చేస్తూ ఉంటే నేను యుద్ధం చెయ్యను" అని కర్ణుడు భీష్మునితో అని, సేన విడిచి వెళ్లిపోయినపుడే నాకు విజయాశ కల్గడం మానేసింది. ఉగ్రపరాక్రమం కల వాసుదేవుడు, అర్జునుడు, గాండీవమూ ఒక చోట చేరాయని విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా! అర్జునుడు మోహావిష్టుడై రథం నొగలిమీద చతికిల బడిపోయినపుడు కృష్ణుడు తన శరీరంలో లోకాల నన్నిటినీ అర్జునునకు చూపించాడని విన్నపుడే విజయాశ పోయింది. శత్రు సంహారకు డయిన భీష్ముడు యుద్ధంలో రోజుకు పదివేల మంది రథికులను చంపుతున్నా పాండవ పక్షాన ప్రసిద్ధు డొక్కడూ చావలేదని విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా! ధార్మికుడయిన భీష్ముడు యుద్ధంలో తన మరణానికి మార్గం చెప్పాడనీ, అది విని పాండవులు సంతోషించి, ఆ పని చేశారనీ విన్నపుడే నాకు విజయాశ పోయింది సంజయా!

అర్జునుడు శిఖండిని ఎదుటపెట్టి యుద్ధంలో మిక్కిలి శూరు డయిన భీష్ముని చంపాడని విన్నపుడే విజయం ఆశించడం మానేశాను. సోమకవంశీయులను కొద్దిమందిని మాత్రమే మిగిల్చి (మిగిలిన వారందరినీ చంపి), అంపశయ్యమీద శయనించాడు వృద్ధవీరుడు భీష్ముడని విన్నపుడే నావిజయాశ పోయింది. భీష్ముడు అంపశయ్య మీద పడినపుడు మంచినీరు అడిగితే అర్జునుడు భూమిని ఛేదించి, నీళ్లు రప్పించి, భీష్మునికి సంతృప్తి కలిగించాడని విన్నపుడే నాకు విజయాశ పోయింది. రోజూ పాండవులకు వాయువూ,

సూర్యచంద్రులూ అనుకూలంగా ఉంటున్నారనీ, మా వాళ్లను కుక్కలు అరుస్తూ భయపెడుతున్నాయనీ విన్నపుడే నాకు జయాశ పోయింది. చిత్రంగా యుద్ధం చేయగల ద్రోణుడు వివిధ అస్త్రాలనూ ప్రదర్శిస్తూ ఉన్నా, పాండవులను మాత్రం చంపటంలేదని విన్నపుడే నాకు జయాశ పోయింది. అర్జునుని చంపటానికే ఉంచిన మహారథు లైన మా సంశప్తకులు అర్జునుని చేత చనిపోయారని విన్నపుడే విజయం మీద ఆశ పోయింది. ఇతరులకు అభేద్యంగా పన్ని ద్రోణుడు స్వయంగా రక్షించే పద్మవ్యూహంలో ఒక్క వీరుడూ తోడు లేకుండా అభిమన్యుడు ప్రవేశింపగలిగాడని విన్నపుడే నాకు జయాశ నశించింది. మా మహారథు లంతా అర్జునుని చంపలేక, అభిమన్యుని చుట్టుముట్టి, అందరూ కలిసి బాలు డయిన అభిమన్యుని చంపి, సంతోషించినపుడే నాకు విజయాశ పోయింది సంజయా! అభిమన్యుని చంపి సంతోషించే కౌరవులను గురించి, సైంధవుని గురించి అర్జునుడు క్రోధంతో ప్రతిజ్ఞ చేసినపుడే నాకు జయాశ ఎగిరిపోయింది. సైంధవుని చంపుతానని చేసిన ప్రతిజ్ఞను శత్రు మధ్యంలో సైంధవుని చంపి, అర్జునుడు నిలబెట్టుకొన్నాడని విన్నపుడే జయం మీద ఊహ లేకపోయింది. గుర్రాలు అలిసిపోయాయి సేదదీరాలని కృష్ణ డన్నపుడు అర్జునుడు ఒక చెరువును సృష్టించి నీళ్లుత్రాగేటట్లు చేశాడు. తరువాతనే కృష్ణుడు వాటిని రథానికి పూన్చి, బయలుదేరా డని విన్నపుడే నేను విజయం గురించి ఊహించటం మానేశాను.

యుద్ధంలో గుర్రాలు రథాన్ని లాగలేకపోతే రథం నొగలి మీదనే ఉండి యోధులందరినీ వారించాడు అర్జును డని విన్నపుడే విజయాశ వదలుకొన్నాను. సైంధవ వధ నాడు ధర్మరాజు సాత్యకిని అర్జునునికి సాయపడటానికి పంపితే ద్రోణుని ఏనుగుల సముదాయం అడ్డుపడింది. వాటిని సంహరించి, సాత్యకి కృష్ణార్జునులను చేరా డని విన్నపుడే విజయాశ వదులుకొన్నాను. భీముని చంపకుండా కర్ణుడు కేవలం మాటలతో పరాభవించి, వింటి కొప్పుతో పొడిచి, విడిచిపెట్టాడని విన్నపుడే నాకు జయాశ పోయింది సంజయా! ద్రోణుడూ, కృతవర్మ, కృపుడూ, కర్ణుడూ, అశ్వత్థామా, శల్యుడూ సైంధవుని రక్షించలేకపోయారని విన్నపుడే నేను విజయాశను విడిచిపెట్టాను.

ఇంద్రు డిచ్చిన దివ్యశక్తిని కృష్ణుడు కర్ణునిచేత ఘటోత్కచునిపై ప్రయోగింపజేశాడని విన్నపుడే నాకు విజయం మీద ఆశ పోయింది. కర్ణుడు ఆ శక్తిని అర్జునునిపై ప్రయోగించవలసి ఉంది. కాని కర్ణ ఘటోత్కచుల యుద్ధంలో కర్ణు డా శక్తిని ఘటోత్కచునిపై ప్రయోగించా డని విన్నపుడే నాకు జయాశ అనేది లేకపోయింది. ధృష్టద్యుమ్నుడు ధర్మం అతిక్రమించి, రథం నొగలిపై ప్రాయోపవిష్టుడై ఉన్న ద్రోణాచార్యుని తెగనరికాడని విన్నపుడే నేను

జయాశ విడిచిపెట్టాను. అశ్వత్థామతో ద్వైరథయుద్ధంలో రాజు లందరూ చూస్తూ ఉండగా నకులుడు సమంగా, చక్కగా మండలయుద్ధం చేశా డని విన్నపుడే జయాశ పోయింది సంజయా ! ద్రోణుడు చనిపోయాక అశ్వత్థామ పాండవులపై నారాయణాస్త్రం ప్రయోగించాడు. అయినా పాండవులు చనిపోలేదు. అపుడే నాకు జయం మీద ఆశ పోయింది. యుద్ధంలో భీముడు తన సోదరు డయిన దుశ్శాసనుని రక్తం త్రాగినపుడు ఎవరూ భీముని వారించలేకపోయారని విన్నపుడే నాకు విజయాశ పోయింది. సోదరులకు దేవరహస్యంగా యుద్ధం జరిగినపుడు, ఎదిరింపశక్యంకాని పరాక్రమవంతు డయిన కర్ణుని అర్జునుడు చంపాడని విన్నపుడే విజయం మీద ఆశపోయింది. ద్రోణపుత్రు డయిన అశ్వత్థామనూ, దుశ్శాసనునీ, కృతవర్మనూ ధర్మరాజు జయించాడని విన్నపుడే నాకు విజయాశ శూన్యమైపోయింది.

కృష్ణునితో ఎప్పుడూ పోటీపడే శూరుడు శల్యుడు యుద్ధంలో ధర్మరాజుచేత చనిపోయాడని విన్నపుడే నా జయాశ పోయింది. కలహ ద్యూతానికి మూలమూ, మాయాబలుడూ అయిన శకుని యుద్ధంలో సహదేవుని చేత చనిపోయాడని విన్నపుడే విజయాశ పోయింది నాకు. సంజయా! దుర్యోధనుడు విరథుడై, శక్తి చచ్చి, మడుగులో ప్రవేశించి, నీటిని స్తంభింపజేసి, అందులో విశ్రమించాడని విన్నపుడే విజయం ఆశించడం మానేశాను. పాండవులు కృష్ణునితో సహా ఆ మడుగు దరిచేరి నా కొడుకు, అసహనశీలి అయిన దుర్యోధనుని రెచ్చగొట్టారని విన్నపుడే విజయాశ పోయింది. గదాయుద్ధంలో దుర్యోధనుడు వివిధ చిత్ర మార్గాల్లో మండలాకారంగా తిరుగుతూ, వాసుదేవుని తెలివి వల్ల భీమసేనుని చేత అధర్మంగా చనిపోయాడని విన్నపుడే నాకు జయాశ ఉడిగిపోయింది. సంజయా! అశ్వత్థామాదివీరులు అకీర్తికరమైన దుష్కర్మ చేసి నిద్రిస్తున్న ఉపపాండవులనూ, పాంచాలురనూ చంపారని విన్నపుడే నాకు జయాశ పోయింది. భీమసేనుడు అశ్వత్థామను వెంటాడినపుడు అశ్వత్థామ ఇషీకాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ఉత్తరగర్భాన్ని మాత్రం ఛేదించిందని విన్నపుడే నాకు జయాశ పోయింది. అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినపుడు అర్జునుడు ఆ అస్త్రాన్ని ఉపశమింపజేశాడు. అపుడు అశ్వత్థామ తన శిరోరత్నాన్ని ఇచ్చాడని విన్నపుడే జయాశ పోయింది. ద్రోణపుత్రుని అస్త్రాలతో ఉత్తరాగర్భం పీడింపబడినపుడూ; వ్యాసుడూ, కృష్ణుడూ కూడా అశ్వత్థామను శాపాలతో బాధించారని విన్నపుడు జయాశ పోయింది. అపుడు గాంధారి అవస్థ చాలా శోచనీయ మయింది. పుత్రులు, పౌత్రులు, బంధువులు, సోదరులు అందరూ పోయారు. పాండవులు చాలా దుష్కరకృత్యం చేశారు. శత్రురహితమైన రాజ్యం మళ్లీ పొందారు.

ఈ యుద్ధం వల్ల చాలా కష్టదశ వచ్చింది. మొత్తం పదిమంది మిగిలారని విన్నాను. మా పక్షంలో ముగ్గురు (అశ్వత్థామ, కృతవర్మ, కృపుడు), పాండవ పక్షంలో ఏడుగురు (పాండవులు 5, కృష్ణుడు, సాత్యకి). ఈ ఘోర సంగ్రామంలో 18 అక్షౌహిణుల మంది చనిపోయారు. నాకు చీకటి అలముకొంది. నన్ను మోహం ఆవేశిస్తోంది. సంజయా స్పృహ పోతోంది. నా మనస్సు విహ్వలమయి పోతోంది. ఇలా ధృతరాష్ట్రుడు ఎంతగానో విలపించి మూర్ఛపోయాడు. సంజయుడు సేద దీర్చాడు. మళ్లీ ఇలా అన్నాడు సంజయునితో ధృతరాష్ట్రుడు. 'సంజయా! ఇలా పోయే ప్రాణాలను శాశ్వతంగా వదిలి వేయాలనుకొంటున్నాను. ఈ జీవితాన్ని ధరించి నందువల్ల కించిత్తుకూడా ఫలం కనిపించటం లేదు.' ధృతరాష్ట్రుడు అలా అంటూ విలపిస్తున్నాడు. పాములాగా బుసలు కొడుతూ మళ్ళీ మళ్లీ మూర్ఛపోతున్నాడు. అపుడు ధీమంతు డయిన సంజయుడు అర్థవంతంగా ఇలా అన్నాడు. రాజా ధీమంతు డయిన నారదుడూ, వ్యాసభగవానుడూ చెపుతూ ఉండగా ఎంతోమంది ఉత్సాహపరులై బలవంతు లయిన రాజులను గురించి వినే ఉన్నావు. గొప్పగొప్ప రాజవంశాల్లో పుట్టి, సద్గుణవంతులయి, దివ్యాస్త్రవేత్త లయి, ఇంద్రసమాన తేజస్సులై ధార్మికంగా భూమిని జయించి, భూరిదక్షిణలతో యజ్ఞాలు చేసి, ఈ లోకంలో ఎంతో కీర్తి గడించి చివరకు వారంతా కాలధర్మం చెందారు. మహారథు డయిన శైబ్యుడు, జయశీలులలో ఉత్తము డయిన సృంజయుడు, సుహోత్రుడు, రంతిదేవుడు, కాక్షీవంతుడు ఔశిజుడు, బాహ్లీకుడు, దమనుడు, చైద్యుడు, శర్యాతి, నలుడు, శత్రుసంహారకు డయిన విశ్వామిత్రుడు, మహాబలు డయిన అంబరీషుడు, మరుత్తుడు, మనువు, ఇక్ష్వాకువు, గయుడు, భరతుడు, దశరథపుత్రు డయిన రాముడు, శశబిందుడు, భగీరథుడు, కృతవీర్యుడు, జనమేజయుడు, యయాతి, (ఈయన చేత దేవతలు స్వయంగా యజ్ఞం చేయించారు. అతని కాలంలో భూమి అంతా యూపస్తంభాలతో నిండిపోయింది.) ఇలా ఇరవై నలుగురు రాజులగురించి దేవర్షి నారదుడు పుత్రశోకంతో విలపించే శ్వైత్యునికి చెప్పాడు. వీరంతా సద్గుణవంతు లయినా, ఎన్ని సత్కృత్యాలు చేసినా చివరకు అన్నీ వదలి కాలధర్మం చెందవలసి వచ్చింది.

వీరేకాదు వీరికంటె బలీయులు, మహారథులూ, మహాత్ములూ సర్వసద్గుణశోభితులూ అయిన పూరుడు, కురువు, యదువు, శూరుడు, మహాతేజస్వి అయిన విష్వగశ్వుడు, అణుహుడు, యువనాశ్వుడు, ఖకుత్ముడు, పరాక్రమవంతు డయిన రఘువు, విజయుడు, వీతిహోత్రుడు, అంగుడు, భవుడు, శ్వేతుడు, బృహద్గురుడు, ఉశీనరుడు, శతరథుడు, కంకుడు, దులిదుహుడు, ద్రుముడు, దంభోద్భవుడు, పరుడు, వేనుడు, సగరుడు, సంకృతి, నిమి, అజేయుడు, పరశుడు, పాండ్రుడు, శంభుడు, దేవావృధుడు, దేవాహ్వాయుడు,

సుప్రతిముడు, సుప్రతీకుడు, బృహద్రథుడు, మహోత్సాహమూ వినయమూ కల సుక్రతుడు, నిషధరాజు నలుడు, సత్యవ్రతుడు, శాంతభయుడు, సుమిత్రుడు, సుబలుడు, ప్రభుడు, జానుజంఘుడు, అనరణ్యుడు, అర్కుడు, ప్రియభృత్యుడు, శుచివ్రతుడు, బలబంధుడు, నిరామర్దుడు, కేతుశృంగుడు, బృహద్బలుడు, ధృష్టకేతువు, బృహత్కేతువు, దీప్తకేతువు, నిరామయుడు, అవీక్షిత్తు, చపలుడు, ధూర్తుడు, కృతబంధుడు, దృఢేషుధి, మహాపురాణంలో సంభావింపబడిన ప్రత్యంగుడు, పరహుడు, శ్రుతి – ఇలా ఇంకా ఇతర రాజులెందరో వందలు, వేలు, లక్షలూ మంది బుద్ధిశాలులూ, బలవంతులూ కూడా ఈ విపులమయిన భోగాలు వదలి నీ పుత్రుల వలెనే చనిపోయారు. ఎన్నో దివ్యకృత్యాలు పరాక్రమంతో చేసిన వారున్నారు. త్యాగబుద్ధి, శక్తి, ఆస్తిక్యం, సత్యం, శౌచం, దయ, ఆర్జవం కలవారున్నారు. విద్వాంసులంతా వారి సద్గుణాలను ప్రశంసించేవారు. పురాణాలలో కవులు వారిని శ్లాఘించేవారు. అభివృద్ధికరములయిన సర్వసద్గుణాలూ కలవారు ఉన్నారు. వారంతా కూడా చనిపోయారు. నీ పుత్రులు దుష్టులు, క్రోధంతో ఉడికిపోయేవారు. లుబ్ధులు, దుష్ప్రవర్తనకలవారు. అందుచేత వారికోసం దుఃఖించవలసిన పనిలేదు. భరతశ్రేష్ఠా! నీవు బాగా చదువుకొన్నవాడవు. ప్రజ్ఞా వంతుడవు. బుద్ధిమంతుడవు. పండితులకు ఇష్టమైనవాడవు. శాస్త్రానుసార మయిన బుద్ధికలిగిన వారు శోక మోహాలకు వశం కారు. రాజా! నీకు నిగ్రహానుగ్రహాలు రెండూ కూడా తెలుసును. నీ పుత్రులను రక్షించుకోవడం కోసం ఇంత వ్యాకుల పడవలసిన పనిలేదు. అది అట్లా జరగవలసిఉన్నపుడు నీవు దుఃఖించవలసిన పనిలేదు. తన ప్రజ్ఞతో దైవాన్ని ఎవరు మళ్లించగలరు? బ్రహ్మ నిశ్చయించిన మార్గాన్ని ఎవడూ దాటలేడు. ఈ జనన మరణాలూ, సుఖదుఃఖాలు దీనికంతకూ మూల కారణం కాలం. ప్రాణు లన్నిటినీ కాలమే సృష్టిస్తుంది. కాలమే ప్రజలను సంహరిస్తుంది. కాలం ప్రజలను సంహరిస్తూనే శమించిపోతుంది. ఈ లోకాలన్నిటా శుభాలు కానీ, అశుభాలు కానీ సర్వ భావాలను కాలం సృష్టిస్తుంది. మళ్లీ ఆ కాలమే అన్నిటినీ సంహరిస్తుంది. మళ్లీ సృష్టిస్తూ ఉంటుంది. (అందుకే కాలం చక్రంలా తిరుగుతుంది.) నిద్రించేవారిని కాలమే మేల్కొలుపుతుంది. కాలం అతిక్రమింపరానిది. అన్ని ప్రాణులపట్ల ఆ కాలం వదలకుండా సమానంగా ప్రవర్తిస్తుంది. భూతకాలంలోనివి కాని, భవిష్యత్తులోనివి కాని, ఇపుడున్నభావాలు కాని కాలనిర్మితాలని తెలుసుకో. వివేకం పోగొట్టుకోరాదు.

ఇలా సంజయుడు పుత్ర శోకంతో దుఃఖిస్తున్న ధృతరాష్ట్రమహారాజును ఓదార్చి స్వస్థచిత్తుని చేశాడు. **ఈ కథను ఆధారం చేసుకొని పుణ్యప్రదమైన ఉపనిషత్తులాంటి భారతాన్ని కృష్ణద్వైపాయనుడు చెప్పాడు. అది విద్వత్ కవీశ్వరులచేత లోకంలో**

చాలాకాలంగా చెప్పబడుతోంది. ఒక పాదం చదివినా భారతం పుణ్యప్రదం. శ్రద్ధగా చదివిన వాని పాపాలన్నీ తుడిచి పెట్టుకొనిపోతాయి. ఇందులో దేవతల గురించి, దేవర్షుల గురించి బ్రహ్మర్షుల గురించి, అలాగే సత్కార్యాచరణం చేసే యక్షుల గురించి, ఉరగుల గురించి కీర్తింప బడింది. సనాతను డయిన భగవంతుడు వాసుదేవుడు ఇందులో కీర్తింపబడినాడు. అతడే సత్యస్వరూపుడు - ఋతస్వరూపుడు - పవిత్రరూపుడు- పుణ్యస్వరూపుడు. ఆ వాసుదేవుడే శాశ్వతుడయిన పరబ్రహ్మ. సనాతనమై శాశ్వతమయిన వెలుగు అతడే. ఆయన దివ్యకృత్యాలనే తెలివైనవారు కీర్తిస్తూ ఉంటారు. ఆయన వల్లనే ఈ విశ్వం (సత్తు, అసత్తు, సదసత్తు రూపంలో) ప్రవర్తిస్తోంది. అతని నుండియే ప్రాణులు, ప్రజలు, ఉద్భవించారు. ప్రవృత్తి (కర్తవ్యం- కర్మ) ఏర్పడింది. జనన మరణాలూ, అలాగే పునర్జన్మ ఏర్పడ్డాయి. ఈ భారతంలో పంచభూతాలగురించి, త్రిగుణాల గురించి, జీవాత్మ గురించి చెప్పబడింది. అవ్యక్త ప్రకృతి మొదలు మూలకారణమయిన పరబ్రహ్మం కూడా చక్కగా చెప్పబడింది. **దీనివల్లనే ముక్తులయిన యతీశ్వరులు ధ్యానబలంతోనూ, యోగబలంతోనూ అద్దంలో ప్రతిబింబాన్ని చూసినట్లు తమలో పరమాత్మను చూస్తున్నారు.** నిత్యమూ శ్రద్ధతో, ధర్మపరాయణుడై ఈ అధ్యాయాన్ని పఠించేవాడూ, వినేవాడూ పాపం నుండి విడివడుతాడు. భారతం యొక్క ఈ అనుక్రమణికాధ్యాయం మొదటినుండీ చివరిదాకా వినే ఆస్తికుడు ఆపత్కాలంలో కూడా దుఃఖం పొందడు. ఉభయ సంధ్యలలోనూ ఈ అనుక్రమణికాధ్యాయాన్ని వీలయినంత చదివేవాడు ఆ పగలూ, రాత్రీ చేసిన పాపాల నుండి వెంటనే ముక్తుడవుతాడు. ఈ అధ్యాయం భారతానికి మూలశరీరం (తత్త్వం- బీజం). సత్యస్వరూపం- అమృతస్వరూపం. పెరుగులో వెన్నవలె, మానవులలో బ్రహ్మజ్ఞానివలె, వేదాలలో ఆరణ్య కాలవలె, ఓషధులలో అమృతం వలె, మడుగులలో సముద్రం వలె, పశువులలో ఆవులవలె, **ఇతిహాసాలలో ఈ భారతం శ్రేష్ఠమయినది.** దీన్ని శ్రాద్ధసమయంలో బ్రాహ్మణులకు ఒక్కపాదమయినా వినిపిస్తే వాని పితరులకు అన్నపానాలు అక్షయ మవుతాయి.

ఇతిహాసపురాణాలతో వేదానికి పుష్టి చేకూర్చాలి. సరిగా చదువుకోని వాడికి వేదం "వీడు నన్ను కొడుతున్నాడని" భయపడి పోతుంది. ఇది కృష్ణద్వైపాయనుడు చెప్పినవేదం. విద్వాంసుడు దీన్ని చక్కగా వినిపిస్తే అర్థం, పురుషార్థం పొందుతాడు. (ప్రయోజనం, సత్ఫలితం, సంపద పొందుతాడు). ప్రతిపర్వం చివర (పర్వసమయాల్లో) ఈ అధ్యాయాన్ని శుచియై చదివేవాడు నిస్సంశయంగా భ్రూణహత్యాది పాపాలు విడిచిపెడతాడు. వాడు భారతమంతా చదివినట్లే అని నా అభిప్రాయం. వాడు దీర్ఘాయువునూ, కీర్తినీ, స్వర్గాన్ని

పొందుతాడు. పూర్వం దేవతలంతా నాలుగువేదాలనూ ఒక ప్రక్క, భారతాన్ని ఒక ప్రక్క త్రాసులో ఉంచి తూచారు. అపుడు రహస్యాలతో కూడిన నాల్గువేదాల కంటె భారతమే బరువుగా కనపడింది. అప్పటినుండి ఇది లోకంలో "విలువలోనూ బరువులోనూ అధికం అవడం వల్ల" మహాభారతం అయింది. (మహత్త్వం - గొప్పదనం - విలువ; గురుత్వం = బరువు) మహత్త్వం వల్లనూ, బరువు వల్లనూ ఇది మహాభారతం అయింది. దీని ఈ అర్థాన్ని తెలుసుకొన్నవాడు సర్వపాపాల నుండి విడివడుతాడు.* తపస్సు దోషం/పాపం కాదు. వేదాధ్యయనం దోషం కాదు. స్వాభావిక మయిన వేదవిధుల్ని ఆచరించడం దోషం కాదు. కష్టాలు సహించి ధనం సంపాదించడం దోషం కాదు. కాని ఇవే భావాలు దెబ్బతింటే దోషాలు. అనగా దంభం కోసం, గొప్పకోసం చేయరాదు. ఇష్టంగా శ్రద్ధతో చెయ్యాలి. గొప్ప కోసం చేస్తే దోషమే.

2. పర్వ సంగ్రహ విషయము - సమంతపంచక, అక్షౌహిణీప్రమాణములు - భారత శ్రవణఫలము.

ఋషులు అడిగారు - 'సూతపుత్రా! నీవు సమంత పంచకం గురించి ప్రస్తావించావు. అది అంతా వివరంగా మేము వినాలనుకొంటున్నాము.' ఉగ్రశ్రవుడు చెప్పాడు. 'విప్రులారా! నేను శుభప్రద మయిన కథలు చెపుతున్నాను వినండి. ఇందులోనే శమంతపంచకం గురించి కూడా వినండి. మహాధనుర్ధారి అయిన పరశురాముడు త్రేతా, ద్వాపర యుగాల సంధికాలంలో కోపంతో చాలాసార్లు రాజుల సముదాయాలను సంహరించాడు. అగ్నిలా జ్వలించే తన పరాక్రమంతో రాజులందరినీ చంపి పరశురాముడు అయిదు రక్తపు మడుగులు చేశాడు. ఆ క్షేత్రం సమంతపంచకం. క్రోధంతో రాముడు ఆ అయిదు రక్తపు మడుగులలోని రక్తంతో తన పితరులకు తర్పణం చేశాడని నేను విన్నాను. అపుడు ఋచీకుడు లయిన అతని పితృదేవతలు పరశురామునితో "రామా! నీ పితృభక్తికీ, పరాక్రమానికీ మేము సంప్రీతుల మయ్యాం. నీకేం కావాలో వరం కోరుకో, నీకు శుభం కలుగుతుంది" అన్నారు. అపుడు పరశురాముడు ఇలా అన్నాడు. "నా పితరులకు ప్రీతి కలిగితే, నామీద అనుగ్రహిస్తే "నేను క్రోధంతో రాజులందరినీ చంపాను గదా. ఆ పాపం నుండి నన్ను విముక్తుని చేయండి. ఇదే నేను కోరుకునే వరం. ఈ మడుగులు అయిదూ తీర్థాలై ప్రసిద్ధి వహించాలి" అన్నాడు. "అలాగే అవుతుంది." అన్నారు పితరులు. 'ఆ

* మహత్త్వాత్ భారవత్త్వాచ్చ మహాభారతముచ్యతే ।
నిరుక్తమస్య యో వేద సర్వపాపైః ప్రముచ్యతే ॥ 274

క్షత్రియ సమూహాన్ని క్షమించు' అనీ, వారిని చంపవద్దని పితరులు నిషేధించారు. అప్పటినుండి పరశురాముడు క్షత్రియులను చంపడం విరమించాడు. ఆ రక్తపు మడుగుల సమీపప్రదేశాన్ని సమంతపంచక ప్రదేశ మనీ, అది పుణ్యప్రద మనీ కీర్తించారు. ఏ చిహ్నాలతో ఏ దేశం కూడి కనిపిస్తుందో ఆ దేశాన్ని ఆ పేరుతోనే ధీమంతులు పిలుస్తారు. ద్వాపరయుగానికీ, కలియుగానికీ సంధికాలం వచ్చినపుడు కురుపాండవసేనలకు ఆ సమంతపంచక ప్రదేశంలో యుద్ధం జరిగింది. మిట్టపల్లాలు లేని పరమధర్మప్రదేశంలో యుద్ధ కాంక్షతో పదునెనిమిది అక్షౌహిణులు చేరాయి. అక్కడకు చేరిన అక్షౌహిణులూ, రాజులు అక్కడే చనిపోయారు. అందుచేత ఆ దేశానికి సమంతపంచకం అని పేరు వచ్చింది. ఆ ప్రదేశం పుణ్యప్రద మనీ, రమణీయ మనీ కీర్తింపబడింది. విప్రోత్తములారా! ఆ ప్రదేశం మూడు లోకాల్లోనూ ఎలా ప్రసిద్ధిచెందిందో మీకు నేను చెప్పాను.'

అపుడు ఋషులు ఇలా అడిగారు- "సూతపుత్రా! నీవు అక్షౌహిణులు అని చెప్పావు - ఆ మాట మరింత వివరంగా వినాలని కోరుతున్నాం. అక్షౌహిణి యొక్క పరిమాణం ఎంత? అందులో పదాతులు, గుర్రాలు, రథాలు, ఏనుగులూ ఎన్నెన్ని ఉంటాయో నీకు అన్నీ తెలుసును కదా. అవి అన్నీ మాకు చెప్పు." అపుడు ఉగ్రశ్రవుడు ఇలా చెప్పాడు. 'ఒక రథం, ఒక ఏనుగు, అయిదుగురు పదాతులు, మూడు గుర్రాలు కల సేన పత్తి అనబడుతుంది. మూడు పత్తులు కలిస్తే సేనాముఖం అవుతుంది. మూడు సేనాముఖాలను గుల్మం అంటారు. మూడు గుల్మాలు గణం. మూడు గణాలు వాహిని. మూడు వాహినులు పృతన అవుతుంది. మూడు పృతనలు ఒక చమువు. మూడు చమువులు ఒక అనీకిని. పది అనీకినులు అక్షౌహిణి. అక్షౌహిణిలో 21870 (ఇరవై ఒక్కవేల ఎనిమిది వందల డెబ్బది) రథాలు ఉంటాయి అని గణిత శాస్త్రజ్ఞులు చెప్పారు. ఏనుగులు కూడ అన్నే ఉంటాయి. లక్షా తొమ్మిదివేల మూడు వందల ఏబది మంది పదాతులుంటారు. (109350). అరువది అయిదు వేల ఆరువందల పది(65610) గుర్రాలు ఉంటాయి. ఈ చెప్పినవన్నీ కలిపి అక్షౌహిణి అవుతుందని సంఖ్యాశాస్త్రవిదు లంటారు. కురు పాండవ సేనలు రెండూ కలిపి 18 (పదునెనిమిది) అక్షౌహిణులు అయ్యాయి. అద్భుతకృత్యాలు చేసే కాలం యొక్క ప్రేరణతో కౌరవులను నిమిత్తం చేసుకొని అక్కడ చేరిన రాజులంతా అక్కడే చనిపోయారు. అందులో పరమాస్త్రవేత్త అయిన భీష్ముడు పది రోజులు యుద్ధం చేశాడు. తరువాత ద్రోణుడు కౌరవసేనను అయిదురోజులు రక్షించాడు. శత్రుసేనను పీడించే కర్ణుడు రెండురోజులు యుద్ధం చేశాడు. తరువాత శల్యుడు ఒకపూట యుద్ధం చేశాడు. తరువాత గదాయుద్ధం జరిగింది. ఆ రోజు రాత్రే

అశ్వత్థామ, కృతవర్మ, కృపుడూ ఆదమరిచి నిద్రిస్తున్న పాండవ సైన్యాన్ని చంపివేశారు.

శౌనక మహర్షీ! నీ విపుడు వింటున్న ఈ ఉత్తమ మయిన ఇతిహాసం భారతం. జనమేజయుని సర్పయాగంలో వ్యాస శిష్య డయిన వైశంపాయనుడు విస్తరించి చెప్పాడు. అందులో రాజులందరి పరాక్రమాలు, కీర్తులూ వర్ణింపబడినవి. అందులో మొదట పౌలోమపర్వం, ఆస్తీకపర్వం చెప్పబడినాయి. వానిని స్మరిస్తాను. మోక్షం పొందాలనుకొనేవారు ముందుగా వైరాగ్యం పొందినట్లు ప్రాజ్ఞ లయిన మానవులు ఈ భారతాన్ని పొందాలి, చదవాలి. ఎందుచేతనంటే ఇది విచిత్రమయిన అర్థాలతోను, అనేక సిద్ధాంతాలతోను, ఆచరణలతోను కూడినది. **తెలుసుకోదగిన వానిలో ప్రధానమయినది ఆత్మ. ప్రియమయిన వానిలో ప్రధానమయినది జీవితం. అలాగే అన్ని విజ్ఞానాలలోనూ ఈ ఇతిహాసం ప్రధానమూ, శ్రేష్ఠమూ కూడా. ఆహారం విడిచిపెడితే శరీరం ధరించడం కష్టం- సాధ్యం కాదు. అలాగే ఈ భారతాన్ని విడిచిపెడితే ఏ కథా భూమి మీద నిలవదు.** (అనగా అన్ని కథల నిర్మాణానికి ఈ భారతం మూలమని భావం.) అభ్యుదయాన్ని కాంక్షించేవారు సత్కులీను డయిన రాజును కోరుకొన్నట్లు ఈ భారతాన్ని కవు లందరూ ఆశ్రయిస్తారు. స్వరవ్యంజనాలతో నిండిన వాక్కు అంతా లోకాన్నీ, వేదాన్నీ ఆశ్రయించినట్లు ఈ భారతేతిహాసం మీద అర్పించబడిన బుద్ధియే ఉత్తమమైనది. ఈ భారతేతిహాసం జ్ఞానంతో పరిపూర్ణ మయినది. విచిత్ర పదాలతో, అర్థాలతో, న్యాయాలతో, వేదార్థాలతో కూడినది. దీని పర్వసంగ్రహం చెపుతాను విను. మొదటిది పర్వానుక్రమణిక - రెండవది పర్వసంగ్రహం. పౌష్యపర్వం మూడవది. తరువాతివి వరుసగా పౌలోమ పర్వం, ఆస్తీక పర్వం, అంశావతార పర్వం, సంభవ పర్వం. ఈ సంభవపర్వం చాలా అద్భుతంగా ఉండి ఒడలు పులకరిస్తుంది. తరువాతివి లాక్షాగృహదహనం, హైడింబ పర్వం, బకవధ పర్వం, చైత్రరథ పర్వం. తరువాతివి పాంచాలీ స్వయంవర పర్వం, (క్షాత్ర ధర్మంతో ఇతర రాజులను జయించిన) వైవాహిక పర్వం, విదురాగమన రాజ్యలంభపర్వం, అర్జున వనవాసం, సుభద్రాహరణం. తరువాతిది హరణహారిక, ఆపైని ఖాండవ వనదహనం, మయదర్శనం. తరువాతిది సభాపర్వం. తరువాతివి మంత్రపర్వం (ఇందులో సభాక్రియా పర్వం, లోకపాల సభాఖ్యాన పర్వం, రాజసూయా రంభ పర్వం ఉన్నాయి), జరాసంధవధ పర్వం, దిగ్విజయ పర్వం. తరువాతిది రాజసూయ పర్వం. తరువాతివి అర్ఘాభిహరణం, శిశుపాల వధ. ద్యూతపర్వం, అనుద్యూత పర్వం. (ఇలా ఇవి 10 పది ఉప పర్వాలు). తరువాతిది ఆరణ్య పర్వం. (దీనిని వన పర్వమని కూడా అంటారు) దీనిలోని ఉప పర్వాలు ఇరువది యొకటి. మొదటిది అరణ్య పర్వం 2. కిర్మీరవధ పర్వం. 3. అర్జునాభిగమన పర్వం. ఈశ్వరార్జునుల

యుద్ధం కల పర్వం 4. కైరాత పర్వం. 5. ఇంద్రలోకాభిగమన పర్వం, 6. నలోపాఖ్యానం. ఇది ధర్మప్రబోధకమై కరుణరస స్ఫోరకమయినది. బుద్ధిమంతుడయిన ధర్మరాజు చేసిన 7. తీర్థయాత్రా పర్వం, 8. జటాసురవధ పర్వం. 9. యక్షయుద్ధపర్వం. 10. నివాతకవచయుద్ధ పర్వం. 11. ఆజగర పర్వం, 12. మార్కండేయ సమాస్యా పర్వం. 13. ద్రౌపదీ సత్యభామా సంవాదపర్వం 14. ఘోషయాత్ర, 15. మృగస్వప్నోద్భవ పర్వం, 16. వ్రీహిద్రౌణికాఖ్యాన పర్వం, 17. ద్రౌపదీహరణ పర్వం, 18. జయద్రథవిమోక్షణ పర్వం. 19. రామోపాఖ్యానం 20. పతివ్రతా మాహాత్మ్యం - ఇందులోనే సావిత్రి చరిత్ర. 21. కుండలాహరణ పర్వం. ఆ తరువాతిది 22. ఆరణేయ పర్వం. (ఇలా వనపర్వంలో ఇరవై రెండు ఉప పర్వాలున్నాయి.) తరువాతిది విరాట పర్వం. (ఇందులో 5 ఉప పర్వాలు) 1. పాండవప్రవేశ పర్వం 2. సమయ పాలన పర్వం. 3. కీచక వధ పర్వం. 4. గోగ్రహణ పర్వం, 5. వైవాహిక పర్వం (ఇది ఉత్తరాభిమన్యుల వివాహం) తరువాతి పర్వం అద్భుతమైన ఉద్యోగపర్వం. (దానిలో 10 పది ఉపపర్వాలున్నాయి.) మొదటిది సేనోద్యోగ పర్వం. 2. సంజయయాన పర్వం, 3. ప్రజాగర పర్వం. (ఇది ధృతరాష్ట్రుని మానసిక వేదన వలన చెప్పబడింది). 4. సనత్సుజాత పర్వం, (ఇది రహస్యమైన అధ్యాత్మవిద్యను ప్రదర్శిస్తుంది) తరువాతిది 5. యానసంధిపర్వం. 6. భగవద్యాన పర్వం. ఇందులోనే మాతలి చరిత్ర, గాలవచరిత్ర, గరుడుని చరిత్ర, పరశురాముని చరిత్ర, షోడశరాజుల చరిత్ర, ఉన్నాయి. కృష్ణుని సభాప్రవేశం, విదులావృత్తాంతం, సైన్యం రెండు పక్షాలకూ చేరడం, విశ్వోపాఖ్యానమూ ఉన్నాయి భగవద్యాన పర్వంలో. ఇందులోనే కర్ణునితో జరిగిన వివాదపర్వమూ ఉన్నాయి. తరువాతి 7వ ఉపపర్వం సైన్యనిర్యాణ పర్వం. అందరికీ అమర్షం కలిగించే 8. ఉలూకదూతా గమనం- ఆ తరువాతిది రథాతిరథ సంఖ్యానపర్వం(9). ఆ తరువాతిది, చివరిది అంబోపాఖ్యాన పర్వం (10) ఇది ఉద్యోగ పర్వం.

భీష్ముని సైన్యాధ్యక్షునిగా అభిషేకం చేశారు కాబట్టి భీష్మపర్వం అయింది. (ఇందులో నాలుగు ఉప పర్వాలు.) 1. జంబూఖండవినిర్మాణ పర్వం. 2. భూమి పర్వం. (ఇవి ద్వీపాల విశేషాలు చెపుతాయి) 3. భగవద్గీతా పర్వం, 4. భీష్మవధ పర్వం. ద్రోణపర్వంలో 8 ఎనిమిది ఉప పర్వాలు. 1. ద్రోణాభిషేచన పర్వం, 2. సంశప్తకవధ. 3. అభిమన్యువధపర్వం, 4. ప్రతిజ్ఞా పర్వం, 5. జయద్రథవధ పర్వం, 6. ఘటోత్కచ వధ పర్వం. 7. ద్రోణవధ పర్వం, ఇది శరీరానికి గగుర్పాటు కలిగిస్తుంది. 8. నారాయణాస్త్రమోక్ష పర్వం. తరువాతిది కర్ణపర్వం- దీనిలో ఉపపర్వాలు లేవు. తరువాతిది శల్య పర్వం. ఇందులో మూడు ఉపపర్వాలు, 1. శల్యపర్వం, 2. హ్రదప్రవేశ పర్వం, 3. గదా పర్వం. సారస్వత పర్వంలో

తీర్థాలు వంశాలు కీర్తింపబడినవి, తరువాతిది బీభత్సం సృష్టించిన సౌప్తిక పర్వం. ఇందులో 1. సౌప్తిక పర్వం. రెండవది ఐషీకపర్వం - రెండే ఉపపర్వాలు. తరువాతి స్త్రీ పర్వంలో మూడు ఉపపర్వాలు 1. జలప్రదానిక పర్వం, 2. స్త్రీవిలాప పర్వం.

3. శ్రాద్ధ పర్వం - ఇందులో కురువంశస్థులకు పారలౌకిక క్రియలు నిర్వర్తింపబడినవి - తరువాత చార్వాకుడు అనే రాక్షసుడు బ్రాహ్మణ రూపంలో రావడం... ధర్మరాజుకు పట్టాభిషేకం - గృహాలను సోదరాదులకు విభజించడం - ఇదంతా శాంతి పర్వంలోని మొదటి ఉపపర్వమయిన రాజధర్మానుశాసనంలో ఉంది. ఇక ఆపద్ధర్మాలు కూడా శాంతిపర్వంలో రెండవదయిన ఆపద్ధర్మపర్వంలో చెప్పబడినాయి. తరువాతిది శాంతి పర్వంలో మూడవది మోక్షధర్మపర్వం. ఇందులో శుకప్రశ్నాభిగమనం, బ్రహ్మ ప్రశ్నానుశాసనం, దుర్వాసుని ప్రాదుర్భావం, మాయాసంవాదం ఉన్నాయి.

తరువాతి పర్వం ఆనుశాసనికపర్వం - ఇందులో రెండు ఉపపర్వాలు 1. దానధర్మపర్వం 2. భీష్ముని స్వర్గారోహణం. ఆశ్వమేధిక పర్వంలో రెండు ఉపపర్వాలు 1. ఆశ్వమేధిక పర్వం, 2. అనుగీతాపర్వం. (ఈపర్వం ఆధ్యాత్మపరమయినది). ఇందులో ఆశ్రమవాస పర్వం, 2. పుత్ర దర్శన పర్వం, 3. నారదాగమనే పర్వం అని మూడు ఉపపర్వాలున్నాయి. తరువాతిది ఘోరమయిన మౌసల పర్వం. ఆ తరువాతిది మహాప్రస్థానిక పర్వం. ఆపైది స్వర్గారోహణ పర్వం. (ఈ మూడు పర్వాలలో ఉపపర్వాలు లేవు.) తరువాతిది హరివంశం (దీనిని భారత పరిశిష్టం అంటారు. దీనినే ఖిలపర్వం అని కూడా అంటారు). దీనిలో 1. హరివంశపర్వం, 2. విష్ణుపర్వం, 3. కృష్ణ లీలలు, కంసవధ మొదలగునవి. ఖిలపర్వాలలోనే భవిష్యపర్వం కూడా చెప్పబడింది. ఇలా వ్యాసమహర్షి భారతాన్ని 100 ఉపపర్వాలలో చెప్పాడు.

దానినే సూతపుత్రు డయిన రౌమహర్షణి తరువాత 18 పర్వాలుగా నైమిశారణ్యంలో చెప్పాడు. ఇలా భారతంలోని పర్వాల సంగ్రహం చెప్పబడింది. ఇక ఈ ఆదిపర్వంలోని కథావిశేషాలు ఇవి. పౌష్యపృత్తాంతం, పౌలోమ కథ, ఆస్తీక వృత్తాంతం, అంశావతరణం, కౌరవవంశ సంభవం, లాక్షాగృహదహనం, హిడింబ బకాసురుల వధ, చైత్రరథం, ద్రౌపదీ స్వయంవరం, వివాహవిధి, విదురాగమనం, రాజ్యలంభం, అర్జున వనవాసం, సుభద్రాహరణం, హరణాహరణం, ఖాండవదహనం, మయదర్శనం - ఇంతవరకు ఆదిపర్వంలో చెప్పబడ్డాయి. పౌష్యపర్వంలో ఉత్తంకుని మాహాత్మ్యం వర్ణింపబడింది. పౌలోమ పర్వంలో భృగువంశం అంతా చెప్పబడింది. ఆస్తీకపర్వంలో నాగుల యొక్క, గరుడుని యొక్క పుట్టుక చెప్పబడింది. ఇందులోనే పాలసముద్రం మథించడం, ఉచ్చైఃశ్రవం పుట్టడం, సర్పయాగం చేస్తున్న

జనమేజయునికి భరతవంశస్థుల కథ చెప్పడం జరిగింది. సంభవపర్వంలో రాజుల భిన్నభిన్న జన్మ సంబంధి కథలు చెప్పబడినాయి. ఇంకా శూరుల యొక్క, వ్యాసమహర్షి యొక్క కథలు తెల్పబడినాయి. ఇక్కడే దేవతల అంశాలు - వాని కథలు చెప్పబడ్డాయి.

ఈ పర్వంలోనే దైత్య, దానవ, యక్ష, నాగ, సర్ప, గంధర్వ, పక్షి జాతుల పుట్టుక, ఇతర ప్రాణుల పుట్టుకలూ చెప్పబడినవి. కణ్వమహర్షి ఆశ్రమంలో శకుంతలకు దుష్యంతుని వలన భరతుడు పుట్టాడు. అతని పేరుతోనే ఆ వంశానికంతకూ భారతవంశమని లోకప్రసిద్ధి ఏర్పడింది. తరువాత వసువులు గంగాదేవికి శంతనుని యింట పుత్రులుగా పుట్టడం, ఏడుగురు దివికేగటం జరిగింది. వసువుల తేజస్సులు భీష్ముని కివ్వడం, భీష్ముడు బ్రహ్మచర్య మవలంబించడం, రాజ్యం అక్కర లేదనడం, చిత్రాంగదుని రక్షించడం, ప్రతిజ్ఞ నిర్వహించుకొనడం, చిత్రాంగదుడు చనిపోతే విచిత్రవీర్యునికి రాజ్యమివ్వడం, యమధర్మరాజు అణీమాండవ్యుని శాపంవల్ల మర్త్యలోకంలో పుట్టడం, కృష్ణద్వైపాయనుని వరంతో ధృతరాష్ట్ర, పాండురాజులు పుట్టడం, పాండవులు పుట్టడం కూడా ఇందులోనే ఉన్నాయి. దుర్యోధనుని దుర్మంత్రంతో పాండవులను వారణావతం పంపడం, దారిలో ధీమంతు డయిన విదురుడు మ్లేచ్ఛభాషలో ధర్మరాజుకు హితోపదేశం చేయడం ఉన్నాయి. విదురుని మాటతో సొరంగం త్రవ్వడం; లక్కయింట్లో పడుకున్న నిషాది, అయిదుగురు కొడుకులూ, పురోచనుడు, లక్కయింట్లో తగలబడిపోవడం; పాండవులు తప్పించుకొని అడవిలో హిడింబను చూడటం, భీముడు హిడింబాసురుని చంపడం, ఘటోత్కచుని పుట్టుక ఈ ఆదిపర్వంలోనే ఉన్నాయి.

అమితతేజస్వి అయిన వ్యాసమహర్షి దర్శనమూ, వ్యాసుని ఆజ్ఞతో ఏకచక్రపురంలో బ్రాహ్మణుని యింట్లో ఎవరికీ తెలియకుండా నివసించటమూ, అచట బకుడనే రాక్షసుని భీముడు చంపడమూ, నగరవాసుల విస్మయమూ ఇందే వివరింపబడ్డాయి. ద్రౌపదీ జననమూ, ధృష్టద్యుమ్నుని పుట్టుక కూడ ఇందే చెప్పబడినవి. బ్రాహ్మణుని మాటలు విని, వ్యాసుని ప్రేరణతో, స్వయంవరం చూడాలనే కోరికతో ద్రౌపదిని కాంక్షిస్తూ పాండవులు కుతూహలంతో పాంచాలదేశానికి బయలుదేరడమూ ఇందే ఉన్నాయి. గంగానదీ తీరంలో అర్జునుడు అంగారపర్ణుని జయించడం, వాని స్నేహంతో తాపత్యులని తెలియడం- అపుడే వశిష్ఠుని వృత్తాంతం, ఔర్వోపాఖ్యానం చెప్పబడింది - తరువాత పాండవులంతా పాంచాల నగరానికి వెళ్ళడం, అక్కడ అర్జునుడు మత్స్యయంత్రం కొట్టి అందరిరాజుల ఎదుట ద్రౌపదిని పొందటం, అక్కడే ఎదురుతిరిగిన రాజులనూ, కర్ణశల్యులనూ భీమార్జునులు జయించడం జరిగింది. బలరామకృష్ణులు భీమార్జునుల అమానుష పరాక్రమాన్ని చూచి పాండవులని శంకించడం, వారిని కలిసికొనేందుకు కుమ్మరి యింటికి రామకృష్ణులు వెళ్లడం, ద్రుపదుడు

తన కుమార్తెను అయిదుగురికీ వివాహం చేయటానికి వెనుకాడటం మొదలగునవి (ఇందులో ఉన్నాయి). ఇక్కడే అద్భుతమైన పంచేంద్రోపాఖ్యానం చెప్పబడింది. మనుష్యులకు విపరీతమయిన ద్రౌపదీ వివాహం కూడా చెప్పబడింది. ధృతరాష్ట్రుడు విదురుని పాండవుల దగ్గరకు పంపడం, అక్కడకు వెళ్లి విదురుడు శ్రీకృష్ణుని కూడ దర్శించడం.

తరువాత ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యం ఇచ్చి ఖాండవ ప్రస్థానికి పంపడం - ఇంద్రప్రస్థంలో పాండవులు రాజ్యం చేయడం - నారదాగమనం - ద్రౌపదితో పాండవుల సమయం. నారదుడు సుందోపసుందుల కథ చెప్పడం, తరువాత ద్రౌపదితో కూర్చున్న యుధిష్ఠిరుని అర్జునుడు బ్రాహ్మణుని కోసం దర్శించడం, అర్జునుడు బ్రాహ్మణుని కార్యం నెరవేర్చి వచ్చి వనవాసానికి అనుజ్ఞ వేడడం, త్రోవలో ఉలూపితో సమాగమం, పుణ్యతీర్థసేవనం, బభ్రువాహనుడు జన్మించడం, బ్రాహ్మణుని శాపం వల్ల మొసళ్లుగా మారిన అయిదుగురు అప్సరసలకు అర్జునుడు శాపమోక్షం కలిగించడం, ప్రభాస తీర్థంలో కృష్ణునితో అర్జునుని సమాగమం, ద్వారకలో సుభద్రను ప్రేమించి వాసుదేవుని అనుమతితో అర్జునుడు చేపట్టడం, కృష్ణుడు హరణం పట్టుకుని రావడం, సుభద్రకు అర్జునుని వలన ఉత్తమతేజస్వి అయిన అభిమన్యుడు పుట్టడం, ద్రౌపదికి అయిదుగురు ఉపపాండవులు పుట్టడమూ ఇక్కడే కీర్తింపబడింది. విహారంకోసం యమునా తీరానికి వెళ్లిన కృష్ణార్జునులకు అగ్నిహోత్రుడు కనపడటం, చక్రాన్ని కృష్ణునికీ, ధనుస్సును అర్జునునికీ ఇవ్వడం, ఖాండవ వనం దహించటం - అందులో మంటలనుండి మయుని, సర్పాన్ని విడిచిపెట్టడం, మందపాల మహర్షికి శార్ఙ్గి పక్షి వలన పుత్రులు పుట్టిన కథ - ఇదంతా ఆదిపర్వంలో విస్తారంగా చెప్పబడింది. వ్యాసమహర్షి ఆదిపర్వంలో రెండువందల ఇరవైఏడు (227) అధ్యాయాలు చెప్పాడు. ఈ ఆదిపర్వంలో వ్యాసులవారు ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై నాలుగు శ్లోకాలు (8884) చెప్పారు.

రెండవది **సభాపర్వం**. ఇందులో చాలా వృత్తాంతాల వర్ణన ఉంది. పాండవుల సభానిర్మాణం, కింకరులనే రాక్షసుల దర్శనం, దేవర్షి అయిన నారదుడు లోకపాలుర సభలను గురించి చెప్పడం, రాజసూయయాగం ఆరంభం, జరాసంధ వధ, గిరివ్రజంలో బంధింపబడిన రాజులను కృష్ణుడు విడిపించడం, పాండవుల దిగ్విజయం ఇందులో ఉన్నాయి. రాజులంతా కానుకలతో రాజసూయయాగానికి రావడం, రాజసూయంలో అర్ఘ్యానికి సంబంధించిన వివాదంలో శిశుపాలుని వధించడం, యజ్ఞవైభవం చూసి దుర్యోధనునికి దుఃఖం, అమర్షం కలగడం, మయ సభలో దుర్యోధనుని చూచి భీముడు నవ్వడం... దానితో దుర్యోధనునికి కోపం రావడం, జూదం ఏర్పాటు- దానిలో జూదగాడయిన

శకుని ధర్మరాజును ఓడించడం, జూదం అనే సముద్రంలో మునిగిపోతున్న ద్రౌపదిని నావలాగా మహాప్రాజ్ఞు డయిన ధృతరాష్ట్రుడు ఉద్ధరించడం. ఆది తెలిసి దుర్యోధనుడు మళ్లీ పాండవులను ద్యూతానికి పిలవడం.. అనుద్యూతంలో జయించి పాండవులను అరణ్యవాసానికి పంపడం- ఇవన్నీ సభాపర్వంలో వర్ణించాడు వ్యాసమహర్షి. డెబ్బది ఎనిమిది 78 అధ్యాయాలు - రెండువేల అయిదు వందల పదకొండు (2511) శ్లోకాలు సభాపర్వంలో ఉన్నాయి.

ఇక మూడవ పర్వం **ఆరణ్యపర్వం**. పాండవులు వనవాసానికి బయలుదేరడం, ధీమంతుడయిన ధర్మరాజును పౌరులు అనుసరించి రావడం, బ్రాహ్మణులను అన్నౌషధులతో పోషించటానికి ధర్మరాజు సూర్యుని ఆరాధించటం, ధౌమ్యుని ఉపదేశంతో, సూర్యుని అనుగ్రహంతో అక్షయపాత్ర ద్వారా అన్నం సంభవించడం - ధృతరాష్ట్రుడు హిత ముపదేశించే విదురుని పాండవుల కడకు పొమ్మనడం, అతడు పాండవుల కడకు వెళ్లడం, మళ్లీ ధృతరాష్ట్రుని ఆజ్ఞతో వెనుకకు రావడం, కర్ణుని ప్రోత్సాహంతో దుర్మార్గు డయిన దుర్యోధనుడు అరణ్యంలో ఉన్న పాండవులను చంపటానికి కుట్ర పన్నడం, ఆ దుష్టభావం తెలిసి వెంటనే వ్యాసమహర్షి రావడం, అతడు ఆ పని చేయవద్దని చెప్పడం, సురభి వృత్తాంతం చెప్పడం, మైత్రేయ మహర్షి వచ్చి దుర్యోధనునకు హితం చెప్పడం, అతడే దుర్యోధనునకు శాపమివ్వడం. భీమసేనుడు యుద్ధంలో కిర్మీరుడనే రాక్షసుని చంపడం-వృష్ణివంశస్థులూ, పాంచాలురూ పాండవులను చూడటానికి రావడం, శకుని మోసంతో ద్యూతంలో ఓడించాడని విని శ్రీకృష్ణుడు కోపించడం, అర్జునుడు శాంతింపజేయడం. కృష్ణుని ఎదుట ద్రౌపది విలపించడం, కృష్ణుడు ఓదార్చడం ఇవన్నీ కీర్తింపబడినవి. ఇందులోనే వ్యాసుడు సౌభవధనుగురించి చెప్పాడు- పుత్రునితో సహా సుభద్రను కృష్ణుడు ద్వారకా పురికి తీసుకొని వెళ్లడం, పాండవులు రమ్య మయిన ద్వైతవనం ప్రవేశించటం, ద్రౌపదీ ధర్మరాజుల సంవాదం, అలాగే భీమధర్మరాజుల సంవాదమూ ఇందులోనే ఉన్నాయి.

వ్యాసుడు పాండవుల దగ్గరకు రావడం, ధర్మరాజుకు వ్యాసమహర్షి ప్రతిస్మృతివిద్యను ఉపదేశించడం, వ్యాసమహర్షి వెళ్లాక పాండవులు కామ్యక వనానికి వెళ్లడం, అమిత తేజస్వి అయిన పార్థుడు అస్త్ర సంపాదన కోసం వెళ్లడం, కిరాతరూపు డయిన మహేశ్వరునితో అర్జునుడు యుద్ధం చేయడం, లోక పాలుర దర్శనం, అస్త్రాలు లభించడం, అస్త్రాల కోసం అర్జునుడు ఇంద్రలోకానికి వెళ్లడం, ఈ విషయం విని ధృతరాష్ట్రుడు చాలా విచారించడం, బృహదశ్వుడనే మహర్షి ధర్మరాజు దగ్గరకు రావడం, యుధిష్ఠిరుడు తన కష్టం చెప్పుకోవడం- కరుణ స్మారకమయిన నలోపాఖ్యానం ఈ సందర్భంలోనే చెప్పబడింది.

నలదమయంతుల చరిత్ర-ఆ మహర్షివల్ల ధర్మరాజు అక్షహృదయం పొందటం, స్వర్గం నుండి లోమశమహర్షి పాండవులకడకు రావడం, అర్జునుని గురించి స్వర్గంలో జరిగిన విశేషాలన్నీ అతడు చెప్పడం, అర్జునుని సందేశంతో ధర్మజుడు తీర్థాభిగమనం చేయడం - తీర్థసేవనంతో పుణ్యఫలప్రాప్తి ఇందులో కీర్తింపబడినవి.

నారదమహర్షి పులస్త్య తీర్థానికి వెళ్లమని ప్రోత్సహించడం, పాండవులు వెళ్లడం, ఇంద్రుడు కర్ణుని కుండలాలు గ్రహించడం, గయుని యజ్ఞ వైభవమూ ఇక్కడ కీర్తింపబడ్డాయి. అగస్త్యవృత్తాంతం, వాతాపిని అగస్త్యుడు భక్షించడం, సంతానంకోసం అగస్త్యుడు లోపాముద్రను వివాహమాడటం. తరువాత ఋష్యశృంగుని చరిత్ర, పరశురాముని చరిత్ర. ఇక్కడే కార్తవీర్యుని యొక్క, హైహయుల యొక్క వధ వర్ణింపబడింది- ప్రభాస తీర్థంలో పాండవులు, వృష్ణివంశస్థులూ కలవడం, సుకన్యోపాఖ్యానం, భార్గవు డయిన చ్యవన మహర్షి శర్యాతి యొక్క యజ్ఞంలో అశ్వినీకుమారులకు సోమపానం చేసే అధికారం ఇవ్వడం.. వారివల్ల చ్యవనునికి యౌవనం రావడం, మాంధాత చరిత్ర కూడా ఇక్కడే చెప్ప బడింది. ఇక్కడే జంతూపాఖ్యానం చెప్పాడు, ఇందులో సోమకుడు తన పుత్రునిచేత పుత్రునికోసం యజ్ఞం చేయిస్తే అతనికి నూర్గురు పుత్రులు కలిగారు. తరువాత శ్యేనకపోతీయమనే ఉపాఖ్యానం. ఇందులోనే ఇంద్రుడూ, అగ్ని శిబిని పరీక్షించడం కోసం వచ్చారు.

ఈ పర్వంలోనే అష్టావక్రుని చరిత్ర వస్తుంది. జనకుని యజ్ఞంలో అష్టావక్రునికి బందితో వివాదం వచ్చింది. ఆ బంది నైయాయికులలో ముఖ్యుడు - వరుణుని కుమారుడు. ఈ వివాదంలో అష్టావక్రుడు బందిని ఓడించాడు. జయించి, సాగరంలో ప్రవేశించిన తన తండ్రిని అష్టావక్రుడు పొందాడు. దీని తరువాత యవక్రీతుని చరిత్ర, రైభ్యుని చరిత్ర వస్తాయి. పాండవులు గంధమాదన పర్వతానికి వెళ్లడం, అక్కడ నారాయణాశ్రమంలో ఉండటం, ద్రౌపది అడిగితే భీముడు గంధమాదన పర్వతానికి వెళ్లడం, త్రోవలో అరటివనంలో పవనాత్మజు డయిన హనుమంతుని చూడటం- అక్కడ సౌగంధిక కమలాల కోసం ఆ సరస్సును కలత పెట్టడం. అక్కడే భీమునికి, యక్ష రాక్షసులతోను, మణిమంతుడు మొదలయిన వారితో యుద్ధం జరగడం.. తరువాత భీముడు జటాసురుని వధించడం, వృషపర్వుడనే రాజర్షిరావడం, ఆర్టిషేణాశ్రమానికి పాండవులు వెళ్లడం, అక్కడ నివాసం, అక్కడ ద్రౌపది భీముని కైలాస పర్వతారోహణానికి ప్రోత్సహించడం, అక్కడ బలవంతు లయిన మణిమంతుడు మొదలయిన వారితో ఘోర యుద్ధం జరగటం.. అక్కడే పాండవులు కుబేరుని కలుసుకోవటం, అర్జునుడు తన సోదరులను అక్కడే కలవటం.. దివ్యాస్త్రాలు పొంది అర్జునుడు ఇంద్రునికోసం హిరణ్యపురవాసులయిన నివాతకవచులతో యుద్ధం

చేయటం.. నివాతకవచులతోను, పౌలోమ కాలకేయులతోను అర్జునుని యుద్ధం, వారిని అర్జునుడు వధించడం, ఇదంతా అర్జునుడు ధర్మరాజుతో చెప్పడం - ధర్మరాజు దగ్గర అర్జునుడు తన దివ్యాస్త్రాలను ప్రయోగించి చూపించాలనుకోవటం... నారదుడు వచ్చి అట్లా ప్రయోగించరాదని వారించడం - తరువాత పాండవులు గంధమాదన పర్వతం దిగడం. పర్వతమంత పెద్ద శరీరమున్న పాము వనంలో భీముని పట్టుకోవడం... అపుడు ధర్మరాజు వాని ప్రశ్నలకు సమాధానం చెప్పి, భీముని విడిపించడం.. మళ్లీ పాండవులు కామ్యకవనం చేరడం.. అక్కడున్న పాండవులను చూడటానికి మళ్లీ కృష్ణుడు రావడం కూడా ఇక్కడే వర్ణింపబడింది. మార్కండేయమహర్షి రావడం - అతడు వచ్చి పృథుచరిత్ర, వైన్యుని చరిత్ర మొదలయినవి చెప్పడం. ఈ సందర్భంలోనే తార్క్ష్య మహర్షికి సరస్వతికి జరిగిన సంవాదమూ, మత్స్యోపాఖ్యానమూ కూడా చెప్పబడ్డాయి. ఈ మార్కండేయ సమాగమంలోనే చాలా పూర్వకథలు.... ఇంద్రద్యుమ్నుని చరిత్ర, ధుంధుమారుని చరిత్ర, పతివ్రతచరిత్ర, అంగిరసుని చరిత్ర, ద్రౌపదీ సత్యభామల సంవాదమూ వర్ణింపబడ్డాయి. తరువాత పాండవులు మళ్లీ ద్వైతవనం చేరడం - ఘోషయాత్ర, అందులోనే దుర్యోధనుడు గంధర్వుల చేత బంధింపబడటం... మందబుద్ధియైన దుర్యోధనుడు సిగ్గుపడుతూ అర్జునుని చేత విడిపింపబడటం.. ధర్మరాజుకు కలలో మృగాలు కనిపించడం...

మళ్లీ కామ్యకవనానికి పాండవులు చేరడం, ఎంతో విస్తారంగా వ్రీహిద్రోణాఖ్యానం చెప్పడం.. దుర్వాసుని ఉపాఖ్యానం కూడా ఇక్కడే చెప్పబడింది. ఆశ్రమం నుండి ద్రౌపదిని జయద్రథుడు అపహరించడం, వాయువేగంతో భీముడు సైంధవుని వెంటాడటం, మహాబలుడయిన భీముడు సైంధవునికి పంచశిఖలు పెట్టడం.. ఇందులోనే ఉన్నాయి. రామాయణం కూడ ఇక్కడ చెప్పబడింది. రాముడు పరాక్రమించి యుద్ధంలో రావణుని చంపడం విస్తారంగా చెప్పబడింది. ఇక్కడే సావిత్రి చరిత్ర చెప్పబడింది. కర్ణుని కుండలాలను ఇంద్రుడు గ్రహించడం... ఒకనిని చంపగల శక్తిని కర్ణుడు ఇంద్రుని నుండి గ్రహించడం. ఆరణేయోపాఖ్యానం తరువాతిది. ఇందులో యమధర్మరాజు ధర్మరాజుకు ధర్మశిక్ష చేశాడు. పాండవులు యమధర్మరాజు నుండి వరాలు పొంది పశ్చిమ దిక్కుకు వెళ్లారు - ఇదంతా ఆరణ్యపర్వమని మూడవ పర్వం చెప్పబడింది. ఇందులో రెండువందల అరువది తొమ్మిది (269) అధ్యాయాలు ఉన్నాయి. ఈ పర్వంలో పదకొండు వేల ఆరువందల అరవైనాలుగు (11664) శ్లోకా లున్నాయి.

తరువాతిది **విరాట పర్వం** - పాండవులు విరాట నగరానికి వెళ్లి, శ్మశానంలోని శమీవృక్షాన్ని చూసి, అక్కడ తమ ఆయుధాలు దాచుకొన్నారు. నగరంలో ప్రవేశించి

రహస్యంగా పాండవులు నివసించసాగారు. కామోపహత చేతస్కుడయి, పాంచాలిని అడిగిన దుష్టాత్ముడయిన కీచకుని ఇక్కడే భీముడు సంహరించాడు. పాండవులను అన్వేషించటానికి దుర్యోధనుని గూఢచారులు అన్ని దిక్కులకూ పంపబడ్డారు. కాని పాండవుల జాడ వారికి తెలియలేదు - త్రిగర్తుల చేత విరాటుని గోవులు ముందుగా గ్రహింపబడినవి. అక్కడే త్రిగర్తులతో ఒళ్లు గగుర్పొడిచే యుద్ధం జరిగింది. అందులో పట్టుబడిన విరాటుని భీమసేనుడే విడిపించాడు. విరాటుని గోధనమంతా పాండవులే విడిపించారు. ఇది దక్షిణ గోగ్రహణం. ఇక తరువాత కౌరవులు ఉత్తర గోగ్రహణం చేశారు. అందులో కౌరవులందరినీ జయించి అర్జునుడు విరాటుని గోవులను విడిపించాడు. అపుడే విరాటుడు తన పుత్రిక ఉత్తరను అర్జునునికి ఇస్తానంటే అర్జునుడు అభిమన్యునికి చేసుకొన్నాడు. ఇది నాలుగవది - విరాట పర్వం. ఇందులో 67 (అరువది ఏడు) అధ్యాయాలు - 2050 (రెండు వేల ఏబది శ్లోకాలు) ఉన్నాయి.

ఉద్యోగపర్వం తరువాత వినవలసినది. పాండవులు ఉపప్లవ్యంలో ఉండగా యుద్ధంలో జయం పొందాలని దుర్యోధనుడూ, అర్జునుడూ శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్లారు. రాబోయే యుద్ధంలో మీరు మాకు సహాయం చెయ్యాలని అడిగారు ఇద్దరూ. అపుడు మహామతి అయిన శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "నేను యుద్ధం చేయకుండా కేవలం సలహా మాత్రం చెపుతాను. నా సైన్యం అక్షోహిణి ఉంది. ఏది మీకు కావాలో కోరుకొనండి" అపుడు మందబుద్ధి, దుర్మార్గుడు అయిన దుర్యోధనుడు సైన్యం కోరుకొన్నాడు. యుద్ధం చెయ్యని కృష్ణుని అర్జునుడు మంత్రిగా కోరుకొన్నాడు. పాండవుల దగ్గరకు వస్తున్న మద్రరాజయిన శల్యుని దుర్యోధనుడు మార్గంలో సౌకర్యాలు కల్పించి, మోసగించి శల్యుని నుండి సాహాయ్యం చేస్తానని వరం తీసికొన్నాడు. తరువాత పాండవులను చూడటానికి పాండవుల దగ్గరకు వచ్చాడు. అచ్చట ధర్మరాజును ఓదారుస్తూ ఇంద్ర విజయ కథ చెప్పాడు. ఆ తరువాత కౌరవుల దగ్గరకు పాండవులు ద్రుపద పురోహితుని పంపారు. ఇంద్రవిజయమూ, ద్రుపదపురోహితుని త్రిప్పి పంపడమూ అయిన తరువాత ధృతరాష్ట్రుడు పాండవుల దగ్గరకు శాంతిని కోరి, సంజయుని దూతగా పంపాడు. వాసుదేవునితో సహా పాండవుల అభిప్రాయాలు తెలిసికొని సంజయుడు తిరిగి వచ్చాడు. దానితో ధృతరాష్ట్రునికి చింత ఏర్పడింది - నిద్రపట్టలేదు. విదురుడు వచ్చి చాలా నీతులు ధృతరాష్ట్రునికి వినిపించాడు. తరువాత సనత్సుజాతుడు వచ్చి మనస్తాపంతో నిండిన ధృతరాష్ట్రునికి అధ్యాత్మ విషయాలు చెప్పాడు.

తెల్లవారింది - సంజయుడు రాజసభలో కృష్ణార్జునుల ఏకాత్మతను, అభిప్రాయాలను

చెప్పాడు. దయాస్వభావంతో సంధిని కోరుతూ మహాధీశాలి అయిన శ్రీకృష్ణుడు స్వయంగా రాయబారానికి హస్తినాపురం వెళ్లాడు. సంధిని కోరి ఉభయపక్షాలకూ హితం చెప్పే కృష్ణుని మాటలను దుర్యోధనుడు తిరస్కరించాడు. అపుడే గర్వితు డయిన దంభోద్భవుని వృత్తాంతం చెప్పబడింది. మాతలి వరాన్వేషణం చేయడం కూడా ఇక్కడే చెప్పబడింది. గాలవ మహర్షి యొక్క చరిత్ర, విదుల తన కొడుకును యుద్ధానికి ప్రేరేపించడమూ చెప్పబడ్డాయి. కర్ణదుర్యోధనాదుల దుర్మంత్రం తెలిసికొని కృష్ణుడు తన యోగేశ్వరత్వమూ, విరాట్ స్వరూపమూ ప్రదర్శించాడు. కృష్ణుడు కర్ణుని రథ మెక్కించుకొని భేదోపాయంతో రహస్యంగా మాట్లాడడమూ, కర్ణుడు తిరస్కరించడమూ ఇందులోనే ఉన్నాయి. కృష్ణుడు హస్తినాపురం నుండి ఉపప్లావ్యానికి తిరిగి వచ్చి పాండవులకు జరిగిన విషయాలన్నీ చెప్పాడు. అతని మాటలు విని పాండవులు ఆలోచించి యుద్ధానికి సిద్ధపడ్డారు. తరువాత హస్తినాపురం నుండి చతురంగ బలాలూ యుద్ధానికి బయలుదేరడం, ఆ బలాలను లెక్కకట్టడం.. "రేపు యుద్ధం, సిద్ధంగా ఉండండి" అంటూ దుర్యోధనుడు ఉలూకుని పాండవుల కడకు పంపడం... ఉభయసైన్యాలలోను రథాతిరథులను పరిగణించడం, అంబోపాఖ్యానం... ఇలా చాలా వృత్తాంతాలతో కూడిన అయిదవ పర్వం ఉద్యోగపర్వం. సంధి విగ్రహప్రయత్నాలతో కూడిన ఈ ఉద్యోగ పర్వంలో నూట ఎనభైఆరు అధ్యాయాలు(186), ఆరువేల ఆరువందల తొంభది ఎనిమిది(6,698) శ్లోకాలూ వ్యాసమహర్షి చెప్పాడు.

తరువాతిది **భీష్మ పర్వం** - ఇది చాలా విచిత్రార్థాలతో కూడినది. ముందుగా సంజయుడు జంబూఖండ వినిర్మాణం గురించి చెపుతాడు. తరువాత యుధిష్ఠిరుని సైన్యం విషాదం పొందడం, పదిరోజుల భీష్ముని యుద్ధం చెప్పబడింది. దీనికంటె ముందు అర్జునునికి మోహం ఆవేశించడం, మహా ప్రజ్ఞావంతుడయిన వాసుదేవుడు మోక్షోపయోగి హేతువులతో అర్జునుని మోహం పోగొట్టడం, యుద్ధంలో ధర్మజుని హితం కోరి కృష్ణుడు రథం నుండి క్రిందికి దూకి, భీష్ముని చంపడానికి పూనుకొనడం... ధనుర్ధారు లందరిలో శ్రేష్ఠ డయిన అర్జునుడు కృష్ణుని మాటల పగ్గాలతో కొట్టబడటమూ. శిఖండిని ముందు పెట్టుకొని నిశితమైన బాణాలతో భీష్ముని పడగొట్టడం... భీష్ముడు అంపశయ్య మీద పడిపోవడం.. ఈ విషయాలతో విస్తరించిన భీష్మపర్వం భారతంలో ఆరవ పర్వం... ఈ భీష్మపర్వంలో నూట పదునేడు (117) అధ్యాయాలూ, అయిదువేల ఎనిమిది వందల ఎనభైనాలుగు(5884) శ్లోకాలూ వ్యాసమహర్షి చెప్పాడు.

తరువాతిది చిత్రమై చాలా కథలతో కూడిన **ద్రోణపర్వం**- ముందుగా ద్రోణాచార్యుని

సైన్యాధ్యక్షునిగా అభిషేకించారు. దుర్యోధనుని ప్రీతికోసం అస్త్రవేత్త అయిన ద్రోణుడు "ధర్మరాజును పట్టుకొంటా"నని ప్రతిజ్ఞ చేశాడు. ఇందులోనే సంశప్తకులు యుద్ధభూమి నుండి అర్జునుని ప్రక్కకు లాగుకొనిపోయారు. భగదత్తుని, అతని ఏనుగు సుప్రతీకాన్ని అర్జునుడు సంహరించాడు. జయద్రథుడు మొదలయిన మహారథులంతా కలిసి బాలుడయిన అభిమన్యు నొక్కని చేసి చంపారు. అభిమన్యుడు చనిపోయాక పార్థుడు యుద్ధంలో ఒక్కరోజున ఏడు అక్షౌహిణుల సేననూ, జయద్రథుని చంపాడు. అదే రోజున ధర్మరాజు ఆజ్ఞతో అర్జునుని వెదకటానికి భీముడూ, సాత్యకి బయలుదేరి దేవతలు కూడా ఎదిరింపలేని భారతసేనను ప్రవేశించారు. మిగిలిన సంశప్తకులు తొమ్మిదికోట్ల మందిని అర్జునుడు నిశ్శేషంగా హరించాడు. ధృతరాష్ట్రుని పుత్రులు పాషాణ యోధులు, నారాయణ గోపాలురు, అలంబుషుడు, శ్రుతాయువు, జలసంధుడు, సౌమదత్తి, విరాటుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు మొదలయిన వారంతా ఈ ద్రోణపర్వంలోనే చనిపోయారు. ద్రోణుడు చనిపోతే అశ్వత్థామ కోపించి నారాయణాస్త్రం ప్రయోగించాడు. ఆగ్నేయాస్త్ర ప్రయోగం, రుద్రమాహాత్మ్యం, వ్యాసుని రాక, కృష్ణార్జునుల మాహాత్మ్యమూ ఇందే ప్రదర్శితమయ్యాయి. ఏడవ దయిన ఈ ద్రోణపర్వంలోనే చెప్పుకోదగిన రాజులంతా చనిపోయారు. ఈ ద్రోణ పర్వంలో నూట డెబ్బది అధ్యాయాలు (170), ఎనిమిది వేల తొమ్మిది వందల తొమ్మిది (8909)శ్లోకాలూ వ్రాశాడు వ్యాసమహర్షి.

తరువాత పరమాద్భుత మయిన **కర్ణపర్వం** చెప్పబడింది. మద్రదేశపు రాజయిన శల్యుని సారథ్యంలో నియోగించడం - త్రిపురాసుర సంహారం. ప్రయాణంలోనే శల్యుడు పరుషంగా మాట్లాడటం, కర్ణశల్యుల సంవాదం, హంసకాకీయోపాఖ్యానం. అశ్వత్థామ పాండ్యరాజును, దండసేనుని, దండుని సంహరించడం ---- కర్ణునితో ద్వైరధయుద్ధంలో ధర్మరాజుకు అందరూ చూస్తూ ఉండగా ప్రాణసంశయం కలగడం ---- ధర్మరాజుకు అర్జునునకు పరస్పరం కోపం రావడం, అక్కడే కృష్ణుడు అర్జునుని అనునయించడం. దుశ్శాసనుని వక్షస్థలం చీల్చి, భీముడు యుద్ధంలో రక్తం త్రాగుతానన్న ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడం, ద్వైరథ యుద్ధంలో కర్ణుడు అర్జునుని చేత చనిపోవడం- ఇట్లా భారతంలో కర్ణపర్వం ఎనిమిదవ పర్వం అయింది. ఇందులో అరవై తొమ్మిది అధ్యాయాలు(69), నాలుగువేల తొమ్మిది వందల అరవై నాలుగు (4964) శ్లోకాలూ ఉన్నాయి.

తరువాతిది విచిత్రార్థాలతో కూడిన **శల్య పర్వం**. ప్రసిద్ధవీరు లంతా చనిపోయాక శల్యుడు సైన్యాధిపతి అయ్యాడు. ఇందులోనే కుమారస్వామి చరిత్ర, అభిషేక కర్మ చెప్పబడ్డాయి. రథ యుద్ధాలు, కురుముఖ్యుల వినాశం ఈ శల్య పర్వంలో వర్ణింపబడింది.

ధర్మరాజు శల్యుని చంపడమూ, సహదేవుడు యుద్ధంలో శకునిని వధించడమూ ఈ పర్వంలోనే జరిగాయి. చాలాసైన్యం చచ్చిపోయి ఇంకా కొద్దిసైన్యం మాత్రమే మిగిలి ఉంది. అపుడు దుర్యోధనుడు మడుగులో నీటిని స్తంభింపజేసి దాగుకొన్నాడు. లుబ్ధకుల చేత భీమునికి దుర్యోధనుని ప్రవృత్తి ఇచ్చటనే చెప్పబడింది. ధర్మరాజు ఆక్షేపిస్తూ మాట్లాడగానే కోపంతో దుర్యోధనుడు బయటికి రావడం, అప్పుడు భీమునితో గదా యుద్ధం చెయ్యడమూ ఇందులోనే ఉంది. యుద్ధం చివరలో బలరాముడు రావడం, సరస్వతి మొదలయిన తీర్థాల పవిత్రత వర్ణించడం; భీమ, సుయోధనుల గదా యుద్ధమూ ఇందులోనే వర్ణించబడింది. ఆ గదాయుద్ధంలోనే భీమసేనుడు దుర్యోధనుని తొడలు విరుగగొట్టాడు. ఈ కథతో ఈ పర్వం అద్భుతమూ, అర్థవంతమూ అయింది. ఇది తొమ్మిదవ పర్వం. ఈ పర్వంలో 59 ఏబది తొమ్మిది అధ్యాయాలున్నాయి. ఎన్నో వృత్తాంతాలున్న ఈ పర్వంలో..... (3220) మూడువేల రెండు వందల ఇరవై శ్లోకాలు వ్రాశాడు వ్యాసమహర్షి.

తరువాతి పర్వం దారుణమయిన **సౌప్తిక పర్వం**. తొడలు విరిగి నేలమీద పొర్లుతున్న దుర్యోధనుని విడిచి పాండవులు వెళ్లిపోయాక; కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ ముగ్గురూ సాయంకాలం రక్తపుమడుగులో ఉన్న దుర్యోధనుని దర్శించారు. కటిక నేలమీద పడిఉన్న దుర్యోధనుని చూసి అశ్వత్థామ క్రోధంతో "ధృష్టద్యుమ్నుడూ మొదలయిన పాంచాలు రందరినీ, మంత్రి సహితంగా పాండవులనూ చంపకుండా కవచం విప్పను" అని ప్రతిజ్ఞ చేశాడు. దుర్యోధనుని అక్కడే విడిచి వారు మువ్వురూ సూర్యాస్తమయంలో వనం చేరారు. ఆ వనంలో ఒక పెద్ద మర్రిచెట్టుక్రింద ముగ్గురూ కూర్చున్నారు. రాత్రి అయింది. ఒక గుడ్లగూబ కాకులను చంపడం చూశాడు అశ్వత్థామ. క్రోధావేశంతో అశ్వత్థామ తండ్రి వధను స్మరిస్తూ, నిద్రించే పాంచాలురను వధించాలని నిశ్చయించుకొన్నాడు. అశ్వత్థామ శిబిర ద్వారం దగ్గర ఘోర రూపు డయిన రాక్షసుని చూశాడు. అతడు ఆకాశమంతా ఆవరించి నిలిచాడు. వానిమీద అస్త్రాలు పనిచేయలేదు. అపుడు అశ్వత్థామ విరూపాక్షుడయిన రుద్రుని ఆరాధించాడు. ఆదమరచి నిద్రపోతున్న ధృష్టద్యుమ్నాది పాంచాలురనూ, ఉపపాండవులనూ అశ్వత్థామ, కృప, కృతవర్మలు చంపివేశారు. కృష్ణుని వల్ల పాండవులు సాత్యకి మాత్రం తప్పించుకొన్నారు. మిగిలిన వారంతా చనిపోయారు. అపుడు ధృష్టద్యుమ్నుని సారథి వెళ్లి ఈ విషయం పాండవులకు చెప్పాడు. పుత్రులు, తండ్రి, సోదరులూ చనిపోయినందుకు ద్రౌపది చాలా దుఃఖించింది. ద్రౌపది అపుడే నిరాహారదీక్ష చేసింది. ద్రౌపది మాటతో ఆమెకు ప్రియం చెయ్యాలని భీముడు గద పట్టుకొని అశ్వత్థామను వెంటాడాడు. భీముని మీది భయంతోను, దైవప్రేరణతోనూ

క్రోధంతో అశ్వత్థామ "అపాండవ మగుగాక" అని అస్త్ర ప్రయోగం చేశాడు. కృష్ణుడు వద్దని వారించినా వినలేదు అశ్వత్థామ. అపుడు అర్జునుడు ఆ అశ్వత్థామ అస్త్రాన్ని మరో అస్త్రంతో శమింపజేశాడు. ద్రౌణి యొక్క ద్రోహ బుద్ధిని చూసి వ్యాసుడు శపించాడు. అశ్వత్థామ తిరిగి వ్యాసుని శపించాడు. అపుడు అశ్వత్థామ నుండి మణిని తీసికొనివచ్చి ద్రౌపదికి ఇచ్చి పాండవులు సంతుష్టులు అయ్యారు. ఇది సౌప్తిక మనే పేరుగల పదవ పర్వం. ఇందులో పదునెనిమిది (18) అధ్యాయాలున్నాయి. ఇందులో ఎనిమిదివందల డెబ్బది(870) శ్లోకాలున్నాయి.

ఇలా సౌప్తిక పర్వం ఉత్తమతేజస్సులతో నిండిపోతే తరువాతిది **స్త్రీ పర్వం** పరమ శోకంతో నిండి పోయింది. పుత్రశోకంతో పరితపించే ధృతరాష్ట్రుడు భీముని చంపాలనుకోవడం, కృష్ణుడు ఇనుపభీముని ధృతరాష్ట్రుని ముందుంచడం, దాన్ని ధృతరాష్ట్రుడు పిండి పిండిగా చేయడం, శోకించే ధృతరాష్ట్రుని మోక్ష ధర్మాలతో విదురుడు ఓదార్చడం..... అంతఃపుర కాంతలతోకూడి ధృతరాష్ట్రుడు చనిపోయిన వారికై విలపించడం, అతికరుణంగా వీరపత్నులు విలపించడం, గాంధారీధృత రాష్ట్రుల క్రోధావేశమూ, ప్రమోహమూ..... అక్కడే చనిపోయిన కౌరవ వీరులనూ, కొడుకులనూ, తండ్రులనూ రణభూమిలో చూడటం.... పుత్రులూ, పౌత్రులూ చనిపోయి దుఃఖించే గాంధారికి కృష్ణుడు క్రోధం ఉపశమింపజేయడం. చనిపోయిన వారి శరీరాలకు శాస్త్రోక్తంగా ధృతరాష్ట్రుడు దహనక్రియలు చేయించడం. చనిపోయిన వారికి ఉదక ప్రదానాలు ..... అపుడు కుంతి తనకు రహస్యంగా పుట్టిన కర్ణుని జన్మను గురించి చెప్పడం..... ఇలా పదకొండవ పర్వం శోకానికీ వైక్లబ్యానికీ నిలయమైనది. ఇందులో ఇరువది ఏడు(27) అధ్యాయాలు, (775)ఏడువందల డెబ్బది అయిదు శ్లోకాలూ ఉన్నాయి.

తరువాత పన్నెండవ పర్వం **శాంతిపర్వం**. ఇది బుద్ధిని పెంచేది. ఇందులోనే ధర్మరాజు తండ్రులనూ, సోదరులనూ, పుత్రులనూ, బంధువులనూ మేనమామలనూ చంపుకొన్నానని నిర్వేదం పొందడమూ, శరతల్పం మీద నున్న భీష్ముని వల్ల ఎన్నో ధర్మాలు వినడమూ జరిగింది. మొదటివి రాజధర్మాలు. ఇవన్నీ రాజు లందరూ జ్ఞానం కావాలనుకొన్నవారూ తప్పక తెలుసుకోవలసినవి. తరువాతివి ఆపద్ధర్మాలు. ఆతరువాతివి మోక్షధర్మాలు. ఇవి చాలా విచిత్రాలూ, విస్తారాలు. ఇవి తెలిస్తే మానవునికి సర్వజ్ఞత్వం సిద్ధిస్తుంది. ఈ పన్నెండవ పర్వం ప్రాజ్ఞులకు ఇష్టమయినది. ఈ పర్వంలో 339(మూడువందల ముప్పది తొమ్మిది అధ్యాయాలూ), 14732(పదునాలుగువేల ఏడువందల ముప్పది రెండు) శ్లోకాలు ఉన్నాయి.

తరువాతిది **అనుశాసన పర్వం**. గంగా పుత్రుడైన భీష్ముని వల్ల కురురాజయిన ధర్మరాజు ఇందులోనే చాలా వేదధర్మాలు విని స్వస్థుడయ్యాడు. ఇక్కడే సర్వ ధర్మ వ్యవహారాలు, వివిధ దానాల ఫలితాలు వివరింపబడ్డాయి. ఇందులోనే పాత్రాపాత్రవిశేషాలు, దానాలు – వాని వైశిష్ట్యం, ఆచారవిధులు, సత్యము యొక్క వైశిష్ట్యం, గోదాన విశేషాలు, బ్రాహ్మణుల విశేషాలు, దేశకాల సమ్మితాలైన ధర్మరహస్యాలు – ఇలా బహు వృత్తాంతాలతో నిండినది ఈ అనుశాసన పర్వం. ఇందులోనే భీష్ముని స్వర్గ ప్రాప్తి కూడా చెప్పబడింది. ఈ పదమూడవ పర్వం ధర్మనిశ్చయం చేస్తుంది. ఇందులో నూట నలువది ఆరు(146) అధ్యాయాలున్నాయి. (8000)ఎనిమిది వేల శ్లోకాలున్నాయి.

తరువాత పదునాల్గవ పర్వం **ఆశ్వమేధిక పర్వం**. ఇందులోనే సంవర్త, మరుత్తరాట్టుల చరిత్ర చెప్పబడింది. ధర్మరాజు అశ్వమేధానికి సువర్ణరాసులు దొరకడం, పరీక్షిత్తుజననమూ చెప్పబడినవి. అశ్వత్థామ అస్త్రాగ్నితో మాడిపోకుండా పరీక్షిత్తును కృష్ణుడు రక్షించడం, అశ్వమేధ యాగంలో గుర్రాన్ని వదలడం, అర్జునుడు వెంట వెళ్లడం, అక్కడక్కడ రాజులతో అర్జునుని యుద్ధాలు, చిత్రాంగద పుత్రుడయిన బభ్రువాహనునితో యుద్ధం, నకులాఖ్యానం, ఇలా అశ్వమేధపర్వం మహాద్భుతమైనది. నూట మూడు(103) అధ్యాయాలూ,మూడు వేల మూడు వందల ఇరవై 3320 శ్లోకాలూ ఉన్నాయి. తరువాతి పదునైదవ పర్వం **ఆశ్రమవాస పర్వం**. ఇందులోనే ధృతరాష్ట్రుడు రాజ్యం వదలి గాంధారితో, విదురునితో ఆశ్రమవాసానికి వెళ్లిపోతాడు. కుంతికూడా గురుశుశ్రూషణ మీది ఆసక్తితో పుత్రుని, రాజ్యం వదలి ఆశ్రమవాసానికి వెళ్లింది. ఇందులోనే ఒక ఆశ్చర్యకర సన్నివేశం వ్యాసమహర్షి చూపించాడు. చనిపోయిన రాజులనూ, పుత్ర పౌత్రులనూ తీసికొని వచ్చి, ధృతరాష్ట్రునికి చూపించాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి పరమసిద్ధి పొందటం, విదురుడు, ధర్ముని ఆశ్రయించి సుగతికి వెళ్లడం, సంజయుడు కూడా వెళ్లిపోవడం ధర్మరాజు నారదుని చూడటం... ఇవన్నీ ఇందులోనే ఉన్నాయి. నారదుని వల్ల వృష్ణివంశస్థుల కలహం వినడం, ఇదంతా అద్భుతమయిన ఆశ్రమవాసపర్వం. ఇందులో 42(నలువది రెండు) అధ్యాయాలూ, 1506 (పదునైదు వందల ఆరు) శ్లోకాలూ ఉన్నాయి.

తరువాతిది దారుణమయిన **మౌసలపర్వం**. ఇందులోనే బ్రాహ్మణశాపంతో సముద్ర సమీపంలో యదువృష్ణి వంశస్థులంతా ఒకరినొకరు యుద్ధంలో చంపుకొన్నారు. దైవప్రేరణతో మధుపానస్థలంలో జమ్ముగడ్డి/ తెల్లుగడ్డి రూపమయిన వజ్రాయుధాలతో ఒకరినొకరు చంపుకొన్నారు. ఈ పర్వంలోనే బలరామకృష్ణులిద్దరూ కాలప్రాప్తమయిన వినాశాన్ని తప్పించుకోలేక పోయారు. కృష్ణుడు లేని ద్వారకకు వెళ్లి అర్జునుడు ఎంతో దుఃఖం

పొందాడు. పొనశాల వల్ల యదువీరులకు కలిగిన కష్టాన్ని చూసి వసుదేవుడికి అర్జునుడు అగ్ని సంస్కారాదులు చేశాడు. అలాగే కృష్ణబలరాముల శరీరాలకూ, వృష్ణివంశస్థుల శరీరాలకు ప్రాధాన్యాన్ని బట్టి సంస్కారం చేశాడు. అర్జునుడు ద్వారకలోని వృద్ధులనూ, బాలురనూ తీసికొని బయలుదేరి వస్తూ గాండీవం కూడా పనిచేయక పోవడం చూశాడు. దివ్యాస్త్రాలన్నీ పనిచేయక పోవడం, వృష్ణి వంశస్థుల భార్యల వినాశం, శక్తులన్నీ పోవడం, ఇవన్నీ చూసి అర్జునునికి నిర్వేదం కలిగి వ్యాసుని దర్శించాడు - ధర్మరాజును చేరి సన్యాసం స్వీకరించాలనుకొన్నాడు. ఇది పదునారవదయిన మౌసల పర్వం (8) ఎనిమిది అధ్యాయాలూ (330) మూడువందల ముప్పదిశ్లోకాలూ కలది.

తరువాతి పదునేడవ పర్వం **మహాప్రస్థానిక పర్వం.** ఈ పర్వంలోనే ద్రౌపదితో సహా పాండవులంతా రాజ్యం విడిచి మహాప్రస్థానం చేశారు. త్రోవలో అగ్నిహోత్రుని చూశారు. అగ్ని మాటతో అర్జునుడు గాండీవాన్ని పూజించి అగ్నిహోత్రునికి ఇచ్చివేశాడు - తమ్ముళ్లందరూ, ద్రౌపదీ పడిపోయారు. వారందరినీ విడిచి ధర్మరాజు వారిని చూడకుండానే వెళ్లిపోవడం ఈ పర్వంలోనే ఉన్నాయి. ఈ మహాప్రస్థానిక పర్వంలో మూడు (3) అధ్యాయాలూ మూడు వందల ఇరవై (320) శ్లోకాలూ ఉన్నాయి.

తరువాతిది **స్వర్గారోహణ పర్వం.** ఇది దివ్య వృత్తాంతాలతో అలౌకికమయినది. స్వర్గం నుండి వచ్చిన రథాన్ని ధర్మరాజు కుక్కమీది కరుణతో ఎక్కననడం - అపుడు శునక రూపం వదలి యమధర్మరాజు ప్రత్యక్ష మవడం, అతనితో స్వర్గం చేరడం, అక్కడి నరకయాతనలన్నీ దేవదూత వల్ల చూడడం, తమ్ముళ్ల కరుణ స్వోరకమయిన ఆరుపులు వినడం, వారంతా యముని ఆజ్ఞ వల్ల యాతనలు పొందడం, తరువాత ఇంద్రుడూ, యముడూ ధర్మరాజుకు తమ్ముళ్ల సద్గతి చూపించడం... ఇదంతా స్వర్గారోహణ పర్వం. ఆకాశగంగలో మునిగి, మనుష్య శరీరం విడిచి, తన ధర్మంతో ధర్మరాజు ఉచిత మయిన స్థానం పొందడం, యమధర్మరాజు, ఇంద్రుడు, దేవతలూ సంతోషించడం.. ఇలా పదునెనిమిదవ అధ్యాయం పూర్తవుతుంది. ఈ స్వర్గారోహణ పర్వంలో అయిదు (5) అధ్యాయాలూ, (209) రెండువందల తొమ్మిది శ్లోకాలూ ఉన్నాయి. ఇలా వ్యాసమహర్షి (18) పదునెనిమిది పర్వాలు చెప్పాడు. ఖిల పర్వాలని హరివంశానికి పేరు. దానిలో, హరివంశపర్వం, విష్ణుపర్వం, భవిష్యపర్వం అని మూడు ఉపపర్వాలు - ఇందులో 12000 పన్నెండు వేల శ్లోకాలున్నాయి. యుద్ధం చేసే కోరికతో 18 అక్షౌహిణులు వచ్చాయి. 18 రోజులు యుద్ధం జరిగింది. **అంగాలతో కలిపి నాలుగు వేదాలూ, ఉపనిషత్తులూ చదివిన విప్రు డయినా ఈ భారతం తెలియకపోతే అతడు విచక్షణుడు కాదు.**

అమితమయిన బుద్ధి వైభవం కల వ్యాసమహర్షి ఈ భారతాన్ని అర్థశాస్త్రం గాను, ధర్మశాస్త్రంగానూ, కామశాస్త్రంగానూ చెప్పాడు. **పుంస్కోకిల పాట విన్నాక కాకి కూతలు ఎవరూ విననట్లు ఈ కథ విన్నాక మరొకటి ఎవరూ వినటానికి ఇష్టపడరు.** పంచభూతాల వల్లనే లోకంలోని సంవిధానాలు ప్రవర్తిల్లినట్లు **ఈ ఇతిహాసం నుండే కవుల బుద్ధులన్నీ ఉద్భవిస్తాయి.** పదునెనిమిది పురాణాల విషయాలన్నీ ఈ ఇతిహాసంలో ఉన్నాయి, ఆకాశంలోనే నాలుగు రకాల ప్రాణులూ ఉన్నటు. (జరాయుజాలు, స్వేదజాలు, అండజాలు, ఉద్భిజ్జాలు అని ప్రాణులు నాల్గువిధాలు). ఇంద్రియా లన్నిటికీ చిత్రాలయిన మనఃక్రియలు ఆశ్రయాలయినట్లు. క్రియా, గుణాలన్నిటికీ ఈ భారతం ఆశ్రయం. **ఆహారం విడిచి శరీరాన్ని ధరించలేము. అలాగే ఈ భారతాన్ని ఆశ్రయించకుండా ఏ కథా భూమి మీద కనపడదు.*** ఉన్నతిని కోరే సేవకులు ఆభిజాత్యం కల మహారాజును కోరుకొన్నట్లు, **ఉత్తమ కవీశ్వరులంతా ఈ భారత కథను ఆధారంగా తీసుకొంటారు. ఈ కావ్యాన్ని మించి కవులెవరూ విశేషంగా /గొప్పగా చెప్పలేరు. ఆశ్రమాలు నాల్గింటిలోనూ గృహస్థాశ్రమం ఉత్తమ మయినట్లు ఈ భారతం సర్వోత్కృష్ట మయిన గ్రంథం.**

మహర్షులారా! భారత శ్రోతలారా! నిత్య ప్రయత్న పరులయిన మీకు **ధర్మం మీదనే బుద్ధి నిలవాలి. నిలుచుగాక! పరలోకానికి వెళ్లేవానికి అది ఒక్కటే బంధువు.** కాంతా కనకాలను నిపుణులు ఎంత సేవించినా అవి ఆప్తభావం పొందవు (ఆప్తులు కావు) - స్థిరం కావు. ఈ భారతం వ్యాసమహర్షి ముఖం నుండి ప్రవహించిన అమృతలహరి - సాటిలేనిది - పుణ్యప్రదమైనది - పవిత్రమైనది. పాపం హరిస్తుంది. శుభప్రదం - (పుణ్యార్థులు భారత శ్రవణమే చేయాలి అని భావం). ఇంద్రియలోలుడై చరించే విప్రుడు కూడా పగటి పూట చేసిన పాపాన్ని మహాభారతం చెప్పి, చదివి, సాయం సంధ్యా వందనంతో పోగొట్టుకొంటాడు. అలాగే మనోవాక్కాయాలతో రాత్రిచేసిన పాపం మహాభారతం పఠిస్తే ఉదయకాల సంధ్యావందన సమయానికే పోగొట్టుకొంటాడు. బంగారుకొమ్ములున్న వంద ఆవులను వేదం చదువుకొన్న చక్కని పండితునికి దానం చేస్తే వచ్చే పుణ్యమూ, భారతకథను నిత్యమూ విన్నవానికి వచ్చే పుణ్యమూ సమానమే. **విలువయిన బరువయిన భావాలు కల ఈ భారతేతిహాసం** ముందు ఈ పర్వసంగ్రహాధ్యాయం వింటే మానవులకు సుఖంగా అవగాహ

---

* అనాశ్రిత్యేతదాఖ్యానం కథా భువి న విద్యతే ।
ఆహారమనపాశ్రిత్య శరీరస్యేవ ధారణమ్ ॥ 388

మవుతుంది. విస్తీర్ణ మయిన సముద్రాన్ని చిన్న నావతో దాటినట్లు సుఖమైన అవగాహానికి తోడ్పడుతుంది.

3. సరమకథ - అయోదధౌమ్యుని శిష్యులు - ఉత్తంకచరిత్రము.

ఉగ్రశ్రవుడు (సూతుని కొడుకు) చెపుతున్నాడు. పరీక్షితుని కొడుకైన జనమేజయుడు తన తమ్ముళ్లతో కలిసి కురుక్షేత్రంలో దీర్ఘసత్రయాగం ఆరంభించాడు. శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు, అనే ముగ్గురు తమ్ముళ్లు అక్కడ ఉండగా దేవశుని సరమ యొక్క కొడుకు (పిల్ల) సారమేయం అక్కడికి వచ్చింది. జనమేజయుని తమ్ముళ్లు ఆ కుక్కను కొట్టారు. అది ఏడుస్తూ తల్లిదగ్గరకు వెళ్లింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న (కుక్కపిల్లను) కొడుకును చూచి తల్లి "ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరు నిన్ను కొట్టారు" అని అడిగింది. అలా అడిగిన తల్లికి "జనమేజయుని తమ్ముళ్ళు నన్ను కొట్టారు" అని చెప్పింది ఆ సారమేయం. దానికి తల్లి ఇలా అంది. "నాయనా! నీవు వారిపట్ల ఏదో అపరాధం చేసి ఉంటావు. అందుకే వారు నిన్ను కొట్టారు." అది మళ్లీ తల్లితో "నేనేమీ తప్పు చేయలేదు. అక్కడి హవిస్సును చూడనూ లేదు, నాకనూ లేదు" అంది. అది విని దాని తల్లి సరమ పుత్రదుఃఖంతో ఆర్తి చెంది, జనమేజయుడు దీర్ఘసత్ర యాగం చేసే చోటికి వచ్చింది. కోపంతో సరమ అతనితో " నా కొడుకు ఏ తప్పూ చేయలేదు. హవిస్సును చూడలేదు. నాకలేదు. ఎందుకు కొట్టారు ?" అని అడిగింది. వారు ఏమీ బదులు చెప్పలేదు. ఆమె వారితో "ఏ తప్పు చేయని నా కొడుకును కొట్టారు. కాబట్టి మీకు అనుకోని భయం కలుగుతుంది." అంది.

దేవశుని సరమ ఇలా అనగానే జనమేజయుడు భయభ్రాంతుడై చింతాక్రాంతు డయ్యాడు. ఆ దీర్ఘసత్రయాగం సమాప్తం అయ్యాక హస్తినాపురానికి వచ్చి జనమేజయుడు తన పాపకృత్యాన్ని శమింపచేయగల పురోహితుని కోసం తీవ్రమైన ప్రయత్నం చేశాడు. ఆ జనమేజయుడు ఒకసారి వేటకు వెళ్లి, తన దేశంలోని ఒకానొక ఆశ్రమాన్ని చూచాడు. అక్కడ శ్రుతశ్రవసుడనే ముని నివసిస్తున్నాడు. అతని కొడుకు సోమశ్రవసుడు. అతడు ఎల్లప్పుడూ తపస్సు చేసుకొంటూ ఉంటాడు. జనమేజయుడు ఆ శ్రుతశ్రవసుని వద్దకు వెళ్లి అతని కొడుకును పురోహితునిగా వరించాడు. రాజు అతనికి నమస్కరించి "మహాత్మా! ఈ నీ పుత్రుడు నాకు పురోహితుడు అగుగాక" అని పలికాడు. అలా అడిగిన జనమేజయునకు శ్రుతశ్రవసుడు "జనమేజయా! ఈ నా పుత్రుడు సర్పగర్భంనుండి పుట్టాడు. మహాతపస్వి. స్వాధ్యాయసంపన్నుడు. నా తపోబలంచేత పోషింపబడ్డాడు. నా వీర్యాన్ని తాగిన ఒక


A.C.No.96351

సర్పిణి యొక్క కుక్షినుండి ఉద్భవించాడు. పరమేశ్వరుడు చేసినది తప్పించి నీ యొక్క సమస్త పాపకృత్యాలను (శాపం వలన కలిగిన ఉపద్రవాలను) శాంతింపచేయడానికి ఇతడు సమర్థుడు. ఇతనికి ఒక గుప్తవ్రతం ఉంది. ఏ బ్రాహ్మణు డయినా ఇతనిని ఏదైనా అర్థాన్ని యాచించినట్లయితే దానిని అతనికి ఇచ్చివేస్తాడు. దీనిని నీవు సహించగలిగితే, అతని ఇష్టాన్ని తీర్చడానికి నీవు ఉత్సాహపడితే, అతనిని తీసుకుని వెళ్లు" అన్నాడు. ఇలా అన్న ఆ శ్రుతశ్రవసునితో "మహాత్మా! అలాగే జరుగుతుంది" అన్నాడు జనమేజయుడు. జనమేజయుడు ఆ మునికుమారుని సోమశ్రవసుని పురోహితునిగా పొంది తిరిగివచ్చి తన తమ్ములతో "ఇతనిని నేను పురోహితునిగా ఎన్నుకొన్నాను. ఇతడు ఏమి చెప్పినా మీరు ఇంకేమీ ఆలోచించకుండా దానిని చేయండి" అని చెప్పాడు. వారు అలాగే చేశారు. అతడు అలా తమ్ములకు చెప్పి తక్షశిలపైకి దండెత్తి వెళ్లాడు. దానిని స్వాధీనం చేసుకొన్నాడు.

ఈ రోజులలోనే ఆయోదధౌమ్యుడనే ఒక ఋషి ఉండేవాడు. అతనికి ఉపమన్యువు, ఆరుణి, వేదుడు అనే ముగ్గురు శిష్యులు ఉండేవారు. గురువు ఒకసారి పాంచాల దేశీయుడైన తన శిష్యుడు ఆరుణిని పొలానికి కంత కట్టమని పంపాడు. ఉపాధ్యాయుని ఆజ్ఞతో పాంచాలుడైన ఆరుణి అక్కడికి వెళ్లి, పొలానికి కంత కట్టడానికి ప్రయత్నించాడు గాని కట్టలేకపోయాడు. అలా ప్రయత్నిస్తున్న అతనికి ఒక ఉపాయం స్ఫురించి "సరే ఇలా చేస్తాను" అనుకొన్నాడు. అతడక్కడ పొలంలో కంతకు అడ్డంగా పడుకొన్నాడు. అప్పుడు నీరు నిలిచిపోయింది. ఇలా కొంతసమయం గడిచాక గురువైన ఆయోద ధౌమ్యుడు శిష్యులను "పాంచాలనివాసి యైన ఆరుణి ఎక్కడకు వెళ్లాడు ?" అని అడిగాడు. శిష్యులు "మహాత్మా! మీరేకదా పొలానికి కంత కట్టమని పంపారు" అని బదులిచ్చారు. "అయితే మనమందరం అతడు వెళ్లిన చోటికే వెడదాం" అన్నారు గురువుగారు శిష్యులతో. గురువు అక్కడికి వెళ్లి 'పాంచాలా ఆరుణీ! ఎక్కడున్నావు బిడ్డా! రా!' అని అతనిని ఎలుగెత్తి పిలిచాడు. ఆ ఆరుణి ఉపాధ్యాయుని మాట విని వెంటనే పొలంలో నుండి లేచి గురువు వద్దకు వచ్చి నిలిచాడు. "అయ్యా! నేనిక్కడున్నాను. పొలంనుండి ప్రవహించిపోతూ అడ్డుకట్టవేయడానికి వీలులేని ఆ నీటిప్రవాహాన్ని ఆపడానికి దానికి అడ్డంగా పడుకొన్నాను. మీ పిలుపు విని, వెంటనే ఆ మట్టినంతా తొలగించుకొని ఇటు మీవద్దకు వచ్చాను. మీ పాదాలకు ప్రణమిల్లుతున్నాను. నేను ఏమిపని చేయాలి. ఆజ్ఞాపించండి" అని వినయంగా అన్నాడు. ఆరుణి ఇలా అనగానే గురువు "నీవు మట్టిని పెకలించుకొని పైకి లేచావు కాబట్టి ఉద్దాలకుడనే పేరుతోనే నీవు ప్రసిద్ధికెక్కుతావు".

అని అనుగ్రహించాడు. "నీవు నా మాట పాటించావు. కాబట్టి శ్రేయస్సు పొందుతావు. సమస్తవేదాలు, సర్వధర్మశాస్త్రాలు స్వయంగా నీకు స్ఫురిస్తాయి" అని కూడా ఆశీర్వదించాడు. గురువుగారు ఇలా ఆశీర్వదించి పంపగా అతడు తనకు నచ్చిన చోటుకు వెళ్లాడు.

ఇక ఆ ఆయోదధౌమ్యుని యొక్క రెండవ శిష్యుడు ఉపమన్యువు అనే వాడున్నాడు. ఉపాధ్యాయుడు అతనిని "వత్సా! ఉపమన్యూ! గోవులు కాస్తూ ఉండు" అని పంపాడు. ఉపాధ్యాయుడు చెప్పినట్టుగా అతడు గోవులను కాస్తున్నాడు. పగలంతా ఆవులను కాసి, సాయంకాలం కాగానే ఇంటికి వచ్చి గురువు ఎదుట నిలిచి నమస్కరించాడు. లావుగా బొద్దుగా ఉన్న ఉపమన్యువును చూచి గురువు"వత్సా! ఉపమన్యూ! దేనిని తిని జీవిస్తున్నావు? ఇంత బలంగా, దృఢంగా ఉన్నావు" అని అడిగాడు. అతడు ఉపాధ్యాయునికి "అయ్యా! భిక్షావృత్తితో జీవిస్తున్నాను" అని సమాధానమిచ్చాడు. దానికి గురువు "నాకు నివేదించకుండా భిక్షాన్నం ఉపయోగించకూడదు" అని చెప్పాడు. 'సరే' అని చెప్పి ఉపమన్యువు భిక్ష తెచ్చి, గురువునకు నివేదించాడు. అతడు తెచ్చిన భిక్ష నంతా గురువే తీసేసుకోసాగాడు. 'సరే' అని చెప్పి అతడు తిరిగి గోవులను కాయసాగాడు. పగలంతా రక్షించి సాయంకాలం కాగానే గురుకులానికి వచ్చి గురువు ఎదుట నిలబడి నమస్కరించాడు. అయినా అతడు పుష్టిగా, లావుగా ఉండడం చూచిన గురువు "వత్సా! నీభిక్షాన్నం మొత్తం నేనే తీసేసుకొంటున్నాను కదా! నీవు దేనితో బ్రతుకుతున్నావు?" అని అడిగాడు. అలా అడిగిన గురువుకు ఉపమన్యుడు "మొదట తెచ్చిన భిక్షను తమరికి అర్పించి మళ్లీ రెండవసారి భిక్ష కోసం వెళ్తున్నాను. దానితో జీవితం కొనసాగిస్తున్నాను" అని సమాధానం చెప్పాడు.

అది విన్న గురువు "ఇలా చేయడం న్యాయమైనది, శ్రేష్ఠమైనది కాదు. ఎందుకంటే భిక్షావృత్తిమీదనే జీవించే ఇతరుల వృత్తికి అవరోధం కలిగించిన వాడవు అవుతున్నావు. కనుక ఇలా చేస్తున్న నీవు లుబ్ధుడవు కూడా అవుతావు." (రెండవసారి భిక్ష మెత్తడం తగదని భావం) అని చెప్పాడు. అతడు సరే అని గోవులను మేపసాగాడు. అలా వాటిని రక్షించి తిరిగి గురుకులానికి వచ్చి గురువు ఎదుట నిలిచి నమస్కరించాడు. అయినా అతడు లావుగానే ఉండడం చూసి గురువు మళ్లీ "వత్సా! ఉపమన్యూ! నేను నీ భిక్షాన్నం అంతా తీసుకొంటున్నాను. నీవు రెండవసారి ఎక్కడా తిరగడం లేదు. (భిక్ష మెత్తడం లేదు). అయినా లావుగానే ఉన్నావు. ఏ విధంగా మనుగడ సాగిస్తున్నావు?" అని అడిగాడు. అలా అడిగిన గురువుగారికి " అయ్యా! ఈ ఆవులపాలు తాగి బ్రతుకుతున్నాను" అని సమాధానమిచ్చాడు ఉపమన్యువు. దానికి గురువు "ఇది న్యాయం కాదు. పాలు ఉపయోగించడానికి నీకు నా అనుమతి లేదు". అన్నాడు. 'అలాగే' అని చెప్పి ఉపమన్యువు

గోవులను రక్షించి, తిరిగి ఉపాధ్యాయుని ఇంటికి వచ్చి, గురువు ఎదుట నిలిచి నమస్కరించాడు.

ఇంకా అతడు బలంగానే ఉండడం చూసిన గురువు "వత్సా! ఉపమన్యూ! భిక్షాన్నం తినడం లేదు. రెండవసారి భిక్షకు పోవడంలేదు. పాలు త్రాగడం లేదు. అయినా బలంగానే ఉన్నావు. ఇప్పుడిక ఏమి తిని జీవిస్తున్నావు" అని అడిగాడు. ఇలా అడిగిన గురువుకు "అయ్యా ! ఈ దూడలు తమ తల్లుల పొదుగుల నుండి పాలు త్రాగేటపుడు పై కెగసిన నురుగును త్రాగుతున్నాను." అని చెప్పాడు. అది విన్న గురువు " ఈ దూడలు చాలా మంచివి. నీ మీద జాలితో ఎక్కువగా నురగను ఎగజిమ్ముతూ ఉండవచ్చు. అలాచేస్తున్న నీవు ఈ దూడల జీవనవృత్తికి ఆటంకం కలిగిస్తున్నావు. కాబట్టి నురుగును కూడా నీవు త్రాగడానికి వీలులేదు" అన్నాడు. 'అలాగే' అని చెప్పి అతడు మామూలుగా గోవులను కాయడానికి వెళ్లిపోయాడు. అలా గురువు వద్దంటే ఉపమన్యుడు భిక్షాన్నం తినలేదు. రెండవసారి భిక్షకు పోలేదు. పాలు త్రాగలేదు. పాలనురుగు ఉపయోగించలేదు. ఒకనాడు అడవిలో తిరుగుతూ ఆకలి బాధకు తట్టుకోలేక జిల్లేడు ఆకులను తిన్నాడు. ఆ ఆకులు కారంగా, చేదుగా, వగరుగా, గరుకుగా ఉండి కడుపులో మంట కలిగిస్తాయి. అలాంటి ఆకులను తినడం చేత అతని కళ్లు దెబ్బతిని అంధుడయి పోయాడు. గ్రుడ్డివాడై తిరుగుతున్న అతడు ఒక నూతిలో పడిపోయాడు. అనంతరం సూర్యుడు అస్తాద్రికి ఏగినా అతడు రాకపోవడంచేత ఉపాధ్యాయుడు ఉపమన్యువు రాలేదే మని శిష్యులను అడిగాడు. వారు గోవులను కాయడానికి వనానికి వెళ్లాడని చెప్పారు. వారితో గురువు "నేను ఉపమన్యుని అన్నివిధాలా అడ్డుకొన్నాను. అతనికి తప్పకుండా కోపం వచ్చి ఉంటుంది. ఇంతవరకు రాలేదు. చాలాసేపయింది. కాబట్టి వెదకాలి." అని చెప్పి శిష్య సహితంగా అడవికి వెళ్లి అతనిని పిలవడానికి "ఓ ఉపమన్యూ! ఎక్కడున్నావు నీవు? రా నాయనా!" అని ఎలుగెత్తి అరిచాడు. అతడు గురువుగారి మాటలు విని "నేనిక్కడ కూపంలో పడిపోయాను" అని గట్టిగా బదులిచ్చాడు. గురువు అతనిని "కూపంలో ఎలా పడ్డావు?" అని అడిగాడు. "జిల్లేడు ఆకులను తిని గ్రుడ్డివాడి నయ్యాను. అందువల్ల కూపంలో పడ్డాన"ని అతడు గురువుకు సమాధానం ఇచ్చాడు.

గురువు "అశ్వినీదేవతలను స్తుతించు. వారు దేవవైద్యులు. నీకు చూపు కలిగిస్తారు" అని అతనికి చెప్పాడు. ఇలా చెప్పగానే ఉపమన్యువు ఆ ఇద్దరు అశ్వినీదేవతలను బుగ్వేదమంత్రాలతో స్తోత్రం చేయసాగాడు. "అశ్వినీ కుమారులారా! మీరిద్దరూ సృష్టికి పూర్వమే ఉన్నారు. పూర్వజులు, చిత్రభానులు మీరే. తపశ్శక్తి, వాగ్వైభవంతో మిమ్ములను స్తోత్రం చేస్తున్నాను. మీరు అనంతులు. దివ్యులు. మంచిరెక్కలు గల పక్షుల వంటివారు.

రజోగుణం, కోపం లేనివారు, విశ్వమంతటా ఆరోగ్యాన్ని విస్తరింప చేస్తారు. బంగారు రెక్కలుగల అందమైన రెండు పక్షులవలె మీ ఇద్దరు చాలా అందగాళ్లు. పారలౌకికమైన ఉన్నతిని పొందే సాధనాలు కలవారు. నాసత్య దస్రులనే పేర్లు కలవారు. అందమైన నాసికలు కలవారు. మీరు నిశ్చయంగా విజయాన్ని సాధించగలరు. సూర్యపుత్రు లైన మీరు స్వయంగా సూర్యుని రూపం ధరించి, రాత్రింబగళ్లు అనే కాలం యొక్క దారాలతో సంవత్సరం అనే వస్త్రాన్ని నేస్తున్నారు. ఆ వస్త్రం ద్వారా వేగంగా దేవయాన పితృయానాలు అనే మార్గాలను పొందిస్తున్నారు. పరమాత్మ యొక్క కాలశక్తి జీవరూపమైన పక్షిని తనకు ఆహారంగా చేసుకొంది. అశ్వినీకుమారులనే పేరుతో జీవన్ముక్తులై మహాపురుషులైన మీ ఇద్దరు జ్ఞానాన్ని ప్రసాదించి, కైవల్యరూపమైన మహాసౌభాగ్యం లభింపచేయడానికి జీవులను కాలమనే బంధాల నుండి విముక్తులను చేస్తున్నారు. మాయతో సహవాసం చేసే అజ్ఞానులైన జీవులు రాగాదివిషయాలతో నిండి ఉన్నంతవరకు తమ ఇంద్రియాలకు లొంగిపోయి తమను తాము శరీరాలకు బద్దులుగా భావిస్తూ ఉంటారు. రాత్రింబగళ్లు – కోరికలీడేర్చే మూడువందల అరవై పాలిచ్చే గోవులు. అవి అన్నీ కలిసి సంవత్సరం అనే ఒక దూడను కని దానిని పెంచి పోషిస్తున్నాయి. ఆ దూడ అన్నిటినీ సృష్టిస్తుంది. సంహరిస్తుంది. జిజ్ఞాసువులు పైన చెప్పిన దూడను నిమిత్తమాత్రంగా చేసుకొని ఆ గోవులనుండి విభిన్న ఫలాలనిచ్చే శాస్త్రవిహితమైన కర్మలను పిదుకుతూ ఉంటారు. ఆ కర్మలన్నిటిలో (తత్త్వజ్ఞానేచ్ఛ) ఒక్కటే పిదుకతగినది. పైన చెప్పిన ఆ గోవులను మీ అశ్వినీకుమారులు ఇద్దరే పిదుకుతున్నారు. అశ్వినీదేవతలారా! ఈ కాలచక్రానికి సంవత్సరం అనేది ఒక్కటేనాభి. దానిమీద రాత్రిపగలు కలిసి ఏడువందల ఇరవై ఆకులు ఏర్పడి ఉన్నాయి. అవన్నీ పన్నెండు మాసాలనే చుట్టుచక్రంతో కలపబడి ఉన్నాయి. ఈ శాశ్వతమైన, మాయామయమైన కాలచక్రం నేమి లేకుండానే అనియత గమనంతో తిరుగుతూ ఇహ పరలోకాలలోని ప్రజలను నశింపచేస్తూ ఉంటుంది. మేషాది పన్నెండు రాసులు పన్నెండు ఆకులుగా, ఆరు ఋతువులు ఆరు నాభులుగా, సంవత్సరం ఇరుసుగా ఉన్న ఈ ఒకే ఒక కాలచక్రం అన్నివైపులకు తిరుగుతూ ఉంటుంది. కర్మఫలాన్ని ధరించడానికి ఇదే ఆధారం. ఇందులోనే సంపూర్ణమైన కాలాన్ని అభిమానించే దేవతలందరూ ఉంటారు. నేను పుట్టుక మొదలైన దుఃఖాలతో మిక్కిలి బాధపడుతున్నాను. కనుక మీరిద్దరూ నన్ను ఈ కాలచక్రం బారినుండి విముక్తుని చేయండి. మీరిద్దరూ సదాచార సంపన్నులు. మీరు మీకీర్తితో చంద్రుని,అమృతాన్ని, జలప్రకాశాన్ని కూడా తిరస్కరిస్తున్నారు. ఈ సమయంలో మీరు మేరుపర్వతాన్ని విడిచి, భూమిమీద అనందంగా విహరిస్తున్నారు. ఆనంద బలాలను వర్షంగా కురిపించడానికే మీసోదరులిద్దరూ దినమంతా

ప్రయాణిస్తూ ఉంటారు. అశ్వినీకుమారులారా! మీరిద్దరూ సృష్టి ప్రారంభ కాలంలో తూర్పు మొదలైన దశదిశలను వెల్లడి చేస్తూ, వాటి గురించిన జ్ఞానాన్ని కలిగించారు. ఆ దిక్కుల శిరసుపై ఉండే అంతరిక్షలోకంలో రథం మీద తిరుగుతూ అన్నిటికీ సమానంగా ప్రకాశాన్ని అందించే సూర్యదేవుని గురించి, ఆకాశాది పంచభూతాలను గురించి కూడా మీరే జ్ఞానాన్ని కలిగించారు. ఆయా దిక్కులలో సూర్యగమనాన్ని చూచి ఋషులు కూడా దానిని అనుసరిస్తున్నారు. దేవతలు, మనుష్యులు (తమ అధికారానుసారం) స్వర్గమర్త్యలోకాల యొక్క భూమికను ఉపయోగిస్తున్నారు.

అశ్వినీదేవతలారా! మీరు ఈ సమస్తవిశ్వాన్ని పోషించడం కోసం ఎన్నోరంగుల వస్తువులను మిళితం చేసి అన్నిరకాల ఔషధాలను తయారుచేస్తున్నారు. ఆ మెరిసే ఓషధులన్నీ ఎల్లప్పుడూ మిమ్మల్నే అనుసరిస్తూ మీతో పాటు తిరుగుతూ ఉంటాయి. దేవతలు, మనుష్యులు తమ తమ అర్హతలను బట్టి స్వర్గమర్త్యలోకాలలో ఉంటూ ఆ ఓషధులను సేవిస్తూ ఉంటారు. మీ ఇద్దరూ 'నాసత్య' నామంతో ప్రసిద్ధులు. నేను మిమ్మల్నీ, మీరు ధరించిన కమలహారాన్నీ పూజిస్తున్నాను. మీరు అమరులై సత్యాన్ని పోషిస్తూ విస్తరింపచేస్తున్నారు. మీ సహాయం లేనిదే దేవతలు కూడా ఆ సనాతన సత్యాన్ని పొందజాలరు. యౌవనంలో ఉన్న తల్లిదండ్రులు సంతానోత్పత్తి కోసం ముందుగా నోటితో అన్నరూపమైన గర్భాన్ని ధరిస్తున్నారు. తరువాత అన్నమే పురుషులలో వీర్యరూపంగా, స్త్రీలలో రజోరూపంగా మార్పుచెంది, జడశరీరం తయారవుతోంది. అనంతరం జన్మించబోయే గర్భస్థ శిశువు పుడుతూనే తల్లిస్తన్యాన్ని త్రాగుతున్నాడు. పైచెప్పినరీతిగా సంసారబంధాలలో చిక్కుకుపోయిన జీవులను తాము తత్త్వజ్ఞానం ఉపదేశించి ముక్తులను చేస్తున్నారు. నా బ్రతుకుతెరువు కోసం నా నేత్రేంద్రియాన్ని కూడా రోగముక్తం కావించండి. నేను మీగుణాలను కొనియాడుతూ, మీ ఇద్దరినీ స్తుతించలేను. నేనిప్పుడు గ్రుడ్డివాడిని. దారిని కూడా సరిగా గుర్తించలేక ప్రమాదపడ్డాను. కనుకనే దుర్గమమైన కూపంలో పడిపోయాను. మీరు శరణాగతవత్సలులు. కాబట్టి మిమ్ము శరణు వేడుకొంటున్నాను."

అని ఈ రీతిగా ఉపమన్యువు స్తోత్రం చేయగానే అశ్వినీకుమారులిద్దరూ వచ్చి "ఉపమన్యూ! మేము ప్రీతులమైనాము. ఇదిగో నీవు ఈ అప్పం తీసుకో. దీనిని తిను." అన్నారు. వారు ఇలా అనగానే ఉపమన్యువు "మీ దేవతలు ఎన్నడూ అసత్యమాడరు. కాని నేను గురువుకు నివేదించకుండా ఈ అప్పాన్ని ఉపయోగించడానికి ఇష్టపడను." అన్నాడు. అప్పుడు ఆ ఆశ్వినులిద్దరూ "నాయనా! ఇంతకు ముందు మీ గురువు కూడా ఇలాగే మమ్మల్ని స్తోత్రం చేశాడు. అప్పుడు మేము ఇచ్చిన అప్పాన్ని అతడు తన

గురువుకు నివేదించకుండానే ఉపయోగించాడు. మీ గురువు చేసినట్లే నీవుకూడా చేయి" అన్నారు. వారు ఇలా అనగా ఉపమన్యువు " ఈ విషయమై నేను మీ అశ్వినులిద్దరినీ అనునయించి అర్థిస్తున్నాను. గురువుకు నివేదించకుండా నేను ఈ అప్పాన్ని వినియోగించను" అన్నాడు. బదులుగా అశ్వినులు - "నీ ఈ గురుభక్తికి చాలా సంతోషించాం. నీ గురువు దంతాలు నల్లగా ఇనుములా ఉన్నాయి. నీ దంతాలు మాత్రం బంగారంలా ఉంటాయి. నీకు కన్నులు బాగవుతాయి. శ్రేయస్సు కూడా పొందుతావు" అని అన్నారు. అశ్వినీకుమారులు ఇలా అనగానే ఉపమన్యువుకు కన్నులు రెండూ కనపడసాగాయి. అతడు గురువు దగ్గరకు వచ్చి నమస్కరించాడు. గురువుగారికి విషయమంతా చెప్పాడు. అతడు కూడా చాలా సంతోషించాడు. ఉపమన్యువుతో ఇలా అన్నాడు. "అశ్వినీకుమారులు చెప్పినట్లుగా నీకు సకలశుభాలూ కలుగుతాయి. నీకు సర్వవేదాలు, సమస్త ధర్మశాస్త్రాలు స్వయంగా స్ఫురిస్తాయి".

ఆ ఆయోదధౌమ్యునికి ఇంకొక శిష్యుడు వేదు డనేవాడు. గురువు అతనిని "వత్సా! వేదుడా! నీవు కొంతకాలం నా ఇంట్లో ఉండు. సేవ చేస్తూ ఉండు. నీకు మేలు కలుగుతుంది" అని ఆదేశించాడు. అతడు 'అలాగే' అని గురుకులంలో చాలా కాలంపాటు గురుశుశ్రూషను చాలా శ్రద్ధగా చేస్తూ ఉన్నాడు. గురువు అతనిని ఎద్దువలె మిక్కిలి బరువులను మోయడానికి నియోగించేవాడు. వేదుడు శీతోష్ణాలను, ఆకలి దప్పులను సహిస్తూ, అన్ని వేళలా గురువుకు అనుకూలుడై గడుపుతూ ఉన్నాడు. ఇలా చాలా కాలం గడిచాక గురువు సంతోషించాడు. గురువుగారిని సంతోషపెట్టడంవలన వేదునికి శ్రేయస్సు, సర్వజ్ఞత్వమూ కలిగాయి. అతడు గురువు అనుమతితో సమావర్తన సంస్కారం పొంది, స్నాతకుడై గురుకుల వాసాన్నుండి గృహస్థాశ్రమం ప్రవేశించాడు. అతనికి తన ఇంటిలో ముగ్గురు శిష్యులున్నారు. వారికి గురుశుశ్రూష చేయమని కాని, ఏపని గాని చెప్పేవాడు కాదు. గురుకులవాసంలోని దుఃఖం తెలిసిన వాడు కాబట్టి శిష్యులకు ఆ కష్టం కలిగించదలచుకోలేదు.

ఇలా ఉండగా కొంతకాలానికి జనమేజయుడు, పౌష్యుడు అనే రాజులిద్దరు వచ్చి, బ్రహ్మవేత్త అయిన వేదుని తమ పురోహితునిగా వరించారు. వేదుడు ఒకనాడు యజమానకార్యం గురించి వెడుతూ ఉత్తంకుడనే శిష్యుని అగ్నికార్యం చేయమని నియోగించాడు. "నాయనా! ఉత్తంకా! నా ఇంటిలో ఏలోటు కలిగినా నీవు దానిని పూరించు" అని ఉత్తంకుని ఆజ్ఞాపించి, వేదుడు ఇతరప్రాంతానికి వెళ్లాడు. పిమ్మట ఉత్తంకుడు శుశ్రూష చేస్తూ గురువుగారి ఆజ్ఞను పాటిస్తూ గురుకులంలో ఉంటున్నాడు. అలా ఉన్న అతనిని ఉపాధ్యాయుని ఇంటిలోని స్త్రీలందరూ కలిసి, పిలిచి, ఇలా చెప్పారు. "మీగురుపత్ని

ఋతుమతి అయింది. గురువు పరదేశంలో ఉన్నాడు. ఈమె ఋతుకాలం వ్యర్థం కాకుండా ఉండేలా చేయి. ఈ విషయమై గురుపత్ని చాలా విచారిస్తోంది". ఇలా చెప్పిన ఆ స్త్రీలకు ఉత్తంకుడు "ఆడువారి మాటలు పట్టుకొని ఈ అకార్యాన్ని నేను చేయలేను. అకార్యం చేయాలని నా గురువు నాకు చెప్పలేదు" అని బదులిచ్చాడు. కొంతకాలం గడిచాక అతని గురువు పరదేశం నుండి ఇంటికి తిరిగివచ్చాడు. అతడు శిష్యుని యొక్క వృత్తాంతాన్ని అంతటిని తెలుసుకొని సంతోషించాడు. అతనితో "నాయనా! ఉత్తంకా! నీకు ఏ ఇష్టం చేయగలను? నీవు ధర్మబద్ధంగా సేవించావు నన్ను. అందువలన మనమధ్య పరస్పరం ప్రేమ పెరిగింది. నీకు ఇంటికి వెళ్లడానికి అనుమతిని ఇస్తున్నాను. నీ కోరికలన్నీ తీరుతాయి. వెళ్లు" అన్నాడు గురువు.

ఇలా అన్న గురువుతో శిష్యుడు "మీకేమి ప్రియం చేయగలను? పెద్దలు చెపుతూ ఉంటారు.--- అధర్మ పూర్వకంగా చెప్పినవాడు, అధర్మపూర్వకంగా అడిగినవాడు వీరిరువురిలో ఒకడు (గురువు లేదా శిష్యుడు) మరణం పొందుతాడు, విద్వేషాన్ని కూడా పొందుతాడు. కాబట్టి మీరు అనుమతిస్తే నేను మీ అభీష్టాన్ని గురుదక్షిణరూపంలో కానుకగా ఇవ్వాలనుకొంటున్నాను"- అన్నాడు. అంతట గురువు "వత్సా! ఉత్తంక! అయితే కొన్ని రోజులు ఉండు" అన్నాడు. ఒక రోజున ఉత్తంకుడు ఉపాధ్యాయుని "అయ్యా! మీకు ఇష్టమైన దేనిని గురుదక్షిణ రూపంలో కానుకగా ఇవ్వగలను ?" అని మళ్లీ అడిగాడు. అప్పుడు గురువు "నాయనా! ఉత్తంకా! నీవు మాటిమాటికి గురుదక్షిణగా కానుకను తెచ్చి ఇస్తానంటున్నావు. అయితే ఇంట్లోకి వెళ్లి మీ గురుపత్నిని "ఏమి కానుక ఇమ్మంటా"రని అడుగు. ఆమె ఏమి చెపుతుందో అది తెచ్చి ఇమ్ము" అన్నాడు. అతడు ఇలా అనగానే ఉత్తంకుడు గురుపత్ని వద్దకు వచ్చి "పూజ్యురాలా! గురువుగారు నన్ను ఇంటికి వెళ్లమని అనుమతించారు. మీకు ఇష్టమైనది గురుదక్షిణగా సమర్పించి ఋణవిముక్తుడనై ఇంటికి వెళ్లాలనుకొంటున్నాను. కాబట్టి గురుదక్షిణగా మీకు ఏ కానుకను తేవాలో ఆజ్ఞాపించండి"అని అడిగాడు. ఉత్తంకుడు ఇలా అడిగినవెంటనే గురుపత్ని అతనితో "పౌష్యమహారాజు వద్దకు వెళ్లి, అతని భార్య ధరించే కుండలాలను అడుగు. వాటిని తీసుకురా. ఈ రోజుకి నాలుగోరోజున పుణ్యక వ్రతం జరుగుతుంది. వాటిని ధరించి అలంకరించుకొని బ్రాహ్మణులకు భోజనం వడ్డించాలనుకొంటున్నాను. కాబట్టి వాటిని సంపాదించు. అలా చేస్తే నీకు మేలు జరుగుతుంది. లేకుంటే మేలెక్కడిది?" అన్నది. గురుపత్ని ఇలా చెప్పగా ఉత్తంకుడు బయలుదేరాడు. అతడు మార్గమధ్యంలో పెద్ద ఆకారం గల ఎద్దును, దానిని ఎక్కిన మహాకాయుడైన పురుషునీ చూశాడు. ఆ పురుషుడు ఉత్తంకునితో ఇలా అన్నాడు.

"ఉత్తంకా! ఈ వృషభ గోమయాన్ని భక్షించు"అని. అతడు చెప్పినదానికి ఉత్తంకుడు ఇష్టపడలేదు. ఆ పురుషుడు మళ్లీ ఉత్తంకునితో "ఉత్తంకా! తిను. ఏమీ ఆలోచించకు, పూర్వం మీ గురువు కూడా తిన్నాడు" అన్నాడు. అతడు చెప్పగానే 'మంచిది' అని ఉత్తంకుడు అపుడు ఆ వృషభం యొక్క మూత్రపురీషాలను భక్షించి, తొందరలో ఉండడంచేత నిలుచునే ఆచమనం చేసి బయలుదేరాడు.

ఉత్తంకుడు పౌష్యమహారాజు ఉండే చోటికి వెళ్లి ఆసీనుడై ఉన్న అతనిని సమీపించి ఆశీఃపూర్వకంగా అభినందించి ఇలా అన్నాడు. "యాచకుడినై మీ వద్దకు వచ్చాను" అని. అంతట అతడు ఉత్తంకునికి నమస్కరించి "పూజ్యుడా! నేను పౌష్యుడిని. మీకు ఏమి చేయగలను?" అని అడిగాడు. ఉత్తంకుడు పౌష్యునితో "గురుదక్షిణకోసం కుండలాలను కోరి ఇక్కడికి వచ్చాను. మీ భార్య ధరించిన ఆ రెండు కుండలాలను ఇవ్వడానికి నీవు తగుదువు" అన్నాడు. దానికి సమాధానంగా పౌష్యుడు "అంతఃపురానికి వెళ్లి, రాణిని అడుగు" అన్నాడు. అతడు చెప్పినరీతిగా ఉత్తంకుడు అంతఃపురంలో ప్రవేశించాడు. కాని రాణి కనపడలేదు. అతడు మళ్లీ రాజు వద్దకు వచ్చి "నీవు నాతో అబద్ధమాడడం యుక్తంగా లేదు. నీ అంతఃపురంలో రాణి లేదు. నాకు ఆమె కనపడలేదు" అన్నాడు. ఉత్తంకు డిలా అనగానే పౌష్యుడు క్షణకాలం ఆలోచించి అతనితో "నీవు తప్పకుండా ఎంగిలిముఖంతో ఉండి ఉంటావు. గుర్తు తెచ్చుకో. ఆమె పతివ్రత కాబట్టి ఉచ్ఛిష్టంతో (ఎంగిలితో) అపవిత్రులైన వారు ఆమెను చూడలేరు. అపవిత్రులకు ఆమె కనబడదు" అన్నాడు. రాజు ఇలా అనగానే ఉత్తంకుడు జ్ఞాపకం తెచ్చుకొని "అవును నేను నిలబడి నడుస్తూ ఆచమనం చేశాను" అన్నాడు. అప్పుడు పౌష్యుడు " ఇదే నీవు చేసిన శాస్త్రవిరుద్ధమైన పని. నిలబడి తొందరతొందరగా నడుస్తూ చేసిన ఆచమనం చేయనట్లే" అన్నాడు. అపుడు ఉత్తంకుడు సరే! అని కాళ్లు చేతులు ముఖం బాగా కడుగుకొని తూర్పువైపు తిరిగి కూర్చుని శబ్దం చేయని, నురుగు లేని, చల్లని, హృదయం వరకు చేరడానికి యోగ్యమైన నీటిని మూడు మార్లు ఆచమనం చేసి, రెండుమార్లు వ్రేళ్లకొనలతో ముఖాన్ని తుడుచుకొని, నీటిలో ముంచిన వేళ్లతో కన్నులు, ముక్కు మొదలైన ఇంద్రియాలను స్పృశించి, అంతఃపురానికి వెళ్లాడు. అప్పుడతనికి రాణి కనపడింది. ఆమె ఉత్తంకుని చూచి ఎదురువచ్చి నమస్కరించి "పూజ్యా! మీకు స్వాగతం. మీకు నేనేమి చేయగలను ? ఆజ్ఞాపించండి" అని పలికింది.

ఉత్తంకుడు ఆమెతో "తల్లీ! గురుదక్షిణ కోసం నీ కుండలాలను అడుగుతున్నాను. ఇవ్వగలవు" అన్నాడు. అతని సద్భావానికి (గురుభక్తికి) ఆమె సంతుష్టురాలయింది.

"ఇతడు అర్హుడైన బ్రాహ్మణుడు. ఇవ్వకుండా ఉండకూడదు" అని తలచింది. ఆ కుండలాలను తీసి అతనికి ఇచ్చి "నాగరాజు తక్షకుడు వీటికోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అప్రమత్తుడవై తీసికొని వెళ్లు" అని చెప్పింది. ఈ విధంగా చెప్పిన రాణితో ఉత్తంకుడు "అమ్మా! నీవు నిశ్చింతగా ఉండు. నన్ను తక్షకుడు గెలవలేడు" అన్నాడు. అని చెప్పి అతడు రాణిని వీడ్కొని పౌష్యుని వద్దకు వచ్చాడు. "పౌష్యమహారాజా! చాలా సంతోషించాను" అని చెప్పాడు. అతనితో పౌష్యుడు ఇలా అన్నాడు. "పూజ్యుడా! చాలాకాలానికి యోగ్యుడు దొరికాడు. మీరు గుణవంతులైన అతిథులు. కాబట్టి శ్రాద్ధకర్మ చేయాలనుకొంటున్నాను. ఆహ్వానాన్ని మీరు అంగీకరించండి." ఉత్తంకుడు "నేను ఆహ్వానాన్ని అంగీకరించాను. కాని శీఘ్రంగా జరగాలని కోరుకొంటున్నాను. మీవద్ద సిద్ధంగా ఉన్న, సుసంస్కృతమైన, పరిశుద్ధమైన అన్నాన్ని వడ్డించండి." అన్నాడు. రాజు అలాగే అని సిద్ధంగా ఉన్న అన్నంతోనే అతనికి భోజనం వడ్డించాడు. ఉత్తంకుడు అన్నం కేశదుష్టమై చల్లగా ఉండడం చూసి ఇది అపరిశుద్ధమని తలచి ఆ పౌష్యుని ఉద్దేశించి "నాకు అశుచి అయిన అన్నం పెట్టావు కనుక అంధుడివి అవుతావు" అన్నాడు.

దానికి బదులుగా పౌష్యుడు కూడా "నీవు శుద్ధమయిన అన్నాన్ని కూడా దూషిస్తున్నావు. కనుక అనపత్యుడ వవుతావు" అని శపించాడు. అప్పుడు ఉత్తంకుడు రాజుతో ఇలా అన్నాడు. "మీరు అపవిత్రమైన అన్నంపెట్టి, పైగా ప్రతిశాపం ఇవ్వడం ఉచితంగా లేదు. అందుచేత ముందు అన్నాన్ని పరీక్షించండి" అన్నాడు. వెంటనే పౌష్యుడు ఆ అన్నం చూస్తే అది అపవిత్రమైనదిగా తెలుసుకొని దానికి కారణాన్ని ఆరా తీశాడు. ఆ అన్నాన్ని జుట్టు విరబోసుకున్న స్త్రీ తయారుచేసిందని, అప్పటికే చాలాసేపు కావడం వలన చల్లారిపోయిందనీ తెలుసుకొన్నాడు. అందుకని అది తలవెంట్రుకతో కూడి అశుచి అయిందని తలచి ఆ ఉత్తంకమహర్షిని ఇలా ప్రార్థించాడు. "మహాత్మా! కేశదుష్టమయిన చల్లనైన అన్నం తెలియకుండానే మీకు వడ్డించాను. తమరు క్షమించండి, నేను గ్రుడ్డివాడిని కాలేను." అన్నాడు. అతనికి ఉత్తంకుడు ఇలా ప్రతి సమాధానమిచ్చాడు. "రాజా! నేను అసత్యమాడను. నీవు అంధుడవై అచిరకాలంలోనే శాపవిముక్తుడవు అవుతావు. నీవు నాకు ఇచ్చిన శాపం కూడా అలాగే జరుగకుండేటట్లు చెయ్యి" అన్నాడు. అతనికి పౌష్యుడు ఇలా సమాధానమిచ్చాడు - "శాపం మరల్చడానికి నేను అశక్తుడను. నా కోపం ఇంకా చల్లారలేదు. అయినా మీకు ఈ విషయం తెలియనిదా? బ్రాహ్మణుని మనసు వెన్న (వెంటనే కరిగిపోతుంది). వాక్కు మాత్రం పదునైన అంచుగల కత్తి. కాని ఈ రెండూ క్షత్రియుని యందు వ్యతిరేకం. వాక్కు నవనీతం. హృదయం పదును. ఇలాంటి స్థితిలో

తీక్ష్ణహృదయం కలిగి ఉండడం వలన ఆ శాపాన్ని మరొకలా మార్చడానికి నేను అశక్తుడను. వెళ్లిరా ! ఇలా అనగానే ఉత్తంకుడు "అన్నం అశుచిగా ఉందని చూచిన నీవు నన్ను బ్రతిమాలావు. కాని అంతకుముందే నీవు అన్నావు. "దుష్టం కాని అన్నాన్ని దూషించావు కాబట్టి అనపత్యుడవు అవుతావు" అని, అన్నం దుష్టమే కాబట్టి ఈ శాపం నాకు తగులదు. ఇక మేము వెళ్తున్నాం" అని చెప్పి ఉత్తంకుడు ఆ రెండు కుండలాలను తీసుకుని బయలుదేరాడు. దారిలో ఒక నగ్నక్షపణకుడు (దిగంబరుడైన భిక్షువు) ఒకసారి కనపడుతూ, ఒకసారి కనపడకుండా మాటిమాటికి తన్ను వెన్నంటి రావడం ఉత్తంకుడు గమనించాడు. ఇలా కొంత దూరం వెళ్లాక ఉత్తంకుడు ఉదకకృత్యాలు (స్నానసంధ్యా వందనాదులు) నిర్వర్తించడానికి ఆ కుండలాలను నేలపై పెట్టి వెళ్లి వాటిని చేసుకోసాగాడు. ఈ లోగా ఆ క్షపణకుడు త్వరగా సమీపించి ఆ కుండలాలను తీసుకొని పారిపోయాడు. ఉత్తంకుడు నీటిని సమీపించి అర్ఘ్య ప్రదానం నిర్వర్తించి శుచియై, నియతితో దేవతలకు, గురువులకు నమస్సులు అర్పించి మిక్కిలి వేగంతో అతనిని వెంబడించాడు. వెంబడించిన అతనికి తక్షకుడు అతిసమీపానికి వచ్చాడు. అతడు అతనిని పట్టుకొన్నాడు. పట్టుకొన్నవెంటనే అతడు ఆ రూపాన్ని విడిచి, తక్షకరూపాన్ని ధరించి వెంటనే నేలమీద కనిపిస్తున్న ఒక పెద్ద కన్నంలో దూరిపోయాడు. తక్షకుడు నాగలోకానికి చేరుకొని తనమందిరానికి వెళ్లిపోయాడు. అంతట ఉత్తంకుడు ఆ రాణి మాటలు గుర్తుకుతెచ్చుకొని, ఆ తక్షకుని అనుసరించాడు. అతడు ఆ బిలాన్ని ఒక కట్టెతో త్రవ్వాడు గాని ఫలితం లేకపోయింది. అలా కష్టపడుతున్న అతనిని ఇంద్రుడు చూచాడు. తన వజ్రాయుధాన్ని పంపించాడు. ఇంద్రుడు వజ్రాయుధంతో "వెళ్లు. ఆ బ్రాహ్మణునికి సహాయం చేయి" అన్నాడు. వజ్రం కట్టెలో ప్రవేశించి ఆ బిలాన్ని త్రవ్వేసింది. ఆ బిలంలోనికి ఉత్తంకుడు ప్రవేశించాడు. అలా బిలం ద్వారా లోనికి ప్రవేశించిన అతడు నాగలోకాన్ని చూశాడు. అది ఎల్లలు లేనిది. అనేక రకాలైన ప్రాసాదాలతో, భవనాలతో, ముంజూరులు కల పెద్ద పెద్ద మండపాలతో, వందలకొద్దీ ద్వారబంధాలతో సంకులమై ఉన్నది. ఆశ్చర్యకరమైన చిన్న, పెద్ద క్రీడాస్థానాలతో వ్యాపించి ఉన్నది. అతడక్కడ ఆ నాగు లందరినీ ఈ శ్లోకాలతో స్తోత్రం చేశాడు.

'ఐరావతం మొదలైనవి రాజులుగా ఉన్నవి, యుద్ధాలలో రాణించేవి, మెరుపుచేత వాయువు చేత ప్రేరేపించబడి, వర్షించే నల్లని మేఘాలవలె సంచరించేవి అయిన సర్పాలు అందమైన ఆకృతులు కలవి. అనేక రూపాలు ధరింపగలిగినవి. చిత్రవర్ణాల కుండలాలు కలిగినవి. ఆ ఐరావత వంశం నుండి ఉద్భవించిన నాగులు ఆకాశంలో ఆదిత్యునివలె ప్రకాశిస్తున్నాయి. గంగాతీరానికి ఉత్తరంగా అనేకమైన నాగనివాసాలు ఉన్నాయి. అక్కడ

నివసించే గొప్ప గొప్ప నాగులను కూడా నేను స్తోత్రం చేస్తున్నాను. ఐరావతం తప్ప సూర్యుని కిరణసైన్యంలో విహరించా లని కోరుకొనేవారు వేరెవరు ? ఐరావతనాగుని సోదరుడు ధృతరాష్ట్రుడు సూర్యునితో కలిసి వెళ్లేటపుడు ఇరవై ఎనిమిది వేల ఎనిమిది సర్పాలు సూర్యుని గుర్రాలకు కళ్లెములుగా అమరి ఉంటాయి. వారితో కలిసి, దూరమార్గాలకు వెళ్లే ఐరావతం యొక్క సోదరులకు నేను నమస్కరిస్తున్నాను. పూర్వం కురుక్షేత్రంలోను, ఖాండవంలోను ఉండే నాగరాజు తక్షకుని కుండలాల కొఱకు స్తుతిస్తున్నాను. తక్షకుడు, అశ్వసేనుడు నిత్యం సహచరులు. ఈ ఇద్దరూ కురుక్షేత్రంలో ఇక్షుమతీనదీ తీరంలో నివసిస్తూ ఉండేవారు. తక్షకుని చిన్న తమ్ముడు శ్రుతసేనుడనే వాడు పాతాళలోకంలో నాగరాజు పదవి పొందేందుకు సూర్యదేవుని ఉపాసిస్తూ కురుక్షేత్రంలో నివసిస్తూ ఉన్నాడు. ఆ మహాత్ములు అందరికీ నేను సదా నమస్కరిస్తున్నాను.' ఈ రీతిగా నాగముఖ్యులను స్తుతించి కూడా బ్రహ్మర్షి అయిన ఉత్తంకుడు కుండలాలను పొందలేకపోయాడు. అతనికి మిక్కిలి చింత కలిగింది.

నాగులను ఈ రీతిగా స్తోత్రం చేస్తున్నప్పటికీ ఆ రెండు కుండలాలను పొందలేక పోయిన సమయంలో ఉత్తంకుడు మగ్గంమీద పడుగునూలు ఎక్కించి బట్టనేస్తున్న ఇద్దరు స్త్రీలను చూచాడు. ఆ పడుగునూలులో తెలుపు, నలుపు పోగులున్నాయి. పన్నెండాకులు గల ఒక చక్రాన్ని కూడా చూశాడు. ఆ చక్రాన్ని ఆరుగురు కుమారులు త్రిప్పుతున్నారు. ఒక మహాపురుషుని, అందమైన ఒక గుఱ్ఱాన్ని కూడా చూశాడు. అతడు వారందరినీ మంత్రాలవంటి ఈ శ్లోకాలతో స్తుతించాడు. శాశ్వతమై నిత్యమూ తిరుగుతూ ఉండే ఈ కాలచక్రంలో మూడువందల అరవై ఆకులు, ఇరవైనాలుగు పర్వాలు ఉన్నాయి. దీనిని ఆరుగురు కుమారులు త్రిప్పుతున్నారు. సంపూర్ణవిశ్వం యొక్క స్వరూపమైన స్త్రీలు నల్లని తెల్లని పోగులను అటు ఇటు మార్చి కదుపుతూ (ఈ వాసనాబంధరూపమైన) వస్త్రాన్ని నేస్తున్నారు. అనగా సమస్త భువనాలను, సర్వప్రాణులను వీరే చలింపచేస్తున్నారని భావం. వజ్రాయుధాన్ని ధరించి, త్రిలోకాలను రక్షించే ఇంద్రునకు నమస్కారం. వృత్రాసురుని, నముచిదానవుని సంహరించి నల్లని రెండు వస్త్రాలను ధరించి లోకంలో సత్యాసత్యాలను వివేచింపగలిగిన ఇంద్రునకు నమస్కారం. పూర్వం జలగర్భం నుండి ఉద్భవించిన వైశ్వానరరూపమైన గుర్రాన్ని వాహనంగా పొందిన, లోకత్రయాధిపతి, పురందరునికి నమస్కారం. అపుడు ఆ పురుషుడు ఉత్తంకునితో "నీ ఈ స్తోత్రం చేత మిక్కిలి ప్రీతుడనైనాను. నీకేమి ప్రియం చేయగలను?" అని అడిగాడు. అతడు ఆ పురుషునితో ఇలా అన్నాడు. "నాగులందరూ నాకు వశ మగుదురు గాక". ఇది విన్న ఆ పురుషుడు తిరిగి ఉత్తంకునితో

"ఈ గుఱ్ఱం యొక్క అపానప్రదేశంలో గట్టిగా ఊదు" అన్నాడు. ఉత్తంకు డలాగే అశ్వం యొక్క అపానంలో ఊదాడు. అలా ఊదగానే అశ్వం యొక్క శరీరంలోని అన్ని రంధ్రాలనుండి పొగతో కూడిన అగ్ని జ్వాలలు వెలువడ్డాయి.ఆ ధూమాగ్ని జ్వాలల చేత నాగలోకమంతా పొగ క్రమ్మేసింది తొట్రుపడిన తక్షకుడు అగ్నితేజస్సునకు భయపడి విషణ్ణుడై కుండలాలను తీసుకుని వెంటనే భవనం నుండి వెలుపలికి వచ్చి ఉత్తంకునితో "కుండలాలు ఇవిగో. తీసుకోండి మీరు" అన్నాడు. ఆ ఉత్తంకుడు వానిని తీసుకొన్నాడు. తీసుకొని ఇలా ఆలోచించాడు. "నేడే గురుపత్ని యొక్క పుణ్యకవ్రతం. నేను చాలా దూరం వచ్చాను. ఆమెను ఎలా సత్కరించగలను?" ఇలా అనుకొంటున్న అతనితో ఆ పురుషుడు ఇలా అన్నాడు. 'ఉత్తంకా! ఈ గుర్రాన్నే ఎక్కు, నిన్ను క్షణకాలంలో గురుకులాన్ని చేర్చుతుంది." అని. అతడు అలాగే అని చెప్పి ఆ గుఱ్ఱాన్ని ఎక్కి, గురుకులానికి వచ్చి చేరాడు. గురుపత్ని స్నానం చేసి కురులు ఆరబెట్టుకొంటూ కూర్చుని ఉత్తంకు డింకా రాలేదని అతనికి శాపమివ్వాలని మనసులో అనుకుంటోంది. ఈ లోగానే ఉత్తంకుడు గురుకులాన్ని ప్రవేశించి గురుపత్నికి నమస్కరించాడు. ఆ కుండలాలను ఆమెకిచ్చాడు. ఆమె అతనితో ఇలా అన్నది. "ఉత్తంకా! నీవు సరియైన సమయంలో సరియైన చోటుకి వచ్చావు. వత్సా! నీకు స్వాగతం. నీవు అపరాధం చేయలేదు కనుక నేను శపించలేదు. నీకు శుభాలు కలుగుతాయి. సిద్ధిని పొందుతావు." తరువాత ఉత్తంకుడు గురువుకు నమస్కరించాడు. గురువు వెంటనే "ఉత్తంకా! నీకు స్వాగతం-ఇంతవరకు ఏంచేశావు?" అపుడు ఉత్తంకుడు ఉపాధ్యాయునికి ఇలా బదులిచ్చాడు- "అయ్యా! నాగరాజైన తక్షకునివలన నాకు విఘ్నం కలిగింది. ఈ పనిలో అతనివలన నేను నాగలోకం వెళ్లాను. అక్కడ నేను ఇద్దరు స్త్రీలను చూశాను. వారు మగ్గం మీద పడుగుతో బట్ట నేస్తున్నారు. అందులో నలుపు, తెలుపు పోగులున్నాయి. అదంతా ఏమిటి? అక్కడే నేను పన్నెండు ఆకులు గల చక్రాన్ని చూశాను. ఆరుగురు కుమారులు దానిని తిప్పుతున్నారు. అది ఏమిటి? నేను చూసిన పురుషుడు ఎవడు? పెద్దదయిన గుఱ్ఱం ఒకటి కనపడింది. అదెవరు? నేను వెళ్లేటపుడు మార్గమధ్యంలో ఒక ఎద్దును చూశాను. దానినిఎక్కిన పురుషుడు గట్టిగా "ఉత్తంకా! ఈ బుషభం యొక్క పేడను తిను. నీ ఉపాధ్యాయుడు కూడా తిన్నాడు." అన్నాడు. అప్పుడు ఆ పురుషుడు చెప్పడం వలన నేను ఆ ఎద్దు యొక్క పేడను తిన్నాను. ఆ పురుషుడెవరు ? ఆ ఎద్దు సంగతేమిటి? "ఇదంతా ఏమిటి ? నేను మీరు చెప్పగా వినాలనుకొంటున్నాను." ఉత్తంకు డలా అడగగానే ఉపాధ్యాయు డిలా చెప్పాడు.

'ఆ ఇద్దరు స్త్రీలు ధాత విధాత. ఆ నల్లని తెల్లని పోగులు రాత్రింబవళ్లు.

ఆరుగురు కుమారులు త్రిప్పుతున్న ద్వాదశారచక్రంలో ఆరుగురు కుమారులు ఆరు ఋతువులు. పన్నెండు ఆకులు పన్నెండు మాసాలు. చక్రం సంవత్సరం. ఆ పురుషుడు పర్జన్యుడు. ఆ అశ్వం అగ్ని, నీవు దారిలో వెడుతూండగా చూచిన ఋషభం గజరాజు ఐరావతం. ఇక దానిని ఎక్కిన పురుషుడు ఇంద్రుడు. నీవు తిన్న ఆ ఎద్దు పేడ అమృతం. దానివలననే ఆ నాగలోకంలో నీవు మరణించలేదు. ఆ ఇంద్రభగవానుడు నా స్నేహితుడు. నీ మీది దయతో నిన్ను ఇలా అనుగ్రహించాడు. ఆ కారణం గానే నీవు కుండలాలను తీసుకొని తిరిగి వచ్చావు. కనుక సౌమ్యుడా ! ఇక వెళ్లవచ్చును. అనుమతిస్తున్నాను. నీకు శుభాలు కలుగుతాయి అన్నాడు." ఉపాధ్యాయుడు అనుమతించాక మహాత్ముడైన ఉత్తంకుడు కోపంతో తక్షకునిపై బదులు తీర్చుకోవడానికి హస్తినాపురానికి బయలుదేరాడు.

ఆ విప్రోత్తముడు ఉత్తంకుడు శీఘ్రంగా హస్తినాపురం చేరి, జనమేజయమహారాజును కలుసుకొన్నాడు. అంతకుముందే అతడు తక్షశిలకు వెళ్లి సంపూర్ణ విజయుడై తిరిగివచ్చాడు. మంత్రులు చుట్టూ కూర్చుని ఉన్న విజయుడైన ఆ రాజును చూచి ఉత్తంకుడు యథాన్యాయంగా ముందు అతనికి జయాశీస్సులు ప్రకటించి, సమయం చూసుకొని చక్కని మాటలతో ఇలా అన్నాడు. "రాజోత్తమా! ఒక పని చేయవలసి ఉండగా నీవు అజ్ఞానంతో వేరొకపనిని చేస్తున్నావు. విప్రుడు ఇలా అనగానే జనమేజయమహారాజు అతనిని తగిన రీతిగా పూజించి అతనితో ఇలా అన్నాడు. ఈ ప్రజలను పరిపాలించడం ద్వారా నేను నా క్షత్రధర్మాన్ని పాటిస్తున్నాను. నేను చేయవలసినది ఏమున్నది? మీరు ఏ పనిమీద ఇక్కడికి వచ్చారు? నృపోత్తముడు ఇలా అడుగగానే పుణ్యాత్ములలో గరిష్ఠుడైన విప్రోత్తముడు ఉదారహృదయుడైన ఆ రాజుతో "అది నీ పనే (నాది కాదు). దానిని చేయాలి." అన్నాడు. ఇంకా ఉత్తంకుడిలా చెప్పసాగాడు - 'మహీపాలోత్తమా! తక్షకుడు నీ తండ్రిని చంపాడు. ఆ దుర్మార్గు డయిన నాగునిపై నీవు ప్రతీకారం తీర్చుకో. శాస్త్రదృష్టితో చేసే కర్మకు (సర్పయజ్ఞరూపమైన కర్మ) ఇది తగిన సమయమని నేను భావిస్తున్నాను. కాబట్టి రాజా! మహాత్ముడైన నీ తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి బయల్దేరు. ఏ అపరాధం చేయని నీ తండ్రిని ఆ దుష్టాత్ముడు కాటు వేశాడు. దానితో వజ్రాయుధం చేత కొట్టబడిన చెట్టువలె అతడు నేలగూలాడు. పన్నగాధము డయిన తక్షకుడు బలగర్వం చేత మిడిసిపడ్డాడు. ఆ పాపాత్ముడు నీ తండ్రిని కాటువేసి అకృత్యం చేశాడు.

నీ తండ్రి రాజర్షివంశాలను రక్షించే దైవతుల్యుడు. అట్టి రాజును రక్షించా లని వస్తున్న కాశ్యపుడనే బ్రాహ్మణుని పాపకృత్యాలను చేసే తక్షకుడు వెనక్కి త్రిప్పి పంపాడు.

మహారాజా ! ఆ పాపిని మండుతున్న అగ్నిలో హోమం చేయి. అందుకు త్వరగా సర్పయాగం చేయి. రాజా ! ఇలా చేస్తే నీ తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకొన్నవాడివి అవుతావు. నాకు కూడా మిక్కిలి ప్రీతి కలుగుతుంది. మహారాజా! గురుకార్యార్థమై వెళ్తున్న నాకు ఈ దుర్మార్గుడు కార్యవిఘ్నం చేశాడు.' ఇది విని రాజు తక్షకునిపై కోపించాడు. హవిస్సుచేత అగ్ని ప్రజ్వరిల్లినట్లుగా ఉత్తంకుని మాట లనే హవిస్సు చేత అతని కోపాగ్ని జ్వలించింది. అప్పుడు ఆ రాజు మిక్కిలి దుఃఖంతో ఉత్తంకుని సన్నిధిలోనే తన తండ్రి స్వర్గప్రాప్తి గురించి ఆ మంత్రులను అడిగాడు. తన తండ్రి మరణవృత్తాంతాన్ని ఉత్తంకుని వలన విన్నప్పుడే ఆ రాజేంద్రుడు దుఃఖశోకాలలో మునిగిపోయాడు.

4. కథా ప్రారంభము.

నైమిషారణ్యంలో కులపతి శౌనకుడు చేస్తున్న ద్వాదశ వత్సరసత్రయాగానికి వచ్చిన ఋషులవద్దకు లోమహర్షణుని కొడుకు, సూతనందనుడు, పౌరాణికుడు అయిన ఉగ్రశ్రవసుడు వచ్చాడు. పురాణాలలో మిక్కిలి పరిశ్రమ చేసి పౌరాణికుడైన అతడు చేతులు జోడించి ఆ ఋషులను "పూజ్యులారా! మీరేమి వినాలనుకొంటున్నారు? నేను ఏమి చెప్పను?" అని అడిగాడు. ఆ ఋషులు ఇలా అన్నారు. "లోమహర్షణపుత్రా! నీకు మేము ఉత్తమమైన దానిని చెపుతాం. కథా ప్రసంగాలను వినడానికి కుతూహలంగా ఉన్న మాకు నీవు అనేకకథలను వినిపించవచ్చును. ఇప్పుడు పూజ్యులైన కులపతులు అగ్నిగృహంలో ఉన్నారు. దేవాసురులకు సంబంధించిన దివ్యమైన కథలను వారు ఎరుగుదురు. ఇంకా మనుష్యుల, నాగుల, గంధర్వుల కథలను అన్నింటినీ సంపూర్ణంగా తెలిసినవారు. సూతనందనా! కులపతి, విప్రవరుడు, విద్వాంసుడు అయిన ఆ శౌనకముని యజ్ఞదీక్షయం దున్నాడు. అతడు సమర్థుడు. వ్రతదీక్ష కలవాడు. బుద్ధిమంతుడు. శ్రుతి స్మృతిపురాణేతిహాసాలలోను, బృహ దారణ్యకాదు లయిన బ్రహ్మశాస్త్రాదులయందును అతడు ఆచార్యుడు. అతడు సత్యవాది. ఇంద్రియనిగ్రహతత్పరుడు. తపస్వి. నియమపూర్వకంగా వ్రతాచరణం చేసేవాడు. మాకు అందరికీ మాన్యుడు. అతడు వచ్చేవరకు ప్రతీక్షించండి. ఆ గురువు విప్రవరుడు ఉత్తమమైన ఆసనాన్ని అలంకరించి మిమ్మల్ని ఏది అడుగుతారో దానిని మీరు చెప్పుదురుగాని". ఉగ్రశ్రవసుడు అన్నాడు - "అలాగే కానివ్వండి. ఆ మహాత్ముడు వచ్చి కూర్చున్నాక వారు అడిగిన పుణ్యకథలను చెప్తాను." అనంతరం ఆ విప్రశ్రేష్ఠుడు శౌనకమహర్షి యథావిధిగా అన్ని కార్యాలు చక్కబెట్టుకుని, దేవతలను వైదిక స్తుతులతోను, పితరులను నీటితోను తృప్తిపరచి (తర్పణాలు చేసి) వచ్చాడు. అక్కడ ఉత్తమవ్రతులైన సిద్ధులు

బ్రహ్మర్షులు యజ్ఞమండపంలో సూతపుత్రుని ఎదుట సుఖాసీనులై ఉన్నారు. ఋత్విజులు, సదస్యులు అందరూ కూర్చుని ఉండగా కులపతి అయిన శౌనకుడు కూడా కూర్చుని ఇలా అన్నాడు.

5. భృగుని ఆశ్రమమునకు పులోముడను రాక్షసుడు వచ్చుట.

"తండ్రీ! లోమహర్షణకుమారా! పూర్వం నీ తండ్రి పురాణాలన్నీ అధ్యయనం చేశాడు. నీవు కూడా అవన్నీ అధ్యయనం చేశావా ?పురాణంలో దివ్యమైన కథలు, ధీమంతు లయిన రాజర్షి బ్రహ్మర్షుల యొక్క మూలవంశాలు వర్ణింపబడి ఉంటాయి. మేము మీ తండ్రివలన పూర్వం ఇవన్నీ విని ఉన్నాం. వానిలో మొదటగా భృగువంశం గూర్చి వినగోరుతున్నాను. కనుక ఈ కథనే చెప్పు. మేమంతా నీ కథ వినడానికి తగినట్లు సిద్ధంగా ఉన్నాము." సూతపుత్రుడు చెపుతున్నాడు - "భృగునందనా! వైశంపాయనాది విప్రవరులు, మహాత్ములయిన ద్విజశ్రేష్ఠులు పూర్వం చక్కగా అధ్యయనం చేసి చెప్పిన పురాణం నాకు బాగా తెలుసు. నాతండ్రి నాచేత చక్కగా అధ్యయనం చేయించాడు. నేను కూడా చక్కగా అధ్యయనం చేశాను. భృగునందనా! భార్గవవంశం ఇంద్రాది దేవతలచేత, ఋషులచేత, మరుద్గణం చేత కొనియాడబడిన శ్రేష్ఠమైన వంశం. మహామునీ! పురాణాలను ఆశ్రయించుకొని అందులో ఇమిడి ఉన్న ఈ భార్గవవంశం గురించి ముందుగా నీకు యథాయుక్తంగా చెపుతాను. విను. స్వయంభువు అయిన బ్రహ్మ వరుణుని యజ్ఞంలో అగ్నినుండి పూజ్యుడు, మహర్షి అయిన భృగువును పుట్టించాడని విని ఉన్నాను. అతనికి మిక్కిలి ప్రీతిపాత్రు డయిన పుత్రుడు చ్యవనుడు. చ్యవనుని కొడుకు ప్రమతి అనేవాడు పరమ ధార్మికుడు. అతనికి ఘృతాచి అనే అప్సరసయందు రురుడు పుట్టాడు. రురునకు ప్రమద్వరయందు శునకు డనే కొడుకు ఉదయించాడు. అతడు వేదాలలో పారంగతుడు. ధర్మాత్ముడు. నీకు ప్రపితామహుడు. అతడు తపస్వి, యశస్వి, శాస్త్రవేత్త, బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు, ధార్మికుడు, సత్యవాది, ఇంద్రియ నిగ్రహం కలవాడు, నియతంగా ఆహారం తీసుకొనేవాడు.

శౌనకుడు అన్నాడు - "సూతపుత్రా! మహాత్ముడైన భార్గవునికి చ్యవనుడనే పేరు ఎందుకు ప్రసిద్ధమయిందో అది నాకు చెప్పు." సూతసుతుడు చెప్పసాగాడు - "భృగువు భార్య పులోమ అని వినుతికెక్కింది. ఆమె భర్తకు అత్యంత ప్రీతి పాత్రమైనది. భృగువు వీర్యం వలన కలిగిన గర్భం ఆమెలో పెరగ సాగింది. భృగువంశోత్తమా ! యశస్వి అయిన భృగువునకు అనుకూలమైన స్వభావం కల ధర్మపత్ని పులోమ. ఆమె గర్భం

తాల్చిన సమయంలో ఒకసారి (ధర్మపరులలో శ్రేష్ఠ డయిన) భృగువు స్నానానికి బయటకు వెళ్లాడు. అప్పుడు పులోము డనే రాక్షసుడు అతని ఆశ్రమానికి వచ్చాడు. అతడు ఆశ్రమంలోకి రాగానే పతివ్రత అయిన భృగువు భార్యను చూచి, కామావిష్టుడై మోహాన్ని పొందాడు. సుందరి అయిన పులోమ అభ్యాగతుడైన ఆ రాక్షసుని అడవిలో దొరికే ఫలమూలాదులు సమర్పించి ఆహ్వానించింది. బ్రహ్మమూర్తీ! ఆ సమయంలో రాక్షసుడు కామపీడితుడై ఉన్నాడు. రాజా! అనిందితురా లయిన ఆమెను ఎత్తుకొని పోదలచి, ఆమె ఒంటరిగా ఉండడం చూచి ఆనందించాడు. ఆ శుభాంగిని ఎత్తుకుపోదలచిన అతడు పట్టరాని సంతోషంతో "నాకార్యం జరిగినట్లే" అని మనసులోనే అనుకొన్నాడు. ఆ సుందరాంగి పులోమను పూర్వం పులోముడనే ఆ రాక్షసుడు వరించాడు. కాని అనంతరకాలంలో తండ్రి ఆమెను శాస్త్రోకంగా భృగువునకు ఇచ్చి వివాహం చేశాడు. భృగునందనా! తండ్రి చేసిన ఆ అపరాధం నిత్యమూ అతని మనసులో గ్రుచ్చుకొంటూనే ఉంది. ఇదే తగిన సమయం అనుకొని ఆమెను అపహరించడానికి మనసులోనే నిశ్చయించుకొన్నాడు. ఇంతలోనే అగ్నిగృహంలో అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉండడం చూశాడు. అప్పుడు ఆ జ్వలిస్తున్న అగ్నిదేవుని పులోముడు - "అగ్నిదేవా! నేను నిజంగా అడుగుతున్నాను. చెప్పు. ఈమె ఎవరి భార్య?

పావకుడా! నీవు దేవతలకు ముఖస్థానీయుడవు. అడుగుతున్న నాకు సమాధానం చెప్పు. ఈ సుందరాంగిని పూర్వం నేను భార్యగా వరించాను. కాని అనంతరం ఆమె తండ్రి అసత్యవ్యవహారంతో ఈమెను భృగువునకిచ్చి వివాహం చేశాడు. ఒంటరిగా చిక్కిన ఈ సుందరి భృగువు భార్యయేనా? అయితే నిజం చెప్పు. ఈ ఆశ్రమం నుండి ఆమెను ఎత్తుకుపోతాను. ఆ నాటి ఆ కోపం ఇప్పటికీ నా హృదయాన్ని మండిస్తూనే ఉన్నది. నా పూర్వపు భార్య అయిన ఈమెను భృగువు పొందాడు." ఈ రీతిగా భృగువుయొక్క భార్యను - ఈమె తనకు చెందుతుందా, భృగువుకు చెందుతుందా అనే సంశయం కల్పిస్తూ రాక్షసుడు జ్వలిస్తున్న అగ్నిని పిలిచి పదే పదే అడుగ సాగాడు. 'అగ్నీ! నీవు సమస్తప్రాణుల లోపల నిత్యం సంచరిస్తూ ఉంటావు. సర్వజ్ఞుడా! పుణ్యపాపాల యందు సాక్షివలె ఉంటావు. కాబట్టి నిజం చెప్పు. అసత్యవర్తనుడైన భృగువు నాకు మొదట భార్యగా నిశ్చయింపబడిన దానిని అపహరించాడు. ఆమె ఈమెయే అయితే నీవు నిశ్చయంగా ఆ విషయం నిజం చెప్పు. అగ్నీ! నీవలన విషయమంతా విని, భృగువు భార్యను నీవు చూస్తూ ఉండగానే ఈ ఆశ్రమం నుండి హరించి తీసుకొనివెడతాను. కాబట్టి నీవు నిజమేదో చెప్పు.' రాక్షసుని ఈ మాటలను విని, అగ్ని దుఃఖించాడు. ఒకవైపు అసత్యానికి, ఇంకొకవైపు భృగువు యొక్క శాపానికి అతడు భయపడ్డాడు. మెల్లమెల్లగా ఇలా అన్నాడు.

అగ్నిదేవుడు చెప్పాడు - దానవనందనా ! నీ చేతపూర్వం వరింపబడిన పులోమయే ఈమె. కాని ఈమెను నీవు విధి పూర్వకంగా మంత్రసహితంగా వివాహమాడలేదు. ఈ యశస్విని పులోమను తండ్రి భృగువుకిచ్చి వివాహం చేశాడు. ఆ కీర్తిమంతుడు శ్రేష్ఠమైన వరుడు కావాలనే కోరికతో నీకు ఇవ్వలేదు. దానవా! తదనంతరం ఈమెను వేదోక్తమైన క్రియాకలాపంతో శాస్త్రపూర్వకంగా, నన్ను ముందుంచుకొని భృగువు భార్యగా పొందాడు. ఆమెయే ఈమె అని నాకు తెలుసు. అబద్ధం చెప్పడానికి ఆసక్తి లేదు. దానవోత్తమా! లోకంలో అనృతం ఎప్పుడూ పూజింపబడదు.

6. చ్యవనుడు పుట్టుట - భృగువు అగ్నికి శాపమిచ్చుట.

అగ్ని చెప్పిన మాటలను విని ఆ రాక్షసుడు వరాహరూపం ధరించి మనోవేగవాయువేగాలతో ఆమెను అపహరించాడు. ఆ సమయంలో ఉదరంలో నివసించే గర్భం రోషంతో తల్లి ఉదరం నుండి (యోగబలం చేత) జారి (చ్యుతమై) వెలుపలికి వచ్చింది. ఆ కారణంగా అతడు చ్యవనుడైనాడు. తల్లి కడుపునుండి జారిపడి, సూర్యునివలె వెలుగొందే అతనిని చూచి, ఆ రాక్షసుడు ఆమెను వదలి పడిపోయి, మండి బూడిదగా మారిపోయాడు. భృగువంశానికి ఆనందకారకమైన భార్గవపుత్రుని చ్యవనుని తీసుకొని పులోమ దుఃఖోద్వేగంతో బ్రహ్మ వద్దకు వెళ్లింది. లోకాలన్నిటికి పితామహుడు అయిన బ్రహ్మ నీరు నిండిన కళ్లతో ఏడుస్తున్న పతివ్రత అయిన భృగుపత్నిని చూశాడు. పూజ్యుడైన ఆ పితామహుడు బ్రహ్మ కోడలిని ఓదార్చాడు. ఆమె కన్నీటి బిందువులు మహానదిగా మారాయి. తపస్విని అయిన ఆ భృగుపత్ని యొక్క మార్గాన్ని ఆక్రమిస్తూ ఆమె మార్గాన్నే అనుసరించి ప్రవహిస్తున్న నదిని చూచి లోకపితామహుడు అప్పుడే నదికి "వధూసర" అనే పేరు పెట్టాడు. అది పూజ్యుడైన భృగువు యొక్క ఆశ్రమప్రాంతంలో ప్రవహించ సాగింది. ఈ రీతిగా భృగువునకు ప్రతాపశాలి అయిన పుత్రుడు చ్యవనుడు పుట్టాడు. తండ్రి ఆ చ్యవనుని, తన పత్ని అయిన పులోమను చూశాడు. సంగతి అంతా విన్నాక కుపితుడై' భృగువు తన భార్య పులోమను ఇలా అడిగాడు.

భృగువు అంటున్నాడు - 'నిన్ను ఎత్తుకుపోవాలని వచ్చిన ఆ రాక్షసునికి నీ గురించి ఎవరు చెప్పారు? నా భార్యవైయున్న నిన్ను ఆ రాక్షసుడు ఎరుగడు గదా! నిజం చెప్పు. కోపంతో ఇప్పుడే అతనిని శపించాలనుకొంటున్నాను. నాశాపానికి వెరవని అతడెవరు? ఎవరు చేశారు ఈ అపరాధం ?' పులోమ చెపుతున్నది - "పూజ్యుడా! అగ్ని ఆ రాక్షసునికి నా గురించి తెలియచేశాడు. పిమ్మట ఆడుపక్షి వలె ఏడుస్తున్న నన్ను ఆ

రాక్షసుడు తీసుకొని పోయాడు. అట్టి నేను ఈ నీ కొడుకు యొక్క తేజస్సు చేత విడిపింపబడ్డాను. ఆ రాక్షసుడు నన్ను విడిచి భస్మీభూతుడై పడిపోయాడు." పులోమయొక్క ఈ మాటలను విన్న భృగువునకు కోపం మరింత పెరిగింది. అతడు అగ్నిని సర్వభక్షకుడ వవుతా వని శపించాడు.

7. కోపించిన అగ్ని మాయమగుట - బ్రహ్మ అతనిని ప్రసన్నుని చేయుట.

"భృగువు శపించగానే క్రుద్ధుడైన అగ్ని ఇలా అన్నాడు. - బ్రహ్మజ్ఞా! నా పట్ల ఇంత సాహసం ఎందుకు చేశావు ? నేను ధర్మం కొరకే ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాను. పక్షపాతం లేకుండా సత్యాన్ని చెపుతూ ఉంటాను. నన్ను అడిగినపుడు సత్యమే చెప్పాను. ఇందులో నా తప్పు ఏముంది. సాక్షి అయినవానిని అడిగినపుడు తెలిసి కూడా సాక్ష్యం చెప్పకుండా అబద్ధం చెపితే అతడు నశిస్తాడు. అతని వంశంలోని అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు నాశనమవుతాయి. అలాగే కార్యం యొక్క అసలు తత్త్వం (రహస్యం) తెలిసి నప్పటికి చెప్పనివాడు కూడా ఆ పాపాన్నే పొందుతాడు. ఇందులో సందేహమేమీ లేదు.*

నేను కూడా నీకు శాపం ఇవ్వగలను. కాని బ్రాహ్మణులు నాకు పూజ్యులు. బ్రహ్మనిధీ! నీకు తెలిసినదే అయినా నేను చెపుతున్నది జాగ్రత్తగా విను. యోగబలం చేత నేను అనేకరూపాలు ధరించి, ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్ని మూర్తులయందు, నిత్యం చేయబడే అగ్నిహోత్రాల యందు; అనేక వ్యక్తులు చేసే యాగాలలోను; గర్భాధానాది క్రియలలోను; జ్యోతిష్టోమాది యజ్ఞాలలోను ఉంటున్నాను. వేదోక్తమైన విధానం ద్వారా నాయందు హోమం చేయబడే హవిస్సుచేత దేవతలు, పితరులు తృప్తి చెందుతున్నారు. దేవగణాలన్నీ జలరూపమే. అలాగే పితృగణాలు జలరూపమే. పితరులకు, దేవతలకు కూడా దర్శ పౌర్ణమాసలు చేస్తూ ఉంటారు. దేవతలే పితరులు. పితరులు కూడా దేవతలే. పర్వాలలో వీరిని కలిపి పూజిస్తారు. విడిగా కూడా పూజిస్తారు. నా యందు హోమం చేయబడిన హవిస్సును దేవతలు, పితరులు కూడా భుజిస్తున్నారు. కనుక నన్ను దేవతలకు, పితరులకు ముఖం అని చెపుతూ ఉంటారు. అమావాస్యనాడు పితరులకు, పూర్ణిమనాడు దేవతలకు నాముఖం ద్వారానే హోమాలు వ్రేల్చబడుతూ ఉంటాయి. హోమం చేయబడిన

* వి తె॥ ఇచట తెలుగులో నన్నయ ఈసూక్తిని ప్రత్యేకమయిన కందంలో పొదిగి రుచిరార్థయుక్తం చేశాడు.
తన యెఱిగిన యర్థం బొరుఁ డనఘా! యిది యెట్లు సెప్పుమని యడిగినఁ జె
ప్పని వాఁడును, సత్యము సె ప్పని వాఁడును ఘోరనరక పంకమునఁ బడున్. (1-1-136)

హవిస్సును వారు భుజిస్తూ ఉంటారు. వారికి ముఖంగా ఉన్న నేను సర్వభక్షకుడను ఎట్లు కాగలను?

"మహర్షులారా! తరువాత అగ్ని కొంతసేపు చింతించి, ద్విజుల యొక్క అగ్నిహోత్రాలలోను, యజ్ఞ సత్ర క్రియలలోను గల తన రూపాన్ని ఉపసంహరించాడు. అగ్ని లేకపోవడం చేత ప్రజలందరూ ఓంకార వషట్కారాలు లేక, స్వధా స్వాహా శబ్దాలు లేక ఆక్రోశించారు. అపుడు మహర్షులందరూ ఉద్విగ్నులై దేవతలవద్దకు వెళ్లి ఇలా అన్నారు. "పుణ్యాత్ములారా! అగ్ని లేకపోవడం వలన క్రియాలోపం జరిగి ముల్లోకాలు దిక్కుతోచకుండా ఉన్నాయి. ఈ విషయంలో ఏమి చేయాలో చేయండి. ఆలసించడం మాత్రం తగదు." అనంతరం ఋషులు, దేవతలు కలిసి బ్రహ్మదగ్గరకు వెళ్లి, అగ్నికి కలిగిన శాపం, అతడు అన్నిరకాల క్రియలనుండి తన రూపాన్ని ఉపసంహరించడం గురించి చెపుతూ ఇలా అన్నారు. "మహాభాగా! కారణాంతరం వలన భృగువు అగ్నికి శాపమిచ్చాడు (సర్వభక్షకుడవు కమ్మని). దేవతలకు ముఖ స్వరూపమై, యజ్ఞభాగాలలో అగ్రభోక్తగా ఉంటూ, అన్ని లోకాలలోను హోమం చేయబడిన దానిని భుజిస్తూ ఉండే అగ్ని సర్వభక్షకుడు ఎలా కాగలుగుతాడు?" దేవతల యొక్క ఋషులయొక్క ఆ మాటలను విని విశ్వవిధాత అయిన బ్రహ్మ ప్రాణులను సృష్టించే నాశరహితుడైన అగ్నిదేవుని పిలిచి మృదువుగా ఇలా అన్నాడు. "హుతాశనా! ఈ లోకాలన్నిటికి సృష్టికర్తవు నీవే. అంతం చేసేవాడవూ నీవే. ముల్లోకాలను నీవే ధరిస్తూ ఉంటావు. సమస్త క్రియాకలాపాలను ప్రవర్తింప చేసేవాడవూ నీవే. కాబట్టి లోకేశా! క్రియాకలాపాలు విచ్ఛేదం కాకుండా ఉండేలా చేయి. నీవు అన్నిటికి ఈశ్వరుడవు అయిఉండి కూడా ఎందుకిలా మూఢునివలె ప్రవర్తించావు ? నీవు లోకంలో సదా పవిత్రుడవు. సర్వభూతాలకు గతివి కూడా. నీవు నీ శరీర మంతటితోను సర్వభక్షకత్వాన్ని పొందవు. అగ్నిదేవా! నీ అపానదేశంలో ఉండే జ్వాలలు మాత్రమే సమస్తాన్ని భక్షిస్తాయి. మాంసాన్ని (లేదా మృత శరీరాన్ని) తినే నీ శరీరభాగంతో సమస్తాన్ని భక్షించగలవు. సూర్యకిరణాల స్పర్శ తగిలిన సమస్తమూ శుచిగా భావింపబడినట్లే నీ జ్వాలచేత దగ్ధమైన సర్వమూ శుచి కాగలదు. అగ్నీ! స్వీయ ప్రభావం చేత ప్రకటమయ్యే పరమ తేజః స్వరూపానివి నీవు, ఆ నీ స్వీయ తేజస్సు చేతనే ఋషి శాపాన్ని నిజం చెయ్యి. నీ యందు హోమం చేయబడిన దానిలో దేవతల యొక్క, నీ యొక్క భాగాన్ని కూడా స్వీకరించు.

అగ్ని బ్రహ్మదేవునితో "అలాగే జరుగుగాక" అని చెప్పి పూజ్యుడైన ఆ పరమేష్ఠి ఆజ్ఞను పాటించడానికి వెళ్లాడు. అనంతరం దేవర్షులు సంతోషించి, ఎలా వచ్చినవారు

ఆలాగే వెళ్లిపోయారు. ఋషులు పూర్వంలాగే సమస్త క్రియాకలాపాలు చేసుకోసాగారు. స్వర్గంలో దేవతలు, లోకంలోని ప్రాణికోటి సంతోషించారు. అగ్ని కూడా శాపంవలన కలిగిన పాపం తొలగిపోయి మిక్కిలి సంతోషించాడు. ఈ రీతిగా పూర్వం పూజ్యుడైన అగ్నిదేవుడు భృగువువలన శాపం పొందాడు. ఇది అగ్ని శాపానికి సంబంధించి పూర్వం జరిగిన ఇతిహాసం. ఇదే పులోముడనే రాక్షసుడు నశించడం, చ్యవనుడు పుట్టడం చెప్పే ఇతిహాసం కూడా.

8. రురు ప్రమద్వరల వృత్తాంతము - ప్రమద్వర మరణించుట.

ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు - బ్రహ్మజ్ఞా! భృగుపుత్రుడైన చ్యవనుడు సుకన్యవలన తేజస్సుతో దీపించే మహాత్ముడైన ప్రమతి అనే కొడుకును కన్నాడు. ప్రమతికి ఘృతాచి అనే అప్సరసయందు రురువు అనే కొడుకు కలిగాడు. రురువుకు ప్రమద్వర యందు శునకుడనేవాడు కలిగాడు.

(మహాభాగా! శునకసుతుడ వయిన నీవు శౌనకుడవు.)

శునకుడు మహాసత్త్వుడై సమస్త భృగుకులానికి ఆనందదాయకు డయ్యాడు. అతడు తీవ్రమైన తపస్సు చేసి స్థిరకీర్తిని పొందాడు. బ్రహ్మజ్ఞా! ఆ గొప్ప తేజస్వియైన రురువు యొక్క చరిత్ర యావత్తు సవిస్తరంగా చెపుతాను. దానిని పూర్తిగా వినుము. పూర్వం తపస్సు, విద్య కలిగి, సమస్తప్రాణులకు మేలు చేయడంలో ఆసక్తి కలిగిన స్థూలకేశుడనే గొప్ప ఋషి ఉండేవాడు. ఆ కాలంలోనే విశ్వావసువు అనే గంధర్వుడు మేనక యందు కొడుకును కన్నాడు. భృగునందనా! ఆ అప్సరస మేనక నెలలు నిండిన తరువాత స్థూలకేశుని ఆశ్రమ సమీపంలో ప్రసవించింది. నిర్దయురాలు, లజ్జాహీనురాలు అయిన మేనక (అనే ఆ అప్సరస) నదీతీరంలో ఆ బిడ్డను విడిచి వెళ్లిపోయింది. మునిశ్రేష్ఠుడు, తేజస్వి అయిన స్థూలకేశ మహర్షి దేవతా-శిశువువలె దివ్య తేజస్సుతో అలరారుతున్న ఆ బాలికను చూశాడు. నదీతీరంలో ఒంటరిగా బంధువులందరిచేత విడువబడిన ఆ బాలికను చూచి అతడు దయాపూర్ణుడై తెచ్చి పెంచసాగాడు. ఆ సుందరి అతని ఆశ్రమంలో దినదిన ప్రవర్ధమానం అవుతోంది. మహానుభావుడైన ఆ మహర్షి స్థూలకేశుడు ఆ బాలికకు జాతకర్మాది క్రియలన్నీ విధిపూర్వకంగా యథాక్రమంగా జరిపించాడు. బుద్ధి, రూప, గుణాలతో ప్రమదలందరిలో శ్రేష్ఠురాలు కాబట్టి ఆమెకు ప్రమద్వర అని మహర్షి నామకరణం చేశాడు. స్థూలకేశమహర్షి ఆశ్రమంలో ప్రమద్వరను చూచి ధర్మాత్ముడయిన రురువు మదన పీడితు డైనాడు. అతడు తన మిత్రుల ద్వారా తండ్రికి తన

అవస్థను తెలియచేశాడు. ప్రమతికూడా వాసికెక్కిన రురువుకు ఆమెను ఇమ్మని ఆ స్థూలకేశుని యాచించాడు. అంతట తండ్రి తన కుమార్తె ప్రమద్వరను రురువుకు ఇవ్వడానికి వాగ్దానం చేశాడు. ముందు రాబోయే ఉత్తరఫల్గునీ నక్షత్రంలో వివాహం చేయాలని నిశ్చయించాడు.

వివాహం ఇక కొద్దిరోజులలో ఉందనగా ఆ సుందరి అయిన ప్రమద్వర చెలులతో కలిసి క్రీడిస్తూ ఉండగా (అడవిలో తిరుగుతోంది)..... దారిలో అడ్డంగా ఒక పెద్ద సర్పం పరచుకుని నిద్రపోవడం ప్రమద్వర చూడలేదు. ఆమె కాల ప్రేరితురాలై కాలితో త్రొక్కింది. కాలధర్మానుసారంగా ఆ సర్పం బుస్సున లేచి అజాగ్రత్తగా ఉన్న ఆమెయొక్క శరీరంమీద విషయుక్తమైన కోరలతో కాటువేసింది. ఆ పాము కరవగానే ఆమె నేలమీద వాలి పోయింది. శరీరం రంగు మారిపోయింది. సౌందర్యం నశించింది. ఆభరణాలు చెదరిపోయాయి. స్పృహ పోయింది. జుట్టు ముడి వీడిపోయింది. అది బంధువులకు శోకాన్ని కలిగించింది. అంతకు ముందు వరకు చూడచక్కగా ఉన్న ఆమె విగతజీవయై చూడ శక్యం కాకపోయింది. ఆ తనుమధ్య సర్పవిషం చేత బాధపడుతూ నేల మీద పడినప్పటికీ నిద్రపోతున్నదానిలా మరింత మనోహరంగా కనిపించింది. కదలక మెదలక నేలమీద పడి తామరకాంతితో ఉన్న ఆమెను తండ్రియైన స్థూలకేశుడు, ఇతర తాపసులూ చూశారు. అనంతరం స్వస్త్యాత్రేయుడు, మహాజానువు, కుశికుడు, శంఖమేఖలుడు, ఉద్దాలకుడు, కరుడు, మహాకీర్తిశాలి శ్వేతుడు, భరద్వాజుడు, కౌణకుత్స్యుడు, ఆర్ష్టిషేణుడు, ఇంకా గౌతముడు, పుత్రునితో సహా ప్రమతి, ఇతర వనవాసులైన బ్రాహ్మణశ్రేష్ఠులు కృపావిష్టులై అక్కడికి చేరారు. పాము కాటు చేత ప్రాణాలు కోల్పోయిన ఆ కన్యను చూచి కృపతో వారందరూ రోదించారు. రురువు మిక్కిలి ఆర్తితో బయటకు వెళ్లిపోయాడు. మిగిలిన బ్రాహ్మణోత్త ములందరూ అక్కడే కూర్చున్నారు.

9. రురు ప్రమద్వరల వివాహము.

ఉగ్రశ్రవసుడు కొనసాగించాడు - "మహాత్ములైన ఆ బ్రాహ్మణులందరూ అక్కడ కూర్చుని ఉండగా రురువు మాత్రం అతిదుఃఖితుడై దట్టమైన అరణ్యంలోకి వెళ్లి శోకించసాగాడు. దుఃఖంతో నలిగిపోయి అతికరుణంగా విలపించాడు. ప్రియురాలు అయిన ప్రమద్వరను తలచుకొని ఏడుస్తూ ఇలా అన్నాడు. "ఆ సుందరి నాశోకాన్ని మరింత పెంచుతూ భూమిమీద పడి ఉన్నది. బంధువులు అందరికీ కూడా శోకం కల్గిస్తోంది. ఇంతకంటె దుఃఖకరమైన విషయం మరొకటి ఏమున్నది? నేను దానం చేసినట్లయితే, తపస్సు

చేసినట్లయితే లేదా గురుజనులను చక్కగా ఆరాధించినట్లయితే ఆ పుణ్యం వలన నాప్రియురాలు జీవించుగాక. నేను జన్మించినది మొదలు ఇంతవరకు ఇంద్రియ మనోనిగ్రహాలు కల వాడిని, బ్రహ్మచర్యాది వ్రతాలు దృఢంగా ఆచరించే వాడిని అయితే ఈ ప్రమద్వర బ్రతికి లేచుగాక!

(అసురాంతకుడు, జగదీశ్వరుడు, ఇంద్రియాధిపతి, సర్వవ్యాపకుడు అయిన శ్రీకృష్ణ భగవానుని యందు నాకు నిశ్చలభక్తి ఉన్నట్లయితే ఈ నా ప్రియురాలు జీవించుగాక!)"

అడవిలో భార్య కోసం దుఃఖంతో విలపిస్తున్న అతని వద్దకు దేవదూత వచ్చి రురుని ఉద్దేశించి ఇలా అన్నాడు. దేవదూత చెపుతున్నాడు - ధర్మాత్మా ! రురూ! దుఃఖంతో నీవు ఇంతవరకు మాటలాడినవన్నీ అసత్యాలే. ఆయువు తీరిన మానవునకు ప్రాణం ఉండదు. గంధర్వ- అప్సరసలకు పుట్టిన ఈ దీనురాలికి ఆయువు తీరింది. కాబట్టి తండ్రీ ! దుఃఖంలో మనసులో కోపగించుకోకు. ఈ విషయంలో మహాత్ములైన దేవతలు పూర్వం ఒక ఉపాయాన్ని నిశ్చయించారు. నీవు దానిని చేయడానికి ఇష్టపడితే ఇప్పుడు ప్రమద్వరను పొందగలవు. అప్పుడు రురువు 'ఆకాశచారి అయిన దేవదూతా! దేవతలు చేసిన ఆ ఉపాయమేదో స్పష్టంగా చెప్పు. అది విని నేను తప్పకుండా చేస్తాను. నీవే నన్ను రక్షించదగినవాడవు' అన్నాడు. దేవదూత చెప్పాడు - "భృగునందనా! రురూ! ఆ కన్యకు నీ ఆయుర్దాయంలో సగం ఇవ్వు. ఇలా చేస్తే నీ భార్య ప్రమద్వర బ్రతికి లేవగలదు." రురువు అన్నాడు - "దేవోత్తమా! నేను ఆ కన్యకు నా ఆయువులో సగం ఇస్తున్నాను. శృంగారం, సౌందర్యం కలబోసుకుని ఆభరణాలు ధరించిన నాప్రియురాలు బ్రతికి లేచుగాక". వెంటనే గంధర్వరాజు అయిన విశ్వావసువు, దేవదూత - ఆ ఇద్దరు సత్పురుషులు కలిసి యమధర్మరాజు దగ్గరకు వెళ్లి ఇలా చెప్పారు. "యమధర్మరాజా! రురువు భార్య, కల్యాణి అయిన ప్రమద్వర చనిపోయింది. నీవు అంగీకరిస్తే అతని సగం ఆయుర్దాయంతో ఆమె బ్రతుకుతుంది" ధర్మరాజు చెప్పాడు- "దేవదూతా! రురువు భార్య ప్రమద్వరను నీవు బ్రతికింపదలచుకొంటే, రురువు యొక్క ఆయుస్సులో సగం పొంది ఆమె లేచుగాక"

ధర్మరాజు ఇలా అన్న వెంటనే ఆ ప్రమద్వర రురువు యొక్క అర్ధాయుస్సును పొంది నిద్రలేచినదాని వలె లేచి కూర్చుంది. రురువు యొక్క అతి దీర్ఘమైన ఆయువులో సగం భార్యకోసం తగ్గింది. ఇది అతని యొక్క అదృష్టంగా భావించబడింది. అనంతరం వారి తల్లిదండ్రులు అనుకున్న రోజున వారి వివాహాన్ని సంతోషంగా జరిపించారు. వారిద్దరూ పరస్పర శ్రేయోభిలాషులై ఆనందంగా కాలం గడుపసాగారు. పద్మ కేసరాల కాంతివంటి

కాంతితో వెలుగొందే దుర్లభమైన ప్రమద్వరను భార్యగా పొంది వ్రతధారి అయిన రురువు పాములను నాశనం చేయాలని దీక్ష పూనాడు. అతడు పాములను చూడగానే తీవ్రమైన కోపంతో కర్ర పుచ్చుకొని బలంకొద్దీ కొట్టి వాటిని చంపసాగాడు. విప్రుడైన ఆ రురువు ఒకసారి పెద్ద అడవిలోకి వెళ్లాడు. అక్కడ డుండుభ జాతికి చెందిన ఒక ముసలిపాము పడుకొని ఉండడం చూశాడు. వెంటనే కోపంతో దానిని చంపదలచి యమదండం లాంటి కర్రను పైకెత్తాడు. అంతలోనే ఆ డుండుభం అతనితో "తపోధనా! నేనిప్పుడు నీకు ఏమీ అపకారం చేయలేదుగదా! కోపించి ఆవేశంతో ఎందుకు నన్ను చంపుతున్నావు?" అంది.

10. రురు డుండుభుల సంవాదము.

'నా ప్రాణసమానురాలయిన భార్యను ఒక పాము కరిచింది. ఎక్కడ పామును చూచినా దానిని చంపాలని అప్పుడు నేను ఘోరమైన ప్రతిజ్ఞ చేశాను. కాబట్టి నేను నిన్ను చంపాలనుకొంటున్నాను. ఇప్పుడు నీకు చావు తప్పదు.' అన్నాడు రురువు. అప్పుడు డుండుభం 'బ్రహ్మజ్ఞా! మానవులను కరిచే పాములు వేరేవి. కేవలం ఆకారంలో మాత్రమే సర్పాలను పోలిన డుండుభాలను నీవు హింసించరాదు. అయ్యో! అనర్థాలు పొందడంలో (హానిపొందడంలో) అన్నీ ఒకటా? ప్రయోజనాలు పొందడంలో మాత్రం వేరా? దుఃఖం పొందడానికి అన్నీ ఒకటేనా ? సుఖాలు మాత్రం వేరా? నీవు ధర్మం తెలుసుకో. డుండుభాలను హింసించడం మానుకో' అన్నది. ఉగ్రశ్రవసుడు అంటున్నాడు - ఆ డుండుభం యొక్క మాటలను విని రురువు అతనిని భయావిష్టుడైన మునిగా తలచి చంపలేదు. పైగా పూజ్యుడైన రురువు అతనిని శాంతింప చేస్తున్న వానివలె "భుజంగమా! ఈ వికృత రూపాన్ని (సర్పాకారాన్ని) పొందిన నీవెవరవు ? నాకు తప్పక చెప్పు" అని అడిగాడు. డుండుభం చెప్పింది - 'రురూ! నేను పూర్వం సహస్రపాదుడనే మునిని. కాని ఒక బ్రాహ్మణుని యొక్క శాపం వలన సర్పంగా మారాను.' రురువు అడిగాడు - 'భుజగోత్తమా! బ్రాహ్మణుడు కోపంతో ఎందుకు నిన్ను శపించాడు? ఎంతకాలం నీవు ఈ శరీరంతో ఉండాలి?'

11. డుండుభము రురునకు అహింస నుపదేశించుట.

డుండుభం చెపుతోంది. పూర్వం నాకు ఖగముడనే ఒక విప్రుడు స్నేహితుడు ఉండేవాడు. నాయనా! అతడు తపోబలసంపన్నుడు. అతని మాటలు చాలా పదునుగా

ఉండేవి. బాల్యంలో ఒకనాడు నేను ఆకతాయితనంగా అగ్నిహోత్రకార్యంలో లగ్నమై ఉన్న అతనిని గడ్డిపాముతో భయపెట్టాను. అతడు భయంతో మూర్ఛపోయాడు. తిరిగి తెలివి తెచ్చుకొని ఆ తపోధనుడు, సత్యవాక్కు, కఠోరవ్రతుడు కోపంతో నన్ను దహిస్తున్నట్లుగా ఇలా అన్నాడు. "నన్ను భయపెట్టడానికి ఎలాంటి శక్తి గల సర్పాన్ని తయారుచేశావో, అలాంటి శక్తి గల సర్పంగా (నిర్వీర్యమైన సర్పం) నా శాపం వలన అవుతావు." తపోధనా! అతనియొక్క తపశ్శక్తిని నేను ఎరుగుదును. కనుక ఉద్విగ్నహృదయుడనై, సంభ్రమంతో దోసిలి ఒగ్గి నమస్కరిస్తూ అతని ఎదుట నిలిచి అతనితో ఇలా అన్నాను - " చెలికాడవని తొందరపడి పరిహాసం కోసం ఇలా చేశాను. నన్ను క్షమించు. శాపాన్ని మరలించు". అతడు కూడా ఉద్విగ్న మనస్కుడై, మాటిమాటికి వేడినిట్టూర్పులు విడుస్తూ మిక్కిలి తొట్రుపాటుతో నన్ను ఉద్దేశించి ఇలా అన్నాడు - "నా నోట అసత్యం రాదు. ఎలాగూ ఇది జరగవలసినదే. తపోధనా! అనఘా! నేను చెప్పబోయే మాటవిను. విని ఈ మాటను నీ ఎదలో ఎల్లప్పుడూ పదిలంగా దాచుకో. ప్రమతికి రురువనే పేరుగల పవిత్రుడైన కొడుకు పుడతాడు. అతనిని చూడగానే వెంటనే నీకు శాపవిముక్తి కాగలదు." రురుడనే పేరుతో ప్రఖ్యాతి చెందిన ప్రమతి కుమారుడవు నీవే కదా! నేను నారూపాన్ని పొంది నీకు హితం చెపుతాను.

ఆ విప్రోత్తముడు డుండుభశరీరాన్ని విడిచి ప్రకాశవంతమైన స్వరూపాన్ని తిరిగి పొందాడు. ఆ కీర్తిమంతుడు సాటిలేని ఓజస్సు కల రురువును ఉద్దేశించి ఇలా అన్నాడు - "సమస్తప్రాణులలో శ్రేష్ఠుడా!<u>అహింస పరమ ధర్మం.</u>

కాబట్టి బ్రాహ్మణుడైనవాడు ఎప్పుడూ కూడా సమస్త ప్రాణులలోను దేనినీ హింసించ కూడదు. "బ్రాహ్మణుడు సౌమ్యుడుగానే ఉండాలి." అని ఉత్తమమైన వేదం చెపుతోంది. అతడు (బ్రాహ్మణుడు) వేదవేదాంగవేత్త, సర్వప్రాణులకు అభయప్రదాత అయి ఉండాలి. అహింస, సత్యవాక్యం, క్షమ, వేదాలను ధారణచేయడం బ్రాహ్మణునకు ఉత్తమ ధర్మాలని నిశ్చయింపబడింది. క్షత్రియ ధర్మం నీకు ఉచితమైనది కాదు. రురూ! దండధారణ, ఉగ్రత, ప్రజాపరిపాలన అనేవి క్షత్రియులకు విధింపబడిన కర్మలు. నేను చెప్పేది విను. పూర్వం జనమేజయుడు చేసిన యజ్ఞంలో సర్పాలన్నీ హింసింపబడ్డాయి. ద్విజోత్తమా! ఆ సర్పయాగంలో బ్రాహ్మణముఖ్యుడు, వేదవేదాంగ పారంగతుడు, తపోవీర్య బలసంపన్నుడు అయిన ఆస్తీకుడు భయపడిన సర్పాలకు ప్రాణరక్షణ కల్పించాడు.'

12. సర్పయాగమును గురించి రురుడు తండ్రిని అడిగి తెలిసికొనుట.

రురువు అడిగాడు– "ద్విజోత్తమా! ఆ జనమేజయమహారాజు సర్పాలను ఎలా హింసించాడు? అయినా సర్పాలను యజ్ఞంలో ఎందుకు చంపించాడు ? విప్రోత్తమా ! బుద్ధిమంతుడైన ఆ ఆస్తీకుడు ఎందుకు సర్పాలను రక్షించాడు? అంతా సవిస్తరంగా వినాలని ఉంది" ఋషి అన్నాడు – "రురూ! గొప్పదైన ఆస్తీకచరితం అంతా బ్రాహ్మణులు చెపుతూంటే నీవు విందువుగాని" అని చెప్పి అతడు అంతర్ధానమయ్యాడు. ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు – రురువు అదృశ్యమైన ఆ మునిని వెదకుతూ ఆ అడవి అంతా అన్నివైపుల పరుగెత్తి గాలించాడు. చివరికి అలసిపోయి నేలపై పడిపోయాడు. అతనికి మూర్ఛవచ్చి స్మృతి తప్పిన వానిలా అయిపోయాడు. ఆ ఋషి యొక్క మాటలలో నిజమెంతో అని మాటిమాటికి ఆలోచిస్తూ తెలివి వచ్చాక ఇంటికి వచ్చాడు. తండ్రికి అదంతా చెప్పాడు. అతడు అడిగిన వెంటనే తండ్రి యావద్వృత్తాంతాన్ని అతనికి వినిపించాడు.

13. జరత్కారుడు పితరుల ఆజ్ఞతో వివాహమునకు అంగీకరించుట.

శౌనకమహర్షి సూతపుత్రుని అడుగుతున్నాడు. 'ఉగ్రశ్రవసా! ఉత్తముడైన జనమేజయుడు ఎందుకు సర్పయాగం చేశాడు? సర్పాలను ఎందుకు నశింపజేశాడు? ఈ విషయాన్ని నాకు వివరంగా చెప్పవలసినదిగా కోరుతున్నాను. బ్రాహ్మణోత్తముడైన ఆస్తీకుడు యాగాగ్నిలో ధ్వంసం అవుతున్న సర్పాలను ఎట్లా రక్షించాడు? సర్పయాగం చేసిన జనమేజయుడు ఎవరికుమారుడు? ఆ ఆస్తీకుడు ఎవరి పుత్రుడు? ఈ విషయాలను నాకు వివరించి చెప్పవలసినది.' శౌనకమహర్షికి ఉగ్రశ్రవసుడు ఈ విధంగా చెప్తున్నాడు. 'బ్రాహ్మణోత్తమా! ఆస్తీకుని గురించిన కథ చాలాపెద్దది. నీ కోరిక ప్రకారం పూర్తిగా ఆస్తీకుని కథను చెప్తాను. విను. శౌనకుడు ఇలా అన్నాడు. ఋషిపుంగవుడు, బ్రాహ్మణోత్తముడూ అయిన ఆస్తీకుని వృత్తాంతం సుందరమయినదిగదా! ఆ కథను పూర్తిగా వినాలని కుతూహలపడుతున్నాను. సౌతి శౌనకునకు చెపుతున్నాడు. తాపసోత్తమా! విజ్ఞానులందరూ ఈ కథ చాల పురాతనమైనదని చెపుతున్నారు. కృష్ణద్వైపాయనుడు (వ్యాసభగవానుడు) కథను చెప్పాడు. పూర్వం నా తండ్రి లోమహర్షణుడు వ్యాసుని శిష్యునిగా ప్రఖ్యాతి కెక్కాడు. అతడు నైమిశారణ్యవాసులకు భారత కథను చెప్పాడు. మాతండ్రి వలన ఈ కథను విని నేను నీకు ఉన్నదున్నట్లు చెపుతున్నాను. ఈ ఆస్తీకుని వృత్తాంతం వింటే సర్పపాపాలు నశిస్తాయి. అటువంటి ఆఖ్యానాన్ని నీవు అడిగావు. కాబట్టి పూర్తిగా ఈ వృత్తాంతాన్ని నీకు చెప్తాను. ఆస్తీకుని తండ్రి బ్రహ్మతో సమానుడు. అతడు బ్రహ్మచారిగా

ఉంటూ ఆహారనియమాలను పాటిస్తూ, ఉగ్రమైన తపస్సు చేసుకొంటూ, ఉండేవాడు. అలా శరీరాన్ని కృశింపజేసుకొంటున్న కారణంగా ఆ బ్రాహ్మణునికి జరత్కారువు అనేపేరు సార్థక మయింది. అతడు మహాతపస్సంపన్నుడు. బ్రహ్మచారిగా సంయమనంతో జీవయాత్ర సాగిస్తున్నాడు. యాయావరవంశంలో ప్రఖ్యాతిని పొందిన ధర్మజ్ఞుడు. కఠినమైన వ్రతాల్ని చేస్తున్నాడు. తీర్థయాత్రలు చేస్తూ సూర్యాస్తమయసమయానికి ఉన్న గ్రామంలోనే ఆ మహానుభావుడు ఆ రాత్రి గడిపేవాడు. అతడు అన్నితీర్థాల్లోను స్నానం చేస్తూ దేశం అంతా తిరుగుతున్నాడు. మహాతేజోవంతు డయిన ఆ జరత్కారువు మోక్షాన్ని కోరి ప్రాపంచికసుఖాలకు దూరంగా ఉంటూ జీవయాత్రను సాగిస్తున్నాడు. ఆ తాపసోత్తముడు భోగాసక్తి మానేసి గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తున్నాడు. నిద్రను కూడా జయించాడు. ప్రకాశిస్తున్న అగ్నిలా వెలిగిపోతూ దేశాటనం చేస్తున్నాడు. ఆ విధంగా తిరుగుతూ ఉన్న అతడు ఒక పెద్దగుంటలో తలక్రిందులుగ వ్రేలాడుతున్న తన తాతలను చూశాడు.

వారిని చూసి జరత్కారువు ఈ విధంగా ప్రశ్నించాడు. "మీరు ఎవరు ? ఒకే ఒక వేరుతో ఉన్న ఈ చెట్టుకొమ్మకు ఎందుకు తలక్రిందులుగా వేళ్లాడుతున్నారు? ఈ గుంటలో రహస్యంగా ఉంటున్న ఎలుక ఈ వట్టి వేళ్ల నన్నిటినీ కొరికి వేసింది గదా! మిగిలింది ఒక వేరే కదా!". అతని పితరులు ఇట్లా చెపుతున్నారు. "బ్రాహ్మణా! మేము ఒక్కొక్క గ్రామంలో ఒక్కరోజు మాత్రమే ఉండి మరునాడు మరొక గ్రామానికి వెడుతూ ఉంటాము. అందుచేత మా వంశానికి యాయావరవంశమని పేరు వచ్చింది. మేము కఠినమైన వ్రతాలు చేసుకొంటూ సంచరిస్తున్నాము. మా సంతానం నశిస్తూండటం వలన మేము అధోలోకానికి పోతున్నాం. మా సంతతిలో జరత్కారువు అనే ఒక అభాగ్యుడు ఉన్నాడు. అతడు దురదృష్టవశాత్తు మా వంశంలో పుట్టి కఠిన తపస్సుతో మోక్షం పొందాలని జీవయాత్ర సాగిస్తున్నాడు. సంతానం మీద కోరిక లేకపోవడం చేత ఆ మూర్ఖుడు వివాహం చేసుకోవడం లేదు. కాబట్టి మా వంశం నశిస్తున్న కారణంగా ఈ గుంటలో వ్రేలాడుతున్నాం. జరత్కారువు సంతానం పొందకపోతే మేమందరం నరకానికి పోవలసిందే సుమా! పాపకర్ములమైన మేము అనాథులం. మహానుభావా! నీవెవ్వరవు? మా బంధువువలె దుఃఖంతో ఉన్న మమ్ముచూచి దయ చూపుతున్నావు గదా! నాయనా ! నీవు ఎవ్వరివో తెలుసుకొన గోరుతున్నాము. మా దుఃస్థితిని చూచి నీవు ఎందుకు విచారపడుతున్నావు?" ఆ మాటలను విన్న జరత్కారువు "మహాత్ములారా! మీరందరు నాపితామహులనీ, పితృగణంలోని వారనీ తెలుసుకొని ఆనందిస్తున్నాను. నన్ను జరత్కారువు అంటారు. నేను ఇపుడేమి చేయవలెనో నాకు తెలియజేయగోరుతున్నాను" అన్నాడు.

"నాయనా! మన వంశాన్ని నిలపడానికి సంతానం పొందే ప్రయత్నం చెయ్యి. నీ ఊర్ధ్వగతికి, మా ఉద్ధరణకు మాత్రమే కాకుండా ధర్మోద్ధరణకు కూడా సంతానాన్ని పొందాలి. పుత్రులుకలవారు పొందే లోకాలను ఇతరులు ఎంతగొప్ప తపస్సుచేసినా, ఎన్ని దానాలు చేసినా, ఎన్ని యజ్ఞాలు చేసినా పొందలేరు. కుమారా! ఆ కారణంచేత వివాహం చేసుకో. సంతానాన్ని పొందు. మమ్మల్ని ఊర్ధ్వలోకాలకు పంపించు. ఇదే మాకు చాలా ఇష్టం అన్నారు పితరులు అపుడు జరత్కారువు వారితో ఇట్లా అన్నాడు. పితామహులారా! నేను జీవితంలో సుఖభోగాలకోసం ఆశపడటంలేదు. మీ మేలుకోరి మాత్రమే ఇపుడు నేను వివాహం చేసుకోవాలనుకొంటున్నాను.

అయితే ఒక నిబంధనకు లోబడి మాత్రమే శాస్త్రోక్తంగా వివాహం చేసుకొంటాను. ఆ కన్యక నాపేరుగలదై ఉండాలి. ఇదే నా నిబంధన. నా పేరుగల కన్యను బంధువులిస్తే భిక్ష వలె స్వీకరిస్తాను. ఆమెను ధర్మయుక్తంగా వివాహం చేసుకొంటాను. దరిద్రుడనైన నాకు ఎవరు అట్టి కన్యను భార్యగా ఇస్తారు? ఎవరయినా అనుగ్రహించి దానంచేస్తే ఆ కన్యను తప్పక వివాహం చేసుకొంటాను. పితామహులారా! నేను ఈ విధంగా వివాహం చేసుకోడానికి తప్పక ప్రయత్నం చేస్తాను. లేదా విరమిస్తాను. ఆ విధంగా నాకు లభించిన భార్యయందు జన్మించే కుమారుడు మిమ్మల్ని తప్పకుండా ఉద్ధరిస్తాడు. కాబట్టి మీరు మీ శాశ్వతస్థానాలకు వెళ్లి ప్రశాంతంగా, ఆనందంగా ఉండండి."

14. జరత్కారుని వివాహము.

ఉగ్రశ్రవసుడు ఇలా చెపుతున్నాడు. అనంతరం జరత్కారుడు తన నియమానుసారం లభించే కన్యను వివాహం చేసుక్కోవటం కోసం దేశాలన్నీ తిరిగాడు. కాని అతని కోరిక నెరవేరలేదు. అతడు ఒకనాడు అడవికి వెళ్లి అక్కడ పితరుల మాటలు స్మరించుకొని 'సనామ్ని అయిన కన్యక వివాహార్థమై నాకు లభించేటట్లు చేయవలసిన' దని ముమ్మారు ప్రార్థించాడు. ఆ మాటలను నాగరాజయిన వాసుకి విని, తన చెల్లెలయిన జరత్కారువును అతని కడకు తీసుకొని వచ్చి "నాచెల్లెలిని భిక్షగా స్వీకరింపుమని" కోరాడు. జరత్కారువు తనపేరుగల కన్యక లభిస్తే స్వీకరిస్తా నని లేనిచో వివాహమాడ ననీ చెప్పాడు. నా పేరుగల కన్యకను మాత్రమే భార్యగా స్వీకరిస్తాను అని జరత్కారుడు తన మనస్సున నిశ్చయించుకొన్నాడు గదా! జరత్కారువు వాసుకితో "మహానుభావా! నీ సోదరి పేరు ఏమిటి? నాకు నిజాన్ని చెప్పు" అన్నాడు. వాసుకి జరత్కారునితో "ఈమె నాచెల్లెలు. పేరు జరత్కారువు. ఈమెను నీవు భార్యగా స్వీకరించు" అన్నాడు. ఈ విధంగా చెప్పిన

తరువాత జరత్కారుడు ఆమెను శాస్త్రోక్తంగా వివాహమాడి భార్యగా స్వీకరించాడు.

15. ఆస్తీకుని జన్మవృత్తాంతము.

ఉగ్రశ్రవసుడు ఈ విధంగా చెప్పాడు - "శౌనకమహర్షీ! పూర్వము నాగమాత అయిన కద్రువ తన కుమారులైన సర్పాలకు "మీరు జనమేజయుడు చేసే యజ్ఞంలో అగ్నిలో భస్మమగుదురుగాక" అని శాపమిచ్చింది. ఆ శాపానికి బలికాకుండా ఉండటానికి వాసుకి ఆ జరత్కారునకు తన చెల్లెలిని ఇచ్చి వివాహం చేశాడు. అతడు కూడా శాస్త్రోక్తంగా వివాహం చేసుకొన్నాడు. ఆ దంపతులకు ఆస్తీకుడు అనే కుమారుడు జన్మించాడు. ఆ ఆస్తీకుడు మహాతపస్వి. వేదవేదాంగాలలో పండితుడు. మహాత్ముడు. సర్పులయందు సమదృష్టి కలవాడు. అటు పితృవంశానికి, ఇటు మాతృవంశానికి భయాన్ని తొలగించి ఆనందం కల్గించేవాడు. తరువాత కొంతకాలానికి పాండవవంశంవాడైన జనమేజయ మహారాజు సర్పయాగాన్ని తలపెట్టాడు. సర్పయాగంలో పాములు నశిస్తూండగా మహాతపస్సంపన్నుడైన ఆస్తీకుడు ఆ యజ్ఞశాలకు వచ్చి, సర్పయాగాన్ని ఆపించి, తన మాతృవంశాన్ని రక్షించాడు. సర్పయాగం మాన్పించి తన మేనమామల్ని, సోదరుల్ని, ఇతర సర్పాల్ని అందరిని రక్షించాడు. అట్లాగే జరత్కారుని పుత్రుడవటం ద్వారా తన పితామహులకు ఊర్ధ్వలోకాన్ని కల్పించి ఉపకారం చేశాడు ఆస్తీకుడు. బ్రాహ్మణోత్తమా! ఆ ఆస్తీకుడు భృగుమహర్షి కుమారుడైన చ్యవనునికడ వేదవేదాంగాలను అభ్యసించాడు. అనేకవ్రతాలు, యజ్ఞయాగాదులు చేసి దేవతల్ని, పితృదేవతల్ని ఎంతగానో సంతోషపరచాడు. తరువాత ఆస్తీకుడనే కొడుకును కని ఉత్తమధర్మాచరణం చేసి జరత్కారుడు చాలాకాలానికి స్వర్గం చేరాడు. ఇది ఆస్తీకుని చరిత్ర. ఉన్నదంతా నీకు చెప్పాను. భార్గవోత్తమా! ఇంకా నేను నీకు ఏమి చెప్పాలో చెప్పు.

16. కద్రూ వినతలు పుత్రులను పొందుట.

శౌనకుడు అన్నాడు. 'సూతకుమారా! ఈ ఆస్తీకుని కథను విస్తరించి ఇంకా పూర్తిగా చెప్పు. ఈ మహాత్ముని కథను వినాలని మాకు చాలా కుతూహలంగా ఉంది. మీరు చక్కగా చెపుతున్నారు. మీరు చెప్పే కథలోని ప్రతీ అక్షరం, ప్రతీ పదం చాలా వినసొంపుగా ఉన్నాయి. ఈ కథాశ్రవణం వల్ల మాకు మనశ్శాంతి కల్గుతున్నది. మీరు తండ్రివలె చెపుతున్నారు. మీ తండ్రిగారు మా సేవలతో ఆనందించారు. మీ తండ్రిగారు చెప్పిన ప్రకారం ఆ ఆస్తీకుని కథను మీరు కూడా మాకు చెప్పండి.' ఉగ్రశ్రవసుడు

వారితో ఇట్లా చెపుతున్నాడు. 'ఆయుష్మంతుడా ! నా తండ్రి వలన విన్న ఆస్తీకుని కథను యథాతథంగా మీకు ఇప్పుడు చెప్తాను. పూర్వం సత్యయుగంలో దక్షప్రజాపతికి కద్రువ, వినత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిద్దరు కశ్యప ప్రజాపతికి భార్య లయ్యారు. ఆ కశ్యపుడు తన భార్యలిద్దరికీ సంతోషపూర్వకంగా వరాలు ఇచ్చాడు. మీ ఇష్టం వచ్చిన వరాల్ని కోరుకొమ్మని చెప్పాడు. ఆ భార్యలిద్దరూ ఎంతో సంతోషపడ్డారు. కద్రువ వేయిమంది సమతేజులయిన సర్పాలు పుత్రులుగా కావాలని వరం కోరింది. కద్రూపుత్రులకంటె అధికమైన బలపరాక్రమాలూ, శరీరమూ, తేజస్సూ కల ఇద్దరు కుమారులను ప్రసాదించవలసినదిగా వినత అడిగింది. కశ్యపప్రజాపతి వినత కోరికను మన్నించి, ఆ విధంగా ఇద్దరు కుమారులు కలిగేటట్లు ఆమెకు వరం ఇచ్చాడు. ఆ వరప్రసాదానికి వినత చాలా సంతోషించింది. తన జన్మ కృతార్థత చెందిందని భావించింది. కద్రూపుత్రుల కంటె గొప్ప కుమారులు జన్మిస్తారని ఆనందించింది. కద్రూ వినతలు వరాల ననుసరించి గర్భాలు ధరించారు. కశ్యపుడు "మీ గర్భాలను యథావిధిగా రక్షించుకోండి" అని చెప్పి, తపస్సుకై వనానికి వెళ్లిపోయాడు. చాలాకాలానికి కద్రువ వేయి గుడ్లను, వినత రెండు గుడ్లను కన్నారు. ఆ అండాలను వారి సేవకురాండ్రు పైకి చెమర్చే నేతికుండలలో పెట్టి కాపాడుతున్నారు. 500 సంవత్సరాల తరువాత ఆ అండాలనుండి కద్రూపుత్రులు పుట్టారు. కాని వినత అండాలు మాత్రం ఫలింపలేదు.

తన అండాలు బ్రద్దలుకాలేదని వినత సిగ్గుపడి ఒక అండం చితుకగొట్టింది. ఆ అండంనుండి ఊర్ధ్వభాగ శరీరంమాత్రమే కలిగిన కుమారుడు ఉదయించాడు. ఆ విధంగా అర్ధభాగంతో జన్మించిన కుమారుడు తల్లితో "అమ్మా! దురాశాపరురాలవై నన్ను అర్ధశరీరునిగా చేశావు. కావున నీవు నీ సవతికి 500 సంవత్సరాలు దాసిగా ఉండి సేవించు" అని శపించాడు. 'నీకు పుట్టబోయే రెండవకుమారుడు నీ దాస్యాన్ని తొలగిస్తాడు. ఆ అండాన్ని కూడా చిదిపి అతనిని కూడా నిశ్శరీరునిగానో, అర్ధశరీరునిగానో చేయకు. జాగ్రత్తగా కాపాడుకో! కాబట్టి ధైర్యంగా ఉంటూ 500 సంవత్సరాలూ జాగ్రత్తగా ఈ అండాన్ని కాపాడుకో. అతని జన్మకోసం నిరీక్షించు అని కూడా సూచించాడు. ఈ విధంగా ఆ కుమారుడు తల్లి అయిన వినతను శపించి ఆకాశమార్గాన వెళ్లిపోయాడు. బ్రాహ్మణోత్తమా! అది ప్రాతఃకాల సమయం. సూర్యదర్శనం చేసుకొన్నాడు. సూర్యరథం మధ్యలో కూర్చుండి ఆదిత్యరథానికి సారథిగా అనుగ్రహింపబడ్డాడు ఆ అనూరుడు. అనంతరకాలంలో గరుడుడు జన్మించాడు. పుట్టినవెంటనే తల్లియగు వినతను విడిచి ఆకాశానికి ఎగిరిపోయాడు. భృగువంశోత్తమా! ఆకలిగా ఉన్న అతనికి బ్రహ్మ నియతమైన ఆహారాన్ని కల్పించాడు.

17. అమృత మథనము.

సూతుడు శౌనకాదులకు చెప్పాడు. 'ఒకనాడు ఆ కద్రూవినతలు సముద్రతీరానికి విహారం కోసం వెళ్లినపుడు ఉచ్చైఃశ్రవమనే గుఱ్ఱాన్ని చూశారు. అది దేవదానవులు అమృతంకోసం పాలసముద్రాన్ని మథిస్తున్నపుడు పుట్టింది. దాన్ని వారందరూ ఎంతో గొప్పగా పూజించారు. ఆ అశ్వరాజం అమోఘ మయిన బలం కలిగి సర్వశుభలక్షణాలతో సుందరంగా ఉంది.' అపుడు శౌనకుడు సూతునితో "దేవతలు అమృత సంపాదనకై పాలసముద్రాన్ని ఎట్లా మథించారు? ఆ అశ్వరాజం ఎలా వచ్చింది ? దీన్ని సవిస్తరంగా చెప్పు" అని అడిగాడు.

అపుడు సౌతి ఆ కథను చెపుతున్నాడు. 'శౌనకా! మేరువు అనే ప్రసిద్ధపర్వతం ఒకటి ఉంది. అది గొప్ప తేజోరాశి. దాని బంగారు శిఖరాలు సూర్యకాంతి కంటె కూడా మిక్కిలి ప్రకాశవంతంగా ఉంటాయి. ఆ బంగారుపర్వతంపై దేవతలు, గంధర్వులు నివాసం ఉంటారు. ఆధర్మపరులైన జనులకు అది భావింపరానిది, ఎక్కరానిది. అక్కడ భయంకరసర్పాలు, దివ్యఔషధాలు ఉన్నాయి. ఆ మహాపర్వతం తన శిఖరాలతో స్వర్గాన్నే ఆక్రమించి నట్లున్నది. మహానదులతోను, వృక్షాలతోను, అనేకపక్షుల కలకల ధ్వనులతోను కూడిన ఆపర్వతాన్ని అందరూ చేరలేరు. ఆకాశం వలె ఎత్తయిన ఆ పర్వతశిఖరం అనేకరత్నాలతో ప్రకాశిస్తోంది. అక్కడ తపోనియమాలు కల దేవతలందరూ చేరి అమృతం పొందడానికి ఉపాయం ఏమిటా? అని ఆలోచింపసాగారు.

అపుడు శ్రీమన్నారాయణుడు బ్రహ్మతో "మీరూ, దానవులూ పాలసముద్రాన్ని చిలకండి. ఆ మహాసముద్రం నుండి అమృతం ఉద్భవిస్తుంది. దేవతలారా! ఆ సముద్రంలో ముందు సకల ఔషధాల్ని, అన్నిరకాల రత్నాలనూ పొంది ఇంకా మథించండి. అపుడు అమృతం వస్తుంది.'

18. విష్ణుమూర్తి మోహినీరూపమును ధరించి అమృతమును రక్షించుట.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. 'దేవతలందరూ మందరపర్వతం దగ్గరకు వెళ్లారు. నీలివర్ణశిఖరాలతో, అనేకలతాసమూహాలతో కూడినది ఆ మందరపర్వతం. అది అనేక పక్షులకు నివాసం. సింహాలకు, వ్యాఘ్రాలకు, తదితర జంతుసమూహానికి అది స్థానం. అక్కడ దేవతలు, అప్సరలు విహరిస్తూంటారు. అది 11000 యోజనాల ఎత్తూ, అంతే లోతునూ కలిగి ఉంది. వారందరూ ఎంత ప్రయత్నంచేసినా ఆ పర్వతం ఎత్తలేకపోయారు., అందరూ మరల విష్ణుని, బ్రహ్మనూ ఇలా ప్రార్థించారు. 'మీరిద్దరూ సద్బుద్ధితో ఆలోచించి, మన మేలుకోసం మందరపర్వతం ఉద్ధరించడానికి ప్రయత్నం చేయండి.' ఉగ్రశ్రవసుడు

అంటున్నాడు. 'భృగుశ్రేష్ఠా! విష్ణుమూర్తి, బ్రహ్మకూడా 'అలాగే' అని అందుకు సిద్ధమయ్యారు. విష్ణుమూర్తి సర్పరాజైన అనంతుని ఆ పర్వతసముద్ధరణకు ప్రేరేపించాడు. అనంతరం విష్ణుమూర్తి బ్రహ్మదేవుల ఆజ్ఞతో మహాపరాక్రమవంతు డైన అనంతుడు లేచి కార్యసిద్ధికి పూనుకొన్నాడు. మహాబలవంతు డయిన అనంతుడు మహోత్సాహంతో వృక్షాదులతో సహా ఆ పర్వతాన్ని లేవనెత్తాడు. అనంతరం అనంతునితో కలిసి దేవత లందరూ అమృతంకోసం సముద్రాన్ని మథిద్దామని అన్నారు. అపుడు సముద్రుడు వారితో "మందరభ్రమణం వల్ల కలిగే బాధను నేనూ భరిస్తాను. ఆ అమృతంలో నాకు కూడా కొంచెం భాగం ఇవ్వండి" అని కోరాడు. అనంతరం కూర్మరాజును (తాబేలును) మందర పర్వతానికి అడుగుభాగాన మట్టుగా ఉండుమని అడిగారు. ఆ తాబేటిరాజు "అట్లే" అని తన అంగీకారం తెల్పి ఆ మందరానికి అడుగుగా ప్రవేశించినది. దేవేంద్రుడు ఆ కూర్మరాజు పైచిప్పను తన వజ్రాయుధంతో చీల్చి, సవరించాడు. దానిపైన అనంతుని సహాయంతో మందరాన్ని ఉంచారు. దేవదానవులు మందరపర్వతాన్ని కవ్వంగా చేసుకొన్నారు. సర్పరా జయిన వాసుకిని తాడుగా చేసుకొని సముద్రాన్ని మథించడానికి ప్రారంభించారు. నాగరాజయొక్క ముఖభాగాన్ని రాక్షసులు, తోకభాగాన్ని దేవతలు పట్టుకొని మథనం చేయసాగారు.

అనంతుడు ఎక్కడ ఉంటాడో శ్రీమన్నారాయణమూర్తి కూడా అక్కడే ఉంటాడు. మాటిమాటికి వాసుకి శిరస్సును పైకి ఎత్తి నిట్టూరుస్తున్నాడు. నిరంతరం దేవతలు వేగంగా లాగుతూ ఉండటంచేత వాసుకి ముఖం నుండి ఎడతెగని మంటలతో, పొగలతో కూడిన వాయువులు వెలువడుతున్నాయి. ఆ పొగలవల్ల ఏర్పడిన మేఘసమూహాలు విద్యుత్ప్రభలతో కూడిన వర్షాన్ని కురిపించి, వారి శ్రమను పోగొడుతున్నాయి. మందరం అటుఇటు కదలుతూ ఉండటంచేత ఆ పర్వత శిఖరాగ్రం నుండి దేవదానవులపై పుష్పవర్షం కురిసింది. దేవదానవులు మందరంతో సముద్రాన్ని చిలుకుతూ ఉంటే సముద్రంలో మేఘగంభీరమైన ధ్వని వినిపించింది. మహాపర్వతసంఘర్షణ చేత అందలి జలజంతువులన్నీ సముద్రంలోని ఉప్పు నీటిలో విలయం పొందాయి. ఆ పర్వతం వల్ల ఆ సముద్రం అడుగున ఉన్న పాతాలంలోని ప్రాణులన్నీ నశించాయి. ఆ మథనసమయంలో పర్వతశిఖరంపై ఉన్న వృక్షాలు, వాటితోపాటు పక్షులు అన్నీ పడిపోయాయి. ఆ పర్వతసంఘర్షణ వలన పుట్టిన అగ్నిజ్వాలలు ఆకాశంలో మెఱుపుతీగల్లాగా మందరపర్వతాన్ని ఆవరించాయి. అక్కడ నివాసం ఉండే ఏనుగులు, సింహాలు, అనేక జంతువులు చనిపోయి, వెలికి వచ్చాయి. అమరాధిపతియైన ఇంద్రుడు మేఘాలను వర్షింపజేసి చుట్టూ ఆవరించిన ఆ

అగ్నిని చల్లార్చాడు. అపుడు ఆ పర్వతశిఖరంపై ఉన్న వృక్షాలనుండి జిగురులు, ఓషధులు అన్నీ ఆ మహాసముద్రంలో పడ్డాయి. వృక్షాలతో, ఓషధులతో కూడి అమృతతుల్యమైన ఆ సముద్రజలం స్వర్ణాలతో అనేక మణులతో కూడి దేవతలను అమరత్వం పొందించినది. ఆ విధంగా అనేకరసమిశ్రితమైన సముద్రజలం నుండి పాలు, దానినుండి ముందుగా నేయి ఉద్భవించాయి. అపుడు అక్కడ కూర్చున్న వరదుడైన బ్రహ్మతో దేవతలు ఈ విధంగా అన్నారు. "నారాయణుడు తప్ప మిగిలిన దేవదానవులమందరం అలసిపోయాం. ఎంతకాలంగా మథిస్తూ ఉన్నా అమృతం పుట్టటంలేదు గదా!" ఈ మాటలను విన్న బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణునితో "పరమాత్మా! ఈ విషయంలో మీశక్తిని ప్రసాదించండి. మీరే మాకు దిక్కు" అన్నాడు.

అపుడు శ్రీమన్నారాయణుడు వారితో "మీ అందరికీ అధికబలం ఇస్తున్నాను. అందరూ కలిసి పాలసముద్రాన్ని మందరంతో మథించండి". అని అభయమిచ్చాడు. ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు - పరమాత్ముని మాటలను విని బలిష్ఠులైన వారంతా మరల సముద్రాన్ని మథించడానికి పూనుకొన్నారు. అప్పుడు ఆ మహాసముద్రం నుండి అనంతకిరణాలతో, చల్లనిప్రకాశంతో, శాంతరూపంతో చంద్రుడు ఉద్భవించాడు. తదనంతరం ఆ ఘృతరూపజలంనుండి శ్వేతవస్త్రాన్ని ధరించిన లక్ష్మీదేవి ఉద్భవించింది. అనంతరం సురాదేవి, పిదప తెల్లని గుఱ్ఱమూ ఉద్భవించాయి. ఆ నేతితో కూడిన జలంలో నుండి దివ్యమైన కౌస్తుభరత్నం పుట్టింది. దానిని శ్రీమన్నారాయణుడు తన వక్షఃస్థలంపై అలంకరించుకొన్నాడు. మహర్షీ! పారిజాత వృక్షమూ, కామధేనువూ సర్వులు కోరిన ఫలాలనూ ఇస్తూ అక్కడనుండే పుట్టాయి. లక్ష్మీదేవి, సురాదేవి, చంద్రుడు, ఉచ్చైఃశ్రవమనే మనోవేగం కల గుర్రమూ దేవతలను చేరాయి. ఆ దేవదానవులు ఇంకా ఉత్సాహంతో మథిస్తుండగా తెల్లని కమండలంలో అమృతాన్ని నింపుకొని ధన్వంతరి ఉద్భవించాడు. ఈ అద్భుతాన్ని చూచాక దానవులలోంచి అమృతంకోసం "ఇది నాది, ఇదినాది" అనే శబ్దాలు వెలువడుతున్నాయి. అనంతరం తెల్లని నాల్గుదంతాలతో కూడిన ఐరావతం అనే ఏనుగు ఉద్భవించింది. దీనిని దేవేంద్రుడు స్వీకరించాడు. అతిగా సముద్రాన్ని మథించడం వల్ల సముద్రం నుండి కాలకూట విషం పుట్టింది. అది పొగలతో, సెగలతో అంతటా వ్యాపించింది. ఆ విషగంధం ముల్లోకాలకూ వ్యాపించి ప్రాణికోటిని బాధిస్తున్నది. అపుడు బ్రహ్మదేవుని ప్రార్థనతో లోకరక్షణకోసం శివుడు ఆ విషాన్ని నోటిలోకి లాక్కున్నాడు. అపుడు మహాశివుడు ఆ విషాన్ని తన కంఠంలోనే ఉంచాడు. అప్పటినుండి పరమేశ్వరుడు నీలకంఠుడుగా పేరుపొందాడు. ఈ అద్భుతాన్ని చూచిన దానవులు నిరాశులై అమృతం కోసం, లక్ష్మికోసం

దేవతలతో వైరందాల్చి వెనగులాడుతున్నారు. అపుడు శ్రీమన్నారాయణమూర్తి మాయామోహినీ రూపాన్ని ధరించి అద్భుతమైన జగన్మోహిని రూపంతో దానవు లందరినీ ఆకర్షించాడు. అపుడు మూఢులైన దానవులు అమృతాన్ని మోహపరవశులై ఆ సుందరి చేతికిచ్చారు.

(మోహినీ రూపంలో ఉన్న నారాయణుడు ఆ కమండలాన్ని పట్టుకొన్నాడు. దైత్యులంతా పంక్తిలో కూర్చున్నారు. మోహిని దేవతలకు అమృతం పోసింది. దైత్యులకు పోయలేదు. దానితో దైత్యులంతా గోలపెట్టారు.)

19. దేవదానవ యుద్ధము.

ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు - దైత్యదానవులు అందరూ ఏకమై కవచాది - అస్త్రశస్త్రాలతో దేవతలపై ఉరికారు. అపుడు నరునితో కూడిన మహావిష్ణువు దానవేంద్రుల నుండి అమృతభాండాన్ని తీసుకొని దేవతలకు పంచుతున్నాడు. దేవతలందరూ అమృతపానం చేస్తున్నారు. అపుడు రాహువు అనే రాక్షసుడు దేవతారూపంలో వారిమధ్య కూర్చుండి అమృతపానం చేశాడు. రాహువు కంఠంలో అమృతం పడిందో లేదో ఈవిషయాన్ని గమనించిన సూర్యచంద్రులు దేవతల మేలు కోరి నారాయణమూర్తికి చెప్పారు. అపుడు వెంటనే తన చక్రాయుధంతో నారాయణుడు రాహుకంఠాన్ని తెగగొట్టాడు. అమృతం కంఠంక్రిందికి దిగకముందే చక్రం ప్రయోగించడంతో దేహం క్రిందపడింది. కంఠం మాత్రం సజీవంగా ఉంది. పర్వతశిఖరంలా ఉన్న ఆ రాక్షసుని శిరస్సు చక్రంచేత ఛేదింపబడి అతిభయంకరంగా ధ్వనించింది. రాహువు యొక్క మొండెం భూమిమీద పడింది. పడినపుడు పర్వతాలు, అడవులు, భూమి కంపించాయి. ఆ నాటినుండి రాహువు సూర్యచంద్రులపై విరోధంతో వారిని మ్రింగుతూనే ఉన్నాడు. దేవతలు అమృతాన్ని తాగిన పిదప, విష్ణువు మోహినీ రూపాన్ని విడిచి, భయంకరమైన అస్త్రశస్త్రాలతో రాక్షసుల్ని భయకంపితుల్ని చేశాడు. లవణసముద్రం దగ్గర యుద్ధం ప్రారంభ మయింది. దేవదానవుల యుద్ధం భయంకరంగా జరిగింది. ప్రాసం, కుంతం, తోమరం మొదలయిన ఆయుధాల్ని, అనేక శస్త్రాల్ని ప్రయోగిస్తూ యుద్ధం చేశారు. నారాయణుని చక్రప్రహారంతో రాక్షసులు నెత్తురు క్రక్కుకొన్నారు. ఖడ్గం, శక్తి, గద మొదలయిన ఆయుధాల దెబ్బలతో వారు నేలకూలారు. బంగారు కాంతులతో ప్రకాశించే పట్టిశం అనే ఆయుధంతో ఎందరో రాక్షసులు మరణించారు. శరీరం అంతా రక్తంతో తడిసి రాక్షసులు అందరూ గైరికాది ధాతువులతో కూడిన పర్వతాలలాగ నేలకూలారు. అనేకులు వేలకొద్దీ హాహాకారాలు చేశారు. సూర్యాస్తమయ సమయానికి వారందరూ హతులయ్యారు. తీక్ష్ణమైన పరిఘ అనే

ఆయుధంతో కొంతసేపు యుద్ధం చేశారు. దగ్గరై పిడికిలిపోటులతో అన్యోన్యం దెబ్బలాడుకున్నారు. పిడికిళ్ల శబ్దం ఆకాశం అంటింది. కొట్టు, చంపు, పొడు, క్రిందపడేయి మొదలైన శబ్దాలతో యుద్ధభూమి అంతటా ధ్వనించింది. ఈ విధంగా భయంకర యుద్ధం జరుగుతూ ఉంటే యుద్ధభూమిలో నరనారాయణులు ప్రవేశించారు. భగవానుడు నరునిచేతిలోని దివ్యమైన ధనుస్సును చూసి, తాను కూడా దానవసంహారానికి చక్రాన్ని ధరించాలని అనుకొన్నాడు. ఆ నారాయణమూర్తి సంకల్పించినంత మాత్రంచేతనే కాంతులను విరజిమ్ముతూ సూర్యతేజస్సుతో ఆకాశం నుండి చక్రం అతనిని చేరింది. అది సుదర్శన చక్రం. శత్రుభయంకర మైనది. అది అకుంఠితం. దానికి తిరుగులేదు. చక్రాయుధం జ్వలిస్తున్న అగ్నిలాగా భయంకరంగా ఉంది. శత్రునగరాలను ధ్వంసం చేసే శక్తి కల చక్రాన్ని నారాయణుడు రాక్షసులపై ప్రయోగించాడు. చక్రం ప్రళయకాలాగ్నిలాగ వేగంగా ఎన్నోసార్లు వెళ్లి పడి వేలాది రాక్షసుల్ని సంహరించింది. నారాయణుని చేతి నుండి వెడలిన చక్రం ఒకసారి అగ్నిలా అసుర గణాలను నాకివేస్తూ నరికివేసింది. భూమ్యాకాశాలు ఆక్రమించి పిశాచంలా రక్తం త్రాగింది. ఆ సమయంలో దానవులు కూడా ఉత్సాహంతో మహాబలంతో దేవతలపై పర్వతాల్ని పడవేసి నీరులేని మేఘాలవలె ఆకాశమంతా ఆక్రమించి వేలకొలదీ దేవతలను పీడించారు.

ఎన్నో రంగులతో కూడిన మేఘాల వలె చెట్లు భయంకరంగా ఆకాశం నుండి పడుతున్నాయి. కొండ శిఖరాలు ఒకదానినొకటి కొట్టుకొంటూ పెద్దశబ్దంతో వేగంగా క్రిందికి పడుతున్నాయి. పడిన కొండ శిఖరాలతోనూ, అడవులతోనూ కూడిన భూమి అంతటా కంపించి పోతోంది. యుద్ధంలో దేవదానవులు పరస్పరం గర్జనలు చేస్తూ కొట్టుకొంటున్నారు. భయంకర మయిన ఆ దేవ దానవ సంగ్రామంలో నరుడు సువర్ణమయ మయిన బాణాలతో గిరిశిఖరాలను చీల్చివేస్తున్నాడు. ఇంతలో అగ్నిహోత్రునిలా మంటలు గ్రక్కుతూ ఆకాశమంతా వ్యాపించి, సుదర్శన చక్రం వస్తోందని విని, దానవులంతా భూమిలోనికీ, సముద్రంలోనికీ దూరారు. తరువాత దేవతలు విజయం పొంది, మందర పర్వతాన్ని పూజించి పూర్వస్థానానికి పంపారు. దేవతలు ఆకాశమూ, స్వర్గమూ అంతటా వినిపించేటట్లు సింహనాదం చేస్తూ తమ స్థానాలకు వెళ్లి పోయారు. ఈ విజయంతో దేవతలు చాలా సంతోషించారు. దేవేంద్రాది దేవతలు ఆ అమృతనిధిని రక్షించటానికి నరుని కిచ్చి చక్కని రక్షణ వ్యవస్థ కల్పించారు.

20. కద్రూ వినతల పందెము, కద్రువ తన పుత్రులను శపించుట.

ఉగ్రశ్రవుడు ఇలా చెపుతున్నాడు. అమృతం ఉద్భవించిన తీరు అంతా నీకు చెప్పాను. ఆ అమృతం పుట్టిన సమయంలోనే ఉచ్చైఃశ్రవం అనే గుఱ్ఱం కూడా ఉద్భవించింది. ఒకనాడు కద్రూవినతలు ఆ అశ్వాన్ని చూశారు. అపుడు కద్రువ వినతతో " ఆ గుఱ్ఱం ఏ రంగులో ఉంది? త్వరగా చెప్పు" అంది. వినత "ఆ గుఱ్ఱం తెల్లగానే ఉంది. నీవు ఏమి అనుకొంటున్నావు? నీవు కూడా దాని రంగు ఏదో చెప్పు. పందెం వేసుకొందాం" అంది. కద్రువ "దాని తోక నల్లగా ఉందనుకొంటున్నాను. నీకు చేతనయితే "దాస్యం" పందెం పెట్టుకో నాతో" అంది. ఈవిధంగా ఇద్దరూ పందెం వేసుకొని, "ఈ విషయాన్ని రేపు వచ్చిచూద్దాం." అనుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. అపుడు కద్రువ వినతను మోసం చెయ్యాలని తన వేయిమంది సంతానాన్ని పిలిచి ఆ నల్లత్రాచులను ఉచ్చైఃశ్రవం తోకకు వ్రేళ్లాడమని ఆజ్ఞాపించింది. "వెంటనే ఆ పని చేయండి. అపుడు నేను దాసీత్వం పొందనక్కరలేదు" అంది. వారు అంగీకరించలేదు. వెంటనే ఆ సర్పాలను కద్రువ "జనమేజయుడు చేసే సర్పయాగంలో మీరు భస్మం అవుతారు" అని శపించింది.

ఈ శాపాన్ని స్వయంగా బ్రహ్మదేవుడు విన్నాడు. ఇది దైవలిఖితం, కద్రువ అతి కఠోరమైన శాపం ఇచ్చింది కదా! అనుకొన్నాడు. బ్రహ్మతోపాటు దేవతలందరూ దీనిని విని, ఆమోదించారు. ఇది ప్రజలకు మేలుగదా! అని సంతోషించారు. ఈ సర్పాలు విషపూరితాలు. ఇతరుల కందరికీ బాధాకరాలు. అందుచే ప్రాణికోటికి మేలు జరగాలనే దృష్టితో దైవవశాత్తు కద్రువ తనపిల్లలకు శాపం ఇచ్చి మేలు చేసింది. కేవలం మానవులకే కాదు. దోషపరులైన ఇతరప్రాణులకు కూడా ఇటువంటి ప్రాణాంతకమైన శిక్ష దైవమే విధిస్తుంది. బ్రహ్మదేవుడు కద్రువను అభినందించి కశ్యపుని పిలిచి ఇలా చెప్పాడు. "మహాత్మా! నీద్వారా సర్పాలు ఉద్భవించాయి. పెద్దపెద్ద పడగలతో వాటి శరీరమే కాకుండా వాటి విషంకూడా భయంకరంగా ఉంది. అందుచేత కద్రువ సర్పాలకు శాపం ఇవ్వటం జరిగింది. కాబట్టి మీరు ఆమెపై క్రోధాన్ని చూపకండి. యజ్ఞంలో సర్పనాశనం జరుగుతుంది. "ఈవిధంగా బ్రహ్మ కశ్యపుడికి చెప్పి ఆయనను శాంతపరచాడు. విషాన్ని హరించే విద్యను కూడా బ్రహ్మ కశ్యపునికి చెప్పాడు.

(కద్రువ ఇలా శపిస్తే ఆ శాపానికి భయపడి కర్కోటకుడు ఆగుర్రం యొక్క తోకను తన నల్లని శరీరంతో మింగి వేస్తానన్నాడు-"మంచి"దని కొడుకుతో కద్రువ అంది).

21. సముద్రవర్ణనము.

ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు - తపోధనా! ఆ రాత్రి గడచిన తరువాత సూర్యుడు ఉదయించగానే కద్రూవినతలు తమ పందెములు నెగ్గించుకోడానికని మాత్సర్యంతో ఆ సముద్రతీరంలో ఉన్న ఉచ్చైశ్రవం అనే అశ్వరాజాన్ని చూడటానికి వెళ్లారు. కొంతదూరం వెళ్లాక అగాధమై హోరుమని శబ్దం చేస్తున్న సముద్రాన్ని వారిద్దరూ చూశారు. తిమింగిలాలు పెద్దపెద్ద చేపలు, మొసళ్లు, ఇంకా ఎన్నో వేల జల జంతువులతో మహాభయంకరంగా ఉన్న సముద్రాన్ని వారు చూశారు. వికృతాకారంలో ఉన్న అనేకభయంకరజలజంతువులతోను, తాబేళ్లతోను, కూడిఉన్న సముద్రం చేరడానికి వీలు కాని విధంగా ఉన్నది. ఆ సముద్రం సకలవిధ రత్నాలకు నిలయం. అది వరుణ దేవుని నివాస స్థానం. సర్పాలకు అది రమణీయ మైన ఆలయంకూడా. అది బడబాగ్నికి స్థానం. రాక్షసులకు ఆ సముద్రం బంధువులాగ ఆశ్రయం ఇస్తున్నది. ఇతర జంతువులకు భయంకరంగా ఉన్నది. నీటికి నిలయం అది. ఆ సముద్రం ఎంతో పవిత్రమైనది. దివ్యమైనది కూడ. అమృతం పుట్టిన ఆ సముద్రజలం అద్భుతమైనది. దానికదే సాటిగదా! ఆ సముద్రం జలజంతువుల రౌద్రశబ్దాలతో భయంకరంగా ఉంది. అన్నిప్రాణులకు భయాన్ని కలిగించే సుడులతో నిండి ఉంది. ఆ సముద్రం అలల ఉయ్యాలల వేగంతో, మహాధ్వనితో క్షోభ కల్గిస్తున్నట్లుగా ఉన్నది. కదిలే కెరటాలు అనే హస్తాలతో నాట్యం చేస్తున్నట్లుగా ఉన్నది. చంద్రుని యొక్క వృద్ధి క్షయాలవలన మహోన్నత తరంగాలతో కూడి ఉన్నది ఆ సముద్రం. అందులో పాంచజన్యం అనే శంఖం ఉద్భవించింది. అది రత్నాలకు నిలయం. ఉత్తమ మైనదా సముద్రం.

భూమిని సంతోషపెట్టడానికి శ్రీమన్నారాయణమూర్తి వరాహమూర్తియై భూమిని ఉద్ధరించేటప్పుడు ఆ సముద్రజలం అంతా క్షోభచెందినట్లుగా అయింది. నిరంతరజపతత్పరుడై బ్రహ్మర్షియైన అత్రిమహర్షి ఆ సముద్రం యొక్క లోతును తెలుసుకొనవలెనని నూరు సంవత్సరాలు ప్రయత్నించినప్పటికీ దాని అంతు చిక్కలేదు. అది పాతాళం చివరిదాకా వ్యాపించి ఉన్నది. శ్రీమహావిష్ణువు యుగాంతకాలం నుండి యుగాదికాలం వరకు యోగ నిద్ర చేయడానికి శయనాగారంగా సేవచేసింది ఆ మహాసముద్రమే. ఇంద్రుని వజ్రాయుధం దాడికి భయపడిన మైనాక పర్వతానికి ఆ సముద్రం ఆశ్రయ మిచ్చింది. దేవతలతో జరిగిన యుద్ధంలో భయపడి పారిపోయిన ఎందరో రాక్షసులకు అది ఆశ్రయం ఇచ్చింది. సముద్రం తనలో పుట్టిన బడబానలం అనే అగ్నిని జలరూప హవిస్సులతో సేవించింది. ఆ విధంగా అది ప్రపంచ కల్యాణానికి కారకమైంది. ఆ విధంగా ఎన్నో నదులకు పతి

యైన సముద్రం అగాధ మైనది. అపారమైనది. ఊహింపరానంత విస్తీర్ణం కలది. వేలకొద్దీ నదులెన్నో పోటీపడినట్లు అభిసరిస్తున్నాయి ఆ సముద్రాన్ని. ఆ నదుల కెరటాలతో నృత్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది ఆ సముద్రం. గంభీరంగా ఉంటూ, తిమింగలాలు మొసళ్లు మొదలైన భయంకర జంతువుల గర్జనలతో కూడి ఉంది. విశాలమై, ఆకాశంలాగా స్వచ్ఛంగా ఉంటూ, అనంతమైన అగాధంతో ప్రకాశిస్తున్న జలనిధిని కద్రూ వినతలు ఇద్దరూ చూశారు.

22. సర్పములు ఉచ్చైఃశ్రవము తోకను నల్లగా చేయుట.

ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు. మహర్షులారా! నాగులందరు తమలో తాము ఆలోచించుకొని తల్లి ఆజ్ఞ ప్రకారం చేయటానికే నిశ్చయించుకొన్నారు. తల్లి చెప్పినట్లు చేయకుంటే రోషంతో కుమారులనికూడా లెక్కచేయక శాపం ఇస్తుంది గదా? ఆమె కోరికను నెరవేర్చి శాపం నుండి విముక్తి పొందడానికే నల్లత్రాచులు ఆ గుర్రంయొక్క తోకకు చుట్టుకొందా మనుకొన్నాయి. ఆ విధంగా కాలసర్పాలు తోకకు చుట్టుకొన్న తరువాత పందెం వేసుకొన్న ఆ కద్రూవినతలు ఇద్దరూ సంతోషంతో సముద్రతీరానికి ఆకాశమార్గాన వెళ్లారు. ఆ సముద్రం గాలితో పెద్దఘోష చేస్తూ క్షోభించి పోతోంది. ఎన్నో వేల జంతువులు కలిగి ఆ సముద్రం మహాభయంకరంగా, ఎవరూ దగ్గరకు రాలేనట్లుగా ఉంది. నాగులకు ఆలయమయిన ఆ సముద్రం నీటికే అధిపతి. ఆ జలనిధి పాతాళంలోని బడబాగ్నికి నిలయం. అలాగే రాక్షసులకూ నిలయం. భయంకరమయిన జలజంతువు లందులో ఉన్నాయి. జలానికి నిలయమది. అది అమృతం పుట్టినచోటు, శుభ్రమైన, పుణ్య జలంతో నిండినది. దానిలోతు ఎంతో ఊహించలేము. అక్కడక్కడ దానిలో ఎన్నో మహానదులు వచ్చి కలుస్తూ ఉంటాయి. ఆ నీటితో బాగా నిండి కెరటాలతో నృత్యం చేస్తూన్నట్లుంది. మెరిసే కెరటాలతో, ఆకాశంలా నల్లగా కనిపిస్తూ, ఆ సముద్రం బడబాగ్ని జ్వాలలతో ప్రకాశిస్తోంది. ఘోషిస్తోంది. ఆ సముద్రాన్ని కద్రూవినతలు త్వరగా చేరుకొన్నారు.

23. వినత కద్రువకు దాసి యగుట. గరుడుని పుట్టుక.

అనంతరం ఉత్సాహంతో కద్రువ (తానే విజయం పొందుతాననే నిశ్చయంతో) వినతతో కూడా ఉచ్చైఃశ్రవస్సమీపాన్ని చేరింది. చంద్రకిరణాలవలె తెల్లగా ఉన్న ఆ గుర్రం యొక్క తోక నల్లగా ఉన్నట్లు ఇద్దరూ చూశారు. ఆ గుఱ్ఱం యొక్క తోక నల్లగా

ఉందని గ్రహించి విచారంతో ఉన్న వినతను కద్రువ దాస్యంలో నియోగించింది. పందెంలో ఓడిపోయిన వినత తన సవతికి దాసిగా ఉండాల్సి వస్తున్న దని దుఃఖించింది. ఇలా దాసిగా కద్రువకు వినత సేవచేస్తూండగా గరుత్మంతుడు పుట్టే సమయం సమీపించింది. తల్లియైన వినత సహాయం అక్కరలేకుండానే అండాన్ని చీల్చుకొని గరుత్మంతుడు పుట్టాడు. ఆ పక్షీంద్రుడు మహాబలసంపన్నుడు. సాహసపరాక్రమాలు కలిగిన వాడు. ఏ రూపం కావాలన్నా పొందగలడు. ఎక్కడికి వెళ్లాలన్నా వెళ్లగలడు. తన దివ్య తేజస్సుతో దిక్కులన్నింటిని ఎంతో ప్రకాశవంతంగా చేస్తున్నాడు. ఆ గరుడుడు మూర్తీభవించిన అగ్నిరాశిలా ప్రకాశిస్తున్నాడు. మెఱుపు తీగ వంటి పచ్చని కళ్లతో ప్రళయకాలంలోని అగ్నిహోత్రుని లాగ తేజోమూర్తియై ఉన్నాడు. భయంకరాకారుడు, భయంకరమైన కంఠధ్వని కలవాడు, ఇతడే బడబాగ్ని అన్నట్లుగా ఉన్న ఆ పక్షీంద్రుడు పుట్టిన వెంటనే ఆకాశానికి ఎగిరి పోయాడు. అలా ఎగిరి వస్తున్న ఆ గరుత్మంతుని చూసి దేవతలందరూ అగ్నిహోత్రుని శరణుకోరి, నమస్కరించి ఆ మహానుభావుని ఇలా ప్రార్థిస్తున్నారు. 'అగ్నిహోత్రుడా! ఇంతకుమునుపు నీవు ఎప్పుడూ ఇలా ప్రజ్వలిస్తూ అపకారం చేయలేదుకదా! ఇపుడు ఇలా ప్రజ్వలిస్తూ ఎందుకు విజృంభిస్తున్నావు?' అని అడిగారు. అగ్ని ఇలా అన్నాడు. "దేవతలారా! మీరు అలా భావించకండి. మీరు అనుకొన్నట్లు ఆ తేజఃపుంజం నేను కాదు. నా తేజస్సుతో సమానమైన వాడు. మహాబలవంతుడు. గరుత్మంతుడు. అతడు వినతాకుమారుడు. తల్లియైన వినతకు ఆనందం కలిగించే విధంగా పరమతేజస్వియైన కుమారుడు జన్మించాడు. ఆ తేజోమూర్తిని చూసి మీరు భ్రమపడ్డారు. అతడు కశ్యప ప్రజాపతి కుమారుడు, మహాబలవంతుడు. సర్పాల బాధనుండి రక్షించడానికి వరప్రసాదంగా జన్మించాడు. దేవతలందరికి హితుడు, రాక్షసులకు శత్రువు. "ఈ సందర్భంలో మీరు భయపడవలసిన పనిలేదు" అని అగ్నిహోత్రుడు తనతోకూడి ఆ మహనీయుని దర్శింపుమని కోరాడు. ఆ మాటలకు దేవతలు, ఋషులు సంతోషించి దూరంగా ఉండే ఆ గరుత్మంతుని చూచి ఇట్లా స్తుతించారు.

దేవతలు ఈ విధంగా ఆ గరుడుని ప్రార్థిస్తున్నారు. "పక్షిరాజా! నీవు మహర్షివి. మంత్ర ద్రష్టవు. నీవు దేవుడవు. పక్షిరాజువు. నీవే మాకు ప్రభువు, నీవే సూర్యుడవు, నీవే బ్రహ్మవు, ప్రజాపతివి. నీవే అగ్నివి, ఇంద్రుడవు, హయగ్రీవుడవు, శర్వుడవు, లోక రక్షకుడవు. నీవు పరమాత్ముని యొక్క ముఖస్వరూపుడవైన బ్రాహ్మణుడవు. పద్మజుడైన బ్రహ్మవు. అగ్నివి, వాయువువు. నీవే ధాతవు. విధాతవు. నీవు విష్ణు స్వరూపుడవే. నీవు

మహత్తువు-అహంకారానివి- సనాతనుడవు. మహా కీర్తివి. నీవు కాంతివి - కోరదగిన వాడవు. నీవు మాఅందరికీ సర్వోత్తముడ వైన రక్షకుడివి, అమృతస్వరూపుడవు. నీవు బలసముద్రుడవు. సత్పురుషుడవు. ఔదార్యంతో కూడిన సాత్త్వికుడవు. ఐశ్వర్యశాలివి. అమితవేగంతో సంచరించే నీకు ఎవ్వరూ సాటిరారు. కీర్తిశాలీ! నీ నుండియే అంతా సృష్టింపబడింది. భూత భవిష్యత్ వర్తమానాలన్నీ నీవే సుమా. నీవు ఉత్తముడవు. నీ స్వయంప్రకాశత్వం చేత ఈ చరాచరజగత్తు నంతటినీ కాంతి వంతంగా చేస్తున్నావు. సూర్యకాంతిని కూడా తిరస్కరింప జేయగల శక్తిమంతుడవు. క్షర - అక్షర రూపమైన జగత్తునంతటినీ అంతం చేయగలవాడవు. అగ్నితో సమానంగా ప్రకాశించే పక్షిరాజా! సూర్యుడు కోపిస్తే ఎలా దహించగలడో అలాగే నీవు కూడా దహించగల శక్తి కల్గిన వాడవు. నీవు కాలాంతకుడైన యముడిలా ప్రళయకాలంలో సర్వాన్ని నాశనం చేయగలవాడవు.

నీవు సమస్త పక్షి లోకానికే కాదు, జీవకోటికి అందరికీ అధిపతివి. అగ్నితో సమానంగా ప్రకాశించే తేజోవంతుడవు. ఆకాశంలోని మెరుపు తీగలాగా ప్రకాశించేవాడివి. నీవు అజ్ఞానాంధకారాన్ని పోగొట్టుతావు. మహా బలాఢ్యుడ వైన నిన్ను మేము శరణు కోరుతున్నాం. జగదీశ్వరా! నీవే కార్య కారణరూపుడవు. నీ పరాక్రమం అజేయం. నీతేజస్సుతో ఈలోకమంతా వేడెక్కి, మేల్కొంటుంది. బంగారంతో సమానమైన నీ దివ్యతేజస్సుతో దేవతల్ని, మహాత్ముల్ని అందరినీ రక్షించు. పక్షిరాజా! విమానంలో చరించే దేవత లందరు నీ దివ్యతేజస్సును చూచి భయపడి అపమార్గంలో పోతున్నారు. నీవు పరమదయాళువైన కశ్యపమహర్షి కుమారుడవుగదా! ప్రభూ! నీవు కోపించవద్దు. శాంతించు. ఈ సర్వజగత్తుపై దయను చూపించు. నీవు ఈశ్వరుడవు కదా! మా అందరికీ రక్షకుడుగా ఉండు. పిడుగుపాటు లాంటి నీ గర్జనధ్వనితో ఆకాశం, దిక్కులు, భూమి అంతా దద్దరిల్లుతోంది. మా హృదయాలన్నీ నిరంతరం కదలిపోతున్నాయి. ఖగశ్రేష్ఠా! అగ్ని సమానమైన నీ రూపాన్ని ఉపసంహరించు. కుపితుడైన యమధర్మరాజులా ఉన్న నీ ఉగ్రస్వరూపాన్ని ఉపసంహరించు. ఆ రూపాన్ని చూస్తూంటే మా మనస్సులు చలిస్తున్నాయి. మా ప్రార్థనను మన్నించి ప్రసన్నుడవు కమ్ము. మాకోసం నీవు కల్యాణస్వరూపుడవు కమ్ము. మాకు సుఖప్రదాతవుగా ఉండు". ఇలా ఋషులు దేవతలు అందరూ ఆ గరుత్మంతుని స్తుతించారు. ఉత్తమోత్తముడైన ఆ పక్షీంద్రుడు వారి మొర విని ఆ భయంకరరూపాన్ని, దివ్యతేజస్సును ఉపసంహరించుకొన్నాడు.

24. అనూరుడు సూర్య రథసారథి అగుట.

ఆ పక్షీంద్రుడు దేవతల స్తుతి విని తన భయంకర శరీరాన్ని చూచుకొని తన ఆ రూపాన్ని ఉపసంహరించుకొన్నాడు. గరుడుడు అంటున్నాడు. "దేవతలారా! నా ఈ భయంకరాకారాన్ని చూసి భయపడకండి. నా ఈ స్వరూపాన్ని ఉపసంహరించు కొంటున్నాను." ఆ తరువాత కామగమనుడు, కామవీర్యుడు అయిన ఆ పక్షీంద్రుడు కశ్యపుని ఆశ్రమంలో ఉన్న తన అన్నగారైన అరుణుని తనవీపుపై కూర్చుండ బెట్టుకొని తనతండ్రి ఇంటినుండి సముద్రం అవతల ఒడ్డున ఉన్న తనతల్లి వినతగృహానికి వచ్చాడు. సూర్యుడు తూర్పుదిక్కులో ఉండి తన భయంకర తేజస్సుతో లోకాలన్నిటినీ దగ్ధంచేస్తుంటే గరుడుడు మళ్లీ తన అన్న అరుణుని తీసుకొని వచ్చి సూర్యునికి దగ్గర నిలిపాడు. ఆ విషయాన్ని విన్న శౌనకుడు "సూర్యుడు ఎందుకు ఈ ప్రపంచాన్ని దగ్ధం చేయ దలచాడు." అని అడిగాడు. అపుడు సూతుడు "రురుడు తండ్రి యైన ప్రమతిని అడిగితే ఈ కథను చెప్పాడు. ఆ విషయాన్నే మీకు చెపుతాను.

రురుడు 'తండ్రితో నాన్నగారూ! ఎందుకు సూర్యుడు లోకాన్ని దగ్ధం చేయాలని అనుకొన్నాడు? దేవతలేమన్నా అపకారం చేయటం వల్ల సూర్యుడికి కోపం వచ్చిందా?' అని అడిగాడు. కుమారుడికి ప్రమతి ఈ విధంగా చెప్పాడు. "అమృతాన్ని దేవతలకు విష్ణుమూర్తి పంచుతున్న సమయంలో దాన్ని సూర్యచంద్రులు చూసి శ్రీమన్నారాయణమూర్తికి చెప్పారు కదా! ఆతడు తన చక్రంతో రాహుకంఠాన్ని తెగవేశాడు. అమృతం త్రాగటం వల్ల తలమాత్రం ప్రాణంతో ఉండటంవల్ల ఆ రాహువు ఆనాటి నుండి సూర్య చంద్రుల్ని బాధిస్తున్నాడు. తాను లోకానికీ, దేవతలకూ ఎంతమేలు చేసినా రాహువు బాధిస్తూంటే దేవతలు విద్రూరంగా చూస్తున్నారే కాని అడ్డుకోవటంలేదు. కాబట్టి సూర్యుడికి కోపం వచ్చింది. "దేవతల మేలుకోసం నేను రాహువును గుటించి విష్ణుదేవునికి చెప్పటం వల్ల నాపై రోషంతో రాహువు నన్ను బాధిస్తున్నాడు. ఇటువంటి అనర్థం నాకు మాత్రమే ప్రాప్తించింది. ఇటువంటి కష్టకాలంలో దేవతలు ఎవ్వరూ నాకు సహాయ పడటంలేదు. రాహువు నన్ను పీడిస్తూంటే అందరు దేవతలు చూస్తూ కూర్చున్నారే తప్ప ఎవ్వరూ నివారించలేకపోయారు. అందుకని లోకానికి అందరికీ బాధకల్గించాలనే ఉద్దేశంతో అస్తాద్రిని చేరాను. అక్కడే ఉంటాను." అని సూర్యుడు నిశ్చయంగా చెప్పాడు.

ఆ అస్తాద్రినుండి సూర్యుడు లోకాన్ని నశింప చేయాలని సంకల్పించి తపింప చేస్తున్నాడు. అపుడు మహర్షు లందరు దేవతలదగ్గరకు వెళ్లి ఈ విధంగా అంటున్నారు. "దేవతలారా! అర్ధరాత్రి సమయంలో అన్నిలోకాలకీ భయాన్ని కల్గించేటట్లుగా అధికమైన

వేడి పుట్టి అందరిని దహిస్తున్నది." మహర్షులు ఇలా చెప్పగా దేవతలు ఆ ఋషులతో కూడా బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లారు. "దేవా! నేడు ఎందుకు ఈ విధంగా భయంకరంగా దహించుకు పోతున్నది లోకం? సూర్యుడు కనిపించటం లేదు. సూర్యుడు ఉదయించినా ఇది ఎట్లా సంభవం?" అని పితామహుని అడిగారు. అపుడు బ్రహ్మ ఈవిధంగా చెప్పాడు. ఈ లోకాలను నశింపచేయాలనే ఉద్దేశ్యంతో సూర్యుడు ఈ విధంగా విజృంభిస్తున్నాడు. మనం చూస్తూండగానే అతడు సమస్తలోకాలను భస్మం చేయగలడు. ఈసూర్యుని శాంతింప చేయటానికి ఇదివరకే నేను ఉపాయాన్ని సిద్ధం చేశాను. కశ్యపమహర్షియొక్క కుమారుడు అరుణుడు అని సుప్రసిద్ధుడే. అతడు చాలా బుద్ధిమంతుడు. ఆ అరుణుని యొక్క శరీరం చాలా విశాల మయినది. అతడు మహాతేజస్వి. అతనిని సూర్యుడి ముందు రథంపై కూర్చుండబెట్టి సారథ్యం చేయిస్తే ఆ భయంకరమైన సూర్య తేజస్సు అడ్డగింపబడుతుంది. ఆ విధంగా చేస్తే దేవతలకూ, ఋషులకూ, లోకాలన్నిటికీ శుభం జరుతుంది. అపుడు ప్రమతి ఈ విధంగా అంటున్నాడు. అనంతరం బ్రహ్మాయొక్క ఆదేశానుసారం అరుణుని దేవతలందరు సూర్య రథ సారథిగా నియమింప చేశారు. సూర్యుడు అరుణునితో సహా ఉదయించాడు. సూర్యుడికి ఎందుకు కోపం వచ్చిందో నేను అంతా చెప్పాను గదా! శక్తిమంతుడైన అరుణుని ఎందుకు సూర్యరథానికి సారథిగా చేశామో ఈ ప్రసంగంలో స్పష్టంగా చెప్పాను గదా! మీరు అడిగిన రెండవ ప్రశ్నకు సమాధానాన్ని వినండి.

25. కద్రువ సూర్యుని, ఇంద్రాదులను స్తుతించుట.

కోరిన ప్రకారం ఏ రూపంలోనైనా ఎక్కడికైనా వెళ్ల గల్గిన ఆ గరుత్మంతుడు సముద్రానికి ఆవలి ఒడ్డున ఉన్న తల్లియైన వినత దగ్గరకు వచ్చాడు. అక్కడే కద్రువతో వేసిన పందెంలో వినత ఓడిపోయి ఆమెకు దాస్యం చేస్తూ ఎంతగానో కుమిలిపోతున్నది. ఒకనాడు కద్రువ గరుత్మంతుని దగ్గర కూర్చున్న వినయశీల అయిన వినతను పిలిచి ఈ విధంగా చెప్పింది. 'వినతా! సముద్రంలోపల నిర్జనప్రదేశంలో రమణీయమై చూడదగిన నాగుల నివాసస్థానం ఉన్నది. నన్ను అక్కడికి తీసుకొనివెళ్లి చూపించు.' అపుడు వినత కద్రువను తనవీపుపైకి తీసుకొన్నది. ఆమె కుమారుడైన గరుత్మంతుడు కూడా తల్లి ఆజ్ఞాపించడం వల్ల కొన్ని సర్పాల్ని తన వీపుపైకూర్చుండ బెట్టుకొన్నాడు. వైనతేయుడు సూర్యుడికి ఎదురుగా ఆకాశమార్గంలోకి ఎగిరాడు. సూర్యతాపానికి తాళలేక ఆ సర్పాలన్నీ మూర్ఛపోయాయి. తనకుమారుల దీనావస్థను చూసి నాగమాత అయిన కద్రువ ఇంద్రుని

స్తుతించింది. 'సమస్త దేవతల అధిపతివైన మహేంద్రా! నీకు నమస్కారం. బలసూదనా! నీకు నా ప్రణామాలు. వేయికన్నులు కలిగి నముచి అనే రాక్షసుని సంహరించి లోకాన్ని రక్షించిన మహేంద్రా! శచీపతీ! నీకు నమస్కారం. సూర్యతాపంచేత తపించి మూర్ఛిల్లిన నా పుత్రుల్ని రక్షించు. నీటిని వర్షించి వారిని మూర్ఛనుండి కాపాడు. నౌకలాగా వారిని ఒడ్డుకు చేర్చు. అమరనాయకా! నీవే మా అందరకు రక్షకుడవు. పురందరా! అధికాధిక వర్షాన్ని కురిపించగల శక్తిమంతుడవు నీవు. నీవే మేఘానివి. నీవే వాయుదేవుడవు. నీవే అగ్నివి. ఆకాశంలో విద్యుత్తువు. నీవు మేఘాల్ని చిన్నాభిన్నం చేసి వర్షింప చేసే మహానుభావుడవు.

ఈ ప్రపంచంలో నీతో సాటి వచ్చేవారు ఎవరూ లేరు. సాటిలేని మహాశక్తి గల వజ్రాయుధం నీవే. నీవు ప్రళయకాలంలో గర్జించే మేఘానివి. సమస్త లోకాలనూ సృష్టించగలవు. లయింప జేయగలవు. నీవు అజేయుడవుకదా! నీవు సమస్త ప్రాణికోటికి జ్యోతిస్వరూపుడవు. చిద్రూపుడవు, సూర్య దేవుడవు. అగ్ని స్వరూపుడవు. అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించే మహాపురుషుడవు. నీవు రాజువే. సమస్త దేవతలలో శ్రేష్ఠుడవు నీవే. నీవే విష్ణువువు, సహస్రాక్షుడవు. సమస్త దేవతలకు ఆశ్రయం కల్పించే వాడవు నీవే. నీవే అమృతానివి. శీతకిరణుడైన చంద్రుడవు నీవే. నీవు ముహూర్తానివి. తిథివి, శుక్లపక్షం, కృష్ణ పక్షం కూడా నీవే. కల, కాష్ఠ, త్రుటి అన్ని కాలభేదాలూ నీవే. నీవే సంవత్సరం, ఋతువు, మాసం రాత్రి,పగలు కూడా. నీవు పర్వతాలతోను, అడవులతోను కూడిన భూమివి. అంధకారాన్ని పటాపంచలు చేసే సూర్యుడితో కూడిన ఆకాశానివి నీవే. తిమి, తిమింగిల మకరాది జంతువులతోను, అలలతోను కూడిన సముద్రానివి నీవే. నీవు గొప్ప కీర్తిమంతుడవు. అందుచేతనే బుద్ధిమంతులు అందరూ నిన్నే పూజిస్తున్నారు. మహర్షులందరు నిన్నే స్తుతిస్తున్నారు. యజమానిసంతోషం కోసమే యజ్ఞంలో సోమరసాన్ని పానం చేస్తున్నావు. వషట్కారంతో సమర్పిస్తున్న హవిస్సుల్ని స్వీకరిస్తున్నావు. ఈ ప్రపంచం యొక్క మేలు కోరి బ్రాహ్మణు లందరూ నిన్ను పూజిస్తున్నారు. బలాఢ్యుడవైన దేవేంద్రా! ఉపనిషత్తులలో కూడా బ్రాహ్మణోత్తములు నీ మహిమను గానంచేస్తున్నారు. నీ సన్నిధిని చేరడానికి బ్రాహ్మణులు వేదాంగాల జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నారు.

26. ఇంద్రుడు వర్షమును కురిపించి సర్పాలను తేర్చుట.

ఉగ్రశ్రవసుడు చెపుతున్నాడు. 'కద్రువ ఆ విధంగా ఇంద్రుని స్తుతించిన తరువాత అతడు సంతోషించి, ఆకాశమంతా నల్లటి మబ్బులతో ఆవరింప జేశాడు. ఆ మేఘాలను వర్షింపుమని ఆజ్ఞాపించాడు. ఆతని ఆజ్ఞ ప్రకారం మేఘాలు ఆవరించి, వర్షించాయి.

ఆ మేఘాలు ఆకాశం అంతా దద్దరిల్లేటట్లు గర్జిస్తూ ఉరుములతో మెఱుపులతో కుండపోతగా వర్షించాయి. ఎటు చూసినా నీరే. ఆకాశ మనే సముద్రం వర్షధార లనే కెరటాలతో నృత్యం చేస్తున్నట్లు ఉంది. మేఘాలు భయంకరంగా గర్జిస్తూ, మెఱుపులకూ, గాలివేగానికి కదుల్తూ నిరంతరం వర్షిస్తూనే ఉన్నాయి. సూర్య చంద్రుల కిరణాలు కనిపించకుండా వర్షించడం వల్ల నాగులన్నిటికి తాపం శమించి సంతోషం కలిగింది. భూమి అంతా జలమయ మయిపోయింది. చల్లని ఆ నీరు పాతాళందాకా వ్యాపించింది. ఆ సమయంలో భూమి అంతా అనేక జల తరంగాలతో కప్పబడింది. ఈ విధమైన వర్షానికి సంతోషించిన సర్పాలు తల్లితో సహా రమణీయమైన నాగద్వీపాన్ని చేరాయి.

27. తల్లి దాస్య నివృత్తిని గురించి గరుడుడు సర్పములను అడుగుట.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. 'నాగులు అందరూ నీటి ధారలతో తడిసి తాపాన్ని పోగొట్టుకొని సంతోషించి' గరుడుని వీపుపై కూర్చుండి రామణీయక ద్వీపాన్ని చేరారు. విశ్వకర్మ నిర్మించిన ఆ ద్వీపం మొసళ్లకు నివాస స్థలం. ఈ నాగులు కూడా ఇక్కడికి రావటం వల్ల లవణసముద్రం భయంకరంగా కనిపించింది. గరుడునితో కూడా వచ్చిన సర్పాల వల్ల ఆ ప్రదేశం సముద్రజలంతో అభిషేకం చేసినట్లుగా ఉంది. అక్కడ ఉన్న పక్షుల కలకలారావాలతో ఆ వనం మారుమ్రోగింది. ఆ రామణీయకవనం విచిత్రమైన పండ్లతో, తేట నీటితో నిండిన దివ్య సరస్సులు పుష్పాలతో, చెరువులతో, అందమైన భవనాలతో, వనాలతో కూడి ఉంది. పుష్పాల పరిమళాన్ని వెదజల్లుతూ చల్లని వాయువులతో పవనుడు అక్కడ సంచరిస్తున్నాడు. అక్కడ మంచి గంధపు చెట్లు మహోన్నతంగా ఉన్నాయి. గాలివేగానికి పుష్పవర్షాన్ని కురిపిస్తూ ఎంతో శోభాయమానంగా ఉన్నాయి. అక్కడ మలయజ వృక్షాలే కాకుండా ఇతర వృక్షాల పూలు కూడా నాగులపై వర్షించాయి. ఆ దివ్యవనం హృదయాన్ని ఆకర్షిస్తోంది. గంధర్వులకు, అప్సర స్త్రీలకు ఆనందం కలిగిస్తోంది. తుమ్మెదల ఝంకారాలతో మనోజ్ఞమై చూడ ముచ్చటగా ఉంది. ఆ వనం రమణీయం, పుణ్యప్రదం, శుభంకరమును. అందరినీ ఆనంద పరిచే దివ్యవనం అది. పక్షుల కలకల ధ్వనులతో సుందరంగా ఉండటంవల్ల కద్రూ సంతానానికి చాలా ఆనందం కలిగింది. వారందరూ ఆ వనంలో కొన్నిరోజులు విహరించిన తరువాత ఆ సర్పాలు మహాపరాక్రమవంతుడయిన ఆ గరుడునితో ఈ విధంగా అన్నాయి. 'ఖేచరా! నీవు ఆకాశంలో సంచరిస్తున్నపుడు అనేకమైన సుందరప్రదేశాల్ని చూసి ఉంటావు కదా! కాబట్టి మమ్మల్ని నిర్మల జలం ఉన్న మరో మంచి ద్వీపంలోనికి తీసుకొని వెళ్లు.'

ఆ మాటలకు కొంత బాధపడి గరుడుడు తన తల్లితో "అమ్మా! నేను సర్పాలు ఆజ్ఞాపించే పనుల్ని ఎందుకు చేయాలి."? అని అడిగాడు. అపుడు వినత ఇలా అంది. "నాయనా! దురదృష్టం వల్ల నేను నా సవతియైన కద్రువకు దాసిని అయ్యాను, పందెంలో నేను ఆమెచేతిలో ఓడి పోవటంవల్ల ఈ విధంగా సేవ చేయవలసి వస్తున్నది." తన దాసీత్వానికి తల్లి కారణం చెప్పగా గరుత్మంతుడు దుఃఖించి సర్పాలను ఇలా అడిగాడు. "పాములారా! మా తల్లి దాస్యవిముక్తికై మీకేం కావాలో చెప్పండి" అని అడిగాడు. గరుడుని మాటలు విన్న సర్పాలు తమకు ఆహారంగా అమృతాన్ని తెచ్చియిస్తే దాసీత్వం నుండి విముక్తి కలుగుతుందని చెప్పాయి.

28. గరుడుడు అమృతమును తెచ్చుటకు వెళ్లుట.

గరుత్మంతుడు తన తల్లికి ఈ విషయాన్ని చెప్పాడు. "అమృతం తీసుకొని రావడానికి బయలు దేరుతున్నాను. నాకు ఆహారం కావాలి, ఎక్కడ దొరుకుతుందో చెప్పు" అని తన తల్లిని అడిగాడు. వినత ఇలా అంది. "నాయనా! సముద్ర మధ్యంలో ఒక బోయపల్లె ఉంది. అందులో వేలాది మంది నిషాదులు ఉన్నారు. వాళ్ళని ఆహారంగా భుజించి అమృతాన్ని తీసుకొనిరా. ఆ నిషాదులలో ఎవరైనా బ్రాహ్మణుడు ఉంటే వానిని చంపకు. బ్రాహ్మణుడు అగ్నితో సమానం. ప్రాణికోటిలో బ్రాహ్మణుని చంపరాదు సుమా! అతడి కోపం అగ్నికంటె, విషంకంటె, కత్తి కంటె భయంకరమైనది. కాబట్టి అతని కోపాగ్ని నిన్ను దహించి వేస్తుంది. బ్రాహ్మణుడు సర్వప్రాణులకూ పూజనీయుడు సుమా. బ్రాహ్మణుడు ఆదరింపదగినవాడు. కావున కుమారా! నీకు కోపం వచ్చినా కూడా అతడిని చంపదగదు. బ్రాహ్మణులకు అపకారం తలపెట్టరాదు. కాబట్టి బ్రాహ్మణులకు ఎప్పటికీ ద్రోహం తలపెట్టరాదు. అతడికి కోపంవస్తే అగ్ని కంటె, సూర్యునికంటె అధికంగా భస్మం చేయగలడు. ఇటువంటి లక్షణాలతో ఉన్న వానిని విప్రునిగా గుర్తించు. అతడు ప్రాణులన్నిటికంటె ముందు ఉద్భవించినవాడు, తండ్రి, గురువు."

గరుడుడు తల్లిని ప్రశ్నిస్తున్నాడు. "అమ్మా! బ్రాహ్మణుడు ఏరూపంలో ఉంటాడు? అతని ప్రవర్తన ఎట్టిది? పరాక్రమం ఎలా ఉంటుంది? అతడు అగ్నిలాగా ఉంటాడా? లేక సౌమ్యుడుగా కనిపిస్తాడా? నేను బ్రాహ్మణుని ఏ శుభలక్షణాలతో గుర్తించాలి? అమ్మా! బ్రాహ్మణుని గుర్తించడానికి నాకు కారణంతో సహా ఉపాయం చెప్పు." అపుడు వినత కుమారునితో ఇలా అంది. "నీవు మ్రింగినపుడు వాడు నీ కంఠబిలంలోకి పోకుండా అగ్నిలాగా దహిస్తూ ఉంటాడు. కుమారా! అట్టివానిని బ్రాహ్మణునిగా గుర్తించు. నీకు

కోపం వచ్చినా బ్రాహ్మణుని చంపరాదు సుమా" అంది. వినత పుత్ర ప్రేమతో ఇంకా ఇలా చెప్పింది. 'నీ జఠరంలో జీర్ణం కాని వాడే బ్రాహ్మణుడు అని తెలుసుకో.' కుమారుని బలపరాక్రమాలు చాలా గొప్పవని తెలిసి, సర్పాలు చేసిన అపకారానికి దుఃఖితురాలై పుత్రప్రేమతో కుమారుని ఆశీర్వదిస్తూ ఇంకా ఇలా చెప్పింది. "నాయనా! నీ రెక్కల్ని వాయుదేవుడు కాపాడుగాక! సూర్యచంద్రులు నీ వీపును రక్షించుగాక! అగ్ని దేవుడు నీ శిరస్సును కాపాడుగాక! అష్టవసువులు నీ శరీర మంతటిని రక్షించుగాక! నేను ఇక్కడే ఉండి నీకు మేలుకలిగి, సుఖంగా కార్య సాధన చేసుకొని వచ్చేటందులకు ప్రార్థిస్తూ ఉంటాను. నీకు మార్గంలో సకల శుభాలూ కలుగుగాక. నీకోరిక ప్రకారం కార్యాన్ని సాధించుకొని తిరిగిరా!" అని తల్లి ఆశీర్వదించింది. గరుత్మంతుడు తల్లి ఆశీర్వచనాన్ని పొంది రెక్కల్ని విప్పార జేసి ఆకాశంలోకి ఎగిరాడు. ఆకలితో ఉన్న అతడు నిషాదుల పాలిట యమునిలాగా వారి దగ్గరకు చేరాడు. నిషాదుల సంహార సమయంలో భూమినుండి ఆకాశందాకా అతని వేగానికి దుమ్ము రేగింది. సముద్రంలో నీరు కూడా ఎండిపోయింది. ఆ సమీపంలో ఉండే చెట్లు అన్నీ కదిలిపోయాయి. నిషాదుల దగ్గరకు చేరాక ఆ బోయలను తినడానికి నోరు తెరిచాడు. నిషాదులు పారిపోకుండా వారి మార్గాన్ని అడ్డగించాడు. వెంటనే అతని నోటిలోనికి నిషాదులందరూ చేరారు. ఆతడి నోరు పెద్దగా తెరిచాడు. ఆ గరుడుని వేగానికి చెట్ల మీద ఉన్న పక్షులన్నీ ఆకాశంలోకి ఎగిరి పోయాయి. వేలకొద్దీ నిషాదులు అతడి నోటిలో ప్రవేశించారు. శత్రువుల్ని తపింపజేసే బలశాలియైన గరుత్మంతుడు ఆకలితో ఉండి మత్స్యజీవనులైన నిషాదుల్ని అందరినీ తననోటిలో ఇముడ్చుకొన్నాడు.

29. గజకచ్ఛపముల వృత్తాంతము.

ఆ గరుడుని కంఠంలో ఒక బ్రాహ్మణుడు తన భార్యతో సహా ప్రవేశించి అగ్నిలాగ దహిస్తూంటే, గరుడుడు ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! నా నోటినుండి బయటకు రా! ఎంత పాపాత్ముడైనా సరే నేను బ్రాహ్మణుని చంపను." అపుడు బ్రాహ్మణుడు గరుడునితో "నాభార్య నిషాది, ఆమె కూడా నాతోపాటు బయటకు రావాలి" అన్నాడు. "నిషాదుడా! నీ భార్యను గ్రహించి వెంటనే బయటకురా. నీవు నా జఠరాగ్నితో జీర్ణమగుట లేదు. వెంటనే నీ భార్యతో నిన్ను నీవు రక్షించుకో" అని గరుత్మంతుడు నిషాదునకు చెప్పాడు. వెంటనే విప్రుడు తన భార్యతో సహా వెలుపలికి వచ్చాడు. గరుడుని సంతోష పెట్టి ఆ విప్రుడు ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళిపోయాడు. బ్రాహ్మణుడు అతని భార్యతో వెళ్ళిన తరువాత గరుడుడు తన రెక్కల్ని విదిలించి

మనోవేగంతో ఆకాశంలోకి ఎగిరాడు. గరుడుడు తండ్రిని దర్శించాడు. తండ్రి అడిగితే గరుత్మంతుడు యథాన్యాయంగా తండ్రికి చెప్పాడు. అపుడు కశ్యపుడు ఇలా అడిగాడు."కుమారా! మీరందఱు కుశలమేనా? నీకు మానవలోకంలో కావలసినంత భోజనం లభిస్తున్నదా?" అని అడిగాడు. అపుడు గరుడుడు సమాధానం చెపుతున్నాడు. "నా తల్లి సదా కుశలమే; నేనును నా అన్నగారును కుశలమే. భోజనం బాగానే ఉన్నా నాకు మాత్రం కుశలం లేదు. మాతృదాస్య విముక్తికి సర్పాలు నన్ను అమృతాన్ని తీసుకొని రమ్మని ప్రేరేపించినాయి. అందుచేత అమృతం తీసుకొని రావటానికి వెళ్లుతున్నాను. నా తల్లి చెప్పి నట్లుగా మార్గ మధ్యంలో వేలకొద్దీ నిషాదుల్ని తిన్నాను. కాని నాకు తృప్తి కలుగలేదు. కాబట్టి నా ఆకలి తీరి, బలం కలగడానికి ఆహారం ఎక్కడ లభిస్తుందో చెప్పండి. దాన్ని తిని అమృతాన్ని తీసుకొని రావడానికి శక్తుడ నవుతాను. నా ఆకలి దప్పులు తీరటానికి తగిన ఆహారం గురించి చెప్పండి." అని తండ్రియైన కశ్యపమహర్షిని అడిగాడు గరుత్మంతుడు.

అపుడు కశ్యపుడు చెప్తున్నాడు. "కుమారా! మహాపుణ్యదాయకమై, దేవలోకంలో కూడ ప్రసిద్ధిచెందిన సరస్సు ఇది. ఆ సరోవరంలో ఒక ఏనుగు, తాబేలు నిరంతరం దెబ్బలాడుకొంటున్నాయి. పూర్వజన్మలో ఆ రెండిటికి గల వైరమే ఆ దెబ్బలాటకు కారణం. ఆ కథను నీకు పూర్తిగా చెపుతాను. వాటి పరిమాణాలను తెలియజేస్తాను. చక్కగా విను. పూర్వం విభావసుడు అనే మహర్షి ఉండేవాడు. అతడు కోపి. అతని తమ్ముడు సుప్రతీకుడు మహా తపస్వి. సుప్రతీకునికి అన్నగారి ధనాన్ని తన ధనాన్ని కలిపి ఉంచటం ఇష్టంలేదు. సుప్రతీకుడు అన్నగారిని నిరంతరం తనభాగాన్ని పంచి ఈయవలసినదిగా కోరేవాడు. అపుడు విభావసుడు తమ్ముడితో ఇలా అన్నాడు. 'తమ్ముడా! అనేకులు ధనవ్యామోహంతో విభాగాన్ని కోరుకొంటారు. ఆ విధంగా విడిపోయిన తరువాత ధనకాంక్షతో విరోధులై, దెబ్బలాడుకొంటారు. మిత్రులుగా కనిపించే శత్రువులు ఐకమత్యంతో ఉన్న కుటుంబంలోని వారికి స్పర్ధలు పెట్టి, విభజించుకో మంటారు. వేరు పడిపోయారని తెలిస్తే కొంతమంది మన భేదాలను ఆసరాగా చేసుకొని మరింత బాధిస్తారు. భిన్నమై పోయిన వారికి త్వరలో నాశనం కలుగుతుంది. కాబట్టి అన్నదమ్ములు పంచుకోవడం మంచిదికాదు. ఇది గురుశాస్త్రానికి విరుద్ధం కూడా. అంతేకాక వారు ఒకరినొకరు నమ్మరు. తమ్ముడా! సుప్రతీకా! ఈ విధంగా ఐక్యంగా ఉండకుండా నీ ధనాన్ని పంచాలని కోరుకొంటున్నావు గావున నీవు తరువాతి జన్మలో ఏనుగువై జన్మింతువు గాక! ఈ విధంగా శపింపబడిన సుప్రతీకుడు అన్నగారికి కూడా "తరువాత జన్మలో తాబేలుగా

జన్మింతువుగాక" అని ప్రతిశాపమిచ్చాడు. ఈ విధంగా ధనంకోసం సుప్రతీక విభావసులు ఇద్దరూ ఒకరినొకరు మూర్ఖత్వంతో శపించుకొని గజకచ్ఛపాలుగా జన్మించారు. కోపం అనే దోషంతో ఆ ఇద్దరూ జంతువులుగా జన్మించారు. పెద్ద పెద్ద గజ కచ్ఛపాలుగా పుట్టిన వారిద్దరూ పరస్పర ద్వేషంతో దెబ్బలాడుకొంటున్నారు. పూర్వవైరాన్ని బట్టి ఆ రెండూ ఆ సరస్సులో పడి దెబ్బలాడుకొనేవి. ఏనుగు నీరు త్రాగడానికి వచ్చి నప్పుడల్లా నీటిలోని తాబేలు దాని శబ్దాన్ని విని పైకిలేచి సరసును కలచివేస్తూ ఏనుగును బాధించేది. ఆ తాబేలును చూసి ఏనుగు తొండం మెలిపెట్టి నీటిలోకి ఉరికేది. దంతాలతో, తొండంతో, తోకతో, పాదాలతో కొట్టుతూ సరస్సు నంతటినీ క్షోభింప జేసేది. తాబేలు కూడా తల పైకెత్తి యుద్ధానికి సిద్ధపడేది. ఏనుగు ఆరుయోజనాల ఎత్తు, పన్నెండు యోజనాల పొడుగు ఉండేది. తాబేలు మూడు యోజనాల వెడల్పు, పదియోజనాల చుట్టుకొలత ఉండేది. పరస్పరం వధించుకోవాలని యుద్ధం చేస్తున్న వారిద్దరిని భక్షించి నీ అభీష్ట కార్యాన్ని నెరవేర్చుకో. కచ్ఛపం మేఘ సమానంగాను, ఏనుగు పర్వత సమానంగాను భయంకరంగా ఉన్నాయి. ఈ రెండింటిని భక్షించి అమృతాన్ని తీసుకొనిరా" అని కశ్యపుడు తన కుమారుడికి ఉపాయం చెప్పాడు. ఈవిధంగా కశ్యపుడు చెప్పి "దేవతలతో అమృతం కోసం పోరాడే నీకు విజయం కలుగుగాక" అని ఆశీర్వదించాడు. ఖగోత్తమా! పూర్ణకుంభం, బ్రాహ్మణుడు, గోవులు మొదలైన ఉత్తమ మైనవన్నీ నీకు శుభాన్నే కలిగిస్తాయి. మహాబలా! నీవు దేవతలతో యుద్ధం చేసేటపుడు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, పవిత్ర మైన హవిస్సులు, మొదలైన వన్నీ నీకు బలాన్ని ఇచ్చుగాక!" ఈ విధంగా తండ్రి ఆశీర్వదించాక గరుడుడు ఆ సరోవరానికి వెళ్ళాడు.

తండ్రి చెప్పిన విషయాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకొని అనేకపక్షులతో కూడి నిర్మలజలంతో ఉన్న ఆ సరోవరాన్ని చూశాడు. ఒక గోటితో గజాన్ని, మరోక గోటితో కచ్ఛపాన్ని పట్టుకొని గరుడుడు ఆకాశంలోకి ఎగిరిపోయాడు. ఆ విధంగా ఎగిరిపోతూ అలంబతీర్థం అనే ప్రదేశం దగ్గరకు చేరి ఆ రెంటిని తినడానికి అనువైన స్థలం కోసం వెదుకుతూండగా ఆతని వేగానికి వృక్షాలన్నీ కంపించాయి. మమ్మల్ని విఱగగొట్ట వద్దని ఆ వృక్షాలు మొఱ పెట్టుకొన్నాయి. సముద్రజలంతో ఆ చెట్లన్నీ వైడూర్యమణులతో బంగారంతో, వెండితో సమానమైన పండ్లతో ఆశ్చర్యకరంగా ప్రకాశిస్తున్నాయి. అపుడు అక్కడి పెద్ద మఱ్ఱి చెట్టు ఒకటి మనోవేగంతో వస్తున్న పక్షీంద్రునితో ఈ విధంగా అన్నది. "పక్షీంద్రా! నా యీ కొమ్మ నూరుయోజనాల పొడవు గలది. ఈ కొమ్మపై చేరి గజ కచ్ఛపాలను భుజించు." అని చెప్పింది. అనేకపక్షులతో సేవింపబడుతూ పర్వతంతో

సమానమయిన వైశాల్యం కలిగి ఉన్న ఆ చెట్టును కంపింప చేస్తూ, గరుడుడు దాని కొమ్మపై వ్రాలగానే ఆ కొమ్మ విరిగిపోయింది.

30. గరుత్మంతుడు రౌహిణశాఖను నిర్జనపర్వతముపై విడచుట.

బలిష్ఠుడైన గరుత్మంతుడు ఆ రౌహిణ వృక్షంపై పాదం పెట్టగానే ఆ చెట్టు కొమ్మ ఫెళఫెళ విరిగి పోయింది. వెంటనే ఆ చెట్టు కొమ్మనుకూడ పట్టుకొన్నాడు. పెద్దదయిన ఆ కొమ్మను పట్టుకొని ఆశ్చర్యంతో చూశాడు. అధోముఖులై వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న వాలఖిల్యులు అనే మహర్షులను చూశాడు ఖగేంద్రుడు. "ఈ కొమ్మకు తాపసులు వ్రేలాడుతున్నారు. వీరిని చంపకూడదు. ఈ కొమ్మను విడిచి పెడితే వీరిని చంపినట్లే" అని ఆలోచించి, గజకచ్ఛపాలను కాలిగోళ్లతో గట్టిగా పట్టుకొన్నాడు. తాపసులు పడిపోతారేమో అనే భయంతో గరుత్మంతుడు 'చూస్తూ ఉంటాను కదా' అని ఆ కొమ్మను నోటితో పట్టుకొన్నాడు. దేవతలు కూడా చేయలేని ఈ మహత్కార్యాన్ని గరుత్మంతుడు చేస్తూంటే వాలఖిల్య మహర్షులు ఆశ్చర్యపడటమే కాకుండా దయదలచి విహగేంద్రునికి పేరు పెట్టారు. ఈ పక్షీంద్రుడు ఆకాశంలో అధికభారాన్ని భరిస్తూ ఎగురుతున్నాడు. కాబట్టి గరుడుడు అని నామకరణం చేశారు. పన్నగాలను తినే ఆ పక్షీంద్రుడు అలా గరుడుడు అయ్యాడు. తరువాత గరుడుడు రెక్కల్ని విప్పారజేసి, పర్వతాన్ని కంపింపజేస్తూ గజకచ్ఛపాలతో, మునీంద్రులతో అనేక ప్రాంతాల్ని చూసుకొంటూ ఎగురుతున్నాడు. ఎక్కడా స్థానం దొరకలేదు. వాలఖిల్యాదులకు ఆపద కలుగ కూడదనే భావంతో ఆ పక్షీంద్రుడు త్వరగా గంధమాదన పర్వతాన్ని చేరాడు. ఆ పర్వతంమీద తపస్సు చేసుకొంటున్న తండ్రిని చూశాడు. కశ్యపుడు కూడా దివ్య రూపంలో ఉన్న విహగేంద్రుని చూశాడు. అమితతేజోవంతుడు, బలపరాక్రమోపేతుడు, వాయువేగ మనో వేగాలతో పర్వత శిఖరంలాగా, ఎత్తిన బ్రహ్మదండం లాగా ప్రవేశించే కుమారుని కశ్యపుడు చూశాడు. అతని రూపం ఊహింప రానిది, చెప్పలేనిది. సమస్త ప్రాణికోటికి భయంకరుడు, మహావీర్యవంతుడు, రౌద్రాకారుడు, అయి అతడు సాక్షాత్తు అగ్నిస్వరూపంలా ఎగురుతున్నాడు. దేవతలు, రాక్షసులు,దానవులు అతనిని చేరడానికి భయపడుతారు. అతడు అజేయుడు. పర్వతశిఖరాల్ని పగులగొట్టగలడు. సముద్రజాలాన్ని శుష్కింపజేయగలడు. సమస్తలోకాల్ని భయకంపితుల్ని చేయగలడు. యమునితో సమానుడు. భగవంతుడైన కశ్యపుడు అలా వచ్చిన కుమారుని చూచి అతని మనస్సు లోని సంకల్పాన్ని గ్రహించి ఈ విధంగా అంటున్నాడు.

కశ్యపుడు గరుడునితో "కుమారా! సాహసం చేయకు. మనస్సులో బాధపడవద్దు.

వాలిఖిల్యులు నీపై కోపించి దహించివేయకుందురుగాక!" తన కుమారుని కారణంగా మహాత్ములై, కల్మషరహితులైన వాలఖిల్యులను కశ్యపుడు అనుగ్రహింప జేశాడు. కశ్యపుడిలా అన్నాడు. 'తాపసులారా! గరుడుడు ప్రజల క్షేమం కోరి గొప్ప కార్యం చేయబోతున్నాడు. దానిని మీరు అనుమతించండి.' కశ్యపుని ప్రార్థనను అంగీకరించి వాలఖిల్యాదులు ఆ చెట్టు కొమ్మను విడిచి హిమవత్పర్వతానికి తపస్సుకై వెళ్ళిపోయారు. ఆ మహర్షులు వెళ్ళిపోయిన తరువాత గరుడుడు చెట్టుకొమ్మతోనే నోరు తెరచి తండ్రిని ఇలా అడిగాడు. 'భగవంతుడా! ఈ చెట్టు కొమ్మనుఎక్కడ విడిచి పెట్టను? మానవ సంచారం లేని ప్రదేశాన్ని నాకు చెప్పండి.' "మంచుతో కప్పబడిన పర్వతం ఉన్నది. అది ఎవ్వరూ సంచరింపలేని ప్రదేశం. దాని గుహలు మంచుతో కప్పబడిఉంటాయి. మనసుతో కూడా అక్కడికి ఎవరూ వెళ్లలేరు" అని కశ్యపుడు చెప్పాడు. వెంటనే గరుడుడు విశాల మయిన ఆ పర్వతం మీదికి గజకచ్ఛపాలతోనూ, ఆ కొమ్మతోనూ వేగంగా ఎగిరిపోయాడు. గరుడుడు తీసుకొని పోతున్న ఆ కొమ్మను నూరు పశువుల చర్మపు (తోలు) త్రాడుతో కూడ కట్టలేము.

గరుడుడు లక్ష యోజనాల దూరంలో నున్న ఆ పర్వతం దగ్గరకు స్వల్పకాలంలోనే చేరుకున్నాడు.

తన తండ్రి చెప్పిన ప్రకారం గరుత్మంతుడు పర్వతం దగ్గరకు క్షణంలో వెళ్లి ఆ చెట్టుకొమ్మను జారవిడిచాడు. అదిపెద్ద ధ్వని చేస్తూ పడి పోయింది. అతని రెక్కల వేగానికి ఆ పర్వతం కంపించింది. అక్కడి వృక్షాలు (అతనిపై) పుష్పవర్షాన్ని కురిపించాయి. మణులతో, రత్నాలతో కూడిన ఆ పర్వతశిఖరాలు బ్రద్దలై శోభించాయి. అక్కడ ఈ కొమ్మపడేసరికి ఆ చెట్ల పుష్పాలు మెఱుపుతో కూడిన మేఘాల కాంతికి బంగారు పుష్పాల వలె ప్రకాశిస్తున్నాయి. బంగారుపుష్పాలతో ప్రకాశించే వృక్షాలు భూమిపై పడి పర్వతం మీది గైరికాది ధాతువులతోకూడటం వల్ల సూర్య కిరణాల కాంతితో కొమ్మలన్నీ ప్రకాశిస్తున్నాయి. అపుడు గరుడుడు ఆ పర్వతశిఖరం చేరి ఆ గజకచ్ఛపాలను రెండిటినీ భక్షించాడు. ఆ రెండిటినీ తినిన తరువాత గరుడుడు పర్వతశిఖరంనుండి మహావేగంతో ఎగిరి పోయాడు.

గరుడుడు ఎగిరివస్తున్నపుడు దేవతలకు భయసూచకమైన చాలా అపశకునాలు కనిపించాయి. ఇంద్రునికి ఇష్టమైన వజ్రాయుధం భయంతో ప్రజ్వరిల్లింది. ఆ సమయంలో పగటిపూటే అగ్నితోకూడిన ఉల్క రాలిపడింది. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, సాధ్యులు, మరుద్గణాలు మొదలైన దేవతాగణాల ఆయుధాలు ఒకదానినొకటి ఢీకొంటున్నాయి.

దేవాసుర యుద్ధసమయంలో కూడా ఇటువంటి ఉల్కాపాతాలు, ఉపద్రవాలు జరగలేదు. మబ్బులు లేకపోయినా ఆకాశం పెద్దపెద్ద ఉరుములతో గర్జించింది. దేవతలకు దేవుడైన పర్జన్యుడు కూడా భయపడ్డాడు. నెత్తుటి వర్షం కురిసింది. దేవతల మెడలోని పుష్పహారాలు వాడిపోయాయి. వారి దివ్యతేజస్సు గూడా తరిగిపోయింది. మేఘాలు భయంకరంగా రక్తాన్ని వర్షించాయి. ఆ సమయంలో లేచిన దుమ్ము దేవతల కిరీటాల్ని మలినం చేసింది. ఇంద్రుడు ఆ భయంకరోత్పాతాలకు అపశకునాలకు భయపడి తమ గురువైన బృహస్పతిని దానికి కారణాన్ని అడిగాడు.

"ఆచార్యా! అకస్మాత్తుగా ఈ ఉత్పాతాలు, అపశకునాలు ఎందుకు కలిగాయి? యుద్ధంలో మనలను ఎదిరించగల శత్రువులు కనపడటం లేదు!" అపుడు బృహస్పతి అంటున్నాడు. 'దేవేంద్రా! ఇదంతా నీ అపరాధం వల్లనే వచ్చింది. తపస్సు చేసుకొనే మహాత్ములు వాలఖిల్యాది మహర్షులకు నీవు చేసిన అవమానం వల్లనే ఈ ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. వినతాకశ్యపుల పుత్రుడయిన ఖగేంద్రుడు కామరూపుడు. మహాబలపరాక్రమవంతుడు. అతడు మన అమృతాన్ని హరించటానికి వస్తున్నాడు. అతడు బలవంతులలో శ్రేష్ఠుడు. అమృతాన్ని అపహరించడానికి సమర్థుడు. అతడు అన్ని పనులూ చేయగలడు. అసాధ్యంకూడా సాధ్యం చేయగలడు.' ఉగ్రశ్రవుడు ఈ విధంగా చెపుతున్నాడు. ఇంద్రుడు బృహస్పతియొక్క మాటల్ని విని అమృత రక్షకులతో ఇలా అన్నాడు. "బల వీర్య సంపన్నుడయిన పక్షి ఇపుడు అమృతం హరించడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు అమృతం హరించకుండా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. వానికి సాటిలేని బలం ఉందని బృహస్పతి చెప్పారు." ఆ మాటలు విన్న దేవతలు ఆశ్చర్యపడి, అమృతం చుట్టూ నాల్గుదిక్కులా రక్షణ కల్పించారు. ఇంద్రుడు కూడా వజ్రాయుధంతో నిలిచాడు. దేవతలు వైడూర్యాలు పొదిగిన బంగారు కవచాలను ధరించారు. అవి ఎంతో విలువైనవి. విచిత్రమైనవి కూడా. దేవతలు శరీరాలకు ప్రకాశమిచ్చే, దృఢమైన కవచాలు, డాలులు ధరించారు. వారి చేతుల్లో రకరకాలైన భయంకర శస్త్రాలు మెరిసిపోతున్నాయి. చక్రాలు, పరిఘలు, త్రిశూలాలు, పరశ్వధాలు, శక్తులు, కత్తులు, గదలు మొదలైన ఆయుధాలు, పదునైన అంచులతో, నిప్పులు క్రక్కుతూ ఉన్నాయి. వారు తమతమ శరీరాలకు తగిన ఆయుధాలు గ్రహించి ఎత్తి పట్టుకొని నిలిచారు. శస్త్రాలతో వారి ఆభరణాలు ధగ ధగా మెరిసిపోతున్నాయి. దేవతలు కల్మషం లేకుండా ధైర్యంతో కాపలా కాస్తున్నారు. సాటిలేని బలపరాక్రమాలతో అమృతాన్ని రక్షించుకొనటానికి నిశ్చయించుకొని రాక్షసనగరాలను ధ్వంసం చేసే దేవతలు అగ్నిహోత్రాల వలె ప్రకాశిస్తున్నారు.

ఇలా దేవతలు యుద్ధానికి సిద్ధమయ్యారు. రణభూమిలో పరిఘాది - ఆయుధాలు లక్షలకొద్దీ ఉన్నాయి. పదునైన ఆ ఆయుధాలపై సూర్య కిరణాలు పడి 'ఆకాశం క్రిందికి పడిందా' అన్నట్లు ప్రకాశిస్తున్నాయి.

31. ఇంద్రుడు వాలఖిల్య మహర్షులను అవమానించుట- అరుణుడు, గరుత్మంతుడు పుట్టుట.

శౌనకుడు ప్రశ్నిస్తున్నాడు. "సూతనందనా! మహేంద్రుడు ఏ అపరాధం చేశాడు? ఏమి ప్రమాదం వచ్చింది? వాలఖిల్యాదుల తపః ప్రభావంతో గరుడుడు ఎలా జన్మించాడు? కశ్యపుడు బ్రాహ్మణుడు కదా! అతనికి పక్షిరాజు జన్మించడమేమిటి? అతడు సర్వప్రాణికోటిని ఎదిరింప శక్యంకానివాడు, అవధ్యుడు ఎలా అయ్యాడు? అతడు తనఇష్టానుసారంగా చరించడానికి, ఇష్టానుసారం పరాక్రమించడానికి కారణం ఏమిటి? పురాణాల్లో ఏమైనా చెప్పబడిందా? అయితే ఈ విషయాన్ని గురించి గరుడుని కథ చెప్పండి." ఉగ్రశ్రవుడు చెప్పుతున్నాడు. 'నీవడిగిన ఈ గరుడుని కథ పురాతనమైనది. దీనినంతటిని సంగ్రహంగా చెపుతాను. విను. కశ్యపప్రజాపతి పుత్రకామేష్టి చేస్తున్నపుడు అతనికి అనేక ఋషులు, దేవతలు, గంధర్వులు సహాయపడుతున్నారు. ఆ యజ్ఞానికి కావలసిన సమిధలు తీసుకొని రావటానికి కశ్యపుడు ఇంద్రుని, వాలఖిల్యాది మహర్షులను, మరికొందరు దేవతల్ని నియమించాడు. ఇంద్రుడు బలశాలిగదా! తనబలానికి తగినట్లుగా పర్వతంలాంటి పెద్ద కట్టెల మోపును ఎత్తికొని సునాయాసంగా తీసుకొని వస్తున్నాడు. అపుడు అంగుష్ఠమాత్రశరీరం కలిగి పొట్టిగా ఉన్న వాలఖిల్యాది మహర్షులు ఒక్కొక్క రావి సమిధను పట్టుకొని యజ్ఞశాలకు వస్తూండగా వాళ్లను ఇంద్రుడు చూశాడు. వారు తమ అవయవాల్లో మునిగిపోయినంత బక్కగా ఉన్నారు. నిరాహారులైన తపోధనులు, కృశాంగులు కాబట్టి బలహీనులు. గోవు పాదముద్రలో ఉన్న నీటిలో కూడా మునిగి పోతారు. వారందరినీ బలగర్వితుడైన ఇంద్రుడు ఆశ్చర్యకరంగా చూస్తూ అపహసించి వారికంటె ముందుగా వెళుతూ అవమానించాడు. మహర్షులు మిక్కిలిగా కోపించి దీనులై ఇంద్రునికి భయంకలిగించే ఒక మహాకార్యాన్ని తలపెట్టారు.

ఆ తాపసోత్తములు ఉదాత్తానుదాత్త స్వరాలతో శాస్త్రోక్తంగా అగ్నిహోత్రునికి ఏ కోరికతో ఆహుతులను ఇచ్చారో చెపుతా విను. 'పాకశాసనుని కంటె బలవంతుడు, కామవీర్యుడు, కామగమనుడు, సర్వ దేవతలకు మరొక ఇంద్రుడగు కుమారుడు జన్మించుగాక! అతడు ఇంద్రునకు భయప్రదుడగుగాక. ఆ జన్మించేవాడు ఇంద్రునికంటె నూరురెట్లు

శౌర్యంలో, అధికుడుగా ఉండుగాక, మనోవేగం కలవాడగుగాక. మా తపస్సునకు ఫలంగా ఈ దారుణం సంభవించుగాక!' ఇంద్రుడు ఈ విషయాన్ని తెలుసుకొని భయపడి బాధపడుతూ కఠోరనియమం కల కశ్యపమహర్షిని శరణు వేడడానికి వెళ్లాడు. దేవరాజైన ఇంద్రుని ద్వారా వాలఖిల్యాదుల సంకల్పాన్ని కశ్యపుడు విని వారి దగ్గరకు వెళ్ళి వారి కార్యసిద్ధిని గురించి ప్రశ్నించాడు. సత్యవాదులైన ఆ మహర్షులు కశ్యపునితో "మేము అనుకొనినట్లే శతక్రతుభయంకరుడైన ఇంద్రుడు జన్మించుగాక" అని చెప్పారు. అపుడు కశ్యపుడు వారిని శాంతింప జేస్తూ ఇలా అన్నాడు. 'తపోధనులారా! బ్రహ్మయొక్క ఆజ్ఞవలన ఈ పురందరుడు ముల్లోకాలకూ ఇంద్రుడిగా నియమింపబడ్డాడు. మరి మీరు మరొక ఇంద్రుడి కోసం ప్రయత్నించారు. పరమేష్ఠి వాక్యం వ్యర్థం కాకూడదు కదా! మహాత్ములారా! మీ మాటకూడా వ్యర్థంకారాదు కదా! మీ సంకల్పం ప్రకారం అత్యంత బలసంపన్నుడైన ఇంద్రుడు జన్మించుగాక! కాని అతడు పక్షీంద్రుడగుగాక! ఇంద్రుడిని మీరు మన్నించండి." ఈ విధంగా కశ్యపుడు చెపితే ఆ తపోధనులు శాంతించి ఆ మహర్షి పైగల గౌరవంతో ఇలా అన్నారు. వాలఖిల్యులు ఇలా అన్నారు -"మా అందరి ప్రయత్నమూ ఇంద్రుని కోసం. మీ ప్రయత్నం కుమారుడు పుట్టాలని. ఇపుడీ పని ఇలా సఫలమయింది-దానిని మీరే గ్రహించండి. ఇపుడు శ్రేయస్సు కలిగేటట్లు జరిపించండి."

ఉగ్రశ్రవుడు ఇలా అంటున్నాడు. "ఈ సమయంలోనే శుభలక్షణసంపన్నురాలూ, దక్షపుత్రిక అయిన వినత పుత్రసంతానాన్ని పొందాలనే కోరికతో తపస్సుతో వ్రతాన్ని పాటిస్తున్నది. ఋతుకాలం రాగానే స్నానం చేసి భర్తను సేవించడానికి కశ్యపుని దగ్గరకు వచ్చింది. అపుడు కశ్యపుడు ఆమెతో ఇలా అన్నాడు. 'దేవీ! నీకోరిక తప్పక నెరవేరుతుంది. నీకు ఇద్దరు కుమారులు జన్మిస్తారు. వారు మహాపరాక్రమవంతులు. ముల్లోకాల్నీ శాసించే శక్తిమంతులుగా, వీరులుగా జన్మిస్తారు. వాలిఖిల్యాది మహర్షుల తపః సంకల్పం, నా సంకల్పం కూడా అదే. ఆ మహర్షుల ఆశీర్వాదం వల్ల ముల్లోకాలచే గౌరవింపబడే పుత్రులిద్దరు నీకు జన్మిస్తారు.' ఇదంతా చెప్పిన తరువాత మరల వినతతో ఇలా అన్నాడు 'దేవీ! ఈ గర్భం అభ్యుదయకరం. జాగ్రత్తగా కాపాడుకో. నీకు జన్మించే ఆ ఇద్దరు కుమారులు పక్షులన్నిటికీ ఇంద్రులుగా గౌరవింపబడతారు. పక్షిరూపంలో ఉన్నప్పటికీ తమ ఇష్టానుసారంగా వీరూపం కావాలన్నా ధరించగలరు. లోకం మెచ్చుకొనే వీరులుగాకూడా ప్రసిద్ధి కెక్కుతారు. తరువాత కశ్యపుడు ఇంద్రునికి ప్రీతిగా ఇలా అంటున్నాడు. "పురందరా! ఈ పరాక్రమవంతులు ఇద్దరు నీకు సహాయకులుగానే ఉంటారు. నీకు వారివల్ల ఎటువంటి హాని కలుగదు. నీవు ఏమాత్రం విచారపడవద్దు. నీవే దేవతలందరికీ ఇంద్రుడవు. నిర్భయంగా

ఉండు. ఇంద్రా! ఇక ఎప్పుడూ బ్రహ్మవాదులను అవమానించకు. గర్వం పనికిరాదు. వాళ్ళదగ్గర వాక్కు అనే వజ్రం ఉంది. అది నీ వజ్రాయుధం కంటే గొప్పది సుమా!" ఈ మాటలు విన్న ఇంద్రుడు తనసందేహాన్ని పోగొట్టు కొని సంతోషంగా స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. వినతకూడా తన కోరిక నెరవేరినందుకు చాల సంతోషించింది. వినతకు అరుణుడు, గరుడుడు అనే ఇద్దరు కుమారులు జన్మించారు. వారిలో అరుణుడు వికలాంగుడు. అతడు సూర్య భగవానునికి ముందు ఉన్నాడు. భృగుకుమారా! రెండవ కుమారుడైన గరుడుడు పక్షీంద్రుడుగా అభిషేకింప బడ్డాడు. ఇపుడు మీరు అతని పరాక్రమాన్ని గురించి వినండి."

32. గరుడుడు యుద్ధము చేసి దేవతలను ఓడించుట.

ఉగ్రశ్రవుడు శౌనకుడితో చెపుతున్నాడు. "బ్రాహ్మణోత్తమా! దేవతలందరూ అస్త్రశస్త్రాలతో గరుడునితో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. పక్షీంద్రుడయిన గరుడుడు దేవతల్ని సమీపించాడు. దేవతలు అతిబలవంతు డయిన గరుడుని చూడగానే వణికి పోయారు. వారి ఆయుధాలు ఒక దానినొకటి డీకొన్నాయి. అక్కడ అగ్నితోను, విద్యుత్తుతోను సమానంగా ప్రకాశించే తేజస్వంతుడు, మహాపరాక్రమవంతుడు అయిన భౌమనుడు(విశ్వకర్మ) అమృతరక్షకభటుడుగా ఉన్నాడు. అతడు పక్షీంద్రునితో రెండు ఘడియలపాటు యుద్ధం చేశాడు. కాని గరుడుడు అతడిని రెక్కలతో, ముక్కుతోను, గోళ్లతోను బాధించి సంహరించాడు. గరుడుడు తనపక్షవిక్షేపంతో స్వర్గలోకం అంతా దుమ్ము వ్యాపించేటట్లు చేశాడు. ఆ విధంగా వారి చూపును మందగింప జేశాడు. ఆ విధంగా వ్యాపింపజేసిన దుమ్మువలన దేవతలందరు అంధకారంలో పడిపోయారు. అమృతరక్షకులుకూడా ఆ దుమ్ము వలన గరుడుని చూడలేక పోయారు. ఇలా గరుడుడు స్వర్గలోకాన్ని కకావికలం చేశాడు. అంతేకాదు. తన రెక్కలతోను, ముక్కుతోను దేవతల్ని చీల్చి చెండాడాడు. అపుడు సహస్రాక్షుడైన ఇంద్రుడు వాయుదేవుని ప్రేరేపించాడు."మారుతా! ఈ ధూళిని చెదరగొట్టడం నీ పనే సుమా" అని ఆజ్ఞాపించాడు. ఇంద్రుని ఆజ్ఞప్రకారం వాయుదేవుడు ఆ ధూళిని చెదరగొట్టాడు. అంధకారం తొలగిపోయింది. దేవతలు పక్షిరాజును తమ అస్త్రశస్త్రాలతో బాధింప సాగారు. దేవతల ప్రహారాలను సహిస్తూ ఆకాశానికి ఎగిరి మేఘంలాగా భయంకరంగా అట్టహాసం చేస్తూ అందరిని భయభ్రాంతులను చేస్తున్నాడు గరుడుడు.

శత్రువీరులను సంహరిస్తూ పక్షీంద్రుడు తన పరాక్రమం చూపిస్తున్నాడు. ఆకాశంలోని కెగిరి దేవతలతో పోరాడుతున్నాడు. దేవతలందరు ఇంద్రుడితోసహా అతనిపైకి పట్టిశం,

పరిఘ, శూలం, గద మొదలైన అనేకాయుధాలను ప్రయోగిస్తున్నారు. అగ్నితో సమానంగా ప్రజ్వరిల్లే అర్ధ చంద్రాకార బాణాలు (క్షురములు), సూర్యునితో సమానంగా ప్రకాశించే చక్రాయుధాలు, ఇంకా అనేకాయుధాలు గరుడునిపై ప్రయోగిస్తూ యుద్ధం చేస్తున్నారు. వారందరూ కలసి పోరాడుతున్నా గరుడుడు ఏమాత్రం చలింప లేదు. ప్రతాపవంతుడైన వినతాసుతుడు ఆకాశంనుండే తనరెక్కలతోను, తొమ్ముతోను వాళ్లను ఎదుర్కొంటూ అంతటా తానై విజృంభిస్తున్నాడు. గరుడునిచేత బాధింపబడిన దేవతలందఱు చెల్లాచెదరు అయ్యారు. గరుడుని దెబ్బలకు రక్తం కార్చుకొంటూ అటూఇటూ పరువు లెత్తారు. గరుడుని దెబ్బలకు తట్టుకోలేక సాధ్యులు, గంధర్వులు తూర్పు దిక్కుకు పారిపోయారు. వసువులు దక్షిణదిశకు పారిపోయారు. రుద్రులు కూడా దక్షిణ దిక్కుకు పారిపోయారు. ఆదిత్యులు పడమటిదిక్కుకు, అశ్వినీదేవతలు ఉత్తర దిక్కుకు పారిపోయారు. మహాపరాక్రమవంతుని ధాటికి భయపడుతూ మాటి మాటికి వెనుదిరిగి చూస్తూ భయంతో పారిపోతున్నారు. ఆకాశంలో అశ్వక్రందుడు, రేణుకుడు, తపనుడు, ఉలూకుడు, శ్వసనుడు, ప్రరుజుడు, పులినుడు అనే యక్షులతో ఖగేంద్రుడు భయంకరంగా యుద్ధం చేస్తున్నాడు. కాని వారినందరినీ తానొక్కడే గోళ్ళతోను, రెక్కలతోను, ముక్కుల తోను, ప్రళయకాలంలోని రుద్రుడు లాగా బాధించి ఓడించాడు. ఆ యక్షులందరు మహాబలాఢ్యులు. ఉత్సాహంతో పోరాడారు. వారు గరుడని దెబ్బలతో రక్తం కార్చుకొంటూ మేఘాల్లాగా చెల్లాచెదరయ్యారు. అలా వాళ్లను అందరినీ సంహరించి గరుడుడు అమృతాన్ని తీసుకొని వెళ్లడానికి ఆ ప్రదేశానికి వచ్చాడు. అక్కడ దాని చుట్టూ ప్రజ్వరిల్లుతున్న అగ్నిని చూశాడు. ఆ అగ్నికి తోడుగా వాయువు వీచింది. ప్రళయాగ్నిలాగా మండుతూ ఆకాశం అంతా అగ్ని జ్వాలలు వ్యాపించాయి. మహావేగశాలియైన గరుడుడు ఎనిమిదివేల వంద ముఖాల్ని కల్పించుకొని, అనేకనదులలోని జలాన్ని పీల్చి, అమితవేగంతో అమృతం ఉన్నచోటికి వచ్చి, పూత్కరించి, నీటిని అంతటా వెదజల్లి అగ్నిని చల్లార్చాడు. తరువాత తన శరీరాన్ని బాగా కుంచింప జేశాడు.

33. గరుడుడు అమృతమును అపహరించుట.

గరుడుడు కనకమయరూపుడై, కిరణసముదాయంతో ఉజ్జ్వలుడై, సముద్రంలోకి ప్రవేశించే నదీజలవేగంతో బలంగా ప్రవేశించాడు. ఆ అమృతం దగ్గర ఒకచక్రం ఉంది. ఎవ్వరూ ప్రవేశించడానికి వీలులేకుండా అతివేగంగా తిరుగుతోంది. ఆ చక్రం వాడి అంచులు కలిగి ఉంది. దాన్ని గరుడుడు చూశాడు. ఆ భయంకరమైన చక్రం అగ్నివలె,

సూర్యునివలె జాజ్వల్యమానంగా ఉంది. దేవతలు అమృతరక్షణార్థం ఆ చక్రాన్ని అతిభయంకరంగా నిర్మింపచేశారు. అమృతం హరించే వారిని అది ఛేదిస్తుంది. గరుత్మంతుడు ఆ చక్రంలోపలికి చూస్తూ ఆకాశంలో నిలిచి, క్షణంలో తన శరీరాన్ని సంకుచితం చేసి ఆ చక్రంలోని ఆకుల మధ్యలో ప్రవేశించాడు. ఆ చక్రం క్రింద అమృతరక్షణ కోసం రెండు పెద్దపెద్ద పాములున్నాయి. వాటి నాలుకలు విద్యుల్లతల వలె ఉన్నాయి. మండే అగ్నుల్లా ఉన్నాయి సర్పాలు. వాటి కళ్లు విషం క్రక్కుతూ భయంకరంగా ఉన్నాయి. అవి సదా క్రోధంతో వేగంగా ముందుకు దూకుతున్నట్లున్నాయి. ఆ సర్పాల కళ్లల్లో క్రోధాగ్ని మండుతూ ఉంటుంది. అవి రెప్పవాల్చకుండా అమృతాన్ని కాపాడుతున్నాయి. ఆ సర్పాల్లో దేన్ని చూసినా వెంటనే వారు భస్మం కావలసిందే. ఆ పరిస్థితిలో గరుడుడు వాటికి కనపడకుండా ఆ సర్పాల కళ్లల్లో దుమ్ముకొట్టి వాటిని అన్ని దిక్కులనుండి పొడిచివేశాడు. ఆకాశంలో చరించే పక్షీంద్రుడు ఆ సర్పాలను పట్టుకొని వాటిని మధ్యకు రెండుముక్కలు చేశాడు. తరువాత వెంటనే అమృతపాత్ర గ్రహించాడు. బలిష్ఠ డయిన గరుత్మంతుడు వేగంగా అమృతపాత్ర పైకెత్తి, ఆ యంత్రాన్ని బ్రద్దలు గొట్టి వెంటనే వేగంగా పాత్రతో పైకెగిరాడు. అతడు అమృతం లభించినా త్రాగలేదు. త్వరగా ఆ చోటునుండి వెళ్లిపోవాలనే క్రోరికతో సూర్యకాంతిని తిరస్కరిస్తూ అలసట లేకుండా వచ్చేశాడు.

అపుడు శ్రీమన్నారాయణుడు అతని అలోలుపత్వానికి సంతోషించి ఆకాశంలో అతనికి ప్రత్యక్షమయ్యాడు. అతని కార్యదీక్షకు సంతోషించాడు. అందుచేత అవ్యయు డయిన విష్ణుమూర్తి గరుడునితో "నీకు వరమివ్వాలని అనుకొంటున్నాను" అన్నాడు. ఆకాశంలో చరించే గరుడుడు "మాపైన (ధ్వజం మీద) ఉంటాను" అని కోరాడు. ఇంకా "అమృతం త్రాగకుండానే నాకు ముసలితనమూ, మరణమూ లేకుండా వరం ఇవ్వవలసినదిగా ప్రార్థిస్తున్నాను" అని విష్ణుమూర్తిని గరుడుడు ప్రార్థించాడు. 'అలాగే' అని విష్ణుమూర్తి గరుడునికి వరం ఇచ్చాడు. ఇలా రెండు వరాలు పొంది మళ్లీ గరుడుడు విష్ణువుతో ఇలా అన్నాడు. 'దేవా! నేను కూడా నీకు వరం ఇవ్వాలని' అనుకొంటున్నాను. అని అనగానే "నీవు నాకు ఎప్పుడూ వాహనంగా ఉండు" అని గరుడుని విష్ణువు కోరాడు. విష్ణుమూర్తి గరుడునికి తన ధ్వజంలో స్థానం ఇచ్చాడు. ఆ విధంగానే ఉంటానని గరుడుడు నారాయణునితో అని, అతనిని విడిచి వాయువేగంతో కదలిపోతూంటే ఇంద్రుడు అమృతాన్ని అపహరించుకొని వెళ్తున్నాడనే రోషంతో గరుడునిపై వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రంచేత అడ్డగింపబడిన ఖగేంద్రుడు ఇంద్రునితో పరిహాసంగా నవ్వుతూ మధురంగా ఇట్లా అన్నాడు. "దేవరాజా! నీ వజ్రాయుధం దధీచి మహర్షి వెన్నెముకతో తయారయింది.

కాబట్టి ఈ ఆయుధాన్ని అవమానిస్తే మహర్షిని అవమానించినట్లే. ఆ మహనీయుని యందలి గౌరవంతో ఒక్క ఈకను మాత్రం ఇస్తున్నాను. దాన్నికూడా నీవు ఏమీ చేయలేవు. నీ వజ్రప్రహారం వల్ల నాశరీరానికి ఎటువంటి బాధ కలుగదు సుమా!" అని ఇంద్రునితో పలికి ఆ పక్షీంద్రుడు ఒక్క ఈకను వదిలాడు. ఈవిధంగా ఈకను విడవటం చూచిన సంతోషించిన జనులు "ఇతడు సుపర్ణుడు అగుగాక!" అని పేరు పెట్టారు. ఈ ఆశ్చర్యకరసంఘటనను ఇంద్రుడు గుర్తించి, ఈ పక్షి సామాన్యుడు కాడని మహాఖగేంద్రు డని తలచి అతనితో ఇలా అన్నాడు. 'ఖగోత్తమా! నీమహత్తరమైన బలాన్ని గూర్చి వినవలెనని అనుకొంటున్నాను. నీతో స్నేహం చేయాలని కోరుకొంటున్నాను.'

34. ఇంద్ర గరుడుల స్నేహము, మాతృదాస్యవిముక్తి.

గరుడుడు చెప్పాడు. 'దేవేంద్రా! నీవు కోరిన ప్రకారం నీతో సఖ్యానికి అంగీకరిస్తున్నాను. సహింపరాని, నా మహాబలాన్ని గురించి తెలుసుకో! మహేంద్రా! తమబలాన్ని కానీ, గుణాలను కానీ తామే పొగడుకొనటాన్ని సత్పురుషులెవ్వరూ గొప్పగా ప్రశంసించరు. నీవు స్నేహం చేయాలని కోరావు కాబట్టి చెప్పకతప్పదు. ఇది ఆత్మస్తుతి కాదు. అవసరం కదా! పర్వతాలతో అడవులతో కూడిన భూమినంతటినీ, అపారమైన సముద్రాలనూ, నిన్ను, నీదేవలోకాన్ని కూడా ఒక్క రెక్కతో మోయగల బలం నాది. స్థావర జంగమాత్మకమైన ఈ బ్రహ్మాండాన్ని అంతటిని ఒక్కరెక్కతో అనాయాసంగా మోయగల బలం నాది అని తెలుసుకో. గరుడుని పరాక్రమాన్ని విన్న సర్వలోక హితుడైన దేవేంద్రుడు పక్షీంద్రునితో "మిత్రమా! నీవు చెప్పింది అంతా సత్యమే. అది సాధ్యమే, అందుచేత నాతో మైత్రిని స్వీకరించు ! నీకు అమృతం అక్కరలేదుకదా! కావున నాకు అమృతకలశాన్ని తిరిగి ఇచ్చేయవలసింది. నీవు దీన్ని ఎవరికయినా ఇస్తే వారు మమ్మల్ని బాధించవచ్చు." అపుడు గరుత్మంతుడు చెప్పాడు. "దేవేంద్రా! ఒకానొక కారణంచేత ఈ అమృతాన్ని తీసుకొని వెళ్తున్నాను. దీనిని త్రాగటానికి ఎవ్వరికీ ఇవ్వను. నేను స్వయంగా ఎక్కడ దీనిని ఉంచుతానో, అక్కడ నుండి వెంటనే దానిని నీవు హరించి తీసుకొని వెళ్లు." అపుడు ఇంద్రుడు ఇలా అన్నాడు. 'పక్షీంద్రా! ఇపుడు నీమాటలకు సంతోషం కలిగింది. నీకు నానుండి ఏ వరం కావాలో కోరుకో.'

ఇంద్రుడలా వరం కోరుకొమ్మని అనడంతో గరుడుడు కద్రూపుత్రులను స్మరించాడు. తన తల్లిని వారు మోసగించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకొన్నాడు. అపుడు ఇంద్రునితో గరుడుడు "దేవేంద్రా! నాకు అసాధ్యం లేకపోయినప్పటికీ ఈ కోరిక కోరుతున్నాను.

అమృతాన్ని ఇతరులకు ఇవ్వను. మహాబలవంతులైన సర్పాలు నాకు ఆహారంగా అగుగాక" అన్నాడు. ఇంద్రుడు 'అట్లాగే' అన్నాడు. యోగీశ్వరుడు, దేవాధిదేవుడు, పరమాత్ముడు అయిన శ్రీహరి వెంట ఇంద్రుడు వెళ్లిపోయాడు.

శ్రీహరి కూడా గరుడుని మాటకు సంతోషించాడు. మరల ఇంద్రుడు ఖగేంద్రుని దగ్గర "నీవు అమృతకలశాన్ని అక్కడ ఉంచగానే నేను తీసుకుని వెళ్తాను" అని మాట తీసుకొన్నాడు. అనంతరం గరుత్మంతుడు తన తల్లి దగ్గరకు వెళ్లిపోయాడు. గరుడుడు సంతోషంతో సర్పాలను అందరినీ పిలిచి వారితో "నాగులారా! నేను మీరు కోరినవిధంగా అమృతాన్ని తీసుకొని వచ్చాను. ఈ దర్భలపైన ఉంచుతాను. మీరు స్నానం చేసి శుచులై వచ్చి ఈ అమృతాన్ని పానం చేయండి. అమృతం తీసుకొని వచ్చి ఇస్తే మాతల్లి దాసీత్వం నుండి విముక్తి పొందుతుందని చెప్పారుగదా! ఆ మాట ప్రకారం అమృతం తెచ్చాను. నా తల్లి మీ దాసీత్వం నుండి నేటికి విముక్తురాలయినది. మీరు చెప్పినట్లు చేశానుగదా!" అన్నాడు. సర్పాలు ఆ మాటను అంగీకరించి స్నానం చేయటానికి వెళ్లాయి. ఆ సమయంలో ఇంద్రుడు ఆ అమృతకలశాన్ని తీసుకొని స్వర్గలోకానికి వెళ్లిపోయాడు. అమృతం త్రాగాలనే కోరికతో స్నానాన్ని జపతపాలను కూడా చేసుకుని సంతోషంగా శుచిగా అమృతస్థానం దగ్గరకు సర్పాలు వచ్చాయి. దర్భలపైన అమృతకలశం లేకపోవడం గమనించాయి. ఎవరో అపహరించారని మోసగించారని తెలుసుకొన్నాయి. ఈ దర్భలపైనే గదా అమృతకలశం ఉంచబడింది అని ఆ సర్పాలు దర్భల్ని నాకటం మొదలుపెట్టాయి. ఆ దర్భల వల్ల వాటినాలుకలు రెండుగా చీలాయి. అమృతస్పర్శచేత దర్భలు పవిత్రమైనాయి. ఈవిధంగా మహాపరాక్రమవంతుడైన గరుత్మంతుడు అమృతాపహరణం చేసి సర్పాలకివ్వడం జరిగింది. సర్పాలు ద్విజిహ్వాలు అయ్యేటట్లు చేశాడు గరుడుడు. ఆనాటి నుండి సుపర్ణుడు సంతోషం పొంది తనతల్లితో స్వేచ్ఛగా వనంలో విహరిస్తున్నాడు. సర్పాలను భుజిస్తూ, ఇతర పక్షులచేత గౌరవింప బడుతూ తన మహోజ్జ్వలకీర్తితో తల్లిని ఆనందపరుస్తున్నాడు. ద్విజగోష్ఠిలో ఈ కథను విన్నా, చదివినా ఆ పక్షీంద్రుని గుణాలను గానం చేసినా, తప్పక పుణ్యం కలుగుతుంది. అతడు స్వర్గసౌఖ్యాన్ని అనుభవిస్తాడు.'

35. ముఖ్యమగు సర్పముల నామములు.

సూతనందనా! కద్రూ పుత్రుల శాపకారణాన్ని, వినతకు గల శాపకారణాన్ని మావల్ల విన్నాము. కద్రువ, వినత తమ భర్తవలన వరాల్ని పొందటం, వినతకు ఇద్దరు పుత్రులు కల్గటం, వారి పేర్లను కూడా తెలియజేయటం జరిగింది. మహానుభావా! పన్నగుల

పేర్లు మాత్రం మాకు మీరు తెలియజేయలేదు. ముఖ్యులయిన సర్పాల పేర్లను తెలియజేయండి. వినాలని అనుకొంటున్నాము. అనగానే ఉగ్రశ్రవుడు 'తపోధనా! అన్ని సర్పాలపేర్లను చెప్పజాలను. ప్రధానమైనవాటి పేర్లను మాత్రం చెప్పుతాను. సర్పాలలో ముందుగా పేర్కొన దగినవాడు శేషుడు, తరువాత వాసుకి, ఐరావతుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాలియుడు, మణినాగుడు, ఆపూరణుడు, పింజరకుడు, ఏలాపత్రుడు, వామనుడు, నీలుడు, అనీలుడు, కల్మాషుడు, శబలుడు, ఆర్యకుడు, ఉగ్రకుడు, కలశపోతకుడు, సుమనాఖ్యుడు, దధిముఖుడు, విమలపిండకుడు, ఆప్తుడు, కర్కోటకుడు(రెండవవాడు), శంఖుడు, వాలిశిఖుడు, నిష్థానకుడు, హేమగుహుడు, నహుషుడు, పింగలుడు, బాహ్యకర్ణుడు, హస్తిపదుడు, ముద్గరపిండకుడు, కంబలుడు, అశ్వతరుడు, కాళీయకుడు, వృత్తుడు, సంవర్తకుడు, పద్ముడు(ప్రథమ), పద్ముడు(ద్వితీయ), శంఖముఖుడు, కూష్మాండకుడు, క్షేమకుడు, పిండారకుడు, కరవీరుడు, పుష్పదంష్ట్రుడు, బిల్వకుడు, బిల్వపాండురుడు, మూషకాదుడు, శంఖశిరుడు, పూర్ణభద్రుడు, హరిద్రకుడు, అపరాజితుడు, జ్యోతికుడు, శ్రీవహుడు, కౌరవ్యుడు, ధృతరాష్ట్రుడు, శంఖపిండుడు, విరజుడు, సుబాహుడు, వీర్యవంతుడగు శాలిపిండుడు, హస్తిపిండుడు, పితరకుడు, సుముఖుడు, కౌణపాశనుడు, కుతరుడు, కుంజరుడు, ప్రభాకరుడు, కుముదుడు, కుముదాక్షుడు, తిత్తిరి, హలికుడు, మహానాగకర్దముడు, బహుమూలకుడు, కర్కరుడు, అకర్కరుడు, కుండోదరుడు, మహోదరుడు-వీరందరు నాగులు. బ్రాహ్మణోత్తమా! అతిముఖ్యులైన నాగులపేర్లను మాత్రమే చెప్పాను. పేర్లు అధికంగానే ఉన్నాయి. అందుచేత అప్రధానులయిన వాళ్లపేర్లను ఇక్కడ చెప్పలేదు. తపోధనా! ఈ నాగులయొక్క సంతానం, మరల వారి యొక్క సంతానం అసంఖ్యాకంగా ఉన్నది. అందుచేత వాళ్లపేర్లను చెప్పలేదు. శౌనకమహర్షీ! నాగులసంఖ్య వేలు, లక్షలు, కోట్లు అని లెక్కపెట్టడానికి వీలులేనంతగా ఉన్నది.

36. శేషుని తపస్సు - బ్రహ్మ వరము లిచ్చుట.

శౌనకుడు ఇలా అడిగాడు. "మహాపరాక్రమవంతులైన నాగుల్ని మీరు వర్ణించారు. తల్లియైన కద్రువ తన బిడ్డలకు శాపం ఇచ్చిన తరువాత మహాసర్పాలు ఆ శాపాన్నుంచి తప్పించుకొనడానికి ఏం చేశాయి?" ఉగ్రశ్రవుడు ఇలా అన్నాడు. 'శౌనకా! ఆ సర్పాలందరిలో ఉత్తమోత్తముడయిన శేషుడు తల్లిని వీడి కఠోరమైన తపస్సు చేయడానికి సిద్ధపడ్డాడు. కేవలం గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ నియమబద్ధంగా తపస్సు చేయసాగాడు. జితేంద్రియుడై గంధమాదనపర్వతానికి వెళ్లి బదరికాశ్రమంలో తపస్సుచేయటం

ప్రారంభించాడు. ఆ తరువాత అనేక పుణ్యతీర్థాల్లోను, దేవాలయాల్లోను ఏకాంతంగా, తపస్సు చేశాడు. ఘోరమయిన తపస్సు చేస్తూ జడలూ, వల్కలాలూ దాల్చి, శరీరాన్ని శుష్కింపజేసుకొన్న శేషునికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. "శేషుడా! ఎందుకు ఈ విధంగా తపస్సుచేస్తున్నావు? నీకోరిక ఏమిటి? ప్రాణి కోటికి మేలు చేయి. ఈ తీవ్రమైన తపస్సువలన ప్రాణికోటికి బాధ కల్గుతున్నది. పుణ్యాత్మా! నీమనస్సులో ఉన్న కోరిక ఏమిటో చెప్పు" అని అడిగాడు.

"సర్వలోకపితామహా! నా సోదరులందరు మందబుద్ధులు. ఆ కారణంగా వారి దగ్గర ఉండటానికి ఇష్టపడను. మీరు నా ఈ కోరికను అంగీకరించండి. నాసోదరులు పరస్పరం శత్రుభావంతో దెబ్బలాడుకొంటున్నారు. అందుచేత వారిని చూడకూడదని తపస్సు చేసుకొంటున్నాను. నాగులయిన నాసోదరులు పుత్రసహిత అయిన వినతను చూసి సహించలేరు. మాకు మరో సోదరుడు ఆకాశచారి అయిన గరుడుడు. ఆ గరుడునితో నాగులందరు ద్వేషభావంతో ఉంటారు. ఆ సుపర్ణుడు మాతండ్రిగారి వరంవల్ల మహాపరాక్రమవంతుడుగా ఉన్నాడు. ఈ కారణంవల్ల తపస్సు చేసుకొంటూ శరీరాన్ని విడిచిపెట్టాలని అనుకొన్నాను. తరువాత కూడా వాళ్లతో కలిసి ఉండటానికి నేను ఇష్టపడను.' అలా అంటున్న శేషునితో బ్రహ్మదేవుడు ఇలా అంటున్నాడు. "నాయనా శేషా! నీ తపస్సుకు సంతోషిస్తున్నాను. నీ సోదరులందరి చెడునడతలు నాకు తెలుసు. నీ తల్లి కద్రువ ఇచ్చిన శాపంవల్ల వాళ్లందరు భయభ్రాంతులుగా ఉన్నారు. ఈ శాపం యొక్క పరిహారాన్ని కూడా నేను పూర్వమే చేసిపెట్టాను. నీ సోదరుల కోసం నీవు విచారించవద్దు. నీవు నీకు కావలసిన వరాన్ని కోరుకో. ఇపుడే నీకు వరమిస్తాను. నీయందు నాకు చాలా ప్రీతి ఉంది. నీధర్మబుద్ధికి నాకు చాలా సంతోషం కలిగింది. నీబుద్ధి ఇదేవిధంగా ఎప్పుడూ ధర్మబద్ధమై ఉండుగాక!" శేషుడు ఇలా ప్రార్థించాడు. "పితామహా! ఇదే నేను కోరే వరం. నాబుద్ధి ఎప్పుడూ ధర్మము నందే నిలిచియుండు నట్లుగాను, నిరంతరం నాబుద్ధి శమమందు, తపస్సునందుగాను లగ్నమగునట్లు వరమిమ్ము."

బ్రహ్మ ఇట్లన్నాడు. "శేషుడా! నీ శమదమాలకు చాలా సంతోషం కల్గింది. ఇపుడు నా ఆజ్ఞప్రకారం ప్రజలకు ఉపకారం జరిగే పని చేయి. శేషుడా! పర్వతాలతోను, అడవులతోను, సముద్రాలతోను, గ్రామాలతోను, విహారాలతోను, పట్టణాలతోను కూడిన ఈభూమి ఎప్పుడూ చలిస్తూ ఊగుతూ ఉన్నది. నీవు భూభారం వహించి నిశ్చలంగా ఉండేటట్లు మోస్తూ ఉండు." శేషుడు ఇలా అన్నాడు. 'స్వామీ! నీవు అందరి కోరికలు తీర్చే వరదుడవు. సమస్త ప్రజలను పాలించేవాడవు. ఈభూమికి రక్షకుడివి. సమస్త ప్రాణికోటికి అధిపతివి.

మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. తప్పక భూభారాన్ని మోస్తాను. నిశ్చలంగా భూమిని ఉంచుతాను. ఈ భూమిని నా శిరస్సుపై ఉంచండి.' అపుడు బ్రహ్మ ఇలా అన్నాడు. "మహానాగా! శేషా! నీవు ఈ భూమికి క్రింది భాగానికి వెళ్లు. నీవు అలా వెళ్లడానికి అది నీకు మార్గాన్ని ఇస్తుంది. ఆ దారిలో నీవు పాతాళానికి వెళ్లి అక్కడ భూమిక్రింద నీశరీరాన్ని ఉంచి నిశ్చలంగా ఉంటూ మోయి. ఈ భూభారాన్ని నీవు వహించడం వల్ల నాకు చాలా సంతోషం కలుగుతుంది."

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. 'నాగులలో పెద్దవాడు, సర్వసమర్థుడూ అయిన శేషుడు బ్రహ్మదేవుడు మెచ్చుకొనే విధంగా సముద్రం ఇచ్చిన మార్గం ద్వారా భూమిలో ప్రవేశించి శిరసుపై భూమాతను ధరించాడు. బ్రహ్మ ఇట్లా అన్నాడు. "నాగరాజా! నీవు శేషుడవు. ధర్మమే నీకు ఆరాధ్యదేవత. నీవు ఒక్కడవే అనేకమైన పడగలతో ఈ భూమిని అంతటినీ నాలాగా, ఇంద్రుడిలాగా భరిస్తున్నావు." ఉగ్రశ్రవుడు ఇలా అంటున్నాడు. 'శౌనకమునీంద్రా! ఇలా ప్రతాపశాలి అయిన అనంతుడు బ్రహ్మ ఆజ్ఞప్రకారం ఈ భూమి నంతటినీ మోస్తూ పాతాళలోకంలో నివసిస్తున్నాడు. శేషునికి సహాయకుడుగా మిత్రునిగ ఉండవలసినదని గరుడుని పిలిచి చెప్పి శేషునితో చెలిమికి కారకుడయ్యాడు.

(అనంతుడు వెళ్లిన తరువాత దేవతలందరూ ఇంద్రుని అభిషేకించినట్లుగా సర్పాలన్నీ వాసుకిని నాగరాజుగా అభిషేకించాయి.)

37: వాసుకి మొదలగువారు సమాలోచనము చేయుట.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. నాగులకు తల్లియైన కద్రువ ఇచ్చిన శాపాన్ని విన్న వాసుకి "ఈ శాపాన్ని ఎలా తప్పించాలి" అని ఆలోచించాడు. అనంతరం ఐరావతుడు మొదలైన ధర్మపరాయణులైన సోదరుల్ని, బంధువుల్ని పిలిచి శాపాన్నుండి తప్పించు కొనడానికి వాసుకి వారందరితో ఆలోచన చేశాడు. వాసుకి ఇలా అన్నాడు. 'మనకు తల్లి ఇచ్చిన శాపం అందరికీ తెలుసుగదా! ఆ శాపం నుండి విముక్తి పొందడానికి అందరం కలిసి ఆలోచించి ప్రయత్నిద్దాం. అందరి శాపాలకూ విరుగుడు ఉంటుంది. కాని తల్లి ఇచ్చిన శాపానికి ఎక్కడా ప్రతీకారం లేదు గదా! అవినాశి, అప్రమేయుడు, సత్యస్వరూపుడు అయిన బ్రహ్మదేవుని ఎదుటనే తల్లి మనకు శాపం ఇచ్చింది. ఈ మాట వింటే నాహృదయం వణికిపోతున్నది. మనం అందరం సర్వనాశనం అయ్యే సమయం వచ్చింది. ఎందుకంటే మనతల్లి ఈ శాపాన్ని బ్రహ్మ కూడా ప్రతిషేధించలేదుగదా! ఆ కారణంచేత మనమందరం చక్కగా ఆలోచించుదాం. ఈ పాములన్నిటికీ శుభం కలిగేటట్లు ఆలోచిద్దాం- ఆలస్యం

చేయకూడదు. మనలో బుద్ధిమంతులు, ఉపాయాన్ని ఆలోచించే నేర్పరులూ ఉన్నారు. మనమందరం కలిసి ఆలోచిస్తే తప్పకుండా ఈ కష్టంనుండి బయటపడగలం. పూర్వం దేవతలందరు కలిసి గుహనుండి వెలువడిన అగ్నినుండి రక్షించుకొన్నవిధంగా మనం మనల్ని రక్షించుకోవాలి. సర్పవినాశనానికి జనమేజయుడు ప్రారంభించే ఆ సర్పయాగం జరగకుండా ఏం చెయ్యాలి - లేదా సర్పయాగానికి ఎలా విఘ్నం కలిగించాలి? అని ఆలోచిద్దాం.

వాసుకి చెప్పిన మాటలను అంగీకరించి కద్రూ పుత్రులంతా సమావేశ మయ్యారు. అక్కడ వారు ఆలోచనాపరులు బుద్ధిమంతుల వడంతో ఒక నిశ్చయానికి వచ్చారు. ఆ సమయంలో కొందరు ఇలా చెప్పారు. "మనం బ్రాహ్మణవేషంలో జనమేజయుడి దగ్గరకు భిక్షుకరూపంలో వెళ్లి యజ్ఞం జరుపవద్దని ప్రార్థిద్దాం" అన్నారు. మరికొందరు ఇలా అన్నారు. "మనలో మహాపండితు లనుకొనేవారు అతనికి మంత్రులుగా చేరుదాం. నమ్మకం కలిగించేట్టుగా ప్రవర్తిద్దాం. ఆ జనమేజయుడు కార్యసిద్ధికోసం మనలను సలహా అడిగినప్పుడు యజ్ఞం జరుపకుండా సలహా ఇచ్చి నివారిద్దాము. బుద్ధిమంతులలో ఉత్తముడయిన రాజు చాలామందికి ఇష్టులయిన మనలను యజ్ఞంకోసం అడుగుతాడు. అపుడు మనం వద్దని చెపుదాం. ఆ విధంగా సలహా అడిగినప్పుడు ఆ యజ్ఞం గురించి అనేక భయంకరమైన దోషాలున్నాయని చెప్పి, ఏవేవో కారణాల్ని చూపిస్తూ సర్పయాగాన్ని జరుగకుండా చూద్దాం. లేదా సర్పయాగ విధానం తెలిసి, రాజకార్యం చేయాలనుకొనే యాగోపాధ్యాయుని మనం కాటువేస్తే అతడు చనిపోతాడు. యజ్ఞం చేయించే అతడు చనిపోతే యజ్ఞం జరుగదు. ఇంకా ఎవరైనా సర్పయాగాన్ని చేయించే బ్రాహ్మణులు ఉంటే వారిని అందరినీ కరిచి చంపేద్దాం. అపుడు సర్పయాగం చేయించేవారే ఉండరు. ఆ విధంగా యాగాన్ని నివారిద్దాం" అని కొందరు సలహా ఇచ్చారు. దయాళురూ, ధర్మాత్ములూ అయిన కొందరు నాగులు వారి మాటల్ని ఖండిస్తూ ఇట్లా అన్నారు. "మీరు చెప్పిన ఆలోచన సమంజసం కాదు. బ్రహ్మహత్య ఎన్నటికినీ శుభప్రదం కాదు. అది మహాపాపం. ఆపద సమయంలో శాంతంగా మంచి ఆలోచన చేయాలి. ఉత్తమధర్మాన్ని అనుసరిస్తూ ఆలోచించాలి. కష్టాల్ని పోగొట్టుకొనడానికి ఒకదాని తరువాత మరొక అధర్మాన్ని ఆచరిస్తే ప్రపంచమే నాశనం అవుతుంది. మరికొందరు నాగులు ఈ విధంగా సలహా ఇచ్చారు. "మనం అందరం కామరూపులం గాబట్టి విద్యుత్తుతో కూడిన మేఘాలుగా మారి ఆ యాగాగ్నిలో వర్షిస్తే యజ్ఞం జరుగదు కదా! యజ్ఞంలో ఉపయోగించే స్రుగ్భాండం రాత్రి వెళ్లి అపహరిద్దాం. అపుడు ఆ యాగానికి విఘ్నం కలుగుతుందికదా! అంతేకాదు. ఆ యాగానికి వచ్చిన

వందలు, వేలు జనాన్ని మనం అంతా కరిచి బాధించుదాం. అపుడు మనకు యజ్ఞభయం కలగదు.

లేనిపక్షంలో అక్కడ ఉన్న భుజింపదగిన పదార్థాలన్నింటి మీద మలమూత్రాల్ని విసర్జించి కలుషితం చేద్దాం. అపుడా భోజన పదార్థాలు పనికి రాకుండాపోతాయి." మరికొందరు "మనమే యజ్ఞం చేయించే ఋత్విక్కులుగా ఉండి దక్షిణగా యాగాన్ని నిలుపుమని కోరుదాం. ఆ రాజు మన కోరికను మన్నించి యజ్ఞాన్ని ఆపుచేస్తాడు" అన్నారు. మరికొందరు ఇట్లా అన్నారు. "జనమేజయుడు జలక్రీడలాడే సమయంలో అతనిని బంధించి తీసుకువస్తే యాగం భగ్నం అవుతుంది". మరికొందరు పండితులమనుకొనేవారు "అతడిని ఆ విధంగా బంధించి తెచ్చినపుడు అతనిని కరిచి చంపుదాం. మనకార్యం సఫలం అవుతుంది. మన కష్టాలన్నీ తొలగిపోతాయి" అన్నారు. "సోదరా! నాగరాజా! మేము అందరం ఈ విధంగా ఆలోచించి, నిశ్చయించి ఈ ఉపాయాల్ని చెప్పాం. ఇవి నీకు సమ్మతం కాకపోతే నీ అభిప్రాయం చెప్పు" అని నాగులందరు వాసుకితో అన్నారు. ఈ విధంగా వారందరు చెప్పి వాసుకి అభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నారు. అపుడు వాసుకి బాగా ఆలోచించి వారి అందరితో ఈ విధంగా అన్నాడు.

"పన్నగులారా! మీరు అందరు చెప్పిన ఆలోచన ఆచరణ యోగ్యంగా లేదు. నేను చెప్పే ఆలోచన కూడా మీకు సమ్మతం కాకపోతే అదికూడా ఆచరణ యోగ్యం కాదు. ఈ పరిస్థితిలో మీ అందరి మేలుకోరి నేను చెపుతున్నాను. మనం మన తండ్రిగారైన కశ్యపప్రజాపతి దగ్గరకు వెళ్లి శాపప్రతీకారం చెప్పుమని ప్రార్థించుదాం. మనకు తప్పకుండా శుభం జరుగుతుంది. నాగులారా! మన వారందరి మేలుకోరి మీరందరు చెప్పిన మాటలవల్ల ఏమి చేయాలో తోచటంలేదు. మీకు అందరికి మేలుకలుగునట్లుగా చేయాలి. ఏ తప్పు చేసినా మీ అందరికంటె పెద్దవాడినైన నాదే బాధ్యతగదా! కాబట్టి గుణదోషాల్ని బాగా ఆలోచించి కార్యసాధనకు పూనుకోవాలి."

38. ఏలాపత్రుని అభిప్రాయము.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. సర్పాలన్నీ చెప్పిన అభిప్రాయాలనూ, వాసుకి అభిప్రాయాన్నీ విన్న ఏలాపత్రుడు అనే సోదరుడు ఈ విధంగా అన్నాడు. 'మనం భయపడుతున్న జనమేజయుడు పాండవ వంశీయుడు. ఆ యజ్ఞం జరుగదనేది లేదు. జనమేజయుని మరణమూ కుదరదు. రాజా! ఈలోకంలో దైవోపహతుడు దైవాన్నే తప్పక శరణుకోరాలి.

దైవంతప్ప వేరెవరూ దైవోపహతుని రక్షించలేరు. నాగరాజా! మనకు కలిగిన భయం దైవం వల్లనే కలిగింది. కాబట్టి మనం భగవంతునే ఆశ్రయించాలి. సర్పశ్రేష్ఠులారా! ఈ విషయంలో నేను చెప్పే ఈ మాటను వినండి. తల్లి కద్రువ మనకు శాపం ఇచ్చేటప్పుడు నేను ఆమె ఒడిలో నిదురపోయినట్లుండి శాపసమయంలో దేవతలకూ, బ్రహ్మకూ జరిగిన సంభాషణలను విన్నాను. దేవతలలో పన్నగులు చాలా తీవ్రస్వభావులు అనే మాటకూడ విన్నాను.

దేవతలు బ్రహ్మతో ఈ విధంగా అన్నారు. 'పితామహా! దేవదేవా! మీముందు ఎపుడైనా ఏస్త్రీ అయినా తన పుత్రులకు ఇంతకఠినంగా శాపం ఇచ్చిందా? మీరు కూడా ఆ కద్రూశాపానికి అడ్డుచెప్పకుండా అనుమతించారే. దీనిని ఎందుకు నివారించలేదు? కారణాన్ని తెలుసుకోవాలని అనుకొంటున్నాము. బ్రహ్మ అన్నాడు. "అనేక సర్పాలు చాలా క్రూరమైనవి. తీక్ష్ణమైనవి విషపూరితాలు కూడా అవి. ప్రజలకు హితం కోరేవాడిని కాబట్టి అపుడు ఆ శాపం నివారించలేదు. ఏ సర్పాలు నీచాలో పాపకర్ములో, విషపూరితులో అటువంటివారికే వినాశనం గాని ధర్మాచరణులు, ఉత్తములు అయిన సర్పాలకు ఎటువంటి హాని జరుగదు సుమా! ఆ భయంకరయాగ సమయం వచ్చినపుడు తప్పకుండా ఉత్తమసర్పాలకు మోక్షం కలుగుతుంది. మీకు ఆ విషయాన్ని చెపుతాను. అందరు వినండి. యాయావరవంశంలో జరత్కారుడు అనే పేరుగల గొప్ప ఋషీశ్వరుడు పుడతాడు. అతడు మహాతపస్వి. జితేంద్రియుడు. ఆ తపోధనుడైన జరత్కారునకు ఆస్తీకుడు అనే కుమారుడు ఉదయిస్తాడు. అతడు ఆ యజ్ఞం నివారిస్తాడు. ధర్మాత్ములైన నాగశ్రేష్ఠులు ఆ విధంగా శాపంనుండి బయటపడతారు." అపుడు దేవతలు మరల ఇలా ప్రశ్నించారు. దేవా! మునిశ్రేష్ఠుడు, మహాతపస్వి, శక్తిశాలి అయిన జరత్కారునకు ఎవరి గర్భంలో ఆస్తీకుడు జన్మిస్తాడు?' బ్రహ్మ చెప్పాడు. 'ఈ జరత్కారునకు సనామ్ని అయిన కన్యతో వివాహం జరిగినప్పుడు ఆమెయందు శక్తి సంపన్నుడయిన కుమారుని కంటాడు. సర్పరాజైన వాసుకియొక్క సోదరి పేరు జరత్కారువు. ఆమెకు ఆస్తీకుడు జన్మించి నాగుల శాపాన్ని నివారిస్తాడు.'

ఏలాపత్రుడు చెప్పాడు. 'ఆ విధంగా జరుగుగాక అని దేవతలు బ్రహ్మకు చెప్పిన తరువాత బ్రహ్మ తనలోకానికి వెళ్లిపోయాడు. కావున సోదరా! వాసుకీ! సోదరియగు జరత్కారువును ఆ జరత్కారుమహర్షికిచ్చి వివాహం చేయడానికి యాచించవలసినది. ఆ విధంగా చేస్తే మనకు మోక్షం కలుగుతుంది.'

39. జరత్కారునికై వాసుకి అన్వేషణము.

ఏలాపత్రుని ఆ మాటలను విని సర్పాలన్నీ సంతోషించాయి. చాలా బాగున్నదని ప్రశంసించాయి. ఆనందాన్ని పొందాయి. ఆనాటి నుండి వాసుకి తన సోదరి జరత్కారువును చాలా జాగ్రత్తగా చూసుకొంటూ, ఎంతో ఆనందంగా ఉన్నాడు. కొంతకాలం గడచింది. దేవతలు, రాక్షసులు అమృతం కోసం సముద్రాన్ని మథించారు. అపుడు మందరపర్వతాన్ని కవ్వంగా చేసుకొని, బలాఢ్యుడయిన వాసుకిని త్రాడుగా ఉపయోగించుకొన్నారు. అమృతం కోసం తలపెట్టిన మంథనకార్యం పూర్తి అయ్యాక దేవతలు వాసుకిని వెంటబెట్టుకొని బ్రహ్మదగ్గఱకు వెళ్లి ఆయనతో ఈ విధంగా అన్నారు. "భగవాన్! ఈ వాసుకి తల్లి ఇచ్చిన శాపం వల్ల మిక్కిలి భయపడుతున్నాడు. చాల పరితపిస్తున్నాడు. ఈ వాసుకి హృదయంలో ఉన్న ఈ బాధని మీరే తొలగించాలి. ఇతడు సోదరులకు, బంధువులకు హితం కోరేవాడు. మాతృశాపానికి చాలా వేదన చెందుతున్నాడు. ఈ నాగరాజు మన అందరికీ సహాయపడుతూ మనకు మేలుచేసేవాడు. మీరు అనుగ్రహించి ఈతని మనస్తాపాన్ని పోగొట్టవలసినదిగా కోరుతున్నాం."

బ్రహ్మ చెప్తున్నాడు. దేవతలారా! 'ఏలాపత్రుడు వాసుకి సమక్షంలో పూర్వం ఏమిచెప్పాడో అది సత్యం. నా ప్రేరణ వల్లనే ఏలాపత్రుడు ఆ మాటలు చెప్పాడు. కాబట్టి ఏలాపత్రుడు వాసుకి మొదలగు వారితో కద్రూశాప ప్రతీకారం గురించి పూర్వం చెప్పినట్లే జరుగుతుంది. ఈ నాగరాజు సమయం వచ్చినపుడు తానే స్వయంగా దానికి అనుగుణంగా ప్రవర్తిస్తాడు. పాపాత్ములు మాత్రమే జనమేజయుని సర్పయాగంలో మరణిస్తారు. ధర్మాత్ములంతా సురక్షితంగానే ఉంటారు. జరత్కారుడు అనే బ్రాహ్మణుడు జన్మించి, ఉగ్రమైన తపస్సు చేస్తున్నాడు. వాసుకి సమయానుకూలంగా తనసోదరి జరత్కారువును అతనికి సమర్పించాలి. దేవతలారా! ఏలాపత్రుడు చెప్పిన మాటలన్నీ సర్పాలకు హితకరాలే. ఆతని మాటప్రకారం జరిగి తీరుతుంది. దానికి వ్యతిరేకంగా ఏమీ జరగదు." బ్రహ్మదేవుని ఆ మాటల్ని వాసుకి విని, ఆనందంగా తన సోదరులందరికీ చెప్పాడు. సోదరి జరత్కారువును జరత్కారుమహర్షికి ఇచ్చి వివాహం చేయడానికి ప్రయత్నం చేయాలి. ఆ జరత్కారుని కనుగొనటానికి సర్పాలను ఆదేశించాడు. జరత్కారుమహర్షి ఎప్పుడు వివాహం చేసుకొనదలచాడో అపుడు ఆ విషయాన్ని వెంటనే నాకు తెలియజేయవలసిన దనీ, అపుడు అందరికీ మేలు కలుగుతుందనీ వాసుకి తన సోదరులకు చెప్పాడు.

40. పరీక్షిదుపాఖ్యానము.

శౌనకుడు ఉగ్రశ్రవుని అడుగుతున్నాడు. 'సూతనందనా! మీరు జరుత్కారు మహర్షిని గురించి చెప్పారు గదా! ఆ మహర్షి యొక్క మాహాత్మ్యాన్ని వినాలని కోరుతున్నాను. జరత్కారుడు అనే పేరు ఎందుకు ప్రసిద్ధికి వచ్చింది. ఆ పదానికి అర్థం ఏమిటి? చెప్పండి.' సౌతి చెప్పాడు. 'జరా శబ్దానికి క్షీణత్వం అని, కారు శబ్దానికి భయంకరం అనీ అర్థం. అతని శరీరం భయంకరంగా, కృశించడం చేత అతనికి జరత్కారుడని పేరు కలిగింది. ఆ మహర్షి తీవ్రమైన తపస్సుచేసి శరీరాన్ని భయంకరంగా కృశింపచేశాడు. అందుచేత అతడు జరత్కారుడు అయ్యాడు. వాసుకి సోదరికూడా అదేవిధంగా ఉండడంచేత ఆమెనుకూడా జరత్కారువు అన్నారు.' ఉగ్రశ్రవుడు ఈవిధంగా చెప్పిన తరువాత శౌనకుడు నవ్వి అతనితో "మీరు చెప్పినది ఉచితంగానే ఉన్నది" అని అన్నాడు. శౌనకుడు అడుగుతున్నాడు. 'పూర్వం మీరు జరత్కారుని వృత్తాంతం చెప్పారు గదా! ఇపుడు ఆస్తీకుని వృత్తాంతం గురించి వినాలని కోరుతున్నాం.' ఆ మాట విని ఉగ్రశ్రవుడు శౌనకునితో పురాణకథనానుసారం ఆస్తీకుని గురించి చెపుతున్నాడు. 'ఏకాగ్రచిత్తంతో వాసుకి సర్పాలందరికీ 'జరత్కారు మునికి సోదరి జరత్కారువునిచ్చి వివాహం చేయాలి. వెదుకు'మని చెప్పాడు గదా! చాలాకాలం తరువాత కూడా బుద్ధిమంతుడైన జరత్కారుముని కేవలం తపస్సు చేయడంలోనే నిమగ్నమైయున్నాడు. వివాహం చేసుకొనే కోరికే లేదు. అతడు ఊర్ధ్వరేతస్కుడైన బ్రహ్మచారి. తపస్సులోనే నిరంతరం లగ్న మయ్యాడు. నిత్యమూ వేదాధ్యయనం చేస్తూ నియమబద్ధంగా జీవితాన్ని గడుపుతున్నాడు. అతడు దేనిని గురించీ భయపడేవాడు కాదు. అతడు దేశం అంతా సంచారం చేశాడు. అతడు ఎప్పుడూ స్త్రీని అభిలషించలేదు.

ఆ తరువాత కొంతకాలానికి పరీక్షిత్తు అనే కౌరవవంశ మహారాజు రాజ్యానికి వచ్చాడు. యుద్ధంలో ధనుర్ధారులందరిలో శ్రేష్ఠుడయిన అతని ముత్తాత పాండురాజు వలె పరీక్షిత్తు కూడా వేటమీద ఆసక్తి కలిగి ఉండేవాడు. ఆ రాజు అడవిపందుల్ని, పులుల్ని, మహిషాల్ని ఇంకా ఎన్నో ఇతరజంతువుల్ని వేటాడుతూ అడవి అంతా తిరిగేవాడు. ఒకనాడు ఆ మహారాజు కీకారణ్యంలో ఒక క్రూర మృగాన్ని బాణంతో కొట్టాడు. అది ప్రాణాలతో పారిపోతూండగా దాని వెనుక ధనుస్సుతో ఇతడు అనుసరించాడు. పూర్వం పరమశివుడు యజ్ఞమృగాన్ని కొట్టి వెంటాడినట్లుగా పరీక్షిత్తు ఆ మృగం వెంట ధనుర్ధారియై వెతుకుతూ వెళ్లాడు. నిజానికి అతనిచే కొట్టబడిన మృగం ఆ అడవిలో ప్రాణాలతో మిగలదు. కాని ఆనాడు పరీక్షిత్తు కొట్టిన మృగం ప్రాణాలతో మిగిలి అతనిని చాలాదూరం

కొనిపోయింది. రాజు ఆ మృగం వెంట పరుగెత్తాడు. వేటాడుతూ ఆ రాజు అలసిపోయాడు. దప్పికతో బాధపడుతున్నాడు. అలా వెళ్తూ ఆ వనంలో ఒక మహర్షిని చూశాడు. ఆవుదూడలు పాలు తాగేటప్పుడు గాలివల్ల వాని నోటినుండి ఎగిరివచ్చే నురగలే ఆ మునికి ఆహారం. ఆవులు సంచరించే ప్రదేశంలోనే తపస్సు చేస్తున్నాడు. వేగంగా అతని దగ్గరకు పరిక్షిత్తు వచ్చాడు. ఆకలి దప్పులతో ఉన్న ఆ రాజు మునిని ప్రశ్నిస్తున్నాడు. "బ్రాహ్మణోత్తమా! నేను అభిమన్యుని కుమారుడిని. నా పేరు పరీక్షిత్తు.

ఈ అడవిలో ఒక మృగాన్ని బాణంతో కొట్టాను. అది పారిపోయింది. ఆ మృగాన్ని మీరు చూశారా?" అని ప్రశ్నించాడు.ఆ మహర్షి మౌనవ్రతుడు. కాబట్టి రాజుకు సమాధానం ఏమీ చెప్పలేదు. ముని సమాధానం చెప్పకపోవటంతో పరిక్షిత్తుకు కోపం వచ్చింది. తన వింటికొమ్ముతో అక్కడ ఉన్న మృతసర్పాన్ని ఆ ముని కంఠానికి తగిలించాడు. ముని అతనిని ఉపేక్షించాడు.

ముని రాజుతో మంచికాని, చెడుకాని ఏమీ మాట్లాడలేదు. అలాగే ఉన్న మునిని చూసి రాజు కోపం విడచి చాలా బాధపడ్డాడు. రాజు నగరానికి వెళ్లిపోయాడు. ఋషిమాత్రం అలాగే ఉండిపోయాడు. రాజధర్మాన్ని చక్కగా ఆచరిస్తూ, పరిపాలిస్తున్న పరీక్షిత్తు మహారాజు తనకు ఆ విధంగా అవమానం కల్గించినా క్షమాశీలుడైన ఆ ముని సహించాడే కాని ఏమాత్రం నిందించలేదు. భరతవంశ శిరోమణి, రాజశ్రేష్ఠుడు అయిన పరీక్షిత్తు ధర్మపరాయణుడైన ఆ మునీంద్రుని గూర్చి తెలియకపోవడం చేత ఆ విధంగా అవమానించాడు. ఆ మునీంద్రునికి శృంగి అనే కుమారుడు ఉన్నాడు. అతడు యువకుడు, తపస్వి కూడా. తేజస్సంపన్నుడు అయిన ఆ మునికుమారుడు మహావ్రతుడు, అయినా అతనిది అధికమైన కోపస్వభావం. అతనిని శాంతింపజేయటం కష్టసాధ్యమే. అతడు చాలాకాలం తనమనస్సును, ఇంద్రియాలనూ నిగ్రహించుకొంటూ సమస్త ప్రాణికోటికి హితాన్నే ఆచరిస్తున్నాడు. అతడు గురుకులంలో తన ఆచార్యదేవుని సేవిస్తూ ఉన్నాడు. ఆ రోజు శృంగి ఆచార్యుని అనుమతితో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో తనమిత్రుడు, అయిన కృశుడు కలిశాడు. అతడు శృంగిని కలిసి అతని తండ్రికి జరిగిన ఆ అవమానాన్ని చెప్పాడు. ఆ సంగతిని విన్న శృంగి కోపోద్రిక్తుడయ్యాడు. కృశుడు శృంగితో అంటున్నాడు. "శృంగీ! నీవు మహాతపస్వివి, తేజోవంతుడవు. నీ తండ్రి భుజంపై మృతసర్పం వ్రేలాడుతున్నది. ఇంకా నీ తపో గర్వమెందుకు? సిద్ధులు, బ్రహ్మవేత్తలు, తాపసులు అయిన మావంటి ఋషి కుమారులు ఇదే మాటాడుకొంటుంటే నీవు మౌనంగా ఉండు! నీ పౌరుషం, అభిమానం ఎక్కడ? నీ గర్వపూరితమైన మాటలెక్కడ? నీ తండ్రి మెడలో ఉన్న మృతసర్పాన్ని

చూసి కూడా మిన్నకున్నావు. శృంగీ! నీ తండ్రి ఎటువంటి అకృత్యాన్నీ చేయలేదు. నీవు ఎటువంటి అనుచితమైన పనిని చేయరాదు. నా తండ్రికి అవమానం జరిగితే నేను ఎంత బాధపడతానో అదేవిధంగా నీ తండ్రికి జరిగిన అవమానానికీ నేను చాలా విచారిస్తున్నాను."

41. శృంగి పరీక్షిత్తుకు శాపమిచ్చుట.

కృశుని మాటలతో మహాతేజస్వి అయిన శృంగికి కోపం అధికమైంది. తన తండ్రి కంఠంలో మృతసర్పాన్ని రాజు వేశాడని విని, కోపంతో పరితపించాడు. శృంగి కృశుని చూసి, సూటిగా ఇలా ప్రశ్నించాడు. "నాతండ్రి కంఠంలో మృతసర్పాన్ని ఎందుకు ధరిస్తున్నాడు?" అని అడిగాడు. కృశుడు చెప్పాడు. "పరిక్షిత్తుమహారాజు వేటకోసం వచ్చాడు. అతడు నీతండ్రి కంఠంలో ఆ మృతసర్పాన్ని వేశాడు". అపుడు శృంగి కృశునితో "ఆ విషయాన్ని జరిగింది జరిగినట్లుగా చెప్పు. నాతండ్రి ఆ దుర్మార్గుడికి ఏ అపరాధం చేశాడు? చెప్పు - లేదా నా తపోబలం ఎంతటిదో చూడు" అని అన్నాడు. అపుడు కృశుడు శృంగితో ఇలా చెప్పాడు. "అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తుమహారాజు ఒంటరిగా వేటనిమిత్తం అడవికి వచ్చాడు. వేగంగా పరుగెడుతున్న ఒక క్రూరమృగాన్ని బాణంతో కొట్టాడు. అయితే ఆ మృగం ఆ విశాలవనంలో ఎటువెళ్లిందీ చూడలేకపోయాడు రాజు. ఇంతలో మౌనవ్రతధారి అయిన మీతండ్రిని చూసి ఆ మృగం ఎటువెళ్లిందో తెలుసుకోవాలని అతనిని అడిగాడు. వేటతో అలసిసొలసి ఆకలి దప్పులతో ఉన్న పరీక్షిత్తు మీతండ్రిని మృగం గురించి అడిగితే సమాధానం చెప్పకుండా మౌనవ్రతాన్ని పాటిస్తున్నాడు గదా! తనకు సమాధానం చెప్పకపోవటం వలన ఆ రాజు తన వింటికొనతో అక్కడే చచ్చిపడిఉన్న సర్పాన్ని మీతండ్రి మెడలో వేశాడు. శృంగీ! ఎంతో నియమంగా మౌనవ్రతాన్ని పాటిస్తున్న మీతండ్రి ఏమీ చలించకుండా ప్రశాంతంగా తన ధ్యానసమాధిలోనే ఉన్నాడు. పరిక్షిత్తు తన హస్తినాపురానికి వెళ్లిపోయాడు."

తనతండ్రి మెడలో పరిక్షిత్తు సర్పశవాన్ని వేశాడని విన్న శృంగికి కోపంతో కళ్లు ఎఱ్ఱబడ్డాయి. క్రోధావేశానికి పూర్తిగా లొంగిపోయిన ఆ శృంగి నీటిని చేతబట్టి, కోపంతో పరీక్షిత్తును శపించాడు. శృంగి ఇలా అన్నాడు. మౌనవ్రతధారియై, ప్రశాంతంగా తపస్సు చేసుకొంటున్న వృద్ధుడైన నాతండ్రి మెడలో మృతసర్పాన్ని వేసి విప్రులను అవమానపరచిన ఆ పరీక్షిత్తు నాశాపవచనంతో ప్రేరేపింపబడిన తక్షకునిచేత విషదగ్ధుడై ఏడురోజులలోగా యమపురికి వెళ్లుగాక' అని శపించాడు. ఆ విధంగా శపించి శృంగి కోపంతో సర్పశవాన్ని మోస్తున్న తన తండ్రి దగ్గరకు వెళ్లాడు. మెడలో పాముతో ఉన్న తండ్రిని చూసి శృంగి

మళ్లీ కోపావిష్టు డయ్యాడు. శృంగికి కళ్లవెంట నీళ్లు గిర్రున తిరిగాయి. తండ్రితో ఇలా అన్నాడు. "తండ్రీ! మీకా దురాత్ముడు చేసిన అవమానం చూశారా? ఆ పరీక్షిత్తును నేను శపించాను. కురుకులాధము డయిన ఆ రాజుకు నాశాపం తగినదే. ఏడవరోజున అతనిని తక్షకుడు యమపురికి పంపుతాడు". ఈమాటలు విని తండ్రి కొడుకుతో ఇలా అన్నాడు.

"కుమారా! నీవు పరిక్షిత్తునకు శాపం ఇవ్వడం నాకు ఇష్టం కాదు. ఇది తాపసులకు ధర్మంగాదు. మనమందరం ఆ మహారాజు ఏలుబడిలో ఉంటున్నాం. అతని ద్వారా మనకు రక్షణ కల్గుతున్నది. అటువంటి ధర్మప్రభువునకు శాపం ఇవ్వడం నాకు సంతోషాన్ని కలిగించదు. పుత్రా! ఇది క్షమింపదగినదే - ధర్మాన్ని చంపివేస్తే అది మనలను చంపుతుంది. ఆ రాజు మనలను రక్షించకపోతే మనకు ఎంతో కష్టం కలుగుతుంది. కుమారా! రాజు లేకపోతే మనం ధర్మాన్ని చక్కగా ఆచరింపలేం గదా! ధర్మబద్ధంగా పరిపాలిస్తున్న రాజుద్వారా మనం సురక్షితంగా ఉండటమేకాకుండా ఇంకా ఎక్కువగా ధర్మాన్ని ఆచరిస్తాం. అందుచేత మనంచేసే పుణ్యకర్మలు అన్నింటిలోను రాజుకు కూడా భాగం ఉంది. ఆ కారణంగా పరీక్షిత్తు అపరాధం చేసినా అతనిని క్షమించాల్సిందే. పరిక్షిత్తు అతని ముత్తాతగారైన పాండురాజులాగా మనకు రక్షకుడుగా ఉన్నాడు. నాయనా! ఆ విధంగా ఆ ప్రభువు కూడా రక్షింపబడాలి కదా! ఆ పరిక్షిత్తు ఆకలి బాధతో దాహంతో అలసిపోయి ఇక్కడికి వచ్చాడు. నేను మౌనవ్రతాన్ని పాటిస్తున్నానని అతనికి తెలియదుగదా! దేశంలో రాజులేకపోతే అనేకదోషాలు కలుగుతాయి. చోరభయంలాంటివి ఉండవచ్చు. అధర్మంగా ప్రవర్తిస్తూ హద్దుమీరి ప్రవర్తించే వాళ్లని రాజు దండిస్తాడు. శిక్షవల్ల భయం కలుగుతుంది. భయంవల్ల తాత్కాలికమైన శాంతి కల్గుతుంది. చోరాదిభయంతో ఉన్నవాడు ధర్మాన్ని ఏమాత్రం ఆచరింపలేడు. ఉద్విగ్నంగా ఉన్న మానవుడు యజ్ఞకర్మలుగాని, శ్రాద్ధాది శాస్త్రీయ కర్మలు గాని చేయలేడు. రాజు ధర్మాన్ని స్థాపిస్తే ధర్మంనుండి స్వర్గలోకం ప్రాప్తిస్తుంది. రాజరక్షణం వల్లే బ్రాహ్మణులు యజ్ఞాల్ని సురక్షితంగా చేస్తారు. యజ్ఞాల వలన దేవతలు సంతోషిస్తారు. దేవతలు సంతోషిస్తే సకాలంలో పంటలకు అనుకూలంగా వర్షాలు కురుస్తాయి. వర్షాలవల్ల ఓషధులు లభిస్తాయి. ఓషధులు బాగా పెరిగితే మనుష్యులకు చాలా మేలు కలిగి సుఖంగా ఉంటారు. కాబట్టి రాజు ఈ సమస్తానికి మూలాధారం. వేదాధ్యయనపరు లైన పదిమందితో ధర్మపరు డైన ఒక్క రాజు సమానం అని మనువు చెప్పాడు. నియమబద్ధు డైన ఆ పరిక్షిత్తు అలసి, ఆకలిదప్పులు సహించలేక నామౌనవ్రతాన్ని గూర్చి తెలియక ఆవిధంగా ప్రవర్తించి ఉంటా డనుకొంటున్నాను. నీవు చిన్నతనంతో, మూర్ఖంగా శాపం

ఇచ్చి సాహసంతో పాపాన్ని చేశావు. కుమారా! రాజుకు ఇలా నామండి శాపం కల్గడం ఏ విధంగాను తగదు.'

42. శమీకుడు గౌరముఖుని ద్వారా పరిక్షిత్తుకు శాపవిషయము తెలుపుట.

శృంగి తండ్రితో ఇలా అన్నాడు. "నాన్నగారూ! ఇది నేను చేసిన సాహసమే కావచ్చు. పాపకర్మమే కావచ్చు. ఇది మీకు ప్రియం కావచ్చు. కాకపోవచ్చు. కాని నేను చెప్పినమాట ఎన్నటికీ అబద్ధం కాదు. నాన్నగారూ! నేను మీకు యథార్థం చెపుతున్నాను. నేను ఇచ్చిన శాపం వ్యర్థంకాదు. నేను పరిహాసానికి కూడా అబద్ధం చెప్పను. ఇక ఇటువంటి కష్టంలో శాపం విషయంలో ఎందుకు అబద్ధమాడతాను?' అపుడు శమీకుడు ఇలా అన్నాడు. 'కుమారా! నీకోపస్వభావం నాకు తెలుసును. నీవు సత్యవాదివి అనికూడా ఎరుగుదును. ఇంతవరకు నీవు ఎప్పుడూ అబద్ధాన్ని చెప్పలేదు కూడా. కాబట్టి నీవు ఇచ్చిన శాపం కూడా అబద్ధం కాదు. అయినప్పటికి తండ్రి తన కుమారుని వయఃస్థితిని తెలుసుకొన్నప్పటికి అతనికి సత్కర్మలను గురించి తప్పక ఉపదేశించాలి. అపుడే కుమారుడు గుణవంతుడు అవుతాడు. గొప్పకీర్తిని పొందుతాడు. నీవు ఇంకా చిన్నబాలుడవే సుమా! కాబట్టి నీకు తప్పక నేను ఉపదేశించాలి. నీవు నిత్యం తపస్సు చేయడం ద్వారా దివ్యమైనశక్తిని పొందుతున్నావు. యోగం ద్వారా శక్తిసంపన్ను లయిన వారికి కూడా కోపం అధికంగా ఉంటున్నది. నీవు బాలుడవు కావున నీకు కోపం అధికంగా ఉంది. నీవు నాకు పుత్రుడవు. కాని బాలత్వమూ ఉంది. (అనగా మూఢత్వం). పైగా నీలో సాహసముంది. అందుచే నీకు కొంత హితబోధ చెయ్యా లనుకొంటున్నాను.

నీవు శమం పొందు. అడవిలోని కందమూల ఫలాలు ఆహారంగా తీసుకొని క్రోధం చంపుకొని సంచరించు. ఎన్నడూ ధర్మాన్ని విడవకు. క్రోధమే ధర్మాన్ని హరిస్తుంది. అది యతీశ్వరులకు కూడా దుఃఖం కలిగిస్తుంది. అందుచేత ధర్మరహితులకు అభీష్టం నెరవేరదు. **క్షమించే యతీశ్వరులకు శమమే సిద్ధినిస్తుంది. ఈలోకం క్షమాగుణం కలవారిది. ఈలోకమేకాదు పరలోకం కూడా క్షమాగుణం కల వారికే లభిస్తుంది.*** కాబట్టి నీవు ఎప్పుడూ ఇంద్రియనిగ్రహాన్ని పాటిస్తూ క్షమాశీలుడవుగా ఉండు. ఓర్పుగలవాడు బ్రహ్మ సామీప్యంకల లోకాలు (క్రమముక్తి) పొందగల్గుతాడు. నామనస్సు ప్రశాంతంగా చేయదగిన దిది అనిపిస్తోంది. 'కుమారా! రాజుదగ్గరకు ఎవరినయినా పంపుతాను -

---

* **శమ ఏవ యతీనాం హి క్షమిణాం సిద్ధికారకః ।**
క్షమావతామయం లోకః పరశ్చైవ క్షమావతామ్ ॥ 9

రాజా! నిన్ను నాతెలివి తక్కువ కొడుకు శపించాడు. నీవు నన్ను అవమానించావని కోపించి నా పుత్రుడిలా చేశాడు అని తెలియజేస్తాను. జితేంద్రియుడైన ఆ శమీకమహర్షి దయాళువై సచ్ఛీలుడైన తన శిష్యుడు గౌరముఖుడు అనేవానిని రాజుదగ్గఱకు పంపాడు. పంపుతూ అతనితో "మొదటగా రాజును కుశలప్రశ్నల్ని అడుగు. తరువాత శాపానికి కారణాన్ని చెప్పు. ఆ తరువాత కుమారుడిచ్చిన శాపాన్ని తెలియచెయ్యి. తరువాత తక్షకుని నుండి తప్పించుకునే ఉపాయాన్ని ఆలోచించుకోమని చెప్పు" అని ఆదేశించి రాజు దగ్గరకు పంపించాడు. వెంటనే గౌరముఖుడు అక్కడనుండి బయలుదేరి పరిక్షిత్తు దగ్గరకు(వెళ్లి), ద్వారపాలకుడి ద్వారా తనరాకను తెలిపి, రాజానుమతితో భవనంలో ప్రవేశించాడు. మహారాజు గౌరముఖుని సగౌరవంగా సత్కరించాడు. మంత్రులసన్నిధానంలో గౌరముఖుడు శ్రమలేకుండా పరిక్షిత్తుకు శమీకమహర్షి చెప్పిన సందేశాన్ని అంతటినీ పూసగుచ్చినట్లు ఇలా చెప్పాడు.

"రాజేంద్రా! తమ రాజ్యంలో శమీకుడు అనే పరమధర్మాత్ముడైన మహర్షి ఉంటున్నాడు. ఆ మహాతపస్సంపన్నుడు జితేంద్రియుడు. మనోనిగ్రహం కల మహాముని. పరమశాంతచిత్తుడు. మహారాజా! మౌనవ్రతాన్ని ఆచరిస్తూ తపస్సు చేసుకొంటున్న ఆ మహర్షి కంఠాన మీరు వింటికొనతో ఒకమృత సర్పాన్ని పడవేశారు. అయినా ఆ మహర్షి శాంతస్వభావుడు, క్షమాశీలుడు కాబట్టి ఆ తిరస్కారాన్ని సహించాడు, క్షమించాడు. కాని ఆయన కుమారుడు మాత్రం ఈ అవమానాన్ని సహించలేకపోయాడు. ఆ కారణంగా ఋషికుమారుడు తనతండ్రికి తెలియకుండ నీకు "నేటినుండి ఏడురోజులలోగా తక్షకుని చేతిలో మరణం సంభవించాలి" అని శాపం ఇచ్చాడు. ఈ పరిస్థితిలో నీవు తక్షకుని బారినుండి రక్షించుకోవలసినదిగా మా శమీకమహర్షి పదేపదే కోరుతున్నారు. ఈ శాపాన్ని మరలించడానికి ఏ విధంగాను సాధ్యంకాదు. కోపావేశపరుడైన తన కుమారుని మహర్షి శాంత పరచలేకపోయాడు. మహారాజా! ఆ కారణంవల్ల శమీకమహర్షి మీ మేలుకోరి నన్ను ఇక్కడికి పంపించారు." భయంకర శాపవిషయాన్ని విన్న పరిక్షిత్తు తాను ఆ మహామునీంద్రుడికి చేసిన అపరాధాన్ని తలచుకొని ఎంతో బాధపడ్డాడు. ఆ శమీకమహర్షి తన వేటసమయంలో మౌనవ్రతాన్ని అవలంబించాడని తెలుసుకొని దుఃఖంతో ఏడుస్తూ మనస్తాపం చెందాడు. మహర్షియొక్క దయాళుత్వానికీ, శాపానికి తగిన ప్రతిక్రియ చెప్పి పంపినందుకూ తాను పశ్చాత్తాపాన్ని చెంది, మునికి చేసిన అపరాధాన్ని తలచుకొంటూ చాల పరితపించాడు పరీక్షిత్తు. దేవతాసమానుడైన పరిక్షిత్తు తన మరణశాపాన్ని విన్నా తాను విచారపడకూడదని అనుకొన్నాడు. తాను మహానుభావుడైన మునీంద్రుడికి చేసిన అపరాధానికి ఎంతగానో కుమిలిపోయాడు.

అనంతరం మహారాజు గౌరముఖుని ఆశ్రమానికి పంపిస్తూ "భగవంతుడైన శమీకమునీంద్రులు మాయందు దయచూపి అనుగ్రహించవలెనని ప్రార్థిస్తున్నాను" అని ప్రతిసందేశం ఇచ్చి పంపించాడు.

గౌరముఖుడు మరలిపోయిన తరువాత పరిక్షిత్తు దుఃఖపరవశుడై తనమంత్రులతో సమావేశం జరిపాడు. మంత్రతత్త్వం తెలిసిన మహారాజు తనమంత్రులతో ఆలోచించి సలహా పొందిన తరువాత సురక్షిత మయిన ఒంటిస్తంభం మేడను నిర్మించాడు. భవనం దగ్గర రాజును రక్షించుకోడానికి అవసరమైన ఏర్పాటు లన్నీ చేశారు. ఔషధాలనూ, వైద్యులనూ, మంత్రసిద్ధు లయిన బ్రాహ్మణులనూ అక్కడ నియమించారు. ధర్మజ్ఞు డయిన మహారాజు మంత్రులతో సంపూర్ణంగా రక్షింపబడుతూ అక్కడనే ఉండి రాజకార్యాలు అన్నీ నిర్వహించాడు. మేడలో ఉన్న మహారాజును ఎవ్వరూ కలుసుకోవడానికి వీలులేకుండా ఆజ్ఞాపించారు. గాలికూడా ప్రవేశించడానికి అవకాశం లేదు. శాపప్రకారం ఏడవరోజున మంత్రశాస్త్రాన్ని తెలిసిన కాశ్యపుడు అనే బ్రాహ్మణుడు పరిక్షిత్తుకు వైద్యం చేయడానికి వస్తున్నాడు. రాజోత్తము డయిన పరిక్షిత్తును నాగరా జైన తక్షకుడు నేడు యమలోకానికి పంపిస్తాడని కాశ్యపుడు విన్నాడు. తక్షకుడు రాజును కఱచినట్లయితే నేను అతని విషాన్ని హరింపజేసి జీవింపచేస్తాను. అప్పుడు నాకు ధనలాభం కలుగుతుంది. ధర్మాన్నిగూడా నెరవేర్చినవాడను అవుతా నని కాశ్యపుడు అనుకొని రాజుదగ్గరకు వస్తున్నాడు.

తక్షకుడు శాపవచన ప్రేరితుడై బయలుదేరి వస్తూ మార్గమధ్యంలో కాశ్యపుని చూశాడు. తక్షకుడు వృద్ధ బ్రాహ్మణవేషాన్ని ధరించి కాశ్యపుని ఈ విధంగా అడిగాడు. "అయ్యా! మీరు అతిత్వరితంగా ఎక్కడికి వెళ్తున్నారు? ఎందుకు వెళ్లుతున్నారు?" అపుడు కాశ్యపుడు చెప్పాడు. "కురుకులంలో జన్మించి, శత్రుసంహారకుడైన పరిక్షిత్తు మహారాజును నేడు తక్షకుడు అనే సర్పరాజు తన విషాగ్నితో దగ్ధం చేయబోతున్నాడు. ఆ రాజు పాండవ వంశపరంపరను సురక్షితంచేస్తున్నాడు. అతడు అత్యంత పరాక్రమశాలి. బ్రాహ్మణోత్తమా! అటువంటి మహారాజును నాగేంద్రుడు కరిస్తే విషంబారినుండి తప్పించడానికి వేగంగా వెళ్తున్నాను" అని చెప్పాడు. అపుడు తక్షకుడు కాశ్యపునితో "బ్రాహ్మణా! నేనే ఆ తక్షకుడిని. ఇవ్వాళ ఆ పరిక్షిత్తును భస్మం చేయడానికి వెళ్తున్నాను. నేను కాటువేసిన వానికి చికిత్స చేయలేరు మీరు. అనగానే కాశ్యపుడు. "నీవు రాజును కరిస్తే నేను అతని శరీరంలోంచి విషాన్ని హరిస్తాను. అతనిని జీవింపచేస్తాను. అటువంటి గొప్పవిద్య నాదగ్గర ఉంది. ఇది నా నిశ్చయం" అని చెప్పాడు.

43. తక్షకుడు కాశ్యపుని మరలించి, పరిక్షిత్తును చంపుట.

తక్షకుడన్నాడు. "కాశ్యపా! ఈ ప్రపంచంలో నేను కరచినవారికి నీవు చికిత్స చేయడంలో సమర్థుడవే అయితే, ఈ వృక్షాన్ని నేను కరుస్తాను. దీన్ని జీవింపచెయ్యి, చూస్తాను. నీ దగ్గర అంతగొప్ప మంత్రబలం ఉన్నట్లయితే నాకు ఇపుడు చూపించు. నేను ఈ వటవృక్షాన్ని నీవు చూస్తూ ఉండగానే దహించివేస్తాను." కాశ్యపుడు అన్నాడు. "నాగేంద్రా! నీవు చెప్పినట్లుగా ఆ మట్టిచెట్టును కాటువెయ్యి. నేను దాన్ని జీవింపచేస్తాను". కాశ్యపుడు ఆ మాట చెప్పిన తరువాత సర్పశ్రేష్ఠుడయిన తక్షకుడు మట్టిచెట్టును కాటువేశాడు. పన్నగేంద్రుడు కరచిన విషంతో ఆ మట్టిచెట్టు మండిపోయి బూడిదయిపోయింది. "ద్విజోత్తమా! ఈ చెట్టును జీవింపచేయడానికి ప్రయత్నించు" అని తక్షకుడు కాశ్యపునితో అన్నాడు.

ఆ తక్షకుని విషాగ్నితో భస్మీభూతమైన వృక్షాన్ని బ్రతికించడానికి ఆ బూడిదను అంతా ప్రోగుచేసి కశ్యపుడు తక్షకుడితో ఇలా అంటున్నాడు. 'నాగరాజా! నా విద్యాబలాన్ని చూడు. నీవు చూస్తూండగానే ఈ వృక్షాన్ని జీవింపజేస్తాను చూడు.' అప్పుడు మహానుభావుడూ, విద్వాంసుడూ అయిన ఆ కాశ్యపుడు తన మంత్రవిద్యాబలంతో ఆ భస్మరాశిని మళ్లీ వృక్షంగా జీవింపచేశాడు. మొదట అంకురంగా, తరువాత రెండు ఆకులతో, ఆ పిదప చిగురుటాకులు, కొమ్మలు, ఉపశాఖలు కలిగేటట్లుగా క్రమక్రమంగా ఆ చెట్టును ఆశ్చర్యకరంగా కాశ్యపుడు జీవింపచేశాడు. మహాత్ము డయిన కాశ్యపుని మంత్రబలంతో జీవించిన ఆ మట్టిచెట్టును చూసి తక్షకుడు కాశ్యపుడితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! ఇది నీకు ఏమీ అద్భుతం కాదు. తపోధనా! కాశ్యపా! నా విషాన్నిగాని, ఇతర సర్పాల విషాన్నిగాని నీ మంత్ర విద్యాబలంతో హరించగలవు. కాని తపోధనా! నీవు ఏ ప్రయోజనాన్ని ఆశించి పరిక్షిత్తు దగ్గరకు వెళ్తున్నావు? ఆ రాజేంద్రుడినుండి ఏ ఫలాన్ని ఆశిస్తున్నావో అది దుర్లభమయినా సరే దాన్ని నేనే నీకు ఇస్తాను. పరిక్షిత్తు మహారాజు బ్రాహ్మణశాపంతో తిరస్కరింపబడ్డాడు. అతని ఆయుష్షు కూడా క్షీణించింది. ఈ స్థితిలో నీవు ఎంత ప్రయత్నించినా నీ కార్యం సిద్ధించకపోవచ్చు. నాకు సందేహమే. నీవు అనుకొన్నట్లుగా కార్యం సిద్ధించకపోతే ఈలోకంలో నీవు సంపాదించిన కీర్తి అంతా కిరణాలు లేని సూర్యుడిలాగా అదృశ్యం అయిపోతుంది." అపుడు కాశ్యపుడు అన్నాడు. "తక్షకా! నేను ధనాన్ని సంపాదించడానికి ఆ రాజుదగ్గరకు వెళ్తున్నాను. నీవు ఆ ధనాన్ని నాకు ఇయ్యి. అలా ఇస్తే ఆ ధనం తీసుకొని వెనుదిరిగి వెళ్లిపోతాను."

తక్షకుడు అన్నాడు. "ఆ రాజు నుండి ఎంత ధనాన్ని కోరుతున్నావో దానికంటె

అధికంగా నేనే ఇస్తాను. నీవు వెనుదిరిగి వెళ్లు." "తక్షకుని మాటలు విని మహాతేజస్వి, బుద్ధిశాలి అయిన కాశ్యపుడు పరీక్షిత్తు గురించి కొంతసేపు ధ్యానించి విచారించాడు. కాశ్యపుడు తన దివ్యజ్ఞానంతో పరీక్షితుని ఆయువు సమాప్తం అయిందని గ్రహించాడు. అందుచేత తక్షకుని కోరిక ప్రకారం ధనం తీసుకొని అక్కడనుండి తన ఊరుకు వెళ్లిపోయాడు. కాశ్యపుడు మరలిపోయిన తరువాత తక్షకుడు అతిత్వరితంగా హస్తినాపురాన్ని చేరుకొన్నాడు. అక్కడికి వెళ్లిన తరువాత పరిక్షిత్తు మంత్రవేత్తలతోను, విషాన్ని హరించే ఓషధులతోను తనను రక్షించుకొనడానికి సిద్ధంగా ఉన్నాడని విన్నాడు తక్షకుడు.

తక్షకుడు తన కార్యసాధన కోసం "ఏ ఉపాయంతో పరిక్షిత్తు ప్రాణాల్ని అపహరించాలి?" అని ఆలోచించాడు. మాయతో పరీక్షిత్తును మోసగించాలి అనుకొన్నాడు. కొందరు నాగుల్ని దర్భలు, ఫలాలు తీసుకొని తాపసులవేషంతో మహారాజు దగ్గరకు వెళ్లవలసిందిగా ఆజ్ఞాపించాడు. తక్షకుడు అన్నాడు. "మీరు మనకార్యాన్ని సఫలం చేయడానికి రాజుదగ్గరకు వెళ్లండి. ఏ మాత్రం భీతి చెందకండి. ఉద్వేగపడకండి. ఆ రాజు మీరిచ్చిన ఫలాలను, పుష్పాలను తీసుకోవాలి. మీతోబాటే నేను కూడా అదృశ్యరూపంలో వస్తాను. తక్షకుడు చెప్పినట్లే ఆ సర్పాలన్నీ చేశాయి. వాళ్లందరు దర్భలు, జలం, పండ్లు తీసుకొని వెళ్లారు. మహాపరాక్రమశాలియైన పరిక్షిత్తు వాటినన్నిటిని తీసుకొన్నాడు. ఆ ఫలాన్ని తీసుకొన్నరాజు వారందరికీ పారితోషికాల్ని ఇచ్చి "మీరు వెళ్లండి" అని వారిని పంపించాడు. తాపసవేషంలో ఉన్న ఆ నాగులు వెళ్లిపోయిన తరువాత పరిక్షిత్తు తన మంత్రులతోను, స్నేహితులతోను "తాపసులు తెచ్చిన తీయని ఫలాలను మీరుకూడ తినండి" అని చెప్పాడు. అందరూ పండ్లను తీసుకొన్నారు. బ్రహ్మ వ్రాసిన వ్రాతప్రకారం శృంగిమహర్షిచే ప్రేరేపింపబడి, మహారాజు ఆ ఫలాల్లో ఒకదాన్ని స్వయంగా భుజించాడు. ఆ పండులోనే తక్షకుడు క్రిమిరూపంలో ఉన్నాడు. ఆ పండు మహారాజు చేతిలో ఉన్న సమయంలో అందులో ఒక చిన్న క్రిమి కనిపించింది. చూడటానికి ఆ పురుగు చిన్నదిగా కనిపించింది. కళ్లు నల్లగా ఉన్నాయి. శరీరకాంతి తామ్రవర్ణంగా ఉంది. పరిక్షిత్తు ఆ కీటకాన్ని తన చేతిలోనికి తీసుకొని మంత్రులతో ఈ విధంగా అన్నాడు. "ఇపుడు సూర్యభగవానుడు అస్తాద్రిని చేరాడు. అందుచేత ఈ సమయంలో నాకు విషంవల్ల ఎటువంటి భయమూ ఉండదు. శాపం ఇచ్చిన ఆ మహర్షి సత్యవాది. ఈ పురుగు తక్షకుడై నన్ను కఱచుగాక! ఈ విధంగా మునిశాపం తీరిపోతుంది. నా దోషం పరిహారమవుతుంది గదా!" కాలంచేత ప్రేరేపింపబడిన మంత్రులు అతని మాటను అనుసరించారు. తరువాత ఆ రాజు ఆ

పురుగును తనమెడమీద ఉంచుకొని గట్టిగా నవ్వాడు. అలా రాజు నవ్వుతూ ఉండగానే రాజు కిచ్చిన ఫలం నుండి త్వరగా బయటకు వచ్చి పెద్ద ధ్వని చేస్తూ రాజును చుట్టివేసి తక్షకుడు కాటువేశాడు.

44. జనమేజయుని రాజ్యాభిషేకము - వివాహము.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. మంత్రులందరూ తమరాజేంద్రుని నాగేంద్రుడు చుట్టుకొనడం చూచి విచారవదనాలతో మిక్కిలి దుఃఖితులైనారు. తక్షకుడు చేసిన పూత్కారశబ్దాన్ని మంత్రులు విని దూరంగా పారిపోయారు. పరీక్షితుని కరచిన తరువాత తక్షకుడు అద్భుతంగా ఆకాశానికి సీమంతం వలె వెళ్లిపోతూంటే మంత్రులు అతనిని చూశారు. అతనిని చూసి మంత్రు లందరూ శోకపరవశు లయ్యారు. ఆ ఒంటిస్తంభంమేడ తక్షకుని విషాగ్నితో దగ్ధమైపోయింది. ఈ దృశ్యాన్ని చూసి మంత్రులు అందరు చెల్లాచెదరై పారిపోయారు. రాజు పిడుగుపడిన విధంగా కుప్పకూలిపోయాడు. తక్షకుని విషాగ్నివలన పరిక్షిత్తు దగ్ధమైపోయాడు. అతనికి పారలౌకిక క్రియలు జరిపించిన తరువాత బ్రాహ్మణులు రాజపురోహితులు, మంత్రులు, ప్రజలందరు కలిసి పరీక్షితుని కుమారుడు, శిశువయినా జనమేజయునికి పట్టాభిషేకం చేశారు. జనమేజయుడు శత్రునాశనసమర్థుడు. ప్రజలు అందరు అతనిని జనమేజయుడనే పిలుస్తున్నారు. బాలుడైనప్పటికీ అతని ప్రజ్ఞ మహాపురుషుల బుద్ధికి సమానంగా ఉంది. తన తాతగారు అయిన ధర్మరాజులాగ వీరులలో జనమేజయుడుకూడా అగ్రగణ్యుడే. ఇతడు కూడా మంత్రులతోను, పురోహితులతోను కూడి రాజ్యాన్ని ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నాడు.

ఇతనియొక్క మంత్రులు శత్రుసంహారంలో సమర్థుడే అని గమనించి, ఇతనికి వివాహం చేసే నిమిత్తం కాశీరాజు అయిన సువర్ణవర్మ కుమార్తె వపుష్టమకోసం ఆ రాజును అర్థించారు. సువర్ణవర్మ కురుప్రవీరుడైన జనమేజయుని యొక్క ధర్మగుణాన్ని విని, సంతోషించి, తన కుమార్తె అయిన వపుష్టమను అతనికి ఇచ్చి, వివాహం చేశాడు. జనమేజయుడు కూడా ఆమెను వరించి, ఆనందంగా జీవితాన్ని కొనసాగిస్తూ ఏకపతీవ్రతుడై ఉన్నాడు. పూర్వం ఊర్వశితో పురూరవుడు విహరించినట్లుగా జనమేజయుడు తనభార్య వపుష్టమతో సరస్సులలోను, ఉద్యానవనాలలోను, విహరిస్తూ మహానందాన్ని పొందుతున్నాడు. వపుష్టమ మహాపతివ్రత, రూపవతి, సౌందర్యవతి. జనమేజయుని పొంది అంతఃపుర కాంత అయిన వపుష్టమ మనసారా ఆ రాజుతో రమించింది.

45. జరత్కారుడు పితరులను దర్శించుట.

ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. జనమేజయుడు రాజ్యం పరిపాలిస్తున్న కాలంలో మహాతపోధను డయిన జరత్కారుడు దేశం అంతా సంచారం చేస్తున్నాడు. ఏ గ్రామంలో లేదా ఏ స్థానంలో ఉన్నపుడు సాయంకాలం అవుతుందో అపుడు అక్కడే ఉండిపోతాడు. ఇది ఆ మహామునీంద్రుని నియమం. ఆ ముని అవలంబిస్తున్న ఆ కఠోరనియమాన్ని అకృతాత్ములు ఆచరింపలేరు. పుణ్యతీర్థాలలో పవిత్రస్నానాలు చేస్తూ దేశసంచారాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ ముని వాయువును మాత్రమే భక్షిస్తూ రోజురోజుకీ శరీరాన్ని శుష్కింపచేస్తున్నాడు. ఒకనాడు ఒక గుంటలో అవురుగంటును పట్టుకొని తలక్రిందులుగ వ్రేలాడుతున్న తన పితరులను చూశాడు. వేళ్లన్నీ ఎలుకలు కొరికివేశాయి. ఒకవేరు మాత్రమే ఉన్నది. ఈ వేరును కూడా అక్కడ కన్నంలో ఉన్న ఎలుక మాటిమాటికి కొరుకుతున్నది. అట్టి వేరును పట్టుకొని వ్రేలాడుతూ కృశించిన తన పితరుల్ని జరత్కారుడు చూశాడు. ఆ పితరులు నిరాహారులై, కృశాంగులై, దీనంగా తమ రక్షణ కోరుతూ గుంటలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. జరత్కారుడు వారి దయనీయ పరిస్థితిని చూసి, దీనవదనంతో వారితో ఈ విధంగా అన్నాడు. "అయ్యా! మీరెవరు? ఎందుకు ఈ విధంగా వ్రేలాడుతున్నారు? ఈ వేరును గూడా ఈ బిలంలో ఉంటున్న ఎలుక తినివేస్తున్నది గదా! ఈ వేరు చాలా బలహీనంగా ఉందికదా! ఈ వీరణస్తంభానికి ఒక్క వేరే మిగిలి ఉంది. ఈ ఒక్క వేరును కూడా ఆ ఎలుక మెల్లగా తన పదునైన పళ్లతో కొరికేస్తోంది. చాలా తక్కువ సమయంలోనే ఈ వేరు కూడా తెగిపోతుంది. అధోముఖులైన మీరు ఈ గుంటలో తప్పక పడిపోతారు గదా! ఈ విధంగా అధోముఖులై దీనావస్థలోఉన్న మిమ్ము చూస్తుంటే నాకు దుఃఖం కలుగుతున్నది. అయ్యా! మీరు చాలా కష్టదశలో ఉన్నారు. నేను మీకు ఏమిచేస్తే సంతోషం కలుగుతుంది? నా తపస్సులో నాల్గవవంతు లేదా మూడవవంతు లేదా సగభాగం ఇచ్చి అయినా మీకష్టాన్ని పోగొట్టడానికి సిద్ధంగా ఉన్నాను. ఆజ్ఞాపించండి. లేదా నాసంపూర్ణ తపఃఫలాన్ని ధారపోసి మిమ్ము ఆపద నుండి రక్షించడానికి సిద్ధంగా ఉన్నాను. కాబట్టి నేను ఏ విధంగా సహాయపడాలో ఆజ్ఞాపించండి."

పితరులు అన్నారు. "బ్రాహ్మణోత్తమా! నీవు వృద్ధుడవైన బ్రహ్మచారివి. నీవు మమ్మల్ని రక్షించాలని కోరుకొంటున్నావు. కాని మా కష్టం తపస్సు వల్ల తీరేది కాదు. నాయనా! మేము చేసిన తపస్సు యొక్క పుణ్యఫలం మా దగ్గర కూడా ఉంది. మాకు వంశపారంపర్యంగా వచ్చే సంతానం క్షీణిస్తూండటం వల్ల మాకు ఇటువంటి అపవిత్రమైన నరకం కలుగబోతున్నది. సంతానాన్ని పొందడమే గొప్ప ధర్మం అని బ్రహ్మదేవుడే

చెప్పాడు. మా సంతానం క్షీణిస్తోంది. ఈ విధంగా వ్రేలాడుతున్న మాకు ఏమీ తోచటం లేదు.. లోకంలో ప్రసిద్ధికెక్కిన మహాపురుషులైన మీవంటి మహానుభావుల్ని గుర్తించలేకపోయాం. నీవు వృద్ధుడవు, మహాపురుషుడవు. ఎంతో కష్టంలో బాధపడుతున్న మమ్ము చూసి నీవు దుఃఖించావు. నాయనా! మేము అత్యంత కఠినవ్రతాన్ని ఆచరిస్తున్న యాయావరులు అనే మహర్షులం. వంశపారంపర్యంగా సంతానం నశిస్తూండటం వలన మేము పుణ్యలోకం నుండి భ్రష్టుల మయ్యాం. మేము చేసిన తీవ్రమైన తపస్సంతా నష్టమైపోయింది. ఇపుడు మా వంశంలో ఒక్క సంతానం కూడా లేదు. ఇప్పుడు మా వంశపరంపరలో ఒకే ఒక్కవేరు అనగా ఒకే ఒక్కడు మిగిలి ఉన్నాడు. మా దురదృష్టం వల్ల ఆ మందభాగ్యుడు కూడా వివాహం చేసుకోకుండా తపోనిష్ఠలో ఉన్నాడు. అతడు వేదవేదాంగపారగుడై, నియమనిష్ఠలతో సువ్రతుడై, మహాతపోధనుడై, జరత్కారుడు అనే పేరుతో ప్రసిద్ధికెక్కినాడు. అతడు తపస్సు చేసుకోవడమే ఇష్టపడుతూ మమ్మల్ని ఈ కష్టంలో పడవేశాడు. అతడికి భార్యగాని, పుత్రులుగాని, బంధువులుగాని ఎవ్వరూ లేరు.

అందుచేత మేమంతా బుద్ధిహీనులమై అనాథల్లాగ ఈ గుంటలో వ్రేలాడుతున్నాం. అతడు నీకు కనిపిస్తే అనాథులమైన మమ్మల్ని సనాథులుగా చేయడానికి అతనికి ఈ విధంగా చెప్పు. "నీ పితరులు దీనాతిదీనులై తలక్రిందులుగా గుంటలో వేలాడుతున్నారు. నీవు సముచితరీతిలో ఒక కన్యను వివాహం చేసుకొని సంతానాన్ని పొందు. తపోధనా! మా వంశతంతువులో ఒకటే మిగిలింది. అది నీవే." నీవు చూస్తున్న తంతువులన్నీ కాలునిచేత భక్షింపబడుతున్నాయి. మిగిలిన ఒక తంతువూ కూడ సగం కాలుడు కొరికేశాడు. నీవు చూసిన ఎలుక ఎవరోకాదు. మహాబలుడయిన కాలుడు. తపస్వి, మూర్ఖుడైన ఆ జరత్కారుడు తపస్సే గొప్పదిగా భావిస్తూ మనసులేకుండా మందబుద్ధితో ఉంటే ఈ ఒక్క వేరు కూడా తెగిపోతుంది. ఆ జరత్కారుడు చేసే తీవ్ర తపస్సు మా ఈ కష్టాన్ని పోగొట్టలేదు. మేము వేలాడుతున్న వేరు కాలునివల్ల తెగిపోవడానికి సిద్ధంగా ఉంది. పాపంచేసిన వారివలె గుంటలో ప్రవేశించిన మమ్మల్ని చూడు. మేము పడిపోతే బంధువులందరితో కలిసిన మమ్ము కాలుడు నరకానికి లాక్కుపోతాడు. నాయనా! **తపస్సుగాని, యజ్ఞంగాని, ఏ ఇతర సాధనంగాని అవన్నీ పంతావంతో సమానం కావు.** నీవు ఆ జరత్కారుడితో ఈ విషయాలన్నీ చెప్పు. నీవు జరత్కారుని కలిస్తే ఇక్కడ చూసిన విషయాలన్నీ అతనికి చెప్పు. మమ్మల్ని నీవు సనాథులుగా చెయ్యదలిస్తే ఈ మాటలన్నీ అతనికి చెప్పు. 'వివాహం చేసుకో, ధర్మపత్ని ద్వారా సంతానాన్ని పొందు.' అని. మేము

జరత్కారుని బంధువులం. నీవు కూడా మా బంధువులాగా మాకోసం దుఃఖించావు. కుమారా! నీవు ఎవరివి? పూర్తిగా తెలుసుకోవాలని అనుకొంటున్నాం.

46. వానుకి జరత్కారులు కలిసికొనుట.

ఆ పితరులమాటల్ని విన్న జరత్కారుడు మిక్కిలిగా దుఃఖించాడు. అతడు దుఃఖంతో, గద్గదస్వరంతో పితరులకు చెపుతున్నాడు. 'మీరు నా పితరులే. పితామహులే. అందుచేత మీకు సంతోషం కలిగించడానికి నేను ఏ పనిచెయ్యాలి? చెప్పండి. నేనే ఆ జరత్కారుడను. నేనే ఆ పాపాత్ముడను, నేనే మీ కుమారుడిని. పాపాత్ముడిని అయిన నన్ను మీ ఇష్టం వచ్చినట్లుగా శిక్షించండి. అనగానే పితరులు "కుమారా! మా అదృష్టంకొద్దీ నీవు ఇక్కడికి వచ్చావు. ఇప్పటిదాకా నీవు ఎందుకు వివాహం చేసుకోలేదు?" అని అడిగారు. జరత్కారుడు చెప్పాడు. 'పితృదేవతలారా! నా మనసులో ఈ భావం ఎందుకు తిరుగుతోందంటే నేను బ్రహ్మచర్యంతో పరలోకం చేరాలని ఎప్పుడూ నా మనసులో అనుకొంటూ ఉంటాను. ఎప్పుడూ పత్నీపరిగ్రహం చేయరాదని అనుకొంటూ ఉంటాను- పితరులారా! పక్షులవలె వ్రేలాడుతున్న మిమ్మల్ని చూచిన తరువాత నా బుద్ధిని బ్రహ్మచర్యం నుండి మళ్లిస్తున్నాను. నిస్సందేహంగా మీరుకోరిన ప్రకారం వివాహం చేసుకొంటాను. నాపేరుతో సమానమైన పేరుగల కన్య ఎపుడయినా దొరికితేనే నేను వివాహం చేసుకొంటాను. నేనడగకుండా ఎవరయినా స్వయంగా భిక్షగా ఇస్తే స్వీకరిస్తాను. ఆ భార్యయొక్క పాలన - పోషణభారం నాపై ఉండకూడదు. ఇలా లభిస్తేనే వివాహం చేసుకొంటాను. మరోవిధంగా అయితే వివాహం చేసుకోను. ఇది నిజం. ఆమెగర్భంలో మిమ్మల్ని నరకం నుండి తప్పించే పుత్రుడు జన్మిస్తాడు. నాపితరులు నిత్యమూ, శాశ్వతమూ అయిన లోకాల్లో ఉందురుగాక!'

ఈ విధంగా జరత్కారుడు పితరులకు చెప్పి, వారిని విడిచి పూర్వంవలె దేశాటనం చేస్తున్నాడు. కాని "ఇతడు వృద్ధు"డని ఎవరూ కన్యనివ్వటంలేదు. అందుచేత భార్య లభించటంలేదు. వివాహం జరగ లేదని విచారపడుతూ అతని పితరులు ప్రేరేపించిన కారణంగా అడవిలోకి వెళ్లి దుఃఖంతో బిగ్గరగా విలపించాడు. అడవికి వెళ్లిన తరువాత విద్వాంసుడైన జరత్కారుడు తనపితరుల హితాన్నికోరి మూడు పర్యాయాలు నెమ్మది నెమ్మదిగా "నేను కన్యను యాచిస్తున్నాను" అని అన్నాడు. మరల బిగ్గరగా "ఇక్కడ ఏ చరాచరప్రాణులు ఉన్నాయో, దృశ్య - అదృశ్యప్రాణులు ఉన్నాయో అవి అన్నీ నామాటను వినుగాక ! నాపితరులు భయంకరమైన కష్టాల్లో ఉన్నారు. వారు దుఃఖంతో బాధపడుతున్నారు.

సంతానప్రాప్తికోసం నన్ను ప్రేరేపించారు నన్ను వివాహం చేసుకొమ్మన్నారు. అందుచేత వివాహంకోసం భూమిఅంతా తిరిగి కన్యను భిక్షగా ఇవ్వమని యాచిస్తున్నాను. నేను దరిద్రుడను. దుఃఖశీలుడను. అయినా పితరుల ఆజ్ఞవలన నేను వివాహం చేసుకొనడానికి ప్రయత్నాన్ని కొనసాగిస్తాను. నేను పేర్కొన్న ఈ ప్రాణి సమూహంలో నాపేరు కల కన్య ఉంటే దేశమంతా తిరిగేనాకు మీరు ఆ కన్యను ఇత్తురుగాక! నాపేరుగల కన్యను నాకిచ్చి వివాహం చేస్తే ఆమె పాలనను పోషణను నాపై ఉంచరాదు. ఆ భారం నేను భరించను. అటువంటి కన్యనే నాకు ఇవ్వండి' అని అరిచాడు. జరత్కారుని సమీపంలో ఉన్న నాగులు ఈ జరత్కారుని మాటల్ని విని సోదరుడైన వాసుకికి చెప్పారు.

ఆ వార్తను విన్న నాగరాజు వాసుకి తనసోదరి అయిన జరత్కారువును వధువుగా అలంకరించి అరణ్యంలో ఉన్న జరత్కారుమహర్షి దగ్గరకు తీసుకొని వెళ్లాడు. అక్కడ వాసుకి జరత్కారునకు భిక్షవలె ఆ కన్యకను సమర్పించాడు. అయితే వెంటనే జరత్కారుడు ఆమెను స్వీకరింపలేదు. మనసులో ఇలా అనుకొన్నాడు. 'ఈమె నాపేరు కలది కాదేమో! పోషణభారం గురించి చెప్పకుండా ఎలా?' పితరుల మోక్షం మీద ఆసక్తి ఉన్నా ఇలా అనుకొని వివాహానికి వెనుకాడుతున్నాడు. అపుడు జరత్కారుడు ఆ కన్య యొక్క పేరు అడిగి ఆమె పోషణభారం గురించి వాసుకికి చెప్పాడు.

47. జరత్కారుడు జరత్కారువును వివాహమాడుట.

వాసుకి జరత్కారుమునీంద్రునితో "బ్రాహ్మణోత్తమా! ఈ కన్యక పేరు కూడా నీపేరు వంటిదే. జరత్కారు ఎనే. ఈమె నా సోదరి. ఈమెకూడా మీవలెనే తపస్వినికూడా. కాబట్టి మా సోదరిని భార్యగా స్వీకరించండి. ఈమెయొక్క పోషణభారాన్ని నేనే చూసుకొంటాను. ఇప్పటివరకు మీకొరకే నిరీక్షిస్తూ ఈమెను రక్షించుకొంటున్నాను" అన్నాడు. జరత్కారుడు అన్నాడు. 'నాగరాజా! ఈమెపోషణభారాన్ని నేను వహించను. ఇది నా నియమం. ఎప్పుడూ నాకు ఇష్టంలేని పనిని చేయకూడదు. చేస్తే నేను ఈమెను విడిచి వెళ్లిపోతాను.' నాగరాజు ఈ షరతుల్ని అంగీకరించాడు. "నా సోదరి భరణ పోషణల్ని నేను భరిస్తాను" అని హామీ ఇచ్చాక జరత్కారుడు వాసుకి ఇంటికి వెళ్లాడు. ఆ వాసుకి భవనంలో మంత్రవేత్తలలో అగ్రగణ్యుడును, తపోధనుడు, మహావ్రతుడు, ధర్మాత్ముడు అయిన జరత్కారుడు విధ్యుక్తంగా నాగకన్య జరత్కారువును పాణిగ్రహణం చేసుకొన్నాడు. వాసుకి భవనంలోకి జరత్కారుడు, తనభార్యను తీసుకొనివెళ్లాడు. మహర్షులందరూ వీరి దాంపత్యాన్ని ప్రశంసించారు. అక్కడ అభిలషణీయమైన ప్రక్క (దుప్పటి)తో

కూడిన శయనం అలంకరింపబడింది. అచట భార్యాసహాయుడై జరత్కారుడు నివసించాడు. సాధుపుంగవుడయిన జరత్కారుడు భార్యతో తన షరతును ఈ విధంగా చెప్పాడు. "నీవు ఎప్పుడూ నాకు ఇష్టంకాని పని చేయవద్దు. అంతేకాక ఎప్పుడూ అప్రియమైన మాటలు కూడా చెప్పవద్దు. నా మాటను కాదని ఎప్పుడైనా అప్రియంగా వాచా కర్మణా ప్రవర్తించినా నిన్ను, నీ గృహాన్నికూడా విడిచిపెట్టి వెళ్లిపోతాను. కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించు" అని చెప్పాడు. భర్తమాటలను విని ఆమె ఉద్విగ్నురాలయి దుఃఖించి భర్తతో "అలాగే అగుగాక" అని మాట ఇచ్చింది. యశస్వినీ అయిన నాగకన్య (కత్తిమీదసాముగా) భర్తపెట్టిన షరతులకు అనుగుణంగా పతిసేవ చేస్తున్నది. ఆమె **కుక్కవలె జాగ్రత్తవహిస్తూ, లేడివలె భయంతో ఉంటూ, కాకిలాగా ఇంగితజ్ఞానంతో మెలగుతూ, ఉపాయంగా భర్తకు ఇష్టంగా వ్యవహరిస్తూ, పతివ్రతగా ఆరాధిస్తూ కాలం గడుపుతున్నది.**

ఒక సమయానికి జరత్కారువుకు ఋతుకాలం వచ్చింది. ఋతుస్నాతయై ఆమె సముచితంగా జరత్కారుని సేవలో ఉన్నది. పిమ్మట ఆమె గర్భవతి అయింది. ప్రజ్వలిస్తున్న అగ్నితో సమానమైన తేజస్వి, తపస్సంపన్నుడు అయిన శిశువు ఆమెగర్భంలో పెరుగుతున్నాడు. శుక్లపక్షంలోని చంద్రుడిలాగా ఆమెగర్భంలోని శిశువు క్రమక్రమంగా పెరుగుతున్నాడు. కొన్నిరోజుల తరువాత జరత్కారుడు ఏదో అలసటతో ఉండి భార్య ఒడిలో తల ఉంచి నిద్రించాడు. ఆ బ్రాహ్మణోత్తముడు నిద్రించే సమయంలో సూర్యభగవానుడు అస్తాద్రిని చేరాడు. సంధ్యాకాలం వచ్చింది. సంధ్యా సమయంలో సూర్యునికి అర్ఘ్యమివ్వకుండా నిద్రించడం ధర్మంకాదని, ఆమె భావించి పతికి ధర్మలోపం జరుగుతుందేమోనని భయపడ్డది ఆ మహాపతివ్రత. "ధర్మాత్ముడైన నా పతియొక్క స్వభావం కఠినమైనది. నిద్రలేపితే నాకు పుణ్యం కలుగుతుందా? నాపతిదృష్టిలో అపరాధం చేసినదానినవుతానా?" అని వితర్కించుకొన్నది జరత్కారువు. "భర్తను మేలుకొలిపితే తప్పకుండా నాపై కోపపడతారు. నిద్రలేపకపోతే సంధ్యోపాసనకు సమయం దాటిపోతుంది. అపుడు తప్పక ధర్మలోపం జరుగుతుంది. కాబట్టి భర్త ఈ సందిగ్ధ సమయంలో కోపించినా సహిస్తాను కానీ ధర్మలోపాన్ని జరుగనీయను. తప్పకుండా మేలుకొలుపుతాను" అని నిశ్చయించుకొన్నది. ఆ విధంగా మనస్సులో నిశ్చయించుకొని అగ్నితో సమానమైన తేజస్వీ, తపోధనుడూ అయిన భర్తను మృదుభాషలతో మేల్కొలుపుతూ "మహాభాగా! నిద్రనుండి లేవండి. సూర్యభగవానుడు అస్తాద్రిని చేరుకొంటున్నాడు. దేవా! నియమపూర్వకంగా ఆచమనం చేసి సంధ్యోపాసన చేయండి. ఇపుడు అగ్నిహోత్రం సిద్ధంగా ఉంది. ఈ సమయం

ధర్మసాధనకు సమయం. ప్రాణులన్నీ కదలిపోతున్నాయి. అందువలన ఇది రమణీయంగాను, భయంకరంగాను ఉన్న సమయం. పశ్చిమదిక్కున సంధ్యాప్రకటనం జరుగుతోంది. ఆ దిక్కులో ఆకాశం ఎఱ్ఱగా ఉంది.'

భార్య ఆ విధంగా చెప్పిన తరువాత జరత్కారుడు నిద్రనుండి లేచాడు. పెదవులు అదిరేటట్లు ఆమెతో ఈవిధంగా అన్నాడు. "నాగకన్యా! నీవు నన్ను అవమానించావు. అందుచేత నీ దగ్గఱ ఇక ఉండను. ఎలా వచ్చానో అలాగునే వెళ్లిపోతాను. నేను నిద్రిస్తూ ఉండగా సూర్యుడికి అస్తమించే శక్తి ఉందా? ఇట్టి అవమానం ఎవరూ భరించలేరు. నాలాంటి ధర్మశీలునికి వేరే చెప్పాలా?" భర్తపల్కిన భయంకరమైన ఆ మాటలకు జరత్కారువు వణికిపోయింది. దుఃఖార్తయై భర్తతో "స్వామీ! నేను మీకు ఎట్టి అవమానమూ తలపెట్టలేదు. మీకు ధర్మలోపం జరుగకూడదని భావించి నిద్రలేపాను" అంది. జరత్కారుడు కోపోద్రేకంతో ఆమెను విడిచిపెట్ట దలచి భార్యకు ఈవిధంగా చెప్పాడు. "నాగకన్యా! నేను ఎప్పుడూ అసత్యం పలుకలేదు. అందుకని నిశ్చయంగా ఇక్కడనుండి నిన్ను విడిచి వెళ్లిపోతున్నాను. ఇంతకు పూర్వమే నేను నీకు నా షరతును చెప్పాను. ఇక్కడ నేను ఎంతో సుఖపడ్డాను. నేను ఇక్కడ నుండి వెళ్లిపోయానని నీ సోదరుడు వాసుకితో చెప్పు. నేను వెళ్లిన తరువాత నీవు దుఃఖించరాదు."

జరత్కారుడు ఆ మాటలు చెప్పిన తరువాత నిర్దోషి అయిన ఆమె ఆ జరత్కారునితో చింతాకులచిత్తంతో, దీనవదనయై కన్నీరు కారుస్తూ, అంజలిఘటించి, గద్గదస్వరంతో కొంతధైర్యం తెచ్చుకొని, ఇట్లా అంది. "ధర్మజ్ఞా! మీరు ఎప్పుడూ ధర్మాన్ని విడిచిపెట్టరు. నేనుకూడా పతివ్రతనై నా ధర్మాన్ని నిర్వర్తిస్తూ మిమ్మల్ని సేవిస్తూనే ఉన్నాను. నిరపరాధిని అయిన నన్ను పరిత్యజించటం ధర్మం కాదు కదా!

బ్రాహ్మణోత్తమా! ఈ సదాశయంతోనే నా సోదరుడు వాసుకి నన్ను మీతో పాణిగ్రహణం చేయించాడు. సోదరుడు నాతో "సోదరీ! మన కుటుంబంలోని వారు తల్లి ఇచ్చిన శాపానికి గురి అయ్యారు. నీ సంతానం వల్ల మేము ఉద్ధరింపబడతాం" అని చెప్పాడు. ఇప్పటివరకూ సంతానం కలుగలేదు. నీవలన పుట్టిన సంతానంతో నా జ్ఞాతులకు శాపభయంలేకుండా శుభం జరుగుతుంది. దేవా! నాతో మీకు ఏర్పడిన సంబంధం వ్యర్థం కారాదు. నా బంధుజనానికి మీరు హితవు కోరినట్లయితే నాప్రార్థనను ఆలకించండి. మహానుభావా! మీరు నన్ను గర్భవతిని చేశారు. ఇప్పటి వరకు ఆ స్వరూపం వ్యక్తం కాలేదు. ఇటువంటి క్లిష్టపరిస్థితిలో నిరపరాధినినైన నన్ను విడిచి మీరు వెళ్లిపోవడం ధర్మమా?" భార్యమాటల్ని విన్న జరత్కారుడు తనభార్య జరత్కారువుతో సముచితం,

అవసరం అయిన కొన్ని విషయాల్ని ఆమెకు తగినట్లుగా చెప్పాడు. 'నీ ఉదరంలో గర్భం ఉంది. నీ గర్భంలో పెరుగుతున్న బాలుడు అగ్నితో సమానమైన తేజస్వి. పరమధర్మాత్ముడు. మహాతపస్వి. వేదవేదాంగపారగుడు.' ఈ విధంగా ఆమెకు చెప్పి ధర్మాత్ముడైన జరత్కారుడు కృతనిశ్చయుడై, మరల తపస్సు చేసుకొనడానికి వెళ్లిపోయాడు.

48. ఆస్తీకుని జననము.

సౌతి ఇట్లన్నాడు. మునీంద్రా! భర్త తనను విడిచి వెళ్లిపోయిన తరువాత జరత్కారువు తనసోదరుడైన వాసుకి దగ్గరకు వెళ్లి తనభర్తకూ, తనకూ జరిగిన సంభాషణ ఉన్నదున్నట్లు చెప్పింది. వాసుకి ఈ అప్రియమైన విషయాన్ని విని, మిక్కిలి దుఃఖించాడు. దుఃఖితురాలైన తనసోదరితో వాసుకి మరింతదీనంగా ఇలా చెపుతున్నాడు. "సోదరీ! సర్పాలకు మహత్తరమైన ఒక కార్యం జరుగబోతున్నది. ఆ కార్యసాధనకై జరత్కారుమునితో నీకు వివాహం జరిపించాము. ఈ సంగతి నీకుగూడా తెలుసుగదా! జరత్కారుమునీంద్రుని ద్వారా నీకు జన్మించబోయే కుమారుడు సర్పజాతికి మహోపకారం చేయబోతున్నాడు. శక్తిసంపన్నుడైన నీకుమారుడు జనమేజయుడు చేయబోయే సర్పయాగాన్ని నివారిస్తాడు. ఈ మాట దేవతల ఎదుట బ్రహ్మదేవుడే చెప్పాడు. అమ్మా! ఆ మునీంద్రునివల్ల గర్భవతివి అయ్యావా? ఆ మహాత్మునితో నీ వివాహం నిష్ఫలం కారాదు. నేను నీసోదరుడను. పుత్రోత్పత్తి విషయం గురించి నీతో మాట్లాడటం ఉచితం కాదని నాకు తెలుసు. కాని కార్యం యొక్క ఆవశ్యకాన్ని గుర్తించి నిన్ను కొన్ని విషయాలు అడగవలసి వస్తున్నది. మహాతపస్వి అయిన నీ భర్తను వెళ్లిపోకుండా ఆపుచేయటం చాలాకష్టం. ఈ సంగతి నాకు తెలిసే నేను అతనిని అనుసరించలేదు. ఒకవేళ అతనిని నేను ఆపుచెయ్యడానికి సిద్ధపడితే నన్ను శపించవచ్చు. సోదరీ! నీ భర్తయొక్క చరిత్రను అంతా చెప్పు. చాలకాలం నుండి నా హృదయంలో ముల్లుగుచ్చుకొన్నట్లు బాధపడుతున్నాను. ఆ ముల్లును నీవే తీసివేయాలి." అన్నగారు ఈవిధంగా అడిగిన తరువాత జరత్కారువు దుఃఖపడుతున్న వాసుకిని శాంతింప చేయాలని అనుకొని ఈవిధంగా చెపుతోంది.

'సోదరా! నేను నా సంతానాన్ని గురించి నాపతిదేవుని అడిగాను. ఆయన "అస్తి' (ఉన్నాడు) అని చెప్పి వెళ్లిపోయారు. ఆ మహానుభావుడు ఎప్పుడూ ఏ సందర్భంలోనూ పరిహాసానికైనా అబద్ధం చెప్పలేదు. చెప్పినట్లు నాకు గుర్తుకూడా లేదు. ఈకష్టపరిస్థితిలో గూడా ఆ మహాతపోధనుడు అబద్ధం చెప్పవలసిన పనిలేదు. సోదరా! నాభర్త నిష్ఠాగరిష్ఠుడు. మహాతపస్వి. ఆయన నానుండి వెళ్లిపోయేటప్పుడు ఇట్లా చెప్పాడు. "కాంతామణీ! నీకార్యం

తప్పక సిద్ధిస్తుంది. నీవు చింతించవలసిన పనిలేదు. నీ గర్భంలో అగ్నితోను, సూర్యునితోను సమానమైన తేజస్వి ఉన్నాడు." అని చెప్పి తపోవనానికి వెళ్లిపోయారు. కాబట్టి సోదరా! నీవు విచారింపవలసిన పనిలేదు." ఉగ్రశ్రవుడు ఇలా అన్నాడు. "మునీంద్రా! ఆ మాటల్ని విన్న వాసుకి చాలా సంతోషించి ఆమెతో "అట్లే అగుగాక" అని అన్నాడు. జరత్కారువు కూడా అన్నగారికి తనమాట మీద నమ్మకం కలిగిందని సంతోషించింది. పన్నగశ్రేష్ఠ డయిన వాసుకి తనసోదరికి సాంత్వన వాక్యాలతో గౌరవపురస్సరంగా ధనం మొదలైనవాటిని ఇస్తూ, ఆమెకు మర్యాద చేస్తూ గౌరవిస్తున్నాడు. బ్రాహ్మణోత్తమా! శుక్లపక్షంలోని చంద్రుడివలె ఆమె గర్భంలో మహాతేజస్వి, కాంతిమంతుడు అయిన కుమారుడు దినదినాభివృద్ధి చెందుతున్నాడు. అనంతరం సమయం రాగానే వాసుకిసోదరి కుమారుని కన్నది. అతడు దేవకుమారునివలె ఉన్నాడు. అటు తల్లిపక్షాన, ఇటు తండ్రిపక్షాన ఉన్న భయాన్ని తొలగించేవాడుగా జన్మించాడు. ఆ బాలుడు నాగరాజైన వాసుకి భవనంలోనే పెరుగుతున్నాడు. పెద్దవాడు అయ్యాక ఆ బాలుడు భృగువంశ శ్రేష్ఠ డయిన చ్యవనమహర్షిదగ్గర వేదవేదాంగాల్ని అధ్యయనం చేశాడు. బాలుడై బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తున్నాడు. అతడు సత్వగుణసంపన్నుడై, బుద్ధిమంతుడై లోకంలో ఆస్తీకుడు అనే పేరుతో ప్రసిద్ధికెక్కాడు. ఆ బాలుడు గర్భంలో ఉన్నపుడే అతని తండ్రి 'అస్తి' అని చెప్పి వెళ్లిపోయాడు కాబట్టి ఆస్తీకుడు అని ప్రసిద్ధ నామం ఏర్పడింది. బుద్ధిమంతు డయిన ఆస్తీకుడు బాల్యావస్థలో బ్రహ్మచర్యాన్ని అవలంబించి, ధర్మాన్ని పాటిస్తున్నాడు. ఆ నాగరాజు భవనంలో యత్నపూర్వకంగా రక్షింపబడుతున్నాడు. బంగారుకాంతితో సమానుడై శూలపాణి, భగవంతుడు అయిన శివుడివలె దినదినాభివృద్ధి చెందుతూ నాగులందరికీ ఆనందాన్ని కల్గిస్తున్నాడు.

49. పరిక్షిత్తు వేటకు వెళ్లుట - శమీకుని అవమానించుట.

శౌనకుడు అడుగుతున్నాడు. 'సూతనందనా! జనమేజయుడు ఉత్తంకుని మాటల్ని విన్నతరువాత తనమంత్రులను తన తండ్రి పరిక్షిత్తు స్వర్గస్థు డయిన విషయాన్ని గురించి పూర్తిగా చెప్పమని కోరాడు గదా! ఆ విషయాన్ని మాకు సవిస్తరంగా చెప్పు.' సౌతి చెప్పాడు. "బ్రాహ్మణోత్తమా! వినండి. ఆ సమయంలో మహారాజుకు మంత్రులు ఏమిచెప్పారో, పరీక్షిత్తు మృత్యువుగురించి జరిగిన సంభాషణను నేను విన్నాను. జనమేజయుడు చెప్పాడు. "నాతండ్రియొక్క జీవితకాలంలో ఆయనయొక్క ఆచారవ్యవహారాల్ని మీరు ఎరుగుదురుకదా! వాటినిచెప్పండి. అంత్యకాలంలో ఆయనకు మృత్యువు ఎలా సంభవించిందో తెలుపండి. మీరందరు నాతండ్రితో సన్నిహితసంబంధం కలవారు కాబట్టి ఆయన

చరిత్రను చెప్పండి. అది వింటే నామనస్సు ప్రశాంతంగా ఉంటుంది. లేకపోతే నాకు మనశ్శాంతి ఉండదు." సౌతి చెపుతున్నాడు. పరిక్షిత్తుయొక్క మంత్రులందరు ధర్మజ్ఞులు, బుద్ధిమంతులును. జనమేజయుడు అడిగినదానికి సమాధానంగా వారు ఆ వృత్తాంతాన్ని అంతటినీ చెప్పారు. మంత్రులు ఇలా పలికారు. "మహారాజా! నీవు అడిగిన విషయాన్ని చెపుతాం. వినండి. పరీక్షిత్తుమహారాజు చరిత్రనీ, అతనికి మృత్యువు ప్రాప్తించిన విధానాన్ని చెపుతాం.

మహారాజా! మీతండ్రి ధర్మాత్ములు. మహాత్ములు. గొప్ప ప్రజాపాలకులును. ఆ మహాత్ముడు ఏవిధంగా వ్యవహరిస్తూ రాజ్యపాలన చేశాడో దాన్ని చెపుతాం. నాలుగువర్ణాలను స్వధర్మమందు నిలిచేటట్లుచేసి ధర్మపరిపాలన చేశాడు. అతడు రూపుదాల్చిన ధర్మమే సుమా! సాటిలేని పరాక్రమం కల అతడు సకలసంపదలు కలిగి భూమండలాన్ని పరిపాలించాడు. అతడిని ద్వేషించే వారే లేరు. అతడు ఎవరినీ ఎప్పుడూ ద్వేషించలేదు. ప్రజాపతి అయిన బ్రహ్మతో సమానుడైన ఆ పరిక్షిత్తు ప్రతిప్రాణిని సమదృష్టితో ఆదరించాడు. మహారాజా! మీతండ్రి పాలనలో ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అందరు తమతమ ధర్మాలను సక్రమంగా పాటించేవారు. దేవతలుకూడ అతని చేత చక్కగా పూజింపబడేవారు. మీతండ్రి విధవలకు, అనాథలకు, వికలాంగులకు, దీనులకు పోషణ రక్షణ భారాన్ని వహించాడు. ఆ మహారాజు రెండవ చంద్రుడిలాగ ప్రాణికోటికి అంతటికి సుందరంగాను, సులభుడుగాను దర్శనమిచ్చేవాడు. అతనిరాజ్యంలో ప్రజలందరు తుష్టిగా, పుష్టిగా ఆనందిస్తూ ఉన్నారు. అతడు ధనసంపన్నుడేకాదు, అమిత పరాక్రమశాలి, సత్యవాది కూడ.

మీతండ్రి కృపాచార్యుని దగ్గర శిష్యరికం చేసి విలువిద్యలో పండితు డయ్యాడు. అంతేకాదు. ఆయన శ్రీకృష్ణపరమాత్మకు ఇష్టుడు కూడా. మహాయశస్వి అయిన ఆ మహారాజు జగత్తులో అందరికీ ఇష్టు డయినాడు. కురుకులం క్షీణిస్తున్న సమయంలో అతడు ఉత్తరగర్భంలో జన్మించాడు. అందుచేత అభిమన్యుకుమారు డైన అతనికి పరీక్షిత్ అనుపేరు పెట్టారు. రాజధర్మంలో, అర్థనీతిలో ఆయన నేర్పరి. అన్ని సద్గుణాలు మీతండ్రిని వరించాయి. అతడు జితేంద్రియుడు. సంయమనంతో వ్యవహరించే వాడు. మహామేధావి. నిరంతర ధర్మసేవకుడు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యా లనే శత్రువుల్ని జయించిన మహానుభావుడు. నీతికోవిదులలో అతడు ప్రథముడు. 60 సంవత్సరాలు నీతండ్రి అత్యుత్తమంగా ప్రజారంజకంగా పాలన చేశాడు. అనంతరం మా అందరికీ దుఃఖం కలిగేటట్లుగా అతనికి మోక్షప్రాప్తి కలిగింది. తరువాత మీరు ధర్మంతో రాజ్యం పొందారు. వేల -సంవత్సరాలుగా కురువంశంలో వస్తున్న ఈరాజ్యాన్ని మీరు

చిన్నతనంలోనే పొంది, సర్వప్రాణులనూ రక్షిస్తున్నారు. జనమేజయుడు అన్నాడు. "మంత్రులారా! మా ఈవంశంలో ఇటువంటి ప్రభువు లేడు. ప్రజలకు ప్రియకార్యాలు చేస్తూ వారి ప్రేమకు పాత్రుడయిన రాజు పూర్వం లేడుగదా! మా ప్రపితామహులు మహాపురుషులు, వారు ధర్మపరాయణులు. వారి సదాచారాలతో సమానంగా మాతండ్రి కీర్తి పొందాడు. అటువంటి ధర్మాత్ముడైన మాతండ్రికి అటువంటి మృత్యువు ఎలావచ్చింది? సవిస్తరంగా తెలుసుకోవాలని కోరుతున్నాను." ఉగ్రశ్రవుడు చెప్పాడు. 'ఆ విధంగా అడిగిన మహారాజుకు అతని మంత్రులు పరిక్షిత్తు మరణాన్ని గురించి యథాతథంగా చెప్తున్నారు.'

మంత్రులు చెప్పారు. 'ఆ రాజు వేటమీద ఆసక్తి కలిగి ఉండేవాడు. పాండురాజులాగా ధనుర్ధారియై వేటకు వెళ్లేవాడు. రాజకార్యాలన్నీ మామీద పెట్టి వెళ్లేవాడు. ఒకనాడు వేటకు వెళ్లి ఒక బాణంతో మృగాన్ని కొట్టాడు. అది పారిపోతుంటే అడవిలో దాని వెంట పరుగెత్తాడు. కత్తిపట్టుకొని పరుగెత్తే అతనికి ఆయుధ కలాపం కూడా ఉంది. ఎంత ప్రయత్నించినా మీతండ్రికి దాని ఆచూకీ తెలియలేదు. మీతండ్రికి అరవైసంవత్సరాల వయసుంది. వేటలో మిక్కిలిగా అలసిపోయాడు. ఆకలిదప్పులతో ఉన్నాడు. ఆ స్థితిలో అక్కడ ఒక మహర్షిని చూశాడు. అతడు మౌనవ్రతంతో తపస్సు చేసుకొంటున్నాడు. మహారాజు అతనిని మృగం గురించి అడిగాడు. మౌనంగా ఉండటంవల్ల ఆ మహర్షి ఎటువంటి సమాధానం చెప్పలేదు. మహర్షి స్థాణువులాగా నిశ్చేష్టుడై కదలకుండా కూర్చుని ఉన్నాడు. ఆకలితోను, అలసటతోను ఉన్న రాజేంద్రుడు వ్యాకులపడి ప్రశాంతంగా, మౌనవ్రతంతో ఉన్న ఆ మునిపై క్రోధావేశు డయ్యాడు. మౌనవ్రతంతో ఉన్నమహర్షిని రాజు మేల్కొలుపలేదు. కోపంతో ఆ మునిని మీతండ్రి అవమానించాడు. భరతవంశోత్తమా! అక్కడ భూమిపై చచ్చిపడిఉన్న సర్పాన్ని తన వింటికొనతో తీసి పరమపవిత్రుడైన మునియొక్క భుజంమీద వేశాడు. మేధావి అయిన మహర్షి మీతండ్రిని మంచిగా గాని, చెడుగా గాని ఏమీ అనలేదు. మెడలో మృతసర్పం ధరిస్తూనే అలాగే కోపించకుండా ఉండిపోయాడు.

50. పరిక్షిత్తు మరణించుట - జనమేజయుని ప్రతీకారము.

మహారాజా! పరిక్షిత్తు ఆకలితో కృశించి, శమీకుని కంఠంలో మృతసర్పాన్ని పడవేసి, తనరాజధానికి వచ్చాడు. ఆ శమీకమహర్షికి శృంగి అనే తేజస్వి అయిన కుమారుడు ఉన్నాడు. గోశాలలో అతడు పుట్టాడు. అతడు మహాయశస్వి. శక్తిశాలి కూడా. కోపస్వభావం కలవాడు. ఒకనాడు శృంగి ఆచార్యదేవుని దగ్గర పూజ చేశాడు. గుర్వాజ్ఞతో ఇంటికి

వెళ్తుండగా అతని సహపాఠి, మిత్రుడును అయిన కృశుని ద్వారా తనతండ్రికి మీతండ్రివలన కలిగిన అవమానాన్ని విన్నాడు. రాజా! ఆ సంగతిని చెప్తాను వినండి. శృంగి ఈవిషయాన్ని మిత్రుడివల్ల తెలుసుకొన్నాడు. "నాతండ్రి పరీక్షిత్తును ఏమీ అనకుండా నిశ్చలంగా ఉన్నాడు. అయినాసరే అతని కంఠంలో మృతసర్పాన్ని వేసి మీతండ్రి వెళ్లిపోయాడు. అయినప్పటికీ శమీకుడు మీతండ్రికి ఎటువంటి అపకారమూ చేయలేదు. ఆ శమీక మహర్షి గొప్ప తపస్వి. జితేంద్రియుడు. పవిత్రాత్ముడు. కర్మిష్ఠి. అద్భుతశక్తిశాలి. కాంతిమంతమయిన శరీరచ్ఛాయ గలవాడు. సంయమి. సదాచారపరుడు. నిశ్చలుడు. లోభరహితుడు. గంభీరుడు. ఏమాత్రం దోషదృష్టి లేనివాడు. వృద్ధుడు. మౌనవ్రతధారుడు. ఆశ్రితవత్సలుడును. ఇట్టి మహనీయునికి మీతండ్రి అవమానం కలిగించాడు. ఈ విషయాన్ని పూర్తిగా తెలుసుకొని బాల్యావస్థలో ఉన్నా వృద్ధుడిలాగా తేజస్వి అయిన ఆ ఋషికుమారుడు శృంగి కోపావేశంతో మీతండ్రికి శాపం ఇచ్చాడు. శృంగి తేజస్సుతో ప్రజ్వలించిపోతున్నట్లు వెంటనే చేతిలో నీళ్లుతీసుకొని మీతండ్రిని లక్ష్యంగా చేసుకొని కోపంతో ఇలా శాపం ఇచ్చాడు. "నిరపరాధుడైన నాతండ్రిపై మృతసర్పాన్ని పడవేసిన మహాపాపి నేటినుండి ఏడు రోజులలోగా నాశక్తివంతమైన వాక్కుచే ప్రేరితుడై సర్పరాజైన తక్షకుని విషాగ్నిచేత దహింపబడుగాక! నా తపోబలాన్ని చూచునుగాక" అని కఠినంగా పలికాడు. ఈ విధంగా శాపం ఇచ్చాక తనతండ్రి దగ్గరకు వెళ్లాడు శృంగి. తండ్రిని చూసి తాను పరీక్షిత్తుకు శాపం ఇచ్చిన విషయాన్ని చెప్పాడు. శాపకథనాన్ని విన్న శమీకుడు మీతండ్రిదగ్గరకు తనశిష్యుడైన గౌరముఖుని సందేశం పంపాడు. గౌరముఖుడు సాధుశీలుడు. గుణవంతుడును. అతడు మీతండ్రికి శాపవృత్తాంతాన్ని అంతా చెప్పి తనగురువు ఇచ్చిన సందేశాన్ని ఇలా చెప్పాడు. "మహారాజా! నాకుమారుడు నీకు శాపం ఇచ్చాడు. అందుచేత నీవు ఏమరుపాటులేక జాగరూకతతో ఉండు. మహారాజా! తక్షకుడు అనే సర్పరాజు మిమ్మల్ని దహించుతాడు" అని శమీకుని సందేశాన్ని గౌరముఖుడు మీతండ్రికి చెప్పాడు.

ఈ భయంకరమైన మాటను విన్న మీతండ్రి తక్షకసర్పరాజువలన భయపడుతూ జాగరూకుడై ఉంటున్నాడు. తరువాత ఏడవరోజు వచ్చింది. ఆ రోజున కాశ్యపుడు అనే బ్రహ్మర్షి మీతండ్రి దగ్గరకు విషచికిత్సకోసం బయలుదేరాడు. మార్గ మధ్యంలో తక్షకుడు కాశ్యపుని కలుసుకొన్నాడు. త్వరితగతిని వెళ్తున్న కాశ్యపుని చూసి తక్షకుడు బ్రాహ్మణవేషధారియై అతనితో "బ్రాహ్మణోత్తమా! మీరు ఏపని మీద ఎక్కడికి ఇంత కంగారుగా వెళ్తున్నారు?" అని ప్రశ్నించాడు. కశ్యపుడు అన్నాడు. "బ్రాహ్మణా! నేను కురువంశ శ్రేష్ఠుడయిన పరీక్షిత్తుమహారాజు దగ్గరకు వెళ్తున్నాను. ఈవేళ ఆ రాజును తక్షకుడు అనే సర్పరాజు

కరుస్తా డట. అందుచేత అతనికి చికిత్సచేసి, విషాన్ని హరించి, జీవింపచేద్దామని త్వరత్వరగా వెళ్తున్నాను. నావల్ల సర్పబాధనుండి ఆ మానవేశ్వరుడు రక్షింపబడాలి." తక్షకుడు ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! నేను కరిస్తే నీవు ఎందుకు అతనిని బ్రతికించుకోవాలని అనుకొంటున్నావు? నేను ఆ తక్షకుడను-నాఅద్భుతశక్తిని చూడు! నేను రాజును కరిస్తే అతనిని నీవు జీవింపచేయలేవు" అని చెప్పి పక్కనే ఉన్న వృక్షాన్ని కరిచి విషపూరితం చేశాడు. కరవడంతోనే ఆ వృక్షం భస్మం అయిపోయింది. పిమ్మట కాశ్యపుడు తన మంత్ర విద్యాబలంతో ఆ వృక్షాన్ని జీవింపచేశాడు. ఈ అద్భుతాన్ని గమనించి తక్షకుడు కాశ్యపుని తన ప్రలోభానికి గురిచేశాడు. కాశ్యపుడితో "నీకోరిక ఏమిటో చెప్పు. నేను తప్పక తీరుస్తాను" అని తక్షకుడు అడుగగానే తనకు ధనం కావాలని కోరాడు. అపుడు కాశ్యపుడితో మధురంగా మాట్లాడుతూ తక్షకుడు ఇలా అన్నాడు. 'మహాత్మా! మహారాజునుండి ఎంతధనాన్ని కోరుతున్నావో అంతకంటె అధికమయిన ధనాన్ని నేను ఇస్తాను. దాన్ని తీసుకొని మరలిపో.' తక్షకుని మాటలను విన్న కాశ్యపుడు తనకు కావలసిన ధనాన్ని తీసుకొని, వెంటనే మరలిపోయాడు. కాశ్యప బ్రాహ్మణుడు వెళ్లిపోయిన తరువాత తక్షకుడు రహస్యవేషంలో మహాత్ము డయిన మీతండ్రి గారి దగ్గరకు వచ్చాడు. రాజప్రాసాదంలో పరిక్షిత్తు ఎంతో జాగరూకతతో ఉన్నప్పటికిని తక్షకుడు అతనిని భస్మం చేశాడు. జనమేజయమహారాజా! పిదప నీవు రాజ్యాభిషిక్తుడవు అయినావు. రాజోత్తమా! చెప్పిన విషయం అంతా కఠినంగాను, దుఃఖదాయకంగాను ఉన్నప్పటికినీ నీవు అడగటం వల్ల పూర్తిగా శాపవృత్తాంతాన్ని నీకు చెప్పాం. మహారాజా! ఈ విధంగా తక్షకుడు మీతండ్రికి అపకారం చేశాడు. ఈ ఉదంకమహర్షికి గూడా తక్షకుడు చాల కష్టాన్ని కలిగించాడు. ఈ విషయాలన్నీ విన్నారు. అనంతర కర్తవ్యాన్ని తమరు చేయండి.

ఉగ్రశ్రవుడు అంటున్నాడు. "శౌనకా! శత్రుదమనుడైన జనమేజయుడు తన మంత్రులందరినీ పిలిచి ఈ విధంగా చెప్పాడు. జనమేజయుడు మంత్రులతో ఇలా అంటున్నాడు. 'తక్షకుడు వృక్షాన్ని కరిస్తే అది భస్మం అయిందికదా. మరల అది జీవింపచేయబడిందని చెప్పారు. తక్షకుడు చెట్టును భస్మంచేస్తే కాశ్యపుడు దాన్ని పూర్తిగా బ్రతికించాడు. ఇది ఆశ్చర్యం కదా! కాశ్యపుడు తన మంత్రాలతో తక్షక విషాన్ని అణచివేసి ఉంటే మా తండ్రి బ్రతికి ఉండేవాడు. పాపాత్ముడు, నీచుడు అయిన ఆ తక్షకాధముడు ఇలా ఆలోచించి ఉంటాడు. "నేను రాజును కరిస్తే కశ్యపుడు ఆవిషాన్ని హరించి రాజును బ్రతికింపచేస్తాడు. ఈ విధంగా జరిగితే ఈ తక్షకుడు లోకంలో పరిహాసానికి గురి అవుతాడు" అని ఆలోచించి కాశ్యపబ్రాహ్మణునికి ధనం ఇచ్చి సంతోషపెట్టి

ఉంటాడు. భవిష్యత్తులో ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించి తప్పక ఆ నీచుని దండిస్తాను. ఇంకా ఒక్క విషయాన్ని గురించి వినాలని అనుకొంటున్నాను. నాగరాజు తక్షకుడికీ, కాశ్యపబ్రాహ్మణుడికీ జరిగిన సంవాదాన్ని ఎవరు విన్నారు? అది నిర్జనవనంగదా! వాళ్లని ఎవరు చూశారు? మీదాకా ఈవిషయం ఎలా వచ్చింది? ఇదంతా తెలుసుకొన్న తరువాత తక్షకుని నాశనానికి ఆలోచిస్తాను. మంత్రులు ఈవిధంగా బదులు చెప్పారు. "మహారాజా! వినండి. ఆకాశ్యపతక్షకులకు మార్గంలో మరొకవ్యక్తి కలిశాడు. అతడు ఈ సమాచారాన్ని అంతటినీ మాకు చెప్పాడు. తక్షకుడు భస్మంచేసిన వృక్షాన్ని కట్టెలకోసం వచ్చిన ఒకడు అంతకుముందే ఎక్కి ఎండు కొమ్మపై కూర్చొని ఉన్నాడు. దగ్ధం చేయబోయే చెట్టుమీద మరొక మనుష్యుడు ఉన్నాడని తక్షకుడు గాని, కాశ్యపుడుగాని గుర్తించలేదు. రాజా! తక్షకుడు వృక్షాన్ని కరచిన తరువాత ఆ మనుష్యుడు విషాగ్నికి భస్మం అయిపోయాడు. రాజేంద్ర! కాశ్యపబ్రాహ్మణుని ప్రభావం వల్ల ఆ వృక్షంతో పాటే ఈ మానవుడు కూడా పునర్జీవితు డయ్యాడు. ఆ వ్యక్తి మాదగ్గరకు వచ్చి తక్షక బ్రాహ్మణ సంవాదాన్ని మాకు వినిపించాడు. రాజా! ఈవిధంగా మేము చూసినది, విన్నదీ అయిన ఈవిషయాన్ని మీకు వినిపించాము. దీనినంతటిని మీరు విన్నారుకదా! ఇపుడు మీకు ఏమిచేస్తే ఉచిత మనిపిస్తోందో దానిని చేయండి.'

సౌతి చెపుతున్నాడు. 'శౌనకా! మంత్రులు చెప్పిన వృత్తాంతాన్ని అంతటిని విన్న జనమేజయుడు దుఃఖంతో కుమిలిపోయాడు. కుపితుడయ్యాడు. చేతితో చేతిని అప్పళించాడు. దీర్ఘంగా వేడిగా నిట్టూర్చాడు. పద్మంలాంటి కళ్లలోంచి కన్నీరు విడిచాడు. విలపించాడు. ఆ రాజు కొద్దిసేపు ధ్యానించి మనస్సులో ఒక నిశ్చయానికి వచ్చాడు. దుఃఖంతోను, కోపంతోను బాధపడుతున్న అతడు విధిపూర్వకంగా నీటిని స్పృశించి తన మంత్రులకు ఈవిధంగా చెపుతున్నాడు. జనమేజయుడు (మంత్రులతో) ఇలా అన్నాడు. "మంత్రులారా! నాతండ్రి స్వర్గతుడైన విషయాన్ని మీరు చెప్పిన తరువాత నేను నాకర్తవ్యాన్ని నాబుద్ధిద్వారా నిశ్చయించుకొన్నాను. నేను ఏమి చేయబోయేదీ మీకు చెపుతున్నాను. వినండి. దురాత్ముడైన తక్షకునిపై తప్పకుండా ప్రతీకారం చేసి తీరుతాను. శృంగి చెప్పినంతమాత్రాన మహారాజైన నాతండ్రిని తన విషాగ్నితో దగ్ధం చేస్తాడా? ఈ పాపాత్ముడు కాశ్యపుని వెనక్కి మరలింపజేశాడు. కాశ్యపుడు నాతండ్రి దగ్గరకు వచ్చి ఉంటే తప్పక జీవింపచేసేవాడే గదా! మంత్రుల వినయప్రవర్తనచేతనూ, కాశ్యపుని అనుగ్రహం వలనను నాతండ్రి జీవింపబడితే తక్షకుడికి కలిగే నష్టం ఏమిటి? నాతండ్రిని జీవింపజేయడానికి కాశ్యపుడు వచ్చేవాడే. కాని అతని

ప్రలోభపెట్టి తక్షకుడు అతడిని రాకుండా చేశాడు. తక్షకుడు ఈ విషయంలో పెద్ద తప్పే చేశాడు. నాతండ్రిని బ్రతికించవద్దని ఆ బ్రాహ్మణునికి ధనం ఇచ్చి పంపివేశాడు. ఇది మహాపాపం కదా! అందుచేత ఉత్తంకమహర్షికీ మాకు సంతోషం కలిగించడానికి తప్పకుండా తక్షకుడిపై ప్రతీకారాన్ని తీర్చుకొంటాను."

51. జనమేజయుడు సర్పయాగము చేయుట.

"మునీంద్రా! ఆ విధంగా పలికి, మంత్రుల ఆమోదాన్ని కూడా తీసుకొని శ్రీమంతుడైన జనమేజయమహారాజు సర్పయాగం చేస్తానని ప్రతిజ్ఞచేశాడు. బ్రాహ్మణా! వసుధాధిపుడు, భరతవంశశ్రేష్ఠుడు అయిన జనమేజయుడు ఆ సమయంలో యాగనిమిత్తం పురోహితులను సంప్రదించాడు. ఋత్విజులను పిలిపించి కార్యసిద్ధిని గురించి వారితో ఇలా అన్నాడు. "పండితులారా! దురాత్ముడైన తక్షకుడు నా తండ్రిని హతమార్చాడు. నేను గూడా ఆ ప్రకారంగానే తక్షకునిపై బదులు తీర్చుకోవాలని అనుకొంటున్నాను. దీని కొరకు నేను ఏమి చేయాలో మీరు చెప్పండి. ఇటువంటి కార్యం గురించి మీకు తెలిస్తే ఆ కార్యం ద్వారా తక్షకుని మాత్రమేకాదు అతని బంధువులను గూడా ప్రజ్వలిస్తున్న అగ్నిలో దహించివేస్తాను. పూర్వం తన విషాగ్నితో తక్షకుడు నాతండ్రిని ఏ విధంగా దగ్ధం చేశాడో అట్లాగే నేనూ తక్షకుని దగ్ధం చేస్తాను." ఋత్విజులు ఇలా చెప్పారు. 'మహారాజా! నీవు చెప్పినదానికి ఒక గొప్ప యజ్ఞం ఉన్నది. ఈ యజ్ఞాన్ని పూర్వమే దేవతలు సంకల్పించి సిద్ధంచేసి ఉంచారు. దీనికి సర్పయాగం అని పేరు పెట్టారు. ఈ యజ్ఞాన్ని చేయగల్గిన వాడవు నీవే. నీకు తప్ప ఇతరులకు సాధ్యంకాదు. ఈయజ్ఞం చేసే విధానం మాకు తెలుసు. ఈమాటల్ని పౌరాణికులైన విద్వాంసులు చెప్పారు. శౌనకమునీంద్రా! ఋత్విజులు ఆ విధంగా చెప్పిన తరువాత జనమేజయుడికి తనకార్యసిద్ధిపై నమ్మకం కలిగి, తక్షకుని అగ్నిలో దగ్ధం చేశాననే అనుకొన్నాడు.

అపుడు జనమేజయుడు మంత్రవేత్త లయిన బ్రాహ్మణులతో ఇలా అన్నాడు. "నేను సర్పయాగాన్ని చేస్తాను. మీరు ఆ యజ్ఞానికి కావలసిన సామగ్రిని సిద్ధం చేయండి." శౌనకా! అపుడా ఋత్విజులు శాస్త్రంలో చెప్పిన విధంగా యజ్ఞమండపాన్ని తయారుచేయడానికి అక్కడ భూమిని కొలిచారు. ఋత్విజు లందరు వేదవిద్వాంసులు. బుద్ధిమంతులు. వాళ్లు శాస్త్రప్రకారం యజ్ఞమండపాన్ని తయారు చేశారు. యజ్ఞశాల సంపూర్ణ ధనధాన్యాలతో, ఉత్తమోత్తములైన బ్రాహ్మణులతో పరిపూర్ణంగా విరాజిల్లుతున్నది. ఋత్విజులతో ఎంతో

శోభాయమానంగా ఉన్నది. ఋత్విజులు సర్పయాగం నిర్విఘ్నంగా సిద్ధించడం కోసం జనమేజయుడికి దీక్షను ఇచ్చారు. ఇలా యజ్ఞం ప్రారంభం అవుతున్న సమయంలో ఈక్రింది సంఘటన జరిగింది. ఈయజ్ఞానికి విఘ్నం కలుగుతుందని ప్రకటింపబడింది. యజ్ఞమండపాన్ని తయారు చేస్తున్నపుడు వాస్తుశాస్త్ర పారంగతుడు, విద్వాంసుడు, మేధావి, అనుభవశాలి సూతపుత్రుడు అయిన శిల్పి "ఈయజ్ఞానికి పెద్ద విఘ్నం ఏర్పడుతుంది" అని చెప్పాడు. ఈప్రదేశంలో, ఈకాలంలో కొలతలు జరిగినందువల్ల ఒక బ్రాహ్మణుని కారణంగా ఈయజ్ఞం కొనసాగదు. జనమేజయుడు ఆ శిల్పిపై కోపించి దీక్షకు ముందే సేవకునికి "నాఅనుమతి లేకుండా అపరిచితు నెవరినీ యజ్ఞశాలకు రానీయవద్దు" అని ఆజ్ఞాపించాడు.

52. సర్పయాగములో సర్పాలు నశించుట.

సర్పయజ్ఞం యథావిధిగా ప్రారంభం అయింది. ఋత్విజులందరు తమ తమ కార్యాలలో నిమగ్నమయి ఉన్నారు. అక్కడ అందరి కళ్లు యజ్ఞాగ్ని నుండి వచ్చిన పొగవల్ల ఎఱ్ఱబడ్డాయి. ఋత్విజు లందరు నల్లటి వస్త్రాలు ధరించి, మంత్రోచ్చారణలతో అగ్నిని ప్రజ్వలింపజేసి, అందులో హోమం చేస్తున్నారు. సమస్త సర్పాల మనస్సులను కూడా కంపింపజేస్తూ అప్పుడు ఆ యాగాగ్నిలోనికి సర్పాలను ఆహ్వానించారు. ఆపై సర్పాలన్నీ చేష్టలుడిగి దీనస్వరంతో ఒకరినొకరు కేకలు పెట్టుకుంటూ, ఆ ప్రజ్వరిల్లుతున్న హోమగుండంలో పడిపోతున్నాయి. పూత్కరిస్తూ, నిట్టూరుస్తూ, ఒకదానినొకటి తోకలతోను, పడగలతోను పెనవేసుకొంటూ మండుతున్న అగ్నిలో అధికసంఖ్యలో సర్పాలన్నీ పడిపోతున్నాయి. తెల్లసర్పాలు, నల్లసర్పాలు, నీలసర్పాలు, వృద్ధసర్పాలు, శిశుసర్పాలు ఆర్తనాదాలు చేస్తూ ఆ అగ్నిలో పడిపోతున్నాయి. కొన్ని సర్పాలు క్రోసుపొడవుతోను, మరికొన్ని నాలుగు క్రోసులతోను, మరికొన్ని చిన్న ప్రమాణాలు కల సర్పాలు అన్నీ హోమాగ్నికి ఆహుతి అయిపోతున్నాయి. ఈ విధంగా లక్షల, కోట్లసర్పాలు ఆ అగ్నిలోపడి భస్మం అయిపోయాయి. కొన్ని సర్పాలు గుఱ్ఱాలవలె ఉన్నాయి. మరికొన్ని ఏనుగు తుండంలాగా ఉన్నాయి. మరికొన్ని మదించిన ఏనుగుల్లాగా మహాకాయంతో మహాబలంతో ఉన్నాయి. ఆ సర్పాలు కొన్ని భయంకర విషపూరితాలు. చూడటానికి మహాభయంకరంగా ఉన్న సర్పాలు, పరిఘ అనే ఆయుధంలాగా ఉన్న సర్పాలు-ఇలా అనేక సర్పాలు తల్లి ఇచ్చిన శాపంతో బాధపడుతూ సర్పయాగంలో ఆహుతి అయ్యాయి.

53. తక్షకుడు ఇంద్రుని ఆశ్రయించుట.

శౌనకుడు అడిగాడు. 'సూతనందనా! పాండవవంశజుడైన జనమేజయుడు ఈసర్పయాగంలో ఏ ఏ మహర్షుల్ని ఋత్విజులుగా నియమించాడు? సర్పాలకు విషాదహేతువై మహాభయంకరమై, పరమదారుణమైన ఆ సర్పయాగంలో సదస్యులెవరు ? తాతా ! ఆ విషయాలను అన్నింటిని వివరించి చెప్పవలసిందిగా కోరుతున్నాను. సర్పయాగం చేసేవిధానం తెలిసిన వాళ్లలో ఏఏమహర్షులు అక్కడ ఉన్నారు?' ఉగ్రశ్రవుడు చెపున్నాడు. 'ఆ నరపాలుడు చేస్తున్న సర్పయాగంలో ఋత్విజులుగా, సదస్యులుగా ఉన్న మహనీయులపేర్లు నీకు చెపుతాను. ఆ యజ్ఞంలో వేదవేదాంగవిదుడై చ్యవనకుల విఖ్యాతుడైన చండభార్గవుడు హోత. ఉద్గాత వృద్ధ బ్రాహ్మణుడైన కౌత్సుడు, జైమిని శార్ఙ్గరవులు బ్రహ్మలు. పింగళుడు అధ్వర్యుడు. ఇక ఈయాగంలోని సదస్యుల్ని చెపుతాను. శిష్య పుత్రసహితంగా భగవంతుడైన వేదవ్యాసుడు, ఉద్దాలకుడు, ప్రమతకుడు, శ్వేతకేతువు, పింగలుడు, అసితుడు, దేవలుడు, నారదుడు, పర్వతుడు, ఆత్రేయుడు, కుండుడు, జఠరుడు, కాలఘటుడు, వాత్స్యుడు, స్వాధ్యాయ జపతత్పరుడును వృద్ధుడును అయిన శ్రుతశ్రవుడు,కోహలుడు, దేవశర్మ, మౌద్గల్యుడు, సమసౌరభుడు - వారేకాక వేదవిద్యాపారంగతులైన ఇతరులు కూడా ఆ సదస్సులో సభ్యులుగా కూర్చున్నారు. ఆ మహాసర్పయాగంలో ఋత్విజులు ఆహుతులిస్తూ మంత్రాలను చదువుతూ ఏ ఏసర్పాలను పిలుస్తున్నారో ఆయా సర్పాలన్నీ ఆ యజ్ఞకుండంలో పడిపోతున్నాయి. అగ్నిలో పడి భస్మం అవుతున్న సర్పాలదేహాల నుండి వస, క్రొవ్వు కాలువలు ప్రవహిస్తున్నాయి. ఆ సర్పాలు అగ్నిలో పడుతూంటే వాటి నుండి వచ్చే దుర్వాసనతో కలిసి గాలి వీస్తోంది. ఆ సర్పాలు కొన్ని అగ్నిలో పడిపోతున్నాయి. మరికొన్ని ఆకాశంలో ఆగి ఉన్నాయి. అలా అగ్నిలో పడి ఉడుకుతున్న ధ్వనులు సదా వినిపిస్తున్నాయి.

జనమేజయుడు సర్పయాగం చెయ్యడానికి దీక్షపూనాడని విన్న తక్షకుడు వెంటనే ఇంద్రుని భవనానికి శరణుకోరడానికి వెళ్లాడు. అక్కడ ఇంద్రుడికి జరిగినవిషయం అంతా తక్షకుడు చెప్పి మిక్కిలిగా భయపడుతూ ఇంద్రుని శరణుకోరాడు. ఇంద్రుడు తక్షకుడితో "నాగరాజా! సర్పయాగం వల్ల నీవు భయపడనక్కరలేదు" అని ప్రసన్నహృదయంతో చెప్పాడు. "నీకోసం ఇదివరకే బ్రహ్మదేవుని ప్రసన్నం చేసుకొన్నాను. కావున నీవు ఏమాత్రం భయపడ నక్కరలేదు. నీమనస్సులోని చింత విడిచిపెట్టు" అని ఇంద్రుడు తక్షకుడికి అభయం ఇచ్చాడు. అపుడు ఉగ్రశ్రవుడు (శౌనకునితో) అన్నాడు. ఆ విధంగా ఓదార్చబడిన తక్షకుడు సంతోషపడి దేవేంద్రుని భవనంలోనే ఉండిపోయాడు. సర్పాలన్నీ అగ్నికి ఆహుతి అవుతుండటంవల్ల వాసుకి మిక్కిలి దుఃఖించాడు. అనేకులు మరణించారు. కొద్ది మంది

మాత్రమే మిగిలారు. దీన్ని తలచుకొని వాసుకి కుమిలిపోతున్నాడు. పన్నగోత్తముడయిన వాసుకి హృదయంలో బాధ, మోహం ఏర్పడ్డాయి. కలతచెందిన మనస్సుతో సోదరియైన జరత్కారువుతో వాసుకి ఈ విధంగా అన్నాడు. 'సోదరీ! నాశరీరం దహించుకుపోతోంది. దిక్కుతోచడం లేదు. శైథిల్యం చెందాను. నామనస్సు భ్రమిస్తోంది. కళ్లు తిరుగుతున్నాయి. మనస్సు వికలమై పోతోంది. నేనుగూడా వశంతప్పి ఆ సర్పయాగాగ్నిలో పడిపోతాను. జనమేజయుడు చేసే యజ్ఞం మన సర్పలోక నాశనానికే జరుగుతోంది. నేనుగూడా తప్పక యమలోకానికి వెళ్లిపోతాను. సోదరీ! ఈ ఆపదనుండి రక్షించుకొనడానికే నిన్ను జరత్కారునకిచ్చి వివాహంచేశాను. ఇపుడు ఆ సమయం వచ్చింది. నీవు బంధుకోటితో సహా మమ్మల్ని రక్షించు. సోదరీ! పూర్వం స్వయంగా బ్రహ్మయే నాతో ఆస్తీకుడే ఈయజ్ఞాన్ని ఆపుచేయగలడని చెప్పాడు. సోదరీ! నేడు నీవు మాకష్టాల్ని తొలగించి మమ్మల్ని కాపాడటానికి ఆస్తీకుడికి చెప్పు. అతడు బాలుడయి నప్పటికినీ పెద్దలవలె గౌరవింపబడతాడు. వేదవేత్తలలో శ్రేష్ఠుడు.'

54. ఆస్తీకుడు సర్పయాగమువకు వచ్చుట.

ఉగ్రశ్రవుడు ఇలా చెపుతున్నాడు. నాగకన్య జరత్కారువు నాగరాజయిన వాసుకి తనతో చెప్పినట్లు తనకుమారుడైన ఆస్తీకుని పిలిచి ఇలా చెప్పింది. 'కుమారా! నాఅన్న వాసుకి ఒకకారణంచేత నన్ను నీతండ్రికి ఇచ్చి వివాహం చేశాడు. ఇపుడు ఆ సమయం వచ్చింది. కాబట్టి నీవు యథాతథంగా ఆ కోరికను నెరవేర్చు.' ఆస్తీకుడు ఇలా అన్నాడు. "అమ్మా! నామేనమామ ఏకారణం చేత నిన్ను నాతండ్రికి ఇచ్చి వివాహం చేశాడు? ఈవిషయాన్ని నాకు పూర్తిగా చెప్పు. దానిని విన్న తరువాత కార్యసిద్ధికి ప్రయత్నం చేస్తాను". ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. బంధువులయొక్క హితాన్నికోరి జరత్కారువు ఆస్తీకునితో ప్రశాంతచిత్తంతో ఇలా చెప్పింది. జరత్కారువు (ఆస్తీకునితో) ఇలా అంది. 'నాయనా! నాగులందరికి తల్లి కద్రువ. ఒకపుడు ఆమెకు కోపం రాగా తనకుమారులకు ఆమె శాపం ఇచ్చింది. ఆ విషయాన్ని నీకు పూర్తిగా చెపుతాను. విను. "ఉచ్చైఃశ్రవం విషయంలో నాకు అనుకూలురై మీరు వినత మాటను వమ్ము చేయలేదు. నేను వినతతో దాస్యాన్ని పందెంగా అంగీకరించాను. నామాట విననందుకు మీరు జనమేజయ యాగంలో అగ్నిదగ్ధులై మరణించి ప్రేతలోకానికి చేరండి." కద్రువ శాపం ఇచ్చినపుడు సాక్షాత్తుగా లోకపితామహుడైన బ్రహ్మ ఆ శాపాన్ని విని ఆమోదించాడు.

కుమారా! నా అన్న వాసుకికూడా బ్రహ్మవాక్కులను విన్నాడు. అమృతమథనం

జరిగిన తరువాత వాసుకి దేవతలను శరణు కోరాడు. దేవతలు నాసోదరుని సహాయంతో అమృతాన్ని పొందినతరువాత అతని మనోరథాన్ని తీర్చాలని అనుకొని బ్రహ్మ దగ్గరకు వెళ్లారు. ఆ బ్రహ్మను దేవతలు వాసుకి అందరు కలిసి ప్రసన్ననిగా చేసుకొన్నారు. కద్రూశాపం జరగకుండా చేసుకోవాలని వీరి ఉద్దేశం. దేవతలు ఇలా అన్నారు. "పరమాత్మా! ఈ నాగరాజైన వాసుకి తన సోదరుల ఆపదగురించి దుఃఖిస్తున్నాడు. తల్లి ఇచ్చిన ఆ శాపం తప్పిపోయే మార్గమేది ?" బ్రహ్మ అన్నాడు. "జరత్కారు డనే ముని జరత్కారువును వివాహం చేసుకొంటే వారివలన జన్మించిన కుమారుడు కద్రువ ఇచ్చిన శాపాన్నుండి ముక్తి కలిగించగలడు. బ్రహ్మపలికిన ఆ మాటను విని నాగశ్రేష్ఠ డయిన వాసుకి నన్ను మహాత్ముడైన నీతండ్రికి ఇచ్చి వివాహం చేశాడు. ఈ పనికోసమే నావివాహం జరిగింది. తరువాత ఆ తపోధనుని ద్వారా నాగర్భంలో నీవు జన్మించావు. జనమేజయుడు సర్పయాగం చేసే కాలం వచ్చేసింది. సర్పాలన్నీ యజ్ఞంలో పడి భస్మం అవుతున్నాయి. నీవు వాళ్లందర్నీ ఉద్ధరించాలి. నాసోదరుడు వాసుకి కూడా ఆ యాగాగ్నివల్ల భయపడుతున్నాడు. ఈ ఉద్దేశంతోనే ధీమంతుడైన నీతండ్రి సేవకొరకు నన్ను అర్పించాడు. ఈకార్యం వ్యర్థం కాకూడదు. కుమారా! సర్పాలకు కలిగిన ఈకష్టం నుండి ఎలా విముక్తి కలిగిస్తావో ఉపాయం ఆలోచించు.'

తల్లి ఈవిధంగా చెప్పిన తరువాత ఆస్తీకుడు తల్లితో "అమ్మా! నీవు చెప్పినట్లే చేస్తాను" అని దుఃఖంతో తపిస్తున్న వాసుకిని జీవింపచేస్తున్నట్లు వాసుకితో ఇలా అన్నాడు. 'పన్నగోత్తమా! మాతల్లి ఇచ్చిన శాపాన్నుండి మిమ్మల్ని విముక్తుని చేస్తాను. ఈ నామాట సత్యమే సుమా! మీరు నిశ్చింతగా ఉండండి. ఏమాత్రం భయపడవద్దు. రాజా! శుభం కలిగే విధంగా నేను తప్పక ప్రయత్నిస్తాను. పరిహాసానికైనా నేను ఎప్పుడూ అసత్యం చెప్పలేదు. ఈసంకటసమయంలో నేను అబద్ధం చెపుతానా? మీరు ఉత్తమోత్తములు. సర్పయాగం కోసం దీక్షవహించిన జనమేజయుని దగ్గరకు వెళ్లి, శుభప్రదమైన మాటలతో ఆయనకు సంతోషం కలిగించి, యజ్ఞాన్ని ముగింపజేస్తాను. బుద్ధిశాలీ! నేను ఏమిచేస్తానని చెప్పానో ఆ మాటలను విశ్వసించండి. మీమనస్సులో నాగురించి ఏమి ఆశిస్తున్నారో అది ఎన్నటికీ మిథ్యకాదు సుమా.' వాసుకి ఇలా అన్నాడు. 'ఆస్తీకా! మాతల్లి ఇచ్చిన శాపరూపమైన బ్రహ్మదండంతో బాధపడుతున్నాను. నాగుండె పగిలిపోతోంది. నాకు దిక్కుతోచడంలేదు.' ఆస్తీకుడు (వాసుకితో) ఇలా అన్నాడు. 'పన్నగోత్తమా! మీరు మనస్సులో ఏవిధంగానూ బాధ పడవద్దు. సర్పయజ్ఞంలో ధగధగా మండిపోతున్న అగ్నినుండి మీకు కలుగుతున్న భయాన్ని నేను పోగొట్టగలను. ప్రళయకాలాగ్నితో సమానమైన భయంకరమైన బ్రహ్మదండం

నుండి రక్షిస్తాను. శాపాన్ని నాశనం చేస్తాను. ఇక ఏమాత్రం భయపడకండి.'

పిమ్మట నాగరాజైన వాసుకియొక్క భయంకరమైన మనోజ్వరాన్ని పోగొట్టి, వెంటనే వాసుకి మొదలయిన వారిని ప్రాణసంకటం నుండి రక్షించడానికి జనమేజయుని యజ్ఞశాలకు ఆస్తీకుడు వెళ్లాడు. ఆ యజ్ఞం ఉత్తమగుణాలన్నింటితో విరాజిల్లుతోంది. ఆస్తీకుడు అక్కడకు వెళ్లి ఉత్తమోత్తమ మయిన యజ్ఞశాలను చూశాడు. ఆ యజ్ఞశాల సూర్యునితోను, అగ్నితోను సమానులైన తేజస్వులైన సభ్యులతో నిండి ఉంది. ద్విజోత్తము డయిన ఆస్తీకుడు యజ్ఞమండపంలోకి ప్రవేశిస్తుంటే ద్వారపాలకులు అతడిని అడ్డగించారు. యజ్ఞశాలలోకి ప్రవేశించాలనే ఉద్దేశంతో ఆ యజ్ఞాన్ని అతడు స్తుతించాడు. ఉత్తమమైన యజ్ఞమండపానికి దగ్గరగా వెళ్లి, పుణ్యాత్ములలో శ్రేష్ఠ డయిన ఆ బ్రాహ్మణోత్తముడు అనంతమైన కీర్తి కల జనమేజయుని, ఋత్విక్కులను, సభ్యులను అగ్నిదేవుని స్తోత్రం చేయసాగాడు.

55. ఆస్తీకుడు చేసిన ప్రశంస.

ఆస్తీకుడు స్తుతిస్తున్నాడు. 'భరతవంశోత్తమా! జనమేజయమహారాజా! నీయజ్ఞం చంద్రుని యజ్ఞంవలె, వరుణుని యజ్ఞంవలె, ప్రయాగలో ప్రజాపతి చేసిన యజ్ఞంవలె ఎంతో శోభాయమానంగా ఉంది. ఉత్తమగుణాలతో విరాజిల్లుతున్నది. మహారాజా! నాప్రియజనులకు శుభం కలుగుగాక! జనమేజయా! దేవేంద్రుడు చేసిన నూరు యజ్ఞాలకు సాటిగా ఉన్నది నీ యజ్ఞం. పూరుడుచేసిన యజ్ఞాలతో ఈ యజ్ఞం సమానంగా ఉన్నది. ఆ యజ్ఞాలన్నిటితోను నీయజ్ఞం సమంగా ఉన్నది. నాప్రియబాంధవులకు కల్యాణమగుగాక! యముని యజ్ఞానికి, హరిమేధసుని యజ్ఞానికి, రంతిదేవుని యజ్ఞానికి, సమానంగా ఉత్తమోత్తమంగా ఉంది నీయజ్ఞం. మాప్రియజనులకు శుభం కలుగుగాక! భరతవంశాగ్రగణ్యా! జనమేజయమహారాజా! గయుని యజ్ఞం, శశబిందుమహారాజు యొక్క యజ్ఞం, రాజాధిరాజైన కుబేరుని యజ్ఞాలతో సమానంగా విధి విధానాలతో జరుపబడుతూ నీయజ్ఞం విరాజిల్లుతున్నది. రాజైన నృగుని యజ్ఞం, మహారాజైన అజమీఢుని యజ్ఞం, దశరథనందనుడైన శ్రీరామచంద్రుని యజ్ఞాలతో సమానంగా నీయజ్ఞం కూడా శోభాయమానంగా ఉంది. మాబంధుజనులకు శుభమగుగాక! ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుని యజ్ఞం వలె ప్రఖ్యాతిని పొందింది నీయజ్ఞం. మాప్రియ వంశజులకు స్వస్తియగు గాక.

సత్యవతీనందనుడైన వ్యాసమహర్షి స్వయంగా కర్మాచరణం చేసిన యజ్ఞంతో నీయజ్ఞం సమానంగా ఉంది. నాబంధులకు శుభం కలుగుగాక! నీయజ్ఞశాలలోని ఋత్విక్కులు

సూర్యునితో సమానమైన తేజస్వంతులు. ఇంద్రుని యజ్ఞంలోలాగా నీయజ్ఞంలో వారు అనుష్ఠానం చేస్తున్నారు. ఇతరు లెవరికీ ఇట్టి జ్ఞానం లేదు. వీరు మహాజ్ఞానసంపన్నులు. వీరికి నీవు ఇచ్చే దానం ఎన్నటికీ తరగదు. కృష్ణద్వైపాయనునితో సాటివచ్చే ఋత్విక్కు మరొకడు లేడు. ఇది నా నిశ్చితాభిప్రాయం. ఆ వ్యాసుని శిష్యులుకూడా వారివారి కర్మానుష్ఠానాలలో నిపుణులు. వీరు అందరు యజ్ఞనిర్వహణలో దక్షులే. విభావసుడు, చిత్రభానుడు, మహాత్ముడు, హిరణ్యరేతుడు, హుతభుక్కు, కృష్ణవర్త్ముడు అని మనం పిలిచే అగ్నిదేవుడు నీయజ్ఞంలో దక్షిణావర్తశిఖలతో ప్రజ్వరిల్లుతున్నాడు. ఆహుతులను గ్రహిస్తూ నీహవిస్సులను కోరుతున్నాడు. మానవలోకంలో ప్రజాపాలనలో నీతో సమానమైన రాజు మరొకడు లేడు. ధైర్యం వలన నీమనస్సు ఎప్పుడూ ప్రసన్నంగానే ఉంటుంది. నీవు సాక్షాత్తుగా వరుణుడిలాగా, ధర్మరాజులాగ, యమధర్మరాజులాగా అత్యంత ప్రభావశాలివి. పురుషోత్తమా! సాక్షాత్తు వజ్రపాణి అయిన ఇంద్రుడు ప్రజలందరినీ ఎలా రక్షిస్తున్నాడో నీవుకూడా ఈలోకంలో అలాగే ప్రజాపాలన చేస్తున్నావు. ఈప్రపంచంలో నీవు తప్ప ఈవిధంగా ప్రజాపాలన చేసే మహారాజు మరొకడు లేడు. జనమేజయమహారాజా! నీవు ఖట్వాంగ మహారాజువలె, నాభాగుడివలె, దిలీపునివలె ప్రతాపశాలివి. నీప్రభావం యయాతి, మాంధాతలప్రభావంతో సమానం. నీతేజస్సు సూర్యభగవానుడి ప్రచండతేజస్సు వంటిది. పితామహుడు అయిన భీష్మాచార్యునివలె ఉత్తమోత్తమనియమవ్రతుడవు. మహర్షి వాల్మీకి లాగా నీలో అద్భుతపరాక్రమం దాగి ఉంది. వసిష్ఠమహర్షి లాగా నీకోపం నీవశంలోనే ఉంది. నీఅధికారం, ఐశ్వర్యం ఇంద్రుని వలె ఉన్నదని నాఅభిప్రాయం. నీకాంతి విష్ణుమూర్తిని తలపిస్తోంది. నీవు యమధర్మరాజులాగా ధర్మనిశ్చయం తెలిసిన వాడివి. భగవంతుడైన శ్రీకృష్ణునివలె సకల సద్గుణసంపన్నుడవు. వసువులవలె నీవు మహాసంపన్నుడవు. ఆ విధంగానే యజ్ఞనిర్వహణలో నీవు నిధివే. మహారాజా! నీవు దంభోద్భవునిలాగా మహాబలశాలివి. అస్త్రశస్త్రవిద్యలలో నీవు పరశురాముని తో సమానుడివి. ఔర్వుడు, త్రితుడు అనేవారి తేజస్సుతో నీ తేజస్సు సమానం. భగీరథమహారాజువలె నీవు దుష్ప్రేక్షణీయుడవు.' ఆస్తీకుడు ఈవిధంగా యాగానికి యజమాని అయిన జనమేజయ మహారాజును, ఆయాగశాలలోని సభ్యులను, ఋత్విజులను, అగ్నిదేవుని, ఇలా అందరినీ స్తుతించి అందరినీ ప్రసన్నులుగా చేసుకొన్నాడు. జనమేజయుడు వారి అందరి భావాల్ని తెలుసుకొనడానికి వారితో ఈ విధంగా అంటున్నాడు.

56. జనమేజయుడు ఆస్తీకునకు వరమిచ్చుట.

బ్రాహ్మణోత్తములారా! ఈతడు బాలకుడే అయినప్పటికీ పెద్దవారివలె మాటలాడుతున్నాడు. కాబట్టి ఇతడు బాలుడు కాడు. వృద్ధుడనే భావిస్తున్నాను. ఆనందంగా ఇతనికి వరం ఇవ్వాలని అనుకొంటున్నాను. మీరందరు బాగుగా ఆలోచించి మీ అంగీకారాన్ని తెలుపండి. సభలోని వారు ఈవిధంగా చెప్పారు. బాలుడు అయినప్పటికీ ఇతడు విప్రుడు. కాబట్టి రాజసమ్మానానికి తగినవాడే. ఇతడు విద్వాంసుడు కూడా. ఇక చెప్పేది ఏముంది? కాబట్టి ఈ బ్రాహ్మణ బాలకుడు మీచేత యథోచితంగా సత్కరింపదగినవాడు. అలాగే తక్షకుడు కూడా వెంటనే రాదగినవాడు. సూతనందనుడు ఇలా అన్నాడు. శౌనకా! ఆ తరువాత వరం ఇవ్వడానికి జనమేజయుడు సిద్ధమయి ఆస్తీకునితో 'నీవు కావలసిన వరాన్ని అడుగు" అని అన్నాడు. ఇంతలో హోత మనస్సు అంత తృప్తిగా లేకపోవటంతో లేచి "ఇప్పటివరకూ ఈ యజ్ఞకర్మలో తక్షకుని మంత్రాలతో పిలిచాం. కాని ఇంతవరకూ రాలేదు" అని చెప్పాడు. అపుడు జనమేజయుడు బ్రాహ్మణులతో "బ్రాహ్మణులారా! తక్షకుడు ఆహుతి అయితేనేగాని ఈ యాగం పూర్తికాదు. మీరు మీశక్తిని ఉపయోగించి తక్షకుని రప్పించండి. అతడే నా అసలు శత్రువు" అని అన్నాడు. ఋత్విజులు ఇలా అన్నారు. 'మహారాజా! మన శాస్త్రాలు ఏమి చెప్పాయో ఆ విధంగా అగ్నిదేవుడు చెపుతున్నాడు. ఈమంత్రాలకు భయపడి తక్షకుడు ఇంద్రుని భవనంలో దాగుకొని ఉన్నాడు. పురాణవేత్త, మహాత్ముడు, సూతపుత్రుడు అయిన లోహితాక్షుడు యాగనిర్వహణకు ముందు "ఈయాగం సంపూర్ణంగా జరుగదు" అని చెప్పాడు కదా!' అని ఋత్విజులు చెపితే జనమేజయుడు ఈవిషయం గురించి లోహితాక్షుని అడిగాడు. అపుడు లోహితాక్షుడు రాజుతో "మహారాజా! బ్రాహ్మణులు ఈవిషయంలో ఏమిచెప్పారో అది సత్యం. మహారాజా! పురాణాన్ని తెలుసుకొన్న నేను ఈమాటను చెపుతున్నాను. ఇంద్రుడు తక్షకుడికి "నాగరాజా! నీవు నాదగ్గర సురక్షితంగా ఉండు. సర్పయాగంలో అగ్ని నిన్ను దహింపలేదు" అని వరం ఇచ్చాడు.

యజ్ఞదీక్షను పూనిన జనమేజయుడు ఈమాటలు విని విచారపడ్డాడు. ఇంద్రుడితో సహా తక్షకుని యాగాగ్నిలోకి రప్పించమని ఆవేశంతో రాజు ఋత్విజులను ప్రేరేపించాడు. అపుడు హోత ఏకాగ్రచిత్తంతో మంత్రాల ద్వారా ఇంద్రునితో కూడిన తక్షకుని ఆహ్వానించాడు. వెంటనే దేవరాజైన ఇంద్రుడు ఆకాశమార్గంలో విమానంలో వచ్చాడు. దేవత లందరూ ఇంద్రుని స్తుతిస్తున్నారు. అప్సరసలు, మేఘాలు విద్యాధరులు అందరూ అతని వెనకాలే వస్తున్నారు. తక్షకుడు ఆ ఇంద్రుని ఉత్తరీయవస్త్రంలో దాగుకొని ఉన్నాడు. భయంతో కలతచెంది తక్షకుడు అశాంతితో ఉన్నాడు. ఇక్కడ తక్షకుని వినాశనాన్ని కోరిన జనమేజయుడు

కోపావేశంతో ఉండి, మంత్రవేత్తలయిన బ్రాహ్మణులతో ఇలా అంటున్నాడు. జనమేజయుడు అన్నాడు.

'బ్రాహ్మణులారా! తక్షకుడు ఇంద్రుని విమానంలో దాగుకొని ఉంటే ఇంద్రుడితో కూడా తక్షకుని అగ్నిగుండంలోకి పడవేయండి. జనమేజయమహారాజు ప్రేరేపించిన ప్రకారం తక్షకుడిని అగ్నికి ఆహుతి చేయదలచి ఇంద్రుడి దగ్గర ఉన్న తక్షకుని ఆహ్వానించారు. అతనిపేరుతో అగ్నిలో ఆహుతులు వేశారు. ఈ ప్రకారం ఆహుతి ఇచ్చాక క్షణకాలంలో ఇంద్రుడితో సహా తక్షకుడు ఆకాశంలో వ్యథచెందుతూ కనబడ్డాడు. ఆ యజ్ఞాన్ని చూసిన ఇంద్రుడు మిక్కిలి భయగ్రస్తుడై, తక్షకుని అక్కడే విడిచిపెట్టి కంగారుపడుతూ తన భవీనానికి వెళ్లిపోయాడు. ఇంద్రుడు వెళ్లిపోయిన తరువాత తక్షకుడు భయంతో తల్లడిల్లిపోతూ మంత్రశక్తికి అధీనుడై అగ్విజ్వాలల సమీపానికి వచ్చాడు. ఋత్విజులు అన్నారు. 'రాజేంద్రా ! మీ యజ్ఞకార్యం విధి పూర్వకంగా సుసంపన్నం అయింది. ఇపుడు మీరు ఈ బ్రాహ్మణోత్తముడైన ఆస్తీకునికి వరం ఇవ్వవచ్చు.' జనమేజయుడు అన్నాడు. "బ్రాహ్మణబాలకా! నీవు అప్రమేయుడవు. నీ ప్రతిభకు పరిమితిలేదు. నీ పాండిత్యానికి తగిన వరం ఇవ్వాలని అనుకొంటున్నాను. నీ మనస్సులోని కోరిక నిర్భయంగా చెప్పు. ఆ కోరిక ఎటువంటిదైనా అయోగ్యమైనా తప్పక ఇస్తాను.

ఋత్విజులు అన్నారు. 'రాజా! ఈ తక్షకనాగుడు వేగంగా నీ అధీనంలోకి వస్తున్నాడు. అతడు భయంకరంగా అరుచుకొంటూ వస్తున్నాడు. ఈ తక్షకుడు ఇంద్రుని నుండి విడివడ్డాడు. ఆ తక్షకుడు మంత్రాలచే స్వర్గలోకం నుండి క్రింది భాగానికి వచ్చాడు. ఆకాశంలో గిరగిరా తిరుగుతున్నాడు. అతడు తీవ్రంగా నిట్టూరుస్తూ అగ్నిగుండం సమీపానికి వస్తున్నాడు.' ఆస్తీకుడు అన్నాడు. 'మహారాజా! నాకు వరం ఇవ్వదలచుకొంటే ఈ సర్పయాగాన్ని ఇపుడే విరమింపచేయండి. ఇక యాగాగ్నిలో సర్పాలు పడరాదు. ఈ వరాన్ని ఇవ్వండి.' ఆస్తీకుడు ఈ వరం అడుగగానే జనమేజయుడు విచారగ్రస్తుడయ్యాడు. అపుడు ఆస్తీకునితో ఈ విధంగా అంటున్నాడు. 'బ్రాహ్మణోత్తమా! బంగారం, వెండి లేదా ఆవులు లేదా మరొక అభీష్టాన్ని దేనినైన నీవు కోరుకో. తప్పక ఇస్తాను. ఈ యజ్ఞాన్ని మాత్రం నిలుపుచేయడానికి ఇష్టపడను.' ఆస్తీకుడు అన్నాడు. 'మహారాజా! బంగారం కాని, వెండికాని, గోసంపదకాని నేను కోరను, నీ సర్పయాగాన్ని నిలుపుచేయి. ఆ విధంగా చేస్తే నా మాతృవంశానికి శుభం కలుగుతుంది.' ఉగ్రశ్రవుడు చెపుతున్నాడు. భృగునందనా! శౌనకా! ఆస్తీకుడు ఆ విధంగా అడిగిన తరువాత మాటకారి అయిన జనమేజయుడు మరల మరల అతనిని వారిస్తూ "బ్రాహ్మణోత్తమా! నీకు శుభం కలుగుతుంది. వేరొకవరం

కోరుకో" అని అడిగినా ఆస్తీకుడు మాత్రం మరొకటి కోరలేదు. అపుడు వేదవేత్త లయిన బ్రాహ్మణ సభ్య లందరూ ఒక్కటై జనమేజయునితో "ఈ బ్రాహ్మణోత్తమునికి కోరిన వరం ఇవ్వండి" అని చెప్పారు.

57. సర్పయాగములో ఆహుతి అయిన ప్రధాన సర్పములు.

శౌనకుడు అడుగుతున్నాడు. 'సూతనందనా! జనమేజయుని సర్పయాగంలో ఏయే సర్పాలు అగ్నికి ఆహుతి అయ్యాయో వారి అందరి పేర్లూ నేను వినాలనుకొంటున్నాను.' సౌతి ఇలా అన్నాడు. 'ఈ యజ్ఞంలో వేలకొలది లక్షలకొలది, కోట్ల కొలది సర్పాలు అగ్నిగుండంలో పడి నాశనం అయ్యాయి. ఎంతో మంది ఉండటం చేత వారి అందరిపేర్లు చెప్పడానికి సాధ్యంకాదు. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు అగ్నికి ఆహుతి అయిన అతిముఖ్యుల పేర్లను మాత్రం చెప్పగలను. విను. ముందుగా వాసుకి వంశంలో జన్మించిన ముఖ్యులయిన వారిపేర్లను చెపుతాను వినండి. అందులో కొందరు నీలవర్ణంతోను, కొందరుఎరుపుగాను, కొందరు తెల్లగాను భయంకర రూపంలో ఉన్నారు. పెద్ద శరీరంతో మిక్కిలి భయంకరంగా విషపూరితులై ఉన్నారు. మాతృశాప పీడితులైన ఆ సర్పాలు పరాధీనాలై అగ్నిలో పడిపోయాయి. వాటిపేర్లు ఇవి. కోటిశుడు, మానసుడు, పూర్ణుడు, శలుడు, పాలుడు, హలీమకుడు, పిచ్ఛలుడు, కౌణపుడు, చక్రుడు, కాలవేగుడు, ప్రకాలనుడు, హిరణ్యబాహుడు, శరణుడు, కక్షకుడు, కాలదంతకుడు. వీరందరు వాసుకి వంశంలో జన్మించినవారు. అగ్నిలో భస్మం అయ్యారు. ఇంకా ఇతరులు కొందరు మహాబలశాలులు, భయంకరులు అయిన నాగులు - ఆ వంశజులే - అందరూ సర్పయాగాగ్నిలో ఆహుతి అయ్యారు. ఇపుడు తక్షకుని వంశంలో జన్మించిన నాగుల పేర్లను వివరిస్తాను విను. పుచ్ఛాండకుడు, మండలకుడు, పిండసేక్తుడు, రభేణకుడు, ఉచ్ఛిఖుడు, శరభుడు, భంగుడు, బిల్వతేజుడు, విరోహణుడు, శిలి, శలకరుడు, మూకుడు, సుకుమారుడు, ప్రవేపనుడు, ముద్గరుడు, శిశురోముడు, సురోముడు, మహాహనుడు, - వీరంతా తక్షకవంశంలో జన్మించిన నాగులు. వీరందరూ సర్పయాగాగ్నిలో భస్మం అయ్యారు. పారావతుడు, పారిజాతుడు, పాండరుడు, హరిణుడు, కృశుడు, విహంగుడు, శరభుడు, మేదుడు, ప్రమోదుడు, సంహతాపనుడు - వీరందరు ఐరావతవంశంలోని వారు. వీరంతా హోమంలో పడిపోయారు.

బ్రాహ్మణోత్తమా! ఇపుడు కౌరవ్యకులంలో పుట్టిన నాగులపేర్లు చెపుతాను విను. ఏరకుడు, కుండలుడు, వేణి, వేణీస్కంధుడు, కుమారకుడు, బాహుకుడు, శృంగబేరుడు, ధూర్తకుడు, ప్రాతరుడు, ఆతకుడు. వీరందరూ కౌరవ్యకులంలో పుట్టినవారు. వీరు

యాగాగ్నిలో భస్మం అయ్యారు. బ్రాహ్మణా! శౌనకా! ఇపుడు ధృతరాష్ట్రకులంలో పుట్టిన నాగుల యొక్క పేర్లు యథాతథంగా చెపుతాను. వినండి. వీరందరూ వాయువుతో సమానమైన వేగం కలవారు. అత్యంత విషపూరితులు కూడా. వీరిపేర్లు ఇవి. శంకుకర్ణుడు, పిఠరకుడు, కుఠారుడు, ముఖసేచకుడు, పూర్ణాంగదుడు, పూర్ణముఖుడు, ప్రహాసుడు, శకుని, దరి, అమాహఠుడు, కామఠకుడు, సుషేణుడు, మానసుడు, అవ్యయుడు, భైరవుడు, ముండవేదాంగుడు, పిశంగుడు, ఉద్రపారకుడు, బుషభుడు, వేగవంతుడు, నాగుడు, పిండారకుడు, మహాహనుడు, రక్తాంగుడు, సర్వసారంగుడు, సమృద్ధుడు, పటవాసకుడు, వరాహకుడు, వీరణకుడు, సుచిత్రుడు, చిత్రవేగికుడు, పరాశరుడు, తరుణకుడు, మణి, స్కంధుడు, ఆరుణి వీరందరూ ధృతరాష్ట్ర వంశజనాగులు. సర్పసత్రంలో యాగాగ్నిలో భస్మం అయ్యారు. బ్రాహ్మణా! నేను ఇపుడు అతిముఖ్యులైన నాగులపేర్లే చెప్పాను. వీరి సంఖ్య చాలా అధికం. అందుచేత అందరిపేర్లు చెప్పలేదు. ఈ సంతానం, వీరి సంతానసంతతి అందరూ అగ్నిలో ఆహుతి అయ్యారు. ఇందులో కొందరు మూడుతలలుగలవారు. కొందరు ఏడు శిరస్సులు కలవారు. ఇంకనూ కొందరు పదితలలు గలవారు ఉన్నారు. వీరందరూ ప్రళయాగ్నితో సమానమైన విషంతో దహించే స్వభావం కలవారు. మహాభయంకరులు, పెద్ద శరీరంగలవారు. మహావేగం కలవారు. పర్వతశిఖరం లాగా పొడగరులు. వీరందరూ లక్షలకొలదిగ యాగాగ్నికి ఆహుతులయ్యారు. వీరు ఒక్కొక్క యోజనం లావు గలవారు. రెండు రెండు యోజనాల పొడవు గలవారు. వీరు కామరూపులు, కామబలులు, ప్రజ్వరిల్లే అగ్నితో సమానమైన విషంతో ఉన్నవారు. వీరందరూ ఆ మహా సర్పయాగంలో మాతృశాపపీడితులై దగ్ధమయ్యారు.

58. సర్పయాగ సమాప్తి - ఆస్తీకునకు వరప్రాప్తి.

ఉగ్రశ్రవుడు ఇలా అన్నాడు. మునీంద్రా! ఆస్తీకునికి సంబంధించి నేను ఒక అత్యద్భుతమైన మాటను విన్నాను. రాజైన జనమేజయుడు ఆస్తీకునికి వరం ఇవ్వడానికి సంకోచపడినప్పుడు ఇంద్రుడు తన ఉత్తరీయంలో ఉన్న తక్షకుడిని యాగాగ్నికి పైభాగంలో ఆకాశంలో విడిచిపెట్టి, తాను భయంతో వెళ్లిపోయాడు. అప్పుడు తక్షకుడు తల్లడిల్లుతూ ఆకాశంలో అటు ఇటు తిరుగుతూ చింతాక్రాంతుడై ఉన్నాడు. ఆ తక్షకుని చూసిన జనమేజయుడు తనయాగం పరిసమాప్త మవుతోందని భావించాడు. అగ్ని దేదీప్యమానంగా ప్రజ్వరిల్లుతున్నది. అయినా మంత్రాలతో ఆ యాగాగ్నిలో పిలిచినా అతడు అందులో పడలేదు. అందుకు జనమేజయుడు విచారపడ్డాడు. శౌనకుడు (సూతునితో) అన్నాడు.

'సూతనందనా! ఆ యజ్ఞశాలలో బ్రాహ్మణులు అందరూ ఉన్నారు. తక్షకుడిపై వారి మంత్రాలు, పనిచేయలేదా? తక్షకుడు అగ్నిగుండంలో పడకుండా ఉండటానికి కారణం ఏమిటి?' సౌతి చెప్తున్నాడు. 'శౌనకా! ఇంద్రునినుండి విడివడిన తక్షకుడు భయంతో తల్లడిల్లిపోయాడు. అతనిలో చైతన్యం నశించింది. ఆ సమయంలో ఆస్తీకుడు ఆ తక్షకుని లక్ష్యంగా పెట్టుకొని మూడు సార్లు "తక్షకా ఆగు ఆగు ఆగు - అక్కడే ఉండు" అని తక్షకుని ఆకాశంలోనే ఉంచాడు. అపుడు తక్షకుడు హృదయంలో బాధపడుతూ ఆకాశంలోనే నిలిచి ఉన్నాడు. ఆ విధంగా ఏ మనుష్యుడూ ఆకాశానికి, భూమికి మధ్యలో పూర్వం ఎప్పుడూ వ్రేలాడలేదు. తరువాత సదస్యులందరు మాటిమాటికి ప్రేరేపించడంతో జనమేజయుడు ఇలా అన్నాడు. "ఆస్తీకుని యొక్క మాట ప్రకారం అతనికోరిక నెరవేరుగాక!'. ఈ యజ్ఞం సమాప్తం అగుగాక! పన్నగులందరూ కుశలముగ ఉందురుగాక! ఆస్తీకుడు సంతోషించుగాక! సూతునిమాట సత్యమగును గాక." జనమేజయుడు ఆస్తీకునకు ఇచ్చిన వరం వలన అందరూ సంతోషించి హర్షధ్వానాలు చేశారు. పాండవవంశీయుడైన జనమేజయ మహారాజు యొక్క సర్పయాగం సమాప్తం అయింది. ఆస్తీకుడికి వరం ఇచ్చిన తరువాత జనమేజయుని మనస్సుకూడా ప్రశాంతంగా ఉన్నది.

ఆ యజ్ఞంలోని ఋత్విజులకు, సభాసదులకు అందరికీ వందలకొలదీ, వేలకొలది ధనాన్ని జనమేజయుడు ఇచ్చాడు. సూతు డయిన లోహితాక్షునికీ, యజ్ఞవాటికను రూపొందించిన శిల్పికీ, ఈ యజ్ఞం ప్రారంభానికి ముందు ఒక బ్రాహ్మణుని నిమిత్తం యజ్ఞం ఆగిపోతుందని చెప్పిన బ్రాహ్మణునికీ అధికమైన ధనాన్ని జనమేజయుడు ఇచ్చాడు. అప్రమేయపరాక్రమవంతు డయిన జనమేజయుడు ప్రసన్నుడయి, యోగ్యు లయిన వారికందరికీ వారి వారి యోగ్యతను బట్టి, ధనం, భోజనం, వస్త్రాలు ఇచ్చి సత్కరించాక శాస్త్రీయ విధిని అనుసరించి అవభృథ స్నానం చేశాడు. ఆస్తీకుడు గొప్ప సంస్కారం కలవాడు. బుద్ధిమంతుడు. విద్వాంసుడు. అతడు తన అభీష్టకార్యమందు కృతకృత్యుడు. కాబట్టి ప్రసన్నంగా ఉన్నాడు. మహారా జయిన జనమేజయుడు అతడిని మెచ్చుకొని ఇంటికి పంపుతూ అతనితో "నేను భవిష్యత్కాలంలో అశ్వమేధయాగాన్ని చేయబోతున్నాను. ఆ యజ్ఞంలో నీవు సదస్యుడవుగా ఉండాలని కోరుతున్నాను" అన్నాడు. ఆస్తీకుడు ఎంతో సంతోషపడి జనమేజయునితో "చాల మంచిది. అలాగే చేస్తాను" అని ఆ మహారాజాకు తన అంగీకారాన్ని తెలిపి, రాజాను సంతోషపరచి వెంటనే బయలుదేరాడు. ఆస్తీకుడు ప్రసన్నహృదయంతో ఇంటికి వచ్చి తల్లిని, తన మేనమామను కలుసుకొని వారి పాదపద్మాలకు నమస్కరించి, యజ్ఞసభలో జరిగిన విషయాలను అన్నిటిని చెప్పాడు.

సర్పయాగంలో భస్మం కాగా అక్కడ మిగిలిన నాగులందరు భయం విడిచిపెట్టి పరమసంతోషాన్ని పొందారు. ఆస్తీకునిపై అమితమైన ప్రీతిని ప్రకటించారు. వారందరు అతనితో "నీకు కావలసిన వరాన్ని కోరుకో" అని అన్నారు. వాళ్లందరు అనేకపర్యాయాలు ఈ విధంగా అతనితో అంటున్నారు. "విద్వాంసుడా! ఇవ్వాళ నీకు సంతోషం కలిగేటట్లుగా మేము ఏమిచేస్తే బాగుంటుంది? మమ్మల్ని అందరిని కష్టాలనుండి గట్టెక్కించావు. నీకోరిక ఏమిటో చెప్పు. తప్పకుండా దాన్ని నెరవేరుస్తాము" అని నాగులందరు గుచ్చి గుచ్చి అడిగారు. ఆస్తీకుడు ఇలా అన్నాడు. 'పన్నగోత్తములారా! ప్రపంచంలో బ్రాహ్మణులుగాని, ఇతరమానవులు గాని ప్రసన్నచిత్తులై ధర్మమయ మయిన నా ఈ కథను చదువుతారో వాళ్లందరికీ మీవలన ఎట్టి భయమూ కలుగకూడదు.' ఈమాటల్ని నాగులందరు విని చాలా ఆనందించారు. తమ మేనల్లుడితో 'బిడ్డా! నీ ఈ కోరికను తప్పక నెరవేరుస్తాం. మేనల్లుడా! మేమందరం అమితప్రేమతో నమ్రతతో అన్నివిధాలా నీ ఈ కోరికను తీరుస్తాం. రాత్రి గాని, పగలు గాని ఎవరు ఆసితుని, ఆర్తిమంతుని, సునీథుని స్మరిస్తారో అట్టివారికి ఎన్నటికినీ సర్పభయం ఉండదు. "జరత్కారు ఋషివలన జరత్కారువు అను నాగకన్యకు జన్మించి, జనమేజయుని సర్పయాగంలో సర్పాలను రక్షించిన ఆస్తీకుని నేను స్మరిస్తున్నాను. నాగులారా! మీరు నన్ను హింసించకండి" అంటూ ఈమంత్రాన్ని జపించండి. మహాసర్పమా! తప్పుకొని వెళ్లిపో. జనమేజయుని యొక్క సర్పయాగాంతకాలంలోని ఆస్తీకుని మాటలను స్మరించు. అట్టి ఆస్తీకుని మాటలను విని, ఏసర్పం తొలగదో దాని శిరస్సు శింశవృక్ష ఫలంలాగా నూరు వ్రక్కలు అగునుగాక!'

ఉగ్రశ్రవుడు (శౌనకునితో) చెపుతున్నాడు. బ్రాహ్మణోత్తమా! శౌనకా! ఆ సమయంలో అక్కడికివచ్చిన ప్రధానమైన నాగులందరు వరం అడిగిన మహాత్ము డయిన ఆస్తీకుని సంతోషపరచారు. తరువాత ఆస్తీకుడు అక్కడనుండి వెళ్లిపోవటానికి సిద్ధమయ్యాడు. ఇలా సర్పయాగంలో నాగుల్ని ఉద్ధరించిన బ్రాహ్మణోత్తముడు, ధర్మాత్ముడు అయిన ఆస్తీకుడు వివాహం చేసుకొని పుత్రపౌత్రాదులతో ఆనందించి, జీవితాన్ని గడిపి సమయంరాగానే మోక్షాన్ని పొందాడు. ఈవిధంగా నేను ఆస్తీకుని ఉపాఖ్యానాన్ని జరిగినది జరిగినట్లుగా చెప్పాను. ఆ ఆస్తీకోపాఖ్యానాన్ని కీర్తించిన వారందరికీ ఎన్నటికీ సర్పభయం ఉండదు. భృగువంశ శిరోమణీ! అ నీ పూర్వులు అయిన ప్రమతి తన కుమారుడైన రురుడు అడిగితే ఈ ఆస్తీకోపాఖ్యానాన్ని చెప్పాడు. దాన్ని నేనుకూడా విన్నాను. ఆ ప్రకారంగా విద్వాంసుడూ, మహాత్ముడూ అయిన ఆస్తీకుని యొక్క శుభ చరిత్రం నేను మొదటి నుండి చెప్పాను. ఈ ఆస్తీకుని యొక్క ఈ ధర్మమయమైన ఉపాఖ్యానం వింటే పుణ్యం

వృద్ధి అవుతుంది. కామక్రోధాదులు అణగిపోతాయి. కథాప్రసంగంలో డుండుభం యొక్క మాటను విని, మీరు నన్ను అడిగినందులకు నేను విన్న ఈ కథనంతటినీ మీకు వినిపించాను. దీనిని విన్న తరువాత మీ మనస్సులో ఉన్న సందేహం తీరిపోయిందనుకొంటాను.

59. మహాభారత కథా ప్రారంభము.

శౌనకుడు ఇలా చెపుతున్నాడు. 'ఉగ్రశ్రవా! భృగువంశం దగ్గర నుండి భారతాఖ్యానం నీవు చెప్పావు. నాకు చాలా సంతోషంగా ఉంది. సౌతీ ! ఇంకా వ్యాసమహర్షి చెప్పిన కథలన్నీ యథాతథంగా వివరంగా నాకు చెప్పు. అనంతమయిన ఆ సర్పయాగంలో కర్మాంతరాల్లో సదస్యుల మధ్య జరిగినవి ఉన్నవున్నట్లు నీ ముఖం నుండి వినాలని కోరుతున్నాను. సౌతీ ! వాటిని మాకు చెప్పు.' సౌతి ఇలా చెప్పాడు. 'కర్మాంతరాల్లో వేదాశ్రితాలయిన కథలు చెప్పారు. అందులో వ్యాసుడు చెప్పిన చిత్రమయిన కథ భారతం చాలా గొప్పది.' శౌనకుడు ఇలా అడిగాడు. 'జనమేజయుడు అడిగితే వ్యాసుడు మహాభారత కథను కర్మాంతరాల్లో వినిపింపజేశాడు. పాండవుల కీర్తిని ప్రకటించే ఆ పుణ్యకథను శాస్త్రోక్తంగా వినాలని కోరుతున్నాను. సజ్జనోత్తమా! నిర్మలాత్ము డయిన వ్యాసమహర్షి యొక్క మనస్సు అనే సముద్రం నుండి వెలువడినది ఈ కథ. సముద్రం వలెనే ఈకథ కూడ రత్నాలకు నిలయం. ఈ కథను చెప్పు.' సౌతి ఇలా అన్నాడు. 'అయ్యో! తప్పకుండా చెపుతాను. గొప్పదయిన ఈ మహాభారతం వ్యాస మహర్షికి చాలా ఇష్టం. ఆ మహాభారతం మొదటి నుండీ చెపుతాను. శౌనకా! మహాభారతం చెప్పటానికి నాకూ ఎంతో సంతోషంగా ఉంది. పూర్తిగా చెపుతాను. విను.'

60. భారత కథానుబంధము.

సౌతి ఇలా చెప్పాడు - జనమేజయుడు సర్పయాగం చేయడానికి దీక్షితు డైనట్లు విని ఋషి, విద్వాంసుడు అయిన కృష్ణద్వైపాయనుడు వచ్చాడు. శక్తికుమారుడైన పరాశరునివల్ల సత్యవతి కన్యావస్థలో యమునాద్వీపంలో పాండవుల పితామహు డైన కృష్ణద్వైపాయనుని కన్నది. అతడు పుట్టిన వెంటనే తన ఇచ్ఛతో శరీరాన్ని పెంచాడు. మహాయశస్వి అయిన వ్యాసుడు సాంగాలైన వేదాలను, ఇతిహాసాలను అధ్యయనం చేశాడు. తపస్సుతో కాని, వేదాధ్యయనంతో కాని, వ్రతాలతో కాని, ఉపవాసాలతో కాని, ఇంద్రియ నిగ్రహంతో కాని, యజ్ఞంతో కాని, పొందలేనట్టి జ్ఞానం అతడు పొందాడు. వేదవేత్తలలో శ్రేష్ఠుడైన అతడు ఏకరాశిగా ఉన్న వేదాన్ని నాలుగుగా విభజించాడు. అతడు పర - అపర

బ్రహ్మలను తెలిసినవాడు. బ్రహ్మర్షి, కవి, సత్యవ్రతుడు, పవిత్రుడు. అతడు ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురులకు జన్మనిచ్చి శంతనుని సంతతిని విస్తరింపచేసిన పవిత్రమయిన కీర్తి, యశస్సు కలవాడు. వేదవేదాంగ పారంగతులైన శిష్యులతో ఆ మహాత్ముడు రాజర్షి అయిన జనమేజయుని సభలోకి ప్రవేశించాడు. అక్కడ దేవతలతో కొలువుదీరిన ఇంద్రునిలా పెక్కుమంది సభ్యులతో కూర్చున్న జనమేజయుని చూశాడు.

అతడు మూర్ధాభిషిక్తు లైన అనేక జనపదాల రాజులతో, యజ్ఞానుష్ఠానంలో నేర్పరులైన ఋత్విజులతో ఆ యజ్ఞవాటికలో ప్రవేశిస్తుంటే జనమేజయుడు వెంటనే ఆ ఋషిని ప్రీతితో తన పరివారంతో పాటు ఎదురేగి ఆహ్వానించాడు. ఇంద్రుడు బృహస్పతికి ఆసనాన్ని కల్పించినట్లుగా జనమేజయుడు సభ్యుల అనుమతితో వ్యాసమహర్షికి బంగారు ఆసనాన్ని ఏర్పాటు చేశాడు. దేవ ఋషి గణాలచే పూజింపబడి ఆసనంమీద కూర్చున్న వరదుడైన వ్యాసమహర్షిని ఆ రాజు శాస్త్రీయ విధానంతో పూజించాడు. ఉత్తమమైన ఆతిథ్యానికి అర్హుడూ, తన పితామహుడూ అయిన ఆ వ్యాసమహర్షికి మహారాజు అర్ఘ్య పాద్య ఆచమనీయాలను, గోవును ఇచ్చి గౌరవించాడు. పాండవ వంశీయుడైన జనమేజయునినుండి ఆతిథ్యాన్ని పొందిన వ్యాసుడు గోవులపట్ల ఆదరాన్ని చూపి, సంతోషించి ప్రసన్ను డయ్యాడు. జనమేజయుడు ప్రేమతో తన ప్రపితామహుని పూజించి సంతుష్టుడై అతని చెంత కూర్చుండి కుశల సమాచారాన్ని అడిగాడు. భగవత్స్వరూపుడైన వ్యాసుడు కూడా అతనిని చూసి కుశలాన్ని తెలిసికొన్నాడు. ఆ తరువాత అక్కడున్న సభ్యులందరూ వ్యాసుని పూజించారు. వ్యాసుడు కూడా వాళ్ళను తిరిగి గౌరవించాడు. తరువాత సభ్యులందరితో పాటు జనమేజయుడు చేతులు జోడించి ద్విజశ్రేష్ఠుడైన వ్యాసమహర్షిని ఈ విధంగా అడిగాడు.

జనమేజయుడిలా అన్నాడు - 'కౌరవులను పాండవులను ప్రత్యక్షంగా చూసిన వాడవు నీవు. కావున వారి చరిత్రను నీవు చెప్పగా వినాలని ఉంది. సత్కర్మల నాచరించే వారిమధ్య భేదభావం ఎందుకు కలిగింది? ప్రాణుల వినాశనానికి కారణమైన అంతటి మహాయుద్ధం ఎలా జరిగింది ? ద్విజోత్తమా! మనసులో ఇష్టంలేకున్నా నా పితామహులంతా దైవప్రేరణచే ఇటువంటి పని చేసి ఉంటారు. దానినంతా ఉన్నదున్నట్లుగా నాకు వివరించి చెప్పు.' అతని మాట విని కృష్ణద్వైపాయనుడు తన చెంతనే కూర్చున్న శిష్యుడైన వైశంపాయనుని ఆజ్ఞాపించాడు. వ్యాసు డిలా చెప్పాడు 'మునుపు కౌరవ పాండవులకు భేదం ఎలా ఏర్పడిందో అదంతా నా దగ్గర నీవు విన్న విధంగా వీరికి చెప్పు.' అటుపై విప్రశ్రేష్ఠుడైన ఆ వైశంపాయనుడు గురువు మాటను పాటించి జనమేజయునికీ, తక్కిన సభ్యులందరికీ

కురుపాండవుల కలహమూ, వారి సర్వ వినాశనమూ మొదలయిన ప్రాచీనేతిహాసాన్నంతా తెలియచెప్పాడు.

61. కౌరవపాండవుల మధ్య భేదము - యుద్ధవృత్తాంతము.

వైశంపాయనుడిలా చెప్పాడు - 'మనస్సు - బుద్ధి వీని ఏకాగ్రతలతో ముందుగా మా గురువుకు నమస్కరించి, ఇక్కడున్న బ్రాహ్మణులను విద్వాంసులను గౌరవించి, సమస్తలోకాల్లోను ప్రసిద్ధిపొందిన ధీమంతుడూ, మహాత్ముడూ అయిన వ్యాసమహర్షి యొక్క అభిప్రాయాన్ని పూర్తిగా వివరిస్తాను. రాజా! నీవు ఈ మహాభారతకథ వినడానికి యోగ్యుడవు. గురుముఖతః వెలువడిన ఈ భారతకథ నామనస్సును ఉత్సాహపరుస్తున్నట్లు ఉంది. రాజా! కురుపాండవుల మధ్య భేదమూ, రాజ్యంకోసం జూదమాడటమూ, పృథివీ వినాశనానికి కారణమైన యుద్ధమూ అదంతా నీకు చెప్తాను. విను. పాండురాజు మరణించాక పాండవులు అడవినుండి ఇంటికి వచ్చారు. వారు అచిరకాలంలోనే ధనుర్వేదంలో పండితు లయ్యారు. ఆ విధంగా సత్త్వ పరాక్రమ తేజ స్సంపన్నులైన, పౌరులకు ప్రీతిపాత్రులైన పాండవులు క్రమంగా ధన, కీర్తి, సంపదలతో వృద్ధి చెందారు. కౌరవులు వారి అభివృద్ధి చూసి ఓర్వలేకపోయారు. క్రూరుడైన దుర్యోధనుడు, కర్ణుడు, శకుని కలిసి పాండవుల్ని నిగ్రహించడానికీ, దేశం నుండి బయటకు పంపడానికీ అనేక ప్రయత్నాలు ప్రారంభించారు. అనంతరం శకుని అభిప్రాయం ప్రకారం నడిచే దుర్యోధనుడు రాజ్యంకోసం పాండవులను రకరకాల ఉపాయాలతో బాధించాడు.

పాపాత్ముడైన దుర్యోధనుడు భీమునికి విషాన్నిచ్చాడు. కాని వీరుడైన భీముడు అన్నంతో పాటుగా ఆ విషాన్ని కూడ (ఆరిగించుకొన్నాడు) జీర్ణించుకొన్నాడు. గంగా తీరంలో ప్రమాణకోటి ఘట్టంలో నిద్రిస్తున్న భీముని బంధించి, గంగా ప్రవాహంలోకి త్రోసివేసి, దుర్యోధనుడు ఏమీ తెలియనివాడివలె నగరానికి వచ్చాడు. భీముడు నిద్రనుండి లేచి తనబంధాల్ని తెంచుకొని ఎటువంటి బాధాలేకుండా గంగలోనుండి పైకి లేచి వచ్చాడు. శత్రుసంహారకుడైన భీముడు నిద్రిస్తుండగా దుర్యోధనుడు అతని శరీరంలోని ప్రతి అవయవంమీద కాలసర్పాల చేత కరిపించాడు. కాని భీముడు మరణించలేదు. కౌరవులు పాండవులకు అపకారం చేస్తున్న ప్రతి సమయంలోను మహాబుద్ధిమంతుడైన విదురుడు వారిని విడిపించడంలోను, ప్రతీకారం చేయడంలోను అప్రమత్తంగా ఉండేవాడు. స్వర్గంలో ఉన్న ఇంద్రుడు జీవలోకానికి ఏవిధంగా సుఖాన్ని కల్గిస్తాడో అదేవిధంగా విదురుడు కూడా నిత్యమూ పాండవులకు సుఖాన్ని కలిగించేవాడు. రహస్యంగాను, బాహ్యంగాను

కూడ అనేకోపాయాలతో కౌరవులు పాండవులను చంపలేకపోయారు. భావికాలంలో జరగబోయే సంఘటనలకోసమే దైవం వారిని రక్షించింది. దుర్యోధనుడు కర్ణదుఃశాసనులతో సమాలోచన చేసి ధృతరాష్ట్రుని అనుమతితో వారణావతంలో లక్క్యిల్లు నిర్మించడానికి ఆదేశించాడు. పుత్రుల ప్రియంకోరే ధృతరాష్ట్రుడు రాజ్యభోగాలపై కోరికతో పాండవులను రాజ్యంనుండి బయటకు పంపాడు. వారు తమతల్లితోపాటు హస్తినాపురం నుండి బయలుదేరారు. ఆ సమయంలో విదురుడు వారికి మంచి సలహా ఇచ్చాడు. ఆ కారణంగా అర్ధరాత్రి సమయంలో వారు లక్క్యింటిని వదిలి అడవిలోకి వెళ్ళిపోయారు.

పాండవులు తల్లితో పాటు వారణావత నగరంలో నివసించసాగారు. ధృతరాష్ట్రుడు ఆదేశించినట్లుగానే వారు లక్క్యింటిలో ఒక సంవత్సరకాలం ఉన్నారు, పురోచనుడిచే రక్షింపబడుతూ, విదురునిచే ప్రేరేపింపబడి సురంగమార్గాన్ని త్రవ్వుకొని, లాక్షాగృహాన్ని తగులబెట్టి అక్కడనుండి తల్లితో బాటుగా బయటపడ్డారు. అడవిలో రాత్రిసమయంలో ఒకసెలయేటి పక్కన క్రూరుడైన హిడింబుడనే రాక్షసుని చూసి, వానిని సంహరించారు. హిడింబుని సోదరి హిడింబ భీమునికి భార్యగా లభించింది. వారికి ఘటోత్కచుడనే కొడుకు పుట్టాడు. ధార్తరాష్ట్రులవల్ల భయంతో వారు అక్కడనుండి దూరంగా వెళ్లారు. అటుపై పాండవులు ఏకచక్రపురానికి వెళ్ళి కఠిన నియమాన్ని పాటిస్తూ, వేదాధ్యయన సంపన్నులుగా, బ్రహ్మచారులుగా జీవించసాగారు. వారు తల్లితో పాటుగా ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంట్లో కొంతకాలం నివసించారు. అక్కడ మనుష్యుల్ని తినే మహాబలవంతుడు అయిన బకు డనే రాక్షసు డున్నాడు. మహాబాహువైన భీమసేనుడు ఆకలితో ఉన్న ఆ బకుని దగ్గరికి వెళ్లాడు. పురుషశ్రేష్ఠుడైన భీముడు తన బాహుబలంతో ఆ బకుని చంపి నగరవాసులకు ఊరట కలిగించాడు. అనంతరం వారు పాంచాలదేశంలో ద్రౌపదీ స్వయంవరం జరుగుతున్నట్లు విన్నారు. అక్కడకు వెళ్లి పాంచాల రాజకుమారి ద్రౌపదిని భార్యగా పొందారు. అక్కడ ఒక సంవత్సరకాలం నివసించి, శత్రువులను నిగ్రహింపగల పాండవులు హస్తినాపురం చేరుకొన్నారు.

అపుడు ధృతరాష్ట్రమహారాజు, భీష్ముడూ వారితో ఇలా చెప్పారు - 'నాయనా! మీకు మీ సోదరులతో విరోధం రాకూడదని మీరు ఖాండవప్రస్థంలో ఉండడం మంచిదని మేము భావించాం. అందువల్ల మీరు ఎటువంటి మత్సరం లేకుండా ఖాండవప్రస్థానికి వెళ్లి ఉండండి, వారి మాటలప్రకారం పాండవులు ఖాండవప్రస్థానికి తమస్నేహితులతో బాటు, రత్నరాసులతో బాటుగా వెళ్లారు. అక్కడ వారు చాలా సంవత్సరాలు నివసించారు. తమ శస్త్రబలంతో చాలమంది రాజులను తమ వశం చేసికొన్నారు. ఇలా పాండవులు

ధర్మప్రధానులై, సత్యపరాయణులై, అప్రమత్తులై, శత్రువులను అదుపుచేస్తూ సహనంతో అక్కడ జీవించారు. మహాయశస్వి భీముడు తూర్పుదిక్కును, మహావీరుడు అర్జునుడు ఉత్తరదిక్కును, నకులుడు పడమటిదిక్కును, సహదేవుడు దక్షిణదిక్కును జయించారు. ఈ విధంగా పాండవులు సమస్తభూమండలాన్ని తమ అధీనంలోకి తెచ్చుకొన్నారు. సూర్యునిలా ప్రకాశించే అయిదుగురు పాండవులతో బాటు సూర్యుడు కలిస్తే ఈ భూమండలం ఆరుగురు సూర్యులు కలదిగా భాసించింది. అనంతరం ఒకానొకనిమిత్తంగా తేజోవంతుడూ, సత్యవిక్రముడూ అయిన ధర్మరాజు తనకు మిక్కిలి ప్రీతిపాత్రుడు, సవ్యసాచి, పురుషశ్రేష్ఠుడు, స్థిరాత్ముడు, గుణసంపన్నుడు అయిన అర్జునుని వనానికి పంపాడు.

(ధైర్యం, సత్యం, ధర్మం, విజయం - వీటివల్ల అర్జునుడంటే ధర్మరాజుకి చాల ఇష్టం. అర్జునుడు కూడ తన అన్నమాటను ఎప్పుడూ అతిక్రమించలేదు)

అతడు ఒక సంవత్సరం పై ఒక మాసం రోజులు వనంలో నివసించాడు.

(అర్జునుడు తీర్థయాత్రలు చేశాడు. నాగకన్య ఉలూపికను పొందాడు. పాండ్యదేశపురాజైన చిత్రవాహనుని కూతురు చిత్రాంగదను కూడా పొందాడు. కొంతకాలం వారితో కలిసి అక్కడ నివసించాడు)

అక్కడ నుండి ద్వారకకు వెళ్లి అక్కడ శ్రీకృష్ణుని కలిశాడు. అతని చెల్లెలైన సుభద్రను భార్యగా పొందాడు. ఇంద్రునితో శచీదేవిలా, శ్రీకృష్ణునితో లక్ష్మీదేవిలా, అర్జునునితో సుభద్ర మిక్కిలి ప్రేమతో జీవించింది. నృపశ్రేష్ఠా! అనంతరం అర్జునుడు ఖాండవప్రస్థంలో ఉండి శ్రీకృష్ణునితో కలిసి అగ్నిహోత్రుని తృప్తిపరిచాడు. దృఢప్రయత్నం తోడుగా ఉన్న విష్ణువుకు దేవతల శత్రువులను చంపడంలో శ్రమలేనట్లుగా శ్రీకృష్ణుడు తోడుండటంచేత అర్జునునికి ఆ పని మిక్కిలి భార మనిపించలేదు. అగ్నిదేవుడు సంతోషించి అర్జునుడికి ఉత్తమమైన గాండీవమనే ధనుస్సునూ, అక్షయబాణాలుగల అమ్ములపొదినీ, కపిధ్వజంగల రథాన్నీ ఇచ్చాడు. ఆ సమయంలో ఖాండవవనంలో దహించుకుపోతున్న మయుడనే రాక్షసుని అర్జునుడు రక్షించాడు. దానితో సంతోషించిన మయుడు అర్జునుని కొరకు దివ్యమైన రత్నాలు పొదిగిన సభాభవనాన్ని నిర్మించి ఇచ్చాడు. మూర్ఖుడు, దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు మనస్సులో దానిపై ఆశపడ్డాడు. ఆ తర్వాత శకుని సాయంతో పాచికలతో ధర్మరాజును మోసగించి, పండ్రెండు సంవత్సరాలు అరణ్యావాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం మొత్తం పదమూడు సంవత్సరాలు బయటకు పంపాడు. అనంతరం పద్నాలుగో సంవత్సరంలో పాండవులు తమ రాజ్యసంపద నిమ్మని అడిగారు. కాని దుర్యోధనుడు పాండవులకు రాజ్యాన్ని ఇవ్వలేదు. వారిరువురి మధ్య యుద్ధం

జరిగింది. ఆ యుద్ధంలో పాండవులు శత్రుపక్షంలోని రాజులను, దుర్యోధనునీ చంపి, తమ నష్టప్రాయమైన రాజ్యాన్ని తిరిగి పొందారు. ఈ విధంగా అనాయాసంగా స్వధర్మాన్ని నిర్వహింపగల పాండవులకూ, కౌరవులకూ మధ్య భేదం వల్ల రాజ్యవినాశం జరిగి పాండవులు విజయాన్ని పొందారు.

62. మహాభారత మహత్వము.

జనమేజయుడిలా అన్నాడు 'బ్రాహ్మణోత్తమా! కురువంశీయుల గొప్పచరితం మహాభారతాఖ్యానం సంగ్రహంగా చెప్పావు. తపోధనా! మిక్కిలి విచిత్రవిషయాలతో ఉన్న వారి కథను విస్తరంగా వినాలని నాకు కుతూహలంగా ఉంది. దయతో చెప్పండి. వారికథను విస్తరంగా చెప్పడానికి నీవే తగినవాడవు. మా పూర్వికుల ఘనచరిత్రను వింటూంటే ఇంకా నాకు తృప్తి కలగటం లేదు. ధర్మజ్ఞులైన పాండవులు చంపలేని వారినందరినీ చంపారు. దానిని ప్రజలంతా ప్రశంసించారు. అంటే దానికి ఏదో చిన్న కారణంకాదు, పెద్దకారణమే ఉండి ఉంటుంది. పురుషశ్రేష్ఠులూ, శక్తిమంతులూ, నిరపరాధులూ ఐన పాండవులు దుర్మార్గులైన కౌరవులు పెట్టే కష్టాలను ఎందుకు సహించారు ? ద్విజోత్తమా! పదివేల ఏనుగులబలమూ, బాహుబలమూ కల భీముడు కష్టాలను భరిస్తూ కోపాన్ని ఎలా నిగ్రహించాడు? దుర్మార్గులైన కౌరవుల వల్ల బాధలు పడుతూ ద్రుపదపుత్రిక కృష్ణ తన క్రోధనేత్రాలతో ధార్తరాష్ట్రులను దహింపగలిగినా ఎందుకు దహించలేదు ? కుంతీపుత్రులైన భీమార్జునులూ, మాద్రీసుతులైన నకులసహదేవులూ ఆ దుర్మార్గులచే బాధింపబడుతున్నా, ద్యూతవ్యసనపరుడైన ధర్మరాజును ఎలా అనుసరించారు? ధర్మాత్ములలో శ్రేష్ఠుడై, ధర్మదేవుని కుమారుడై, ధర్మం తెలిసిన ధర్మరాజు అన్నికష్టాలుపడటానికి తగిన వాడు కాకున్నా ఆ కష్టాల్ని ఎలా సహించాడు? కృష్ణుడు సారథిగా ఉండగా పాండవమధ్యముడైన ధనంజయుడు ఒక్కడే బహులసంఖ్యాకమైన శత్రుసేనలను పితృలోకానికి ఎలా పంపగలిగాడు ? తపోధనా ! ఆయా సమయాల్లో ఆ మహారథులంతా ఏమేమి చేశారో అదంతా జరిగింది జరిగినట్లుగా నాకు చెప్పు.'

వైశంపాయనుడిలా చెప్పాడు – 'మహారాజా! సావధానంగా ఉండు. వ్యాసమహర్షి చెప్పిన ఈ పవిత్రమైన ఆఖ్యానం చాలా విపులమైనది. దాన్ని యథాక్రమంగా చెప్పవలసి ఉంది. సమస్తలోకాల్లో గౌరవింపబడే గొప్ప తేజస్సంపన్నుడైన మహాత్ముడైన వ్యాసమహర్షి అభిప్రాయాన్ని సమగ్రంగా చెప్తాను. పుణ్యకర్ములైన పాండవులకథను తేజస్సంపన్నుడైన సత్యవతీతనయుడు వ్యాసుడు లక్ష శ్లోకాల్లో వివరించాడు. ఈ కథను వినిపించిన విద్వాంసుడూ,

విన్నమానవులూ బ్రహ్మలోకం చేరి దేవసము లవుతారు. ఇది వేదాలతో సమానమైనది. పవిత్రమైనది. ఉత్తమమైనది. వినదగినవానిలో ఉత్తమమైన పురాణం. ఋషుల ప్రశంసలు పొందినది. చాలా పవిత్రమైన **ఈ మహాభారతం అనే ఇతిహాసంలో ధర్మార్థాలు పూర్తిగా ఉపదేశింపబడ్డాయి. పరినిష్ఠితమైన మోక్షబుద్ధి ఉపదేశింపబడింది.** కృష్ణద్వైపాయనుడు చెప్పిన ఈ భారతసంహితను మంచిస్వభావం కలవారికి, దానశీలులకు, సత్యశీలులకు, ఆస్తికులకు, వినిపించిన విద్వాంసుడు అభీష్టాన్ని/అర్థాన్ని పొందుతాడు. ఈ ఇతిహాసం వినడంవల్ల భ్రూణహత్యవల్ల కలిగిన పాపం కూడా పోతుంది. ఇందులో సందేహం లేదు. **రాహువుచే విడువబడిన చంద్రునిలా అన్ని పాపాలనుండి విముక్తుడౌతాడు. విజయాన్ని కోరుకొనేవాడు తప్పనిసరిగా జయ మనేపేరుగల ఈ ఇతిహాసాన్ని వినాలి.** దీన్ని విన్నరాజు భూమిని జయిస్తాడు. శత్రువులను ఓడిస్తాడు. పుత్రుని పొందటానికి ఇది శ్రేష్ఠమైన మంచి గొప్ప సాధనం. ఇది ఎంతో శుభానికి మార్గం. యువరాజు, రాణి అనేక పర్యాయాలు దీన్ని వినాలి. అలా వింటే వీరుడైన పుత్రుడు జన్మిస్తాడు. లేదా రాజ్యాన్ని పొందగల కన్య జన్మిస్తుంది. **అపారమైన మేధాసంపత్తి గల వ్యాసుడు పవిత్రమైన ధర్మశాస్త్రాన్ని, గొప్ప అర్థశాస్త్రాన్ని, ఉత్తమమైన మోక్షశాస్త్రాన్ని ఈ భారతరూపంలో చెప్పాడు.** ఇపుడు ఈ జయేతిహాసాన్ని చెప్పే వారి, వినేవారి పుత్రులు సేవాపరాయణు లవుతారు. సేవకులు ప్రియంగా పని చేసేవారు అవుతారు. **ఈ ఇతిహాసాన్ని విన్న మానవుడు మనోవాక్కాయాలచే చేసిన పాపం నుండి వెంటనే విముక్తు డౌతాడు.* భరతవంశీయుల జన్మవృత్తాంతం విన్నవారికి అసూయ ఉండదు. వారికి రోగభయమే ఉండదు. ఇక పరలోక భయం ఎక్కడిది?**** పవిత్రమైనపని చేయగోరి కృష్ణద్వైపాయనుడు ధనమూ, యశస్సూ, ఆయువూ, పుణ్యమూ, స్వర్గమూ ఇవ్వగలిగిన ఈ భారతాన్ని రచించాడు. లోకంలో మహోత్ములైన పాండవులకీర్తిని వ్యాపింపజేస్తూ వారితోపాటు సంపదా, తేజస్సూ గల ఇతరరాజుల కీర్తిని, అన్ని విద్యలు అభ్యసించి, కర్మనిష్ఠులైన వారి కీర్తిని లోకంలో వ్యాపింపజేశాడు. **పుణ్యంకొరకు పవిత్రమైన బ్రాహ్మణులకు దీన్ని వినిపించినవాడు సనాతన ధర్మాన్ని ఆచరించినవా డౌతాడు.** నియమంతో పవిత్రమైన ఈ భారతాన్ని అధ్యయనం చేసిన బ్రాహ్మణుని వంశం వృద్ధి

* శరీరేణ కృతం పాపం వాచా చ మనసైవ చ।
పర్వం సంత్యజతి క్షిప్రం య ఇదం శృణుయాన్నరః ॥ 25

**భరతానాం మహజ్జన్మ శృణ్వతామనసూయతామ్ ।
నాస్తి వ్యాధిభయం తేషాం పరలోకభయం కుతః ॥ 26

చెందుతుంది. అతడు లోకంలో మిక్కిలి పూజింపదగినవా డౌతాడు. వర్షాకాలం నాలుగు నెలలూ చదివితే అన్ని పాపాలనుండి ముక్తుడౌతాడు. భారతాన్ని పఠించినవాడు వేదపారగుడని గుర్తించాలి. దేవతలూ, రాజర్షులూ, పవిత్రమైన బ్రహ్మర్షులూ, పాపనిర్ముక్తులూ, ఇందులో కీర్తింపబడుతూ ఉన్నారు. శ్రీకృష్ణభగవానుడు కూడా కీర్తింప బడుతున్నాడు. దేవేశుడయిన ఈశ్వరుడు, పార్వతీదేవి, పలువురు తల్లులు గల కార్తికేయుని జననం ఇందులో వర్ణింపబడ్డాయి. బ్రాహ్మణులయొక్క గోవులయొక్క మహత్త్వం ఇందులో చెప్పబడింది. సర్వవేద సమూహం అయిన ఈ భారతాన్ని ధర్మబుద్ధితో వినాలి. **పర్వదినాల్లో బ్రాహ్మణులకు వినిపించిన విద్వాంసుడు పాపముక్తుడై స్వర్గాన్ని జయించి శాశ్వతమయిన బ్రహ్మమును చేరుకొంటాడు.**

(ఈ మహాభారతాన్ని విన్న రాజు సమస్త భూమండలాన్నీ పొందుతాడు. గర్భవతి పుత్రుని కంటుంది. కన్యకు శీఘ్రంగా వివాహం అవుతుంది. వర్తకులు తమ వాణిజ్యయాత్రలో సఫలులు అవుతారు. వీరులు విజయాన్ని పొందుతారు. ఆస్తికులకు, అసూయలేనివారికి, వేదాధ్యయనం పూర్తయిన బ్రాహ్మణులకు, జయాన్ని కోరుతున్న క్షత్రియులకు, స్వధర్మాన్ని ఆచరిస్తున్న వైశ్యులకు, రాజాశ్రితులైన శూద్రులకు దీన్ని వినిపించాలి.

రాజా! బ్రాహ్మణులనుండి భారతం వినడం ప్రాచీన కాలంనుండి ఉన్న ఒక విశిష్టధర్మం. దాన్ని చదివినట్లయితే ఉత్తమ స్థితిని పొందుతారు. **శ్లోకం కాని, అర్ధశ్లోకంకాని చివరకు ఒక్క పాదం కాని నిత్యం చదవాలి. అంతేకాని నిర్ధారకుడు (భారతం చదవనివాడు) మాత్రం కాకూడదు.** ఈ భారతంలో మహాత్ములైన రాజర్షుల జన్మవృత్తాంతాలు ఎన్నో వర్ణింపబడ్డాయి. ఉత్తమమైన మంత్రాంగ విధానం చెప్పబడింది. అనేక దర్శనాలకు లోబడి ధర్మం చెప్పబడింది. విచిత్రాలైన యుద్ధాలు వర్ణింపబడ్డాయి. రాజుల వృద్ధి వర్ణింపబడింది. ఋషులు,గంధర్వులు, రాక్షసులు వీరియొక్క కథలు ఆయా విషయప్రాధాన్యాన్ని బట్టి విస్తరంగా చెప్పబడ్డాయి. పవిత్రతీర్థాలు, దేశాలు, వనాలు, పర్వతాలు, నదులు, సముద్రం, వీటన్నింటి గురించి దీంట్లో చెప్పబడింది.

పవిత్రాలైన దేశాలు, పురాలు వర్ణింపబడ్డాయి. శ్రేష్ఠమైన ఉపచారాలు, అలౌకిక పరాక్రమాలు, సత్కారాలు, రథ, అశ్వ గజ బలాలను వీర్యాటుచేయడం, యుద్ధకౌశలం, ఇందులో వర్ణింపబడ్డాయి. అనేక వ్యాసాల వాక్య సమూహాలు, ఇందులో చూపబడ్డాయి.)

శ్రాద్ధ సమయంలో బ్రాహ్మణులకు చివరకు ఈ భారతంలోని ఒక్కశ్లోక పాదం వినిపించినా, ఆశ్రాద్ధం అక్షయ ఫలాన్నిస్తుంది. పితృదేవతలకు తప్పక చేరుతుంది. ఇంద్రియాలతోకాని, మనస్సుతోకాని, తెలిసి కాని తెలియక కాని ఏరోజు చేసిన పాపం ఆరోజే భారతాఖ్యానం వినడం వల్ల నశిస్తుంది. భరతవంశీయుల ఉత్తమ జన్మవృత్తాంతం చెప్పడం వల్ల ఇది మహాభారతమని చెప్పబడుతోంది. మహాభారతం యొక్క ఈ నిర్వచనాన్ని తెలిసినవాడు సమస్తపాపాలనుండి విముక్తుడౌతాడు. ఎందువల్ల

నంటే భరతవంశీయుల ఇతిహాసం చాలా అద్భుతమైంది. నిరంతరపఠనం వల్ల ఇది మానవులను మహాపాపం నుండి విముక్తుని చేస్తుంది. నిత్యం ప్రాతఃకాలంలో లేచి తపోనియమాన్ని పాటిస్తూ, శక్తిసంపన్నుడైన కృష్ణద్వైపాయనుడు మూడు సంవత్సరాల కాలంలో మహాభారతరచన చేశాడు. అందువల్ల బ్రాహ్మణులు కూడా నియమాన్ని పాటిస్తూ దీన్ని వినాలి. వ్యాసమహర్షి చెప్పిన ఈ మహాభారత మనే ఉత్తమకథను ఇతరులకు వినిపించిన బ్రాహ్మణులు, విన్నమానవులు కృతాకృతాల చింతలేక దుఃఖంలేనివారై ఎప్పుడూ ఆనందంగా ఉంటారు. ధర్మాన్ని కోరుకొనే మానవుడు ఈ మహాభారతాన్నంతా వినాలి. అలా విన్నవాడు అన్ని సిద్ధులనూ పొందుతాడు. మిక్కిలి పవిత్రమైన ఈ ఇతిహాసాన్ని వినడం వల్ల పొందే తృప్తిని, ఆనందాన్ని స్వర్గానికి వెళ్ళినా పొందలేడు. మంచినడవడిక గల మానవుడు అద్భుతమైన ఈ మహాభారతాన్ని విన్నా, వినిపించినా రాజసూయ అశ్వమేధయాగాలు చేసిన ఫలాన్ని పొందుతాడు. **సముద్రాన్ని మేరుపర్వతాన్ని రత్ననిధి అన్నట్లే ఈ మహాభారతాన్ని కూడ రత్ననిధి అంటారు.* ఇది వేదాలతో సమానమైంది. పవిత్రమైంది. శ్రేష్ఠమైంది. వివదగింది. వినుటకింపైనది. పవిత్రమైనది. శీలాన్ని మెరుగుపరుస్తుంది.**** రాజా! ఈ మహాభారతాన్ని చెప్పేవానికి ఇచ్చినట్లయితే సముద్రమేఖల అయిన భూమండలాన్ని దానంచేసినంత ఫలం లభిస్తుంది. పరీక్షిదాత్మజ! నేను చెప్పే దివ్యమైన ఈ కథను సమగ్రంగా విను. ఇది మిక్కిలి ఆనందాన్ని, విజయాన్ని, పుణ్యాన్ని కలిగిస్తుంది. కృష్ణద్వైపాయనుడు మూడు సంవత్సరాలు నిత్యోత్సాహంతో అద్భుతమైన ఈ మహాభారత ఆఖ్యానాన్ని రచించాడు. **భరతశ్రేష్ఠా! ధర్మ, అర్థ, కామ, మోక్షాల విషయంలో ఇందులో ఉన్నదే ఎక్కడయినా ఉంటుంది. ఇందులో లేనిది ఇతరత్ర ఉండదు.'**

63. ఉపరిచర మహారాజు చరిత్ర - వ్యాసజననము.

వైశంపాయను డిలా చెప్పాడు - జనమేజయా! నిత్యం ధర్మం ఆచరిస్తూ వేటకు వెళ్లడం నియమంగా పెట్టుకొన్న ఉపరిచరుడనే రాజు ఉండేవాడు. పౌరవనందనుడైన ఆ ఉపరిచరవసువు ఇంద్రుని సలహాపై చేదిరాజ్యాన్ని స్వీకరించాడు. శస్త్రాన్ని వదిలి ఆశ్రమంలో

---

* యథా సముద్రో భగవాన్ యథా మేరుర్మహాగిరిః।
ఉభౌ ఖ్యాతౌ రత్ననిధీ తథా భారతముచ్యతే ॥ 48

**ఇదం హి వేదైః సమితం పవిత్రమపి చోత్తమమ్।
శ్రవ్యం శ్రుతిసుఖం చైవ పావనం శీలవర్ధనమ్ ॥ 49

తపోనిష్ఠలో ఉన్న అతనిని చూసి 'ఈ రాజు తన తపస్సుతో ఇంద్రపదవికి అర్హుడౌతాడు' అని భావించి, ఇంద్రాదిదేవతలంతా అతనిని సమీపించి శాంతి పూర్వకంగా అతనిచేత తపస్సు మాన్పించారు. దేవతలిలా అన్నారు – 'రాజా! ఈ భూమిమీద ధర్మం సంకరం కాకూడదు. నీవు ధర్మాన్ని ఆచరిస్తే ఈ లోకమంతా ధర్మాన్ని ఆచరిస్తుంది.' ఇంద్రుడిలా చెప్పాడు – రాజా! **ఈ లోకంలో నిత్యం సావధానుడవై ధర్మాన్ని రక్షించు. అలా ధర్మయుక్తుడవైన నీవు శాశ్వత పుణ్యలోకాలను పొందుతావు.** నరాధిపా! స్వర్గంలో ఉండే నాకు భూమిపై ఉండే నీవు మిత్రుడవు. ఈ భూమిపై నీకిష్టమైన అందమైన దేశంలో నీవుండవచ్చు. చేదిదేశం పశువులకు హితమైనది. పవిత్రమైనది. ధనధాన్యరాశులు కలది. స్వర్గంవలె రక్షింపదగినది. సౌమ్యమైనది. భూసంబంధమైన భోగ్యగుణాలతో కూడి ఉంది. సంపన్నమైనది. ధనరత్నాదులతో – బంగారంతో నిండినది. కావున నీవు అక్కడ నివసించు. అక్కడి పల్లెలన్నీ ధర్మశీలం కలవి. సత్పురుషులంతా సంతోషంగా ఉంటారు. స్వేచ్ఛగా సంచరించేవారు కూడా. అసత్యమాడరు. ఇకతక్కిన వారి విషయం చెప్పాలా? పెద్దవారికి హితంకోరి పుత్రులు తల్లిదండ్రులనుండి విడిపోరు. ఎద్దులపైనే భారాన్ని మోపరు. కృశించిన ఎద్దులను దయతో పోషిస్తారు కూడ. చేది దేశంలో అందరూ వారివారి ధర్మాలను ఆచరిస్తారు. ముల్లోకాల్లో జరిగింది నీకు తెలియనిదంటూ ఏమీ ఉండదు. ఈ విమానాన్ని నీకు ఇస్తున్నా. ఇది స్ఫటిక నిర్మితం. దేవతలు మాత్రం ఉపభోగించేది. ఇది నీకు ఆకాశంలో సదా సిద్ధంగా ఉంటుంది. మానవులందరిలో నీవొక్కడివే శ్రేష్ఠమైన ఈ విమానాన్ని ఎక్కి రూపుదాల్చిన దేవుడిలా ఆకాశంలో సంచరింపగలవు. వాడని పద్మాలుండే 'వైజయంతి' అనే మాల నీకు ఇస్తున్నాను. అది యుద్ధంలో ఆయుధాల వల్ల దెబ్బతగల కుండా నిన్ను రక్షిస్తుంది.

ఇంద్రమాలగా ప్రఖ్యాతిగాంచిన ఈ మాల చాలా గొప్పది. దీనిని పోలినది వేరొకటి లేదు. ఈ ఇంద్రమాలతో నిన్ను అందరూ గుర్తిస్తారు. వృత్రాసురుని చంపిన ఇంద్రుడు ఆ రాజుకు ఒకవేణుయష్టిని (వెదురు కర్ర) ఇచ్చాడు. అది కోరికలు తీరుస్తుంది. సజ్జనులను రక్షిస్తుంది. అపు డా రాజు ఇంద్రునిగౌరవార్థం ఆ కర్రను భూమి మీద ప్రతిష్ఠించి పూజించాడు. ఒక సంవత్సరం గడచింది. అప్పటినుండి నేటివరకు రాజశ్రేష్ఠులు ఆ రాజు చేసినట్లు **యష్టిప్రవేశం** చేసేవారు. యష్టిప్రవేశం జరిగిన మరుసటిరోజున దానికి ఉత్సవం చేస్తారు. దానిని పిటకాలతో, గంధమాల్యాలతో, భూషణాలతో అలంకరిస్తారు. పూలదండలతో కప్పి దానిని యథావిధిగా హంసరూపంలో ఈశ్వరునిగా పూజించేవారు. మహేంద్రుడు వసురాజుపై ప్రీతితో స్వయంగా హంసరూపం దాల్చి, అతడు చేసిన

శుభమైన పూజను గ్రహించి, సంతుష్టుడై ఇలా అన్నాడు – "చేదిరాజు ఉపరిచరవసువు చేసిన విధంగా నా పూజచేసి, ఉత్సవం చేసిన రాజులు, విజయ సంపన్నులవుతారు. వారి రాజ్యాలు సంపదలతో విజయాలతో విలసిల్లుతాయి. అంతేకాక ఆ రాజుల ఏలుబడిలోని జనపదాలు క్రమక్రమంగా ఉన్నతిని పొందుతాయి.' ఇలా అని మహేంద్రుడు ఉపరిచరవసువును ప్రీతితో సత్కరించాడు. 'భూమి రత్నాది దానాలతో ఇంద్రోత్సవాన్ని చేసిన మానవులు వరదానమహాయజ్ఞాదులచే పూజనీయులౌతారు".' ఇలా ఇంద్రునిచే పూజింపబడిన వసువు చేదిదేశంలో ఉండి ఈ భూమిని ధర్మంగా పరిపాలింపసాగాడు. ఇంద్రుని మీద ప్రీతితో చేదిరాజయిన వసువు ప్రతి సంవత్సరమూ ఇంద్రోత్సవం చేసేవాడు. ఆనంతరం ఆతనికి మిక్కిలి బలశాలులైన ఐదుగురు కుమారులు కలిగారు.

వసురాజు తన కుమారులను వివిధరాజ్యాలకు అభిషిక్తుల్ని చేశాడు. అందులో మహారథుడైన బృహద్రథుడు మగధరాజ్యానికి రాజుగా ప్రఖ్యాతి చెందాడు. ప్రత్యగ్రహుడు రెండోవాడు. మూడవవాడైన కుశాంబుని మణివాహనుడని కూడా అంటారు. నాల్గవవాడు మావేల్లుడు. ఐదోవాడు యదువు. ఇతడు ఎవరిచేతిలోనూ ఓడిపోలేదు. జనమేజయా! గొప్ప తేజోవంతుడు, రాజర్షి ఐన ఉపరిచరవసువు కుమారులు తమతమ పేర్లమీదుగ నగరాలను, దేశాలను ఏర్పాటు చేసి నివసించారు. వసురాజుకుమారులు ఐదుగురూ వేర్వేరు రాజ్యాలను పాలిస్తూ వేరువేరుగా తమ సనాతన వంశ పరంపరను కొనసాగించారు. చేది రాజైన వసువు మాత్రం తిరుగుతూ ఆకాశంలోనే ఉండేవాడు. గంధర్వులు, అప్సరసలు ఆ మహాత్ముని సేవించడానికి వచ్చేవారు. ఆకాశంలో పైపైన చరించే అతనికి 'ఉపరిచరవసు' వనే పేరు ప్రసిద్ధి చెందింది.

పూర్వం చేదిరాజ్యంలో శుక్తిమతి అనే ఉపనది ప్రవహిస్తూండేది. కోలాహలమనే పర్వతం చైతన్యం పొంది కామవశం వల్ల దివ్యరూపధారిణి ఐన ఆ నదిని అడ్డగించింది. అపుడు వసురాజు ఆ కోలాహలుని తన కాలితో తన్నాడు. ఆ దెబ్బతో ఏర్పడిన రంధ్రం నుండి ఆ నది ప్రవహించింది. కోలాహలుడు ఆ నదీ గర్భమందు ఒకపుత్రుని, ఒక పుత్రికను కన్నాడు. అతని నిర్బంధం నుండి విడిపించడం వల్ల ప్రసన్నురాలైన నది తన పిల్లల నిద్దరిని వసురాజుకు అప్పగించింది. ధనదాత, శత్రుదమనుడూ అయిన వసురాజు వారిలో మగవానిని తన సేనాపతిగా చేశాడు. కన్య అయిన గిరికను తన భార్యగా చేసికొన్నాడు. వసురాజు భార్య గిరిక భోగార్హమైన ఋతుకాలంలో శుచిగా పుత్రసంతానాభిలాషను విన్నవించింది. అదే రోజున వసురాజు తండ్రి క్రూరమృగాలను సంహరింపుమని వసురాజును ఆదేశించాడు. తండ్రి ఆదేశాన్ని కాదనలేక చక్కని రూపసంపద

గల్గి సాక్షాత్తుగా లక్ష్మీదేవి వలె ఉండే గిరికనే తలచుకొంటూ వేటాడినాడు. ఆది వసంతకాలం అవటంతో అశోకాలు, చంపకాలు, మామిళ్లు, మాధవీలతలు, పున్నాగలు, కర్ణికారాలు, వకుళాలు, దివ్యపాటలాలు, పాటలాలు, నారికేళాలు, చందనవృక్షాలు, అర్జునవృక్షాలు మొదలయిన వృక్షాలతో, పువ్వులతో, పళ్లతో నిండి, కోకిలల మధురస్వనంతో తుమ్మెదల ఝంకారాలతో ఆ వనం చైత్రరథంలా ఉంది. ఆ వాతావరణంలో మన్మథాయత్తుడై బాధపడుతూ రాజు గిరికను చూడలేక ఇచ్ఛానుసారంగా తిరుగుతూ ఉన్నాడు. అలా తిరుగుతూ వసురాజు పూలతోనిండిన శాఖాగ్రాలతో, చిగురుటాకులతో శోభిల్లుతున్న ఒకఅందమైన అశోకవృక్షాన్ని చూశాడు. ఆ చెట్టుక్రింద నీడలో రాజు సుఖంగా కూర్చున్నాడు. పూలయొక్క మకరంద, సుగంధాలతో నిండిన చక్కనిగాలి అతని మనస్సుకు ఆహ్లాదం కలిగిస్తూ వీచింది. మనోహరమైన గాలి సోకగానే అతని మనస్సులో ఆనందంతో సంభోగాభిలాష కలిగింది. అక్కడనుండి బయలుదేరి వనంలో వెళుతుండగా అతనికి రేతఃస్ఖలనం జరిగింది. స్ఖలితమైన ఆ రేతస్సు వ్యర్థం కాకూడదని భావించి, రాజు దాన్ని ఒక ఆకుదొప్పలోకి తీసుకున్నాడు. 'స్ఖలించిన నారేతస్సు వృథా కాకూడదు. నాభార్య యొక్క ఋతుకాలం కూడా వ్యర్థం కాకూడదు' అని మళ్లీ మళ్లీ బాగా ఆలోచించి, ఆ రేతస్సు నిష్ఫలం కాదని ఒక నిశ్చయానికి వచ్చాడు.

భార్యకు శుక్రం పంపటాని కది సమయమని భావించి, ఆ శుక్రాన్ని అభిమంత్రించి ధర్మార్థాల సూక్ష్మతత్త్వం తెలిసిన రాజు తనకు దగ్గరలో ఉన్న డేగను సమీపించి 'సౌమ్యా! నీవు ఈ శుక్రాన్ని మాయింటికి తీసుకొని వెళ్ళి గిరికకు ఇయ్యి. ఆమెకిది ఋతుకాలం' అని చెప్పాడు. అపుడా డేగ దానిని తన కాళ్లమధ్య పెట్టుకొని వేగంగా ఎగిరింది. ఆ డేగ వేగంగా ఆకాశమార్గంలో ఎగురుతూంటే మరొక డేగ చూసింది. చూసినవెంటనే మాంసమని భ్రమించి దాన్ని వెంబడించింది. ఆ రెంటికి ఆకాశంలో తుండయుద్ధం జరిగింది. ఆ రెండూ యుద్ధం చేస్తూండగా, ఆ శుక్రం కాళ్లమధ్య నుండి జారి యమునా నదీజలాల్లో పడింది. ఆ నదిలో బ్రహ్మశాపం వల్ల అద్రిక అనే అప్సర చేపరూపంలో నివసిస్తూంది. డేగకాలి నుండి జారిపడిన వసురాజు వీర్యాన్ని వేగంగా వచ్చి చేపరూపంలో ఉన్న అద్రిక స్వీకరించింది. పదినెలల తరువాత ఒకనాడు ఆ చేపను జాలరులు బంధించారు. అపుడు దాని ఉదరం నుండి ఒక కన్య, ఒక పురుషుడు బయటకు వచ్చారు. ఆశ్చర్యకరమైన ఆ సంఘటన చూసి ఆ పల్లెవారు రాజును సమీపించి 'రాజా! ఈ చేప గర్భంనుండి ఇద్దరు మనుష్యులు జన్మించారు' అని నివేదించారు. ఉపరిచరవసువు వారిలో మగశిశువును స్వీకరించాడు. అతడే మత్స్యరాజయ్యాడు. అతడు ధర్మాత్ముడు. సత్యపరిపాలకుడు కూడ.

పశుపక్ష్యాది జాతులలో పుట్టి మానవు లిద్దరికి జన్మనిచ్చి శాపం నుండి విముక్తి పొందుతావు' అని మునుపు బ్రహ్మ చెప్పినట్లు ఆ అప్సర ఆ పిల్లలను ప్రసవించిన వెంటనే శాపవిముక్తిని పొందింది. మత్స్య రూపాన్ని విడిచి దివ్యరూపాన్ని పొంది సిద్ధచారణులు సంచరించే ఆకాశమార్గంలో వెళ్ళిపోయింది. చేపగర్భంనుండి పుట్టి మత్స్యగంధం గల ఆ కన్యను వసురాజు దాశరాజుకిచ్చి కూతురుగా చూసుకొమ్మని చెప్పాడు.

చక్కనిరూపమూ, సత్యమూ బలంకలిగి అన్ని మంచిగుణాలతో ఉన్న ఆ సత్యవతి చేపలు పట్టేవారితో జీవించడం వల్ల మత్స్యగంధిగా పిలువబడింది. తండ్రికి సేవచేయడం కోసం తండ్రి నావను నడుపుతూ ఉండేది. సిద్ధులు కూడా కోరే రూపం ఆమెది ఆమెను ఒకసారి తీర్థయాత్రే చేస్తూ పరాశరుడు చూశాడు. అందమైన చిరునవ్వూ, దివ్యమైన రూపమూ కల సత్యవతిని చూడగానే ధీమంతుడు, మునిపుంగవుడూ అయిన పరాశరునికి ఆమెపై కోరిక కలిగింది. 'కల్యాణీ! నాతో సంగమించు' అని తనకోర్కెను చెప్పాడు. అపుడామె ఇలా అంది – 'పూజ్యుడా! ఈ నది ఒడ్డున ఉన్న ఆ ఋషులను చూడు. వీరు చూస్తుండగా మనకలయిక ఎలా జరుగుతుంది?" ఆమె అలా అనగానే సమర్థుడైన పరాశరుడు మంచును సృష్టించాడు. దానిచేత ఆ ప్రదేశమంతా చీకటి క్రమ్మినట్టైంది. ఆ మహర్షి సృష్టించిన మంచును చూసి ఆమె ఆశ్చర్యపడింది, సిగ్గుపడింది. సత్యవతి ఇలా అంది – 'పూజ్యుడా ! ఎల్లపుడూ తండ్రి అధీనంలో ఉండే కన్యను నేనని గ్రహించు. అనఘా! నీతో కలయికవల్ల నా కన్యాత్వం దూషిత మౌతుంది. ద్విజోత్తమా! కన్యాత్వం చెడిన తర్వాత ఇక నేనింటికి ఎలా వెళ్లగలను ? బుద్ధిమంతుడా! అట్టి స్థితిలో నేనిక జీవించి ఉండలేను. ఇదంతా బాగా ఆలోచించి తరువాత చేయదగింది చెయ్యి.' ఇలా పలికిన సత్యవతితో ప్రసన్నుడైన పరాశరుడిలా అన్నాడు – 'నా ఇష్టాన్ని చేకూర్చినా నీవు కన్యగానే ఉంటావు! నీకు కావలసిన వరాన్ని కోరుకో. నిర్మలహాసినీ! నా అనుగ్రహం మునుపెన్నడూ వ్యర్థం కాలేదు.' ఆతడలా చెప్పాక సత్యవతి తన శరీరం సుగంధభరితం కావాలని వరం కోరింది. పూజ్యుడయిన పరాశరుడు ఇహలోకంలో ఆమె కోరుకొన్న దాన్ని అనుగ్రహించాడు. అలా వరం పొందాక ఆమె సంతోషించి, స్త్రీ సహజమైన గుణాలతో నిండి అద్భుతవర్తనుడైన ఆ ఋషితో సంగమించింది. అప్పటినుండి ఆమె లోకంలో గంధవతి అనే పేరుతో ప్రసిద్ధి పొందింది. ఆమెకు యోజనదూరంలో ఉన్న జనులంతా ఆ శరీరసౌగంధ్యాన్ని ఆఘ్రాణించారు. అందువల్ల ఆమెకు యోజనగంధి అనే పేరు కూడా కలిగింది. ఈ విధంగా సత్యవతి గొప్పవరాన్ని పొంది ఆ పరాశరునితో సంగమించి సద్యోగర్భంలో యమునా ద్వీపంలో తేజోవంతుడైన పుత్రుని కన్నది. అతడే 'అవసరమయిన

పని కలిగినపుడు తలచుకొంటే వెంటనే కనబడతాను'అని తల్లికి మాట ఇచ్చి తపస్సునందే మనస్సును లగ్నం చేశాడు. ఇలా పరాశరునివల్ల సత్యవతికి ద్వైపాయనుడు జన్మించాడు. ద్వీపంలో నివసించడంచేత అతడు ద్వైపాయనుడని పిలువబడ్డాడు.

(అనంతరం సత్యవతి ఆనందించి తన ఇంటికి వెళ్లింది. ఆమెకు యోజన దూరంలో జనులంతా ఆమె పరిమళాన్ని ఆఘ్రాణిస్తున్నారు. దాశరాజు కూడ ఆ పరిమళాన్ని ఆఘ్రాణించి ఆనందించాడు అపుడు దాశరాజిలా అన్నాడు - అమ్మాయీ! నిన్ను మత్స్యగంధ అంటున్నారు కదా! నీకీ సుగంధం ఎలా వచ్చింది? నీ చేపవాసన పోగొట్టి ఈ మంచివాసన నీకెవరిచ్చారు? సత్యవతి ఇలా చెప్పింది - నాయనా! శక్తికి మంచి పండితుడైన ఒక కొడుకున్నాడు. అతనిపేరు పరాశరుడని ప్రసిద్ధి. నావను నడుపుతున్న నన్ను చూచి నా అసహ్యమైన చేపవాసన పోగొట్టి యోజనదూరం వ్యాపించే ఈ సుగంధాన్నిచ్చాడు. ఋషి యొక్క అనుగ్రహాన్ని చూచి జనులంతా సంతోషించారు)

విద్యాంసుడైన ద్వైపాయనుడు యుగయుగానికి ఒక్కొక్క పాదం చొప్పున లోపిస్తున్న ధర్మాన్నీ, మానవులకు లోపిస్తున్న ఆయుశ్శక్తులనూ, యుగాల దురవస్థనూ చూచి, వేదాలను బ్రాహ్మణులను అనుగ్రహింప దలచి వేదాలను విస్తరింప చేశాడు. అందువల్లే అతడు వేదవ్యాసు డని ప్రసిద్ధిపొందాడు. మహాభారతంతో పాటు వేదాలను సుమంతుడు, జైమిని, పైలుడు, తనకుమారుడైన శుకుడు, వైశంపాయనుడు అనేవారికి నేర్పాడు. వారు వేరువేరుగా భారతసంహితను వ్యాప్తిచేశారు. అదేవిధంగా భీష్ముడు శంతనునికి గంగయందు వసువుల తేజస్సుతో, మహాపరాక్రమవంతునిగా మహాకీర్తిమంతునిగా జన్మించాడు.

పూర్వకాలంలో వేదార్థం తెలిసిన, గొప్పకీర్తికల అణీమాండవ్యుడనే పురాతన ఋషి ఉండేవాడు. అతడు చోరుడు కాకున్నా చోరుడని ఆరోపింపబడి శూలారోపంతో మరణించాడు. పరలోకంలో అతడు ధర్ముని పిలిచి ఇలా అన్నాడు. 'యమధర్మరాజా! బాల్యంలో తెలియక నేను ఒక ఇనుపఊచతో చిన్న పక్షిని పొడిచాను. అంతకంటే నేనింక వేరే ఏపాపం చేసినట్లు గుర్తులేదు. నేను వేల సంవత్సరాలు తపస్సు చేశాను. ఆ తపస్సు ఎందువల్ల ఈ పాపాన్ని జయింపలేకపోయింది? అన్ని ప్రాణుల వధకంటె బ్రాహ్మణవధ పెద్దదోషం కదా! ధర్ముడా! అందువల్ల పాపం చేసిన నీవు శూద్ర జన్మ ఎత్తుతావు' అన్నాడు. అతని శాపంచేత ధర్ముడు శూద్రస్త్రీ యందు జన్మించాడు. పాపరహితమైన ధర్ముడు పండితుడగు విదురుని రూపంలో ఆవిర్భవించాడు. మునివంటి సంజయుడు సూతునిగా గవల్గణుని వల్ల జన్మించాడు.

కుంతిభోజుని కూతురు కుంతికి సూర్యునివల్ల మహాబలుడైన కర్ణుడు జన్మించాడు. అతడు సహజమైన కవచకుండలాలతో ప్రకాశించేవాడు. లోకాలన్నీ నమస్కరించే మహాయశస్వి శ్రీమహావిష్ణువు లోకానుగ్రహంకోసం వసుదేవుని ద్వారా దేవకియందు జన్మించాడు. అతడే

ఆద్యంతరహితుడు, జగత్తునకు కర్త, సమర్థుడు, అవ్యక్తుడు, అక్షరుడు, బ్రహ్మ, కారణం, త్రిగుణాత్మకం కూడ. అతడే ఆత్మ, అవ్యయం, ప్రకృతి, కారణం, అధిష్ఠాత, పురుషుడు, విశ్వకర్మ, సత్యయుక్తుడు, నిశ్చలుడు, అక్షరం, అనంతం, అచలం, హంస, నారాయణుడు, ప్రభువు, ధాత, అజుడు, అవ్యక్తం, పరం, అవ్యయం, పురుషుడు, విభుడు, కర్త, సర్వభూత పితామహుడు. ధర్మాన్ని పర్దిల్లజేయడానికి అస్త్రజ్ఞానం, మహాపరాక్రమం, సర్వశాస్త్రపాండిత్యమూ కల సాత్యకి, కృతవర్మలు అంధక, వృష్ణివంశాల్లో జన్మించారు. వారు నారాయణుని అనుచరులు. ఇరువురు అస్త్రవిశారదులు. సత్యకునికి సాత్యకి, హృదికునికి కృతవర్మ జన్మించారు. ఉగ్రమైన తపస్సు చేసే భరద్వాజమహర్షి నుండి స్థలితమైన శుక్రాన్ని ద్రోణియందు భద్రపరిచారు. దానినుండి ద్రోణుడు జన్మించాడు. గౌతమ గోత్రీయుడైన శరద్వంతునికి శరస్తంబం నుండి కవలలు జన్మించారు. అందులో ఒకరు అశ్వత్థామకు తల్లి ఐన కృపి, మరొకరు మహాబలుడైన కృపాచార్యుడూ. ద్రోణునివల్ల మహాబలుడైన అశ్వత్థామ జన్మించాడు. అలాగే ధృష్టద్యుమ్నుడు సాక్షాత్తూ అగ్నితో సమానమైన తేజస్సుకలవాడు. యజ్ఞకర్మమందలి అగ్నిహోత్రం నుండి ద్రోణవినాశనం కోసం పుట్టాడు. అతడు ధనుర్ధారి, పరాక్రమవంతుడు. అదే యజ్ఞవేదికనుండి తేజోవతి, శుభస్వరూప అయిన కృష్ణ(ద్రౌపది) ఉత్తమమైన రూపంతో ప్రకాశించే శరీరంతో జన్మించింది. ప్రహ్లాదుని శిష్యుడైన నగ్నజిత్తు సుబలునిగా జన్మించాడు. అతనికి దేవతల కోపంవల్ల ధర్మకంటకమైన సంతానం కలిగింది. గాంధారరాజైన సుబలునికి అర్థవిశారదులైన శకుని, (దుర్యోధనుని తల్లి ఐన) గాంధారి జన్మించారు.

కృష్ణద్వైపాయనుని వల్ల విచిత్రవీర్యుని భార్యలకు ధృతరాష్ట్రుడు, మహాబలుడైన పాండురాజు జన్మించారు. ద్వైపాయనుని వల్లనే శూద్రస్త్రీయందు విదురుడు జన్మించాడు. అతడు ధర్మార్థకుశలుడు, ధీమంతుడు, మేధావి, పాపరహితుడు. పాండురాజునకు భార్యలిద్దరి యందు దేవసమానులైన ఐదుగురు కుమారులు జన్మించారు. వారిలో యుధిష్ఠిరుడు పెద్దవాడు. ధర్మదేవునివల్ల యుధిష్ఠిరుడు, వాయువువల్ల వృకోదరుడు, ఇంద్రునివల్ల శ్రీమంతుడూ, శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడూ ఐన ధనంజయుడు కలిగారు. అశ్వినీదేవతల వల్ల రూపసంపన్నులైన కవలలు నకులసహదేవులు జన్మించారు. నకులసహదేవు లిద్దరూ పెద్దలను సేవించడంలో ఆసక్తి కలవారు. తెలివిగల ధృతరాష్ట్రునికి దుర్యోధనుడు మొదలయిన నూరుగురు కుమారులు జన్మించారు. ఇంకా కరణుడైన యుయుత్సుడు జన్మించాడు. భారతా! దుఃశాసనుడు, దుఃసహుడు, దుర్మర్షణుడు, వికర్ణుడు, చిత్రసేనుడు, వివింశతి, జయుడు, సత్యవ్రతుడు, పురుమిత్రుడు, వైశ్యపుత్రుడైన యుయుత్సుడు ఈ పదకొండుగురు

మహారథులు. వాసుదేవుని సోదరి కుమారుడు, పాండురాజుకు మనుమడు అయిన అభిమన్యుడు అర్జునుని వల్ల సుభద్రకు జన్మించాడు. పాంచాలి ఐన ద్రౌపదికి పాండవుల వల్ల మంచి రూపంగలిగి, సర్వశాస్త్ర విశారదులు ఐన ఐదుగురు కుమారులు జన్మించారు. వారిలో యుధిష్ఠిరుని వల్ల ప్రతివింధ్యుడు, భీముని వల్ల సుతసోముడు, అర్జునునివల్ల శ్రుతకీర్తి, నకులుని వల్ల శతానీకుడు, సహదేవునివల్ల ప్రతాపవంతుడైన శ్రుతసేనుడూ జన్మించారు. అడవిలో భీమునికి హిడింబయందు ఘటోత్కచుడు జన్మించాడు. ద్రుపదుని వల్ల శిఖండి అను కన్య జన్మించింది. ఆమెకు మేలు చేయగోరి స్థూణుడనే యక్షుడు ఆమెను పురుషునిగా చేశాడు. నాటి కౌరవయుద్ధంలో వందలకొద్దీ, వేలకొద్దీ రాజులు వచ్చి యోధులుగా పాల్గొన్నారు. వారందరి పేర్లన్నీ పదివేల సంవత్సరాలైనా చెప్పటం శక్యం కాదు. వారిలో ముఖ్యులైన వారు మాత్రమే చెప్పబడ్డారు. వారివల్లే ఈ కథ విస్తరించింది.

64. దేవతలను తమ అంశలతో భూమిపై అవతరించమని బ్రహ్మ ఆదేశించుట.

జనమేజయుడిలా అడిగాడు - బ్రాహ్మణోత్తమా! నీవు పేర్కొన్న రాజులను గురించి, ఇంకా పేర్కొనని రాజులను గురించి విశదంగా వినాలని కోరుకొంటున్నాను. మహాభాగా! దేవతుల్యులైన ఆ మహారథులంతా ఈ భూమిమీద ఎందుకోసం పుట్టారో ఆ విషయాన్నంతా సమగ్రంగా చెప్పండి. అపుడు వైశంపాయనుడిలా చెప్పాడు - 'రాజా! అది దేవతలకు సంబంధించిన రహస్య మని మేము విని ఉన్నాం. బ్రహ్మకు నమస్కరించి ఆ రహస్యాన్ని నీకు చెప్తాను. పూర్వం జమదగ్ని కుమారుడైన పరశురాముడు ఇరువది ఒక్కమార్లు భూమిపై క్షత్రియు డనే వానిని లేకుండా చేసి, మహేంద్రపర్వతం మీదకు పోయి తపస్సు చేశాడు. అలా పరశురాముడు క్షత్రియుడు లేకుండా చేయగా, క్షత్రియకాంతలంతా పుత్రార్థినులై బ్రాహ్మణులను శరణువేడారు. నరవ్యాఘ్రా! అపుడు కఠోరనియమాల్ని పాటిస్తూ, బ్రాహ్మణులు కేవలం ఋతుకాలంలో మాత్రమే క్షత్రియ కాంతలతో సంగమించారు. కామవశం వల్లకాని, ఋతుకాలం కానపుడు కాని వారిని కలిసేవారు కాదు. క్షత్రియవంశాభివృద్ధికై వారివల్ల గర్భం పొందిన క్షత్రియ స్త్రీలు మహాబలశాలులైన పుత్రులను, పుత్రికలను కన్నారు. ఈ విధంగా తపస్వులైన బ్రాహ్మణులవల్ల క్షత్రియస్త్రీలయందు ధర్మపూర్వకంగా క్షత్రవంశజననమూ, అభివృద్ధీ జరిగాయి. అనంతరం బ్రాహ్మణప్రధానమైన నాలుగువర్ణాలు స్థిరపడ్డాయి.

పురుషులు ఋతుకాలంలోనే స్త్రీలతో కలిసేవారు. కామవశంవల్ల కాని, ఋతుకాలం కానపుడు కాని సంగమించేవారు కాదు. పశుపక్ష్యాది ప్రాణులన్నీ నియమాన్ని అనుసరించేవి. ఆ విధమైన ధర్మంచేత వందల సంవత్సరాలు జీవించేవారు. రాజా! ఆనాటి ప్రజలు ధర్మవ్రతపరాయణులు. అందుకే ఆధులచేత, వ్యాధులచేత విముక్తు లయ్యారు. తరువాత సముద్రపర్యంతం వ్యాపించి, పర్వతాలతో అడవులతో కూడిన ఈ భూమిపై క్షత్రియ జాతి ఏర్పడింది. క్షత్రియజాతి ఈ భూమిని ధర్మంతో పాలిస్తూండగా బ్రాహ్మణాది వర్ణాలన్నీ మిక్కిలి ఆనందాన్ని పొందాయి. **నాటి ప్రజాపాలకులు కామక్రోధాలవల్ల కలిగే దోషాలను దరిచేరనీయక ధర్మానుసారంగా దండింపదగిన వారిని దండిస్తూ పరిపాలించారు.** ఆ విధంగా రాజు ధర్మపరుడుకాగా ఇంద్రుడు తగినసమయంలో తగిన ప్రదేశంలో వర్షం ద్వారా ప్రజలను రక్షించేవాడు. రాజా! ఆ **నాడు ఒక్కబాలుడూ మరణించలేదు. యౌవనం రాకుండానే ఏ పురుషుడూ స్త్రీ సుఖాన్ని కోరుకోలేదు.** భరతశ్రేష్ఠా! ఇలా సాగరపర్యంతం ఉన్న ఈ భూమండల మంతా దీర్ఘాయుష్మంతు లైన ప్రజలతో నిండి ఉండేది. క్షత్రియులు గొప్పగొప్ప దక్షిణలిస్తూ యజ్ఞాలు చేసేవారు. బ్రాహ్మణులు వేదాలను సాంగోపాంగంగా అధ్యయనం చేసేవారు. రాజా! ఆనాడు బ్రాహ్మణులు వేదవిక్రయాన్ని చేయలేదు. శూద్రుల దగ్గర వేదాన్ని ఉచ్చరించే వారు కాదు. వైశ్యులు ఎద్దులతో వ్యవసాయం చేసేవారు. కృశించిన ఎడ్లపై భారం మోపేవారు కాదు. వాటికి ఆహారాన్నిచ్చి జీవనాన్ని కల్పించేవారు. పాలుత్రాగే దూడ లుండగా పశువులపాలను పిండుకొనేవారు కాదు. వర్తకులు మోసపు కొలతలతో వస్తువులను అమ్మేవారు కాదు. నరోత్తమా! మనుష్యులు ధర్మబద్ధమైన కర్మల నాచరిస్తూ ధర్మపరాయణులై, ధర్మంపట్ల దృష్టిపెట్టి వ్యవహరించేవారు. అన్ని వర్ణాలవారు వారివారి కర్మలను శ్రద్ధగా ఆచరించేవారు. ఈ విధంగా ఆనాడు ధర్మం ఎక్కడా తక్కువ కాలేదు. సకాలంలో ఆవులు ఈనేవి. స్త్రీలు ప్రసవించేవారు. ఆయా ఋతువులలో వృక్షాలు పూలు పూచేవి. ఫలాలు ఇచ్చేవి. ఈ విధంగా కృతయుగంలో చక్కగా ఉండగా ఈ భూమంతా అనేకప్రాణులతో నిండి ఉండేది.

ఈ విధంగా మానవులతో ఈ లోకం ప్రసన్నంగా ఉండగా, క్షత్రియకాంతలకు అసురులు జన్మించారు. ఆదిత్యులచే (అదితికుమారులచే) దైత్యులు పలుమార్లు ఓడింపబడి స్వర్గంనుండి, ఐశ్వర్యంనుండి భ్రష్టులై ఈ భూమిమీద జన్మించారు. అభిమానం గల అసురులు ఈ భూమిమీద ప్రభుత్వాన్ని కోరుకొని, మనుష్యులయందు, ఇతరప్రాణులయందు జన్మించారు. రాజేంద్ర! ఆ అసురులు ఆవులు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, గేదెలు,

మాంసాహారులైన పశువులు, ఏనుగులు, లేళ్లు, ఇలా అన్ని జాతులయందు జన్మించారు. వారందరితో ఈ భూమి తనభారాన్ని తాను మోయలేకపోయింది. భూమిపై జన్మించిన దైత్యులు, దానవులు అయిన కొందరు రాజులు మిక్కిలి గర్వంతో ఉండేవారు. బలవంతులు, గర్విష్ఠులు అయిన ఆ రాజులు శత్రువులను అణచివేస్తూ సాగరపర్యంతమైన ఈ భూమిపై సంచరించేవారు. తమ బలంతో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను, ఇతరప్రాణులను హింసించసాగారు. ప్రాణులందర్నీ భయపెడుతూ, హింసిస్తూ భూమండల మంతా పలుమార్లు తిరగసాగారు. వారు వేదబ్రాహ్మణ విరోధులై బలగర్వంతో, అహంకారంతో ఇటూ అటూ తిరుగుతూ ఆశ్రమాలలో ఉన్న మహర్షులను కూడా అవమానింపసాగారు.

అసురులు బలగర్వంతో పెద్ద ప్రయత్నంతో బాధించగా భూమి బ్రహ్మను శరణువేడింది. ఈ ప్రాణిసమూహాలన్నీ పర్వతవనాలతో ఉన్న ఈ భూమిపై దానవుల ప్రాబల్యం వల్ల జీవించలేకపోయాయి. రాజా! అపుడు భయపీడితురాలైన ఈ భూమి దేవద్విజ మహర్షులతో కలిసి సర్వభూతపితామహుడు, లోకకర్త అయిన బ్రహ్మదేవుని దర్శించింది. దేవ కర్మలలో నిమగ్నమైన గంధర్వులు అప్సరలు నమస్కరిస్తూండగా, భూమి బ్రహ్మకు నమస్కరించింది. లోకపాలురందరి సంనిధిలో శరణు కోరి వచ్చిన భూమి ఇలా విన్నవించుకొంది. సర్వకారణస్వరూపుడైన బ్రహ్మకు భూమి కోరే పని ముందే అవగత మయింది. ఈ జగత్తంతటికి కర్తయైన బ్రహ్మ సమస్త సురాసురలోకాల మనోగతాన్ని ఎందుకు తెలియలేడు ? భూమికి రక్షకుడు, ప్రభువు, సర్వభూతాల ఉత్పత్తికి కారణుడు, అధీశ్వరుడు, ప్రజాపతి అయిన బ్రహ్మ ఆమెతో ఇలా అన్నాడు. 'వసుంధరా! నీవు ఏ పనిమీద నాదగ్గరకు వచ్చావో ఆ పని కోసం దేవతలందర్నీ నియోగిస్తాను.'

ఆ విధంగా పలికి బ్రహ్మ భూమిని సాగనంపి, సమస్తదేవతలను ఇలా ఆజ్ఞాపించాడు - దేవతలారా! ఈ భూమి భారాన్ని తగ్గించడానికి అసురులతో విరోధించడానికై మీరు మీమీ అంశలతో వేరువేరు చోట్ల భూమిపై జన్మించండి. అదేవిధంగా గంధర్వులను, అప్సరలను పిలిపించి అర్థవంతమైన వచనాన్ని చెప్పాడు. 'మీమీ అంశలతో మానవులలో యథేచ్ఛగా జన్మించండి'. అలా అనగానే శక్రాదులు తథ్యమూ, అర్థసాధకమూ, పథ్యమూ అయిన బ్రహ్మమాటను స్వీకరించారు. అటుపై వారు వారివారి అంశలతో భూమిపై జన్మించటానికి శత్రుసంహారియైన నారాయణుని వైకుంఠానికి వెళ్లారు. ఆ నారాయణుడు చక్రగదాపాణి, పీతాంబరుడు. నీలకాంతికలవాడు, పద్మనాభుడు, దేవతల శత్రువులను చంపేవాడు, విశాలమైన అందమైన చూపులు గలవాడూను. ప్రజాపతులకే ప్రభువు. దేవతలందరికి నాథుడు. మహాబలుడు, శ్రీవత్సాంకుడు, హృషీకేశుడు, దేవతలందరిచే

పూజింపబడుతున్నవాడు. అట్టి పురుషోత్తముని సమీపించి ఇంద్రుడు 'ప్రభూ! భూభారాన్ని తగ్గించడానికి మమ్ములను అంశతో అవతరించుటకు అనుమతించండి' అని ప్రార్థించాడు, అపుడు శ్రీహరి 'అలాగే' అని వారి ప్రార్థనను అంగీకరించాడు.

65. మరీచి, మున్నగు మహర్షుల, దక్ష కన్యకల వంశవివరణము.

వైశంపాయనుడిలా చెప్పాడు - 'తరువాత దేవతలందరితో బాటు ఇంద్రుడు శ్రీమహావిష్ణువుతో స్వర్గం నుండి భూమిపై అవతరించడానికి అనుజ్ఞ తీసికొన్నాడు. ఇంద్రుడు దేవతలందరిని ఆదేశించి నారాయణుని నివాసం నుండి నిష్క్రమించాడు. ఆ దేవతలందరూ తమ శత్రువులైన అసురుల వినాశంకోసమూ, సర్వలోక హితంకోసమూ క్రమంగా స్వర్గం నుండి భూమిపై అవతరించారు. దేవతలు వారి వారి ఇచ్ఛానుసారంగా బ్రహ్మర్షుల వంశాలలోను, రాజర్షుల వంశాలలోను జన్మించారు. వారు దానవులను, రాక్షసులను, దుష్టగంధర్వులను, సర్పాలను, మానవులను భక్షించే ఇతర ప్రాణులను పలుమార్లు సంహరించారు. బలవంతులైన వారు బాల్యంలో ఉన్నా దానవులు, రాక్షసులు, గంధర్వులు నాగులు ఏమీ చెయ్యలేకపోయారు.'

జనమేజయుడిలా అడిగాడు - 'దేవతలు, దానవులు, గంధర్వులు, అప్సరసలు, మానవులు, యక్షులు, రాక్షసులు మొదలయిన సర్వప్రాణుల జన్మప్రకారాన్ని పూర్తిగా నీవు చెపితే వినాలని ఉంది.' వైశంపాయనుడిలా అన్నాడు - 'పూజ్యుడైన స్వయంభూ బ్రహ్మకు నమస్కరించి, దేవతాదుల ఉత్పత్తి వినాశాదుల గురించి సమగ్రంగా చెప్తాను. బ్రహ్మ మానసపుత్రులు మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే ఆరుగురు మహర్షులు ప్రసిద్ధులు. వారిలో మరీచికి కశ్యపుడనే కుమారు డున్నాడు. ఆ కశ్యపునకే ఈ ప్రజలందరూ జన్మించారు. బ్రహ్మకు దక్షుడనే కొడు కున్నాడు. అతనికి సౌభాగ్యశీలవతులైన పదముగ్గురు కూతుళ్లున్నారు. అదితి, దితి, దనువు, కాల, దనాయువు, సింహిక, క్రోధ, ప్రాధ, విశ్వ, వినత, కపిల, ముని, కద్రువ, అను పదముగ్గురు దక్షుని కూతుళ్లు. వీరికి బలపరాక్రమాలు గల పుత్రులు జన్మించారు. అదితికి లోకపాలురైన పన్నెండుగురు ఆదిత్యులు జన్మించారు. వారి పేర్లు పేర్కొంటాను. ధాత, మిత్రుడు, అర్యముడు, శక్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు, వివస్వంతుడు, పూష, సవిత, త్వష్ట, విష్ణువు. వీరందరిలో చిన్నవాడు విష్ణువు ఆదిత్యులందరి కంటె గుణాధికుడు. దితికి హిరణ్యకశిపు డనే ఒక్కపుత్రుడు మాత్రమే కలిగాడు. అతనికి మహాత్ములైన ఐదుగురు పుత్రులు కలిగారు. వారిలో పెద్దవాడు ప్రహ్లాదుడు. రెండవవాడు సంహ్లాదుడు.

మూడవవాడు అనుహ్లాదుడు. నాల్గవవాడు శిబి. ఐదవవాడు బాష్కలుడు. ప్రహ్లాదునికి విరోచనుడు, కుంభుడు, నికుంభుడు అను ముగ్గురు పుత్రులు కలిగారు. విరోచనుడికి ప్రతాపవంతుడైన బలి అనే ఒక పుత్రుడు జన్మించాడు. ఆ బలికుమారుడు బాణుడు మహాసురుడని ప్రసిద్ధుడు. శ్రీమంతుడైన అతడు రుద్రునికి అనుచరుడు. మహాకాలుడని ప్రసిద్ధుడు. ఇక దనువుకు ముప్పది నలుగురు పుత్రులు కలిగారు.

రాజా! వారిలో మహాయశస్వి ఐన విప్రచిత్తి అందరికంటె పెద్దవాడు. తరువాత శంబరుడు, నముచి, పులోముడు, అసిలోముడు, కేశి, దుర్జయుడు, అయఃశిరుడు, అశ్వశిరుడు, అశ్వశంకువు, గగనమూర్ధుడు, వేగవంతుడు, కేతుమంతుడు, స్వర్భానుడు, అశ్వుడు, అశ్వపతి, వృషపర్వుడు, అజకుడు, అశ్వగ్రీవుడు, సూక్ష్ముడు, తుహుండుడు, ఇషుపాదుడు, ఏకచక్రుడు, విరూపాక్షుడు, హరుడు, అహరుడు, నిచంద్రుడు, నికుంభుడు, కుపటుడు, కపటుడు, శరభుడు, శలభుడు, సూర్యుడు, చంద్రుడు – ఈ ముప్పది నలుగురు దనువంశంలో జన్మించినవారు, దానవులు. దేవతలలోని సూర్యచంద్రులు వేరు. దానవ ముఖ్యులలోని సూర్యచంద్రులు వేరు. ధైర్యవంతులు, బలవంతులు అయిన ఈ దనుపుత్రుల వంశాలు ప్రసిద్ధాలు, దానవవంశంలో పుట్టిన పదిమంది దనుజులు ప్రసిద్ధులు. ఏకాక్షుడు, మృతపుడు, ప్రలంబుడు, నరకుడు, వాతాపి, శత్రుతపనుడు, శఠుడు, గవిష్ఠుడు, వనాయువు, దీర్ఘజిహ్వుడు అనే వారు ప్రసిద్ధులు. వారికి పుత్రులు, పౌత్రులు లెక్కించలేనంతమంది. దక్షకన్య సింహిక సూర్యచంద్రులను హింసించే రాహువును కన్నది. అదేవిధంగా సుచంద్రుడు, చంద్రహర్త, చంద్ర ప్రమర్దనుడు అనే పుత్రులనూ కన్నది. క్రూరకు (క్రోధ) క్రూరస్వభావం గల పలువురు పుత్రులు, పౌత్రులు జన్మించారు. శత్రువులను అణచివేయగల క్రూరకర్ములు క్రోధవశులు, అనే సంతాన గణాన్ని కన్నది. దనాయువుకు విక్షరుడు, బలుడు, వీరుడు, వృత్రుడు అనే నలుగురు మహాసురులు కొడుకులు అయ్యారు. కాలకు అస్త్రశస్త్రాల్లో ఆరితేరి కాలునితో సమానమైన పుత్రులు కలిగారు. వారు దానవులలో ప్రసిద్ధులూ, పరాక్రమవంతులూ, శత్రువులను నాశనం చేయగలవారూ అయ్యారు. వారిలో వినాశనుడు, క్రోధుడు, క్రోధహంత, క్రోధశత్రువు అనేవారు ప్రసిద్ధులు. ఇంకా కాలకేయులని ప్రసిద్ధిగల అసురులు కూడ కాలయొక్క పుత్రులే. అసురులకు ఉపాధ్యాయుడైన శుక్రుడు భృగు మహర్షికుమారుడు. అతనిని ఉశనసుడనికూడా అంటారు. అతనికి నలుగురు పుత్రులున్నారు. వారు అసురులకు పురోహితులు. తక్కిన శుక్రుని కుమారులు త్వష్టాధరుడు, అత్రి అనువారు. మిగిలిన వారిద్దరూ రౌద్రకర్మలు చేసేవారు, చేయించేవారు కూడ. ఉశనసుని కుమారులంతా

సూర్యునితో సమంగా ప్రకాశించేవారు, బ్రహ్మలోక పరాయణులు కూడ.

రాజా! పురాణాలలో విన్నరీతిగా దేవతల యొక్క తీవ్రస్వభావులైన అసురుల యొక్క జన్మవృత్తాంతాన్ని నీకు చెప్పాను. రాజా! వారి సంతానాన్ని గురించి పూర్తిగ చెప్పడం సాధ్యంకాదు. అనంతమైన ఆ వృత్తాంతమంతా చెప్పడానికి అంతప్రధానమైంది కూడా కాదు. తార్క్ష్యుడు, అరిష్టనేమి, గరుడుడు; అరుణుడు, ఆరుణి, వారుణి వినతాపుత్రులుగా ప్రసిద్ధులు. శేషుడు, అనంతుడు, వాసుకి, తక్షకుడు, కూర్ముడు, కులికుడు కద్రువపుత్రులు. రాజా! భీమసేనుడు, ఉగ్రసేనుడు, సుపర్ణుడు, వరుణుడు, గోపతి, ధృతరాష్ట్రుడు, సూర్యవర్చసుడు, సత్యవాక్కు, అర్కపర్ణుడు, ప్రయుతుడు, భీముడు, సర్వజ్ఞుడు, జితేంద్రియు డయిన చిత్రరథుడు, శాలిశిరుడు, పర్జన్యుడు, కలి, నారదుడు ఈ పదునార్గురు దేవగంధర్వ జాతులవారు మునిగర్భం నుండి జన్మించారు. ఇక తక్కిన వంశాలను గురించి చెప్తాను. దక్షకన్య అయిన ప్రాధ అనవద్య, మనువు, వంశ, అసుర, మార్గణప్రియ, అరూప, సుభగ, భాసి అను కన్యలను కన్నది. సిద్ధుడు, పూర్ణుడు, బర్హి, మహాయశస్వి, పూర్ణాయువు, బ్రహ్మచారి, రతిగుణుడు, సుపర్ణుడు, విశ్వావసువు, భానువు, సుచంద్రుడు అను పదిమంది దేవగంధర్వజాతుల వారు ప్రాధకు జన్మించిన కుమారులు. ఇంతేకాక ప్రాధ కశ్యప మహర్షి వల్ల ప్రసిద్ధులైన శుభలక్షణాలున్న అప్సర స్త్రీలకు జన్మ నిచ్చింది. అలంబుష, మిశ్రకేశి, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అరుణ, రక్షిత, రంభ, మనోరమ, కేశిని, సుబాహు, సురత, సరజ, సుప్రియ అనేవారు ప్రాధకు జన్మించిన వారే. అతిబాహువు, హాహా, హూహూలు, తుంబురుడు ఈ నలుగురు ప్రాధ సంతానమే. అమృతం, బ్రాహ్మణులు, గోవులు, గంధర్వులు, అప్సరసలు కపిలయొక్క సంతానంగా పురాణ ప్రసిద్ధమైంది. ఈ విధంగా గంధర్వులు, అప్సరసలు, సర్పాలు, సుపర్ణులు, రుద్రులు, మరుత్తులు, గోవులు, బ్రాహ్మణులు మొదలైన సమస్త ప్రాణుల ఉత్పత్తిని ఉన్నదున్నట్లుగా చెప్పాను. **ఆయుర్దాయకం, పుణ్యప్రదం, ధన్యం, శ్రుతిసుఖావహం, శ్రోతవ్యం అయిన ఈ వృత్తాంతాన్ని, వినాలి, వినిపించాలి. దోషదృష్టి లేకుండా వినాలి. మహాత్ముల వంశోత్పత్తిని గురించి బ్రాహ్మణ దేవ సన్నిధిలో చదివినవారు సంతానం, పుష్కలమైన ధనం, కీర్తి పొందగలరు. మరణానంతరం ఉత్తమ గతిని పొందుతారు.'**

66. మహర్షుల - కశ్యపపత్నుల సంతానము.

వైశంపాయనుడిలా చెప్పాడు - 'బ్రహ్మమానస పుత్రులైన ఆరుగురు మహర్షులు నీకు తెలుసు కదా! వారిలో పరమతేజస్వి ఐన స్థాణువునకు పదకొండుగురు కొడుకులు ఉన్నారు. మృగవ్యాధుడు, సర్పుడు, నిర్ఋతి, అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, పినాకి, దహనుడు, ఈశ్వరుడు, కపాలి, స్థాణువు, భవుడు - ఈ పదకొండుగురు స్థాణుకుమారులు, రుద్రులుగా ప్రసిద్ధులు. మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు- ఈ ఆరుగురు తేజస్సులూ, మహర్షులూ అయిన బ్రహ్మ పుత్రులు. రాజా! అంగిరసునకు బృహస్పతి, ఉతథ్యుడు, సంవర్తకుడు అనే ముగ్గురు కొడుకులు. వీరు లోకప్రసిద్ధులు, దృఢవ్రతులు. అత్రికి చాలమంది పుత్రులున్నారని వినికిడి. వారంతా కూడా వేదవేత్తలు, శాంతస్వభావులు, మహర్షులూ కూడ. నరశ్రేష్ఠా! బుద్ధిమంతుడైన పులస్త్య మహర్షికి రాక్షసులు, వానరులు, కిన్నరులు, యక్షులు పుత్రులుగా జన్మించారు. రాజా! పులహునికి శరభ, సింహ, కింపురుష, వ్యాఘ్ర, ఋక్ష, ఈహామృగాలు పుత్రులుగా జన్మించారు. క్రతువునకు క్రతుసమాన పవిత్రులూ, సూర్యునితో బాటు సంచరింపగలవారూ వాలఖిల్యులని త్రిలోక ప్రసిద్ధులై సత్యవ్రత పరాయణులైన పుత్రులు జన్మించారు. రాజా! బ్రహ్మయొక్క కుడిచేతి బొటనవ్రేలి నుండి మహర్షి దక్షుడు జన్మించాడు. అతడు శాంత స్వభావుడు, మహాతపస్వి. బ్రహ్మయొక్క ఎడమచేతి బొటనవ్రేలినుండి పుట్టిన కన్య దక్షునికి భార్య అయింది. ఆమెకు దక్షునివల్ల ఏభైమంది కన్యలు పుట్టారు. కొడుకులు లేని దక్షప్రజాపతి ఆ కన్యక లందర్ని తనవద్దనే ఉంచుకొన్నాడు. వారంతా అందమైనవారు, పద్మాలవంటి కన్నులు కలవారు. ఆ దక్షుడు పదిమంది కన్యలను ధర్మున కిచ్చాడు. చంద్రునికి ఇరవై ఏడుగురు కన్యల నిచ్చాడు. కశ్యపునకు పదముగ్గురు కన్యలను దివ్యవిధిప్రకారంగా ఇచ్చాడు. ధర్మునకు కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, బుద్ధి, లజ్జ, మతి అనే పదిమంది ధర్మపత్నులుగా ఉన్నారు. బ్రహ్మ ఈ పదిమందిని ధర్మానికి ద్వారాలుగా నిర్ణయించాడు.

చంద్రుని ఇరువది ఏడుగురు భార్యలు(27 నక్షత్రములుగా) లోక ప్రసిద్ధులు. పవిత్రలైన వారు కాలాన్ని నడపటానికి నియోగింపబడ్డారు. లోకయాత్రా విధానం కోసం వీరంతా నక్షత్ర నామాలతో వ్యవహరింపబడ్డారు. పితామహుడైన బ్రహ్మయొక్క వక్షఃస్థలం నుండి పుట్టడం వల్ల ధర్మదేవుని బ్రహ్మపుత్రునిగా వ్యవహరించారు. అతనికి అష్టవసువులు పుత్రులుగా జన్మించారు. వారి వృత్తాంతం విస్తారంగా చెప్తాను. ధరుడు, ధ్రువుడు, సోముడు, అహస్సు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసులనే

పుత్రులు అష్టవసువులుగా చెప్పబడ్డారు. ధూమ్రకు ధరుడు, బ్రహ్మవేత్త అయిన ధ్రువుడు అనే ఇద్దరూ పుత్రులు. చంద్రుడు మనస్విని కొడుకు. శ్వాసకు శ్వసనుడు జన్మించాడు. రతకు అహుడు, శాండిల్యకు హుతాశనుడు, ప్రభాతకు ప్రత్యూషుడు, ప్రభాసుడు జన్మించారు. ధరునికి ద్రవిణుడు, హుతహవ్యవహుడు (అగ్ని) అను పుత్రులున్నారు. ధ్రువునికి లోకులందరికి తిండిని కల్పించే పూజ్యుడైన కాలు డనే పుత్రుడు కలిగాడు. సోముని వల్ల మనోహరకు వర్చసు డనే కొడుకు కలిగాడు. అతనివల్ల మానవుడు వర్చస్వి అవుతున్నాడు. ఇంకా మనోహరకు శిరుడు, ప్రాణుడు, రమణుడు అని ముగ్గురు కుమారులు కలిగారు. అహస్సుకు జ్యోతిస్సు, శముడు, శాంతుడు, ముని అని నలుగురు కుమారులు పుట్టారు. అగ్నికి రెల్లువనం నివాసంగా కల శ్రీమంతుడైన కుమారుడు (స్కందుడు) జన్మించాడు. అతనికి శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు అనేవారు తమ్ముళ్లు. ఆరుగురు కృత్తికలు ఆదరించటంచేత కుమారుని కార్తికేయుడని కూడా అంటారు. అనిలుని భార్య శివ. ఆమెకు మనోజవుడు, అవిజ్ఞాతగతి అని ఇరువురు కుమారులు కలిగారు. ప్రత్యూషునికి దేవలుడనే కుమారుడు జన్మించాడు. అతనికి సహనశీలులు, బుద్ధిమంతులూ అయిన ఇద్దరు కొడుకులు కలిగారు. బృహస్పతికి బ్రహ్మవాదిని, స్త్రీ రత్నం అనదగిన సోదరి ఉంది. ఆమె యోగాసక్తురాలు. లోకవ్యవహారమందు అనాసక్తురాలూను. ఆమె అష్టవసువులలో ఎనిమిదివాడగు ప్రభాసుని భార్య.

పూజ్యుడైన విశ్వకర్మ శిల్పసృష్టికర్త. వేలకొద్దీ శిల్పాలను నిర్మించాడు. దేవతల శిల్పి అతడు. అతడు అన్ని భూషణాలను చేసేవాడు. శిల్పులలో శ్రేష్ముడు. దేవతలకు దివ్యవిమానాల నతడే నిర్మించాడు. మనుష్యులు ఆ విశ్వకర్మ యొక్క శిల్పాన్ని ఆశ్రయించి, జీవనయాత్ర సాగిస్తున్నారు. అవ్యయుడైన ఆ విశ్వకర్మను మనుష్యులు పూజిస్తున్నారు. బ్రహ్మయొక్క కుడి తొమ్మును చీల్చుకొని ధర్ముడు మానుషరూపంలో బయటకు వచ్చాడు. అతడు మానవులందరికి సుఖాన్ని కలిగిస్తాడు. అతనికి ప్రాణులన్నింటిలో మనోహరులైన శముడు, కాముడు, హర్షుడు అనే ముగ్గురు కుమారులున్నారు. వారు తమ తేజస్సుతో ఈ జగత్తును పోషిస్తున్నారు. కాముని భార్య రతి. శముని భార్య ప్రాప్తి. హర్షుని భార్య నంద. ఈ ముగ్గురు లోకమంతా వ్యాపించి ఉన్నారు. మరీచి కుమారుడు కశ్యపుడు. అతని కుమారులు సురాసురులు. అందువల్ల కశ్యపుడు ఈ లోకా లన్నింటికి కారణమైనవాడు. త్వష్ట కూతురయిన సంజ్ఞ సూర్య భగవానుని ధర్మపత్ని. ఆమె మిక్కిలి సౌభాగ్యవతి. ఆమె వడవా (ఆడ గుఱ్ఱం) రూపాన్ని ధరించి, అంతరిక్షంలో సంచరిస్తూ ఇద్దరు అశ్వినీ కుమారులను కన్నది. అదితికి ఇంద్రాదులు పన్నెండుగురు కుమారులు ఉన్నారు. వారిలో

చిన్నవాడు విష్ణువు. అతనియందే ఈ లోకాలన్నీ ప్రతిష్ఠితా లయి ఉన్నాయి.

ఈ విధంగా అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ప్రజాపతి, వషట్‌కారుడు మొత్తం ముప్పది ముగ్గురు దేవతలు. వారి పక్షాలను, కులాలను, గణాలను గూర్చి వివరిస్తాను. రుద్రులు, సాధ్యులు, మరుత్తులు, వసువులు, వేరు వేరు గణాలు, ఇదే విధంగా భార్గవుడు, విశ్వేదేవతలు వేరువేరు గణాలు. వినతా కుమారుడు గరుడుడు బలవంతుడు. అరుణుడు, బృహస్పతి ఆదిత్య గణంలోని వారే. అశ్వినులు, సర్పోషధాలు, పశువులు గుహ్యక పక్షంలోని వారు. రాజా! ఈ దేవ గణాలను గూర్చి క్రమంగా నీకు వివరిస్తాను. వారిని కీర్తించడం వల్ల మానవుడు సమస్త పాపాలనుండి విడుద లౌతాడు. పూజ్యు డయిన భృగుమహర్షి బ్రహ్మ హృదయాన్ని చీల్చుకొని బయటకు వచ్చాడు. భృగువు కుమారుడు విద్వాంసుడు కవి. ఆ కవి కుమారుడు శుక్రుడు, ఇతడు గ్రహరూపంలో ఈ ముల్లోకాలలోని జీవుల జీవయాత్రారక్షణకొఱకు వృష్టి అనావృష్టులను, భయాభయాలను కలిగిస్తూ ఉంటాడు. స్వయంభువు అయిన బ్రహ్మ ప్రేరణతో అతడు సమస్త లోకాలలోను సంచరిస్తూ ఉంటాడు. మహాబుద్ధిమంతుడు, యోగాచార్యుడూ అయిన శుక్రుడు దైత్యులకు గురు వయ్యాడు. యోగబలం కల మేధావి, బ్రహ్మచారి, నియమపరాయణుడూ అయిన బృహస్పతి రూపంలో అతడే దేవతలకు కూడా గురువయ్యాడు. ఆ విధంగా శుక్రుడు, బ్రహ్మచేత లోకరక్షణార్థం నియోగింపబడగా, భృగువు మరో ఉత్తముడైన కొడుకును కన్నాడు. అతనివేరు చ్యవనుడు. అతడు తపః ప్రకాశం కలవాడు. ధర్మాత్ముడు, యశస్వి. అతడు తల్లిని కష్టాలనుండి విముక్తి చేయడానికి రోషంతో గర్భంనుండి వెలుపలికి వచ్చాడు. (అందుకే అతనిని చ్యవనుడన్నారు). మనువు కూతురైన ఆరుషి బుద్ధిమంతుడైన చ్యవనుడికి భార్య అయింది. ఆమె తొడను చీల్చుకుని మహాయశస్వి అయిన ఔర్వుడు జన్మించాడు. (ఊరువు నుండి పుట్టడం వల్ల అతనిని ఔర్వుడన్నారు). అతడు గొప్ప తేజస్సంపన్నుడు, మహాబలుడు, బాలు డైనా సద్గుణసంపన్నుడు. అతని కుమారుడు ఋచీకుడు. అతని కుమారుడు జమదగ్ని. జమదగ్ని మహర్షికి నలుగురు కుమారు లున్నారు. వారిలో అందరికంటె చిన్నవాడు (పరశు)రాముడు. అతడు చిన్నవాడైనా ఉత్తమగుణసంపన్నుడు. అన్ని శస్త్రాలయందు నిపుణుడు. క్షత్రియులను అంతమొందించినవాడు. జితేంద్రియుడు కూడాను. ఔర్వమునికి జమదగ్ని మున్నగు నూరుగురు కుమారులున్నారు. వారికి వేయిమంది పుత్రులు కలిగారు. ఈ విధంగా భూమండలమంతా భృగువంశసంతతి వ్యాపించింది. బ్రహ్మకు ధాత, విధాత అని మరో ఇద్దరు కొడుకులున్నారు. వారి వల్లనే ఈ లోకంలో నిరంతరాయంగా ప్రాణులపుట్టుక,

ధారణ, పోషణ జరుగుతోంది. వారు మనువుతో పాటు ఉండేవారు. వారి యొక్క సోదరి లక్ష్మి. శుభలక్షణాలుగల ఆమెకు కమలం నివాసస్థానం. ఆకాశంలో సంచరించే తురగాలు ఆమెకు మానసపుత్రులు. వరుణునికి జ్యేష్ఠ అనే భార్య యందు బలుడనే పుత్రుడూ, సురనందిని అయిన 'సుర' అనే పుత్రిక జన్మించారు. అన్నకాముకులైన ప్రజలు అన్నార్తులై ఒకరినొకరు భక్షించే పరిస్థితి వచ్చినపుడు, సర్వప్రాణికోటి వినాశకమైన అధర్ముడు పుట్టాడు. ఆ అధర్మునికి నిర్ఋతి భార్య. ఆమెకు నైర్ఋతులనే భయంకర రాక్షసులు జన్మించారు. వారు నిరంతరం పాపకర్మల పట్ల ఆసక్తి కలిగి ఉండేవారు. వారి పేర్లు - భయం, మహాభయం, మృత్యువు. మృత్యువు ప్రాణులను అంతమొందిస్తాడు. వానికి భార్యా పుత్రులు లేరు. తామ్ర కాకి, శ్యేని, భాసి, ధృతరాష్ట్రి, శుకి అనే లోక విఖ్యాతలైన ఐదుగురు కన్యలను కన్నది. కాకి ఉలూకాలను, శ్యేని శ్యేనా (డేగ)లను, భాసి మృగాలను, గ్రద్దలను ప్రసవించింది. ధృతరాష్ట్రి హంసలకు, కలహంసలకు, చక్రవాకాలకు జన్మనిచ్చింది. శుకి శుభప్రదగుణాలు కలది. సర్వలక్షణాల చేత పూజింపదగింది. ఆమె యశస్విని. ఆమె శుకాలకే జన్మనిచ్చింది. క్రోధవశ క్రోధసంభవలైన మృగి, మృగమంద, హరి, భద్రమనస్విని, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సర్వలక్షణసంపన్న మైన సురస అనే తొమ్మండుగురు కూతుళ్ళకు జన్మనిచ్చింది. రాజా! మృగియొక్క సంతానం మృగాలు; మృగమంద సంతానం ఎలుగుబంట్లు, చమరీమృగాలు; భద్రమనస్విని ఐరావత మనే ఏనుగును కన్నది. అది దేవగజ మైన ఐరావతంగా ప్రసిద్ధి పొందింది. రాజా! గుర్రాలు, వానరాలు, పెద్దతోకగల కోతులు, (కొండముచ్చులు) హరి యొక్క సంతానం; సింహాలు, అన్నిరకాల పులులూ మొదలయిన పెద్ద జంతువులన్నీ శార్దూలియొక్క సంతానం. ఏనుగులన్నీ మాతంగి సంతానం. తెల్లని దిగ్గజాలు శ్వేత యొక్క సంతానం. సురభికి రోహిణి, గంధర్వి అని ఇద్దరు కూతురులు. వారిలో గంధర్వి యశస్విని. రోహిణికి విమల, అనల అనే ఇద్దరు కూతురు లున్నారు. రోహిణి గోవులకు జన్మ నిచ్చింది. గంధర్వి గుర్రాలకు జన్మ నిచ్చింది. అనల పిండఫలాలు గల ఏడు వృక్షాలకు జన్మ నిచ్చింది. అనలకు శుకి అనే కూతురు ఉంది. సురసకు కంకపక్షి జన్మించింది. అరుణుని భార్య శ్యేని పరాక్రమవంతులు, మహాబలులు అయిన ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చింది. వారిద్దరూ సంపాతి, జటాయువూను. సురస నాగాలకు, కద్రువ పన్నగాలకు జన్మనిచ్చారు. వినతకు గరుడుడు, అరుణుడు అని ఇద్దరు లోక విఖ్యాతులైన పుత్రులున్నారు. సురస ఒక శిరస్సు గల సర్పాలను నూరింటిని కన్నది. ముగ్గురు కన్యలకు జన్మనిచ్చింది. వారే వనస్పతులైన వృక్షాలకు, లతాగుల్మాలకు తల్లులు. వారికి అనల, రుహ, వీరుధములని పేర్లు. పువ్వులు లేకుండా

పళ్లు కాసే వృక్షాలను **వనస్పతు లంటారు.** అవన్నీ అనలయొక్క సంతానంగా భావించాలి. లతలు, గుల్మాలు, తీగలు, త్వక్సారంగల తృణాలు వీరుధ యొక్క సంతానంగా భావించాలి. ఇంతటితో వంశవర్ణన పూర్తయింది. నరాధిపా! ఈ విధంగా సర్వభూతాలయొక్క ఉత్పత్తి వివరించాను. దీన్ని విన్నవాడు పాపాలనుండి ముక్తుడౌతాడు. సర్వజ్ఞత్వాన్ని పొందుతాడు. ముందు ముందు ఉన్నత (స్థితిని) గతిని పొందుతాడు.'

67. దేవతల, దైత్యుల అంశావతారముల వర్ణన.

జనమేజయుడిలా అన్నాడు. 'దేవతలు, దానవులు, గంధర్వులు, ఉరగాలు, రాక్షసులు, సింహవ్యాఘ్రమృగాలు, పన్నగాలు, పక్షులు మొదలయిన అన్ని ప్రాణుల పుట్టుకను, వారి కర్మలను, మనుష్యులలో మహాత్ముల జన్మకర్మలను యథార్థంగా ఆనుపూర్విగా వినాలనుకొంటున్నాను.' వైశంపాయనుడిలా చెప్పాడు - 'రాజా! మానవులలో పుట్టిన దేవతలను గురించి దానవుల గురించి ముందుగా చెప్తాను. విప్రచిత్తి అని ఒకానొక ప్రఖ్యాతమైన దానవరా జుండేవాడు. అతడు మానవులలో జరాసంధునిగ జన్మించి ప్రసిద్ధి పొందాడు. దితికుమారుడైన హిరణ్యకశిపుడు మానవులలో శిశుపాలునిగ జన్మించాడు. ప్రహ్లాదుని తమ్ముడు సంహ్లాదుడు బాహ్లికశ్రేష్ఠుడైన శల్యునిగా జన్మించాడు. ప్రహ్లాదుని మరొక తమ్ముడు తేజస్వి ఐన అనుహ్లాదుడు ధృష్టకేతువుగా జన్మించి రాజుగా ప్రసిద్ధి కెక్కాడు. రాజా! దితి కుమారుడై ప్రసిద్ధు డయిన శిబి ఈ భూమిపై ద్రుముడనే రాజుగా విఖ్యాతి చెందాడు. అసురశ్రేష్ఠుడైన బాష్కలుడు భగదత్తుడనే రాజుగా జన్మించాడు. ఆయుఃశిరుడు, అశ్వశిరుడు, పరాక్రమవంతుడైన అయుఃశంకువు, గగనమూర్ధుడు, వేగవంతుడు అనే ఐదుగురు మహాసురులు కేకయదేశంలో మహారాజులుగా జన్మించారు. కేతుమంతుడనే మహాసురుడు అమితౌజసుడనే మహారాజుగా జన్మించి క్రూరకర్మలు చేసేవాడు. స్వర్భానువుగా ప్రసిద్ధినొందిన మహాసురుడు ఉగ్రకర్ముడైన ఉగ్రసేనునిగా జన్మించాడు. అశ్వ డనే పేరుగల మహాసురుడు మహాబలవంతుడు, ఓటమిలేనివాడూ అయిన అశోకునిగా జన్మించాడు. అతని తమ్ముడైన అశ్వపతి హార్దిక్యుడనే రాజుగా జన్మించాడు. వృషపర్వ డనే మహాసురుడు భూమిపై దీర్ఘప్రజ్ఞ డనే రాజుగా జన్మించాడు. వృషపర్వుని తమ్ముడయిన అజకుడు భూమిపై సాల్వునిగా జన్మించాడు. అశ్వగ్రీవు డనే రాక్షసుడు రోచమాను డనే రాజుగా జన్మించాడు. కీర్తిమంతుడైన సూక్ష్ముడు బృహద్రథునిగా జన్మించాడు. తుహుండు డనే రాక్షసుడు సేనాబిందు డనే రాజుగా జన్మించాడు. అసురులలో బలాధికుడైన ఇషుపాదుడు భూమిపై పరాక్రమవంతుడైన నగ్నజిత్తు అనే రాజుగా జన్మించాడు. ఏకచక్రు డనే మహాసురుడు

ప్రతివింధ్యు డనే రాజుగా జన్మించాడు. చిత్రయోధుడైన విరూపాక్షు డనే రాక్షసుడు చిత్రధర్ము డనే రాజుగా జన్మించాడు. శత్రుంజయుడైన హరు డనే దానవోత్తముడు సుబాహు వనే రాజుగా జన్మించాడు. శత్రువిమర్దనుడు, తేజోవంతుడూ అయిన అహరు డనే రాక్షసుడు బాహ్లీకు డనే రాజుగా జన్మించాడు. చంద్రముఖుడైన నిచంద్రు డనే రాక్షసుడు ముంజకేశు డనే రాజుగా జన్మించాడు. యుద్ధంలో ఓటమి నెరుగని మహాబుద్ధిమంతుడైన నికుంభుడు దేవాధిపునిగ జన్మించాడు. దితికుమారులలో మహాసురుడైన శరభుడు రాజర్షి ఐన పౌరవునిగ జన్మించాడు. రాజా! మహాబలవంతుడు, మహాసురుడు అయిన కుపటుడు సుపార్శ్వ డనే రాజుగా జన్మించాడు. మహాసురుడైన క్రథుడు మేరుపర్వతంలా ప్రకాశించే పార్వతీయు డనే రాజర్షిగా జన్మించాడు.అసురులలో రెండవ శరభుడు బాహ్లీక వంశంలో ప్రహ్లాదు డనే రాజుగా జన్మించాడు. చంద్రుడితో సమానంగా ప్రకాశించే చంద్రుడనే దైత్యుడు కాంబోజదేశాలకు రాజైన చంద్రవర్మగా జన్మించాడు. దానవశ్రేష్ఠుడైన అర్కుడు ఋషికు డనే రాజుగా పుట్టాడు. గవిష్ఠ డనే మహాసురుడు ద్రుమసేను డనే రాజుగా జన్మించాడు. మయూరుడనే రాక్షసుడు విశ్వ డనే రాజుగా పుట్టాడు. సుపర్ణ డనే రాక్షసుడు కాలకీర్తిగా భూమిపై పుట్టాడు. చంద్రహంత అనే రాక్షసుడు శునకుడనే రాజర్షిగా జన్మించాడు. చంద్రవినాశకునిగ ప్రసిద్ధి చెందిన దైత్యుడు జానకి అని ప్రసిద్ధి పొందిన రాజుగా జన్మించాడు. దీర్ఘజిహ్వ డనే దానవశ్రేష్ఠుడు కాశిరాజుగా జన్మించాడు. సింహిక అనే రాక్షసి సూర్యచంద్రులను హింసించే గ్రహాన్ని కన్నది. అతడు క్రాథు డనే రాజుగా జన్మించాడు.

దనాయువు యొక్క నలుగురు పుత్రులలో జ్యేష్ఠుడైన విక్షరు డనే రాక్షసుడు తేజస్వి ఐన వసుమిత్రు డనే రాజుగా జన్మించాడు. నరాధిపా! విక్షరుని రెండవ తమ్ముడు బలు డనే మహాసురుడు పాండ్యదేశానికి ప్రఖ్యాతి చెందిన రాజుగా జన్మించాడు. విక్షరుని మూడవ సోదరుడూ, బలవంతుడూ అయిన వీరు డనే అసురోత్తముడు పౌండ్రకమాత్స్యకు డనే రాజుగ జన్మించాడు. వృత్రాసురు డని ప్రసిద్ధిపొందిన దానవశ్రేష్ఠుడు మణిమంతు డనే రాజర్షిగా జన్మించాడు. క్రోధహంత అనే అసురుని చిన్న తమ్ముడు ఈ భూమిపై దండు డనే రాజుగా జన్మించాడు. క్రోధవర్ధను డనే మరొక దైత్యుడు దండధారు డనే రాజుగ జన్మించాడు. కాలేయు డనే రాక్షసునికి కలిగిన ఎనమండుగురు కొడుకులు ఈ భూమిపై సింహవిక్రములైన రాజులుగా జన్మించారు. కాలేయుని కొడుకులలో పెద్దవాడు మగధరాజైన జయత్సేనునిగ జన్మించాడు. వారిలో రెండవాడు ఇంద్రసమానుడు. అతడు అపరాజితు డనే రాజుగా జన్మించాడు. మహాతేజస్వి, మహామాయకుడు, మహాసురుడూ

అయిన మూడవవాడు భూమిపై భీమపరాక్రముడైన నిషాదరాజుగ జన్మించాడు. వారిలో నాల్గవవాడు శ్రేణిమంతు డనే రాజుగా జన్మించాడు. మహౌజసునిగ ప్రసిద్ధి చెందిన ఐదవకుమారుడు ఈ భూమిపై శత్రువులను పీడించే మహౌజునిగా జన్మించాడు. కాలేయులలో ఆరవవాడు ఈ భూమిపై అభీరు డను రాజర్షిశ్రేష్ఠునిగా విఖ్యాతు డయ్యాడు. కాలేయులలో ఏడవవాడు సముద్రసేను డనే రాజుగా పుట్టి, ధర్మార్థాల తత్త్వాన్ని తెలిసిన వాడుగా ప్రసిద్ధి చెందాడు. కాలేయులలో ఎనిమిదోవాడైన బృహత్తు అనేవాడు సర్వభూతాల హితాన్నికోరే ధర్మాత్ముడైన రాజుగ జన్మించాడు. దానవులలో మహాబలు డైన కుక్షి మేరుపర్వతంతో సమానంగా ప్రకాశించే పార్వతీయు డనే రాజుగా ఖ్యాతి చెందాడు. క్రథను డనే మహాసురుడు సూర్యాక్షు డనే మహారాజుగా జన్మించాడు. అసురులలో గొప్పవాడైన సూర్య డనేవాడు రాజులందరిలో శ్రేష్ఠుడైన దరదు డనే బాహ్లీకరాజుగా జన్మించాడు.

రాజా! క్రోధవశులనే రాక్షసగణం ఈ భూమిపై వీరులైన రాజులుగా జన్మించారు. మద్రకుడు, కర్ణవేష్టుడు, సిద్ధార్థుడు, కీటకుడు, సువీరుడు, సుబాహువు, మహావీరు డగు బాహ్లీకుడు, క్రథుడు, విచిత్రుడు, సరథుడు, శ్రీమంతు డగు నీలుడు, చీరవాసుడు, కౌరవ్యుడు, భూమిపాలుడు, దంతవక్త్రుడు, దానవుడు, దుర్జయుడు, రుక్మి, జనమేజయుడు, ఆషాఢుడు, వాయువేగుడు, భూరితేజుడు, ఏకలవ్యుడు సుమిత్రుడు, వాటధానుడు, గోముఖుడు, కారూషకరాజులు, క్షేమధూర్తి, శ్రుతాయువు, ఉద్వహుడు, బృహత్సేనుడు, క్షేముడు, ఉగ్రతీర్థుడు, కుహురుడు, బుద్ధిమంతు డయిన ఈశ్వరు డనే ఈ రాజు లందరును క్రోధవశులనే రాక్షసగణంలోని వారే. ఈరాజులందరు క్రోధవశులనే రాక్షసగణంవల్ల ఈ భూమిపై పుట్టినవారే. వీరందరు కీర్తి, సౌభాగ్యం, బలం కలవారు. దానవులలో మహాబలు డైన కాలనేమి ఉగ్రసేనుని కొడుకు, బలవంతుడూ అయిన కంసునిగా జన్మించాడు. దేవేంద్రునితో సమానమైన తేజస్సుగల దేవకు డనేవాడు ఈ భూమిపై గంధర్వరాజుగా జన్మించాడు. భారతా! గొప్పకీర్తి గల దేవర్షి ఐన బృహస్పతి అంశతో అయోనిజుడు, భరద్వాజనందనుడు అయిన ద్రోణుడు జన్మించాడు. రాజా! ఆ ద్రోణుడు ధనుర్ధారులలో ఉత్తముడు. సర్వశాస్త్రాలూ తెలిసినవాడు. మహాకీర్తిమంతుడు, గొప్పతేజస్సు కలవాడు. వేదంలోను, ధనుర్వేదంలోను నిష్ణాతుడు. చిత్రకర్మలు చేసే వరిష్ఠుడు, తనకులమర్యాదలను పాటిస్తూ, వర్ధిల్లిజేసినవాడు. మహాదేవుడైన శివుడు, యముడు, కామక్రోధాలు కలగలసి ఒక్కటైన అంశతో అశ్వత్థామ ఈ భూమిపై పుట్టాడు. అతడు మహాబలవంతుడు. శత్రుపక్షాలకు భయంకరుడు, వీరుడు, పద్మపత్రాల వంటి విశాలమైన కన్నులు కలవాడు.

వసిష్ఠమహర్షి శాపంచేత, ఇంద్రుని ఆదేశం వల్ల అష్టవసువులు గంగాగర్భంలో శాంతనుమహారాజుకు పుత్రులుగా జన్మించారు. వారిలో చిన్నవాడు భీష్ముడు. అతడు కురువంశీయు లందరికీ అభయమిచ్చినవాడు, బుద్ధిమంతుడు, వేదవేత్త, మాటనేర్పరి, శత్రుపక్షాలను నాశనం చేయగలవాడు. సర్వాస్త్ర పండితులలో శ్రేష్ఠుడు, తేజస్వి అయిన భీష్ముడు భృగువంశీయుడూ, జమదగ్ని కుమారుడూ అయిన పరశురామునితో యుద్ధంచేసిన మహావీరుడు. రాజా! కృపుడు రుద్రగణాల అంశతో జన్మించాడని తెలుసుకో. శకుని ద్వాపరాంశతో జన్మించాడని గ్రహించు. వాయుదేవతల అంశతో సాత్యకి వృష్ణికులంలో జన్మించాడు. రాజా! మరుద్గణాల అంశతోనే ద్రుపదుడు జన్మించాడు. మరుద్గణాలనుండే కృతవర్మ జన్మించాడు. విరాటరాజు కూడ మరుద్గణాల అంశతో జన్మించినవాడే.

అరిష్ట కుమారుడైన హంసుడు అను గంధర్వరాజు ధృతరాష్ట్రునిగ జన్మించాడు. దీర్ఘబాహువు, మహాతేజస్వి, ప్రజ్ఞాచక్షువు (అంధుడు) అయిన ఆ రాజు మాతృదోషం వల్ల ఋషికోపం వల్ల, అంధునిగా జన్మించాడు. పాండురాజు మరుద్గణాల అంశతోనే పుట్టాడు. అతడు మహాశక్తిశాలి, మహాబలుడు, సత్యంపట్ల, ధర్మంపట్ల దీక్ష గలవాడు. అత్రిమహర్షి కుమారుడు, పుత్రవంతులలో శ్రేష్ఠుడూ అయిన ధర్మునియొక్క అంశతో విదురుడు జన్మించాడు. దుర్బుద్ధి, దుర్మతి, కురువంశీయుల అపకీర్తి కారకుడు అయిన దుర్యోధనుడు కలియొక్క అంశతో జన్మించాడు. భూమండలాన్నంతా హింసించిన దుర్యోధనుని వల్ల లోకాని కంతటికి కలిపురుషుడు ద్వేషింపదగిన వాడయ్యాడు. ఆ దుర్యోధనుడు ప్రాణివినాశకారకమైన మహావైరాన్ని ప్రేరేపించాడు. పులస్త్యవంశానికి చెందిన రాక్షసులు దుర్యోధనునికి తమ్ముళ్లుగా జన్మించారు. క్రూరమైన పనులుచేసే దుఃశాసనుడు, దుర్ముఖుడు, దుఃసహుడు మున్నగు నూరుగురు పులస్త్య వంశీయులైన రాక్షసులే దుర్యోధనునికి తోడుగా ఉన్నారు. ధృతరాష్ట్రునికి వైశ్యస్త్రీయందు పుట్టిన యుయుత్సుడు నూటొకటోవాడు.' జనమేజయుడిలా అన్నాడు – 'ప్రభూ! ధృతరాష్ట్రుని నూరుగురు పుత్రులపేళ్ళను జ్యేష్ఠక్రమంలో చెప్పవలసింది.'

అపుడు వైశంపాయనుడిలా చెప్పాడు – 1.దుర్యోధనుడు, 2. యుయుత్సుడు, 3. దుఃశాసనుడు, 4. దుఃసహుడు, 5. దుఃశలుడు, 6. దుర్ముఖుడు, 7. వివింశతి, 8. వికర్ణుడు, 9. జలసంధుడు, 10. సులోచనుడు, 11. విందుడు, 12. అనువిందుడు, 13. దుర్ధర్షుడు, 14. సుబాహువు, 15. దుష్ప్రధర్షణుడు, 16. దుర్మర్షణుడు, 17. దుర్ముఖుడు, 18. దుష్కర్ణుడు, 19. కర్ణుడు, 20. చిత్రుడు, 21. ఉపచిత్రుడు, 22. చిత్రాక్షుడు, 23. చారుడు, 24. చిత్రాంగదుడు, 25. దుర్మదుడు, 26. దుష్ప్రధర్షుడు, 27. వివిత్సుడు,

28. వికటుడు, 29. సముడు, 30. ఊర్ణనాభుడు, 31. పద్మనాభుడు, 32. నందుడు, 33. ఉపనందుడు, 34. సేనాపతి, 35. సుషేణుడు, 36. కుండోదరుడు, 37. మహోదరుడు, 38. చిత్రబాహువు, 39. చిత్రవర్మ, 40. సువర్మ, 41. దుర్విరోచనుడు, 42. అయోబాహువు, 43. మహాబాహువు, 44. చిత్రచాపుడు, 45. సుకుండలుడు, 46. భీమవేగుడు, 47. భీమబలుడు, 48. బలాకి, 49. భీముడు, 50, విక్రముడు, 51. ఉగ్రాయధుడు, 52. భీమశరుడు, 53. కనకాయువు, 54. దృఢాయుధుడు, 55. దృఢవర్మ, 56. దృఢక్షత్రుడు, 57. సోమకీర్తి, 58. అనూదరుడు, 59. జరాసంధుడు, 60, దృఢసంధుడు, 61. సత్యసంధుడు, 62. సహస్రవాక్కు, 63. ఉగ్రశ్రవుడు, 64. ఉగ్రసేనుడు, 65. క్షేమమూర్తి, 66. అపరాజితుడు, 67. పండితకుడు, 68. విశాలాక్షుడు, 69. దురాధనుడు, 70. దృఢహస్తుడు, 71. సుహస్తుడు, 72. వాతవేగుడు, 73.సువర్చసుడు, 74. ఆదిత్యకేతువు, 75. బహ్వాశి, 76. నాగదత్తుడు, 77. అనుయాయి, 78. కవచి, 79. నిషంగి, 80. దండి, 81. దండధారుడు, 82. ధనుర్గహుడు, 83. ఉగ్రుడు, 84. భీమరథుడు, 85. వీరుడు, 86. వీరబాహువు, 87. అలోలుపుడు, 88. అభయుడు, 89. రౌద్రకర్ముడు, 90. దృఢరథుడు, 91. అనాధృష్యుడు, 92. కుండభేది, 93. విరావి, 94. దీర్ఘలోచనుడు, 95. దీర్ఘబాహువు, 96. మహాబాహువు, 97. వ్యూఢోరువు, 98. కనకాంగదుడు, 99. కుండజుడు, 100. చిత్రకుడు అని నూరుగురు కుమారులు. దుశ్శల కూతురు. ధృతరాష్ట్రునికి వైశ్యస్త్రీయందు కలిగిన యుయుత్సుడు నూటొకటవ కుమారుడు. వీరుకాక ఒక కూతురు కూడ ఉంది. జ్యేష్ఠానుపూర్వీగా ధార్తరాష్ట్రుల పేర్లు అన్నీ తెలిసినవి కదా! వీరందరూ అతిరథులు, శూరులు, యుద్ధవిశారదులూను. రాజా! వీరందరూ వేదవిదులు, శాస్త్రకోవిదులు, సంగ్రామవిద్యలో ప్రవీణులు. విద్యచేత, వంశంచేత విరాజిల్లుతున్నవారు.

రాజా! వారందరికి తగిన భార్యలు వచ్చారు. దుఃస్సలను శకుని సలహాపై సింధురాజయిన జయద్రథునికిచ్చి వివాహం చేశారు. ధర్మం యొక్క అంశతో పుట్టినవాడు యుధిష్ఠిరుడు. వాయువు అంశతో భీమసేనుడు, దేవేంద్రుని అంశతో అర్జునుడు, అశ్వినీదేవతల అంశతో సర్వభూతమనోహరులైన నకులసహదేవులు జన్మించారు. చంద్రుని కుమారుడైన వర్చసుడు అర్జునుని పుత్రుడైన అభిమన్యునిగా జన్మించాడు. అతడు అవతరించే సమయంలో చంద్రుడు దేవతలతో ఇలా చెప్పాడు. 'నాప్రాణాలకంటె మిక్కిలి ప్రియమైన నాకుమారుని నేనివ్వను. అందువల్ల ఒక ఒప్పందం చేయండి. దాన్ని అతిక్రమించడానికి వీలులేదు. భూమిపై రాక్షసులను సంహరించడమనే దేవతల కార్యం మన కార్యమే. అందువల్ల అక్కడికి వర్చసుడు వెళ్తున్నాడు. కాని ఎంతోకాలం ఉండడు. ఇంద్రునికొడుకు పాండురాజు

కుమారులలో ప్రతాపవంతుడైన అర్జునుడిగా విఖ్యాతుడు, నారాయణుని మిత్రుడుగా జన్మించాడు. అటువంటి అర్జునుడికి కొడుకుగా ఈ వర్చసుడు జన్మిస్తాడు. బాలుడుగానే మహారథునిగ గుర్తింపబడతాడు. పదహారు సంవత్సరాలు మాత్రమే అక్కడ ఉంటాడు. ఇతనికి పదహారు సంవత్సరాలు వచ్చేసరికి మహాసంగ్రామం జరుగుతుంది. ఆ యుద్ధంలో వీరులంతా శత్రువీరవినాశనాన్ని చేస్తారు. ఒకనాడు నరనారాయణులులేని సమయంలో శత్రువీరులు చక్రవ్యూహం రచించి దేవతలతో యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో బాలుడైన నా కుమారుడు అభేద్యమైన చక్రవ్యూహంలో ప్రవేశించి నిర్భయంగా విహరించి శత్రుసంహారం చేస్తాడు. మహారథులైన వీరులతో యుద్ధం చేస్తాడు. పగలు సగం గడిచేసరికి నాల్గవవంతు శత్రువీరులను యమపురికి పంపుతాడు. ఆపై యుద్ధంలో మహారథులైన వీరులతో పాటుగా సాయంకాలానికి నన్ను చేరుకొంటాడు. అతనికి వంశకారకుడైన ఒక కుమారుడు కలుగుతాడు. అతడే నశించి నటువంటి భారతవంశాన్ని మళ్లీ ఉద్ధరిస్తాడు.' చంద్రుని ఈ మాటలు విని దేవతలు 'తథాస్తు' అని పలికి, చంద్రుని పూజించారు. రాజా! ఈ విధంగా నీయొక్క, నీ తండ్రులయొక్క, వారి తండ్రులయొక్క జన్మవృత్తాంతం చెప్పాను. మహారథుడైన ధృష్టద్యుమ్నుడు అగ్నియొక్క అంశగా తెలుసుకో. శిఖండి రాక్షసుని అంశతో పుట్టినవాడు. మొదట స్త్రీగా జన్మించి తరువాత పురుషరూపాన్ని పొందినవాడు. ద్రౌపదికి కల్గిన అయిదుగురు కుమారులను విశ్వేదేవులుగా గ్రహించు. ప్రతివింధ్యుడు, సుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు – అనే ఐదుగురు ద్రౌపదికుమారులు. వసుదేవుని తండ్రి శూరసేనుడు యదుకులశ్రేష్ఠుడు. అతనికి అసమాన సౌందర్యవతి ఐన కూతురుంది. ఆమె పేరు పృథ. శూరసేనుడు తనతండ్రి ఉగ్రసేనుని సోదరికుమారుని కుమారుడు. సంతానంలేని వాడగుటవల్ల తన మొదటి సంతానాన్ని అతనికిస్తానని ముందుగా మాటిచ్చాడు. శూరసేనుడు తన పెద్దకూతురయిన పృథను తనమాట ప్రకారం కుంతిభోజునకు అనుగ్రహించే తలంపుతో ఇచ్చాడు. ఆమె తండ్రియింట బ్రాహ్మణులను, అతిథులను పూజించటానికి నియోగింపబడింది. ఆమె ఒకసారి దుర్వాసమహర్షిని సేవించింది. అతడు కోపిష్ఠి. కఠోరనియమాలు కలవాడు. ధర్మమందు నిగూఢ నిశ్చయం కలవాడు. కఠినుడు. ఆమె సర్వప్రయత్నాలతోను అతనిని సంతోషపెట్టింది. ఆమె సేవలచే సంతుష్టుడైన దుర్వాసుడు యథావిధిగ ప్రయోగవిధానంతో పాటు మంత్రోపదేశం చేశాడు. తరువాత ఇలా చెప్పాడు – 'సుందరీ! నీపట్ల సంతుష్టుడ నయ్యాను. ఈ మంత్రంచే నీవు ఏ దేవుని ఆహ్వానిస్తే ఆ దేవుని యొక్క అనుగ్రహం వల్ల నీవు పుత్రులను కంటావు.' ఋషి అలా చెప్పగానే, అమాయకురాలైన ఆమె కుతూహలంతో సూర్యభగవానుని ఆహ్వానించింది. లోక ప్రకాశకుడైన

సూర్యునివల్ల ఆమె గర్భం ధరించింది. ఆమె శస్త్రధారు లందరిలో శ్రేష్ఠుడైన ఒక కుమారుని ప్రసవించింది. కవచకుండలాలతో, దివ్యమైన కాంతితో సూర్యునితో సమంగా ప్రకాశిస్తూ అందమైన శరీరసౌష్ఠవంతో ఉన్న కొడుకును కన్నది. అతనిని రహస్యంగా దాచి ఉంచి, బంధుజనులకు భయపడి, యశస్వి అయిన ఆ కుమారుని కుంతి నీటిలో విడిచిపెట్టింది.

అలా వదిలిన ఆ పసికందును మహాయశస్వి, అతిరథుడూ అయిన రాధ భర్త తీసికొని రాధకు కొడుకుగా కల్పించాడు. ఆ బాలుడికి ఆ దంపతులు వసుషేణుడు అని పేరు పెట్టారు. ఆ పేరు అంతటా వ్యాపించింది. వారి పెంపకంలో వసుషేణుడు అన్ని అస్త్రవిద్యల్లోను ఉత్తముడుగా ఆయ్యాడు. జయశీలులలో శ్రేష్ఠుడైన అతడు వేదాంగా లన్నింటిని అధ్యయనం చేశాడు. అతడు బుద్ధిమంతుడు, సత్యపరాక్రముడు. అతడు జపం చేస్తూన్న సమయంలో అతని దగ్గరకు వెళ్ళినవాడు పొందలేని దంటూ ఏమీ ఉండదు. అటువంటి వసుషేణుని ఇంద్రుడు తన కుమారుని కోసం బ్రాహ్మణ రూపంలో వచ్చి, సహజాలైన కవచకుండలాలను యాచించాడు. కర్ణుడు కవచకుండలాలను తన శరీరంనుండి కోసి అతని కిచ్చాడు. ఇంద్రుడు అతనికి శక్తి అనే ఆయుధాన్ని ఇచ్చాడు. దేవ, అసుర, మనుష్యులలో కాని, గంధర్వ, ఉరగ, రాక్షసులలో కాని ఎవనిపై దాన్ని విసిరినా అత డిక మిగిలి ఉండడు. మొదటకర్ణుని పేరు వసుషేణుడు. అతడు తన కవచకుండలాలను కత్తిరించడం వల్ల 'కర్ణుడు', వైకర్తనుడుగా ప్రసిద్ధి పొందాడు. పృథకు మొదటి కుమారునిగ సహజకవచ కుండలాలతో జన్మించిన మహావీరుడు 'కర్ణు'డని లోకవిఖ్యాతిని పొందాడు. రాజశ్రేష్ఠా! అతడు సూతుని ఇంట పెరిగాడు. శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడు. నరవరులలో శ్రేష్ఠుడు. అతడు దుర్యోధనుని సచివుడు, మిత్రుడు, శత్రునాశకరుడు. అతడు సూర్యుని అంశవల్ల జన్మించిన ఉత్తముడు.

దేవదేవుడు, సనాతనుడు అయిన నారాయణుడు తన అంశతో మనుష్యులలో ప్రతాపవంతు డైన వాసుదేవునిగా జన్మించాడు. ఆదిశేషుని అంశతో మహాబలు డైన బలదేవుడు జన్మించాడు. మహాతేజోవంతు డైన ప్రద్యుమ్నుడు సనత్కుమారుని అంశతో జన్మించినవాడు. ఈ విధంగా దేవతల అంశలతో తక్కిన రాజులందరూ వసుదేవుని వంశంలో వంశ ప్రవర్ధకులుగా జన్మించారు. రాజా! మునుపు నేను చెప్పిన అప్సరోగణం ఇంద్రుని ఆదేశం మీద వారి వారి అంశలతో భూమిపై జన్మించారు. ఆ అప్సరలు భూలోకంలో పదునారువేలమంది దేవులుగా జన్మించి, భగవంతుడైన శ్రీకృష్ణునికి భార్యలయ్యారు. నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుని ఆనందంకోసం లక్ష్మి తన అంశతో భీష్మకుని కులంలో రుక్మిణిగా జన్మించింది. శచీదేవి ద్రుపదకులంలో వేది మధ్యనుండి

ద్రౌపదిగా అవతరించింది. ఆమె మిక్కిలి పొట్టిదికాదు. అంత పొడుగుకాదు. నీలోత్పలం వలె మంచి సుగంధం కలది. విశాలమైన కన్నులు కలది. చక్కని నల్లని జుట్టుకలది. సర్వశుభలక్షణాలూ కలిగి ఉన్నది. వైడూర్యంలా ప్రకాశిస్తున్నది. పురుషశ్రేష్ఠులైన పాండవులైదుగురికి ఏకాంతంలో మనస్సును హరింపగల్గినది ఆ ద్రౌపది. ఆ పంచ పాండవులకు సిద్ధి, ధృతి అనే దేవతలు కుంతీ, మాద్రీరూపాలలో తల్లులుగా జన్మించారు. ఈ విధంగా దేవతలు, అసురులు, గంధర్వులు, అప్సరలు, మున్నగు వారి యొక్క అంశావతరణం చెప్పబడింది. యుద్ధగర్వంతో ఈ భూమిపై పుట్టిన రాజులు, యదువంశంలో పుట్టినరాజులు, బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులు చెప్పబడ్డారు. ధన్యం, కీర్తికరం, పుత్రప్రదం, విజయదాయకం ఈ అంశావతరణం. దీన్ని అసూయలేకుండా వినాలి. దేవగంధర్వ రాక్షసుల అంశావతారవర్ణనం వినడం వల్ల ఉత్పత్తి వినాశనాలు తెలిసిన ప్రాజ్ఞుడు కష్టాలలో పడజాలడు.'

68. దుష్యంతుని అద్భుతశక్తి-రాజ్యపాలనసామర్థ్యము.

జనమేజయుడిలా అన్నాడు – 'బ్రాహ్మణోత్తమా! నీవల్ల దేవదానవ రాక్షస గంధర్వ అప్సరోగణాల అంశావతారాలను బాగా విన్నాను. ఈ బ్రహ్మర్షుల సన్నిధానంలో కురువంశం గురించి మొదటినుండి వినాలనుకొంటున్నాను.' వైశంపాయనుడిలా చెప్పాడు – 'భరతశ్రేష్ఠా! పౌరవ వంశవర్ధకుడు, తేజస్వి అయిన దుష్యంతుడు నాలుగుసముద్రాలు సరిహద్దులుగా గల ఈ భూమండలాన్ని ఏలుతున్నాడు. అతడు నాలుగు సముద్రాలచే చుట్టబడిన భూమండలాన్నంతా పరిపాలిస్తున్నాడు. యుద్ధాలలో విజయాన్ని పొందినవాడు. బ్రాహ్మణ క్షత్రియాది వర్ణాలతో నిండి మ్లేచ్ఛ దేశాలు సరిహద్దులుగాగల ఈ భూమండలాన్ని శత్రుమర్దనుడైన ఆ దుష్యంతు డొక్కడే రక్షిస్తున్నాడు. ఆ మహారాజు పాలనలో ఎక్కడా వర్ణసాంకర్యం జరుగలేదు. ప్రజలు వ్యవసాయం చేసి రత్నాలు పండిస్తూ రత్నాకరం (సముద్రం) జోలికే ఎవరూ పోవటం లేదు. ఎవరూ పాపకార్యం చేయటం లేదు. రాజా! అతనిపాలనలో ప్రజలు ధర్మమందు ఆసక్తి కలిగి ధర్మార్థాలను పాటిస్తున్నారు. చోరభయం కాని, ఆకలిభయం కాని, వ్యాధిభయం కాని అతనిపాలనలో ఎక్కడా లేదు. జనులందరూ వారివారి ధర్మాల్ని తప్పక పాటించేవారు. **దైవకర్మలు నిష్కామంగా చేసేవారు.** ఆ రాజు ఆశ్రయంలో ఎటువంటి భయాలూ లేకుండా ప్రజలు జీవించేవారు. మేఘం సకాలంలో వర్షించేది. రసవంతాలైన పంటలు పండేవి. భూమి సర్వ రత్నాలతో సమృద్ధమై పశుసంపదలతో నిండి ఉండేది. బ్రాహ్మణులు స్వకర్మనిరతులు, అబద్ధమాడేవారు కాదు. దుష్యంతమహారాజు యువకుడు, అద్భుతమైన పరాక్రమం కలవాడు. వజ్రంలా దృఢమైన శరీరం కలవాడు.

అతడు తనభుజాలతో అడవులతో నిండిన మందర పర్వతాన్ని ఎత్తగల బలశాలి. ప్రక్షేప, విక్షేప, పరిక్షేప, అభిక్షేపాలనే నాలుగు విధాల గదాయుద్ధంలో ఆరితేరినవాడు. బలంలో విష్ణువుతో సమానమైనవాడు. తేజస్సులో సూర్యునితో సమానుడు. గాంభీర్యంలో సముద్రంతో సమానుడు, సహనంలో భూమితో సమానుడు. అందరికీ ఆమోదయోగ్యుడు. అతని ఏలుబడిలో నగరాలు, దేశాలు ప్రశాంతంగా ఉన్నాయి. అతడు ధర్మ భావనలతో ప్రజలను శాసించేవాడు.'

69. దుష్యంతుడు వేటకై వనమునకు వెళ్లుట.

జనమేజయుడిలా అడిగాడు - 'బ్రాహ్మణోత్తమా! దుష్యంత మహారాజు యొక్క చరిత్ర, శకుంతలాజననం, భరతుని పుట్టుక యథాతథంగా వినాలనుకొంటున్నాను. పూజ్యుడా! వీరుడైన దుష్యంతుడు శకుంతలను ఎలా పొందాడు? పురుషశ్రేష్ఠ డైన దుష్యంతుని చరిత్రను విస్తరంగా వినాలనుకొంటున్నాను.' వైశంపాయనుడిలా అన్నాడు - 'ఒకానొకప్పుడు మహాబాహుడైన దుష్యంతుడు చతురంగ బలాలతో దట్టమైన అడవికి వేటకువెళ్లాడు. ఖడ్గాలు, శక్తులు, గదలు, ముసలాలు, ప్రాసాలు, తోమరాలు ధరించిన వందలాది యోధులతో బాటుగా వెళ్లాడు. యోధుల సింహనాదాలతో, శంఖ దుందుభి ధ్వనులతో, రథాల ఇరుసుల చప్పుళ్లతో, గజరాజుల గర్జనలతో, నానావిధాయుధధారులతో, నానావేష ధారులతో, యోధుల గర్జనలతో, తాళ ధ్వనులతో ఆ రాజు వెళ్లే మార్గమంతా కోలాహలంగా ఉంది. రాజశోభతో ఉండి, తమకు కీర్తికరుడై, ఇంద్రసమానుడై, శత్రుసంహర్తయై, శత్రుగజాలను నిలువరింపగల ఆ దుష్యంతుణ్ణి స్త్రీలు భవనాలెక్కి చూడసాగారు. అలా చూస్తున్న స్త్రీలు అతనిని ఇంద్రునిగా భావించారు. తమలో తాము "ఈ పురుషసింహుడు దుష్యంతుడు యుద్ధరంగంలో వసువులతో సమానమైన పరాక్రమం కలవాడు. అతని బాహుబలం ముందు శత్రుగణాలేవీ మిగిలి ఉండవు" అని మాట్లాడుకొంటూ ప్రేమతో ఆ రాజును స్తుతించారు. స్త్రీలు ప్రేమతో పూలవాన కురిపించారు. అన్ని దిక్కులా విప్రశ్రేష్ఠులు అతనిని స్తుతిస్తున్నారు. ఆ దుష్యంతుడు అడవికి వేటకు వెళ్లాడు. దుష్యంతుడు మదగజాన్ని అధిరోహించి వెళుతూ ఉంటే బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యశూద్రులు అంతా ఆశీశ్శబ్దాలతో, జయ జయ ధ్వానాలతో అనుసరించారు. పౌరులు, చాలా దూరం అతనిని అనుసరించి, అతని అనుమతితో వెనుకకు మళ్ళారు.

అతడు గరుడుని వంటి రథం ఎక్కి ప్రయాణిస్తుంటే రథశబ్దం భూమిని, స్వర్గాన్ని కూడా ఆవరించింది. అతడు వెళుతూ మారేడు, జిల్లేడు, చండ్రవృక్షాలతోను వెలగ,

వెలమ చెట్లతోను నిండిన అడవిని చూడసాగాడు. ఆ అడవి అంతా పర్వతాలనుండి జారిపడిన రాళ్లతో నిండి ఎత్తుపల్లాలతో నిర్జలంగా, నిర్మానుష్యంగా అనేక యోజనాలు విస్తరించి ఉంది. మృగాలు, సింహాలు, క్రూరమృగాలు, ఏనుగులు ఉంటున్న ఆ వనమంతా దుష్యంతుడు తన సేవకులతో, బలాలతో బాటు మృగాలను వేటాడుతూ కలియ తిరిగాడు. తన బాణాలకు అందినంతమేరలోకి వచ్చిన వ్యాఘ్రసమూహాలను పడగొట్టాడు. దూరంగా ఉన్న మృగాలను బాణాలతో ఛేదించాడు. దగ్గరగా ఉన్నవాటిని ఖడ్గంతో ఖండించాడు. శక్తిమంతులలో శ్రేష్ఠుడైన అతడు తన శక్తితో లేళ్ళను సంహరించాడు. అతడు గద త్రిప్పడంలో నేర్పరి. మేరలేని పరాక్రమశాలి. వనంలో స్వేచ్ఛగా సంచరించే ఏనుగులను తోమరాలతో, ఖడ్గాలతో, గదలతో, ముసలాలతో చంపుతూ సంచరించాడు. అద్భుతమైన పరాక్రమం గలరాజు, యుద్ధప్రియులైన యోధులూ సంచరిస్తూండగా అడవిలోని సింహాలు ఆ ప్రాంతం విడిచి వెళ్ళిపోసాగాయి. యూథపతులు మరణించడంతో చెల్లాచెదరైన మృగాలు, ఆర్తనాదాలు చేయసాగాయి. ఎండిపోయిన నదుల దగ్గరకు వెళ్లిన మృగాలు నీరులేక కృశించి, అలసట చెందిన హృదయాలతో అచేతనంగా పడిఉంటున్నాయి. ఆకలి దప్పులకు తట్టుకోలేనివి భూమిపై పడిపోతున్నాయి. ఆకలిగా ఉన్న కొందరు మానవులు కొన్ని మృగాలను తిన్నారు. కొందరు వనేచరులు అగ్నిని రగిలించి ఆ మాంసాలను కాల్చుకొని తినసాగారు. మదగజాలు కొన్ని ఆయుధాల దెబ్బలవల్ల తొండాలను ముడుచుకొని, భయంతో మలమూత్రాలను విసర్జిస్తూ రక్తం కారుతున్నా వేగంగా పరుగెత్తసాగాయి. అడవి ఏనుగులు కొన్ని కొంతమంది మనుష్యుల్ని మర్దించాయి. ఆ వనమంతా సైన్య మనే మేఘంతో బాణాల వర్షధారలతో నిండిపోయింది. చచ్చిపడి ఉన్న సింహాలతో, మృగాలతో ఆ వనమంతా శోభిల్లింది.'

70. దుష్యంతమహారాజు కణ్వాశ్రమమున ప్రవేశించుట.

వేలాది మృగాలను చంపిన దుష్యంతుడు ససైన్యంగా మృగాలను వెంటాడుతూ మరొక వనంలోకి ప్రవేశించాడు. మంచిబలం గల ఆ దుష్యంతు డొక్కడూ ఆకలి దప్పులతో ఆ వనం చివరికి వెళ్లాడు. అక్కడ ఒక శూన్యప్రదేశం. ఆ ప్రదేశాన్ని కూడా దాటి దుష్యంతుడు మరొక వనంలోకి వెళ్లాడు. ఆది చక్కనైన ఆశ్రమాలతో మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తూ, చూడటానికి చాలా అందంగా ఉంది. చల్లని గాలివీస్తూ వికసించిన పూలచెట్లతో కూడి, మిక్కిలి సుఖంగా ఉండే పచ్చికలతో నిండి ఉంది. ఆ వనం పక్షుల కలధ్వనులతో ప్రతిధ్వనిస్తూ కోకిలల కుహూరవాలతో, తేనేటీగల ఝంకారాలతో నిండి

విశాలంగా ఉంది. పెరిగిన కొమ్మలున్న వృక్షాలతో, చక్కని నీడనిచ్చే చెట్లతో నిండి ఉంది. తుమ్మెదల ఝంకారాలతో మిక్కిలి శోభాయమానంగా ఉంది. ఆ వనంలో పువ్వులులేని మొక్కలు లేవు. పండ్లు లేని చెట్లు లేవు. ముళ్ళున్న మొక్కలు అసలే లేవు. తుమ్మెదలు వాలని పువ్వులు లేవు. పక్షుల ధ్వనులతో, పూలతో, అన్ని ఋతువులలో ఉండే పూలు గల చెట్లతో, చక్కని నీడనిచ్చే వృక్షాలతో మిక్కిలి అందంగా అలంకరింపబడి ఉంది ఆ వనం. అటువంటి మనోహరమైన, ఉత్తమమైన వనంలోకి మహాధన్వి అయిన దుష్యంతుడు ప్రవేశించాడు. పూలతో నిండిన కొమ్మలు గల వృక్షాలు గాలికి కదులుతూ మాటిమాటికి విచిత్రమైన పుష్పవృష్టిని కురిపించాయి. పక్షుల మధుర ధ్వనులు ఆకాశాన్నంటుతున్నాయి. విచిత్రమైన పూలవస్త్రాలతో అక్కడి చెట్లు ప్రకాశిస్తున్నాయి. పూలభారంతో వంగి ఉన్న చెట్ల చిగుళ్ళలో చేరి తేనె త్రాగాలనే కోరికతో తుమ్మెదలు మధుర రావాలు చేస్తున్నాయి. విరబూసిన పూలతో అలంకరింపబడిన, లతా గృహాలతో, మనస్సుకు ప్రీతిని కలిగించే ఆ ప్రదేశాలను చూస్తూ దుష్యంతుడు మిక్కిలి ఆనందించాడు. పూలతో నిండి ఒక దానితో ఒకటి పెనవేసుకొన్న కొమ్మలతో మహేంద్రుని ధ్వజంలా ప్రకాశిస్తున్న వృక్షాలతో ఆ వనం శోభిల్లింది. సిద్ధులు, చారణులు, గంధర్వులు, అప్సరలు, మదించిన వానరులు, కింనరులు మొదలైన వారిచే సేవింపబడుతోంది ఆ వనం. ఆ వనంలో వీచేగాలి సుఖంగా, చల్లగా, సువాసనతో పూలపుప్పొడిని తీసికొనిపోతూ క్రీడించే కోరికతో వృక్షాలను చేరుతున్నట్లుగా ఉంది. మాలినీనదీతీరంలో ఎత్తైన ధ్వజాలవలె ప్రకాశిస్తున్న చక్కని చెట్లతో మనోహరమైన ఆ వనాన్ని రాజు చూశాడు. ఆనందంతో ఉన్న పక్షులతో ఉన్న ఆ వనాన్ని చూస్తున్న దుష్యంతుడు అక్కడ అందమైన ఒక ఆశ్రమాన్ని చూశాడు.

అతడు అనేకవిధాలైన వృక్షాలతో నిండి ప్రజ్వరిల్లుతూన్న అగ్నిహోత్రాలతో సాటిలేని శోభతో ఉన్న ఆ ఆశ్రమాన్ని ఎంతో గౌరవించాడు. యతులతో, వాలఖిల్యులతో, మునిగణాలతో, అగ్నిహోత్ర గృహాలతో పలురకాల పువ్వులు పరిచినట్లు వ్యాపించి ఉన్న ఆ ఆశ్రమాన్ని రాజు గౌరవించాడు. నిర్మలమై, ఆస్వాదయోగ్యమైన నీటితో ఉన్న మాలినీనదికి ఇరుప్రక్కల పెద్ద పెద్ద చెట్లతో ప్రకాశిస్తున్న ఆ ఆశ్రమాన్ని ఆదరించాడు. పలురకాల పక్షి సమూహాలతో, తపోవనంతో అందంగా ఉన్న ఆ మాలినీనదిని చూశాడు. ఆ ప్రాంతంలో ఉన్న సౌమ్యాలైన పులులను, మృగాలను చూస్తూ అతడు ఆనందాన్ని పొందాడు. అప్రతిరథుడు, శ్రీమంతుడూ ఐన దుష్యంతుడు దేవలోకంలా ప్రకాశించే మనోహరమైన ఆ ఆశ్రమాన్ని చేరుకొన్నాడు. ఆ ఆశ్రమాన్ని ఆనుకొని నిర్మలమైన నీటితో ప్రాణు లన్నింటికి తల్లిలా ఉన్న మాలినీనదిని చూశాడు. చక్రవాకాలున్న ఇసుకతిన్నెలతో, పూలనురుగులతో కూడిన

ప్రవాహంతో కిన్నరగణాలూ, వానరాలూ, ఎలుగుబంట్లు సేవిస్తున్న నదిని చూశాడు. మాలినీనదీతీరం ఇసుకతిన్నెలతో అందగించి ఉంది. పవిత్రవేదఘోష అక్కడ ప్రతిధ్వనిస్తోంది. మదపుటేనుగులు, పులులూ, సర్పాలు అక్కడ సంచరిస్తున్నాయి. ఆ నదీతీరంలో కాశ్యపగోత్రుడయిన కణ్వుని ఆశ్రమాన్ని చూశాడు. పూజ్యాలయిన మహర్షిగణాలతో నిండి అది ఎంతో రమ్యంగా ఉంది. ఆశ్రమాన్ని ఆనుకొని ఉన్న నదిని, ఆశ్రమప్రదేశాన్ని చూసి, దుష్యంతుడు ఆశ్రమంలో ప్రవేశించా లనుకొన్నాడు. అందమైన తీరాలూ, ద్వీపాలు గల మాలినీ నదిచేత అలంకరింపబడింది ఆ ఆశ్రమం. అది గంగచేత శోభిల్లుతున్న నరనారాయణ స్థానంలా ప్రకాశిస్తూ ఉన్నది. మదించిన నెమళ్ల క్రేంకారాలతో కుబేరుని చైత్రరథవనంలా ఉన్న ఆ మహావనంలోకి దుష్యంతుడు ప్రవేశించాడు. గొప్ప గుణసంపద కలిగి, కశ్యపగోత్రజుడైన కణ్వమహర్షిని చూడాలనుకొన్నాడు. గుర్రాలు, ఏనుగులు, యోధులతో కూడి ఉన్న సేనను ఆశ్రమప్రవేశ ద్వారం దగ్గరే ఉంచి, ఇలా అన్నాడు.

'విరాగి, తపోధనుడూ అయిన కాశ్యప మునిని చూడటానికి వెళుతున్నాను. నేను వచ్చేటంత వరకు మీరిక్కడే ఉండండి.' నందనవనంలా ఉన్న ఆ తపోవనంలో ప్రవేశించిన రాజు ఆకలి దప్పులు మరచి పుష్కలమైన ఆనందాన్ని పొందాడు. ఆ రాజు అమాత్యులతోపాటు రాజ చిహ్నాలను కూడా విడిచిపెట్టి, పురోహితుడుతోడుగా ఆశ్రమంలో ప్రవేశించాడు. తుమ్మెదల ఝుంకారాలతో రకరకాల పక్షి సమూహాలతో బ్రహ్మలోకంలా ప్రకాశిస్తూన్న ఆ ఆశ్రమాన్ని చూసి, వికార రహితుడు, తపోనిధి అయిన ఆ కణ్వ మహర్షిని చూడాలనుకొన్నాడు. వివిధ కర్మలయందు బహ్వృచులైన బ్రాహ్మణులు ఋక్కులను పదక్రమాలతో ఉచ్చరిస్తూ ఉండగా ఆ రాజు విన్నాడు. యజ్ఞవిద్యను, యజ్ఞాంగవిద్యలను (వేదవేదాంగాలు) తెలిసినవారితో, యజుర్వేత్తలతో శోభిల్లుతూ, మధుర సామగీతాలతో, నియమదీక్షగల ఋషులతో, భారుండ సామగీతాలతో, అథర్వ శిరోగీతాలతో, జితేంద్రియులైన మునులతో ఆ ఆశ్రమం శోభిల్లుతోంది. అథర్వవేదంలో శ్రేష్ఠులు, పూగయజ్ఞియసామను గానం చేసేవాళ్లు పదక్రమాలతో వేదసంహితను పఠిస్తూ ఉన్నారు. మరికొందరు బ్రాహ్మణులు శబ్దసంస్కార సంయుక్తంగా వేదోచ్చారణలు చేస్తూంటే ఆ ఆశ్రమం మరొక బ్రహ్మలోకంలా ప్రతిధ్వనింపసాగింది.

యజ్ఞవేదికలు ఏర్పాటు చేయటం తెలిసినవారు; క్రమంలో శిక్షణనివ్వటంలో నేర్పరులు; న్యాయం, తత్వం, ఆత్మ విజ్ఞానం, కలిగిన వేదపారగులు; అనేక విధాలైన వాక్యాలను సమన్వయం చేసే నేర్పరులు; విశేష కార్యాలు తెలిసినవారు, మోక్ష ధర్మంపట్ల ఆసక్తి గలవారు; విషయ ప్రతిపాద్యమైన, ఆక్షేపం, సిద్ధాంతం, పరమార్థం, తెలిసినవారు; వ్యాకరణం,

ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషాల జ్ఞానం కలవారు; పక్షుల, వానరాల అరుపులు తెలిసినవారు; పెద్దపెద్ద గ్రంథాలను వ్యాఖ్యానింపగలవారు, అనేక శాస్త్రాలలో పండితులు, లోకులను రంజింపచేయగలవారు --- పలికిన మాటలను అతడు విన్నాడు. దుష్యంతుడు ఆయా ప్రదేశాలలో కఠోర నియమాలను పాటించే జపహోమ తత్పరులైన విప్రులను చూశాడు. ఆ రాజు ప్రయత్నపూర్వకంగా తయారుచేసిన విచిత్రాలైన, అందమైన ఆసనాలను చూసి ఆశ్చర్యపోయాడు. అక్కడున్న దేవగృహాలలో బ్రాహ్మణులు చేసిన పూజలు చూసి తాను బ్రహ్మలోకంలో ఉన్నట్లుగా అతడు భావించాడు. కణ్వమహర్షి తపస్సులచే రక్షింపబడుతూ, తపోవన లక్షణాలన్నింటితో నిండిన ఆ ఆశ్రమాన్ని చూస్తూ ఉన్నా దుష్యంతునికి తృప్తి కలగలేదు. మహావ్రతులు, తపోధనులు అయిన ఋషులతో కూడి, మిక్కిలి మనోహరంగా, మంగళకరంగా, ఏకాంతంగా ఉన్న ఆ కాశ్యపుని ఆశ్రమంలోఅమాత్య పురోహితులతో కలిసి దుష్యంతుడు ప్రవేశించాడు.

71. దుష్యంతమహారాజు శకుంతలతో సంభాషించుట.

తర్వాత ఆ దుష్యంతుడు అమాత్యులను విడిచి పెట్టి తానొక్కడే ఆశ్రమంలోకి వెళ్లాడు. అక్కడ నియమనిష్ఠుడైన కణ్వమహర్షి అతనికి కనబడలేదు. ఆ ఋషి కనబడకపోవటంతో ఆశ్రమం శూన్యమైందిగా భావించి 'ఇక్కడ ఎవరున్నారు ?' అని బిగ్గరగా అడిగాడు. వెంటనే ఆ ధ్వని విని లక్ష్మీదేవి వంటి రూపంతో తాపసీ వేషంలో ఉన్న ఒక కన్య ఆశ్రమంలో నుండి వెలుపలికి వచ్చింది.

నల్లని కన్నులతో ఆమె రాజును చూసి

(అభ్యాగతుడైన ఆరాజు పూజింపదగిన వాడని గ్రహించింది. ఆమె నియమాన్ని పాలించేది, రూప, యౌవనసంపదగలది. శీల, ఆచారాలు కలది. శుభలక్షణాలు కలది. విశాలనేత్రుడు, ఉన్నతవక్షం, అంగసౌష్ఠవం కలిగి, సింహభుజుడు, దీర్ఘబాహువు, పూజ్యుడు అయిన రాజుతో ఆమె స్పష్టంగా మధురంగా ఇలా పలికింది.)

'నీకు స్వాగతం' అని పలికి వెంటనే ఆతనిని గౌరవించింది. ఆమె ఆ రాజును అర్ఘ్య పాద్య ఆసనాలతో గౌరవించి, ఆరోగ్యాన్నీ కుశలాన్నీ అడిగింది. యథావిధిగా పూజించి, కుశలప్రశ్న లడిగి, సిగ్గుపడుతున్న దానివలె 'మీకొరకు ఏమిచేయగలను' అని అడిగింది. 'ఆశ్రమానికి వచ్చి నీవేమి చేయగోరుచున్నావు? మంగళప్రద మయిన ఈ మహర్షి ఆశ్రమానికి వచ్చిన నీవెవరవు?' అని అడిగింది. పిమ్మట యథావిధిగా గౌరవింపబడిన రాజు తియ్యగా మాట్లాడే, అందమైన ఆ సుందరితో ఇలా పలికాడు.

('కమలలోచనా! నేను ఇలిలుడనే మహాత్ముడయిన రాజర్షి కుమారుడను. నాపేరు దుష్యంతుడు. ఇది సత్యం.)

పూజ్యుడగు కణ్వమహర్షిని ఉపాసించటానికి వచ్చాను. భద్రా! పూజ్యుడగు ఆ మహర్షి ఎక్కడకు వెళ్ళాడు? ఆ విషయం నాకు చెప్పు.' శకుంతల ఇలా అంది - 'పూజ్యుడగు నాతండ్రి ఫలాల కోసం ఆశ్రమంనుండి బయటకు వెళ్లాడు. ముహూర్తకాలం నిరీక్షించు. ఆయన వస్తారు. చూడవచ్చు.'

ఋషి కనబడక పోవడం, ఆమె ఆవిధంగా చెప్పడంతో చక్కని శరీరసౌష్ఠవం, అందమైన చిరునవ్వు, తపస్సు, ఇంద్రియనిగ్రహం రూపయౌవన సంపదలు గల్గిన ఆమెను చూసి రాజిలా అన్నాడు. 'సుందరీ! నీవెవరు ? ఎవరికూతురువు? ఈ వనానికి ఎందుకు వచ్చావు? ఇంత చక్కటి రూపంతో ఉన్న నీవు ఇక్కడకు ఎలా వచ్చావు ? చూపుతోనే నీవు నామనస్సును హరించావు. 'నీవెవరవో' తెలుసుకోవా లనుకొంటున్నాను - చెప్పు.

(సుందరీ! నామాట విను. నేను 'పూరు' రాజవంశంలో జన్మించాను. ఇప్పుడే నేను నిన్ను వరిస్తున్నాను. క్షత్రియ స్త్రీ కాని వారిపట్ల నామనసెప్పుడూ ప్రవర్తింపదు. ఋషిపుత్రికల విషయంలో కాని, సవర్ణులు కాని స్త్రీల విషయంలో కాని నామనసుపోదు. మధుర భాషిణీ! నీయందే నామనసు లగ్నమైంది. తెలుసుకో. నామనస్సు విప్రస్త్రీ విషయంలో ప్రవర్తింపదు. ! నిన్ను నేను సేవిస్తున్నాను. నీభక్తుడను, నన్ను నీవు సేవింపదగినదానవు. విశాలాక్షీ! నా రాజ్య మనుభవించు. మరో ఆలోచన వద్దు.')

ఆశ్రమంలో అలా ఆరాజు పలుకగా ఆమె నవ్వుతూ మధురాక్షరాలతో ఇలా పలికింది - 'దుష్యంతా! నేను పూజ్యుడు, తపస్వి, ధృతిమంతుడు, ధర్మజ్ఞుడు, మహాత్ముడు ఐన కణ్వుని కూతురిని. రాజా! నేను స్వతంత్రురాలను కాను. కాశ్యపుడు నాతండ్రి, గురువు కూడ. నీవతనినే ప్రార్థించు. స్వేచ్ఛగా, అనుచితంగా ప్రవర్తించటం తగదు.' అపుడు దుష్యంతుడిలా అన్నాడు - 'ఊర్ధ్వరేతసుడు, లోకపూజితుడు, పూజ్యుడు అయిన కణ్వమహర్షి నియమవ్రతుడు. ధర్మదేవు డయినా నడవడి నుండి చలిస్తాడేమోకాని ఈ మహర్షి మాత్రం చలింపడు. నీవు ఆతనికి కూతు రెట్లా అయ్యావు? నాకు చాలా పెద్ద సందేహం కలుగుతోంది. దాన్ని తీర్చగల దానవు నీవే.' అపుడు శకుంతల ఇట్లా అంది - 'రాజా! ఈ ఋషి రాక నాకొఱకు ఎలా జరిగిందో, (మునుపు నారాక ఎలా జరిగిందో, ఈ మునికి కూతురను ఎట్లా అయ్యానో) యథార్థంగా చెబుతాను. విను.

(వేరొక విధంగా ఉన్న తన్నుగూర్చి మరొకవిధంగా మహాత్ముల దగ్గర చెప్పేవాడు పాపాత్ముడు, మూర్ఖుడు, దొంగ, ఆత్మవంచకుడూ అవుతాడు.)

రాజా! ఒకానొక ఋషి ఇక్కడకు వచ్చి ఒకనాడు నా జన్మ గురించి ప్రశ్నించాడు.

(నీవు ఊర్ధ్వరేతసుడవు ఎలా అయ్యావు? ఈ శకుంతల ఎలా వచ్చినది? నీకు ఈమె కూతురెట్లయింది ? కాశ్యపా? నాకు నిజం చెప్పు.)

అతనికి పూజ్యుడయిన కాశ్యపుడు చెప్పిన ప్రకారం నీకు నేను చెపుతాను. విను. పూర్వమొకప్పుడు విశ్వామిత్రుడు గొప్పతపస్సు చేయసాగాడు. దానివల్ల దేవగణాధిపుడైన ఇంద్రుడు మిక్కిలి సంతాపం పొందాడు. 'తపశ్శక్తితో ఈ విశ్వామిత్రుడు నన్ను ఈ ఇంద్రస్థానం నుండి పడగొట్టునేమో' అని భయపడిన దేవేంద్రుడు మేనకతో ఇలా అన్నాడు. 'మేనకా! అప్సరలలో దివ్యగుణాలతో నీవు గొప్పదానవు. నాకు శ్రేయస్కర మయిన పనిని నీవు చెయ్యి. ఆ పని చెపుతాను విను. సూర్యునితో సమానంగా ప్రకాశించే ఈ విశ్వామిత్రుడు ఘోరమైన తపస్సు చేస్తూ నా మనస్సును వణికిస్తున్నాడు. సుందరీ ! ఈ విశ్వామిత్రుని చలింపచేసే భారం నీది. ఇతడు కఠోరనియమం కలవాడు. జయించడానికి శక్యంకానివాడు. ఉగ్రమైన తపస్సులో ఉన్నవాడు. అతడు నన్ను నాస్థానం నుండి పడగొట్టరాదు. నీవు వెళ్ళి అతనిని ప్రలోభపెట్టు. అతనికి తపోభంగం కలిగించు, సుందరీ! నీరూపంచేత, యౌవనంచేత, సౌందర్యంచేత, చేష్టలచేత, చిరునవ్వులచేత, తీయనిమాటలచేత అతనిని ప్రలోభపరచి తపస్సు నుండి మరలించు.' అపుడు మేనక ఇలా అంది - 'దేవరాజా! పూజ్యు డయిన విశ్వామిత్రుడు మహాతేజస్వి, మహాతపస్వి, కోపిష్ఠి. ఆతని ఈ స్వభావం మీకు తెలుసు. ఆ మహాత్ముని తేజస్సుకు, తపస్సుకు, క్రోధానికి, మీరుకూడా భయపడుతున్నారు కదా! ఇక నేనెలా భయపడకుండా ఉంటాను ? అతడు మహాత్ముడైన వసిష్ఠుని తన ప్రియమైన కొడుకుల నుండి విడదీసినవాడు. క్షత్రియజాతిలో పుట్టి తపోబలంతో బ్రాహ్మణు డైనవాడు. లోతులేని నదిని స్నానం చేయడం కష్టమయ్యేంత నీటితో నింపిన వాడు. దానినే జనులు 'కౌశిక' అని పిలుస్తారు. పూర్వమొకప్పుడు కష్టకాలంలో విశ్వామిత్రుని భార్యను శాపవశం వల్ల వ్యాధుడై ఉన్న ధర్మాత్ముడైన రాజర్షి మతంగుడు (త్రిశంకుడు) పోషించాడు. దుర్భిక్షకాలం గడిచాక ఆ మతంగమహర్షి మళ్లీ విశ్వామిత్రుని ఆశ్రమానికి వచ్చి 'పారా' అని ఈ కౌశికీనదికి పేరుపెట్టి వెళ్ళాడు. సురేశ్వరా! మతంగుడు చేసిన ఉపకారానికి ప్రీతినొందిన విశ్వామిత్రుడు తాను స్వయంగా అతనిచే యజ్ఞం చేయించాడు. ఆ యజ్ఞంలో అతనికి భయపడి నీవు కూడా సోమపానం చేయడానికి వెళ్ళావు. క్రుద్ధుడైన విశ్వామిత్రుడు నక్షత్రసంపదతో వేరే లోకాన్ని సృష్టించాడు. ప్రతిశ్రవణం మున్నగు నక్షత్రాలను చేశాడు. గురుశాపం తగిలిన త్రిశంకువుకు శరణ మిచ్చాడు.

('రాజర్షి ఐన కౌశికుడు బ్రహ్మర్షి శాపాన్ని ఎలా విడిపిస్తాడు?' అని దేవతలు యజ్ఞంలోని హవ్యాలను తిరస్కరించి, వాటిని నాశనం చేశారు. అపుడు విశ్వామిత్రుడు మళ్లీ యజ్ఞాంగాలను

సృష్టించి, త్రిశంకువును స్వర్గానికి పంపాడు.)

ఇటువంటి అద్భుతకృత్యాలు చేసిన ఆ మహాత్మునికి నేను ఎంతో భయపడుతున్నాను. అతడు క్రుద్ధుడై నన్ను భస్మం చేయకుండా మీరు నన్ను ఆజ్ఞాపించండి. అతడు తన తేజస్సుతో లోకాలను దహింపగలడు. భూమిని కంపింపచేయగలడు. మేరుపర్వతాన్ని విసిరి వేయగలడు. దిక్కులను శీఘ్రంగా త్రిప్పగలడు. అగ్నివలె ప్రజ్వలించే అటువంటి తపస్సంపన్నుడు, జితేంద్రియుడూ అయిన విశ్వామిత్రుని నావంటిస్త్రీ ఎలా తాకగలదు ? సురశ్రేష్ఠా! అగ్నివంటి ముఖం, సూర్యచంద్రుల వంటికళ్ళు, కాలసర్పం వంటి నాలుక కల ఆ మహర్షిని నావంటి స్త్రీ ఎలా తాకగలదు? యముడు, చంద్రుడు, మహర్షులు, సాధ్యులు, విశ్వేదేవతలు, వాలఖిల్యమహర్షులు, అందరూ ఆ విశ్వామిత్రుని ప్రభావానికి భయపడతారు కదా! నావంటిది ఎలా భయపడకుండా ఉండగలదు ? సురేంద్రా! నీవీ విధంగా ఆజ్ఞాపించాక ఆ మహర్షి దగ్గరకు వెళ్ళకుండా ఎలా ఉండగలను ? ! నారక్షణ గురించి ఆలోచించు. నీచేత రక్షింపబడి నేను మళ్లీ వచ్చి నీకోసమే పని చేయగలను . దేవేంద్రా! నీ అనుగ్రహంవల్ల అక్కడ నేను స్వేచ్ఛగా ఆడే సమయంలో వాయువు తగిన సమయంలో నావస్త్రాన్ని దూరంగా తొలగించుగాక! నాపనిలో మన్మథుడు తోడుగా ఉండుగాక! ఆ ఋషిని నేను ప్రలోభపరిచే సమయంలో వనంలో పరిమళభరితమైన వాయువు వీచుగాక!' "అలాగే" అని ఇంద్రుడు చెప్పినతరువాత ఆమె కౌశికుని ఆశ్రమానికి వెళ్లింది.

72. శకుంతలా జననము.

కణ్వుడిలా అన్నాడు – మేనక ఆ విధంగా చెప్పగానే ఆమెవెంట వెళ్ళుమని ఇంద్రుడు వాయువును ఆదేశించాడు. అపుడు మేనక వాయువుతో బాటు బయలుదేరింది. వనానికి చేరుకొంది మేనక. తనపాపాల్ని దగ్ధం చేసి ఆశ్రమంలో తపస్సు చేసుకొంటున్న విశ్వామిత్రుని భీరువు అయిన మేనక చూసింది. ఆమె ఋషికి నమస్కరించి, ఆతని ఎదుట నాట్యమాడడం ప్రారంభించింది. చంద్రునిలా స్వచ్ఛంగా ప్రకాశించే ఆమెవస్త్రాన్ని వాయువు తొలగించాడు. నేలమీదపడిన తన వస్త్రాన్ని తీసికోవటానికి వాయువును చూసి ఆశ్చర్యపడ్డట్టు సిగ్గుపడుతూ మేనక అక్కడకు వచ్చింది. అగ్నితో సమానంగా ప్రకాశించే విశ్వామిత్రుడు చూస్తూండగా మేనక అక్కడకు వచ్చింది. ఆమె సంకటస్థితిలో ఉన్నది. గౌరవింపదగినది. వస్త్రం తీసికోవాలనే కంగారులో ఉన్నది. చెప్పనలవికాని వయోరూపాలతో వివస్త్రయై ఉన్నమేనకను ఆ మునిసత్తముడు చూశాడు. ఆమె రూపగుణాలను చూసి,

బ్రహ్మర్షి విశ్వామిత్రుడు కామవశుడై, ఆమె సాంగత్యాన్ని కోరుకొన్నాడు. అతడు ఆమెను దగ్గరకు రమ్మని పిలిచాడు. అందమైన ఆమె కూడ అందుకు ఇష్టపడింది. వా రుభయులు చాలాకాలం అక్కడ విహరించారు. రోజుకొక్కవిధంగా స్వేచ్ఛగా వారు క్రీడించారు. ఎప్పుడూ సహనంతో ఉండే విశ్వామిత్రుడు కామక్రోధాలను జయింప లేకపోయాడు. చాలాకాలంగా సంపాదించుకొన్న తపస్సును నాశనం చేసికొన్నాడు. తపస్సు క్షీణించడంవల్లనే అతనిని మోహం ఆవరించింది. కామరాగసహితు డయిన అతనిని ఆమె సమీపించింది. మేనక యందు ఆ మునికి శకుంతల జన్మించింది. రమ్యమైన హిమవత్పర్వత సానువులలో మాలినీనదీ తీరంలో పుట్టిన ఆ పసిగుడ్డును వదిలి మేనక తనపని పూర్తయిందని శీఘ్రంగా ఇంద్రసభకు వెళ్ళిపోయింది. సింహవ్యాఘ్ర సమూహాలు సంచరించే ఆ వనంలో (పడి ఉన్న మాంసం తినే) గ్రద్దలు మున్నగునవి హింసించకుండా శకుంతాలు ఆ శిశువును చుట్టూ ఉండి రక్షింపసాగాయి. ఆ బాలికను శకుంతాలు రక్షిస్తున్నాయి. అపుడు ఆచమనం చేయడానికి మాలినీనదీ తీరానికి వెళ్ళిన నేను నిర్జనవనంలో శకుంత రక్షిత అయి నిద్రిస్తూన్న ఆ బాలికను చూశాను. నన్ను చూడగానే ఆ పక్షులన్నీ నాపాదాలపై పడి మధురంగా ఇలా అన్నాయి.

'విశ్వామిత్రుని కూతురైన ఈ బాలికను నీవు న్యాసంగా పోషించు. కామక్రోధాలకు లోబడిన నీ మిత్రుడు కౌశికీనదికి వెళ్ళాడు. అందువల్ల నీవు ఆతని పుత్రికను పోషించు' అని అన్నాయి. కణ్వుడిలా చెప్పాడు - 'నేను అన్నిప్రాణుల శబ్దాలను తెలిసినవాడిని. అన్ని ప్రాణులయందు దయగలవాడిని. ఈమె ఈ నిర్జనమైన మహారణ్యంలో శకుంతాలచే రక్షింపబడినది. ఈమెను అక్కడ నుండి తీసికొనివచ్చి కూతురుగా పెంచాను. శరీరాన్ని ఇచ్చినవాడు, ప్రాణదాత, అన్నంపెట్టినవాడు క్రమంగా ఈ ముగ్గురు తండ్రులని ధర్మశాస్త్రంలో చెప్పబడింది. నిర్జనవనంలో శకుంతాలచే రక్షింపబడటం వల్ల శకుంతల అని ఈమెకు నామకరణం చేశాను. బ్రాహ్మణా! ఈ విధంగా ఈ శకుంతల నాకు కూతురయింది అని గ్రహించు. దోషరహిత అయిన శకుంతల కూడా నన్ను తండ్రిగా భావిస్తుంది.' శకుంతల ఇలా అంది - 'రాజా! నాజన్మ వృత్తాంతాన్ని అడిగిన మహర్షికి కణ్వమహర్షి ఈ విధంగా చెప్పాడు. ఈ విధంగా నేను కణ్వమహర్షికి కూతురు నయ్యానని గ్రహించు. తండ్రిని ఎరుగని నేను కణ్వమహర్షినే తండ్రిగా భావిస్తున్నాను. నేను విన్నది విన్నట్లుగా నీకు చెప్పాను.'

73. శకుంతలా దుష్యంతుల గాంధర్వ వివాహము.

దుష్యంతుడిలా అన్నాడు- 'కల్యాణీ! నీవు రాజపుత్రిక వని నీ మాటల్లో స్పష్టపడింది. నీవు నా భార్యవు కావాలి. నీకోసం నేనేమి చేయాలో చెప్పు. బంగారు హారాలు, వస్త్రాలు, బంగారుకుండలాలు, కేయూరాలు పట్టణంలో తయారైన స్వచ్ఛమైన మణిరత్నాలు, నిష్కాలు, మృగాజినాలు ఈరోజునే నీకు తీసికొని వస్తాను. సమస్తరాజ్యమూ నీదే. నీవే నా భార్యవు కావాలి. సుందరీ! నన్ను గాంధర్వవిధితో వివాహమాడు. వివాహాలలో గాంధర్వం శ్రేష్ఠమైనది.' అపుడు శకుంతల ఇలా అంది- 'రాజా! నాతండ్రి పండ్లు తేవడానికి ఆశ్రమంనుండి బయటకు వెళ్ళాడు. ముహూర్తకాలం వేచి ఉండు. అతడు నన్ను నీకు ఇవ్వగలడు.

(నా తండ్రి నాకు ఎప్పుడూ పరదేవతయే. అతడు ఎవరికి నన్నిస్తే ఆతడే నాభర్త. కౌమారంలో తండ్రి, యౌవనంలో భర్త, ముసలితనంలో పుత్రుడు స్త్రీని రక్షిస్తూ ఉంటారు. స్త్రీకి స్వాతంత్ర్యం పనికిరాదు, రాజేంద్రా! తపస్వి అయిన తండ్రిని లెక్కచేయకుండా అధర్మంగా పతిని ఎలా వరించగలను?' దుష్యంతుడిలా అన్నాడు 'సుందరీ! నీవీ విధంగా అనకు. తపోరాశియైన కణ్వుడు మిక్కిలి దయాళువు.' శకుంతల ఇలా అంది 'విప్రులకు కోపమే ఆయుధం. వారి చేతులలో ఆయుధాలుండవు. అగ్ని తేజస్సుతో దహిస్తాడు. సూర్యుడు కిరణాలతో దహిస్తాడు. రాజు దండంతో దహిస్తాడు. బ్రాహ్మణుడు కోపంతో దహిస్తాడు. ఇంద్రుడు రాక్షసులను చంపినట్లుగా కోపం వచ్చిన విప్రుడు కోపంతో చంపుతాడు.')

అపుడు దుష్యంతుడిలా అన్నాడు - 'సుగుణవతీ! నీవు స్వేచ్ఛగా నన్ను సేవించాలని కోరుకొంటున్నాను. నీకోసమే నేనిక్కడున్నానని గ్రహించు. నామనస్సు నీమీదే లగ్నమైంది. తనకు తానే బంధువు. తనకు తానే దిక్కు. తనకు తానే మిత్రం. తనకు తానే తండ్రి. ధర్మం ప్రకారం తన్ను తానే దానం చేసికోవచ్చు. ధర్మం ప్రకారం మొత్తం ఎనిమిది రకాల వివాహాలు చెప్పబడ్డాయి. బ్రాహ్మం, దైవతం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం అని ఎనిమిది రకాలు. వాటిలో ధర్మసమ్మతాలైనవి స్వాయంభువ మనువు చెప్పినట్లుగా చెప్తాను. అందులో మొదటి నాలుగు బ్రాహ్మణులకు ప్రశస్తా లైనవి. మొదటి ఆరు క్షత్రియులకు ధర్మసమ్మతాలు. రాజులకు రాక్షసం కూడా యుక్తమే. వైశ్య, శూద్రులకు ఆసురం చెప్పబడింది. చివరి ఐదింటిలో మూడు ధర్మసమ్మతాలు. రెండు ధర్మసమ్మతాలు కావు. పైశాచ, ఆసురా లెప్పుడూ చేయదగినవికావు. ఈ విధానంతో వివాహం చేసికోవాలి. ధర్మంయొక్క మార్గం ఇది. గాంధర్వరాక్షసాలు క్షత్రియులకు ధర్మసమ్మతాలు. వానిని నీవు శంకింపవద్దు. ఈ రెండూ వేరువేరుగా కాని, కలిపి కాని చేయదగినవి. ఇందులో ఎట్టి సందేహమూ లేదు. సుందరీ! నీపట్ల కోరికతో ఉన్న నాకు, కోరికతో ఉన్న నీవు గాంధర్వవివాహం ద్వారా భార్య కావటానికి అర్హురాలవు.' శకుంతల

ఇలా అంది – 'పౌరవ శ్రేష్ఠా! ఇది ధర్మమార్గమే అయితే, నన్ను నేను దానం చేసుకొనుటకు సమర్థురాలనే అయితే నా నియమం విను. నాకు నిజంగా మాట ఇయ్యి. నేను నీకు రహస్యంగా (ఏకాంతంగా) చెప్తున్నాను. నాయందు పుట్టిన కుమారుడే నీ తరువాత యువరాజు కావాలి. మహారాజా! నేను నిజం చెపుతున్నాను. ఇది ఇలా జరిగేటట్లయితే నీతో నా కలయిక జరుగుతుంది.' అపుడు రాజు ఆలోచించకుండా 'అలాగే కానిమ్ము' అన్నాడు. ఇంతేకాక 'నేను నిన్ను నగరానికి తీసికొని వెళ్తాను' అని కూడా చెప్పాడు. 'సుందరీ! నీవు రాజమందిరంలో ఉండటానికి యోగ్యురాలవు. నేను నిజం చెపుతున్నాను.' అని చెప్పి ఆ రాజర్షి ఉత్తమమైన నడవడిగల ఆమెను యథావిధిగా పాణిగ్రహణం చేసి, ఆమెతో పాటు నివసించాడు. ఆమెకు విశ్వాసం కలిగించి, 'నీకోసం చతురంగ బలాలను పంపుతాను. దానితో నిన్ను నా నివాసానికి రప్పించుకొంటాను' అని మరల మరల చెప్పి

(ఆ రాజర్షి ఆమెను కౌగిలించుకొని చిరునవ్వుతో చూశాడు. ఆమె అతనికి ప్రదక్షిణం చేసింది. ఆమె నాతడు కౌగిలించుకొన్నాడు. శకుంతల కన్నీటితో రాజు పాదాలమీద పడింది. అతడామెను మరల లేవదీసి 'రాజకుమారీ! నిన్ను తప్పక తీసికొని వెళ్తాను విచారించకు. నా పుణ్యంతో ప్రమాణం చేస్తున్నా' అని మళ్ళీమళ్ళీ చెప్పి వెళ్లాడు.)

ఇలా ఆమెకు మాట ఇచ్చి ఆ దుష్యంతుడు కాశ్యపుని గురించి మనస్సులో ఆలోచిస్తూ వెళ్ళాడు. పూజ్యుడు, తపోయుక్తుడు అయిన కాశ్యపుడు ఈ వార్త విని ఏం చేస్తాడో! అని ఆలోచిస్తూనే తన నగరాన్ని ప్రవేశించాడు. అతడు వెళ్ళాక ముహూర్తకాలం గడిచేసరికి కణ్వుడు ఆశ్రమానికి వచ్చాడు. శకుంతల సిగ్గుతో తండ్రిని సమీపించలేదు.

(భయంతో శంకిస్తూ ఆ బ్రహ్మర్షిని మెల్లగా సమీపించింది. అతనికి ఆసనం తీసికొని వచ్చి వేసింది. కాని సిగ్గుతో శకుంతల అతనితో మాట్లాడలేదు. స్వధర్మం నుండి తప్పినందు కామె భయపడింది. స్వేచ్ఛగల బ్రహ్మచారిణి అయిన ఆమె తప్పు వల్ల భయపడింది. అలా సిగ్గుపడుతున్న ఆమెను చూసి మహర్షి ఆమెతో ఇలా అన్నాడు. 'దీర్ఘాయుష్మంతురాల వయిన నీవు సిగ్గువడుతున్నావు. మునుపటిలా ఇపుడు లేవు. కళ్యాణీ! జరిగింది చెప్పు. భయపడకు.' ఆటుతరువాత అతికష్టం మీద సిగ్గుతో, బొంగురుపోయిన కంఠంతో శకుంతల కాశ్యపునితో ఇలా చెప్పింది. 'తండ్రీ! ఇలిలాత్మజుడైన దుష్యంతమహారాజు ఇక్కడకు వచ్చాడు. దైవయోగం వల్ల ఈ ఆశ్రమానికి వచ్చిన అతనిని నేను పతిగా వరించాను. తండ్రీ! అతనివట్ల ప్రసన్నుడవై ఉండు. గొప్పయశస్సుగల అతడు నాభర్త. ఆపై జరిగినదంతా నీవు దివ్యజ్ఞానంతో చూడగలవు. క్షత్రియవంశానికి అభయమిచ్చి అనుగ్రహించు.')

మహాతపస్వి అయిన కణ్వుడు దివ్యజ్ఞానంతో వృత్తాంతాన్నంతా తెలిసికొన్నాడు. దివ్య చక్షువుతో చూస్తూ, ప్రీతినొంది పూజ్యు డయిన కణ్వు డిలా అన్నాడు. ఆయుష్మతీ! నన్ను లక్ష్యపెట్టక ఈ రోజు నీ వా పురుషుని సంగమించడం ధర్మమేని కాదు. కోరుకొన్న

ఆమె కోరుకొన్న వానితో ఏకాంతంగా మంత్రరహితంగా కలవడమనే గాంధర్వవివాహం క్షత్రియులకు శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. దుష్యంతుడు ధర్మాత్ముడు, మహాత్ముడు, పురుషోత్తముడు. శకుంతలా! నీవు యోగ్యుడైన పతిని పొందావు. నీకు మహాత్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు జన్మిస్తాడు. అతడు సాగరపర్యంత భూమినంతా పరిపాలిస్తాడు. శత్రువులపై దండెత్తితే ఆ చక్రవర్తి రథం అడ్డులేనిదై ముందుకు సాగుతుంది.' ఇలా అన్న తరువాత తండ్రి తెచ్చిన పండ్లను తీసుకొని భద్రపరిచి శకుంతల కణ్వుని పాదాలు కడిగింది. కణ్వుడు విశ్రాంతి తీసుకొంటూ ఉండగా శకుంతల ఇలా అంది. 'పురుషోత్తముడైన దుష్యంతమహారాజును నేను పతిగా వరించాను. కావున నీవు సచివులతో కూడిన అతనిపట్ల అనుగ్రహాన్ని చూపు.' అపుడు కణ్వుడిలా అన్నాడు – 'నీకొరకు అతనిపట్ల నేను ప్రసన్నుడనే. శుచిస్మితా! అనేక ఋతువులు నీకు వ్యర్థంగా గడిచాయి. ఇపుడు ఈ ఋతుకాలం సార్థకమయింది. నీకు పాపంలేదు. నీకు (కావలసిన) ఇష్టమైన వరాన్ని నానుండి గ్రహించు.' వైశంపాయనుడిలా అన్నాడు – 'జనమేజయా! అపుడు శకుంతల దుష్యంతుని హితాన్ని కోరి పౌరవుల ధర్మిష్ఠతనూ, రాజ్యంనుండి భ్రష్టతలేకపోవటాన్ని కోరుకొంది.' 'అట్లే అగుగాక' అని పలికి ధార్మిక శ్రేష్ఠుడైన కణ్వుడు లక్ష్మిలా ఉన్న కూతురును తన చేతులతో స్పృశించాడు.

(కణ్వుడిలా అన్నాడు – ఇప్పటినుండి నీవు మహాత్ముడైన దుష్యంతుని దేవేరివి. పతివ్రతల నడవడికను నీవు నిరంతరం పాటించు.)

74. భరత జననము – రాజసభలో శకుంతల తన నిర్దోషితను నమర్థించుట.

(శకుంతలకు మాట ఇచ్చి, దుష్యంతుడు వెళ్ళిన తర్వాత ఆ రాజపుత్రిక గర్భం క్రమంగా వృద్ధి చెందింది. కార్యభారంపట్ల దృష్టి ఉంచి, శకుంతల నిరంతరం రాజును గూర్చి ఆలోచిస్తూ ఉంది. రాత్రింబవళ్లు స్నానభోజనాలు విడిచిపెట్టింది. రాజుపంపిన బ్రాహ్మణులు, చతురంగబలసైన్యమూ ఈరోజో, రేపో, ఎల్లుండో వచ్చి తన్ను తీసికొని వెళ్తారని దృఢనిశ్చయంతో ఉంది. ఇలా రోజులు పక్షాలు, మాసాలు, ఋతువులు, అయనాలు లెక్కిస్తూండగా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.)

జనమేజయా! మూడు సంవత్సరాలు పూర్తికాగానే, శకుంతల అగ్నివలె ప్రకాశిస్తున్న రూపం, ఔదార్యం మొదలయిన గుణాలతో కూడి ఉన్న పుత్రుని ప్రసవించింది.

(ఆతనిమీద అంతరిక్షంనుండి పూలవాన పడింది. దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలు నృత్యం చేశారు. తీయగా గానం చేశారు. అపుడు ఇంద్రుడు దేవతలతో కూడి ఇలా పలికాడు. 'శకుంతలా! నీ కుమారుడు చక్రవర్తి అవుతాడు. అతనితో సమానమైన బలం, పరాక్రమం కలవాడు

ఈ భూమిమీద ఉండడు. పూరువంశంలో పుట్టిన ఇతడు నూరు అశ్వమేధాలు చేస్తాడు. రాజసూయాది యాగాలు వేలకొద్దీ. చేసి బ్రాహ్మణులకు తన ధనాన్నంతా దక్షిణగా సమర్పిస్తాడు.' దేవతల మాటలు విని కణ్వాశ్రమంలోని మహర్షులందరూ శకుంతలను గౌరవించారు. శకుంతల కూడ వారిమాటలను విని, మిక్కిలి ఆనందించింది.)

కణ్వమహర్షి బ్రాహ్మణులను పిలిచి సత్కరించాడు. మునులచేత ఆ బాలునికి జాతకర్మాది సంస్కారం యథావిధిగా చేయించాడు. అతడు తెల్లనై, మొనదేలిన దంతాలు, సింహంతో సమానమైన శరీరసౌష్ఠవం కలవాడు. చక్రాంకితమైన చేతులు, ఉన్నతమైన ఫాలం, గొప్పబలమూ కలవాడు. ఆ బాలుడు దేవతా బాలుడిలా ఉన్నాడు. అత డా ఆశ్రమంలో తొందరగా పెరగసాగాడు. ఆరుసంవత్సరాల బాలుడే అయినా కణ్వాశ్రమానికి దగ్గర్లో సింహవ్యాఘ్రాలను, అడవిపందులను, అడవి దున్నలను చెట్లకు కట్టివేసేవాడు. అతడా సింహవ్యాఘ్రాదులపై ఎక్కుతూ, వాటిని లొంగదీస్తూ వాటితో ఆడుతూ, పరిగెడుతూ ఉన్నాడు.

(అతడు రాక్షసులను, పిశాచాలను, శత్రువులు యుద్ధంలో జయించాడు. ఋషులను ఆరాధించాడు. రాక్షసులను చంపుతున్న అతడిని చంపాలని ఒక బలవంతుడైన దైత్యుడు వచ్చాడు. అతడిని చూసి నవ్వుతూనే బాలుడు తన బాహువులతో బంధించి మర్దింపసాగాడు. అతడు ఆ బంధాన్ని విడిపించుకోలేకపోయాడు. అతడు బాధను తట్టుకోలేక భయంకరంగా అరిచాడు శరీరంలోని రంధ్రాలనుండి రక్తం స్రవించింది. అతడు చేసిన శబ్దానికి భయపడిన మృగాలు, సింహాలు,మలమూత్రాలు విడుస్తూ పరుగెత్తాయి. ఆ కేకకు భయపడి ఆశ్రమంలో జంతువులు కూడా మలమూత్రాలు స్రవించాయి. తన మోకాళ్ళతో అతనిని ప్రాణహీనుని చేశాడు. అతడు నేలకొరిగాడు. ఆసన్నివేశం చూసిన ఆశ్రమవాసులు ఆ బాలుని పరాక్రమానికి ఆశ్చర్యపోయారు. అప్పటి నుండి అతనివల్ల భయంతో రాక్షసులు ఆశ్రమంలోకి వెళ్ళడం మానేశారు.)

అనంతరం ఆ ఆశ్రమనివాసులంతా అతనికి పేరుపెట్టారు. అన్నింటిని అణచగలవాడు కావున ఇతడు 'సర్వదమనుడు' అగుగాక. అందువలన ఆ బాలుడు సర్వదమనుడు అయ్యాడు. పరాక్రమంచేత, తేజస్సుచేత, బలంచేత అతడు సర్వదమనుడే అయ్యాడు.

(పట్టపురాణి శకుంతలకోసం, కుమారునికోసం దుష్యంతుడు మనుషులను పంపలేదు. శకుంతల చింతతో తెల్లగా పాలిపోయింది. వేలాడుతున్న జుట్టు, మలినవస్త్రం కలిగి కృశించి దీనంగా ఉంది శకుంతల. పన్నెండు సంవత్సరాలు నిండేసరికి పుత్రుడు శాస్త్రాలు, సర్వవేదాలు అధ్యయనం చేశాడు.)

కణ్వమహర్షి అతిమానుషమైన అతనిచేష్టలను చూసి యౌవరాజ్యానికి తగినసమయమని శకుంతలతో ఇలా అన్నాడు.

(కల్యాణీ! అమ్మాయీ! పతివ్రతలైన స్త్రీలవిషయంలో విశిష్ట విషయాన్ని చెపుతున్నాను. నామాటను విను. మనస్సు, వాక్కు, శరీరం, కర్మలచే భర్తను ముందుగ సేవించాలి. నాచే అనుమతింపబడి

ముందుగ భర్తను పూజించు. ఇది నీకు వ్రతం. ఈ విధమైన ప్రవృత్తిచేతనే విశిష్టమైన సంపదను పొందగలవు. భద్రా! అందువల్ల నీవు పూరువంశరాజైన దుష్యంతుని దగ్గరకు వెళ్ళు. అతడు స్వయంగా రావడంలేదనే ఆలోచనచేత నీకు కాలం గడిచిపోయింది. రాజు హితాన్ని కోరి, నీవు దుష్యంతుని వద్దకు వెళ్ళి, అతనిని సేవించు. నీకుమారుడగు దౌష్యంతుని యువరాజ పదవిలో చూసి ఆనందాన్ని పొందుతావు. దేవతలు, గురువులు, క్షత్రియులు, భర్త-వీరి యొక్క కలయిక నవ్మార్గులకు విశేషమైన హితాన్ని కలిగిస్తుంది. అందువల్ల అమ్మాయీ! నాకిష్టాన్ని కలిగించేందుకైనా నీవు నీ కొడుకుతో భర్త దగ్గరకు వెళ్ళాలి. నాపాదాలపై ఒట్టేసి చెపుతున్నా. నీవు నాకు వ్యతిరేకంగా మాట్లాడవద్దు.' కూతురుతో ఇలా మాట్లాడి కణ్వుడు మనుమని చేతులతో కౌగలించుకొని, శిరస్సుపై ముద్దిడుకొని, ఇలా అన్నాడు. 'చంద్రవంశంలో పుట్టిన దుష్యంతుడు ప్రసిద్ధుడు. పవిత్రురాలయిన నీతల్లి ఆతనికి పట్టపురాణి. నీతోపాటు ఆమె భర్త దగ్గరకు వెళ్ళాలనుకొంటోంది. వెళ్ళి రాజుకు అభివాదం చేసి యౌవరాజ్యం పొందుతావు. ఆ రాజేంద్రుడు నీ తండ్రి, నీవతని అధీనంలో ఉండు. తాతతండ్రుల రాజ్యాన్ని సహజంగా పరిపాలన చెయ్యి. శకుంతలా! హితమూ, పథ్యమూ అయిన నామాట విను. పతివ్రతా సంబంధమగు గుణాలను విడిచి సాధింపదగింది లేదు. అన్నివరాల నిచ్చే దేవతలు పతివ్రతలపట్ల సంతుష్టులై ఆపత్సమయంలో అనుగ్రహిస్తారు. భర్త అనుగ్రహంవల్ల పతివ్రతలు పుణ్యగతిని పొందుతారు. అమంగళాన్ని పొందరు. అందువల్ల నీవు వెళ్లి రాజును సేవించు.')

కణ్వుడు బాలుని బలాన్ని గ్రహించి శిష్యులతో ఇలా అన్నాడు- అన్ని మంచిలక్షణాలతో గౌరవింపదగిన ఈ శకుంతలను కుమారునితో బాటు తొందరగా ఈ ఇంటి నుండి తీసికొనివెళ్ళి భర్తనివాసానికి చేర్చండి. బంధువుల దగ్గర స్త్రీలు ఎక్కువకాలం ఉండటం మంచిదికాదు. అలా ఉంటే కీర్తికీ, నడవడికకూ, ధర్మానికీ హానికరం. అందువల్ల తొందరగా తీసికొని వెళ్ళండి.

(వైశంపాయనుడిలా అన్నాడు- కాశ్యపుడు ధర్మానుసారంగా తనకుమారుని ఆదరించడం విన్న శకుంతల కాశ్యపుని అనుమతిని పొంది ఆనందించింది. కణ్వుడు అనేకపర్యాయాలు 'భర్తవద్దకువెళ్ళు' అని చెప్పడంవిని, పూరువంశసంజాతుడైన ఆ బాలుడు కణ్వునితో అట్లే అని వలికి, తల్లితో 'అమ్మా! నువ్వింకా ఆలస్యం చేస్తున్నా వేమిటి? రాజభవనానికి వెళ్దాం' అన్నాడు. మహాత్ముడైన దుష్యంతుని భార్య శకుంతలతో అలా పలికి, మహర్షి పాదాలకు నమస్కరించి, పూరువంశసంజాతుడైన సర్వదమనుడు బయలుదేరాడు. శకుంతల కూడ తండ్రికి నమస్కరించి, చేతులు జోడించి ప్రదక్షిణంచేసి తండ్రితో ఇలా అంది- 'తండ్రి అనే చనవుతో అజ్ఞానంవల్ల పొరపాటు మాట్లాడినా, అసత్యం చెప్పినా, చేయకూడని పనిచేసినా, అనిష్టమైన పని చేసినా నన్ను క్షమించు.' ఆమె అలా అంటే కణ్వమహర్షి తలదించుకొని ఏమీ మాట్లాడలేదు. మనుష్యస్వభావంవల్ల అతడుకూడా కన్నీరు పెట్టుకొన్నాడు. తన ఆశ్రమంలో జలభక్షకు లున్నారు. వాయుభక్షకులు, పర్ణభక్షకులు, ఫలమూలాలు తినేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, కృశించి నవనాడులు కనిపిస్తున్నవారు, కఠోరనియమం కలవారు, జటలుకలవారు, శిరోముండనం కలవారు, వల్కలాలు, అజినాలు ధరించినవారు ఉన్నారు. కణ్వుడు మునులందర్నీ పిలిచి శకుంతలమీది

ప్రేమవల్ల ఇలా అన్నాడు – 'యశస్విని అయిన ఈమెను నిత్యమూ నేను లాలిస్తూ పెంచాను. వనంలో పుట్టింది, వనంలో పెరిగింది. ఏమీ తెలియని పిల్ల. శ్రమలేని మార్గంలో మీరంతా ఈమెను రాజభవనానికి తీసికొని వెళ్ళండి'.)

మహా తేజస్సుగల వారంతా 'అలాగే' అని శకుంతలను ముందిడుకొని దుష్యంతుని నగరానికి బయలుదేరారు. దేవకుమారునిలా ప్రకాశిస్తూ, పద్మంవంటి కన్నులున్న కుమారుని శకుంతల పరిచితమైన ఆ వనంనుండి దుష్యంతుని దగ్గరకు తీసికొని వచ్చింది. రాజును సమీపించి, తనరాకను తెలిపింది. అనుమతింపబడి ఆమె బాలసూర్యునివలె ప్రకాశిస్తున్న కొడుకుతో లోనికి ప్రవేశించింది. ఆ మునులందరు రాజుకు నివేదించి ఆశ్రమానికి తిరిగి వచ్చారు. శకుంతల న్యాయానుసారంగా రాజును గౌరవించి ఇలా అంది.

('కఠోరనియమంగల రాజు నీతండ్రి. నమస్కరించు' అని కుమారునితో పలికి, శకుంతల సిగ్గుతో తల దించుకొని స్తంభానికి ఆనుకొని రాజుతో 'అనుగ్రహించు' అని అంది. శకుంతల కొడుకు కూడ రాజునకు నమస్కరించి, చేతులు జోడించి ఆనందంతో వికసించిన కన్నులతో రాజును చూశాడు. రాజు కూడ ధర్మబుద్ధితో ఆలోచిస్తూనే ఇలా అన్నాడు. 'సుందరీ! నీవు వచ్చినపని ఏమిటి? చెప్పు చేస్తాను. సందేహం వద్దు. అందునా కొడుకుతో కలిసి వచ్చావు. ప్రత్యేకించి చేస్తాను.' శకుంతల ఇలా అంది. 'మహారాజా! పురుషోత్తమా! అనుగ్రహించు. చెప్తాను.)

రాజా! ఈ కుమారుని నీవు యౌవరాజ్యాభిషిక్తుని చేయి. దేవతాసమానుడైన ఈ కుమారుడు నీద్వారా నాయందు జన్మించినవాడు. పురుషోత్తమా! (చేసుకొన్న) సమయానికి తగినట్టు ఈతని విషయంలో ప్రవర్తించు. మహాభాగా! కణ్వాశ్రమానికి నీవు వచ్చి నాతో కలిసినపుడు నీవు చేసిన ప్రతిజ్ఞను స్మరించు.' ఆ మాటలు విని రాజు ఆమెను గుర్తించినా ఇలా అన్నాడు. "దుష్టతాపసీ! నీవెవరికి సంబంధించినదానవో నాకు గుర్తులేదు. నీతో నాకుగల ధర్మ, కామ, అర్థ సంబంధం గుర్తురావటంలేదు. ఉండు, లేదా వెళ్ళు. స్వేచ్ఛగా నీవు ఏంచేయాలనుకొంటే అదే చెయ్యి." అత డామెతో అలా అంటే, శకుంతల సిగ్గుపడి దీనురాలిలాగా చేష్ట లుడిగి స్తంభంలా దుఃఖంతో నిశ్చలంగా ఉండిపోయింది. కోపంతో, అసహనంతో ఎర్రబడ్డ కన్నులతో, అదిరే పెదవులతో, చూపులతో దహిస్తున్నట్లు శకుంతల రాజును చూసింది. క్రోధంతో ఉన్న తన రూపాన్ని కప్పిపుచ్చుకొంటూ, తపస్సుతో నింపుకొన్న తేజస్సుతో కోపాన్ని నిగ్రహించుకొంటూ, నిలిచింది. ఆమె ఒకముహూర్తకాలం ఆలోచించి, దుఃఖంతో, అసహనంతో భర్తను చూసి, కోపించి ఇలా పలికింది– 'మహారాజా! తెలిసి కూడా తెలియనివాడిలా 'నాకు తెలియదు' అని శంకలేకుండా ఎలా మాట్లాడుతున్నావు?! ఈ విషయంలో ఏది నిజమో ఏది అసత్యమో నీహృదయానికే తెలుసు. అది సాక్ష్యంగా శుభప్రదమైన మాట చెప్పు. నీ అంతరాత్మను నీవు అవమానించుకోకు. ఒకవిధంగా ఉన్న

తన్ను గూర్చి వేరొకవిధంగా చెప్పేవాడు తన్ను తాను దొంగిలించుకొనేవాడు. అతడు ఎంతటి పాపాన్నైనా చేస్తాడు. నీవు నేనొక్కడనే ఉన్నానని అనుకొంటున్నావు. హృదయంలో ఉన్న పరమాత్మను తెలియలేక పోతున్నావు. పాపాత్ముల పాపకర్మ లన్నింటిని ఎరుగున్న ఆ మహర్షి ఎదురుగా నీవు పాపం చేస్తున్నావు.

(అసత్యం లేకుండా సత్పురుషులందరికి హితాన్ని కలిగించేది ధర్మమే. అది ఎప్పుడూ దుఃఖాన్ని కలిగించదు.)

పాపంచేస్తూ నన్ను ఎవడూ ఎరుగడు, (నాగురించి ఎవరూ తేలుసుకోలేరు) అని భావించేవాడిని దేవత లెరుగుదురు. లోపల ఉన్న అంతరాత్మ ఎరుగును. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, అంతరిక్షం, భూమి, నీరు, హృదయం, యముడు, అహోరాత్రాలు, ప్రాతఃసాయంసంధ్యలు, ధర్మం ఇవి మానవుని నడవడిని తెలుసుకొంటాయి. హృదయంలో ఉన్న కర్మసాక్షి, క్షేత్రజ్ఞుడు ఎవని పనికి సంతోషిస్తాడో ఆతని పాపాల్ని యమధర్మరాజు తొలగిస్తాడు. దుర్మార్గుడైన పురుషుని యొక్క పనులకు కర్మసాక్షి సంతోషించకపోతే ఆ పాపాత్ముని యముడే తొలగిస్తాడు. తన్నుతాను మోసం చేసికొని వేరొకవిధంగా చెప్పుకొనే వానికి, దేవతలుకూడ శ్రేయస్సు కలిగించలేరు. దానికి తాను కూడా కారణం, ప్రమాణం కాదు. నా అంతట నేనుగా వచ్చానని పతివ్రతనైన నన్ను ఈ విధంగా అవమానించవద్దు. స్వయంగా చెంతకువచ్చినా గౌరవార్హ అయిన భార్యనైన నన్ను నీవు గౌరవించటంలేదు. అనాగరికునివలె ఈ సభలో ఎందుకు అవమానిస్తున్నావు? జనరహితమైన అరణ్యంలో నేనీమాటలు చెప్పటం లేదుకదా! నామాట నీవెందుకు వినటంలేదు? దుష్యంతా! ప్రార్థిస్తున్నప్పటికీ నీవు నా మాటలు లక్ష్యపెట్టకపోతే నీ శిరస్సు వంద ముక్కలుగా బ్రద్దలౌతుంది. భర్త భార్యలో ప్రవేశించి మరల సంతానంగా జన్మిస్తాడు. అందుకే భార్యను జాయ అని అంటారు. ఈ విషయం ప్రాచీన విద్వాంసు లందరికీ తెలుసు. శాస్త్రవిధి తెలిసిన పురుషునికి సంతానం కలిగితే ఆ సంతతి యొక్క వరంపర మునుపు మరణించిన పితామహులను కూడ తరింపజేస్తుంది. తండ్రిని 'పుత్'నామ నరకం నుండి రక్షిస్తాడు కాబట్టి కొడుకుని 'పుత్రు'డన్నారు. ఈవిషయాన్ని బ్రహ్మయే స్వయంగా చెప్పాడు.

(పుత్రునిచే లోకాలను జయిస్తాడు. పౌత్రునిచే అక్షయసుఖాన్ని పొందుతాడు. పౌత్రుని కుమారునిచే ప్రపితామహులు కూడ ఆనందిస్తారు.)

ఇంటి వ్యవహారంలో సమర్థంగా వ్యవహరించేదే భార్య. సంతానవతి అయినదే భార్య. పతికి ప్రాణంలా మసలుకొనేదే భార్య. పతివ్రతగా ఉండేదే భార్య. మానవునికి భార్య సగభాగం. భార్య ఉత్తమోత్తమమైన స్నేహితుడు. ధర్మార్థకామాలనే త్రివర్గాన్ని

తరించాలను కొనేవానికి భార్య మూలసాధనం. భార్యకలవారే యజ్ఞాదిక్రియలు చేస్తారు. భార్య కలవారే ఉత్తములైన గృహస్థులు. భార్య కలవారే ఆనందించగలరు. భార్య కలవారే భాగ్యవంతులు. ఏకాంతసమయాలలో భార్యలు ప్రియంగా మాట్లాడుతూ మిత్రు లవుతారు. ధర్మకార్యాలలో తండ్రు లవుతారు. కష్టసమయంలో ఉన్న భర్తకు తల్లులవుతారు. అడవులలో ఉన్నవానికైనా భార్య మార్గంలో విశ్రాంతిని కల్గిస్తుంది. భార్యకలవారినే ఈ లోకం విశ్వసిస్తుంది. అందువల్ల పురుషునికి భార్యే ఉత్తమగతి. ప్రపంచంలో జీవించిఉన్నా, మరణించినా, నరకలోకాల్లో పడినా పతివ్రత ఐన భార్య మాత్రమే ఎప్పుడూ భర్తను అనుసరిస్తుంది. ముందుగా భార్య మరణిస్తే, ఆమె భర్తకోసం నిరీక్షిస్తుంది. భర్త ముందుగా మరణిస్తే, ఆమె భర్తను అనుసరిస్తుంది. రాజా! అందువల్లనే పాణిగ్రహణం అందరికీ ఇష్టమైంది. ఎందువల్లనంటే, భర్త భార్యను పొందడం వల్ల ఈ లోకంలోను, పరలోకంలోనూ కూడ సుఖాన్ని పొందుతాడు. తనద్వారా తానే భార్యగర్భంలో పుత్రరూపంలో జన్మిస్తాడని పండితులు చెప్తారు. **అందువల్ల పుత్రునికి తల్లిఐన భార్యను భర్త తల్లిలా చూడాలి.**

(అందరికి వారి అంతరాత్మే పుత్రరూపంగా ఎల్లపుడూ చెప్పబడుతోంది. తండ్రులయొక్క నడవడి, రూపం, చేష్ట, వ్యవహారం, లక్షణాలు పుత్రులలో కనబడుతూ ఉంటాయి. తండ్రి సంపర్కంవల్లే పుత్రులకు శుభాశుభాలైన శీల, ఆచార, గుణాలు వస్తూ ఉంటాయి.)

అద్దంలో ముఖాన్ని చూసుకొన్నట్లుగా భార్యయందు పుట్టిన కొడుకుమ చూసి, పుణ్యాత్ముడు స్వర్గంపొంది ఆనందించినట్లుగా భర్త ఆనందిస్తాడు. వేసవిఎండకు తపించిపోయిన జనులు నీళ్లతో ఆనందించినట్లుగా, మానసిక వ్యాధితోనూ, శారీరక వ్యాధులతోనూ బాధపడుతున్నవారు తమ భార్యలు దగ్గరుంటే ఆనందాన్ని పొందుతున్నారు.

(దరిద్రులు ధనం దొరికితే సంతోషించినట్లుగా ప్రవాసంచేత కృశించి, దైన్యంతో, మాసిన బట్టలతో తిరిగివచ్చిన పురుషులు తమ భార్యలను చేరుకోగానే ఆనందిస్తారు.)

రతి, ప్రీతి, ధర్మమూ స్త్రీల అధీనంలో ఉండడాన్ని గమనించి, పురుషుడు కోపంలో ఉన్నాసరే, స్త్రీలకు అప్రియం చేయడు.

(భార్య తనలో (భర్తలో)సగభాగమని వేదం చెపుతోంది. ఆమె ధనం, సంతానం, శరీరం, లోకవ్యవహారం, ధర్మం, స్వర్గం, ఋషులు, పితరులు అన్నింటినీ రక్షిస్తుంది.)

తాను (పురుషుడు) పుట్టడానికి స్త్రీలు సనాతనమైన పవిత్రమైన క్షేత్రాలు అని గ్రహించాలి. స్త్రీ లేకుండా సంతానం కలిగించడానికి ఋషులకు కూడా శక్తి లేదు. నేలమీది ధూళి అంటిన కొడుకు వచ్చి తండ్రిని కౌగలించుకుంటే, అంతకంటె తండ్రికి ఇంకేమి కావాలి? అటువంటి తండ్రివైన నీవు స్వయంగా వచ్చి, కోరికతో నిన్నే చూస్తున్న కొడుకును ఎందుకు తిరస్కరిస్తున్నావు? చీమలు కూడా తమ అండాలను రక్షించుకొంటాయి.

చిదిపి వెయ్యవు. ధర్మజ్ఞుడవై కూడ నీవు నీకుమారుని ఎందుకు భరించటంలేదు ?

(తమ అండలనే భావంతో కాకులు కోకిలలను కూడా పెంచుతున్నాయి. కాని సర్వజ్ఞుడవైన నీవు ఇటువంటికొడుకును ఆదరించటం లేదేమి? మలయపర్వతం మీదపుట్టిన చందనం మిక్కిలి చల్లనిదని అంటారు. అంతకంటె ఎక్కువ చల్లదనం తండ్రికి కొడుకును (బిడ్డను) కౌగిలించుకోవటం వల్ల కలుగుతుంది.)

కొడుకును కౌగలించుకొనే తండ్రికి పుత్రస్పర్శ వల్ల కలిగినంత సుఖం వస్త్రాలను గాని, స్త్రీలను గాని, నీళ్ళను గాని స్పృశించడం వల్ల కలుగదు. మనుషుల్లో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. (నాలుగు పాదాలున్న) పుశువుల్లో గోవు శ్రేష్ఠమైంది. పెద్దవారిలో గురువు శ్రేష్ఠుడు. స్పృశింపదగినవారిలో పుత్రుడు శ్రేష్ఠుడు. దర్శనమాత్రంచేతనే ఇష్ట డయ్యే ఈ కుమారుడు నిన్ను కౌగలించుకొని స్పృశించనియ్యి. **ఈలోకంలో పుత్ర స్పర్శకు మించిన సుఖమేదీ లేదు.** రాజేంద్రా! నీ దుఃఖాన్ని పోగొట్టే ఈ కుమారుని నేను మూడు సంవత్సరాలు మోసి కన్నాను. పౌరవా! ఇతనిని కన్నపుడు ఇతడు నూరు అశ్వమేధాలను చేస్తాడని అంతరిక్షంనుండి అశరీరవాక్కు నాకు చెప్పింది. సాధారణంగా మానవులు గ్రామాంతరం వెళ్ళి వచ్చిన పిదప ప్రేమతో పుత్రులను ఒడిలో కూర్చోపెట్టుకొని శిరసుపై ఆఘ్రాణించి, ఆనందిస్తారు. పుత్రుల జాతకర్మలో బ్రాహ్మణులు వేదాలలోని ఈమంత్రసముదాయాన్ని చెపుతూ ఉంటారు. ఈ విషయం నీకూ తెలుసు. (ఇరువురి) శరీరావయవాల నుండి పుడుతున్నావు. హృదయంనుండి జన్మిస్తున్నావు. పుత్రునిగా చెప్పబడుతున్న నీవు నా ఆత్మవే. అట్టి నీవు నూరుసంవత్సరాలు జీవించు. నా జీవితం, అక్షయమైన సంతానపరంపర నీ అధీనంలో ఉన్నాయి. అందువల్ల కుమారా! నీవు సుఖంగా నూరుసంవత్సరాలు జీవించు. ఈ బాలుడు నీ శరీరంనుండి జన్మించాడు. ఒక పురుషుని నుండి వేరొక పురుషుడు జన్మించినట్లుగా, స్వచ్ఛమైన సరస్సులోని ప్రతిబింబంలా ఈ కుమారుని నీ రెండవ రూపంగా, ప్రతిరూపంగా చూడు. గార్హపత్యాగ్ని నుండి ఆహవనీయాగ్ని ఏర్పడినట్లుగా నీనుండి ఈ కుమారుడు జన్మించాడు. నీవు ఒక్కడివే రెండుగా చేయబడ్డావు. మునుపు నీవు వేటలో ఒకలేడిచే ఆకర్షింపబడి పరిగెడుతూ నాతండ్రి ఆశ్రమంలో కన్యనైన నన్ను కలుసుకున్నావు. ఊర్వశి, పూర్వచిత్తి, సహజన్య, మేనక, విశ్వాచి, ఘృతాచి ఈ ఆరుగురు అప్సరసలలో శ్రేష్ఠులు. వారిలో బ్రహ్మసంభవ ఐన మేనక శ్రేష్ఠురాలైన అప్సర. ఆమె స్వర్గం నుండి ఈ లోకంలోకి వచ్చి విశ్వామిత్రునివల్ల సంతానాన్ని కన్నది.

(అగ్ని వంటివాడు, ధర్మపరుడు, బ్రహ్మసంభవుడు, శ్రీమంతుడు అయిన కుశుడనే ఋషి ఉండేవాడు. ఆ కుశునికి బలవంతుడూ, ధార్మికుడూ అయిన కుశనాభుడనే పుత్రుడున్నాడు. అతని కుమారుడు గాధి. అతనికుమారుడు విశ్వామిత్రుడు. అటువంటి విశ్వామిత్రుడు నా తండ్రి. మేనక

నా తల్లి.)

ఆ అప్సర మేనక నన్ను హిమవత్పర్వత సానువుమీద ప్రసవించింది. ఆ మేనక నన్ను ఇతరుల సంతానంలా అక్కడ విడిచిపెట్టి వెళ్ళిపోయింది.

(పుణ్యాత్ములు లైన పక్షులు కలిసి వాటిధర్మంగా రెక్కలతో నన్ను రక్షించాయి. అందువల్లనే నేను శకుంతలను. అటుపై మహర్షి కాశ్యపుడు అగ్నిహోత్రంకోసం నీటికై నదీతీరానికి వెళ్ళాడు. అపుడతనిని చూసి పక్షులు దయాళువైన అతనికి నన్ను న్యాసంగా ఇచ్చాయి. అతడు నన్ను అరణివలె తన ఆశ్రమానికి తీసికొని వచ్చాడు. రాజా! ఆ మహర్షి నాపట్ల జాలివల్ల నన్ను కూతురుగా పెంచాడు. విశ్వామిత్రుని కూతుర్ని అవటం వల్ల కూడ ఆ ఋషి నన్ను పెంచాడు. యౌవనంలో ఉన్న నన్ను నీవు చూశావు. ఆశ్రమంలో పర్ణశాలలో తండ్రి దగ్గరలేని సమయంలో ఒంటరిగా ఉన్న నన్ను విధిప్రేరణతో నీవు మంచిమాటలతో సంతానంకోసం ప్రేరేపించావు. ధర్మార్థకామసమ్మతమైన ఆశ్రమంలో నివసించావు. గాంధర్వ విధితో నన్ను వివాహం చేసికొన్నావు. అటువంటి నేను నీవంశాన్ని, శీలాన్ని, సత్యవాదిత్వాన్ని, స్వధర్మాన్ని గౌరవించి ఈ రోజు నిన్ను శరణువేడాను. అందువల్ల 'అలాగే' అని మాటిచ్చి ఇపుడు దాన్ని అసత్యంచేయడం నీకు తగదు. నీవు ఈ జగత్తుకు రక్షకుడవు. నాకు ప్రాణనాథుడవు. నిన్ను సమీపించిన నిర్దోషినైన నన్ను స్వధర్మాన్ని వెనక్కిపెట్టి, విడిచిపెట్టడం నీకు తగినది కాదు.)

పూర్వజన్మలో నేను ఏ పాపకర్మ చేశానో ఈ జన్మలో బాల్యంలో బంధువులచేత, ఇపుడు నీచేత విడువబడ్డాను. నీవు స్వేచ్ఛగా నన్ను విడిచిపెట్టితే నేను తిరిగి మా ఆశ్రమానికి వెళ్తాను. కాని నీకుమారుడైన ఈ బాలుని విడిచిపెట్టటం నీకు తగదు.' దుష్యంతుడిలా అన్నాడు 'శకుంతలా! నీకు పుట్టిన ఈ కుమారుని నేను గుర్తింపలేకున్నాను. సాధారణంగా స్త్రీలు అసత్య మాడతారు. మీమాటనెవరు నమ్ముతారు? వేశ్య అయిన నీతల్లి మేనక జాలి లేనట్టిది. అందుకే హిమవత్పర్వత సానువులపై నిర్మాల్యంలా నిన్ను విడిచిపెట్టింది. క్షత్రజాతిలో పుట్టిన నీతండ్రి విశ్వామిత్రుడు కూడా జాలిలేనివాడే. బ్రాహ్మణత్వం మీది లోభంతో తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడు కామానికి వశమయ్యాడు. అప్సరసలలో శ్రేష్ఠ మేనక. మహర్షులలో శ్రేష్ఠుడు నీతండ్రి. వారిరువురి సంతానమైన నీవు వేశ్యాస్త్రీ వలె మాట్లాడుతున్నావేమిటి? విశ్వసింపదగని మాటలు చెపుతున్న నీవు సిగ్గుపడటంలేదు. ప్రత్యేకించి నాదగ్గర చెప్పడానికి సంకోచం కలుగలేదా! దుష్టతాపసీ! ఇకవెళ్లు. మునిశ్రేష్ఠుడైన ఆ మహర్షి ఎక్కడ? అప్సరస అయిన ఆ మేనక ఎక్కడ? తాపసి వేషం ధరించి దీనురాలిగా ఉన్న నీవెక్కడ? అతికాయుడు, మిక్కిలి బలవంతుడూ అయిన ఈ నీ కొడుకు తక్కువకాలంలోనే సాలస్తంభంలా ఎలా పెరిగాడు? నీజన్మ నీచమైంది. కులటవలె మాట్లాడుతున్నావు. కామవశంవల్ల అనుకోకుండా మేనకకు నీవు జన్మించావు. తాపసీ! నీవు చెపుతున్నదంతా నాపరోక్షంలో జరిగిందే. నేను నిన్ను ఎరుగను. నీవు స్వేచ్ఛగా

వెళ్ళవచ్చు.'

శకుంతల ఇలా అంది – 'రాజా! ఆవగింజంత ఇతరుల దోషాన్ని చూస్తున్నావు. మారేడు కాయంత స్వదోషాన్ని చూస్తున్నా చూడనట్లుగా ఉన్నావు. మేనక దేవతలలో ఉంది. దేవతలంతా మేనకను అనుసరిస్తున్నారు. దుష్యంతా! నీజన్మకంటె నాజన్మే గొప్పది. రాజేంద్రా! నీవు భూమిమీద తిరుగుతున్నావు. నేను అంతరిక్షంలో సంచరిస్తున్నాను. చూడు. నాకూ, నీకూ మేరుపర్వతానికి, ఆవగింజకు ఉన్నంత తేడా ఉంది. రాజా! నేను మహేంద్రుడు, కుబేరుడు, యముడు, వరుణుడు మున్నగు వారిళ్లకి వెళ్తాను. నాప్రభావం చూడు. లోకంలో ఒక నానుడి ఉంది. అది నిజంకూడ. ద్వేషంవల్ల కాదు, నిదర్శనంకోసం చెప్తాను. దానిని విని క్షమించు. **కురూపి అద్దంలో తన ముఖాన్ని చూడనంతసేపూ తన్ను ఇతరులకంటె అందమైనవాడిగా భావిస్తాడు. అద్దంలో తన వికృతమైన ముఖాన్ని చూశాక ఇతరునికీ, తనకూ ఉన్న తేడాను తెలిసికొంటాడు. అందమైనవాడు ఎవరినీ అవమానించడు.** కాని రూపవంతుడు కాకున్నా తనరూపాన్ని ప్రశంసించుకొనేవాడు తన చెడుమాటలతో ఇతరులను హింసిస్తాడు. మానవులు మాట్లాడే శుభాశుభాలైన మాటలను విని మూర్ఖుడు పంది 'మలాన్ని' గ్రహించినట్లు అశుభమైన వాక్యాన్నే గ్రహిస్తాడు. **మానవులు మాట్లాడే శుభాశుభవచనాలు విని ప్రాజ్ఞుడు నీటిమండి హంప పాలను గ్రహించినట్లుగ గుణవంత మయిన వాక్యాన్నే గ్రహిస్తాడు.** ఇతరులను నిందిస్తున్నపుడు సత్పురుషుడు పరితాపం చెందుతాడు. దుర్జనుడు ఇతరులను నిందిస్తూ తాను ఆనందిస్తాడు. సత్పురుషులు వృద్ధులకు నమస్కరించి, ఆనందాన్ని పొందుతారు. మూర్ఖుడు సజ్జనుని నిందించి ఆనందాన్ని పొందుతాడు. ఇతరులదోషాలను గుర్తింపని సత్పురుషులు సుఖంగానే జీవిస్తారు. ఇతరుల దోషాలను మాత్రమే చూస్తూంటారు మూర్ఖులు. ఏ దోషాలచేత మూర్ఖులు నిందింపదగిన వారుగా సత్పురుషులు భావిస్తారో, అవే దోషాలను సత్పురుషులపై ఆరోపించి మూర్ఖులు వారిని నిందిస్తారు. తాను దుర్జనుడై ఉండి సజ్జనుని దుర్జనుడని చెప్పడం కంటె మించిన హాస్యాస్పదమైనది ఈలోకంలో మరొకటి లేదు.

కోపించిన సర్పంవల్ల భయపడినట్లుగా సత్యధర్మాల నుండి భ్రష్టుడైన వానివల్ల నాస్తికుడు కూడ భయపడతాడు. ఇక ఆస్తికుని విషయంలో చెప్పేదేముంది? స్వయంగా తాను పుత్రుని కలిగించి అతనిని ఆదరింపని వాని భాగ్యాన్ని దేవతలు నశింపజేస్తారు. అతడు ఉత్తమలోకాలకు కూడ వెళ్ళడు. పుత్రుడిని కులానికీ, వంశానికీ, ప్రతిష్ఠ కలిగించే వాడిగా పితరులు చెప్పారు. పుత్రుని కలిగి ఉండటం అన్నిధర్మాల్లోను ఉత్తమమైంది. అందువల్ల పుత్రుని విడిచిపెట్టరాదు. తన భార్యయందు పుట్టినవారిని, ఇతరస్త్రీలకు

జన్మించి తనకు లభించినవారిని, కొనబడినవారిని, పోషింపబడిన వారిని, ఉపనయనాది సంస్కారం చేయబడిన వారిని, ఈ ఐదు విధాల వారిని పుత్రులుగా మనువు చెప్పాడు. మానవులకు పుత్రులు ధర్మాన్ని, కీర్తినీ తెచ్చిపెట్టేవారు. మనస్సుకు ప్రీతిని ఎక్కువ జేసే పుత్రులు ధర్మరూపమయిన నౌకలుగా పితరులను నరకం నుండి రక్షిస్తారు. రాజసింహా! అందువల్ల అటువంటి నీవు పుత్రుని విడవటం తగదు. తన్ను, సత్యధర్మాలనూ రక్షిస్తూ కపటాన్ని వహించడం యుక్తంకాదు. వంద నూతులకంటె ఒకబావి శ్రేష్ఠమైనది. వందబావుల కంటె ఒక క్రతువు శ్రేష్ఠం. వంద క్రతువులకంటె పుత్రుడు శ్రేష్ఠుడు. నూరుగురు పుత్రులకంటె సత్యం శ్రేష్ఠమైనది. **వేయి అశ్వమేధయాగాలనూ, సత్యాన్నీ తక్కెడలో తూచివట్లయితే అశ్వమేధసహస్రం కంటె సత్యమే బరువని తెలుస్తుంది.** రాజా! వేదాలన్నీ చదవడం, అన్ని తీర్థాల్లో స్నానమాడడమూ కూడ సత్యవచనంతో సమానం అవుతాయో కావో చెప్పలేము. **సత్యంతో సమానమైన ధర్మంలేదు. సత్యంకంటే గొప్పది లేదు. ఈలోకంలో అసత్యంకంటె మించిన తీవ్రతరమైంది ఏదీ లేదు.*** రాజా! సత్యమే పరబ్రహ్మము. (అధిష్ఠానపరమాత్మము). సత్యము అన్నిటికంటె గొప్ప వ్రతం. నీవు నీ సత్యవ్రతాన్ని విడిచిపెట్టకు. సత్యంతో నీవు కలిసి ఉండు. అసత్యం మీదే నీకు ఆసక్తి ఉంటే నామాటపట్ల శ్రద్ధలేకపోతే, నేను స్వయంగా వెళ్ళిపోతాను. నీలాంటివాడితో కలిసిఉండడం నాకు యుక్తం కాదు.

(ఇతడు నాకొడుకు అవునా కాదా అని సందేహిస్తున్నవానికి బుద్ధే దానిని గుర్తింపచేసే వెలుతురు. గమనం, స్వరం, స్మరణం, బలం, శీలం, విజ్ఞానం, పరాక్రమం, సాహసం, స్వభావం, వ్యవహారం, రోమావలి (సుడులు) ఇవి ఎవనితో సమానంగా ఉంటాయో అతడు అతనికి పుత్రుడు. ఇందులో సందేహంలేదు. రాజా! నీ పోలికతో ఈతని రూపం ఏర్పడింది. తండ్రీ! అని పిలుస్తున్న ఈతని ఆశను వమ్ముచేయకు.)

దుష్యంతా! నీవు లేకున్నా, నాపుత్రుడు నాలుగు సముద్రాల వరకు వ్యాపించి, హిమవత్పర్వతం మకుటంలా భాసించే భూమినంతా పరిపాలిస్తాడు.

('శకుంతలా! నీకొడుకు చక్రవర్తి కాగలడు' అని ఇంద్రుడు చెప్పాడు. అది అట్లే జరుగుతుంది. మరొకలా జరుగదు. ఈవిషయంలో సాక్షులుగా దేవదూతాదు లెందరో ఉన్నారు. కాని వారిపుడు సత్యమో అసత్యమో చెప్పరు. అందువల్ల సాక్షిలేని దురదృష్ట వంతురాలిని వచ్చినదారినే వెళ్తాను.

వైశంపాయను డిలా అన్నాడు – ఇంతమాత్రం రాజుకు చెప్పి శకుంతల బయలుదేరింది. అపుడు అంతరిక్షంనుండి అశరీరవాణి ఋత్విక్పురోహితులతో మంత్రులతో కూడి ఉన్న

---

* నాస్తి సత్యసమో ధర్మః న సత్యాద్ విద్యతే పరమ్ ।
న హి తీవ్రతరం కించి దనృతా దిహ విద్యతే ॥ 105

దుష్యంతునికి ఇలా చెప్పింది. 'దుష్యంతా! తల్లి గర్భసంచిలో మోసేది మాత్రమే. పుత్రుడు తండ్రికి సంబంధించిన వాడే. ఎవని చేత అతడు జన్మించాడో అతడి స్వరూపమే పుత్రుడు. అందువల్ల పుత్రుని భరించు. శకుంతలను అవమానించకు.

(తండ్రి యొక్క శరీరావయవా లన్నింటితో శరీరం ఏర్పడి సాక్షాత్తూ పుత్రరూపంలో జన్మిస్తాడు. పౌరవా! పేరుకి పుత్రుడే కాని వాస్తవానికి తానే. తనచేత ఏర్పడిన కుమారుడి రూపంలో ఉన్న తన్ను తానే రక్షించుకోవాలి. ఈ శకుంతలను అసాధారణమైన నీభార్యగా చూసుకో. ఆమెను అవమానించవద్దు. దుష్యంతా! ధర్మబద్ధంగా స్త్రీలను గ్రహించడం పవిత్రమైన, అసమానమైన కార్యం. నెలనెలా రజస్సు వీరి దోషాలను తొలగిస్తుంది.)

నరదేవా! రేతస్సును ధరించే తండ్రే పుత్రుని కలిగించగలడు. ఆ పుత్రుడు యమలోకం నుండి తన పితృగణాలను రక్షిస్తాడు. ఈమె యందు గర్భాన్ని (ఉంచినవాడవు) కలిగించినవాడవు నీవు. శకుంతల నిజం చెప్పింది. తన శరీరాన్ని రెండుగా విభజించుకొని భార్య తనకుమారుని కంటుంది. దుష్యంతమహారాజా! అందువల్ల శకుంతల కుమారుని నీవు రక్షించు, పోషించు, జీవించి ఉన్న పుత్రుని విడిచిపెట్టి జీవించడం ఒక దౌర్భాగ్య మని గ్రహించు. పౌరవా! మహాత్ముడైన శకుంతలకుమారుని భరించు. మామాటవల్ల కూడ నీవు తప్పక భరించాలి. అందువల్ల ఈ నీ కుమారుడు భరతుడనే పేరుతో ప్రసిద్ధి చెందుతాడు.

(ఇలా చెప్పిన తర్వాత దేవతలు, ఋషులు, తపోధనులు "శకుంతల పతివ్రత అని సంతసించి పుష్పవృష్టిని కురిపించారు.)

దేవతలు చెప్పిన ఆమాటలను విని పూరువంశరాజైన దుష్యంతుడు ఆనందించి పురోహితులతోనూ, అమాత్యులతోను ఇలా అన్నాడు - 'మీరంతా ఈ దేవదూతయొక్క మాటను వినండి. నేను కూడా ఈ బాలుని నాకుమారునిగా ఎరుగుదును. కాని ఈమె మాటను బట్టి ఇతనిని కొడుకుగా గ్రహిస్తే లోకానికి శంకింపదగిన వాడవుతాడు. స్వచ్ఛమైన వాడు కాలేడు.' వైశంపాయనుడిలా అంటున్నాడు - రాజు దేవదూతద్వారా ఆ బాలుని స్వచ్ఛతను నిశ్చయించి, మిక్కిలి ఆనందించి, అతడిని కొడుకుగా స్వీకరించాడు. అనంతరం రాజు ప్రేమతో, ఆనందంతో తన కుమారునికి తండ్రి చేయదగిన సంస్కారాలను జరిపించాడు. అతనిని శిరసుమీద ప్రేమతో ముద్దిడి కౌగిలించుకొన్నాడు. బ్రాహ్మణులంతా గౌరవించారు, వందిమాగధులు స్తుతించారు. అపుడు ఆ రాజు పుత్రస్పర్శవల్ల కలిగే గొప్ప ఆనందాన్ని అనుభవించాడు. దుష్యంతుడు ధర్మబద్ధంగా భార్య ఐన శకుంతలను గౌరవించాడు. అనునయపూర్వకంగా ఆమెతో ఇలా అన్నాడు. 'దేవీ! నీతో నాకుగల వివాహబంధం ఈ ప్రజలకు పరోక్షంలో జరిగింది. వారికి నీ స్వచ్ఛత తెలియడం కోసం నేనీ విచారణ

అంతా చేశాను.

(బ్రాహ్మణులు, క్షత్రియులు, శూద్రులు అంతా నిస్సంశయంగా పతివ్రతవైన నిన్ను వేరువేరు విధంగా గౌరవిస్తారు.)

ఈ లోకం నీతో నా కలయికను స్త్రీవ్యామోహంగా భావిస్తుంది. కామవశుడనయి ఈ పుత్రుడికి రాజ్యం ఇవ్వడానికి అంగీకరించా ననుకొంటుంది. అందువల్లనే నేనీ విచారణ చేశాను. ప్రియా! కోపించిన నీవు నాతో పలికిన అప్రియవచనాలన్నీ నాపై ప్రేమతో పలికినవే. అందువల్ల వాటన్నింటిని నేను క్షమిస్తున్నాను.

(నీతో నేను పలికిన అసత్య - అప్రియవచానలను చెడుచేష్టను క్షమించు. స్త్రీలు భర్తచేష్టలను సహించడం ద్వారా పాతివ్రత్యాన్ని పొందుతారు.')

ఆమెతో ఇలా పలికి, రాజర్షి దుష్యంతుడు ప్రియమైన పట్టమహిషిని వస్త్రాలతో, అన్నపానాలతో గౌరవించాడు.

(ఆనంతరం రాజు భార్యాపుత్రులతో తల్లి రథంతరి దగ్గరకు వచ్చి 'అమ్మా! ఇతడు నాకొడుకు. అరణ్యంలో జన్మించాడు. ఇతడు నీదుఃఖాన్ని పోగొట్టగలవాడు, ఈ నీపౌత్రునిచేత ఇపుడు నేను పితృఋణం నుండి విముక్తుడ నయ్యాను. ఈమె విశ్వామిత్రుని కూతురు. కణ్వమహర్షి ఈమెను పెంచాడు. మహాభాగా! ఈ నీ కోడలు శకుంతలను అనుగ్రహించు.' అన్నాడు కొడుకు మాటలు విన్న రాజమాత తనమనుమడిని కౌగిలించుకుంది. తనపాదాలమీద పడ్డ శకుంతలను చేతులతో(ఎత్తి) కౌగిలించుకొని ఆనందంతో బాష్పాలు విడిచింది. మనుమడిలక్షణాలను గుర్తించి సత్యవచనాన్నిలా పలికింది - 'విశాలాక్షీ! నీకొడుకు చక్రవర్తి అవుతాడు. నీభర్త ముల్లోకాలను జయిస్తాడు. సుందరీ! నీవు దివ్యమైన భోగాలను అనుభవించు.' రాజమాత రథంతరి ఇలా పలకడంతో శకుంతల మిక్కిలి ఆనందించింది. ఆనంతరం సర్వాభరణాలతో అలంకరించి శకుంతలను అగ్రమహిషిగా చేశారు. బ్రాహ్మణులకు, సైనికులకు ధనాన్ని ఇచ్చారు.)

అటుపై దుష్యంతుడు శకుంతలకు పుట్టిన తన కుమారుడికి 'భరతుడు' అని పేరుపెట్టి యువరాజుగా అభిషేకించాడు.

(భరతుడికి భారాన్ని అప్పగించి దుష్యంతుడు కృతకృత్యు డయ్యాడు. అనంతరం నూరుసంవత్సరాలు పూర్తిగా రాజ్యంచేసి, దానాలు చేసి దుష్యంతుడు స్వర్గలోకం చేరాడు.)

దివ్యప్రకాశంతో, ఎదురులేకుండా, లోకమంతటా మారుమ్రోగుతూ అతని రాజ్యం ప్రసిద్ధి వహించింది. అతడు రాజులందరినీ జయించి తనవశం చేసుకొన్నాడు. సత్పురుషుల ధర్మాన్ని ఆచరించాడు. గొప్ప యశస్సును పొందాడు. ప్రతాపవంతుడైన ఆ భరతుడు సార్వభౌముడు, చక్రవర్తి అయ్యాడు. మరుత్పతి అయిన ఇంద్రునిలా అనేక యజ్ఞాలను చేశాడు. కణ్వమహర్షి అతనిచేత భూరిదక్షిణలతో కూడిన గోవితత మనే పేరుగల అశ్వమేధయాగాన్ని చేయించాడు. ఆ యజ్ఞంలో కణ్వమహర్షికి వేయి పద్మస్వర్ణముద్రలను

భరతుడు దానం చేశాడు. భరతునివల్ల ఈ భూమి భారతిగా ప్రసిద్ధి పొందింది. **అతనివల్ల ఈవంశం భారతవంశం అయింది.** ఈ వంశంలో ఇంతకుముందున్నవారు, ఇపుడున్న ఇతరులుకూడ భరతవంశంలోని వారుగా ప్రసిద్ధు లౌతారు. భరతునివంశంలో జన్మించిన సమానులు, మహాతేజస్వులు, బ్రహ్మకల్పులు, మహాభాగులు, సత్య, ఋజుత్వాలకు బద్ధులైనవారూ ఎందరో రాజశ్రేష్ఠులున్నారు. అసంఖ్యాకంగా వారిపేర్లున్నాయి. ప్రాధాన్యాన్ని బట్టి వారిని గురించి ప్రస్తావిస్తాను.

75. దక్ష,వైవస్వతమనువుల ఉత్పత్తి; నహుష, యయాతుల చరిత్ర.

వైశంపాయనుడిలా చెప్పాడు – దక్షప్రజాపతి, వైవస్వతమనువు, భరత, కురు, పూరు, అజామీఢుల యొక్క, ఆ చరితలు పుణ్యప్రదాలూ, మంగళకరాలూ, కీర్తికరాలూ, ఆయుర్దనవర్ధకాలు. ప్రచేతసునికి తేజస్వులైన పదిమంది పుత్రులు పుట్టారు. వీరంతా మహర్షులతో సమానమైన తేజస్సు కలవారు. సత్పురుషులు. వీరిని పుణ్యజనులు అని అంటారు. పూర్వకాలంలో వీరినోటి నుండి వెలువడిన అగ్ని వృక్షాలను దహించివేసింది. ఆ పదిమందికి ప్రాచేతసుడైన దక్షుడు జన్మించాడు. ఆ దక్షునివల్లనే ఈ ప్రజలంతా జన్మించారు. పురుషశ్రేష్ఠా! ఆ దక్షుడు ఈలోకానికే పితామహుడు. ముని, ప్రాచేతసుడూ అయిన దక్షుడు వీరిణితో సంగమించి తనవంటి కఠోరనియమాలు కలిగిన వేయిమందిని కన్నాడు. వేలసంఖ్యలో ఉన్న దక్షపుత్రులకు నారదుడు శ్రేష్ఠమయి సాంఖ్యజ్ఞాన రూపమైన మోక్షవిద్యను చెప్పాడు. జనమేజయా! పుత్రులు విరక్తులుకాగా, దక్షప్రజాపతి ఇంకను సంతానం కనాలనే కోరికతో ఏబదిమంది పుత్రికలను కన్నాడు.

వారిలో పదిమంది కన్యలను ధర్మదేవుని కిచ్చాడు. పదముగ్గురు కన్యలను కశ్యపునికిచ్చాడు. కాలం నడపటంలో నియమింపబడిన ఇరువది ఏడుగురు పుత్రికలను చంద్రుని కిచ్చాడు.

మరీచమహర్షికుమారుడైన కశ్యపుడు తన పదముగ్గురు భార్యలలో శ్రేష్ఠురాలైన అదితి యందు వీర్యసంపన్నులైన ఇంద్రాది ఆదిత్యులను కన్నాడు. అనంతరం అదితియందు అతడు వివస్వంతుని కన్నాడు. వివస్వంతునకు సమర్థుడైన యముడు జన్మించాడు. అతనినే వైవస్వతుడు అని అంటారు. మార్తండునికి బుద్ధిమంతుడు, సమర్థుడు అయిన మనువు జన్మించాడు. మార్తండునికి మరొక కొడుకు యముడు కూడా జన్మించాడు. యముడుకూడ సమర్థుడు. మనువు ధీమంతుడు, ధర్మాత్ముడు. అతని యందే వంశం

ప్రతిష్ఠితమైంది. మనువంశంలో జన్మించిన మానవులకే మానవజాతిగా ప్రసిద్ధి కలిగింది. మహారాజా! మనువువల్ల జన్మించిన మానవు లందరూ బ్రాహ్మణక్షత్రియాదులుగా చెప్పబడ్డారు. అప్పటినుండే బ్రాహ్మణ కులం క్షత్రియులతో సంబంధం కలిగి ఉంది. వారిలో బ్రాహ్మణులు వేదాన్ని సాంగంగా అధ్యయనం చేసి రక్షించారు. 1. వేనుడు, 2. ధృష్ణుడు, 3. నరిష్యంతుడు, 4. నాభాగుడు, 5. ఇక్ష్వాకువు, 6. కారూషుడు, 7. శర్యాతి, 8. ఇల, 9. పృషధ్రుడు, 10. నాభాగారిష్టుడు అనే పదిమందీ మనువుయొక్క పుత్రులు. ఇంకా ఇతరపుత్రులతోబాటు మొత్తం ఏభైమంది మనువు యొక్క పుత్రులు భూమిపై ఉన్నారు. వారందరూ పరస్పర భేదభావం వల్ల నశించారని వినికిడి. ఇలయందు పురూరవుడు జన్మించాడు. అతడు విద్వాంసుడు. పురూరవునికి తల్లీ, తండ్రీ ఆమెయే అని విన్నాం. పురూరవుడు సముద్రసంబంధమైన పదమూడు ద్వీపాలను పాలించాడు. మహాయశస్వి పురూరవుడు మానవు డైనప్పటికి మనుష్యేతర ప్రాణులతో కలిసి ఉన్నాడు. పరాక్రమగర్వంతో పురూరవుడు బ్రాహ్మణులతో విరోధించేవాడు. బ్రాహ్మణుల యొక్క రత్నరాసులన్నింటిని వారు ఏడుస్తున్నప్పటికీ అపహరించాడు. రాజా! బ్రహ్మలోకంనుండి సనత్కుమారుడు వచ్చి అతనిని అనునయించాడు. బ్రాహ్మణులపై అత్యాచారం మాన మని ఉపదేశించాడు. కాని అతడు ఆ ఉపదేశాన్ని స్వీకరించలేదు. క్రుద్ధులైన మహర్షులు అతనిని శపించారు. దానివల్ల అతడు నశించాడు. లోభంతోకూడి బలగర్వంవల్ల పురూరవుడు వివేకాన్ని కోల్పోయాడు. అతడు గంధర్వలోకంలో ఉన్న మూడు అగ్నులను, ఊర్వశిని యథావిధిగ భూమికి తీసికొని వచ్చాడు. ఇలానందనుడైన పురూరవునకు ఊర్వశియందు ఆరుగురు కుమారులు కలిగారు. వారు ఆయువు, ధీమంతుడు, అమావసువు, దృఢాయువు, వనాయువు, శతాయువు అనేవారు. వారిలో ఆయువుకు స్వర్భానువునందు నహుషుడు, వృద్ధశర్మ, రజి, గయుడు, అనేనసుడు అనే ఐదుగురు పుత్రు లున్నారు. ఆయువు కొడుకు నహుషుడు మంచి బుద్ధిమంతుడు, సత్యపరాక్రముడు.

రాజా! అతడు చాలా పెద్దరాజ్యాన్ని ధర్మంతో పాలించాడు. పితృదేవతలను, దేవతలను, ఋషులను, విప్రులను, గంధర్వులను, నాగులను, రాక్షసులను పరిపాలించాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను పాలించాడు. దస్యుసంఘాలను సంహరించి ఋషులకు పన్ను ఇప్పించాడు. అతడు దేవతలను కూడ తిరస్కరించి తన తేజస్సుచేత, తపస్సుచేత, పరాక్రమంచేత, బలంచేత ఇంద్రపదవిని పొంది, బలవంతుడైన అతడు మహర్షులచేత తనను పశువువలె మోయించుకొన్నాడు. నహుషుడు యతి, యయాతి, సంయాతి, ఆయాతి,

అయతి, ధ్రువుడు అనే ఆరుగురు పుత్రులను కన్నాడు. వారంతా ప్రియవాదులు. వారిలో యతి యోగంతో బ్రహ్మభావాన్ని పొందాడు. సత్యపరాక్రముడైన నహుషకుమారుడు యయాతి సమ్రాట్టు అయ్యాడు. అతడు భూమండలాన్నంతా పాలించాడు. అనేక యజ్ఞాలు చేశాడు. యయాతి మిక్కిలి భక్తితో పితృదేవతలను, దేవతలను శ్రద్ధతో అర్చించాడు. ఓటమిలేనివాడై ప్రజలందరిని అనుగ్రహించాడు. అతనికి దేవయాని, శర్మిష్ఠల యందు మహాధనుర్ధారులై, సద్గుణులైన పుత్రులు పుట్టారు. దేవయాని యందు యదువు, తుర్వసువు జన్మించారు. శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే కొడుకులు జన్మించారు. యయాతి అనేక సంవత్సరాలు ధర్మంగా ప్రజలను పరిపాలించాడు. కొంతకాలానికి రూపనాశిని అయిన ఘోరమైన ముసలితనాన్ని పొందాడు. ముసలితనానికి లొంగిన ఆ యయాతి పుత్రులందరితో ఇలా అన్నాడు. 'పుత్రులారా! యువకుడనై యౌవనంతో యువతులతో కూడి కోరిక లనుభవిస్తూ విహరించాలని నాకు ఉంది. నాకు సాహాయ్యం చేయండి.' దేవయాని పెద్దకొడుకు యదువు అతనితో ఇలా అన్నాడు-'మా యౌవనంతో నీకు చేయదగినది ఏముంది?' అపుడు యయాతి అన్నాడు - 'నీ యౌవనం ఇచ్చి నాముసలితనాన్ని తీసికో. నీయౌవనంతో విషయసుఖాలను నేను అనుభవిస్తాను. పుత్రులారా! అనేక దీర్ఘసత్రాలు చేసిన నేను శుక్రుని శాపం వల్ల కామపురుషార్థం క్షీణించిన వాడ నయ్యాను. అందుచేత నేను కోరికలతో తాపించిపోతున్నాను. మీలో ఒకరు నా ముసలిశరీరంతో ఈ రాజ్యాన్ని పరిపాలించండి. నేను నూతనశరీరంతో యువకుడినై కోరికల ననుభవిస్తాను.' యయాతి అలా చెప్పినప్పటికిని యదువు మున్నగువారు అతని ముసలితనాన్ని స్వీకరించలేదు. అపుడు చిన్నవాడు, సత్యవిక్రముడూ అయిన పూరుడు అతనితో ఇలా అన్నాడు - 'రాజా! నూతనమైన శరీరంతో యౌవనంతో సంచరించు. నేను నీ ఆజ్ఞ ప్రకారం నీముసలితనాన్ని స్వీకరించి రాజ్యాధికారంలో ఉంటాను.' ఈ విధంగా చెప్పినవెంటనే రాజర్షి యయాతి తన తపోబలాన్ని ఆశ్రయించి మహాత్ముడైన తన పుత్రునియందు తన ముసలితనాన్ని ప్రసరింపచేశాడు. అనంతరం పూరుని వయస్సుతో యయాతి యౌవనాన్ని పొందాడు. పూరుడు యయాతి వయస్సుతో ముసలితనం పొంది రాజ్యాన్ని పాలించాడు.

ఓటమిలేని నృపశ్రేష్ఠుడు, యయాతి శార్దూల సమాన పరాక్రమంతో వేలసంవత్సరాలు యువకునిగా ఉన్నాడు. యయాతి భార్యలిద్దరితో చాలాకాలం విహరించాడు. చైత్రరథవనానికి వెళ్ళి విశ్వాచి అనే అప్సరసతో కూడి ఆనందించాడు. రాజా! మహాయశస్వి ఐన ఆ యయాతి కామతృప్తిని పొందలేదు. మనస్సుతో విచారించి తెలిసికొని, అప్పుడు ఈ గాథను గానంచేశాడు. **'కోరికలు అనుభవించినంత మాత్రాన అవి ఎన్నడూ శాంతింపవు.**

హవిస్సుచేత అగ్నిజ్వాల వృద్ధిచెందినట్లు, అనుభవంతో కోరిక మరల అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.* కోరికతో ఉంటే రత్నసంపూర్ణమైన భూమి, బంగారం, పశువులు, స్త్రీలు సమస్తమూ ఒక్కనికి కూడ చాలదు. అని భావించి శాంతిని (ఇంద్రియనిగ్రహాన్ని) పొందాలి. ప్రాణులన్నింటి విషయంలో ఒకప్పుడు కూడ మనసుచే కాని, వాక్కుచే కాని, కర్మచే కాని పాపం చేయనినాడు బ్రహ్మభావం పొందుతాడు. **తాను దేనివల్ల భయపడక, తనవల్ల ఎవరూ భయపడకుండా ఉండి, దేనినీ కోరక, ద్వేషింపక ఉండేవాడు బ్రహ్మభావం పొందుతాడు.'**** రాజా! మహాప్రాజ్ఞుడైన యయాతి కోరికల సారహీనతను గుర్తించి, బుద్ధిచే మనస్సును సమాధానపరచి, కొడుకునుండి ముసలితనాన్ని తిరిగి తీసికొన్నాడు. యయాతి మహారాజు తిరిగి యౌవనాన్ని కొడుకుకు ఇచ్చి, పూరుని రాజ్యంలో అభిషేకించి, కామతృప్తిని చెందక తన కుమారుడు పూరునితో ఇలా అన్నాడు. 'కుమారా! నీచేత నేను పుత్రవంతుడనయ్యాను. వంశకారకుడవగు కుమారుడవు నీవే. పౌరవ వంశమనే ఖ్యాతి నీకే లోకంలో కలుగుతుంది.' వైశంపాయనుడిలా అన్నాడు- పూరుడిని రాజ్యంలో అభిషేకించిన తర్వాత మహాతపస్వి యయాతి భృగుతుంగ పర్వతానికి వెళ్ళి సత్కర్మల నాచరించాడు. తర్వాత చాలా కాలం గడిచాక తన భార్యలతో పాటు నిరాహారవ్రతం చేసి స్వర్గాన్ని పొందాడు.

76. కచుడు శుక్రుని దగ్గర మృతసంజీవినీ విద్యను పొందుట.

జనమేజయుడు ఇలా అడిగాడు. 'తపోధనా! ప్రజాపతికి పదవతరంలో పుట్టిన యయాతి దుర్లభ అయిన శుక్రునికూతురగు దేవయానిని ఎలా పొంద గలిగాడు? ఈ విషయాన్ని విస్తరంగా వినాలనుకొంటున్నాను. వంశకర్త లయిన రాజులను గురించి వేరుగా కాలానుక్రమంగా నాకు చెప్పు.'

వైశంపాయనుడిలా చెప్పాడు - దేవేంద్రునితో సమానమైన తేజస్సుగల యయాతి అనే రాజున్నాడు. అతనిని పూర్వకాలం శుక్రుడు, వృషపర్వుడూకూడా అల్లునిగా స్వీకరించారు. జనమేజయా! ఆ విషయం నీకు చెపుతాను. నహుషనందనుడైన యయాతి దేవయాని కలుసుకొనడం కూడా చెపుతాను. చరాచరాలతోనున్న ముల్లోకాల్లోని ఐశ్వర్యం గురించి

---

* న జాతు కామః కామానామ్ ఉపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ 50

**యదా చాయం న బిభేతి యదా చాస్మాన్న బిభ్యతి ।
యదా నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ॥ 53

సురాసురులకు పరస్పరం సంఘర్షణ జరిగింది. జయించాలనే కోరికతో దేవతలు అంగిరసుని కుమారుడయిన బృహస్పతిమహర్షిని యజ్ఞనిర్వహణకోసం పురోహితునిగా కోరారు. రాక్షసులు కూడ కావ్యుడైన శుక్రాచార్యుని కోరారు. శుక్రాచార్య బృహస్పతులిరువురూ బ్రాహ్మణులు, పరస్పర స్పర్ధ కలవారు. అక్కడ యుద్ధంలో మరణించిన దానవులను శుక్రాచార్యుడు తన విద్యాబలాన్ని ఉపయోగించి, మళ్ళీ ఉజ్జీవింపజేస్తున్నాడు. అందువల్ల రాక్షస యోధులు మళ్ళీ లేచి, సురలపై యుద్ధం చేసేవారు. యుద్ధరంగంలో అసురులు చంపిన సురలను మాత్రం బృహస్పతి తిరిగి బ్రతికింపలేదు. తేజోవంతుడయిన శుక్రునికి తెలిసిన మృతసంజీవనీ విద్య బృహస్పతి ఎరుగడు. అందువల్ల దేవతలు మిక్కిలి విషాదాన్ని పొందారు. శుక్రునివల్ల భయంతో విచారిస్తున్న దేవతలు బృహస్పతి పెద్దకొడుకైన కచుని సమీపించి ఇలా అన్నారు.

'నిన్ను సేవిస్తున్న మమ్మల్ని ఆదరించు. మాకు ఉత్తమమైన సాహాయ్యం చెయ్యి. తేజస్సుగల బ్రాహ్మణుడైన శుక్రునిలో ఉన్నవిద్యను ఇక్కడకు వేగంగా అపహరించుకొనిరా! అపుడు నీవు హవిర్భాగాన్ని మాతోపాటు స్వీకరింపగలవు. ఆ శుక్రాచార్యుని వృషపర్వుని దగ్గర చూడగలవు. శుక్రుడు దానవులను మాత్రమే రక్షిస్తున్నాడు. దేవతలను రక్షించడంలేదు. యౌవనంలో ఉన్న నీవు ఆ శుక్రుని ఆరాధించడానికి సమర్థుడవు. ఆ మహాత్ముని కూతురు ప్రీతిపాత్రురాలు అయిన దేవయానిని సేవించడానికి కూడ నీవే సమర్థుడవు. మరొకరు ఎవరూ ఆ పని చేయగలవారు లేరు. నడవడిక, దయ, తీయనిమాటలు, ఆచారం, ఇంద్రియ నిగ్రహం వీటన్నింటిచేత దేవయానిని సంతుష్టురాలిని చేస్తే ఆ విద్యను నిశ్చయంగా పొందగలవు.' 'అలాగే' అని పలికి బృహస్పతి కుమారుడైన కచుడు దేవతలచే పూజింపబడి అక్కడనుండి వృషపర్వుని సమీపానికి వెళ్లాడు. రాజా! ఆ కచుడు తొందరగా రాక్షసరాజయిన వృషపర్వుని నగరానికి వెళ్ళి, శుక్రుని దర్శించి ఇలా పలికాడు. 'అంగిరసుని పౌత్రుడు, సాక్షాత్తూ బృహస్పతి కుమారుడు, కచుడని పిలువబడే నన్ను శిష్యునిగా తమరు స్వీకరింపగోరుతున్నాను. బ్రాహ్మణోత్తమా! గురువైన నీపట్ల నేను వేయిసంవత్సరాలు బ్రహ్మచర్యాన్ని పాటిస్తాను. నన్ను శిష్యునిగా అంగీకరించగోరుతున్నాను.' అపుడు శుక్రుడిలా అన్నాడు - 'కచా! నీకు స్వాగతం! నీ మాటను అంగీకరిస్తున్నాను. గౌరవింపదగిన నిన్ను గౌరవిస్తే బృహస్పతిని గౌరవించినట్లే.'

ఆ కచుడు శుక్రుడు చెప్పినప్రకారం వ్రతానికి అదే తగిన సమయంగా భావించి స్వీకరించాడు. ఉపాధ్యాయుని, దేవయానిని అతడు నిత్యమూ సేవిస్తూ యౌవనంలో ఉన్న కచుడు పాడుతూ, నృత్యంచేస్తూ, వీణాదులను వాయిస్తూ దేవయానిని సంతోష పెట్టాడు. మంచినడవడిక గల ఆ కచుడు యౌవనంలో ఉన్న కన్య అయిన దేవయానిని

పూలతో, ఫలాలతో- సంతోషపెట్టాడు. ఆమె ఆజ్ఞలను నిర్వర్తించి సంతోషపెట్టాడు. దేవయాని కూడా బ్రహ్మచర్యవ్రత నియమం పాటిస్తూన్న ఆ బ్రాహ్మణుని పాడుతూ, ఆడుతూ ఏకాంతంగా సేవించింది. ఈ విధంగా బ్రహ్మచర్యవ్రతం ఆచరిస్తున్న కచునికి అక్కడ ఐదువందల సంవత్సరాలు గడిచాయి. దానవులు అతని గురించి తెలుసుకొని, అడవిలో ఒంటరిగా గోవులను రక్షిస్తూన్న కచుని చూసి, సహింపలేక, బృహస్పతిమీది ద్వేషం వల్ల, మృతసంజీవినీ విద్యను రక్షించడంకోసం అతనిని చంపేశారు. వారు కచుని చంపి ముక్కముక్కలుగా చేసి తోడేళ్ళకు వేశారు. సాయంకాలానికి గోవులు, గోపాలకుడు (కచుడు) లేకుండానే స్వయంగా తమనివాసానికి తిరిగి వచ్చాయి. అడవి నుండి కచుడులేకుండా తిరిగి వచ్చిన గోవులను దేవయాని చూసి, తగిన సమయంలో తండ్రితో ఇలా పలికింది. దేవయాని ఇలా అంది – 'ప్రభూ! నీ అగ్నిహోత్రంలో హోమం చేయబడింది. సూర్యుడు కూడ అస్తమించాడు. గోవులు గోపాలకుడు లేకుండానే తిరిగివచ్చాయి. నాయనా! కచుడు కనబడటంలేదు. చంపబడి ఉంటాడు, లేదా మరణించి ఉంటాడు, ఇది స్పష్టం. అతడు లేకుండా నేను జీవింపలేను. ఇది నిజం. నీకు చెపుతున్నాను.' అప్పుడు శుక్రుడిలా అన్నాడు – 'ఇదుగో ఇలా రా' అని పలికి 'మరణించిన కచుని నేను మరల జీవింపజేస్తాను.' అని చెప్పి వెంటనే సంజీవినీ విద్యను ప్రయోగించి కచుని ఆహ్వానించాడు. అలా శుక్రునిచే పిలువబడ్డ కచుడు తోడేళ్ళ శరీరాలను చీల్చుకుని బయటకు వచ్చి, ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు. కచుడు ఆ విద్యతో ఆనందించాడు.

దేవయాని 'ఎందువల్ల ఆలస్యం చేశావు' అని కచుని అడిగింది. ఆమెతో అతడిలా అన్నాడు – సమిధలు, కుశలు మొదలగువానిని, కాష్ఠాలను తీసికొని వస్తూ శ్రమవల్ల భారంవల్ల బాధకల్గి వటవృక్షాన్ని ఆశ్రయించాను. గోవులుకూడా చెట్టునీడను ఆశ్రయించాయి. అసురులు అక్కడ నన్ను చూసి నీవెవరు? అని అడిగారు. బృహస్పతి కుమారుడను. కచుడని పేరు. అని చెప్పినమాత్రాన, నన్ను చంపి, ముద్దచేసి రాక్షసులు కుక్కలకు తోడేళ్ళకు వేసి, సుఖంగా తమనివాసానికి వెళ్లారు. భద్రా! మహాత్ముడైన భార్గవుడు తన విద్యచేత పిలువగానే నీదగ్గరకు ఇక్కడకు వచ్చాను. ఎట్లాగో బ్రతికాను.' ఈవిధంగా బ్రాహ్మణకన్య దేవయాని అడగ్గానే 'నేను చంపబడ్డాను' అని తన వృత్తాంతాన్ని చెప్పాడు. మళ్లీ దేవయాని చెప్పగా మరొకరోజు అతడు అనుకోకుండా పూలు తేవడానికి వెళ్లాడు. బ్రాహ్మణుడైన కచుడు (పూలకోసం) వనానికి వెళ్లాడు. దానవులు అతడిని చూశారు. మళ్లీ అతనిని చంపి ముద్దచేసి సముద్రజలాల్లో కలిపారు. కచుడు వెళ్ళి చాలాసేపయింది. దేవయాని తండ్రికి అతని గురించి నివేదించింది. భార్గవుడు మళ్ళీ

విద్యచేత ఆహ్వానించాడు. బృహస్పతి కుమారుడైన కచుడు మళ్ళీ వచ్చి జరిగిన వృత్తాంతాన్ని ఉన్నదున్నట్లుగా నివేదించాడు. తరువాత మూడవసారి రాక్షసులు కచుని చంపి, తగలబెట్టి, పొడిచేసి, మద్యంలో కలిపి శుక్రాచార్యునికే ఇచ్చారు. అటుపై దేవయాని మళ్లీ తండ్రితో ఇలా అన్నది. 'నాయనా! పూలు తేవడానికి పంపాను. కచుడు కనబడడంలేదు. తండ్రీ! కచుడు చనిపోయిఉంటాడు. లేదా చంపబడి ఉంటాడు. నేను నిజం చెపుతున్నాను. కచుడు లేకపోతే నేను బ్రతుకను.'

శుక్రుడిలా అన్నాడు – 'అమ్మాయీ! బృహస్పతి కుమారుడైన కచుడు మరణించాడు. నావిద్యచే జీవితు డౌతున్నా మళ్ళీ మళ్ళీ చంపబడుతున్నాడు. నేనేం చెయ్యను. దేవయానీ! ఇలా దుఃఖించకు. నీవంటిది మరణించిన వానిని గురించి దుఃఖించకూడదు. బ్రహ్మ, బ్రాహ్మణులు, ఇంద్రాది దేవతలు, వసువులు, అశ్వినులు, రాక్షసులు, సమస్తజగత్తు సంధ్యాసమయంలో నాప్రభావం వల్ల నీకు శిరస్సువంచి నమస్కరిస్తారు. (అటువంటి నీవు దుఃఖించడమేమిటి?) ఈ బ్రాహ్మణుడు మరల జీవింపచేయడానికి శక్యం కాడు. జీవింపజేసినా మళ్ళీ చంపబడుతూనే ఉన్నాడు.' దేవయాని ఇలా అంది – 'తపోనిధి బృహస్పతి కొడుకు అయిన కచుని గురించి దుఃఖించకుండా ఏడవకుండా ఎలా ఉండగలను? అతడు బ్రహ్మచారి, తపోధనుడు, ఎల్లపుడూ సిద్ధంగా ఉండేవాడు. పనులలో సమర్థుడు కూడ. కచునియొక్క మార్గాన్ని తెలుసుకొంటాను. నేను భుజింపజాలను, నాయనా! అతడు నాకు ఇష్టమైనవాడు, నారూపానికి తగినవాడు.' అనగానే ఆ శుక్రాచార్యుడు కూతురు కంగారువల్ల కచుని ఆహ్వానించాడు. 'నాదగ్గరకు వచ్చిన శిష్యులను చంపుతున్న రాక్షసులు నన్ను ద్వేషిస్తారు. ఇందులో సందేహం లేదు. రౌద్రస్వభావం గల ఈ రాక్షసులు నన్ను అబ్రాహ్మణునిగా చేయగోరుతున్నారు. అందుకే నిత్యమూ నాకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ బ్రహ్మ హత్యా పాపానికి అంతం లేదు! బ్రహ్మహత్య ఎవరిని దహింపదు? ఇంద్రుని కూడా దహిస్తుంది.' అని భావించాడు. గురువు వల్ల భయపడి, అతని విద్యచే పిలువబడి కచుడు ఉదరంలో ఉండి మెల్లగా ఇలా మాట్లాడాడు.

(కచుడు ఇలా అన్నాడు – పూజ్యుడా! నన్ను అనుగ్రహించు. కచుడను నేను నమస్కరిస్తున్నాను. మీకుమారుడు మిక్కిలి ఇష్టుడైనట్లే నన్నుకూడ భావించండి.)

వైశంపాయనుడిలా అన్నాడు – 'విప్రా! నీవు నా ఉదరంలో ఉన్నావు. అక్కడికి ఏవిధంగా వెళ్లావు? చెప్పు.' కచుడిలా అన్నాడు – 'నీ అనుగ్రహం వల్ల నాస్మృతి పోలేదు. ఏది ఏవిధంగా జరిగిందో అదంతా స్మరిస్తున్నాను. ఈవిధంగా నాతపస్సు క్షీణించలేదు. అందువల్లనే ఘోరమైన ఈక్లేశాన్ని సహిస్తున్నాను. కావ్యా! రాక్షసులు నన్ను చంపి, దహించి,

పాడిచేసి సురలో కలిపి నీకు ఇచ్చారు. విప్రా! మీరుండగా నేను దైవీమాయనుగాని, ఆసురీమాయనుగాని ఏ విధంగా ఉల్లంఘించగలను?' శుక్రుడిలా అన్నాడు 'అమ్మాయీ! ఇపుడు నేను నీకు ఇష్టమైనదేది చేయాలి? నామరణంచేతనే కచుడు జీవిస్తాడు. నాఉదరాన్ని భేదించడంకంటె వేరొక ఉపాయం లేదు. అలా అయితేనే నాఉదరంలోని కచుడు ఎదురుగా కనబడగలడు.' దేవయాని ఇలా అంది 'నన్ను ఈ రెండుదుఃఖాలు అగ్నివలె దహిస్తున్నాయి. కచుని నాశనం, నీకు హాని. కచుడు నశిస్తే నాకు శాంతిలేదు. నీకు హాని జరిగితే నేను జీవించలేను.' శుక్రుడిలా అన్నాడు 'బృహస్పతి కుమారా! ఇపుడు నీవు (కార్య) సిద్ధి పొందినవాడవు. ఎందుకంటే దేవయాని భక్తుడవైన నిన్ను కోరుకొంటోంది. నీవు కచరూపంలో ఉన్న ఇంద్రుడవు కాకపోతే, ఈ సంజీవినీ విద్యను పొందు. ఒక్క బ్రాహ్మణుడు తప్ప వేరొకడెవడూ నాఉదరం నుండి మళ్ళీ జీవిస్తూ బయటకు రాకూడదు. అందువల్ల ఈవిద్యను పొందు. నాయనా! నా ఈ శరీరంనుండి జీవంతో బయటకు వచ్చి నాకు పుత్రతుల్యుడవై, నన్ను మరల భావించి జీవింపచెయ్యి. గురువునుండి విద్యనుపొంది, విద్వాంసుడ వైన తర్వాతకూడ ధర్మబద్ధ మయిన దృష్టితో చూడాలి.' గురువు దగ్గర నుండి విద్యపొంది, శుక్రుని ఉదరం చీల్చుకొని కచుడు తత్క్షణం బయటకు వచ్చాడు. అపుడతడు శుక్లపక్షం చివరవచ్చే పున్నమినాటి చంద్రునిలా ఉన్నాడు. కచుడు బ్రహ్మరాశివలె పడిఉన్న ఆ శుక్రుని చూచి, తాను పొందిన విద్యచేత శుక్రుని బ్రతికించి పైకి లేవదీశాడు. సంజీవినీవిద్యను పొంది కచుడు నమస్కరించి పిమ్మట ఇలా అన్నాడు.

విద్యలేని నాచెవులలో అమృతంవంటి మృతసంజీవినీ విద్యను నింపిన ఈ శుక్రాచార్యుని నేను నాతల్లిగా, తండ్రిగాకూడ భావిస్తున్నాను. అతడు చేసిన దానిని (ఉపకారాన్ని) గుర్తుంచుకొని అతనికి ద్రోహం చేయరాదు. సర్వోత్తమమైన వేదజ్ఞానాన్ని ఇచ్చి, నిధులన్నింటికి పెన్నిధి అయిన గురువునుండి విద్యలను పొంది పూజింపదగిన గురువును ఆదరించనివారు లోకంలో అప్రతిష్ఠను పొంది, పాపలోకాలకు వెళ్తారు.' వైశంపాయనుడిలా అన్నాడు - 'విద్వాంసుడైన శుక్రుడు సురాపానంవల్ల మోసగింపబడి, (జ్ఞానం) నశించి, మిక్కిలి ఘోరమైన స్థితిని పొందాడు. ఆ స్థితిలో తనకు ప్రియశిష్యుడైన కచుని చూసి కూడా, మద్యంచేత మోహితుడై మద్యాన్ని త్రాగాడు. ఈవిషయం తలుచుకొని మహానుభావుడైన శుక్రుడు కోపంతో లేచి, విప్రులకు హితాన్ని చేయగోరి, సురాపానం పట్ల కోపించి స్వయంగా ఈ మాటలన్నాడు. 'ఈ లోకంలో ఇప్పటినుండి ఏ బ్రాహ్మణుడైనా తెలివితక్కువతనంతో మోహంవల్ల మద్యాన్ని త్రాగితే, అతడు ధర్మం తప్పినవాడూ,

బ్రహ్మహత్య చేసినవాడూ కాగలడు. ఈలోకంలోను, పరలోకంలోను నిందితుడౌతాడు. సమస్తలోకంలోను విప్రధర్మశాస్త్రానికి హద్దయిన ఈ మర్యాదను నేను స్థాపిస్తున్నాను. గురువులకు సేవచేయాలనుకొనే శిష్యులు, సత్పురుషులు, విప్రులు సమస్తదేవలోకాలు ఈ మాటను వినండి.' అని ఈ విధంగా చెప్పి తపోనిధులకు నిధి, అయిన శుక్రుడు దైవంపట్ల విముఖమైన బుద్ధిగల ఆ దానవులను పిలిచి ఇలా చెప్పాడు. 'దానవులారా! మీకు చెపుతున్నాను. మీరు ఇంకా బాలచేష్టలు చేస్తున్నారు. కచుడు విద్యాసిద్ధి పొందినవాడు. నాదగ్గరే ఉంటాడు. సంజీవినీ విద్యను పొంది నాతో సమానమైన ప్రభావం కలవాడు, మహాత్ముడు, బ్రాహ్మణుడు, బ్రహ్మస్వరూపుడూను.

(దేవతల కారణంగా దుష్కరమైన కర్మను కచుడు చేశాడు. దానివల్ల కలిగిన కీర్తి జీర్ణించిపోదు. యజ్ఞభాగం కూడ ఉంటుంది.')

ఇంతమాత్రం చెప్పి భార్గవుడు విరమించాడు. దానవులు ఆశ్చర్యపడి స్వనివాసాలకు వెళ్ళారు. ఆ కచుడు గురువు వద్ద వెయ్యిసంవత్సరాలు ఉండి, గురువుచే అనుమతింపబడి స్వర్గానికి వెళ్ళగోరాడు.

77. దేవయాని కచుని వివాహమాడగోరుట. కచుడు తిరస్కరించుట.

తనవ్రతాన్ని పూర్తిచేసికొని, గురువు అనుమతితీసికొని దేవలోకానికి బయలుదేరిన కచునితో దేవయాని ఇలా పలికింది– 'నడవడిచేత, వంశం చేత, విద్యచేత, తపస్సుచేత, ఇంద్రియనిగ్రహంతో చక్కగా ప్రకాశిస్తున్నావు. నా తండ్రి వలెనే మహాయశస్వి అయిన అంగిరసమహర్షి కూడ నాకు గౌరవింపదగినవాడు, అలాగే బృహస్పతికూడ నాకు గౌరవింపదగినవాడు, పూజింపదగినవాడూ కూడ. తపోధనా! ఈ విషయాన్ని గ్రహించి, నేచెప్పే విషయాన్ని తెలుసుకో. విద్యావ్రతంలో నియమాన్ని స్వీకరించి ఉన్న నీ విషయంలో నేను ఎలా ఉన్నానో గ్రహించు. విద్య సమాప్తి చేసుకొన్న నీవు నీభక్తురాలైన నన్ను సేవింప దగియున్నావు. యథావిధిగా మంత్రపురస్సరంగా నాపాణిగ్రహణం చెయ్యి.' కచుడిలా అన్నాడు – 'నీతండ్రి నీకు పూజ్యుడు, మాన్యుడు అయినట్లే నాకు కూడ పూజ్యుడు, మాన్యుడూ కూడ. అలాగే నీవుకూడ ఇంకా ఎక్కువ పూజింపదగినదానవు. భద్రా! మహాత్ముడైన భార్గవునికి(శుక్రాచార్యునికి) నీవు ప్రాణాలకంటె మిక్కిలి ప్రియమైన దానివి. ధర్మంప్రకారంగా గురుపుత్రివైన నీవు నాకు ఎల్లపుడు పూజింపదగినదానవే. దేవయానీ! నాగురువు, నీతండ్రియైన శుక్రుడు నాకు నిత్యమూ మాన్యుడు. అదేవిధంగా నీవు కూడ. కావున ఈ విధంగా నాతో మాట్లాడరాదు.' దేవయాని ఇలా చెప్పింది – 'నాతండ్రి గురుపుత్రునికి పుత్రుడవు

నీవు. నాతండ్రికి నీవు పుత్రుడవు కాదు, ద్విజోత్తమా! అందువల్ల నీవుకూడ నాకు పూజ్యుడవు, మాన్యుడవూ కూడ, కచా! రాక్షసులు నిన్ను మాటిమాటికి చంపుతూంటే అప్పటినుండి నేను నీపట్ల చూపిన ప్రేమను నీవిప్పుడు ఒకసారి తలుచుకో. స్నేహంలో, అనురాగంలో ఉత్తమమైన నా ప్రీతిని తెలుసుకో. ధర్మజ్ఞా! దోషంలేని నన్ను నీవు విడిచి పెట్టడం యుక్తంకాదు.'

కచుడిలా అన్నాడు - 'శుభవ్రతా! నియోగింపరాని కార్యంలో నీవు నన్ను నియోగిస్తున్నావు. నీవు అనుగ్రహించు. నీవు నాకు గురుని కంటె ఎక్కువ గౌరవింపదగినదానవు. కావ్యుని గర్భంలో నీవున్నట్లే నేనుకూడ అదేగర్భంలో నివసించాను. ధర్మంప్రకారం నీవు నాకు సోదరివి. నీవిలా మాట్లాడకు, నేనిక్కడ సుఖంగా నివసించాను. నాకు నీపై కోపం ఏమాత్రమూ లేదు. నిన్ను సెలవు అడుగుతున్నాను. నేను వెడుతున్నాను. నాకు మార్గంలో మంగళాన్ని పలుకు. మాటల మధ్యలో ధర్మానికి విరుద్ధంగా లేకుండా, నేను స్మరించ దగినవాడిని. నాగురువును అప్రమత్తంగా, ముందుగాలేచి నిత్యమూ ఆరాధించు.' దేవయాని అంది. 'కచా! ధర్మబద్ధమైన కామపురుషార్థం కోసం యాచించిన నన్ను నీవు నిరాకరిస్తే నీనేర్చుకొన్న విద్య నీకు సిద్ధిని కలిగించదు.' కచుడిలా అన్నాడు 'గురుపుత్రివవటంచేత నేను తిరస్కరిస్తున్నాను. నీలోని దోషంవల్ల కాదు, గురువు దీనిని అనుమతించలేదు. నీఇష్టమైనట్లు నన్ను శపించుకో. దేవయానీ! నేను ఋషిధర్మాన్ని చెపుతున్నాను. అటువంటి నన్ను నీవు శపించావు. అటువంటి శాపానికి నేను అర్హుడిని కాను. నీవు కామం వల్ల ఇపుడు శపించావు. ధర్మంతో కాదు, అందువల్ల నీకోరిక నీవు కోరుకొన్నట్లుగా జరగదు. ఋషిపుత్రు డెవ్వడూ నీపాణిగ్రహణం చెయ్యడు. నీవు నన్ను శపించినట్లుగానే నావిద్య ఫలించదు. కాని నేను నేర్పిన వానికి ఆ విద్య ఫలిస్తుంది.' ఈ విధంగా దేవయానితో చెప్పి కచుడు శీఘ్రంగా దేవలోకానికి వెళ్లాడు. అపుడు ఇంద్రుని ముందిడుకొని దేవతలందరూ బృహస్పతి దగ్గరకు వెళ్లి, పూజించి కచునితో ఇలా అన్నారు. 'మాకు హితమైన, అద్భుతమైన పనిని నీవు చేశావు. దీనివల్ల నీకు శాశ్వతమైన కీర్తి కలుగుతుంది. నీవు యజ్ఞభాగాన్ని స్వీకరించేవాడవు కాగలవు.'

78. శర్మిష్ఠా దేవయానుల కలహము.

కచుడు మృతసంజీవినీ విద్యను నేర్చుకొని రావడంతో దేవతలంతా ఆనందించారు. కచుని దగ్గర ఆ విద్యను అధ్యయనం చేసి కృతార్థులయ్యారు. అందరూ కలిసి వచ్చి ఇంద్రునితో ఇలా అన్నారు - 'ఇప్పుడిక నీవు పరాక్రమించవలసిన సమయం ఆసన్నమయింది

పురందరా! శత్రువులను జయించు. దేవతలందరూ కలిసి ఇలా చెప్పగానే దేవేంద్రుడు అలాగే అని పలికి బయలుదేరాడు. అతడు ఒకవనంలో స్త్రీలను చూశాడు. చైత్రరథవనాన్ని పోలిన వనంలో కన్య లందరూ జలక్రీడలాడుతుండగా అతడు వాయురూపంలో వారి బట్టల్ని కలగాపులగం చేశాడు. నీటినుండి పైకి వచ్చి, ఆ కన్యలందరూ ఒకదానితో ఒకటి కలిసి ఉన్న వస్త్రాలను తీసికొన్నారు. వస్త్రాలు తారుమారు కావటాన్ని వృషపర్వుని కూతురు శర్మిష్ఠ గమనించకుండా దేవయాని వస్త్రం స్వీకరించింది. అనంతరం అక్కడ ఆ వస్త్రంకోసం దేవయానికీ శర్మిష్ఠకూ పరస్పరం విరోధం ఏర్పడింది. దేవయాని అంది 'ఆసురీ! శిష్యురాలవై ఉండి నా వస్త్రాన్ని ఎందుకు తీసికొన్నావు? సముదాచారం లేని నీకు ఈ పని మంచిదికాదు.' శర్మిష్ఠ ఇలా అన్నది - 'కూర్చున్నా, పరుండినా, నాతండ్రికి క్రిందనిలిచి నీతండ్రి వినయంతో మాటిమాటికి వందిమాగధునివలె స్తుతిస్తూ ఉంటాడు. యాచిస్తూ, స్తుతిస్తూ దానాన్ని ప్రతిగ్రహించే శుక్రుని కూతురవు నీవు. యాచకీ! కోపగించు. ఆయుధంలేకుండా ఉన్న నీవు ఆయుధంతో ఉన్న నాతో వ్యర్థంగా విరోధిస్తున్నావు. నిన్ను నే లెక్కపెట్టను.

(యాచకీ! ఇకపైన ప్రతికూలంగా మాట్లాడితే నాదాసీలు నిన్ను బలవంతాన బయటకు పంపుతారు.)

తన ఉన్నతత్వాన్ని, గొప్పతనాన్ని చెప్పి తన వస్త్రం పట్టుకులాగుతున్న దేవయానిని శర్మిష్ఠ నూతిలోకి త్రోసింది. అనంతరం 'ఆమె మరణించింది' అని భావించి పాపనిశ్చయురాలయిన శర్మిష్ఠ తన నగరానికి తిరిగివచ్చి, ఇంటికి వెళ్ళింది. అనంతరం ఆ ప్రదేశానికి నహుషుని కొడుకు యయాతి వచ్చాడు. ఆ యయాతి యొక్క సారథి, రథాశ్వాలు అలిసిపోయాయి. మృగాలను వేటాడుతూ అతడు కూడా దప్పికతో ఉన్నాడు. త్రాగడానికి నీరున్న ప్రదేశాన్ని వెదకుతూ యయాతి అక్కడకు వచ్చి నూతిలో అగ్నిశిఖలా ఉన్న ఆ కన్యను చూశాడు. దేవతాస్త్రీలా ఉన్న ఆమెను చూడగానే ఇలా అడిగాడు. రాజశ్రేష్ఠుడైన యయాతి తీయనైన సాంత్వన వచనాలతో ఆమెను ఊరడించి, 'ఎర్రనిగోళ్ళు కలిగి, మణికుండలాలతో ప్రకాశిస్తూన్న నీవు ఎవరవు ? మిక్కిలిగా ఆలోచిస్తున్నావు. తెలివైన నీవు ఎందువల్ల మిక్కిలి దుఃఖిస్తున్నావు. నీటిమొక్కలతోను, గడ్డితోను నిండి ఉన్న ఈ కూపంలో ఎలా పడ్డావు? నీవు ఎవరి కూతురవు. సుందరీ! నిజం చెప్పు.' అని అడిగాడు. దేవయాని ఇలా చెప్పింది - దేవతలు చంపిన దైత్యులను తన విద్యతో తిరిగి బ్రతికిస్తున్న శుక్రాచార్యుని కూతురను. నన్ను నీవు ఎరుగవా!

(రూపం, పరాక్రమం, బలం, వీటితో కూడియున్న నీవు 'నీవెవరూ', అని నన్ను అడుగుతున్నావు.

నీవు ఇక్కడకు రావడం ఎందుకో చెప్పు. యథార్థంగా వినాలనుకొంటున్నాను.' యయాతి ఇలా అన్నాడు - 'నహుషుని కుమారుడైన యయాతిని నేను, మృగాలను వేటాడుతూ అలసిపోయి ఇక్కడకు వచ్చాను. గడ్డితో నిండి ఉన్న ఈ నూతిలో నిన్ను చూశాను.' అని దేవయాని ఇలా అన్నది.)

'రాజా! రాగరంజితమైన గోళ్లు వేళ్లు ఉన్న నాకుడిచేతిని గ్రహించి నన్ను ఉద్ధరించు. ఉత్తమవంశస్థుడవయిన నీవు నాకు ఇష్టుడవే. శాంతుడు, పరాక్రమవంతుడు, యశస్వి అయిన నిన్ను నేనెరుగుదును. అందువలన ఈ నూతిలో పడ్డ నన్ను ఉద్ధరించటానికి నీవే యోగ్యుడవు.' నహుషుని కొడుకైన యయాతిరాజు ఆమెను బ్రాహ్మణస్త్రీగా తెలిసికొని కుడిచేతితో పట్టుకుని ఆ రాజు కూపంనుండి తేలికగా ఆమెను పైకితీసి

('స్వేచ్ఛగా వెళ్లు. నీకు భయంలేదు' అని అన్నాడు. అపుడామె రాజుకి ఇలా సమాధానమిచ్చింది - 'నన్ను స్వీకరించి 'శీఘ్రంగా వెళ్ళు' అని నీవు అన్నావు. కాని నీవు నాకిష్టుడవు. నీవు నా పాణిని గ్రహించావు. కాబట్టి భర్త వవుతావు.' ఇలా చెప్పగానే క్షత్రవంశంలో పుట్టిన యయాతి ఇలా అన్నాడు - 'భద్రా! నీవు బ్రాహ్మణ కన్యవు. అందువల్ల నాతో కలయిక నీకు తగదు. శుక్రాచార్యుడు లోకానికంతకూ గురువు. ఆతని కూతురివి నీవు. ఆతనివల్ల ఇపుడు నాకు భయం కూడా. కళ్యాణీ! అందువల్ల ఇందుకు తగిన దానివి కాదు.' దేవయాని ఇలా అంది 'రాజా! నామాటప్రకారం ఇపుడు నన్ను ఇష్టపడకపోయినట్లయితే, తండ్రి ద్వారానే నిన్ను వరిస్తాను. తర్వాత నీవు తెలుసుకొంటావు. వెళ్ళు.')

యయాతి దేవయానిని వీడ్కొని తన నగరానికి వెళ్లాడు. యయాతి వెళ్ళగానే దేవయాని ఒక చెట్టుకింద కూర్చుని దుఃఖితురాలై ఏడుస్తూ కూర్చుంది.

(అనంతరం కూతురి రాక ఆలస్యం కావడంతో శుక్రాచార్యుడు దాదితో ఇలా అన్నాడు - 'ధాత్రీ! స్వచ్ఛమైన చిరునవ్వుతో ఉండే నాకూతురు దేవయానిని నీవు త్వరగా తీసికొనిరా.' అని చెప్పగానే దాది తొందరగా ఆమెను పిలవడానికి వెళ్ళింది. చెలులతోబాటు ఆమె వెళ్లిన ప్రదేశాలన్నీ ఆమెకోసం వెదికింది. ఒకచోట అలసిపోయి దీనంగా ఏడుస్తూ ఉన్న దేవయానిని చూసింది. దాది ఇలా అంది - 'భద్రా! నీకేం జరిగింది? ఇలా ఉన్నావు. తొందరగా చెప్పు. నీ తండ్రి నిన్ను పిలిచాడు.' అపుడు దేవయాని దాదిని దగ్గరకు పిలిచి శర్మిష్ఠ చేసిన అపరాధాన్ని చెప్పింది.)

దుఃఖంతో తపించినదై తనకెదురుగా వచ్చిన ఘూర్ణిక (దాది) తో ఇలా అంది. 'ఘూర్ణికా తొందరగా వెళ్లు. శీఘ్రంగా నా తండ్రికి చెప్పు. నేనిపుడు వృషపర్వుని నగరాన్ని ప్రవేశించను.' ఘూర్ణిక అక్కడున్న రాక్షసమందిరానికి తొందరగా వెళ్ళి, శుక్రుని చూసి కంగారుపడుతున్న హృదయంతో 'వృషపర్వుని కూతురయిన శర్మిష్ఠ వనంలో దేవయానిని కొట్టిందని' చెప్పింది. అక్కడ శుక్రుడు తన కూతురిని శర్మిష్ఠ కొట్టిందని విని, దుఃఖంతో తొందరగా అక్కడనుంచి వెళ్ళాడు. కూతురిని వనంలో వెతుక్కొంటూ వెళ్ళి ఒకచోట దేవయానిని చూశాడు. కూతురిని కౌగిలించుకొని, దుఃఖితుడై ఇలా అన్నాడు - "జనులందరూ తమతమదోషాల చేతనే సుఖదుఃఖాల్లో నియమింపబడతారు.

నీవేదో చెడుపని చేసి ఉంటావు. దానివల్లనే నీవిటువంటి ఫలితాన్ని పొందావు.' దేవయాని ఇలా పలికింది – 'నిష్కృతి ఉండనీ, ఉండకపోనీ. సావధానంగా నామాట విను. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ నాతో అన్నది నిజమా? కాదా? 'రాక్షసులను స్తుతిస్తూ గానం చేసేవాడివి' అని ఆమె అంది. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ఇలా అంటోంది. ఆమె కోపంతో ఎర్రబడ్డ కన్నులతో తీవ్రమూ, కఠినమూ అయిన ఈమాట మాటిమాటికీ అంటోంది. నీవు స్తుతించేవానికి, నిత్యం యాచించే వానికి, దానం తీసికొనేవానికి కూతురివి, నేనయితే స్తుతింపబడే వానికి, ఇచ్చేవానికి, దానం తీసికోనటువంటివానికి కూతురిని. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ కోపంతో ఎర్రబడ్డ కన్నులతో నిండుగర్వంతో మాటిమాటికి ఈ మాటను అంటోంది. తండ్రీ! 'నేను స్తుతించేవానికి, ప్రతి గ్రహణం చేసేవానికి, కూతురినే అయితే నిన్ను ప్రసన్నం చేసుకోగలను' అని నా సఖి శర్మిష్ఠతో అన్నాను.

(ఇలా చెప్పినప్పటికీ మిక్కిలి కోపంతో జనులు లేని ఈవనంలో నన్ను వట్టుకొని కూపంలోకి త్రోసి ఇంటికి వెళ్ళింది.)

శుక్రుడిలా అన్నాడు – 'నీవు స్తుతించేవానికి, యాచించేవానికి, ప్రతిగ్రహణం చేసేవానికి కూతురివి కాదు. స్తోత్రం చేయకుండా, స్తుతింపబడే శుక్రుని కూతురు దేవయానివి నీవు. చింతింపశక్యంగాని, బ్రహ్మం, ద్వంద్వాతీతం, అయిన ఈశ్వరసంబంధమగు శక్తియే నాబలం. ఆ సంగతి వృషపర్వునికీ తెలుసు. ఇంద్రుడు, యయాతి రాజు కూడా దీనిని ఎరుగుదురు. భూమిమీద గాని, స్వర్గంలో గాని, ప్రాణులన్నింటిలో గాని ఏదున్నప్పటికిని నిత్యమూ దానికి నేను ఈశ్వరుడను. సంతోషించిన స్వయంభువు నాకీ వరాన్ని ఇచ్చాడు. ప్రజలకు హితం చేయాలనే కోరికతో నేను నీటిని తర్పణం చేస్తాను-ఓషధులన్నింటిని నేను పోషిస్తున్నాను. నీకు నిజమే చెపుతున్నాను.' ఇలా విషాదాన్ని పొంది కోపంతో బాధపడుతున్న కూతురిని తండ్రి శుక్రాచార్యుడు తీయని మాటలతో ఊరడించాడు.

79. శుక్రాచార్యుడు దేవయానిని సముదాయించుట.

శుక్రుడిలా అన్నాడు

('నావిద్య తిరుగులేనిది. దాని ఫలితమే కదా ఈ నా ఐశ్వర్యం. దైన్యం, శౌర్యం, కుటిలత్వం, అధర్మ ప్రవృత్తి నాకు లేవు.')

పరులనిందలను సహించేవాడు ఈ సర్వజగత్తును జయింపగలడు. గుఱ్ఱాన్ని నిగ్రహించినట్లు పొంగివచ్చే క్రోధాన్ని నిగ్రహించినవాడే సారథి అని సత్పురుషు లంటారు. కేవలం కళ్ళెములు పట్టుకొన్నవాడు సారథి కాడు. చెలరేగే క్రోధాన్ని సహనంతో తొలగించినవాడు

ఈ సమస్తజగత్తును జయిస్తాడు. దేవయానీ! ఈ విషయం గ్రహించు. పాము కుబుసం విడిచినట్లు, పొంగివచ్చే కోపాన్ని సహనంతో తొలగించుకొనే వాడే పురుషుడని అంటారు. కోపాన్ని నిగ్రహించేవాడు, నిందలను సహించేవాడు, బాధపడినా ఇతరులను బాధింపనివాడు ఐశ్వర్యానికి అర్హుడ వుతాడు. అలసటలేకుండా నెలకొకసారి చొప్పున నూరు సంవత్సరాలు యజ్ఞంచేసేవాడు - అందరిపట్ల కోపంలేక ప్రవర్తించేవాడు - వీరిరువురిలో కోపంలేనివాడే గొప్పవాడు.

(క్రోధంతో ఉన్నవాని దానం, యజ్ఞం, తపస్సు వ్యర్థమే. క్రోధంలేనివాడు చేసిన యజ్ఞం, తపస్సు, దానం మహోఫలాన్ని ఇస్తాయి. క్రోధానికి వశమైనవాడు పవిత్రుడు కాడు, తపస్వికాడు, యజ్వకాదు, కర్మజ్ఞుడు కాదు. ఆటువంటివానికి ఇహపరాలు రెండూ లేవు. నిత్యం కోపించేస్వభావం ఉన్నవానికి పుత్రుడు, సేవకుడు, మిత్రుడు, సుహృత్తు, భార్య, ధర్మం, సత్యమూ - ఇవన్నీ దూరంగా పోతాయి.)

అజ్ఞానం వల్ల కుమారులు కాని, కూతుళ్లు కాని పరస్పరం విరోధించుకొంటే, ప్రాజ్ఞులు వారిని అనుసరించకూడదు. అజ్ఞానంవల్ల వారు ఇతరుల బలాబలాలు తెలియజాలరు. దేవయాని ఇలా అంది - 'నాయనా! నేను బాలికనయినా ధర్మాల మధ్యనున్న భేదాన్ని ఎరుగుదును. సహనం, నిందలమధ్య బలాబలాలను కూడ నేను ఎరుగుదును. శిష్యుడిగా ఉండి శిష్యప్రవృత్తికి విరుద్ధంగా ఉండేవాడిని, అతడి హితంకోరే గురువు క్షమించకూడదు. అందువల్ల ఆచారవిచారాల్లో సంకీర్ణంగా ప్రవర్తించే దానవుల దగ్గర నివాసం నాకు ఇష్టంలేదు. ఇతరుల సదాచారప్రవృత్తిని, కులీనతను నిందించేవారు పాపబుద్ధులు. శ్రేయస్సును కోరుకొనే ప్రాజ్ఞుడు వారిమధ్య నివసించకూడదు. తనప్రవృత్తిని గాని, కులీనత గాని తెలిసికొనగల్గిన సత్పురుషులమధ్య నివసించాలి. ఆ నివాసం శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది.

(ధనం లేకపోయినా నిత్యమూ మనస్సును నియంత్రించ గలిగిన మానవులు శ్రేష్ఠులు. దుష్టప్రవృత్తితో పాపాలు చేసేవారు ధనవంతులైనా వారు చండాలురే. కారణం లేకుండా ఇతరులను ద్వేషించేవారు, ఇతరులను నిందించేవారు పాపాత్ములు. వారితో సత్పురుషులు నివసించరాదు. వారితో కలిస్తే ఇతరులు కూడ పాపాత్ము లౌతారు. మానవుడు సుకృతంలో కాని, దుష్కృతంలో కాని ఆసక్తుడైతే తప్పనిసరిగా దాని యందతనికి దృఢమైన ప్రీతి కలుగుతుంది. అందువల్ల దోష ప్రీతి కలిగి ఉండకూడదు.)

అగ్ని కోరేవాడు అరణిని మథించినట్లు వృషపర్వుని కూతురు పలికిన ఘోరమైన తప్పుమాట నా హృదయాన్ని మథిస్తోంది. ఇంతకంటె మిక్కిలి దుఃఖకరమైంది వేరొకటి ఈ మూడులోకాలలోనూ లేదు.

(పరుషమైన మాట మర్మాలను ఛేదిస్తుంది. సందేహంలేదు. సజ్జనులూ, మిత్రులూ వారితో స్నేహం చెయ్యరు.)

తేజరిల్లుతున్న శత్రువులసంపదను సంపదలేకుండా ఆరాధించేవాడు మరణించడం మంచిది- అని విద్వాంసులు చెపుతున్నారు.

(నీచులతో కలిసిన మనుష్యుడు మెల్లమెల్లగా అవమానాన్ని పొందుతాడు. నోటినుండి వెలువడ్డ వాగ్బాణాలు తగిలినవాడు రాత్రింబవళ్ళు దుఃఖిస్తాడు. శస్త్రంవల్ల, విషంవల్ల, అగ్నివల్ల కలిగినదుఃఖం మెల్లగా అనుభవంలోకి వస్తుంది. అందుచే పండితుడు పరులమీద వాగ్బాణాల్ని విడువకూడదు. బాణాలచే కాని, గొడ్డలిచే కాని నరకబడిన వనం మళ్లీ మొలకెత్తుతుంది. కాని భయంకరమైన, కటువైన వాక్కుచే గాయపడిన హృదయం, మళ్లీ సహజంగా వికసించదు.)

80. శర్మిష్ఠ దేవయానికి దాసియగుట.

అనంతరం శుక్రుడు కోపంతో సింహాసనంపై కూర్చున్న వృషపర్వుని సమీపించి అనాలోచితంగా ఇలా అన్నాడు. 'రాజా! అధర్మం ఆచరిస్తే అది గోవువలె వెంటనే ఫలితాన్ని ఈయదు. కాని మెల్లగా పరిణమిస్తూ కర్తయొక్క మూలాలను నాశనం చేస్తుంది. ఎక్కువగా తిన్న అన్నం ఉదరంలో మెల్లగా హాని కలిగించినట్లే **చేసినపాపం తనయందు కాని, పుత్రుల యందు కాని, మనుమలయందు కాని తప్పక ఫలిస్తుంది.** ఇది నిశ్చయం. కచుడు హితుడు, సహనశీలి, జితేంద్రియుడు అయిన విద్యార్థి. పాపరహితుడై, ధర్మజ్ఞుడై మా కిష్టుడై మా ఇంట శుశ్రూష చేస్తున్న అంగిరసుని కుమారుని - కచుని - మళ్ళీమళ్ళీ చంపించావు. వృషపర్వా! చంపకూడని ఆ కచుని చంపటంవల్ల, నాకూతుర్ని చంపటంవల్ల బంధుమిత్రులతో కూడిన నిన్ను విడిచిపెడతాను. కాని రాజా! నీదేశంలో నీతోపాటు నేను ఉండలేను. రాక్షసరాజా! నేనెప్పుడైనా అసత్యమాడడం నీవెరుగుదువా! నీ ఈదోషాన్ని నీవు నిగ్రహించుకోవటం లేదు. పైగా ఉపేక్షిస్తున్నావు.'

(వృషపర్వుడు ఇలా అన్నాడు. బ్రహ్మస్వరూపా! శర్మిష్ఠచేత దేవయానిని చంపించినా, నిందింపజేసినా నేను సద్గతిని పొందలేను.)

భార్గవా! నీలో అధర్మాన్ని కాని, అసత్యాన్ని కాని ఎప్పుడూ చూడలేదు. నీయందు ధర్మం, సత్యం ఉన్నాయి. మమ్మల్ని అనుగ్రహించు. నీవు మమ్మల్ని వదిలి ఇక్కడనుండి ఎక్కడకైనా వెళ్లేటట్లయితే మేమంతా సముద్రంలో ప్రవేశించాలి. మాకు వేరే గతి లేదు.

(గ్రహాధిపా! నీవు నన్నుకూడా వదిలి ఆ దేవతల దగ్గరికి వెళ్ళేటట్లయితే ఆ తరువాత నేను అన్నీ విడిచిపెట్టి అగ్నిలో ప్రవేశిస్తాను.)

శుక్రుడిలా అన్నాడు - 'మీరంతా సముద్రంలో ప్రవేశించండి, లేదా రాక్షసులంతా కలసి నానాదిక్కులకు పరుగెత్తండి. ప్రియమైన నాకూతురుకు జరిగిన అవమానాన్ని నేను సహింపలేను. దేవయానిని ప్రసన్నురాలిని చేసుకోండి. ఆమెపై నాజీవితం ఆధారపడి

ఉంది. ఇంద్రుని యోగక్షేమాలు బృహస్పతి మీద ఆధారపడి ఉన్నట్లు నీయోగక్షేమాలు నా మీద ఆధారపడి ఉన్నాయి.' అపుడు వృషపర్వుడిలా అన్నాడు – 'భార్గవా! రాక్షసరాజులకు ఈభూమిమీదున్న ఏనుగులు, గోవులు, గుఱ్ఱాలు మొదలయిన సంపదలన్నింటికీ, నాకూ నీవే ఈశ్వరుడవు.' శుక్రుడు ఇలా అన్నాడు – 'మహాసురా! దైత్యేంద్రులకు ఉన్న ద్రవిణానికంతటికి నేను ఈశ్వరుడనే అయినట్లయితే, దేవయాని ప్రసన్నురాలు కావాలి.' శుక్రుడిలా అనగానే వృషపర్వుడు 'అలాగే' అని అంగీకరించాడు. అతనితోపాటు భార్గవుడు దేవయాని దగ్గరకు వెళ్ళి వృషపర్వుని అభిప్రాయాన్ని చెప్పాడు. అపుడు దేవయాని ఇలా అంది – 'నాయనా! భార్గవా! రాజయొక్క ధనానికి నీవు ఈశ్వరుడవైనట్లయితే, నేను దాన్ని అంగీకరించను. ఆ మాటను రాజే స్వయంగా చెప్పాలి.' వృషపర్వుడిలా అన్నాడు – 'దేవయానీ! నీవు మిక్కిలిగా కోరుకొంటున్న దానిని నేను నీకు ఇస్తాను. అది దుర్లభమైనదయినా సరే ఇస్తాను.' దేవయాని ఇలా అంది – 'కన్యాసహస్రంతో కూడిన శర్మిష్ఠను నేను దాసిగా కోరుతున్నాను. నా తండ్రి నన్ను ఇచ్చిన చోటికి కూడా ఆమె నన్ను అనుసరించి రావాలి.' వృషపర్వుడిలా అన్నాడు – 'ధాత్రీ! లే, నీవు వెళ్ళు, శర్మిష్ఠను శీఘ్రంగా తీసికొనిరా. దేవయాని ఏకోరిక కోరితే దాన్ని చెయ్యాలి.

(వంశాన్ని రక్షించడం కోసం ఒకవ్యక్తిని విడిచిపెట్టాలి. గ్రామరక్షణకోసం వంశాన్ని విడవాలి. జనపదం కోసం గ్రామాన్ని విడవాలి. తన్ను రక్షించుకోవటం కోసం భూమినే(రాజ్యాన్నే)వదిలేయాలి.')

అక్కడనుండి ధాత్రి నగరానికి వెళ్ళి శర్మిష్ఠతో 'శర్మిష్ఠా! లే, జ్ఞాతులకు సుఖాన్ని కలిగించు', అని చెప్పింది. దేవయానిచేత ప్రేరేపించబడ్డ శుక్రాచార్యుడు శిష్యులను వదలివేస్తున్నాడు. 'పుణ్యాత్ములారా! ఆ దేవయాని దేన్ని కోరుకుంటే అది నీవిపుడు చెయ్యాలి.' శర్మిష్ఠ ఇలా అంది – 'ఆమె దేనిని కోరితే దానిని ఇపుడే నేను చేస్తాను. దేవయానికోసం శుక్రుడు నన్ను పిలిచాడు. నాదోషంవల్ల, నాకోసం శుక్రుడూ, దేవయానీ విడిచి వెళ్ళిపోనక్కర్లేదు.' అనంతరం వేయికన్యలతో పల్లకీతో శర్మిష్ఠ తనతండ్రి ఆజ్ఞతో తొందరగా ఆ పురాన్ని విడిచి వనానికి వెళ్ళింది. శర్మిష్ఠ(దేవయానితో) ఇలా అంది – 'వేయిమంది దాసీలు(దాసులు) గల నేను నీకు పరిచారికను, నీతండ్రి నిన్ను ఇచ్చినచోటకు కూడ నేను అనుసరించి వస్తాను.' అపుడు దేవయాని ఇలా అంది – 'నేను స్తుతించేవానికి, యాచించేవానికి, ప్రతిగ్రహించేవానికి కూతురిని, స్తుతింపబడే వాని కూతురువైన నీవు నాకు దాసీ ఎట్లా అవుతావు?' శర్మిష్ఠ ఇలా అంది – 'ఏదోవిధంగా ఆర్తులైన జ్ఞాతులకు సుఖాన్ని కలిగించాలి. అందువల్ల నీదాసిగా వచ్చాను. నీతండ్రి నిన్ను ఎక్కడిస్తే అక్కడకు కూడ నిన్ను అనుసరించి వస్తాను.' వృషపర్వుని కూతురు శర్మిష్ఠ దాసిగా ఉంటానని

మాటిచ్చిన తర్వాత దేవయాని తండ్రితో ఇలా అంది. 'నాయనా! బ్రాహ్మణోత్తమా! వృషపర్వుని పురాన్ని ప్రవేశిస్తాను. నీవిజ్ఞానం అమోఘమైంది. నీకు విద్యాబలం ఉంది.' కూతురు అలా చెప్పగానే శుక్రుడు ఆనందించి పురంలో ప్రవేశించాడు. దానవులంతా అతనిని గౌరవించారు.

81. యయాతి దేవయానిని వివాహమాడుట.

చాలాకాలం తర్వాత దేవయాని ఆ వనానికి క్రీడార్థం వెళ్ళింది. దాసీ సహస్రంతో, శర్మిష్ఠతో పాటు వనంలో (ఇంతకు ముందు నూతిలో పడిన) ఆ ప్రదేశానికి దేవయాని వెళ్ళింది. స్వేచ్ఛగా సంచరించింది. చెలులతో బాటు అందరూ ఆనందంతో ఆటలాడుతున్నారు. ప్రీతితో మధుమాసంలో తేనె త్రాగుతున్నారు. ఎన్నో విధాల భక్ష్యాలను, ఫలాలను తింటున్నారు. ఆ సమయంలో మళ్ళీ నహుషుని కుమారుడైన యయాతి మృగాలను వేటాడుతూ దాహంతో అలసటతో కృశించి అనుకోకుండా వారున్న ప్రదేశానికి వచ్చాడు. దేవయానిని, శర్మిష్ఠను, ఆ స్త్రీలనూ అతడు చూశాడు. మధువును త్రాగుతూ, ఆడుతూ, దివ్యమైన ఆభరణాలతో అలంకరింపబడిన వారినందరినీ చూశాడు. దివ్యమైన ఆభరణాలతో అలంకరింపబడిన ఒక ఆసనంమీద కూర్చుని చిరునవ్వు నవ్వుతున్న దేవయానిని చూశాడు. సాటిలేని రూపంతో, స్త్రీల మధ్యలో శర్మిష్ఠచేత పాద సంవాహనం చేయించుకొంటున్న శ్రేష్ఠమైనస్త్రీని చూశాడు.

యయాతి :- రెండువేల కన్యలతో కలిసి మీరిద్దరు కన్యలు ఉన్నారు. మీ వంశాలేవి? పేర్లు ఏమిటి? చెప్పండి.

దేవయాని :- నరాధిపా! నేను చెప్తాను, నామాటను గ్రహించు. రాక్షసులకు గురువు శుక్రాచార్యుడు, అతని కూతురిని నేను. ఈమె దానవేంద్రుడు వృషపర్వుని కూతురు శర్మిష్ఠ. నాకు సఖి, దాసి. నేనెక్కడకు వెళితే అక్కడకు వస్తుంది.

యయాతి :- సుందరీ! ఈ కన్య నీకు సఖి, దాసి ఎలా అయింది? ఈమె రాక్షసరాజకూతురు కదా! నాకు తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది.

దేవయాని :- నరశ్రేష్ఠా! ఈ లోకంలో అన్నీ విధి ననుసరించి జరుగుతాయి. విధి విహితమని గ్రహించు. ఆశ్చర్యకరాలైన సంఘటనలను గురించి ప్రశ్నించవద్దు. ఈ నీ రూపం, వేషం, రాజువలె ఉన్నాయి. మాటమాత్రం బ్రాహ్మణుని మాటలా ఉంది. నీవెవరు? ఎక్కడ నుండి వచ్చావు. ఎవరి కుమారుడివి? నాకు చెప్పు.

యయాతి :- బ్రహ్మచర్యంతో నేను సంపూర్ణమైన వేదాన్ని అధ్యయనం చేశాను. నేను రాజును. రాజకుమారుడిని. యయాతి అని ప్రసిద్ధికెక్కాను.

దేవయాని :- రాజా! నీవు ఏ పనిమీద ఈ ప్రదేశానికి వచ్చావు ? పద్మగంధాన్ని ఆస్వాదించడం కోసం ఇక్కడకు వచ్చావా? లేక మృగాన్ని వెంటాడుతూ ఇలా వచ్చావా?

యయాతి :- కళ్యాణీ! మృగాన్ని వెంటాడుతూ నేను నీటికోసం ఇక్కడకు వచ్చాను. మిక్కిలి అలసి ఉన్నాను. అందువల్ల ఇంక నేను వెళ్ళడానికి అనుమతించు.

దేవయాని :- రెండు వేల దాసీలతో ఉన్న దాసియైన శర్మిష్ఠతోపాటుగా నీకు అధీనురాలి నవుతున్నాను. నాకు సఖుడవు. భర్తవు కమ్ము. నీకు శుభమగుగాక.

యయాతి :- దేవయానీ! నీకు శుభమగుగాక. భావినీ! నిన్ను వివాహమాడటానికి నేను తగినవాడను కాను. నీ తండ్రితో క్షత్రియులు వివాహసంబంధానికి యోగ్యులు కారు కదా!

దేవయాని :- యయాతీ! బ్రాహ్మణులతో క్షత్రియులు, క్షత్రియులతో బ్రాహ్మణులు మునుపే కలిశారు. నీవు రాజర్షివి, రాజర్షిపుత్రుడవు కూడా. నన్ను వివాహమాడు.

యయాతి :- సుందరీ! ఈ బ్రాహ్మణాదివర్ణాలు నాలుగూ ఒకదేహం నుండి పుట్టినవే. కాని వేరు వేరు ధర్మాలు, వేరు వేరు శౌచాలు (ఆచార వ్యవహారాలు) వారికి ఉన్నాయి. వారిలో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు.

దేవయాని :- నహుషకుమారా! పాణిగ్రహణ మనే ధర్మం స్త్రీలకు ముఖ్యమైంది. మునుపు ఏ పురుషుడూ నన్ను స్వీకరించలేదు. ఇంతకుముందే నీవు నాపాణిని (చేతిని) గ్రహించావు. అందుకే నేను నిన్ను వరిస్తున్నాను. మనస్సు తన అధీనంలోగల నా చేతిని వేరొక పురుషుడు ఎలా తాకగలడు? ఋషి పుత్రుడవో, స్వయంగా ఋషివో అయిన నీవు నాచేతిని పట్టుకొన్న తర్వాత, వేరొకడు ఎలా పట్టుకొంటాడు?

యయాతి :- కోపించిన విషసర్పం కంటె, మండుతున్న అగ్నికంటెకూడ విప్రుడు భయంకరమైన వాడని విజ్ఞుడైన పురుషుడు గ్రహించాలి.

దేవయాని :- పురుషోత్తమా! విషసర్పంకంటే, మండుతున్న అగ్నికంటే కూడా విప్రుడు భయంకరమైన వాడని ఎలా చెపుతున్నావు?

యయాతి :- సర్పం ఒక్కడినే చంపుతుంది. ఆయుధం చేత ఒకడే చంపబడతాడు. కాని కోపించిన విప్రుడు నగరాలను, రాష్ట్రాలను కూడ నాశనం చేయగలడు. అందువల్లనే విప్రుడు మిక్కిలి భయంకరమైన వాడు అని నా అభిప్రాయం. కళ్యాణీ! అందువల్ల నీతండ్రి ఇవ్వకుండా, నిన్ను నేను వివాహం చేసుకోలేను.

దేవయాని :- రాజా! అలాగయితే నా తండ్రి ఇచ్చాక నన్ను స్వీకరించు. నేను నిన్ను వరించాను. అడగకుండా, ఇతరులు ఇచ్చిన దాన్ని తీసికోనేవాడికి భయంలేదు.

(రాజా! ఒక ముహూర్తకాలం వేచి ఉండు. నేను తండ్రికి వర్తమానం పంపుతాను. ధాత్రీ! నీవు వెళ్ళు. బ్రహ్మకల్పుడైన నా తండ్రిని ఇక్కడకు తీసికొనిరా. నహుషకుమారుని స్వయంవరంలో వరించానని చెప్పు.)

అలా దేవయాని తొందరగా తన తండ్రి దగ్గరకు సందేశాన్ని పంపింది. ధాత్రి ఉన్నదున్నట్లుగా అతడకి అంతా నివేదించింది. వినగానే భార్గవుడు వచ్చి రాజును చూశాడు. శుక్రాచార్యుడు రావడం చూసిన వెంటనే యయాతి శుక్రునికి నమస్కరించాడు. కవికుమారుడు, బ్రహ్మతేజస్వి అయిన శుక్రునికి చేతులు జోడించి నమస్కరిస్తూ నిలిచాడు.

దేవయాని :- తండ్రీ! ఇతడు రాజు. నహుషుని కుమారుడు. అరణ్యంలో నాపాణిని గ్రహించాడు. నీకు నమస్కారం. నన్ను ఇతనికియ్యి. లోకంలో మరెవ్వరినీ పతిగా వరించను.

శుక్రుడు :- వీరా! నాకు ఇష్టురాలయిన నాకూతురు నిన్ను పతిగా వరించింది. నేనీమెను నీకు దానం చేస్తున్నాను. నీవీమెను పట్టమహిషిగా స్వీకరించు.

యయాతి :- భార్గవా! ఈమెను స్వీకరించిన పిదప వర్ణసాంకర్యం వల్ల వచ్చే మహాపాపం నన్ను తాకకూడదు. అలా అనుగ్రహింపగోరుతున్నాను.

శుక్రుడు :- నిన్ను అధర్మం నుండి విముక్తుని చేస్తున్నాను. నీకిష్టమైన వరాన్ని కోరుకో. ఈ వివాహ విషయంలో నీకు దుఃఖం కలుగదు. నీకు కలిగే పాపాన్ని నేను పోగొడతాను. సుందరియైన దేవయానిని ధర్మం ప్రకారంగా భార్యగా స్వీకరించు. ఈమెతో కలిసి అసాధారణమైన ఆనందాన్ని అనుభవించు. ఈవృషపర్వుని కూతురు శర్మిష్ఠ కూడ కన్యయే. రాజా! ఈమెను నీవు గౌరవించాలి. అంతేగాని (పక్క)శయనం మీదికి ఎప్పుడూ ఆహ్వానించకూడదు.

(ఈమెను రహస్యంగా పిలిచి మాట్లాడటం, తాకడం చేయకూడదు. నీకోరిక నెరవేరినంచి నీభార్యను నీవు వహించు. నీకు మంగళమవుతుంది.')

ఇలా చెప్పాక యయాతి శుక్రునికి ప్రదక్షిణం చేసి శాస్త్రోక్తప్రకారంగా వివాహం చేసుకొన్నాడు. శుక్రుని నుండి గొప్పధనాన్ని పొంది, రెండువేల కన్యకలతో నున్న శర్మిష్ఠతో పాటుగా దేవయానిని స్వీకరించాడు. రాక్షసులు, శుక్రాచార్యుడు అతనిని పూజించారు. అనంతరం ఆనందంతో ఆ మహారాజు శుక్రుని అనుమతి తీసికొని తన నగరానికి వెళ్ళాడు.

82. దేవయానికి పుత్రుడు జన్మించుట, యయాతి శర్మిష్ఠలు ఏకాంతముగ కలుసుకొనుట.

యయాతి మహేంద్రపురం (అమరావతి)లా వెలుగొందుతున్న తన పురానికి వెళ్లాడు. దేవయానిని అంతఃపురంలోనికి ప్రవేశపెట్టాడు. దేవయాని అనుమతితో వృషపర్వుని కూతురైన శర్మిష్ఠను అశోకవనానికి దగ్గరలో ఇంటిని నిర్మించి, అందులో ఉంచాడు. దాసీ సహస్రంతో ఉన్న వృషపర్వుని కూతురయిన శర్మిష్ఠకు వస్త్రాలు అన్నపానాలు ఇచ్చి గౌరవించాడు.

(దేవయాని శర్మిష్ఠతోబాటు మనోహరమైన అశోకవనంలో ఆటలాడి, ఆమె నక్కడే వదిలిపెట్టి, రాజుతోపాటు ఇంటికి వెళ్లింది. ఇలా ప్రీతితో చాలాకాలం ఆనందించింది.)

యయాతి, దేవయానితో కలిసి అనేకసంవత్సరాలు దేవతలవలె ఆనందంతో సుఖంగా విహరించాడు. ఋతుకాలం ప్రాప్తించి సుందరి దేవయాని గర్భం దాల్చింది. మొదట కుమారుని కన్నది. వేయి సంవత్సరాలు గడవగా వృషపర్వుని కూతురు శర్మిష్ఠ యౌవనం పొందింది. ఋతుకాలం వచ్చి ఆమె ఇలా ఆలోచించింది.

(శర్మిష్ఠ స్నానం చేసి, పరిశుభ్రంగా, ఆభరణాలన్నీ అలంకరించుకొని వికసించిన పూల గుత్తులతో ఉన్న అశోక వృక్షం కొమ్మను పట్టుకొని, తనముఖాన్ని అద్దంలో చూసికొంది, భర్తదర్శనం మీదకోరిక గలదై శోకమోహాలు ఆవేశించి, అశోక వృక్షంతో ఇలా పలికింది – 'అశోకా! దుఃఖించే దెబ్బతిన్న మనస్సుగలవారి శోకాన్ని తొలగించేదానా! ప్రియుని చూడటం ద్వారా నన్ను నీపేరు గలదిగా (అశోక) వేగంగా చెయ్యి. ఇలా అని శర్మిష్ఠ మరల ఇలా అనుకుంది.)

ఋతుకాలం ప్రాప్తమయింది. నాకు వరింపబడిన భర్తలేడు. నాకిపుడేమయింది? నేనేం చేయాలి? ఏం చేస్తే మంచిపని చేసినట్లు అవుతుంది? ఈ దేవయాని సంతానవతి అయింది. యౌవనం పొందిన నేను వృధాగా ఉన్నాను. ఆమె భర్తను వరించినట్లుగానే నేనుకూడ అతనినే భర్తగా వరిస్తాను. రాజు నాకు పుత్రఫలాన్ని ఇవ్వాలి అని నా నిశ్చితాభిప్రాయం. ధర్మాత్ముడైన ఆ రాజు ఇపుడు ఏకాంతంలో నాకు దర్శనం ఇస్తాడా?' అనంతరం ఆ సమయంలో బయటకు వచ్చిన రాజు అశోకవన సమీపంలో శర్మిష్ఠను చూసి నిలుచుండిపోయాడు. అందమైన చిరునవ్వుగల శర్మిష్ఠ ఏకాంతంగా, ఒంటరిగా ఉన్న అతనిని చూసి సమీపించి చేతులు జోడించి రాజుతో ఇలా అంది. 'నహుషపుత్రా! రాజా! చంద్రుడు, ఇంద్రుడు, విష్ణువు, యముడు, వరుణుడు, నీతో సమానులు. మీఇంటిలో ఉన్న స్త్రీని ఎవడూ చూడలేడు. నరాధిపా, నారూపం, వంశం, నడవడి ఎల్లప్పుడూ నీవెరుగుదువు. అటువంటి నేను నిన్ను యాచిస్తున్నాను. నన్ను అనుగ్రహించి నా ఋతుకాలం సార్థకం చెయ్యి.' అపుడు యయాతి ఇలా అన్నాడు 'శీలసంపద వలన ప్రశంసింపదగిన

దైత్యకన్యవని నిన్ను నేను ఎరుగుదును. నీరూపంలో సూదిమొనయంత కూడా దోషం లేదు.'

శుక్రుడు నేను దేవయానిని వివాహం చేసుకొన్నప్పుడు, నీ గురించి "ఈమెను శయనానికి నీవు ఆహ్వానింపకూడదు" అని చెప్పాడు.

శర్మిష్ఠ పరిహాసంగా మాట్లాడింది అసత్యమైనా అది హానికరం కాదు. రాజా! అలాగే స్త్రీల విషయంలో, వివాహసమయంలో, ప్రాణాపాయసమయంలో, సర్వస్వం కోల్పోయేటపుడు– ఈ ఐదు సమయాల్లోను అసత్యాలు పాపాన్ని కలిగించవు. నరేంద్రా! నిర్దోషిని రక్షించవలసినపుడు సాక్ష్యం అడిగితే అసత్యం చెప్పినవానిని పతితుడని చెప్పడం యుక్తం కాదు. కాని తన ప్రాణమో, ఇతరుని ప్రాణమో ఒక్కదానినే రక్షించవలసినపుడు తనప్రాణంకోసం అసత్యం చెప్పినవానిని ఆ అసత్యం హింసిస్తుంది.

యయాతి ప్రాణులన్నింటికి (ప్రజలందరికి) రాజే ప్రమాణం, అతడు అసత్యం పలికితే నశిస్తాడు. కార్యసంకటం ఏర్పడినాసరే నేను అసత్యమాడటానికి ఇష్టపడను.

శర్మిష్ఠ ఇలా అంది – 'రాజా! తన భర్త, తన సఖురాలి భర్త ఇద్దరూ సమానులే. అలాగే వివాహం కూడా సమానమైందే. నా సఖి నిన్ను భర్తగా వరించింది. కాబట్టి నాకు కూడా నీవే పతివి.'

(మహర్షి శుక్రాచార్యుడు దేవయానితోపాటుగా నన్ను కూడ నీకిచ్చాడు. గౌరవింపదగింది, పోషింపదగింది అని చెప్పాడు. ఆ మాట నీవు అబద్ధం చేయతగదు. బంగారం, మణులు, రత్నాలు, వస్త్రాలు, ఆభరణాలు, గోవులు, భూములు అడిగిన వాళ్ళకు ఇస్తున్నావు. అది బాహ్యమైన దానం. శరీరాశ్రితమైంది కాదు. పుత్రదానం, ఆత్మదానం, దుష్కరములైనవి. నహుషకుమారా! శరీరదానంకంటె పైన చెప్పినవన్నీ గొప్పవే. ఎవరెవరికి ఏవీ కోరిక ఉంటే వారివారికి ఆ కోరికను తీరుస్తానని నీవు నగరంలో త్రికాలాలలోను చాటింపు వేయిస్తావు. అది అసత్యమూ, వ్యర్థమూ అవుతుంది. ఆ మాటను నిజం చెయ్యి. నీవు కుబేరుని వంటివాడవు. అతనివలె నీవు ఆ మాటను నిజం చెయ్యి.)

యయాతి – 'యాచించినవాళ్ళకు దానం చెయ్యాలని నేను స్వీకరించిన వ్రతం. నీవు కూడ స్వేచ్ఛగా నన్ను యాచిస్తున్నావు. చెప్పు. నేను నీకేం చేయగలను.'

శర్మిష్ఠ – 'రాజా! నన్ను అధర్మం నుండి రక్షించు. ధర్మాన్ని ఆచరించు. నీవల్ల సంతానవతినై నేను లోకంలో ఉత్తమమైన ధర్మాన్ని ఆచరిస్తాను. రాజా! భార్య, దాసుడు, పుత్రుడు – వీరు ముగ్గురూ ధనంపై అధికారంలేనివాళ్ళు. వారు పొందిన ధనం, వారు ఎవరికి అధీనంలో ఉంటే వారిదే. నేను దేవయానికి దాసీని, దేవయాని నీకు (వశురాలు) అధీనురాలు. రాజా! అందువల్ల ఆమె, నేనూ కూడ నీకు పొందదగినవారమే. నన్ను (పొందు) సేవించు.'

శర్మిష్ఠ ఇలా చెప్పగానే రాజు అది నిజమే అని అంగీకరించాడు. శర్మిష్ఠను గౌరవించాడు. ధర్మాన్ని నిర్వహించాడు. అతడు శర్మిష్ఠను సమీపించి, తనకోరికకు తగినట్లుగ పొందాడు. వారొకరినొకరు గౌరవించుకున్నారు. అనంతరం వారిరువురు (వారివారి నివాసాలకు) వారు వచ్చిన చోటుకి వెళ్ళారు. ఆ యయాతితో సమాగమం పొందాక శర్మిష్ఠ, ఆ రాజశ్రేష్ఠుని వల్ల మొదటి గర్భాన్ని తాల్చింది. రాజా! తరువాతి కాలంలో ఆ శర్మిష్ఠ దివ్య తేజస్సు, పద్మాలవంటి కన్నులు గల పుత్రుని కన్నది.

83. శుక్రాచార్యుడు యయాతిని వృద్ధుడవు కమ్మని శపించుట.

స్వచ్ఛమైన చిరునవ్వుగల దేవయాని శర్మిష్ఠకు కొడుకుపుట్టాడని విని, విచారించింది. శర్మిష్ఠ దగ్గరకు వెళ్ళి దేవయాని ఇలా అంది. శర్మిష్ఠా! కామవ్యామోహంతో ఎటువంటి పాపం చేశావు?

శర్మిష్ఠ – 'ధర్మాత్ముడు, వేదపారగుడూ అయిన ఒకానొక ఋషి అభ్యాగతునిగ వచ్చాడు. వరదుడైన అతనిని ధర్మసమ్మతమైన కోరికను కోరాను.'

నేను న్యాయసమ్మతం కాని కామాన్ని ఆచరించను. ఆ ఋషి వల్ల నేను సంతానాన్ని పొందాను. నీకు నిజం చెపుతున్నాను.

దేవయాని – బాగుంది. అలాగయితే ఆ ద్విజుడెవరో తెలుసునా? ఆ ద్విజుని వంశం, నామం, దేశాలను గురించి తెలుసుకోవాలి.

శర్మిష్ఠ – తపస్సుచేత, తేజస్సుచేత సూర్యునిలా ప్రకాశిస్తున్న అతనిని చూసిన నాకు అడగటానికి శక్తి లేకపోయింది.

దేవయాని – శర్మిష్ఠా! పెద్దవాడు, శ్రేష్ఠుడూ అయిన ద్విజునివల్ల నీవు సంతానాన్ని పొందినట్లయితే నాకు కోపంలేదు.

వారొకరితో ఒకరు ఇలా మాట్లాడుకొని, పరస్పరం నవ్వుకొన్నారు. దేవయాని శర్మిష్ఠ చెప్పింది నిజమని భావించి తన నివాసానికి వెళ్ళింది.

యయాతి దేవయానియందు ఇంద్రవిష్ణువులవంటి యదువు, తుర్వసువు అను ఇద్దరు పుత్రులను కన్నాడు. ఆ రాజర్షి యయాతి వల్లనే వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ద్రుహ్యుడు, అనుడు, పూరుడు అను ముగ్గురు పుత్రుల్ని కన్నది. రాజా! తరువాత ఒకానొక సమయంలో దేవయాని యయాతితోపాటుగా ఏకాంతంగా వనానికి వెళ్ళింది. అక్కడ దేవరూపంలో ఉన్న కుమారులను చూసింది. వారు స్వేచ్ఛగా ఆడుకొంటున్నారు. దేవయాని ఆశ్చర్యపోయి ఇలా పలికింది.

దేవయాని ఇలా అంది – రాజా! దేవపుత్రులవలె శుభలక్షణాలున్న ఈ పిల్లలు

ఎవరు ? తేజస్సుచేత, రూపంచేత వీరు నీతో పోలి ఉన్నారు. అని తర్వాత ఆ బాలురను అడిగింది. 'బాలకులారా! మీపేరేమిటి? మీవంశమేమిటి? మీ తండ్రి ఎవరు? యథార్థం చెప్పండి. వినాలనుకొంటున్నాను.' వెంటనే ఆ బాలురు చూపుడు వేలుతో రాజును చూపించారు. తల్లి శర్మిష్ఠ అని ఆ పిల్లలు చెప్పారు. ఆలా చెప్పి వారంతా కలిసి రాజు దగ్గరికి వచ్చారు. దేవయాని దగ్గరుండటంచేత రాజు ఆ పిల్లలను చేరదీయలేదు. వారు ఏడుస్తూ తమ తల్లి శర్మిష్ఠదగ్గరకు వెళ్ళారు. ఆ బాలురమాటలు విని యయాతి సిగ్గుపడ్డాడు. ఆ బాలురకు రాజపట్ల ఉన్న ప్రేమను చూసి, యథార్థాన్ని గ్రహించిన దేవయాని శర్మిష్ఠతో ఇలా అంది.

(ఒకానొక ఋషి అభ్యాగతునిగా వచ్చాడు అని నాకు చెప్పావు. నీవే యయాతిని ప్రోత్సాహించావు. ఇది తథ్యం. ఇంతకుమునుపే నీతో చెప్పాను, నీవు పాపం చేశావు.)

నా అధీనంలో ఉండి నాకు అనిష్టమైన పని చేశావు. నీవు అసురధర్మాన్నే ఆచరించావు. నాకు నీవు భయపడటంలేదు.' శర్మిష్ఠ ఇలా అంది - నేను ఋషి అని చెప్పినమాట నిజం. న్యాయంగా, ధర్మంగా నడచుకొంటున్న నేను నీకు భయపడను. నీవెప్పుడైతే భర్తను వరించావో, అపుడు నేనూ వరించినట్లే. కళ్యాణీ! సఖురాలిభర్త ధర్మంగా నాకూ భర్తే. నీవు నాకన్న పెద్దదానవు. గౌరవానికి, పూజకు తగిన బ్రాహ్మణివి నీవు. నీభర్త రాజర్షి నీకంటె నాకు మిక్కిలి పూజింపదగినవాడు. ఆ విషయం నీవెరుగవా?

(నీతండ్రి, నాగురువు అయిన శుక్రాచార్యుడు మనల్ని ఇద్దర్నీ ఇతని కిచ్చాడు. నీభర్త నాకు పూజ్యుడు. అతడు పోషింపదగిన నన్ను పోషిస్తున్నాడు.)

ఆమె మాటలు విన్న తర్వాత దేవయాని రాజుతో ఇలా అంది. 'రాజా! ఇంక ఇపుడు ఇక్కడ నేనుండలేను. నాకు ఇష్టంలేని పనిచేశావు.' అని పలికి దేవయాని వేగంగా లేచి తొందరగా శుక్రాచార్యుని దగ్గరకు బయలుదేరింది. కన్నీరు పెట్టుకొన్న ఆమెను చూసి రాజు బాధపడ్డాడు. కంగారుపడి రాజు సాంత్వన వచనాలు పలుకుతూ ఆమె వెనకాలే అనుసరించి వెళ్ళాడు. అయినా కోపంతో ఎర్రబడ్డకన్నులతో ఆ దేవయాని వెనకకు రాలేదు. నీరు నిండిన కన్నులతో ఆమె రాజుతో ఏమీ మాట్లాడకుండా, తొందరగా శుక్రాచార్యుని దగ్గరకు చేరింది. ఆమె తండ్రిని చూస్తూనే అతనికి నమస్కరించి ఎదురుగా నిలచింది. తరువాత యయాతి అక్కడకు చేరి శుక్రాచార్యుని పూజించాడు.

దేవయాని ఇలా అంది - 'అధర్మం ధర్మాన్ని జయించింది. క్రిందుమీదులుగ జరిగింది. నీచమైనది ఉన్నతికి, ఉన్నతమైనది నీచానికి వెళ్ళింది. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ నన్నతిక్రమించి ప్రవర్తించింది. ఈ యయాతిరాజు ఆమెయందు ముగ్గురు పుత్రుల్ని కన్నాడు. తండ్రీ! దౌర్భాగ్యవతినైన నాకు ఇద్దరు పుత్రులు. నేను నీకు నిజం చెపుతున్నాను.

ఈ రాజు ధర్మజ్ఞుడని ఖ్యాతి పొందాడు. కాని తన మర్యాదను అతిక్రమించాడు. అందువల్ల నీకు చెపుతున్నాను.' శుక్రుడిలా అన్నాడు - 'మహారాజా! ధర్మజ్ఞుడవు అయికూడా అధర్మాన్ని ప్రియంగా భావించి ఆచరించావు. అందువల్ల జయింపశక్యంగాని ముసలితనం శీఘ్రంగా నిన్ను పీడిస్తుంది.'

యయాతి ఇలా అన్నాడు - 'పూజ్యుడా! దానవరాజు కూతురు ఏకాగ్రమైన మనస్సుతో నన్ను ఋతుదానాన్ని యాచించింది. అది ధర్మసమ్మతమని నేను ఈ పని చేశాను. ఋతువును యాచించిన స్త్రీకి పురుషుడు ఋతుదానం చేయకుంటే భ్రూణహత్య చేసినట్లని వేదవేత్తలు చెపుతున్నారు. బ్రాహ్మణశ్రేష్ఠా! ఏకాంతంలో తన కోరికను యాచించిన, పొందదగిన స్త్రీని ఆ పురుషుడు పొందకపోతే అతడు భ్రూణహత్య చేసినట్లని ధర్మవిషయంలో పండితులు చెపుతున్నారు.

(ఎవరు ఏది అడిగితే అది ఇవ్వాలని నావ్రతం. ఆమెను కూడ నీవే ఇచ్చావు. ఆమె వేరొకరిని నాథునిగ ఇష్టపడలేదు. బ్రాహ్మణశ్రేష్ఠా! ఇదంతా ఆలోచించి ఇది ధర్మమని భావించి నేనీపని చేశాను. నన్ను క్షమించు.)

పైకారణాలను సమీక్షించి, అధర్మంవల్ల భయంతో శర్మిష్ఠను పొందాను.' శుక్రుడిలా అన్నాడు - పార్థివా! నీవు నా అధీనంలో ఉన్నావు. నీవు నాఆజ్ఞకోసం ప్రతీక్షించాలి. నహుషా! ధర్మవిషయంలో అసత్యమైన ఆచరణ చేసేవాడు దొంగతనం వల్ల కలిగే ఫలితాన్ని పొందుతాడు. కోపించిన శుక్రుడు అపుడు యయాతిని శపించాడు. అందువల్ల యయాతి తన యౌవనాన్ని విడిచి వెంటనే ముసలితనాన్ని పొందాడు.

యయాతి ఇలా అన్నాడు - 'భృగువంశశ్రేష్ఠా! యౌవనంలో దేవయానియందు నేనింకా తృప్తిని పొందలేదు. బ్రాహ్మణోత్తమా! నన్ను అనుగ్రహించు. ఈ ముసలితనం నాలో ప్రవేశించకుండా చెయ్యి.' శుక్రుడిలా అన్నాడు - 'నామాట అసత్యం కాదు. రాజా! నీవు ముసలితనాన్ని పొందుతున్నావు. కోరుకొన్నట్లయితే ఈ ముసలితనాన్ని నీవు వేరొకరిలో సంక్రమింపచేయవచ్చు.'

యయాతి ఇలా అన్నాడు - 'బ్రాహ్మణోత్తమా! నాకు తనవయస్సు నిచ్చిన పుత్రుడు రాజ్యాన్నీ, పుణ్యాన్నీ, కీర్తినీ పొందేవాడు కావాలి. నీవు అనుమతించ గోరుతున్నాను.' శుక్రుడిలా అన్నాడు - 'నహుషాత్మజా! నన్ను ధ్యానించడం ద్వారా నీవు స్వేచ్ఛగా ముసలితనాన్ని ఇతరులకు సంక్రమింపజేయగలవు. పాపం పొందవు. నీకు తన యౌవనం దానం చేసిన పుత్రుడు రాజ్యానికి రాజు అవుతాడు. ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు, బహుసంతానవంతుడు అవుతాడు.'

84. యయాతి పూరునికి తన ముసలితనమునిచ్చి, అతని యౌవనమును గ్రహించుట.

యయాతి ముసలితనాన్ని పొంది, తననగరానికి వెళ్ళి జ్యేష్ఠకుమారుడైన, యదువుతో ఇలా అన్నాడు. నాయనా! శుక్రుని శాపంవల్ల నాశరీరం ముడతలుపడి ముసలితనం వచ్చింది. కేశాలు తెల్లబడ్డాయి. కాని ఇంకా యౌవనంలో తృప్తిని పొందలేదు. యదూ! నీవు నా ముసలితనంతో పాటు దోషాన్ని కూడా తీసికో. నీ యౌవనంతో నేను విషయసుఖాలను అనుభవిస్తాను. వేయిసంవత్సరాలు గడిచాక మరల నీయౌవనం నీకిస్తాను. నా ముసలితనంతో పాటు నాదోషాన్ని కూడ నేను స్వీకరిస్తాను.' అపుడు యదువు ఇలా అన్నాడు 'ముసలితనంలో పానభోజనాలవల్ల ఏర్పడే చాలాదోషా లుంటాయి. రాజా! అందువల్ల నీ ముసలితనాన్ని నేను గ్రహించను. ఇది నా అభిప్రాయం. రాజా! ముసలితనంచేత జుట్టు తెల్లబడుతుంది. ఆనందం నశిస్తుంది. అవయవాలు పట్టుతప్పుతాయి. శరీరం ముడతలు పడుతుంది. దుర్భలుడయి, నీరసించి చూడశక్యం గాకుండా ఉంటాడు. పనులుచేయడంలో అశక్తుడౌతాడు. స్త్రీలచే తిరస్కరింపబడతాడు. తనపై ఆధారపడి జీవించేవారు కూడా వానిని తిరస్కరిస్తారు. అందువల్ల ముసలితనాన్ని నేను కోరుకోవడంలేదు. రాజా! నీకు నాకంటె మిక్కిలి ప్రియమైన పుత్రులు చాలామంది ఉన్నారు. ధర్మజ్ఞా! నీముసలితనాన్ని తీసికోవడానికి వేరొకరినెవరినైనా అడుగు.' అపుడు యయాతి ఇలా అన్నాడు- 'నాయనా! నా హృదయం నుండి పుట్టికూడా నీవయస్సును నాకివ్వటంలేదు. అందువల్ల నీపిల్లలు నారాజ్యం పొందడానికి అర్హులుకారు. కుమారా! తుర్వసూ! నాముసలితనంతో పాటు నా దోషాన్ని స్వీకరించు. నీయౌవనంతో నేను విషయసుఖాలను అనుభవిస్తాను. వేయిసంవత్సరాలు గడిచాక మరల నీ యౌవనాన్ని నీకిస్తాను. నాముసలితనాన్ని దోషాన్ని, నేను తీసుకొంటాను.' అపుడు తుర్వసుడు ఇలా అన్నాడు - నాయనా! కామభోగాలను నాశనం చేసి, బలాన్ని రూపాన్ని పాడుచేసి, బుద్ధిని, ప్రాణాన్ని నాశనం చేసే ముసలితనాన్ని నేనిష్టపడటం లేదు.

యయాతి ఇలా అన్నాడు - 'నాఔరసపుత్రుడవైన నీవు నీవయస్సును నాకివ్వడం లేదు. కాబట్టి తుర్వసూ! నీపిల్లలు నాశనం పొందుతారు. మూఢా! సంకీర్ణాలైన ఆచారధర్మాలతో వర్ణసాంకర్యం ఏర్పడిన ప్రతిలోమజాతుల వారికి, మాంసభక్షణ చేసే వారికీ, చండాలురకూ నీవు రాజు కాగలవు. గురుభార్యను పొందిన వారియందు, పశుపక్ష్యాదుల యందు, పశుధర్మం ఆచరించే పాపులయందు, మ్లేచ్ఛులయందు నీవు ఉండగలవు.' తుర్వసుని శపించి యయాతి శర్మిష్ఠకు కలిగిన తన కుమారుడు ద్రుహ్యునితో ఇలా అన్నాడు.

'ద్రుహ్యా! వర్ణరూపాలను నశింపజేసే నాముసలితనాన్ని వేయిసంవత్సరాలపాటు

నీవు స్వీకరించు. నీ యౌవనాన్ని నాకు ఇయ్యి: వేయిసంవత్సరాలు గడవగానే నీయౌవనాన్ని నీకు తిరిగి ఇస్తాను. నాముసలితనంతోపాటు దోషాన్ని కూడా స్వీకరిస్తాను.' ద్రుహ్యుడు ఇలా అడిగాడు – 'ముసలివాడు ఏనుగు, గుఱ్ఱం, రథం అధిరోహించలేడు. స్త్రీని భోగించలేడు. అతని మాటకూడా తడబడుతుంది. అటువంటి ముసలితనాన్ని నేనిష్టపడటం లేదు.'

యయాతి ఇలా అన్నాడు – 'నీవు నాఔరసపుత్రుడవై కూడా నీ యువవయస్సును నాకివ్వడం లేదు. అందువల్ల ద్రుహ్యా! నీకిష్టమైన కోరిక నీకెక్కడా లభించదు. ఉత్తమాలైన అశ్వాలు పూన్చదగిన రథాలు, అశ్వాలు, ఏనుగులు, సింహాసనాలు, లేనిచోట; గాడిదలు, దున్నలు, ఎద్దులు, పల్లకీలు లేనిచోట; నిత్యం నావపై తిరుగవలసి ఉన్నచోట నీవు నీవంశీయులతో పాటు ఉంటావు. నీవంశంలోనివారు రాజులు కాలేరు. 'భోజ' శబ్దంతో మీరు వ్యవహరింపబడతారు.'

యయాతి ఇలా అన్నాడు. – 'నాయనా అనూ! నీవు ముసలితనంతో పాటు నా యౌవనాన్ని స్వీకరించు. ఒకవేయి సంవత్సరాలు నీ యౌవనంతో నేను సంచరిస్తాను.' అపుడు అనువు ఇలా అన్నాడు 'ముసలివాడు శిశువులా అకాలంలో అన్నం తింటాడు. (అశుభ్రంగా) అశుచిగా ఉంటాడు. సకాలంలో అగ్నిహోత్రంలో హోమం చేయలేడు. అటువంటి ముసలితనాన్ని నేను ఇష్టపడటం లేదు.'

యయాతి ఇలా అన్నాడు – 'నీవు నా ఔరసపుత్రుడవై యుండి కూడ నీయువవయస్సును నాకివ్వటం లేదు. ముసలితనం యొక్క దోషాన్ని నీవు చెప్పావు. అందువల్ల నీవు ముసలితనంలోని దోషాలన్నింటిని పొందుతావు. నీ సంతానం యౌవనం పొందుతూనే నశిస్తుంది. నీవు కూడా ముసలితనంతో అగ్నిహోత్రానికి దూరం అవుతావు.'

యయాతి ఇలా అన్నాడు – 'పూరూ! నీవు నాకు ప్రియమైన పుత్రుడవు. నీవు శ్రేష్ఠుడవు కాగలవు. నాయనా! నాపై ముసలితనం వచ్చిపడింది. నా శరీరం ముడతలు పడింది. జుట్టు తెల్లబడింది. కావ్యుడైన శుక్రాచార్యుని శాపంవల్ల యౌవనంలో తృప్తినిపొందలేదు. పూరూ! ముసలితనంతో పాటు దోషాన్ని స్వీకరించు. నీయౌవనవయస్సుతో కొంతకాలం చరిస్తాను. వేయి సంవత్సరాలు గడిచాక మరల నీయౌవనం నీకిస్తాను. నా ముసలితనాన్ని దోషంతో పాటుగ స్వీకరిస్తాను. ఇలా అనగానే పూరుడు తండ్రికి ఇలా బదులిచ్చాడు. – 'నీవు నాకు చెప్పిన విధంగా నీమాటను ఆచరిస్తాను.

(మానవులకు పెద్దవారి మాట పవిత్రమైనది. స్వర్గాన్నిస్తుంది. ఆయుష్కరం కూడా. గురువు అనుగ్రహం వల్లనే ఇంద్రుడు ముల్లోకాలను శాసించాడు. పెద్దల అనుమతి పొంది అన్ని కోరికలను పొందాలి.)

రాజా! నీ ముసలితనాన్ని దోషంతోపాటు స్వీకరిస్తాను. నానుండి యౌవనాన్ని

స్వీకరించు. నీవు కోరుకొన్న విధంగా కోరికలను అనుభవించు. నేను నీ యొక్క ముసలితనంతో కప్పబడి నీవయోరూపాలను ధరిస్తాను. నా యౌవనాన్ని నీకిచ్చి నీవు నాకు చెప్పినట్లుగా సంచరిస్తాను.'

యయాతి ఇలా అన్నాడు – 'వత్సా! పూరూ! నీమాటలకు నేను తృప్తి చెందాను. ఆనందించి నీకిది ఇస్తున్నాను. సర్వకామ సమృద్ధమైన రాజ్యాధికారంలో నీ పిల్లలు ఉంటారు.' మహాతపస్వి యయాతి ఈ విధంగా పలికి శుక్రాచార్యుని స్మరించి, ముసలితనాన్ని మహాత్ముడైన పూరునిలో సంక్రమింపజేశాడు.

85. యయాతి పూరునకు రాజ్యాభిషేకము చేసి వనమున కేగుట.

నహుషుని కుమారుడైన యయాతి పూరుని వయస్సుతో ఆనందించి తనకిష్టాలైన విషయసుఖాలను అనుభవించాడు. అతడు కోరిక ననుసరించి, ఉత్సాహాన్ని బట్టి, కాలోచితమైనట్లు, సుఖంగా ధర్మవిరుద్ధంకానట్లు, యోగ్యత ననుసరించి ప్రవర్తించాడు. దేవతలను యజ్ఞాలచేత, పితృదేవతలను శ్రాద్ధాలచేత, దీనులకు ఇష్టమైనవి ఇచ్చి, బ్రాహ్మణోత్తములకు వారి కోరికలు తీర్చి, తృప్తిపరచాడు. అతిథులను అన్నపానాలతోను, వైశ్యులను రక్షణలతోను, శూద్రులను దయతో, దొంగలను బంధించి, ప్రజలను ధర్మంచేత అందరిని తగినవిధంగా రంజింపజేస్తూ సాక్షాత్తు ఇంద్రునివలె యయాతి పాలించాడు. సింహంవంటి పరాక్రమంగల యువకుడైన ఆ రాజు విషయసుఖాలన్నీ అందుబాటులో ఉన్నా, ధర్మవిరోధం లేకుండా ఉత్తమసుఖాన్ని అనుభవించాడు. శుభాలైన కోరికలను అనుభవించి, తృప్తి చెంది, గడిచిన వేయిసంవత్సరాలను స్మరించి ఆ మహారాజు ఖిన్నుడయ్యాడు. కాలజ్ఞుడైన యయాతి కళలు, కాష్ఠలు లెక్కించి, యౌవనంపొంది వేయి సంవత్సరాలను విశ్వాచి అనే అప్సరతో నందనవనంలో ఆనందించాడు. అతడు అలకానగరంలో, ఉత్తరదిక్కులో ఉన్న మేరుశిఖరంపైన ఇచ్ఛానుసారంగా విహరించాడు. ధర్మాత్ముడైన ఆ రాజు కాలంమీద దృష్టిపెట్టి, తన సమయం పూర్తయిందని భావించి, కుమారుడైన పూరునితో ఇలా అన్నాడు. 'పుత్రా! కోరికల ననుసరించి ఉత్సాహమున్నంతవరకు,తగినసమయంలో విషయసుఖాలను నీ యౌవనంతో నేను అనుభవించాను. కోరికలను అనుభవించినంతమాత్రాన కోరిక శాంతింపదు. హవిస్సుచేత అగ్నిహోత్రం వృద్ధిచెందుతుంది. అలాగే కోరికల అనుభవంచేత కోరిక పెరుగుతూనే ఉంటుంది.* ఈ భూమిపై ఉన్న ధాన్యాలు, బంగారం, పశువులు, స్త్రీలు అన్నీ స్వీకరించినా

* న జాతు కామః కామానామ్ ఉపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ 12

అవి ఒక్కనికి చాలవు. అందువల్ల ముందు కోరికను విడిచిపెట్టాలి. తృష్ణను చెడు బుద్ధిగలవారు త్యజింపలేరు. జీర్ణమైపోతున్న (ముసలి) వానిలో కూడ అది నశింపదు. ఇది ప్రాణాంతకమైన రోగం. అందువల్ల తృష్ణను విడిచిపెట్టాలి. విషయాలపట్ల లగ్నమైన మనసుతో నాకు వేయి సంవత్సరాలు గడిచాయి. అయినా నిత్యమూ నాకు ఈ విషయసుఖాలయందు కోరిక కలుగుతూనే ఉంది. అందువల్ల నేను ఈ తృష్ణను విడిచి, మనస్సును బ్రహ్మమందు నిలిపి, సుఖదుఃఖాది ద్వంద్వరహితుడనై మమకారంలేకుండా, మృగాలతోపాటు సంచరిస్తాను. పూరూ! సంతోషించాను. నీకు శుభమగుగాక! నీ యౌవనాన్ని నీవు గ్రహించు. ఈ రాజ్యాన్ని కూడ స్వీకరించు. నీవే నాకు ప్రియాన్ని చేసిన కొడుకువు.' అని యయాతి తన ముసలితనాన్ని తాను తీసికొన్నాడు. పూరుడు తన యౌవనాన్ని తాను తీసికొన్నాడు. చిన్న కొడుకైన పూరుని రాజ్యాభిషిక్తుని చేయా లనుకొంటున్న యయాతి దగ్గరకు బ్రాహ్మణాదిప్రముఖులు వచ్చి ఇలా అన్నారు. 'శుక్రుని మనుమని, దేవయాని కుమారుడైన జ్యేష్ఠుని యదుని విడిచిపెట్టి పూరునకు రాజ్యం ఎలా ఇస్తావు? నీ జ్యేష్ఠ కుమారుడు యదువు. అతని తరువాత తుర్వసువు, శర్మిష్ఠకుమారులు ద్రుహ్యువు, అనువు, పూరువు జన్మించారు. (పూరుడు అందరికంటె చిన్నవాడు.) పెద్దవాళ్లను విడిచిపెట్టి చిన్నవాడు రాజ్యానికి ఎలా అర్హుడౌతాడు? ఈ విషయాన్ని నీకు గుర్తుచేస్తున్నాం. నీవు ధర్మాన్ని పాటించవలసింది.'

యయాతి ఇలా అన్నాడు - బ్రాహ్మణాదులైన అన్నివర్ణాల వారూ నామాటను వినండి. ఏవిధంగానైనా సరే, ఈ రాజ్యం నా జ్యేష్ఠకుమారునికి ఇవ్వదగింది కాదు. నా జ్యేష్ఠకుమారుడు యదువు నా ఆజ్ఞను పాటించలేదు. తండ్రికి ప్రతికూలంగా ఉండేవాడు కొడుకే కాదు అని సత్పురుషుల అభిప్రాయం. **తల్లిదండ్రుల మాటను ఆచరించేవాడు, హితుడు, అనుకూలంగా ఉండేవాడు, తల్లిదండ్రుల విషయంలో కొడుకులా ప్రవర్తించేవాడే నిజమైన పుత్రుడు.**

('పుత్' అని ఒక నరకానికి పేరు. ఆ నరకం దుఃఖరూపమైంది. 'పుత్' అనే నరకం నుండి రక్షించటం వలన పుత్రుడని అంటారు. అందుకే ఇహపరాలకోసం పుత్రుని కోరుకొంటారు. పితరులను, దేవతలను, ఋషులను పూజించడంలో తనతో సమానమైన వాడు ఎక్కువ మందికి ఉపకారం చేసేవాడే జ్యేష్ఠపుత్రు డౌతాడు. గుణవంతుడైన లేదా ఉపకారి అయిన పుత్రుడే ఇహపరాలలో జ్యేష్ఠాంశాన్ని పొందుతాడు. గుణాలతో ఉన్న పుత్రుడే శ్రేయస్కారకుడు. అతడే పుత్రుడు. ఇతరులు కాదు. గుణహీనుడైన పుత్రుడు వ్యర్థుడు. ధర్మజ్ఞులైన వారు పుత్రులకారణంగానే పితరులకు ధర్మాన్ని చెపుతున్నారు.)

యదువు, తుర్వసువు, ద్రుహ్యువు, అనువు - వీరంతా నామాటను తిరస్కరించారు.

నన్ను చాలా అవమానించారు. పూరుడు నామాటను ఆచరించాడు. ప్రత్యేకించి నామాటను గౌరవించాడు. అతడు నా చిన్నకొడుకు. అయినా అతడు నా ముసలితనాన్ని స్వీకరించాడు. స్నేహితుని రూపంతో ఉన్న నాకుమారుడు పూరుడు నాకోరికను మన్నించాడు. నామాటను అనుసరించినవాడే ఈ రాజ్యానికి రాజౌతాడని శుక్రుడు స్వయంగా వరాన్నిచ్చాడు. కాబట్టి మిమ్మల్ని అనునయిస్తున్నాను. పూరుని రాజ్యంలో అభిషేకిద్దా' అనగానే పౌరులిలా అన్నారు- 'గుణసంపన్నుడు, తల్లిదండ్రులకు హితం కూర్చేవాడు, మంచి పుత్రుడు చిన్నవాడైనా సమస్త శుభాలకూ యోగ్యు డవుతాడు. నీకు ప్రియాన్ని ఆచరించిన నీకుమారుడు పూరుడు ఈ రాజ్యాధికారం పొందటానికి అర్హుడు. శుక్రుడు వరం ఇవ్వడంచేత దానికి విరుద్ధంగా మాట్లాడటం కూడా యుక్తంకాదు.' పౌరజానపదులు సంతుష్టులై చెప్పిన తరువాత రాజు తనకుమారుడైన పూరుని తన రాజ్యానికి అభిషిక్తుని చేశాడు. పూరునికి రాజ్యమిచ్చిన తర్వాత యయాతి వనవాసానికి దీక్షితుడై బ్రాహ్మణులతో, తాపసులతోకూడి నగరం నుండి బయటకు వెళ్ళాడు. యదువునకు యాదవులు జన్మించారు. తుర్వసువు వల్ల యవనులు జన్మించారు. ద్రుహ్యునికి జన్మించిన పుత్రులను భోజులని, అనువుకు జన్మించిన వారిని మ్లేచ్ఛజాతులని అంటారు. రాజా! పూరుని వల్ల పౌరవవంశం ఏర్పడింది. ఆ వంశంలోనే నీవు జన్మించావు. ఇంద్రియనిగ్రహంతో నీవు వేయి సంవత్సరాలు ఈ రాజ్యం చేయడానికి అర్హుడవు.

86. యయాతి స్వర్గమును పొందుట.

యయాతి తన ప్రియపుత్రుని పూరుని రాజ్యంలో అభిషిక్తుని చేసి, ఆనందంతో వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. కఠోరనియమాలు పాటిస్తూ బ్రాహ్మణులతో పాటు అరణ్యంలో ఫలమూలాలను మాత్రమే భుజిస్తూ, ఉండి కొంతకాలం తర్వాత స్వర్గానికి వెళ్ళాడు.

యయాతి అక్కడ ఆనందంగా, సుఖంగా చాలాకాలం నివసించాడు. తరువాత మళ్ళీ ఇంద్రుడు అతనిని క్రిందికు త్రోసివేశాడు. స్వర్గం నుండి క్రిందికి పడుతూ అతడు నేలమీద పడకుండా అంతరిక్షంలోనే ఉండిపోయాడు అక్కడ నుండే మళ్ళీ అతడు స్వర్గానికి వెళ్లాడు. వసుమంతుడు, అష్టకుడు, ప్రతర్దనుడు, శిబి అనేవారితో కలిసి మళ్ళీ ఇంద్రుని సభలోకి ప్రవేశించాడు. జనమేజయుడిలా అడిగాడు - 'ఆ యయాతి రాజు ఏపనిచేసి మళ్ళీ స్వర్గానికి వెళ్ళాడు?

నహుషుని కొడుకు యయాతిమహారాజు తన కనిష్ఠ కుమారుని పూరుని రాజ్యంలో అభిషేకించి, ఆనందించి వానప్రస్థానికి వెళ్ళాడు. యదువు మొదలయిన తక్కిన కొడుకులను రాజ్యం సరిహద్దులలో ఉంచాడు. ఫలమూలాలు భుజిస్తూ యయాతి వనంలో చాలాకాలం

ఉన్నాడు. మనోనిగ్రహంతో, క్రోధాన్ని జయించి పితృదేవతలకు తర్పణాలిస్తూ, వానప్రస్థ విధానంలో అగ్నిహోత్రంలో హోమం చేస్తూ నివసిస్తున్నాడు. వనంలో దొరికిన హవిస్సుతో(పదార్థాలతో) రాజు అతిథులను పూజించేవాడు. శిల, ఉంఛ అను పద్ధతుల ద్వారా లభించిన ఆహారాన్ని అతిథులకు పెట్టి మిగిలినదాన్ని భుజించేవాడు. ఇలా వేయిసంవత్సరాలు జీవించాడు. నీటిని మాత్రమే స్వీకరిస్తూ, వాక్కునూ, మనస్సునూ నిగ్రహించి ముప్పది సంవత్సరాలు (శరత్తులు) గడిపాడు. అనంతరం వాయుభక్షణచేస్తూ అలసట లేకుండా సంవత్సరకాలం గడిపాడు. అదేవిధంగా పంచాగ్ని మధ్యంలో ఉండి ఒక సంవత్సర కాలం అతడు తపస్సు చేశాడు. ఒకే పాదంమీద నిలబడి, వాయుభక్షణచేస్తూ ఆరునెల లున్నాడు. అనంతరం .పవిత్రమైన అతనికీర్తి రోదసి అంతటా వ్యాపించింది. తరువాత అతడు స్వర్గానికి వెళ్ళాడు.

87. యయాతి పూరునికిచ్చిన ఉపదేశము.

ఒకానొకసారి దేవరాజు ఇంద్రుడు యయాతి దగ్గరకు వచ్చాడు. వారిరువురి సంభాషణ చివరలో శుక్రుడు యయాతిని ఇలా అడిగాడు. 'రాజా! నీకుమారుడు పూరుడు నీముసలితనాన్ని స్వీకరించి నీరూపంతో భూమిపై సంచరించాడు కదా! అతడికి రాజ్యాన్ని అప్పగిస్తూ అపుడు నీవు అతనికి ఏంచెప్పావు? నాకిప్పుడు చెప్పు.'

యయాతి ఇలా అన్నాడు - 'గంగా యమునలకు మధ్యనున్నదంతా నీదేశం. ఈ మధ్య నున్న భూమి కంతటికి నీవు రాజువి. నీసోదరులు నీరాజ్యం చివరనున్న సీమాంతప్రదేశాలకు రాజులు. మానవునికి దైన్యం, శాఠ్యం, క్రోధం, కుటిలత్వం, మత్సరం, వైరం, ఎప్పుడూ రాకూడదు. తల్లిదండ్రులను, పండితులను, తపోధనులను, ఓర్పుగలవారిని బుద్ధిమంతుడు ఎప్పుడూ అవమానింపడు. శక్తికలవాడు ఎప్పుడూ ఓర్పును వహిస్తాడు. శక్తిలేనివాడే కోపిస్తాడు. దుర్జనుడు సుజనుని ద్వేషిస్తాడు. బలహీనుడు బలవంతుని ద్వేషిస్తాడు. కురూపి రూపవంతుని ద్వేషిస్తాడు. నిర్ధనుడు ధనవంతుని ద్వేషిస్తాడు. పనిచేయనివాడు చేసేవానిని ద్వేషిస్తాడు. ధార్మికుడు కానివాడు ధార్మికుని ద్వేషిస్తాడు. గుణహీనుడు గుణవంతుని ద్వేషిస్తాడు. ఇంద్రా! ఇది కలికాల లక్షణం. కోపించనివాడు కోపించే వారికంటె గొప్పవాడు. అట్లే ఓర్పుగలవాడు ఓర్పులేని వానికంటె విశిష్టుడు. అమానుషులకంటె మనుష్యులు ముఖ్యులు. అనిద్వాంసుని కంటె విద్వాంసుడు ప్రధానుడు. ఇతరులు తన్ను నిందిస్తున్నా తిరిగి వారిని నిందింపకూడదు. సహనంగలవారి కోపమే నిందించేవానిని దహిస్తుంది. అతని పుణ్యాన్ని కూడ సహనంగలవాడు

పొందుతాడు. ప్రాణాపాయం కలిగించే మర్మస్థానాల్లో బాధించకూడదు. ఇతరులను హింసించే మాటలను మాట్లాడరాదు. ఇతరులు ఉద్వేగం పొందే మాటలు మాట్లాడకూడదు. పాపలోకంలో ఉండే పాపులు మాట్లాడే మాటలు మాట్లాడకూడదు. ఇతరుల మర్మస్థానాలను బాధించేవాడు, కఠినంగా, తీక్ష్ణంగా మాట్లాడేవాడు వాక్కు లనే ముళ్ళతో మనుష్యులను బాధపెట్టేవాడు, ఈ లక్షణాలు కలవానిని దరిద్రుడుగా భావించాలి. అతడు నోటియందు రాక్షసిని ధరించినవాడని గ్రహించాలి. ముందుగా సత్పురుషులను గౌరవించి, వారిచే గౌరవింపబడాలి. ఆ తరువాత సత్పురుషులచే రక్షింపబడాలి. చెడ్డవారి అనుచితమైన మాటలను సహించాలి. సత్పురుషుల నడవడికను అనుసరించి వారిప్రవృత్తిని ఆదరించాలి. దుష్టులైన మానవుల నోటినుండి వెలువడిన వాగ్బాణాలు అవి తగిలిన వారిని రాత్రింబవళ్ళు బాధిస్తాయి. దుష్టుడు అటువంటిమాటలను ఇతరుల మర్మస్థానాల్లో కొడతాడు. అందువల్ల పండితులు అటువంటి మాటలను ఇతరులపై ప్రయోగింపరాదు. **ప్రాణులపట్ల దయ, స్నేహం; దానం, తీయనిమాట -ఇతరులను వశంచేసుకోవడానికి ఈ మూడులోకాలలో ఇంతకంటె వేరొకటి ఏమీలేదు.*** అందువల్ల ఎల్లపుడు సాంత్వనవచనమే పలకాలి కాని కఠినమైన మాటలు పలకరాదు. గౌరవింపదగిన వారిని గౌరవించాలి. దానం చెయ్యాలి. ఎన్నడూ యాచించకూడదు.

88. యయాతి స్వర్గమునుండి పడుట, అష్టకు డతనిని ప్రశ్నించుట.

ఇంద్రుడిలా అన్నాడు – 'రాజా! నీవు గృహస్థకర్మా లన్నింటిని పూర్తిచేసికొని, ఇంటిని వదిలి, వనానికి వెళ్ళావు. నహుషపుత్రా! ఒకమాట నిన్ను అడుగుతున్నాను. నీవు తపస్సుతో ఎవరితో సమానుడవయ్యా?' యయాతి ఇలా అన్నాడు – 'ఇంద్రా! దేవతలలో, మనుష్యులలో, గంధర్వులలో, మహర్షులలో, నాతో తపస్సులో సమానుని ఎవరినీ చూడలేదు.' ఇంద్రుడిలా అన్నాడు – 'రాజా! నీవు నీతో సమానమైన వాళ్ళని, ఎక్కువవాళ్ళను, తక్కువవాళ్ళను వాళ్ళప్రభావం తెలియకుండానే తిరస్కరించావు. అందువల్ల నీకు ఈ పుణ్యలోకాల్లో ఉండే సమయం పూర్తయింది. పుణ్యం క్షీణించడం వల్ల నీ విపుడు క్రిందికి పడుతున్నావు.'

యయాతి ఇలా అన్నాడు – 'ఇంద్రా! దేవ ఋషి గంధర్వ మనుష్యుల అవమానం వల్ల నాకు ఈ పుణ్యలోకాలు క్షీణిస్తే, స్వర్గలోకం విడిచి, సత్పురుషుల మధ్యలో పడాలని

---

* న హీదృశం సంవననం త్రిషు లోకేషు విద్యతే ।
దయా మైత్రీ చ భూతేషు దానం చ మధురా చ వాక్ ॥ 12

కోరుతున్నాను.' ఇంద్రుడిలా అన్నాడు - 'రాజా! నీవు ఈ స్వర్గం నుండి చ్యుతుడవై సత్పురుషుల దగ్గర పడుతున్నావు. యయాతీ! అక్కడ మరల ప్రతిష్ఠను పొందుతావు. ఈవిషయం గ్రహించి నీవు మళ్ళీ సమానులను, గొప్పవాళ్ళను అవమానించవద్దు.'

దేవేంద్రుడు అనుభవించే పుణ్యలోకాలను విడిచి, యయాతి క్రిందికి పడుతున్నాడు. అలా పడుతున్న ఆ రాజర్షిని చూసి, సద్ధర్మాచరణాన్ని రక్షించే అష్టకుడు అతనితో ఇలా అన్నాడు. 'ఇంద్రునితో సమానరూపం గల యువకుడవు, నీవెవరు? నీవు అగ్నిలా తేజస్సుతో ప్రకాశిస్తున్నావు. దట్టని మేఘంలాంటి అంధకారం గల ఆకాశంనుండి గ్రహాల్లో శ్రేష్ఠమైన సూర్యునిలా ఎక్కడ నుండి పడుతున్నావు? సూర్యుని మార్గం నుండి పడుతూ, అగ్నివలె, సూర్యునివలె అప్రమేయమైన కాంతిగల నిన్ను చూసి 'ఏమిటీ పడుతున్నది?' అని అంతా సమ్మోహితులమై ఆలోచిస్తున్నాం. ఇంద్ర సూర్య విష్ణువులతో సమానప్రభావంగల నీవు ఆకాశమార్గంలో ఉండటం చూసి, ఇపుడు మేమంతా నీవు పడటంలోని యథార్థకారణాన్ని తెలుసుకోవాలని నీదగ్గరకు వచ్చాం. నిన్ను ముందుగా అడగటానికి సాహసింపలేకపోతున్నాం. నీవు కూడ మమ్మల్ని 'ఎవర'ని అడగలేదు. అందువల్ల నేను నిన్ను అడుగుతున్నాను- 'నీవెవరి కుమారుడవు? ఏకారణంగా నువ్విక్కడకి వచ్చావు? నీభయం తొలగిపోవుగాక! విషాదాన్ని, మోహాన్నీ వెంటనే విడిచిపెట్టు. నీవు సత్పురుషుల మధ్యలో ఉన్నావు. ఇంద్రుడు కూడ ఇపుడు నీతేజస్సును సహింపడానికి సమర్థుడు కాదు. సుఖం నుండి చ్యుతులైన సత్పురుషు లకు సత్పురుషులే ఆశ్రయం. స్థావరజంగమాలను శాసింపగల సత్పురుషులంతా ఇక్కడ కలిసి ఉన్నారు. నీవిపుడు నీతో సమానమైనవారిలో ఉన్నావు. అగ్ని కాల్చడానికి సమర్థమైనది. భూమి బీజం మొలకెత్తడానికి సమర్థమైనది. సూర్యుడు అంతటిని ప్రకాశింపజేయడానికి సమర్థుడు. ఇదేవిధంగా అతిథి సత్పురుషులను శాసించడానికి సమర్థుడు.'

89. అష్టక యయాతుల సంవాదము.

యయాతి ఇలా అన్నాడు నేను నహుషుని పుత్రుడయిన యయాతిని. పూరుని తండ్రిని. సర్వభూతాలను అవమానించటం వల్ల పుణ్యం క్షీణించి సుర, లోకంనుండి త్రోయబడి ఇక్కడ పడ్డాను. నేను వయస్సుచేత మీకంటె పెద్దవాడిని. అందుచేత మీకు నమస్కారం చేయడం లేదు. **విద్యచేత గాని, తపస్సుచేత గాని, జన్మచేత గాని వృద్ధుడైనవాడు మాత్రమే ద్విజులకు నమస్కరింపదగినవా డవుతాడు.** అష్టకు డిలా అన్నాడు-రాజా! వయస్సుచేత వృద్ధుడైనవాడు నీవు చెప్పినట్లుగ సమ్మానింపదగినవాడు కాదు. విద్యచేత, తపస్సుచేత వృద్ధు డైనవాడే ద్విజులకు పూజింప దగినవాడు.

యయాతి ఇలా అన్నాడు – 'పుణ్యకర్మలను నశింపచేసేది పాపమని చెపుతున్నారు. ఆ పాపం నరకాన్ని కలుగజేస్తుంది. పాపప్రవణుడు కాని వాడుకూడ పాపలోకనివాసం చేయడం ఉంది. సత్పురుషులు చెడ్డవారి పనులను అనుసరించరు. సత్పురుషులు సత్పురుషుల చేష్టలనే అనుసరిస్తారు. 'మునుపు నాకు ఎక్కువ పుణ్యధనం ఉండేది. ఇతరులను నిందించడంవల్ల అదంతా నశించింది. ఇపుడు మంచిపని చేసికూడ మరల దాన్ని పొందలేను.' ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకొని ఆత్మహితమందే లగ్నమై ఉన్నవాడే ధీరుడు. అతడే జ్ఞాని. మహాధనవంతుడై మంచి యజ్ఞాలతో దేవతలను ఆరాధించేవాడు, అన్నివిద్యలయందు వినయ బుద్ధికలవాడూ, వేదాలను అధ్యయనంచేసి తనదేహాన్ని తపస్సుకు నియోగించినవాడూ మోహం నశించి స్వర్గానికి వెళతాడు. చాలా ధనం పొందగానే ఆనందం పొందకూడదు. అహంకారం లేకుండా వేదాధ్యయనం చేయాలి. ఈ ప్రాణిలోకంలో అనేక స్వభావాలు కలవారున్నారు. వారంతా దైవాధీనులైనవారే. వారి ప్రయత్నాలు, కర్మలు వ్యర్థాలే. సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని పొంది ధీరుడైనవాడు చలింపకూడదు. ఆత్మబుద్ధితో దైవమే బలీయమైనదని గ్రహించాలి. **ప్రాణి సుఖాన్ని కాని, దుఃఖాన్ని కాని దైవాధీనం వల్ల పొందుతాడేగాని తనశక్తిచేత కాదు. అందువల్ల దైవం బలవంతమైనదని తెలిసి ఏవిధంగాను దుఃఖించకూడదు. ఆనందించకూడదు.** ధీరుడు దుఃఖాలతో తపించిపోక, సుఖాలతో పొంగిపోక, రెండింటియందు సమంగా ఉండాలి. దైవం బలీయమైనదని గ్రహించి ఎప్పుడూ క్రుంగిపోకూడదు. పొంగిపోకూడదు. అష్టకా! నేనెప్పుడూ భ్రమలో మోహితుడిని కాలేదు. భయపడలేదు. నామనస్సులో ఎపుడూ సంతాపంలేదు. ఈ లోకంలో బ్రహ్మ నన్ను ఎలా శాసించాడో తప్పక నేను అలాగే ఉంటాను అని భావించాను. స్వేదజాలు,అండజాలు, ఉద్భిదాలు, సరీసృపాలు, క్రిములు, నీటిలోని చేపలు, రాళ్లు, గడ్డి, కర్రలు ఇవన్నీకూడ వాటి కర్మం నశించగానే వాటివాటి స్వభావాన్ని (మూలతత్త్వాన్ని) పొందుతాయి. అష్టకా! సుఖదుఃఖాల అనిత్యతను తెలిసి కూడ నేను సంతాపాన్ని ఎందుకు పొందుతాను? నేనేమి చెయ్యను? ఏమిచేసి నేను తపించకుండ ఉండగలను? అందువల్ల అప్రమత్తుడనై విడిచిపెడుతున్నాను.

(దుఃఖంచేత కుంగిపోకూడదు. సుఖంచేత పొంగిపోకూడదు. ధీరుడు రెండింటియందు సమానంగా ఉండాలి. దైవం (కర్మ) బలీయమని బుద్ధిచే గ్రహించి మనుష్యుడు ఈలోకంలో దేనియందూ చిక్కుకుపోకూడదు.)

వైశంపాయనుడిలా అన్నాడు- అన్ని సద్గుణాలతో కూడి, మాతామహుడైన యయాతిరాజు అంతరిక్షంలో ఉన్నా స్వర్గలోకంలో ఉన్నట్లు భావించి అష్టకుడు యయాతిని మళ్ళీ ఇలా అడిగాడు. అష్టకుడిలా అన్నాడు – 'రాజేంద్రా! ప్రధానాలైన ఏఏ లోకాలు

ఎంతెంతకాలం అనుభవించావో ఉన్నదున్నట్లు వాటన్నింటిని నాకు చెప్పు. నీవు క్షేత్రజ్ఞనివలె ధర్మాలను గురించి చెపుతున్నావు.'

యయాతి ఇలా అన్నాడు - నేనీ భూలోకంలో సార్వభౌమునిగ ఉన్నాను. అనంతరం సత్కర్మలవల్ల గొప్పగొప్పలోకాలను జయించాను. ఆ లోకాలలో నేను వేయిసంవత్సరాలు నివసించాను. అనంతరం అంతకంటె ఉన్నతమైన లోకాన్ని పొందాను. అనంతరం వేయి ద్వారాలతో, శతయోజనాలు విస్తరించిన ఇంద్రునియొక్క అందమైన అమరావతీ నగరానికి వెళ్ళాను. అక్కడ వెయ్యిసంవత్సరాలు నివసించాను. అనంతరం అంతకంటె ఉన్నతమైన లోకానికి వెళ్ళాను. దివ్యమై, జరారహితమై లోకపతికి దుర్లభమైన ప్రజాపతిలోకాన్ని పొందాను. అక్కడ వేయి సంవత్సరాలు నివసించాను. అనంతరం అంతకంటె ఉన్నతమైన లోకాన్ని పొందాను. అక్కడ దేవదేవుడయిన బ్రహ్మయొక్క భవనంలో ఉండి, అచటి లోకాల్లో యథేష్టంగా విహరిస్తూ నివసించాను. అక్కడున్న దేవతలందరిచే పూజింపబడుతూ దేవతలతో సమానమైన ప్రభావాన్ని, తేజస్సునూ పొందాను. ఆ విధంగా నందనవనంలో కామారూపినై పదిలక్షల సంవత్సరాలు అప్సరసలతో విహరిస్తూ, పవిత్రమైన పరిమళమూ, అందమైన రూపమూ, వికసించిన పూలూ కల వృక్షాలను చూస్తూ నివసించాను. దివ్యమైన సుఖాలలో మునిగి ఉన్న నన్ను చాలాకాలం గడిచాక భయంకరరూపంలో ఉన్న దేవదూత 'జారిపడు' ((క్రిందికిపడు) అని గట్టిగా ప్లుతస్వరంతో మూడుసార్లు పలికాడు. రాజసింహా! నాకు ఇంతమాత్రమే తెలుసు. అనంతరం పుణ్యం క్షీణించిన నేను నందనవనం నుండి జారిపడ్డాను. నరేంద్రా! అంతరిక్షంలో నాగురించి దుఃఖిస్తున్న దేవతల జాలి మాటలను విన్నాను. అయ్యో! ఎంతకష్టం! పుణ్యాత్ముడు, పవిత్రకీర్తి అయిన యయాతి పుణ్యం నశించి క్రిందికి పడుతున్నాడు. ఆ మాటలను విని నేను వారితో 'సత్పురుషుల మధ్యలో నేనేవిధంగా పడగలను?' అని పలికాను. మీ యజ్ఞభూమినిగురించి వారు చెప్పారు. ఈ భూమిని చూసి నేను త్వరగా వచ్చాను. ఈ యజ్ఞభూమిని తెలియపరిచే హవిస్సుల పరిమళం, ధూమం వ్యాపించిన ప్రదేశాన్ని గ్రహించి నేను ఊరట పొందాను.

90. అష్టక యయాతుల సంవాదము.

అష్టకుడిలా అన్నాడు - 'కృతయుగరాజోత్తమా! నందన వనంలో ఇచ్ఛారూపంతో పదిలక్షల సంవత్సరాలు నివసించి, దానిని వదిలి ఏకారణంగా భూమిమీదికి వచ్చావు?'

యయాతి ఇలా అన్నాడు - 'ఈ లోకంలో ధనం నశించగానే జ్ఞాతి, మిత్రుడు, తనవాడు ఎవడైనా సరే మానవులచే విడువబడినట్లే, పుణ్యం నశించగానే ఈశ్వరునితోబాటు దేవతలందరూ వెంటనే మానవుని త్యజిస్తారు.' అష్టకుడిలా అడిగాడు - 'దేవలోకంలో

మనుష్యుల పుణ్యం ఎలా క్షీణిస్తుంది? ఈ విషయంలో నామనస్సు మిక్కిలి అజ్ఞానంలో ఉంది. ఎటువంటి పుణ్యవిశేషంతో ఉన్నవారు ఎవని నివాసానికి చేరుతారు? ఆ విషయాన్ని చెప్పు. నేను నిన్ను క్షేత్రజ్ఞునిగా భావిస్తున్నాను.'

యయాతి ఇలా చెప్పాడు. 'తమ పుణ్యకర్మల గురించి గొప్పలు చెప్పుకొనేవారు, ఈ భౌమ నరకమందు వచ్చిపడతారు. ఇక్కడ వారు గ్రద్దలు, గోమాయువులు, కాకులు తినటానికి యోగ్యమైన శరీరంకోసం క్షీణిస్తారు. పుత్రపౌత్రాదిరూపంలో మిక్కిలి వృద్ధిచెందుతారు. నరేంద్రా! అందువల్ల ఈ లోకంలో దుష్టమై, నిందింపదగిన కర్మ చేయడం మానాలి. పార్థివా! నీకు సర్వమూ చెప్పాను. మళ్లీ ఇంకా ఏం కావాలో అడుగు. నే చెప్తాను.'

అష్టకుడిలా అడిగాడు - 'మనుష్యులు మరణించిన పిదప పక్షులు, గ్రద్దలు, నెమళ్లు, పతంగాలు వారిని తింటాయికదా! ఆ పక్షులు ఎలా ఏరూపంలో వస్తాయి! భౌమమనే వేరొక నరకముందని నేనింతవరకు వినలేదు.'

యయాతి ఇలా చెప్పాడు. 'కర్మచేత పుట్టి, పెరిగిన దేహంతో ఈ భూమి మీదికి వచ్చిన జీవులు అందరిసమక్షంలో సంచరిస్తూ ఉంటారు. వారంతా ఈ భౌమనరకంలో పడతారు. పడిన తర్వాత వ్యర్థంగా అనేకసంవత్సరాలు చూడనే లేరు. ప్రాణులు కొన్ని ఆకాశంలో అరవై వేల సంవత్సరాలు పడుతూ ఉంటాయి. మరికొన్ని ఎనభై వేల సంవత్సరాలు ఉంటాయి. అనంతరం వారు భూమిపై పడతారు. అలా పడుతున్న వారిని భౌములైన భయంకరులైన రాక్షసులు వాడియైన కోరలతో బాధిస్తారు.'

అష్టకుడిలా అన్నాడు - 'పాపంవల్ల పడుతూన్న ఎటువంటి ప్రాణులను ఈ భౌములూ, భయంకరములూ అయిన తీక్ష్ణదంష్ట్రలు గల రాక్షసులు హింసిస్తారు? వారు క్రిందపడి ఎలా జీవిస్తారు? ఎటువంటి ఇంద్రియాలతో ఉంటారు? ఎటువంటి గర్భాలలో ప్రవేశిస్తారు?'

యయాతి ఇలా చెప్పాడు - 'అంతరిక్షంనుండి పడే ప్రాణి నీటిరూపంలో పడతాడు. ఆ నీరు నూతనశరీరానికి బీజభూతమైన రేతస్సుగా మారుతుంది. అది పుష్ప ఫలరూపకర్మలతో కూడి పురుషునిలో ప్రవేశిస్తుంది. పురుషుడు స్త్రీతో కలిసినపుడు వీర్యమందలి జీవుడు రజస్సుతో కలుస్తాడు. అది గర్భంగా పరిణమిస్తుంది. జలరూపంలోని జీవుడు వనస్పతులలోను, ఓషధులలోను కూడ ప్రవేశిస్తాడు. గాలి, వాయువు, భూమి, అంతరిక్షాలలో ప్రవేశించి కర్మానుసారంగా ద్విపద, చతుష్పదాలలో గర్భరూపం దాల్చి ఇక్కడ ప్రాణిగా జన్మిస్తాడు. భూమిమీద ప్రాణులన్నీ ఇలాగే రూపు దాలుస్తాయి.'

అష్టకుడిలా అడిగాడు - 'మనుష్య గర్భంలో ప్రవేశించిన జీవుడు వేరొక శరీరాన్ని

ధరిస్తాడా లేక తన శరీరంతోనే వస్తాడా? సంశయంవల్ల అడుగుతున్నాను. నాకు చెప్పవలసింది. జీవుడు మనుష్యగర్భంలో ప్రవేశించాక భిన్నభిన్న శరీరాల వృద్ధిని, కన్ను, చెవి, చైతన్యాలను ఎలా పొందుతాడు? ఇదంతా నిజంగా చెప్పు. తాతా! నిన్ను క్షేత్రజ్ఞునిగా భావిస్తున్నాము.'

యయాతి ఇలా అన్నాడు – 'ఋతుకాలంలో పూలతేనెలో కలిసిన రేతస్సును వాయువు గర్భాశయానికి చేరుస్తుంది. అది అక్కడ (తన్మాత్ర) సూక్ష్మరూపంలో ఉండి క్రమంగా గర్భాన్ని (సంరక్షిస్తుంది) వృద్ధిచేస్తుంది. గర్భంలో సంపూర్ణావయవాలు పొందిన ఆ జీవుడు చైతన్యంతో బయటపడి మనుష్యుడని చెప్పబడతాడు. అతడు చెవులతో శబ్దాన్ని తెలుసుకుంటాడు. కంటితో రూపాన్ని చూస్తాడు. నాసికతో పరిమళాన్ని, నాలుకతో రుచిని, చర్మంతో స్పర్శను, మనస్సుతో భావాన్ని తెలుసుకొంటాడు. అష్టకా! ఈ విధంగా మహాత్ములైన ప్రాణధారుల శరీరంలో జీవుని స్థాపన జరుగుతుంది.'

అష్టకుడిలా అడిగాడు – 'మనుష్యుడు మరణించిన తర్వాత శరీరం దహింపబడుతుంది, లేదా పాతిపెట్టబడుతుంది, లేదా నీటిలో విడువబడుతుంది. ఈవిధంగా స్థూలశరీరం నశిస్తుంది. అభావ రూపం పొందిన జీవాత్మ తరువాత ఏశరీరం ద్వారా చేతనావ్యవహారం చేస్తుంది?'

యయాతి ఇలా చెప్పాడు – 'రాజసింహా! జీవుడు ప్రాణాలను విడిచి నిద్రిస్తున్నవానివలె స్థూలశరీరాన్ని విడిచి, సుకృత, దుష్కృతాలను ముందుంచుకొని వాయువుకంటె వేగంగా చలిస్తూ వేరొక పుట్టుకస్థానాన్ని పొందుతాడు. పుణ్యాత్ములు పుణ్యజన్మను పొందుతారు. పాపాత్ములు పాపజన్మను పొందుతారు. పాపులు కీటకాలుగా, పక్షులుగా జన్మిస్తారు. మహానుభావా! వీటన్నింటిని చెప్పాలని నాకులేదు. రాజసింహా! గర్భాన్ని ప్రవేశించిన జీవులు చతుష్పదాలు, ద్విపదాలు, షట్పదాలుగా జన్మిస్తారు. ఇంకా మళ్లీ ఏం అడగాలనుకొంటున్నావు?'

అష్టకుడు ఇలా అడిగాడు – 'తాతా! మానవుడు ఏ కర్మచేసి శ్రేష్ఠమైన లోకాలను పొందుతాడు? తపస్సు చేతనా? లేక విద్య చేతనా? ఏకర్మచేత క్రమంగా పుణ్యలోకాలకు వెళ్తాడు? ఉన్నదున్నట్లుగా చెప్పు.'

యయాతి ఇలా చెప్పాడు – **తపస్సు, దానం, శమం, దమం, సిగ్గు, ఋజుత్వం, సర్వప్రాణులపట్ల దయ అనే ఏడూ మానవుడు స్వర్గాలోకానికి చేరటానికి పెద్ద ద్వారాలని సత్పురుషులు చెపుతున్నారు.** మానవుని అభిమాన రూపమైన చీకటిచే ఈ ఏడు ద్వారాలు ఎల్లపుడూ కప్పబడినవై నశిస్తున్నాయి అని సత్పురుషులు చెపుతున్నారు. వేదాధ్యయనం చేస్తూ తానే పండితుడనని భావించేవానికి, తన విద్యతో ఇతరుల కీర్తిని నశింపజేసేవానికి పుణ్యలోకాలు నశించిపోతాయి. అతడు చదివిన వేదం కూడా అతనికా

ఫలాన్ని ఇవ్వదు. అగ్నిహోత్రం, మౌనం, అధ్యయనం, యజ్ఞం అనే ఈ నాలుగు కర్మలూ అభయాన్ని కలిగించేవి. అవే యథావిధిగా చేయకపోతే భయాన్ని కలిగిస్తాయి. **అభిమానపూర్వకంగా అగ్నిహోత్రం, మౌనం, అధ్యయనం, యజ్ఞం చేస్తే అవి భయాన్ని కలిగిస్తాయి.** విద్వాంసుడైన పురుషుడు సమ్మానింపబడినా మిక్కిలి ఆనందాన్ని పొందడు. అవమానం వల్ల సంతాపాన్ని పొందడు. ఈ లోకంలో సత్పురుషులు సత్పురుషులను గౌరవిస్తారు. దుష్టబుద్ధులు సాధుబుద్ధిని పొందలేరు. నేను ఈ విధంగా ఇస్తాను, నేనిలా యజ్ఞం చేస్తాను, ఈ విధంగా అధ్యయనం చేస్తాను, ఇది నావ్రతం అని అహంకారంతో చేసిన ఈ కర్మలు భయాన్ని కలిగించేవి. అన్నివిధాలా అటువంటి వాటిని విడిచిపెట్టాలి. అందరికీ ఆశ్రయమైన దనీ, (కూటస్థమనీ) పురాతనమైన, మనోగతిని నిరోధించే దనీ విద్వాంసులు చెప్పే పరబ్రహ్మం మీకు శ్రేయస్సును కలిగిస్తుంది. ఈ విషయం తెలిసినవారు పరబ్రహ్మతో కలిసి ఇహపరలోకాలలో పరమశాంతిని పొందుతారు.'

91. యయాతి అష్టకుల ఆశ్రమధర్మ సంవాదము.

అష్టకుడిలా అడిగాడు – 'మహారాజా! ఆచార్యుని సేవచేసే బ్రహ్మచారి, గృహస్థుడు, భిక్షువు (సన్యాసి), మంచి మార్గంలో ఉన్న వానప్రస్థుడు వారివారి ధర్మాల నాచరిస్తూ ఏ విధంగా ఉత్తమలోకాలను పొందగలరు? ఈ విషయంలో పండితులు అనేకమార్గాలను తెలియజేస్తున్నారు.'

యయాతి ఇలా చెప్పాడు – 'గురువు పిలుపందుకొని అధ్యయనం చేసేవాడు, గురుసేవలో స్వయంగానే ప్రవర్తించేవాడు, గురువుకంటె ముందుగా నిద్రలేచి, గురువు నిద్రించిన పిమ్మట నిద్రించేవాడు, మృదుస్వభావుడు, ఇంద్రియనిగ్రహం ధైర్యంకలవాడు, జాగరూకుడు, స్వాధ్యాయశీలుడూ అయిన బ్రహ్మచారి సిద్ధిని పొందుతాడు. గృహస్థుడు ధర్మప్రకారం వచ్చిన ధనాన్ని పొంది యజ్ఞం చేయాలి. దానంచేయాలి. ఎల్లపుడు అతిథులకు భోజనం పెట్టాలి. ఇతరులచే ఇవ్వబడనిది స్వీకరించకూడదు. ఇది ప్రాచీనమైన గృహస్థుల సాధనమార్గం. వానప్రస్థుడు స్వశక్తితో జీవించేవాడు, పాపం చేయనివాడు, ఇతరులకు దానం చేసేవాడు, ఇతరులకు బాధను కలిగింపనివాడు అయి ఉండాలి. నియతమైన ఆహారం, చేష్టలు కల్గి అరణ్యంలో నివసిస్తున్న ముని ముఖ్యసిద్ధిని పొందుతాడు. శిల్పకళచే జీవించనివాడు, గుణవంతుడు, జితేంద్రియుడు, అన్నింటికి దూరంగా ఉన్నవాడు, గృహస్థుని ఇంటియందు నిద్రింపనివాడు, పరిగ్రహభారం లేనివాడు, తక్కువ ప్రచారం కలవాడు, అనేకప్రదేశాలను ఒంటరిగా తిరిగేవాడు నిజమైన భిక్షువు. అట్టివాడు సిద్ధిని పొందుతాడు.

లోకంలో ఏ రాత్రి విషయవాంఛలు, సుఖవాంఛలు జయింపబడతాయో ఆరాత్రే విద్వాంసుడు నిగ్రహంకలవాడై అరణ్యంలో ఉండడానికి ప్రయత్నించాలి. అరణ్యవాసి అయిన ముని వనంలో తనపంచ భూతాత్మక శరీరాన్ని పరిత్యాగం చేస్తే పది ముందు తరాలను, పది తరువాతి తరాలను, ఇరువది యొక్క పుణ్యలోకాలను రక్షింపగలుగుతాడు.'

అష్టకుడిలా అడిగాడు - 'మునులు ఎన్నిరకాలు? మౌనా లెన్నిరకాలున్నాయి? నాకు వినాలని ఉంది. చెప్పండి.'

యయాతి ఇలా చెప్పాడు - 'అరణ్యంలో నివసించే వాని వెనుక గ్రామం ఉంటే, గ్రామంలో ఉన్నా వాని వెనుక అరణ్యముంటే అట్టివాడు ముని అవుతాడు.' అష్టకుడిలా అడిగాడు - 'అరణ్యంలో ఉన్నవానికి వెనుక గ్రామం ఎలా ఉంటుంది? గ్రామంలో ఉన్నవాని వెనుక అరణ్యం ఎలా ఉంటుంది?'

యయాతి ఇలా చెప్పాడు - 'అరణ్యంలో వానప్రస్థునిగా ఉన్న ముని గ్రామంలోని వస్తువులను ఉపయోగించకూడదు. అపుడు అరణ్యంలో నివసించే ఆ ముని వెనుక గ్రామమంతా ఉన్నట్లు ఉంటుంది. అగ్నిని, ఇంటిని వదిలిపెట్టి, స్వవేదశాఖాది సంబంధాన్ని విడిచి, మౌనం వహించి, కోపీనాచ్ఛాదనమాత్రానికి సరిపడిన వస్త్రాన్ని మాత్రమే స్వీకరించేవాడు, ప్రాణం నిలబెట్టడానికి కావలసినంత భోజనం మాత్రమే తీసికొనేవాడు. గ్రామంలో నివసిస్తున్నా, అతని వెనుక అరణ్యం ఉన్నట్లే ఉంటుంది. విషయవాంఛలను విడిచి, కర్మప్రవృత్తిని మాని, జితేంద్రియుడై, మౌనాన్నివహించి ఉండే ముని ఈ లోకంలో సిద్ధిని పొందుతాడు. స్వచ్ఛమైన దంతాలు కలవాడు, గోళ్లు కత్తిరించుకొన్నవాడు, ఎల్లపుడు స్నానం చేసి, అలంకరించు కొన్నవాడు, శీతోష్ణాలను సహించటంచేత నల్లని శరీరం కలవాడు, స్వచ్ఛమైన కర్మకలవాడు ....ఇటువంటి మానవుని పూజించటానికి ఎవరికి అర్హత ఉండదు? అందరూ అర్హులే. తపస్సుచే కృశించినవాడు, వడలిన శరీరం కలవాడు, మాంసం, ఎముకలు, రక్తం క్షీణించినవాడు ఈ లోకాన్ని జయించి, పరలోకాన్నికూడా జయిస్తాడు. సుఖదుఃఖ రాగద్వేషాది ద్వంద్వాలకు అతీతుడై, మౌనాన్ని పాటించే ముని ఈ లోకాన్ని పరలోకాన్ని కూడా జయిస్తాడు. **గోవువలె ముఖంతో మాత్రమే ఎవడు ఆహారాన్ని గ్రహిస్తాడో, హస్తాదులు ఉపయోగించడో (అనగా ఆహారాన్ని కూడ బెట్టడో) అట్టి మునికి ఈలోకమంతా మోక్షానికి సమర్థమవుతుంది.***

---

* ఆస్యేన తు యదాహారం గోవన్భుగయతే ముని: ।
అథాస్య లోకః సర్వోఽయం సోఽమృతత్వాయ కల్పతే ॥ 18

92. అష్టక యయాతుల సంవాదము, యయాతి చేయు పుణ్యదానములు ఇతరులు స్వీకరింపకపోవుట.

అష్టకుడిలా అడిగాడు – 'రాజా! సూర్యచంద్రులవలె బ్రహ్మభావం పొందటానికి పరుగిడుతున్న వానప్రస్థ సన్యాసులలో ఎవరు ముందుగా బ్రహ్మభావాన్ని పొందుతారు?'

యయాతి ఇలా చెప్పాడు – 'విషయవాంఛా ప్రవృత్తిగల గృహస్థులు – గ్రామంలోనే ఉంటూ గృహం లేకుండా జితేంద్రియుడై ఉన్న సన్యాసి – వీరిరువురిలో ముందుగా సన్యాసి బ్రహ్మభావాన్ని పొందుతాడు, దీర్ఘమైన ఆయువును పొంది కూడా మనోవికారాలకు లోనై సంచరించినవాడు తరువాత పశ్చాత్తాపం చెందిన వానప్రస్థుడు మరల వేరొక తపస్సును ఆచరించాలి. పాపకర్మల పట్ల నిత్యం భయపడుతూ నిత్యం తన ధర్మాన్ని ఆచరించేవాడు అత్యంతసుఖమైన మోక్షాన్ని పొందుతాడు. రాజా! పాప బుద్ధికలవాడై అధర్మాన్ని ఆచరించేవాని పనిని పాప మని, అసత్యమని చెప్పారు. ఇంద్రియనిగ్రహంలేని ధనంకూడా అటువంటిదే. వానప్రస్థుని ధర్మపాలన ఋజువైనది. అదే సమాధి. అదే శ్రేష్ఠమైంది కూడ.' అష్టకుడిలా అన్నాడు – 'రాజా! నిన్ను ఎవరు ఆహ్వానించారు? ఎవరు పంపారు? యువకుడవు, పుష్పమాల ధరించినవాడవు, అందమైనవాడవు, తేజస్సుకలవాడవు, ఎక్కడనుండి వచ్చావు? ఏ దిక్కునకు వెళుతున్నావు? లేదా నీకొరకు రాజస్థానం ఎక్కడైనా ఉందా?'

యయాతి ఇలా చెప్పాడు – పుణ్యం క్షీణించిన నేను ఈ భౌమనరకాన్ని – భూమిని – ప్రవేశించడానికై ఆకాశంనుండి త్రోయబడ్డాను. బ్రహ్మ లోకపాలురు నన్ను తొందర పెడుతున్నారు. మీ అనుమతి పొందిన పిమ్మట భూమిపై పడతాను. రాజా! భూతలం మీద పడబోతున్న నేను గుణవంతులైన సత్పురుషుల దగ్గర పడటాన్ని కోరుకొని ఇంద్రుని వరాన్ని పొందాను.'

అష్టకుడిలా అడిగాడు – 'పార్థివా! ఒక విషయం నిన్ను అడుగుతున్నాను. అంతరిక్షంలోగాని, స్వర్గంలోకాని నేను పొందదగిన పుణ్యలోకా లున్నాయా! ఉన్నట్లయితే క్రిందపడవద్దు. మీకు పతనం జరుగదు. పారలౌకిక ధర్మాన్ని బాగా తెలిసినవాడవుగా నిన్ను నేను భావిస్తున్నాను.'

యయాతి ఇలా చెప్పాడు – 'రాజశ్రేష్ఠా! ఈ భూమిపై గోవులు, అశ్వాలు, పర్వతాలలోని పశువులతోబాటు అరణ్యాలు ఉన్నంతకాలం స్వర్గంలో ఆ పుణ్యలోకాలు ఉంటాయి అని గ్రహించు.' అపుడు అష్టకుడిలా అన్నాడు – 'రాజేంద్రా! నాకు లభించే ఆ పుణ్యలోకాలు నేను నీకు ఇస్తున్నాను. నీవు ఈ లోకంలో పడకు. మోహం తొలగి, తొందరగా అంతరిక్షంలోగాని, స్వర్గంలోగాని ఉన్న ఆ లోకాలను ఆక్రమించుకో.'

యయాతి ఇలా అన్నాడు - 'రాజముఖ్యా! నావంటి బ్రాహ్మణుడు, బ్రహ్మవేత్త దానం పట్టడు. పూర్వం నేను బ్రాహ్మణులకు ఇవ్వవలసినతీరులో ఎల్లపుడూ ఇచ్చేవాడిని. అబ్రాహ్మణుడు(క్షత్రియుడు) యాచిస్తూ దీనుడై ఎప్పుడూ జీవించకూడదు. యాచన మనేది బ్రాహ్మణునికి పత్నివంటిది. నేను మునుపు ఎన్నడూ చేయని పనిని ఇపుడెలా చేయగలను. అందులో ఔచిత్యం ఏముంది?'

ప్రతర్దనుడిలా అన్నాడు - 'కోరదగిన రూపం కలవాడా! ప్రతర్దనుడనయిన నేను నిన్ను అడుగుతున్నాను- అంతరిక్షంలో కాని, స్వర్గంలోకంలోగాని నాకు చెందదగిన లోకాలు ఉన్నాయా. నిన్ను ఈ పారలౌకిక ధర్మాన్ని బాగా తెలిసినవాడిగ భావిస్తున్నాను.'

యయాతి ఇలా అన్నాడు - 'నరేంద్రా! నీకు చాలా లోకాలున్నాయి. ఒకొక్కలోకంలో ఏడు ఏడురోజులు చొప్పున ఉన్నప్పటికిని వాటికి అంతముండదు. అవి అన్నీ అమృతాన్ని స్రవిస్తూన్నవి. నేతి(తేజస్సు) తో కూడి యున్నవి, శోకంలేనివి కూడ, ఆ లోకాలన్నీ మీగురించి నిరీక్షిస్తున్నాయి.' ప్రతర్దనుడిలా అన్నాడు - 'ఆ లోకాలన్నింటిని నీకు ఇస్తాను. నేను పొందదగిన లోకాలన్నీ నీవి కాగలవు. నీవు క్రింద పడవద్దు. నీవు క్రిందపడవు. మోహం లేకుండా అంతరిక్షంలోగాని, స్వర్గంలోగాని ఉన్న ఆ లోకాలను వేగంగా ఆక్రమించు.'

యయాతి ఇలా చెప్పాడు - 'పార్థివా! రాజు సమానమైన తేజస్సు కలవాడై ఎదుటవాని సుకృతాన్నికాని, యోగక్షేమాలను కాని కోరకూడదు. విద్వాంసుడైన రాజు దైవయోగం వల్ల ఆపదను పొందినప్పటికి ఎప్పుడూ ఏ పాపకార్యం చేయకూడదు. ధర్మంపట్ల దృష్టిగల రాజు ప్రయత్నపూర్వకంగా ధర్మబద్ధము, కీర్తికరమూ అయిన మార్గాన్ని అనుసరించి కార్యం చెయ్యాలి. ధర్మబుద్ధిగల నావంటివాడు గుణదోషాలు తెలిసినవాడై నీవు చెప్పినవిధంగా దైన్యమైన పనిచేయకూడదు. మంచిపనిని చేయదలచినవాడు ఇతరులు చేయని పనిని చేయాలి. ధర్మాధర్మాలను బాగుగ నిశ్చయించుకొని, కార్యాకార్యాలందు అప్రమత్తుడై వ్యవహరించాలి. అటువంటి రాజు బుద్ధిమంతుడు, సత్యసంధుడు, మనస్వి. అతడు తన మహిమచే లోకపాలు డౌతాడు. ధర్మార్థకామాల విషయంలో సంశయం కలిగినపుడు, బాగా తెలిసికొని ధర్మకార్యాన్ని ముందుగా చేయాలి. అర్థకామాలను కాదు, అదే ధర్మం.' ఈవిధంగా చెపుతున్న యయాతి రాజుతో రాజశ్రేష్ఠుడైన వసుమంతుడు ఇలా పలికాడు.

93. ఉత్తరయయాతి చరిత్ర.

'నరేంద్రా! నేను ఉషదశ్వని కుమారుడ నగు వసుమంతుడను. నేను నిన్ను అడుగుతున్నాను. స్వర్గంలోగాని, అంతరిక్షంలోగాని నాగురించి విఖ్యాతమైనలోకం ఉంటే

చెప్పవలసింది. మహాత్మా! నీవు పారలౌకిక ధర్మాన్ని బాగా తెలిసినవాడవని భావిస్తున్నాను.'

యయాతి ఇలా చెప్పాడు - 'రాజా! ఆకాశం, పృథివి, దిక్కులు, సూర్యుడు తన తేజస్సుతో ఎంతమేరకు ప్రకాశింపజేస్తూ ఉంటాడో, అన్నిలోకాలు స్వర్గంలో ఉన్నాయి. వాటికి అంతంలేదు. నీకొరకు అవి నిరీక్షిస్తూ ఉంటాయి.' వసుమంతుడు అన్నాడు. 'రాజా! ఆ లోకాలను నీకు ఇస్తాను. నీవు పడవద్దు. నీవు పడవు. నాకు తగిన లోకాలు నీవి కాగలవు. బుద్ధిమంతుడా! ప్రతిగ్రహం దోషమని నీవు భావిస్తే గడ్డిపోచతో ఆ లోకాలను నీవు కొనుక్కో.'

యయాతి ఇలా అన్నాడు - 'అసత్యమైన విక్రయాన్ని నేనెప్పుడూ స్మరించనుకూడాలేదు. కుర్రవానినుండి ఏదీ వ్యర్థంగా తీసికోలేదు. కాలచక్రంవల్ల నేను శంకిస్తున్నాను. ఇంతకుమునుపు మహాత్ములు చేయని పనిని నేనూ చెయ్యను. ఎందువలననగా నేను సత్కర్మ చేయాలనుకొంటున్నాను.' అపుడు వసుమంతు డిలా అన్నాడు - 'రాజా! కొనడం నీకిష్టం లేకపోతే నేనే స్వయంగా ఇస్తున్న ఆ లోకాలను నీవు స్వీకరించు. నరేంద్రా! నేను ఆ లోకాలకు వెళ్లను. ఆ లోకాలన్నీ నీవే అగుగాక.' శిబి ఇలా అడిగాడు - 'ఉశీనరుని కుమారుడనైన శిబిని నేను అడుగుతున్నాను. తాతా! నాకు కూడా లోకాలున్నట్లయితే, అంతరిక్షంలో కాని, స్వర్గంలో కాని ఉంటే చెప్పు. అలౌకిక ధర్మానికి నిన్ను క్షేత్రజ్ఞునిగా భావిస్తున్నాను.'

యయాతి ఇలా చెప్పాడు - 'నరేంద్రా! నీవు వాక్కుచేకాని, హృదయంచే కాని, నిన్ను అడగడానికి వచ్చిన **సత్పురుషులను అవమానించవద్దు.** అందువలన స్వర్గంలో నీకు అనంతలోకాలు ఉన్నాయి. అవి విద్యుత్ సమానమైన తేజస్సు కలవి. మధురధ్వని కలిగినవి. గొప్పవి.' శిబి ఇలా అన్నాడు - 'రాజా! నీకు కొనడం ఇష్టం కాకపోతే నేను స్వయంగా సమర్పిస్తున్న ఆ లోకాలను నీవు స్వీకరించు. నేను ఆ లోకాలకు వెళ్లను. ఎక్కడకు చేరి ధీరులు విచారించరో అట్టి స్థానాలు ఆ లోకాలు.'

యయాతి ఇలా అన్నాడు - 'నరదేవా! నీవు ఇంద్రునితో సమానమైన ప్రభావం కలవాడివైనట్లే నీలోకాలు కూడా (శాశ్వతాలు) అనంతాలైనవి. ఇతరులు ఇచ్చిన లోకంలో ఉండి నేను ఆనందించలేను. శిబీ! అందువల్ల నీవు ఇచ్చేదాన్ని నేను అంగీకరించలేను.'

అష్టకుడిలా అన్నాడు - 'రాజా! నీవు వేర్వేరుగా ఒక్కొక్క లోకం చొప్పున తీసుకోడానికి ఇష్టపడకపోతే మేమంతా అన్నిలోకాలను నీకిచ్చి నరకానికి (భూలోకానికి) వెళతాం.' అపుడు యయాతి ఇలా అన్నాడు- 'నేను దేనికి అర్హుడినో దానికోసం ప్రయత్నించండి. సత్పురుషులు సత్యాన్ని అభినందిస్తారు. పూర్వం నేను చేయని పనిని ఇప్పుడు నేను చేయడం యోగ్యంకాదు.' అష్టకుడిలా అన్నాడు - 'ఆకాశంలో ఐదుబంగారు రథాలు

కనబడుతున్నాయి. మానవుడు అటువంటి రథాలనెక్కి శాశ్వత పుణ్యలోకాలను చేరాలనుకొంటాడు. ఆ రథాలు ఎవరివి?'

యయాతి ఇలా చెప్పాడు - 'అగ్నిశిఖలవలె ఉన్నతంగా ప్రకాశిస్తున్న ఈ ఐదు బంగారు రథాలు మిమ్మల్ని తీసికొని వెళతాయి.'

(వైశంపాయనుడిలా అన్నాడు - రాజా! ఇంతలో తపోధనురాలైన మాధవి అక్కడకు వచ్చింది. ఒంటినిండా మృగచర్మాన్ని కప్పుకొంది. ముసలితనంలో మృగాలతో సంచరిస్తూ, మృగాల ఆహారాన్నే తీసుకొంటూ, మృగవ్రతాన్ని ఆచరిస్తూ మృగసమూహంతో యజ్ఞవాటికను ప్రవేశించి మిక్కిలి అచ్చెరువొందింది. అక్కడి ధూమగంధాన్ని వాసనచూచి, మృగాలతోనే సంచరించింది. ఆ మాధవి యజ్ఞవాటికలో తిరుగుతూ ఓటమిలేని తన పుత్రులను చూస్తూ, యజ్ఞమాహాత్మ్యాన్ని అనుభవించి ఆనందించింది. భూమిని తాకకుండా అంతరిక్షంలోనే ఉండి సమీపించిన తన తండ్రి, యయాతికి మాధవి నమస్కరించింది. పిమ్మట వసుమంతుడు తపస్విని అగు తన తల్లిని ఇలా అడిగాడు. 'అమ్మా! శ్రేష్ఠురాలా! నీవు నమస్కరించిన ఈతడు ఎవరు? దేవుడా! లేక రాజా! నీకు తెలిస్తే నాకు చెప్పు.' అపుడు మాధవి ఇలా అంది - 'పుత్రులారా! మీరంతా వినండి. నహుషుని కుమారుడైన ఈ యయాతి నాతండ్రి. నాకుమారులకు మాతామహునిగ ప్రసిద్ధుడు. నాసోదరుడైన పూరుని రాజ్యాధికారంలో పెట్టి స్వర్గస్థు డయ్యాడు. గొప్ప యశస్సుగల ఇతడు ఏదో కారణంచేత ఇక్కడకు వచ్చాడు. ఆమె చెప్పిన ఆమాటలను విని వసుమంతుడు 'ఇతడు స్థానభ్రష్టుడయ్యాడు' అని చెప్పాడు. ఆమె కొడుకుమాటను విని, తొట్రుపాటుపడి, దౌహిత్రులతో కూడియున్న తండ్రితో ఇలా చెప్పింది. 'తపస్సుచేత ఆర్జించిన నాపుణ్యలోకాలను నీవు స్వీకరించు. పుత్రుల ధనంవలె పౌత్రులు సంపాదించిన ధనాన్నికూడా తనధనంగానే వేదపారగులైన ఋషులు చెపుతున్నారు. అందువల్ల మా తపస్సుచేత, దానంచేత స్వర్గానికి వెళ్లు.' యయాతి ఇలా అన్నాడు - 'ఇది ధర్మపలమే అయినట్లయితే నాకు శుభాన్ని కలిగిస్తుంది. కూతురుచేత, మహాత్ములైన దౌహిత్రులచేత నేను తరింపజేయబడ్డాను. అందువల్ల ఈనాటినుండి పితృకర్మలయందు దౌహిత్రుడు పరమపవిత్రుడైన వాడుగా తెలియబడతాడు. అతడు పితృదేవతలకు ఆనందాన్ని ఇనుమడింపజేస్తాడు. ఇందులో సందేహంలేదు. శ్రాద్ధకర్మలో దౌహిత్రుడు, కుతపకాలం, తిలలు ఈ మూడు పవిత్రమైనవి. శౌచం, కోపంలేకపోవడం, తొందరపడకపోవడం అనే మరో మూడింటిని కూడా ఈ విషయంలో చెప్తారు. భోక్తలు, వడ్డించేవారు, మంత్రాన్ని వినిపించేవారు ఈ ముగ్గురూ కూడ పవిత్రులై ఉండాలి. పగటి సమయంలో ఎనిమిదవ భాగం కుతపకాలం. అపుడు సూర్యుని తీక్ష్ణత కొంత మందగిస్తుంది. ఆ సమయంలో పితృదేవతలకు ఈయబడినది శాశ్వత పలాన్నిస్తుంది. నువ్వులు పిశాచాలనుండి రక్షిస్తాయి. దర్భలు రాక్షసులనుండి రక్షిస్తాయి. శ్రోత్రియులు పంక్తిని రక్షిస్తారు. యతులు భుజించినది అక్షయపలాన్నిస్తుంది. విద్వాంసుడు శ్రోత్రియుడు, పవిత్రుడు అయిన బ్రాహ్మణుడు శ్రాద్ధానికి యోగ్యుడు. అతడు లభించిన సమయమే శ్రాద్ధానికి తగిన కాలం. అతని కప్పుడు చేసిన దానమే సకాలంలో చేసిన దానమవుతుంది. మరొకటేదీ సకాలం కాదు. వైశంపాయనుడిలా అన్నాడు - ఇలా చెప్పి, బుద్ధిమంతుడైన యయాతి మళ్లీ ఇలా అన్నాడు - 'అందరూ అవభృధ స్నానం చేసి

ఈగొప్పకార్యం కోసం తొందరగా సిద్ధం కండి'.)

అష్టకుడిలా అన్నాడు - 'రాజా! ఈ రథాలను అధిరోహించండి. ఆకాశంలో పైకి ప్రయాణించండి. తగిన సమయం కాగానే మేముకూడా మిమ్మల్ని అనుసరిస్తాం.' యయాతి ఇలా అన్నాడు - స్వర్గాన్ని జయించిన మనమంతా ఇపుడే వెళ్ళాలి. దేవలోకానికి రజోగుణరహితమైన (విరజా) మనమార్గం ఇదిగో కనబడుతోంది.' ఆ రాజశ్రేష్ఠులంతా రథాలనెక్కి, తమ ధర్మంచేత స్వర్గాన్ని చేరడానికి బయలుదేరారు. ఆసమయంలో వారి తేజస్సులు భూమ్యాకాశాలను వ్యాపించాయి.

(అష్టకుడు, శిబి, కాశిరాజైన ప్రతర్దనుడు, ఇక్ష్వాకు వంశీయుడు వసుమంతుడు ఈ రాజులు నలుగురు అవభృధస్నానం చేసినవారు. సత్పురుషులు. వీరంతా ఒకేసారి స్వర్గంలో ప్రవేశించారు.)

అష్టకుడిలా అన్నాడు -' మహాత్ముడైన ఇంద్రుడు నాకు అన్నివిధాలా మిత్రుడు. అందువల్ల ముందు నేనొక్కడనే వెళ్లాలనుకొంటున్నాను. కాని ఉశీనరపుత్రుడైన ఈ శిబి ఒక్కడే మనరథాల్ని దాటి వేగంగా ఎలా వెళ్లాడు?' యయాతి చెప్పాడు - దేవలోకం చేరడంకోసం ఈ ఉశీనరపుత్రుడైన శిబి తన సర్వస్వాన్ని దానం చేశాడు. అందువల్ల మీలో అతడు శ్రేష్ఠుడు. **దానం, తపస్సు, సత్యం, ధర్మం, సిగ్గు, సంపద, ఓర్పు, సౌమ్యం, వ్రతపాలన పట్లకోరిక అనే ఈ అప్రమేయ గుణాలు శిబిలో ఉన్నాయి. బుద్ధిలో అతనితో పోల్చదగ్గవాడు లేడు. ఇన్ని ఉన్నప్పటికి (అవన్ని తక్కువన్నట్లుగా) బిడియంతో ఉంటాడు. అందువల్లే అతడు రథంతో ముందుగా వెళ్లాడు.** తర్వాత అష్టకుడు కుతూహలంతో ఇంద్రసమానుడైన మాతామహుని మళ్లీ ఇలా అడిగాడు. 'రాజా! నిన్నొక్కమాట అడుగుతున్నాను. నిజం చెప్పు. నీవెక్కడ నుండి వచ్చావు? ఎవరివి? ఎవనికొడుకువి? నీవు చేసిన (పుణ్యాన్ని)దాన్ని ఈ లోకంలో బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడు కాని మరొకడెవడూ చేయలేడు.' యయాతి ఇలా చెప్పాడు - నేను నహుషుని కుమారుడనైన యయాతిని. పూరుని తండ్రిని, ఈ భూమిపై సార్వభౌమునిగా ఉన్నాను. నేను మీకు మాతామహుడిని. అందువల్ల మావాళ్ళైన మీకు రహస్యాన్ని పైకి చెపుతున్నాను. నేను ఈ భూమండలాన్నంతా జయించి బ్రాహ్మణులకు నివాసానికి ఇచ్చాను. అందమైన పవిత్రమైన నూరు అశ్వాలను దానంచేసినవారు పుణ్యాన్ని పొందినవారై దేవత లౌతారు. నేను వాహనాలు, గోవులు, బంగారం, ముఖ్యసంపదలు నిండి ఉన్న ఈ సమస్త భూమండలాన్ని బ్రాహ్మణులకు దానం చేశాను. పదిలక్షల గోవులను దానం చేశాను. సత్యంచేతనే భూమి, ఆకాశం ప్రకాశిస్తున్నాయి. సత్యం చేతనే మనుష్యలోకంలో అగ్ని ప్రజ్వలిస్తూంది. నేనెప్పుడూ వ్యర్థమైన వాక్యాన్ని ఒక్కటికూడా పలుకలేదు. సత్పురుషులు సత్యాన్నే పూజిస్తారు కదా! అష్టకా! నీకు, ప్రతర్దనుడికి, ఉషదశ్వని కొడుకు వసుమంతునికి కూడ నేను నిజమే

చెపుతున్నాను. ఈసమస్త లోకాలు, మునులు, దేవతలు, సత్యంచేతనే పూజింప దగినవారు. ఇది నా అభిప్రాయం. అసూయలేకుండా స్వర్గాన్ని జయించిన ఈ మన వృత్తాంతాన్ని యథాతథంగా బ్రాహ్మణశ్రేష్ఠులనుండి తెలుసుకొన్నవాడు మనలాగే పుణ్యలోకాలను పొందుతాడు.' వైశంపాయనుడిలా అన్నాడు - 'ఈ విధంగా మహాత్ముడైన యయాతి తన దౌహిత్రులవలన తరించాడు. అతడు శత్రువులకు జయింప శక్యం కానివాడు. ఈ భూమిపై తన మంచి కర్మలద్వారా ప్రసిద్ధి చెందాడు. గొప్ప ఉదార కర్మలు చేసిన అతడు భూమిని విడిచి స్వర్గాన్ని పొందాడు.

94. పూరువంశవర్ణనము.

జనమేజయుడిలా అన్నాడు - 'పూజ్యుడా! పూరువంశ విస్తారకులైన రాజులను గూర్చి వినాలనుకొంటున్నాను. వారు ఎంత బలం కలవారు? ఎటువంటివారు? ఎంతటి పరాక్రమం కలవారు? వారిలో శీలహీనుడు గాని, బలపరాక్రమాలు లేనివాడు గాని, సంతానహీనుడు గాని మునుపు లేడు కదా! తపోధనా! ప్రసిద్ధమైన చరిత్రం, విజ్ఞానమూ కల ఆ వంశ రాజుల చరిత్రను విస్తరంగా వినాలని ఉంది.' అపుడు వైశంపాయనుడిలా అన్నాడు - 'నాయనా! నీవు అడుగుతున్న పూర్వవంశకర్తలైన (వీరులై, ఇంద్రునితో సమానమైన పరాక్రమమూ, సర్వసంపదలూ, అన్ని శుభలక్షణాలూ కల ఆ) రాజులను గురించి చెపుతాను. పూరునకు పౌష్టి అనే భార్యయందు ప్రవీరుడు, ఈశ్వరుడు, రౌద్రాశ్వుడు అనే మహారథులైన ముగ్గురు పుత్రులు కలిగారు. వారిలో ప్రవీరుడు పూరువంశపరంపరను ముందుకు తీసికొనివెళ్లాడు. ఆ ప్రవీరుని వల్ల శూరసేనికి మనస్యువు పుట్టాడు. అతడు అందగాడు, సమర్థుడు, చతుస్సముద్రాలవరకూ వ్యాపించిన ఈ భూమిని పాలించినవాడు. మనస్యునకు సౌవీరియందు శక్తుడు, సంహననుడు, వాగ్మి - ముగ్గురు కొడుకులు జన్మించారు. వారంతా శూరులూ, మహారథులూ కూడ. పూరుని మూడో కొడుకు, మనస్వి అయిన రౌద్రాశ్వునకు మిశ్రకేశి అను అప్సరయందు అన్వగ్భానుడు మున్నగు పదిమంది కొడుకులు పుట్టారు. వారంతా మహాధనుర్ధరులు, యజ్ఞంచేసిన వారు, శూరులు, సంతానవంతులు, విద్యావంతులు, అస్త్రవిద్యలన్నీ తెలిసినవారు, ధర్మపరాయణులు. ఋచేయువు, కక్షేయువు, కృకణేయువు, స్థండిలేయువు, వనేయువు, మహాయశస్వి జలేయువు, బుద్ధిమంతుడూ అయిన తేజేయువు, ఇంద్రునితో సమానమైన పరాక్రమంగల సత్యేయువు, ధర్మేయువు, సంనతేయువు అను పదుగురు కుమారులు - అందులో పదోవాడు సంనతేయువు దేవతలతో సమానమైన పరాక్రమం గలవాడు. వారిలో అనాధృష్టి అని పేరుగల ఋచేయువు అందరికంటె విద్వాంసుడు, దేవతలలో

ఇంద్రుడిలా పరాక్రమం కలవాడూ. అతడు ఈ భూమండలానికి చక్రవర్తి అయ్యాడు. ఆ అనాధృష్టికి మతినారు డనే కొడుకున్నాడు. అతడు రాజసూయ, అశ్వమేధాలను చేసిన ధార్మికుడు. మతినారునికి అమితవిక్రములైన తంసువు, మహత్తు, అతిరథుడు, అనుపమతేజస్సుగల ద్రుహ్యువు అనే నలుగురు కొడుకులు కలిగారు. వారిలో మహాపరాక్రమవంతుడైన తంసువు వంశభారాన్ని వహించి వంశప్రతిష్ఠను ఇనుమడింపజేశాడు. భూమండలాన్నంతా జయించాడు.

పరాక్రమవంతుడైన తంసువుకు ఈలి అనే కొడుకు పుట్టాడు. జయశీలురలో శ్రేష్ఠుడైన ఆ ఈలి కూడ ఈ సమస్త భూమండలాన్ని జయించాడు. ఆ ఈలి రథంతరి యందు పంచభూతాలతో సమానమైన దుష్యంతుడు మొదలయిన ఐదుగురు కొడుకులను కన్నాడు. దుష్యంతుడు, శూరుడు, భీముడు, ప్రవసువు, వసువు అనే ఐదుగురిలో శ్రేష్ఠుడైన దుష్యంతుడు రాజ్యానికి రాజయ్యాడు. ఆ దుష్యంతునికి శకుంతలయందు భరతుడు జన్మించాడు. అతనివల్ల భరతవంశానికి గొప్పకీర్తి ఏర్పడింది. భరతుడు ముగ్గురు స్త్రీలయందు తొమ్మండుగురు కొడుకులను కన్నాడు. కాని వారు తనకు తగినట్లులేరని వారిని ఆదరించలేదు. అందువల్ల కోపించిన వారి తల్లులు ఆ తొమ్మండుగురు కొడుకుల్ని చంపేశారు. ఆ విధంగా భరతునికి కల్గిన పుత్రజననం వ్యర్థమయింది. అనంతరం భరతుడు గొప్పగొప్ప క్రతువులను చేశాడు. భరద్వాజుని అనుగ్రహం వల్ల భుమన్యువు అను కుమారుని పొందాడు. అనంతరం పూరువంశానికి ఆనందం కలిగించిన భరతుడు తాను పుత్రవంతుడ నయ్యానని గ్రహించి, తన కొడుకైన భుమన్యువును యౌవరాజ్యమందు అభిషేకించాడు. భుమన్యువుకు దివిరథుడు, సుహోత్రుడు, సుహోత, సుహవి, సుయాజువు, ఋచీకుడు అనే కొడుకులు పుష్కరిణియందు జన్మించారు. వారిలో జ్యేష్ఠుడైన సుహోత్రుడు రాజ్యాధికారాన్ని పొందాడు.

ఆ సుహోత్రుడు రాజసూయం, అశ్వమేధం మున్నగు అనేక యజ్ఞాలు చేశాడు. సాగరపర్యంతమున్న ఈ భూమండలాన్ని అంతా పరిపాలించాడు. ఏనుగులతో, గుర్రాలతో, అనేక రత్నరాశులతో ఉన్న ఈ భూమిని అనుభవించాడు. ధర్మంగా సుహోత్రుడు పరిపాలిస్తుండగా హస్తి, అశ్వ, రథ బలాలతో, మనుష్యసమూహాల భారంతో ఈ భూమి మునిగినట్లుగా క్రుంగింది. లక్షలకొలదీ మందిరాలతో, యూపస్తంభాలతో ఈ భూమి నిండింది. ఎల్లపుడూ వృద్ధి చెందే జనులతో, పంటలతో ప్రకాశించింది. రాజైన సుహోత్రునివల్ల ఐక్ష్వాకి(ఇక్షాకువంశానికి చెందిన స్త్రీ) అజమీఢుడు, సుమీఢుడు, పురుమీఢుడు అనే పుత్రులను కన్నది. భారతా! వారిలో పెద్దవాడైన అజమీఢుని వల్ల వారివంశం ప్రతిష్ఠితం అయింది. అతడు ముగ్గురు స్త్రీలయందు ఆరుగురు పుత్రుల్ని కన్నాడు. అతని భార్యలలో ధూమిని ఋక్షుని, నీలి దుష్యంత, పరమేష్ఠులను, కేశిని జహ్నువు, వ్రజనుడు, రూపి

అనే కుమారులను కన్నారు. రాజా! వారిలో దుష్యంత, పరమేష్ఠుల సంతానాన్ని పంచాలురని, అమితతేజస్వి అయిన జహ్నువు సంతానాన్ని కుశికులని అంటారు. ప్రజన రూపులకంటె పెద్దవాడైన బుక్షుడు రాజు అయ్యాడు. రాజా! ఆ బుక్షునికి సంవరణుడు అనే వంశకర్త అయిన కొడుకు కలిగాడు. బుక్షుని కుమారుడైన సంవరణుడు ఈ భూమిని పాలిస్తూండగా పెద్ద ప్రజానాశనం జరిగిందని విన్నాం. ఆకలి, మృత్యువు, అనావృష్టి, వ్యాధులు మున్నగు వాటిచే (రాష్ట్ర) దేశమంతా కష్టాలపాలై క్షీణించింది.

అదేసమయంలో పాంచాలరాజు తన చతురంగబలంతో భూమినంతా జయిస్తూ భరతవంశీయులసేనలను కూడా సంహరించి, పది అక్షౌహిణులసైన్యంతో యుద్ధంలో సంవరణుని జయించాడు. అనంతరం సంవరణుడు తన భార్యాపుత్రులతో, అమాత్యులతో, మిత్రులతో కలిసి భయంతో అక్కడ నుండి పారిపోయాడు. సింధు మహానదంతీరంలో చుట్టూ నది ప్రవహిస్తున్న ప్రదేశంలో, పర్వతానికి దగ్గర్లో, ఒక పొదరింట్లో, అతడు నివసించాడు. కొండ ప్రదేశాలను ఆశ్రయించి, ఆ భరతవంశీయులు చాలా సంవత్సరాలు నివసించారు. అలా నివసిస్తూండగా వేయి సంవత్సరాలు గడిచాయి. తరువాత వారిదగ్గరికి పూజ్యుడైన వసిష్ఠమహర్షి వచ్చాడు. అభ్యాగతునిగ వచ్చిన అతనిని ప్రయత్న పూర్వకంగా ఎదురేగి, నమస్కరించి భరతవంశీయులు అతనికి అర్ఘ్యం సమర్పించారు. సత్కారపూర్వకంగా అతనిని ఆసనంపై కూర్చోబెట్టి తమ విషయాన్ని నివేదించుకొని, "మేము రాజ్యంకోసం ప్రయత్నిస్తున్నాం. దానికి మీరే పురోహితులుగా ఉండాలి" అని కోరారు. వసిష్ఠుడు కూడ భరతవంశీయులకు తన అంగీకారాన్ని తెలిపాడు. సర్వక్షత్రసమూహానికి సామ్రాజ్యంలో పౌరవుని సంవరణుని అభిషేకించాడు. ఈ భూమండలంలోని రాజులలో సంవరణుడు శ్రేష్ఠుడు అని ప్రసిద్ధి. అతడు తన పూర్వికుడైన భరతుడున్న నగరంలోనే నివసించాడు. మరల రాజులందరిని జయించి వారినుండి కప్పాలను (పన్నులను) తీసికొని తనరాజ్యమందు యజ్ఞాలను చేశాడు. గొప్పగొప్ప యాగాలు చేసి భూరి దక్షిణలిచ్చాడు. ఆ తరువాత సూర్యవంశీయు రాలయిన తపతి సంవరణుని వల్ల 'కురు'ని కన్నది. ఆ కురుని ప్రజలందరు ధర్మజ్ఞుడని రాజుగా కోరుకొన్నారు. అతనిపేరు మీదుగానే ఈ భూమిమీద కురుజాంగలదేశం ప్రసిద్ధి చెందింది. ఆ కురురాజు తన తపస్సుచేత కురుక్షేత్రాన్ని పవిత్రంగా చేశాడు. అతనికి అశ్వవంతుడు, అభిష్యంతుడు, చైత్రరథుడు, ముని, జనమేజయుడు అనే ఐదుగురు కొడుకులున్నారు. ఈ ఐదుగురిని మనస్విని ఐన వాహిని కన్నది.

అశ్వవంతునికి మరొకపేరు అవిక్షితుడు. అతనికి పరిక్షిత్తు, శబలాశ్వుడు, ఆదిరాజు, విరాజుడు, మహాబలుడు, శాల్మలి, ఉచ్చైఃశ్రవసుడు, భంగకారుడు, జితారి అని ఎనమండుగురు కొడుకు లున్నారు. వీరివంశంలో మహారథులైన జనమేజయాదులు ఏడుగురు సద్గుణాలవల్ల

సత్కర్మలవల్ల ప్రసిద్ధినొందారు. పరిక్షిత్తుకు కక్షసేనుడు, ఉగ్రసేనుడు, చిత్రసేనుడు, ఇంద్రసేనుడు, సుషేణుడు, భీమసేనుడు అనే కుమారులున్నారు. వారంతా ధర్మార్థాలయందు పండితులు. జనమేజయుని కుమారులంతా మహాబలవంతులు, భూమిపై విఖ్యాతులుకూడ. వారిలో ధృతరాష్ట్రుడు మొదటివాడు. అతని తర్వాత పాండుడు, బాహ్లీకుడు, మహాతేజస్వి నిషధుడు, బలవంతుడైన జాంబూనదుడు, కుండోదరుడు, పదాతి, వసాతి ఉన్నారు. వారిలో వసాతి ఎనిమిదవ వాడు. వీరంతా ధర్మార్థకుశలులు. ప్రాణులన్నింటి హితాన్ని కోరుకొనేవారు. అనంతరం వీరిలో ధృతరాష్ట్రుడు రాజయ్యాడు. అతని కొడుకులు కుండికుడు, హస్తి, వితర్కుడు, క్రాథుడు, కుండినుడు, హవిఃశ్రవుడు, ఇంద్రాభుడు, భుమన్యువు, అపరాజితుడు అనువారు. వీరితోపాటు ప్రతీపుడు, ధర్మనేత్రుడు, సునేత్రుడు అనే ముగ్గురు కొడుకులు ప్రసిద్ధులైన వారున్నారు. వారిలో ప్రతీపుడు అసమానుడై ప్రసిద్ధి కెక్కాడు. భరతశ్రేష్ఠా! ప్రతీపునికి దేవాపి, శాంతనుడు, మహారథుడయిన బాహ్లీకుడు అను ముగ్గురు కుమారులు జన్మించారు. వారిలో దేవాపి ధర్మంద్వారా హితాన్ని పొందాలనే కోరికతో వనానికి వెళ్లాడు. శాంతనుడు రాజ్యాధికారానికి వచ్చాడు. బాహ్లీకుడు కూడా రాజయ్యాడు. భరతవంశంలో పుట్టిన ఎంతోమంది రాజులు బలవంతులు, దేవర్షిసమానులు, రాజశ్రేష్ఠులూను. ఐలవంశాన్ని వృద్ధిచేసిన దేవకల్పులు, మహారథులూ అయిన రాజులు ఇంకా ఇతరులెందరో మనువంశంలో జన్మించారు.

95. పూరు, భరత, పాండు వంశముల వర్ణనము.

రాజా! మునుపు వ్యాసుడు చెప్పగా విన్న మీవంశీయుల శుభప్రదమయిన జన్మవృత్తాంతాన్నంతా నేను నీకు చెపుతాను. సావధానంగా వినుము. దక్షుని వల్ల అదితి, అదితివల్ల వివస్వంతుడు, వివస్వంతునివల్ల మనువు, మనువువల్ల ఇల, ఇల యందు పురూరవుడు, పూరూరవునివల్ల ఆయువు, ఆయువు వల్ల నహుషుడు, నహుషుని వల్ల యయాతి కలిగారు. యయాతికి ఇద్దరు భార్యలున్నారు. వారిలో మొదటిది శుక్రాచార్యుని కూతురు దేవయాని, రెండవది వృషపర్వుని కూతురు శర్మిష్ఠ. దేవయాని యదువును, తుర్వసువును కన్నది. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ద్రుహ్యువు, అనువు, పూరులను కన్నది. యదు సంతానము యాదవులు, పూరుని సంతానము పౌరవులుగా ప్రసిద్ధిచెందారు. పూరుని భార్య కౌసల్య. ఆమె యందు జనమేజయుడు జన్మించాడు. అతడు మూడు అశ్వమేధయాగాలను, విశ్వజిద్యాగాన్ని చేసి వనానికి వెళ్లాడు. జనమేజయుడు మధువంశంలో పుట్టిన అనంతను వివాహం చేసుకొన్నాడు. అతనికి ఆమె యందు ప్రాచిన్వంతుడు జన్మించాడు. అతడు సూర్యోదయం లోపల తూర్పు దిక్కునంతా జయించాడు.

అందువల్లనే అతడు ప్రాచిన్వంతుడయ్యాడు. ప్రాచిన్వంతుడు యదువంశీయురాలైన అశ్మకి యందు సంయాతిని కన్నాడు. సంయాతికి దృషద్వంతుని కూతురయిన వరాంగిని యందు అహంయాతి జన్మించాడు. అహంయాతికి కృతవీర్యుని కూతురగు భానుమతిని యందు సార్వభౌము డనే కొడుకు పుట్టాడు. సార్వభౌమునకు కేకయరాజకుమారి సునందను యందు జయత్సేనుడు జన్మించాడు. జయత్సేనునికి విదర్భరాజకుమారి సుశ్రవ యందు అవాచీనుడు జన్మించాడు. అవాచీనునికి విదర్భరాజకుమారి మర్యాద యందు అరిహుడు జన్మించాడు. అరిహుడు అంగదేశపు రాజకుమారి యందు మహాభౌముడు జన్మించాడు. మహాభౌముడు ప్రసేనజిత్తుకూతురైన సుయజ్ఞయందు అయుతనాయి జన్మించాడు. అతడు పదివేల (అయుత)పురుష మేధాలను చేశాడు. అందువల్లనే అయుతనాయి అయ్యాడు. అయుతనాయికి పృథుశ్రవసుని కూతురు కామ యందు అక్రోధనుడు జన్మించాడు. అతనికి కళింగదేశపు కరంభయందు దేవాతిధి జన్మించాడు. దేవాతిథికి విదేహరాజకుమారి మర్యాదయందు అరిహుడు జన్మించాడు. అరిహునికి అంగదేశపురాజకుమారి సుదేవయందు ఋక్షుడనే పుత్రుడు జన్మించాడు. ఋక్షునికి తక్షకుని కూతురగు జ్వాల యందు మతినారు డను పుత్రుడు జన్మించాడు. మతినారుడు సరస్వతీ నదీతీరంలో గుణసమన్వితమైన పన్నెండు సంవత్సరాల సత్రాన్ని చేశాడు. సత్రం పూర్తయ్యాక సరస్వతి అతనిని సమీపించి భర్తగా కోరింది. అతనికి ఆమెయందు తంసు వనే పుత్రుడు జన్మించాడు. తంసువు కాలింగియందు ఈలి యనే కుమారుని కన్నాడు.

ఈలి రధంతరియందు దుష్యంతుడు మున్నగు ఐదుగురు కొడుకులను కన్నాడు. దుష్యంతుడు విశ్వామిత్రుని కూతురయిన శకుంతలను వివాహమాడాడు. అతనికి ఆమెయందు భరతుడు జన్మించాడు. ఇక్కడ ఆనువంశిక శ్లోకాలు రెండున్నాయి. 'తల్లి సంరక్షించే తోలుతిత్తివంటిది. ఎవరివల్ల జన్మించాడో ఆ తండ్రికే కొడుకౌతాడు పుట్టినవాడు . ఆ తండ్రే కొడుకుగా జన్మిస్తాడు. అందువల్ల దుష్యంతుని పుత్రునిగ భరించు. శకుంతలను అవమానించవద్దు. రాజా! గర్భాధానంచేసే తండ్రియే పుత్రునిరూపంలో జన్మిస్తాడు. పుత్రుడు తండ్రిని యమలోకంనుండి రక్షిస్తాడు. ఇతనిని గర్భాన ఉంచినవాడవు నీవు. శకుంతల నిజం పలికింది.'

అందువల్లనే ఇతడు భరతుడయ్యాడు. భరతుడు కాశీరాజుకు సర్వసేనుని కూతురు సునంద యందు భుమన్యువు జన్మించాడు. భుమన్యువుకు దాశార్హుని కూతురైన విజయయందు సుహోత్రుడు జన్మించాడు. సుహోత్రునికి ఇక్ష్వాకురాజకుమారి సువర్ణ యందు హస్తి జన్మించాడు. అతడే హస్తినపురాన్ని స్థాపించాడు. ఇందువల్లనే దానికి హస్తినపురమనే పేరువచ్చింది. హస్తికి త్రిగర్త రాజకుమారి యశోధర యందు వికుంఠనుడు

జన్మించాడు. వికుంఠనునికి దశార్హవంశీయురాలయిన సుదేవయందు అజమీఢుడు జన్మించాడు. అజమీఢునికి కైకేయి, గాంధారి, విశాల, ఋక్ష అనే భార్యలయందు నూట ఇరవై నలుగురు పుత్రులు జన్మించారు. వారంతా వేరువేరు వంశకర్తలగు రాజులయ్యారు. వారిలో సంవరణుడు కురువంశ ప్రవర్తకుడు.

సంవరణుడు సూర్యుని కూతురయిన తపతిని వివాహమాడాడు. అతనికి ఆమెయందు కురురాజు జన్మించాడు. కురునికి దాశార్హునికూతురు శుభాంగిని యందు విదూరుడు జన్మించాడు. విదూరునికి మధువంశీయురాలు సంప్రియ యందు అనశ్వుడు జన్మించాడు. అనశ్వునికి మగధదేశపు అమృత యందు పరిక్షిత్తు జన్మించాడు. పరిక్షిత్తుకు బాహుదరాజకుమారి సుయశ యందు భీమసేనుడు జన్మించాడు. భీమసేనునికి కేకయరాజకుమారి కైకేయి యందు ప్రతిశ్రవుడు జన్మించాడు.

ప్రతిశ్రవసుని మరోపేరు ప్రతీపుడు. అతడు శైబ్యరాజకుమారి సునందను వివాహమాడాడు. అతనికి ఆమెయందు దేవాపి, శాంతనుడు, బాహ్లీకుడనేవారు జన్మించారు. దేవాపి బాల్యంలోనే అరణ్యానికి వెళ్లాడు. శాంతనుడు రాజయ్యాడు. శాంతనుడు తన చేతులతో ఏముసలివానిని తాకినా అతడు మరల యువకుడై సుఖాన్ని పొందుతాడు. అందువల్లనే అతడు శాంతనుడయ్యాడు. శాంతనుడు భాగీరథియగు గంగను వివాహమాడాడు. అతనికి ఆమెయందు దేవవ్రతుడు జన్మించాడు. అతడే భీష్ముడుగా ప్రసిద్ధిచెందాడు. భీష్ముడు తండ్రికి ప్రియం చేయాలని సత్యవతితో తండ్రికి పెళ్ళిచేశాడు. ఆమెను తల్లిగా గౌరవించాడు. ఆమెను గంధకాలి అని కూడా అంటారు. ఆమెకు మునుపు కన్యగా ఉన్నపుడు పరాశరుని వల్ల ద్వైపాయనుడు జన్మించాడు. ఆమెయందు శాంతనునకు ఇద్దరు కుమారులు జన్మించారు. వారు విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు. వారింకా యౌవనవంతులు కాకుండానే గంధర్వుడు చిత్రాంగదుని చంపేశాడు. తరువాత విచిత్రవీర్యుడు రాజయ్యాడు. విచిత్రవీర్యుడు కౌసల్యకు జన్మించిన అంబిక, అంబాలికలను వివాహం చేసికొన్నాడు. వీరిద్దరూ కాశీరాజు కూతుళ్లు. విచిత్రవీర్యుడు సంతానంపొందకుండానే మరణించాడు. అనంతరం సత్యవతి భరతవంశం విచ్ఛిన్నం కారాదని భావించింది.

ఆమె ద్వైపాయనుడైన వ్యాసుని మనసా స్మరించింది. అతడు ఆమెకు ఎదుట నిలిచి 'ఏమిచేయగలను' అని అడిగాడు. ఆమె అతనితో ఇలా అంది - 'నీసోదరుడు విచిత్రవీర్యుడు సంతానంలేకుండానే స్వర్గానికి వెళ్లాడు. అతనికి నీవు చక్కని సంతానాన్ని కలిగించు.' అతడు అట్లే అని ధృతరాష్ట్రుడు, పాండుడు, విదురుడు అని ముగ్గురు పుత్రులను కలిగించాడు. వారిలో రాజైన ధృతరాష్ట్రునికి వ్యాసుని వరదానం వల్ల గాంధారియందు నూరుగురు పుత్రులు పుట్టారు. ఆ ధృతరాష్ట్రుని కుమారులలో దుర్యోధనుడు, దుః

శాసనుడు, వికర్ణుడు, చిత్రసేనుడనే నలుగురు ప్రధానమైనవారు. పాండురాజునకు పృథ అనుపేరు గల కుంతి, మాద్రి అను ఇద్దరు స్త్రీరత్నాలు భార్యలు. అటుపై పాండురాజు వనంలో వేటాడుతూ ఆడలేడితో లేడిరూపంలో సంగమిస్తున్న ఒక ఋషిని చూశాడు. అలా కామరసానంద తృప్తిచెందని ఆ మృగాన్ని బాణంతో చంపాడు. బాణంతో దెబ్బతిన్న ఆ ఋషి పాండురాజుతో ఇలా అన్నాడు - 'కామసుఖానందాన్ని పొందని కాముకక్రీడలో నున్న నన్ను ధర్మాన్ని ఆచరిస్తూ, కామసుఖానందం తెలిసిన నీవు కొట్టినందువల్ల నీవుకూడ ఇటువంటి మిథునక్రీడావస్థలో ఉండి, కామసుఖానందాన్ని పొందకుండానే త్వరలోనే మరణిస్తావు.' అప్పటినుండి వివర్ణభావం పొంది పాండురాజు ఋషి శాపం తప్పించుకొనేందుకు భార్యలను (కలియడం మానేశాడు) సమీపించలేదు. 'నా మృగయా చాపల్యంవల్ల నేనిటువంటి స్థితిని పొందాను. సంతానంలేనివానికి పరలోకాలు లేవని నేను విన్నాను. అందువల్ల నీవు నాకొరకు పుత్రులను కను' అని కుంతితో అన్నాడు. ఆమె అట్లే అని పుత్రులను కన్నది. ధర్మదేవుని వలన యుధిష్ఠిరుని, వాయువువల్ల భీమసేనుని, ఇంద్రుని వలన అర్జునుని పొందింది. ఆమెపట్ల ఆనందించినవాడై పాండురాజు ఇలా అన్నాడు - 'ఈనీ సవతి సంతానం లేనట్టిది. ఈమెకు కూడ మంచి సంతానాన్ని కలిగించు.' అలాగే అని కుంతి తనవిద్యను మాద్రికి ఇచ్చింది. అశ్వినీదేవతలవలన మాద్రి నకులసహదేవులను కన్నది. అలంకరించుకొని ఉన్న మాద్రిని చూసి పాండురాజు ప్రీతితో సమీపించాడు. ఆమెను తాకగానే తనువు చాలించాడు. చితాగ్నిలోనున్న అతనిని మాద్రి అనుగమించింది. కుంతితో ఇలా చెప్పింది- 'ఈ కవలల విషయంలో అప్రమత్తంగా ఉండు' అని.

అనంతరం తాపసులు పాండవులను కుంతితోబాటు హస్తినాపురం తీసుకువచ్చి భీష్మవిదురులకు విన్నవించారు. అన్నివర్ణాల వారికీ విన్నవించి, వారంతా చూస్తూండగానే తమ తపస్సుచే తాపసులు అంతర్ధాన మయ్యారు. పూజ్యులైన ఆ మునులవాక్యం విని, ఆకాశం నుండి పూలవాన పడింది. దేవదుందుభులు మ్రోగాయి. ధృతరాష్ట్రాదులచే ఆదరింపబడిన పాండవులు తండ్రికి ధర్మబద్ధంగా ఔర్ధ్వదైహిక క్రియలుచేశారు. అక్కడ నివసిస్తున్న పాండవులను బాల్యంనుండీ కూడ దుర్యోధనుడు సహింపలేకపోయాడు. పాప స్వభావంగల దుర్యోధనుడు తన రాక్షసబుద్ధిని అనుసరించి అనేక ఉపాయాలతో పాండవులను బయటికి పంపడానికి ప్రయత్నించాడు. భవిష్యత్తులో జరగవలసి ఉన్నది జరుగుతుంది. అందువల్లే పాండవులను పైకి పంపడానికి వారు సమర్థులు కాలేదు. అనంతరం ధృతరాష్ట్రుడు ఏదో నెపంతో వారణావతానికి పాండవులను పంపాడు. వారుకూడా వెళ్ళడానికి ఇష్టపడ్డారు. అక్కడ కూడా లక్కయింటిలో పాండవులను దహించడానికి ప్రయత్నించారు. కాని విదురుని సలహాతో ఆ పని వారికి శక్యంకాలేదు. అక్కడనుండి

దారిలో హిడింబుని చంపి ఏకచక్రపురానికి వెళ్లారు. అక్కడకూడ ఏకచక్రపురంలో బకుడనే రాక్షసుని చంపి, పాంచాల నగరానికి వెళ్లారు. అక్కడ ద్రౌపదిని భార్యగా పొందారు. తమదేశానికి తిరిగివచ్చారు. నేర్పరులైన పుత్రులను కన్నారు. యుధిష్ఠిరుడు ప్రతివింధ్యుని, భీమసేనుడు సుతసోముని, అర్జునుడు శ్రుతకీర్తిని, నకులుడు శతానీకుని, సహదేవుడు శ్రుతకర్మను కన్నారు.

యుధిష్ఠిరుడు శిబిదేశపురాజయిన గోవాసనుని కూతురు దేవికను స్వయంవరంలో పొందాడు. ఆమెయందు అతనికి యౌధేయుడనే పుత్రుడు పుట్టాడు. భీమసేనుడు కూడ కాశీలో పరాక్రమంతో పొందదగిన బలంధర అనే ఆమెను వివాహం చేసికొన్నాడు. ఆమె యందు అతనికి సర్వగు డనే పుత్రుడు పుట్టాడు. అర్జునుడు ద్వారవతికి వెళ్ళి మధురభాషిణి, వాసుదేవుని సోదరి అయిన సుభద్రను వివాహమాడి, క్షేమంగా తనదేశానికి తిరిగివచ్చాడు. ఆమెయందు మిక్కిలి గుణసంపన్నుడు, వాసుదేవునికి ఇష్టుడూ అయిన అభిమన్యు డనే పుత్రుని కన్నాడు. నకులుడు చేదిదేశపు రాకుమారి కరేణుమతిని వివాహం చేసికొన్నాడు. ఆమె యందు నిరమిత్రు డనే పుత్రుని కన్నాడు. సహదేవుడు కూడ మద్రరాజు ద్యుతిమంతుని కూతురు విజయను స్వయంవరంలో వివాహమాడాడు. ఆమెయందు సుహోత్రు డనే కుమారుడు పుట్టాడు. భీమసేనుడు ఇంతకు మునుపే హిడింబయందు ఘటోత్కచుడనే పుత్రుని కన్నాడు. ఈ పదకొండుగురు పాండవుల పుత్రులు, వీరిలో అభిమన్యుడు (కురు)వంశ కారకుడు. ఆ అభిమన్యుడు విరాటరాజు కూతురయిన ఉత్తరను వివాహం చేసికొన్నాడు. ఆమెయందు అతనికి మృతశిశువు జన్మించింది. పురుషోత్తముడైన వాసుదేవుని ఆదేశానుసారం కుంతి ఆశిశువును తన ఒడిలోనికి తీసికొంది. శ్రీకృష్ణుడు 'ఆరునెలల గర్భముగు ఈ శిశువును నేను బ్రతికిస్తా'నని ఆమెను ఊరడించాడు. బలవీర్యపరాక్రమాలు కలుగని, అకాలంలో పుట్టి, అస్త్రాగ్నిచే దహింపబడిన ఆ శిశువును శ్రీకృష్ణుడు తనతేజస్సుచే బ్రతికించాడు. అలా అతనిని బ్రతికించి ఇలా చెప్పాడు- 'క్షీణించిన వంశంలో జన్మించిన ఇతడు పరిక్షిత్తు అనబడతాడు.' పరిక్షిత్తు నీతల్లి ఐన మాద్రవతిని వివాహమాడాడు. అతని కామెయందు జనమేజయుడవైన నీవు జన్మించావు. నీకు వపుష్టమయందు శతానీకుడు, శంకుకర్ణుడనే ఇరువురు పుత్రులు పుట్టారు. శతానీకునకు వైదేహియందు అశ్వమేధదత్తుడను కొడుకు జన్మించాడు. ఇది పూరునివంశం, పాండవుల వంశం కూడ చెప్పబడింది. ధన్యం, పుణ్యం, మిక్కిలి పవిత్రం అయిన ఈ వృత్తాంతం నియమవంతులైన బ్రాహ్మణులచేత, స్వధర్మనిరతులూ ప్రజాపాలనతత్పరులూ అయిన క్షత్రియులచేత, వైశ్యులచేతనూ ఎల్లపుడూ వినదగింది. త్రివర్ణాలను సేవించే శ్రద్ధగల శూద్రులచేతనూ ఇది తెలియదగింది. పవిత్రమైన ఈ

ఇతిహాసాన్ని పూర్తిగా ఇతరులకు వినిపించేవారు, ఇంద్రియనిగ్రహంకల్గి, మాత్సర్యం లేక స్నేహశీలులై, వేదపరాయణులవుతారు. ఈ ఇతిహాసాన్ని విన్నవారు కూడా స్వర్గాన్ని, పుణ్యలోకాలను పొందుతారు. వారు దేవబ్రాహ్మణమనుష్యులకు ఎల్లపుడు గౌరవింపదగినవారు, పూజింపదగినవారూ కూడ. పూజ్యుడగు వ్యాసుడు చెప్పిన ఈభారతం మిక్కిలిగొప్పది, పవిత్రమైనదీ. చతుర్వర్ణాలవారూ మత్సరం లేనివారై, స్నేహశీలురై, వేదసంపన్నులై ఈ భారతాన్ని వింటే వారుకూడ స్వర్గాన్ని జయించినవా రౌతారు. వారు పుణ్యాత్ములు, కృతాకృతాలలో దుఃఖంలేనివారు అవుతారు. వేదాలతో సమానమైంది, పవిత్రమైంది, ఉత్తమమైంది, ధన్యమైంది, కీర్తినికలిగించేది, ఆయువునిచ్చేది అయిన ఈ భారతాన్ని మనోనిగ్రహంతో వినాలి.

96. మహాభిష, వసుశాప వృత్తాంతము.

ఇక్ష్వాకుల వంశంలో పుట్టి మహాభిషుడని ప్రసిద్ధికెక్కిన రాజు ఒకడు ఉండేవాడు. అతడు సత్యవాది, సత్యపరాక్రముడు కూడా. ఆ రాజు వేయి అశ్వమేధయాగాలను, వంద రాజసూయ యాగాలనూ చేసి, దేవేంద్రుని తృప్తిపరచాడు. ఆ పై స్వర్గాన్ని పొందాడు. తరువాత ఒకానొక సమయంలో దేవతలందరూ బ్రహ్మను సేవింపదలచి ఆయనను సమీపించారు. అక్కడ ఎందరో రాజర్షులూ, ఇక్ష్వాకు వంశస్థుడైన మహాభిషుడు కూడా ఉన్నారు. అదే సమయంలో నదీమతల్లి అయిన గంగ బ్రహ్మ సన్నిధికి వచ్చింది.గాలి విసురు వల్ల చంద్రకాంతి గల ఆ గంగాదేవి కట్టుబట్ట పైకి లేచింది. అది గమనించి దేవతలందరూ వెంటనే తలలు వంచుకొన్నారు. రాజర్షి అయిన మహాభిషుడు కొంకు లేకుండా ఆ నదివైపు చూస్తూనే ఉన్నాడు. అప్పుడు బ్రహ్మ మహాభిషుని అన్యధా భావించి ఇలా శపించాడు. "దుర్బుద్ధీ! నీవు మానవలోకంలో జన్మించి మరల పుణ్యలోకాలను పొందగలవు. ఇక్కడ నీ మనస్సును కొల్లగొట్టిన గంగానదియే మానవ లోకంలో నీకు ప్రతికూలంగా ప్రవరిస్తుంది. నీకు గంగపై కోపం కలిగినప్పుడే నీకు శాపవిమోచనం కలుగుతుంది." అప్పుడు మహాభిషమహారాజు బాగా ఆలోచించి తపస్సంపన్నులయిన రాజులను పరిశీలించి అధికతేజస్వి అయిన ప్రతీపమహారాజును తనకు తగిన తండ్రిగా ఎన్నుకొన్నాడు. నదీలలామ అయిన గంగ ధైర్యాన్ని కోల్పోయిన మహాభిషుని గమనించి మనస్సులో ఆయన్నే తలపోస్తూ నిష్క్రమించింది. మార్గమధ్యంలో ఆ గంగ వసువులను చూచింది. వారు స్వర్గంనుండి క్రిందకు దిగుతున్నారు. దిగులుపడి ఉన్నారు. అటువంటి వారిని చూచి ఆ గంగ ఇలా అడిగింది. "ఏమిది ? మీ దివ్యరూపాన్ని ఎలా కోల్పోయారు ? దేవతలంతా క్షేమమే గదా!" అంది. ఆ వసువులు ఆమెతో ఇలా అన్నారు - "మహానదీ !

వసిష్ఠమహాముని మేము చేసిన చిన్న తప్పుతో కోపించి మమ్ముల నందరిని శపించాడు. ఒకనాడు వసిష్ఠుడు చెట్టుచాటున కూర్చుని సంధ్యోపాసన చేస్తుండగా మేమంతా ఆయనను అతిక్రమించి వెళ్ళాం. దానితో కోపించిన ఆయన మానవులుగా పుట్టండని మమ్ము శపించాడు. ఆ బ్రహ్మవేత్త మాటను మరల్చటానికి వీలులేదు. కాబట్టి నీవు మానవస్త్రీగా జన్మించి వసువులమయిన మాకు జన్మ నివ్వవలసినది. కళ్యాణీ! మేము మానవస్త్రీల కడుపులో ప్రవేశించలేము"-వసువులు అలా అంటే గంగానది 'అలాగే' అని అంగీకరించింది.

గంగ ఇలా అడిగింది - 'మానవులలో మీకు తండ్రి కాదగినంత గొప్పవాడెవడు ?' వసువులు ఇలా అన్నారు - 'ప్రతీపమహారాజ కుమారుడు శాంతనుడు లోకప్రసిద్ధుడు అవుతాడు. అతడు మానవలోకంలో మాకు తండ్రి కాదగినవాడు.' గంగ ఇలా అన్నది - 'అనఘులారా! దేవతలారా! మీరు చెప్పిన రీతిగానే నేనూ అభిప్రాయపడుతున్నాను. ఆ మహారాజు మక్కువను తీర్చి మీ కోరికను కూడా నెరవేరుస్తాను.' వసువు లిలా అన్నారు- 'త్రిలోకగామినీ! గంగా! మేము నీ కడుపున పడి జన్మించగానే మమ్ములను నీటిలో పడవేయాలి. దానితో మేము స్వల్పావధిలోనే నిష్కృతి పొందగలుగుతాము.' గంగా ఇలా అన్నది - 'అలాగే చేస్తాను. కానీ ఆ రాజు సంతానోత్పత్తికై నాతో పెనవేసికొన్న బంధం వ్యర్థం కారాదు. కాబట్టి ఆయనకు ఒక్క కొడుకైనా మిగలాలి.' వసువులిలా అన్నారు - మేమంతా మామా తేజస్సులలోని ఎనిమిదవ భాగాన్ని ధారవోస్తాము. ఆ తేజస్సుతో నీ కొక కొడుకు కలుగుతాడు. ఆతడు ఆరాజు కోరిక నెరవేర్చగలడు. అయితే మానవలోకంలో అతనికి మాత్రం సంతానముండదు. కాబట్టి పరాక్రమవంతుడైన ఆ నీ కుమారుడు మాత్రం సంతానహీను డవుతాడు.' ఈ విధంగా గంగానదితో ఒప్పుదల చేసికొని వసువులంతా ఆనందించి, వెంటనే వారి ఇష్టానుసారంగా వెళ్ళిపోయారు.

97. శాంతనూపాఖ్యానము.

ప్రతీపుడనే మహారాజు ఉండేవాడు. ఆయన ఎల్లప్పుడూ సర్వప్రాణుల హితంపై ఆసక్తిగలిగి ఉండేవాడు. ఆయన గంగాద్వారంలో నివసిస్తూ ఎన్నో సంవత్సరాలు జపిస్తూ కూర్చున్నాడు. అప్పుడు మనస్విని అయిన గంగానది అందమూ, సద్గుణాలూ గల స్త్రీరూపాన్ని ధరించి ఆ నీటినుండి వెలువడింది. ఆమె రూపం దివ్యమై, ఆస పడదగినదై ఉంది. ఆ శుభానన అధ్యయనం చేస్తున్న ఆ రాజర్షిని సమీపించి మద్దిమానువలె కనిపిస్తున్న ఆయన కుడితొడపై కూర్చున్నది. ప్రతీపమహారాజు "కళ్యాణీ! నీకేమి చేయగలను ? నీకోరిక ఏమి?" అని యశస్విని అయిన ఆ కాంతతో అన్నాడు. ఆమె ఇలా అన్నది - రాజా! నిన్ను నేను కోరుతున్నాను. నీపై నాకనురాగమున్నది. నన్ను పరిగ్రహించు. కాముక

అయిన స్త్రీని తిరస్కరించడాన్ని సత్పురుషులు గర్హిస్తారు.' ప్రతీపుడిలా అన్నాడు- 'సుందరీ! నేను పరకాంతను కామించలేను. సవర్ణురాలు కాని కాంతను కూడా నేను కామించలేను. ఇది ధర్మబద్ధమయిన నా వ్రతం.' ఆమె ఇలా అన్నది - 'నేను అమంగళహేతువును కాను. పొందదగని దానను కాను. ఏరీతిగానూ మాటపడిన దాననుకూడా కాను. నీపై అనురక్తిగల దివ్యసుందర కాంతను నేను. నన్ను పరిగ్రహించు.' ప్రతీపుడిలా అన్నాడు- 'ఏ కోరికతో నీవు నన్ను ఒత్తిడి చేస్తున్నావో ఆ కోరికను నీవే నిరాకరింపజేసికొన్నావు. నీ కోరికను నేను అంగీకరిస్తే ధర్మహాని నన్ను నాశనం చేస్తుంది. సుందరీ! నీవు నా కుడితొడపై కూర్చొని నన్ను కౌగిలించుకున్నావు. పిరికిదానా! కుడితొడపై కూర్చునే అవకాశం సంతానానికి, కోడలుకు మాత్రమే ఉంటుందని గ్రహించు. సుందరీ! ఎడమతొడ కామినులు ఆరోహించదగినది. నీవు దానిని ఆశ్రయించలేదు. కాబట్టి నీతో నేను కాముకుడనై ప్రవర్తించలేను. సుందరీ! నీవు నాకు కోడలివి కమ్ము. నాకుమారుని కొరకు నిన్ను వరిస్తున్నాను. నీవు నా కుడితొడనే ఆశ్రయించావు కాబట్టి కోడలు కాదగినదానవు.' ఆ కాంత ఇలా అన్నది - 'ధర్మాత్మా! అలాగే కానీ. నేను నీ కుమారుని కలుస్తాను. నీ మీదగల భక్తిభావం వలన నేను ప్రసిద్ధమయిన భరతవంశాన్ని సేవిస్తాను. భూలోకమందలి రాజులందరకు తమరే ఆశ్రయింపదగినవారు. వందల సంవత్సరాలలోనైనా మీ గుణాలను నేను వర్ణించలేను. తమ వంశంలోని రాజులందరూ మంచితనంలో పేరుకెక్కిన వారు. ధర్మాత్మా! నేను ఒక నియమానికి లోబడి తమకు కోడలిని కాగలను. ప్రభూ! నా ప్రవర్తనను తమ కుమారుడు అంగీకరించాలి. ఎప్పుడూ కాదనకూడదు. ఈ నియమానికి అంగీకరిస్తే తమ కుమారునిపై అనురాగాన్ని పెంచుకొంటాను. తమ కుమారుడు కూడా పుణ్యాత్ములు, ప్రియులు అయిన పుత్రులద్వారా స్వర్గలోకాన్ని పొందగలుగుతాడు.'

దానికి రాజు అంగీకరించాడు. ఆమె అక్కడే అదృశ్యమయింది. తరువాత పుత్రుని పుట్టుకకై నిరీక్షిస్తున్న ప్రతీపమహారాజుకు ఆ విషయం గుర్తుకువచ్చింది. కురునందనా! ఆ రోజుల్లో క్షత్రియశ్రేష్ఠుడైన ప్రతీపుడు తన భార్యను వెంటబెట్టుకొని, పుత్రులకోసం తపస్సు చేయనారంభించాడు.

(ప్రతీపుని భార్య గర్భవతి అయినది. శరత్కాల శుక్లపక్ష చంద్రునివలె ఆ గర్భం వృద్ధిచెందింది. ఆపై పదవ నెలలో ప్రతీపుని పట్టమహిషి దేవతలతో సమానుడైన కుమారుని ప్రసవించింది అతడు సూర్యతేజస్సుగలవాడు. ఆ వృద్ధరాజదంపతులకు ముందు చెప్పిన మహాభిషమహారాజే కుమారుడయ్యాడు. శాంతుడైన తండ్రికి పుట్టినవాడు కాబట్టి ఆ కొడుకు శాంతనుడైనాడు. ప్రతీపమహారాజు విప్రులద్వారా వేదోక్తపద్ధతిలో కుమారునకు జాతకర్మాది సంస్కారాలు జరిపించాడు. ఆ తరువాత విప్రులందరూ కలిసి వేదోక్తరీతిగా శాంతనునికి నామకరణ సంస్కారం కూడా జరిపించారు. ఆపై ఎదిగిన ఆ

శాంతనుడు ధర్మవేత్తలలో శ్రేష్ఠుడై పరమనిష్ఠతో లోకపాలన చేయసాగాడు. ధనుర్వేదంలో, వేదంలో పరమోన్నత స్థితికి చేరాడు. వాగ్మి అయిన ఆ శాంతనుడు యౌవనదశకు చేరుకొన్నాడు.)

కురుసత్తము డయిన ఆ శాంతనుడు తన సత్కర్మలతో సంపాదించిన అక్షయపుణ్యలోకాలను తలపోస్తూ పుణ్యకర్మలనే చేయసాగాడు. యౌవనంలో ఉన్న శాంతనుని ప్రతీపమహారాజు ఇలా ఆదేశించాడు. "కుమారా! గతంలో ఒక దివ్యకాంత నా దగ్గరకు వచ్చింది. నీ అభివృద్ధికోసమే ఆమె వచ్చింది. ఆ దివ్యకాంత ఎప్పుడైనా ఏకాంతంగా పుత్రకామనతో నిన్ను సమీపిస్తే "నీవెవరు? ఎవరి కుమార్తెవు" వంటి ప్రశ్నలను నీవు అడగకూడదు. ఆమె ఏ పని చేసినా నీవు దానిని ప్రశ్నించరాదు. ఆమె కోరితే నా ఆదేశంగా భావించి ఆమెనే నీవు భార్యగా స్వీకరించాలి" అని ప్రతీపుడు కుమారునితో అన్నాడు. ప్రతీపమహారాజు శాంతనుని ఈ విధంగా ఆదేశించి తన రాజ్యానికి రాజుగా పట్టాభిషేకం చేసి తాను అరణ్యానికి వెళ్ళిపోయాడు. ధీమంతుడయిన శాంతనుమహారాజు దేవేంద్రుని వంటి శోభ గలవాడు. ఆ శాంతనుడు వేటమీది ఆసక్తితో అరణ్యంలో తిరుగసాగాడు. ఆ క్రూరమృగాలనూ, అడవిదున్నలనూ సంహరిస్తూ సిద్ధచారణులు సేవించే గంగాతీరంలో ఒంటరిగా తిరుగసాగాడు. ఆ శాంతనుడు ఒకనాడు ఉత్తమకాంతను చూచాడు. ఆమె తన శరీరకాంతితో మరొకలక్ష్మివలె వెలిగిపోతూ కనిపిస్తోంది. మచ్చలేని అందంగల స్త్రీ ఆమె. చక్కని పలువరస గలది. దివ్యమైన ఆభరణాలు అలంకరించుకొని ఉన్నది. సన్నని వలువలను ధరించి ఉన్నది. పద్మంలోపలి భాగం వలె చక్కని శోభగలిగి ఉన్నది. ఆమెను చూచి ఆ రూపసంపదకు ఆశ్చర్యపడి రాజు తన కళ్ళతో ఆమెను త్రాగుతూ కూడా తనివిని పొందలేకపోయాడు. ఆమె కూడా గొప్పతేజస్సుతో సంచరిస్తున్న ఆ రాజుమీది మక్కువతో సౌహార్దాన్ని పొంది, ఆయనను ఎంతచూచినా తృప్తి పొందలేకపోయింది. అపుడు శాంతను మహారాజు మధురవచనాలతో ఆమెను పలుకరించి "సుమధ్యమా! నీవు దేవకాంతవా? దానవ కాంతవా? గంధర్వవనితవా? అప్సరసవా? యక్షకాంతవా ? నాగకాంతవా? మానవస్త్రీవా? దేవతల సౌందర్యం వంటి శోభగల నిన్ను యాచిస్తున్నాను. నా భార్యవు కావలసినది" అని అన్నాడు.

98. భీష్ముని పుట్టుక.

మందహాసపూర్వకంగా శాంతనుడు పలికిన ఆ మధురవచనాలను విని గంగ శాంతనుని అభివృద్ధికై ఆయన దగ్గరకు వచ్చింది. ఒడ్డున సంచరిస్తున్న ఆ రాజశ్రేష్ఠుని చూచి ఆమె వసువుల కిచ్చిన మాటను గుర్తు తెచ్చుకొన్నది. ప్రతీపుని మాటను కూడా తలచుకొన్నది. దానితో తగిన సమయంగా భావించి వసువుల శాపం ప్రేరణ కాగా

సంతానార్థివియై శాంతనురాజును సమీపించి తన మాటలతో ఆ నరపాలుని మనస్సును ఆహ్లాదపరుస్తూ ఇలా అన్నది - 'రాజా! నేను నీకు పట్టమహిషినై నీఅధీనంలో ఉంటాను. అయితే నేను శుభమైనా, అశుభమైనా సరే ఏ పని చేసినా నన్ను అడ్డగించకూడదు. నాకు కష్టం కలిగేటట్టు మాటాడకూడదు. ఇలా నడుచుకొన్నప్పుడే నేను నీ దగ్గర ఉంటాను. నన్ను అడ్డగించినా, అప్రియంగా మాట్లాడినా నిస్సందేహంగా నిన్ను విడిచి వెళతాను.' "అలాగే" అని శాంతనుడు అనగానే ఆమె ఆ రాజును భర్తగా పొంది పరమానందాన్ని పొందింది. ఆ గంగాదేవిని రథంపై ఎక్కించుకొని ఆమెతో కూడా శాంతనుడు వెళ్లిపోయాడు. ఆమె సాక్షాత్తు మరొక లక్ష్మివలె ఆ శాంతనుమహారాజును అనుసరించింది. శాంతనుడు ఆమెను పొంది జితేంద్రియుడై ఆమెతో స్వేచ్ఛగా సుఖించాడు. ఆమెను ప్రశ్నించరాదు కాబట్టి ఎప్పుడూ ఏమీ అనలేదు. ఆ గంగ నడవడితోనూ, రూప-ఔదార్య గుణాలతోనూ, ఏకాంతంగా ఆమె చేస్తున్న పరిచర్యలతోనూ ఆ శాంతనురాజు సంతోషించాడు. ముల్లోకాలలోను సంచరించే ఆ గంగ దివ్యసుందర రూపంతో మానవశరీరాన్ని ధరించి, దేవేంద్రుని వంటి శోభగలిగి, సౌభాగ్యకారణంగా సకలకామాలను అనుభవిస్తున్న ఆ నరశ్రేష్ఠుడైన శాంతనునకు భార్యగా లభించింది. ఆమె హావభావాలతో కూడియున్న సంభోగచాతుర్య, స్నేహచాతుర్యాలతో ఆ రాజును ఆనందింపజేసింది. ఆ రాజుకూడా దానికి ప్రతిగా ఆమె నలాగే ఆనందింపజేశాడు. ఆ రాజు రతిమీద ఆసక్తి గలిగి ఉండటం వలన, ఉత్తమ స్త్రీ- గుణాలకు వశమైపోవటం వలన గడచిపోతున్న సంవత్సరాలనూ, ఋతువులనూ, మాసాలనూ గమనించనేలేదు. తన ఇచ్ఛ వచ్చినట్లుగా ఆమెతో సుఖిస్తున్న ఆ రాజు ఆమెయందు దేవతలతో సమానమైన ఎనిమిదిమంది కొడుకులను కన్నాడు. పుట్టిన ప్రతిబిడ్డను ఆమె నీటిలో పడవేయసాగింది. "నిన్ను నేను ఆనందింప జేస్తున్నాను" అంటూ గంగా ప్రవాహంలో ముంచి వేస్తున్నది. అయితే అది అప్పుడు ఆ శాంతనుమహారాజుకు నచ్చలేదు. కానీ వదలి వెళ్లుతుందన్న భయంతో ఆ రాజు ఆమెను ఏమీ అనలేదు.

ఎనిమిదవ కుమారుడు పుట్టినప్పుడు దుఃఖార్తుడైన శాంతనుమహారాజు తన కుమారుని బ్రతికించు కోవాలని భావించి నవ్వుతూ ఆమెతో ఇలా అన్నాడు. 'చంపవద్దు. నీవు ఎవరి కూతురువు? పిల్లలనెందుకు చంపుతున్నావు? పుత్రఘాతినీ! కుమారులను చంపి నిందార్హమైన పెద్ద పాపాన్ని పొందుతున్నావు.' ఆ స్త్రీ ఇలా అన్నది - 'పుత్రులను కోరుతున్న రాజా! పుత్రవంతులలో నీవు గొప్పవాడవు. నేను ఈ నీ కొడుకును చంపను. కానీ నేను ముందు చెప్పిన నియమం మేరకు నేనిక్కడ నివసించే సమయం ముగిసిపోయింది. నేను జహ్నుమహర్షి కూతురును. గంగను. మహర్షులు నన్ను సేవిస్తూ ఉంటారు. దేవతల కార్యసిద్ధికోసం నేను నీతో కలిసి జీవించాను. ఈ ఎనిమిదిమంది దివ్యులయిన

వసువులు మహాతేజోమూర్తులూ, మహాత్ములూ. వసిష్ఠుని శాపం వలన మానవరూపాలను పొందారు. వారికి తండ్రి కాగల అర్హత ఈ లోకంలో నీకు తప్ప మరొకరికి లేదు. వారిని గర్భంలో ధరించటానికి తగిన మానవకాంత నావంటిది ఈ లోకంలో ఎవరూ లేదు. కాబట్టి వారికి తల్లికావలసినందున నేను మానవత్వాన్ని పొందాను. నీవు ఎనిమిదిమంది వసువులను కని అక్షయపుణ్యలోకాలను పొందగలిగావు. వసువులు ఒక నియమాన్ని పెట్టారు. దానికి నేను అంగీకరించాను. పుట్టినవాడిని పుట్టినట్టు మానవ జన్మనుండి విముక్తి కలిగించాలన్నది ఆ నియమం. అందువలన వారు ఆ వసిష్ఠుని శాపం నుండి విముక్తు లయ్యారు. నీకు మేలు కలుగుతుంది. నేను వెళ్తున్నాను. మహాదీక్షాదక్షుడైన ఈ కుమారుని పెంచుకో.

(ఈ నీ కుమారుడు ఆ వసువుల పరాక్రమంతో సంపన్నుడై నీ వంశానందం కోసం పుట్టినవాడు. ఈ బాలుడు పరాక్రమంలో ఇతరులనందరినీ మించిపోగలవాడు. సందేహమే లేదు.)

ఈ బాలుడు వసువులందరి అంశలతో పుట్టినవాడు. రాజుకొడుకు ఒక్కడైనా మిగలాలని నేను వసువులను ప్రార్థించాను. ఈ బాలుడు నా కుమారుడు. అందుకే గంగాదత్తుడని పేరుపెట్టాలి.'

99. వసిష్ఠోపాఖ్యానము.

శాంతనుడిలా అన్నాడు - ఆ వసిష్ఠుడెవరు ? ఆయన శాపం వలన మానవులుగా జన్మించవలసినంత తప్పు ఏం చేశారు ఈ వసువులు ? నీవు నాకిచ్చిన ఈ కుమారుడు చేసిన తప్పేమిటి ? ఏ తప్పు చేసినందువలన ఈయన మానవుడుగా జీవించబోతున్నాడు ? జాహ్నవీ ! సమస్తలోకాలకూ అధీశ్వరులయిన ఈ వసువులు మానవజాతిలో ఎలా పుట్టారు? అదంతా నాకు చెప్పు.' తన భర్త శాంతనుడు అలా అడిగిన తర్వాత గంగాదేవి ఆ రాజుకు ఇలా చెప్పింది. భరతశ్రేష్ఠా! పూర్వం వరుణుడు తన కుమారునిగా స్వీకరించిన వాడే వసిష్ఠమహర్షి. ఆయనకే ఆపవుడని కూడా ప్రసిద్ధి. మేరు పర్వతం ప్రక్కన ఆయన ఆశ్రమ ముండేది. అది పవిత్రమైనది. జంతువులతో, పక్షులతో నిండినది. అది అన్ని ఋతువులలోని పూలతో విలసిల్లేది రుచికరాలయిన పండ్లు, మూలాలు, నీరు సమృద్ధిగా గల అక్కడి వనంలో ఆ వసిష్ఠమహర్షి తపస్సు చేసేవాడు. భరతశ్రేష్ఠా! సురభి అనే పేరుగల దక్షుని కుమార్తె కశ్యపుని వలన ఒక ఆవుకు జన్మనిచ్చింది. ఆ ఆవు లోకానుగ్రహం కోసం జన్మించింది. కోరికల నన్నింటిని తీర్చగలవాటిలో శ్రేష్ఠమయినది. ధర్మాత్ముడైన వసిష్ఠమహర్షి హోమధేనువుగా ఆ ఆవును స్వీకరించాడు. పవిత్రమై, రమణీయమై మునులచే సేవింపబడే ఆ వసిష్ఠాశ్రమంలో ఆ ఆవు నివసిస్తూ నిర్భయంగా సంచరించేది. ఒకసారి

పృథువు మొదలయిన ఆ దివ్యవసువు లందరూ దేవ, ముని సేవితమైన ఆ ఆశ్రమానికి వచ్చారు. వారు వారి వారి భార్యలతో కలిసి ఆ ఆశ్రమ ప్రాంతమంతా తిరుగుతూ అందమైన ఆ పర్వతాలలో, వనాలలో క్రీడించసాగారు.

ఆ వసువులలో ఒకరి ఇల్లాలు ఆ ఆశ్రమవనంలో తిరుగుతూ ఆ ఆవును చూచింది. అన్ని కోరికలనూ తీర్చటంలో అగ్రగణ్య అయిన ఆ నందినిని(ఆ ఆవును) చూచి, దాని శీలసంపదతో ఆ వసుపత్ని ఆశ్చర్యచకిత అయింది. వసుపత్ని ఆ ఆవును ద్యోనామకుడైన తన భర్తకు చూపించింది. మంచి గిట్టలు, సలక్షణమైన తోక, పాలతోనిండిన పొదుగు మొదలైన సర్వశుభలక్షణాలతో, ఉత్తమమయిన నడవడితో ఆ నందిని అందగిస్తోంది. ద్యోవు ఆ ఆవును చూచి దాని రూప గుణాలను వివరిస్తూ"దేవీ! నల్లని కన్నులున్న ఈ ఉత్తమధేనువు ఈ ఆశ్రమాధిపతి అయిన వసిష్ఠమహర్షిది. దీని పాలను త్రాగిన మానవుడు స్థిరయౌవనంతో పదివేలసంవత్సరాలు జీవించగలడు" అని తెలియజెప్పాడు. ఆ మాటలు విని అందమైన ఆ వసుపత్ని తేజోమూర్తి అయిన భర్తతో ఈ విధంగా అన్నది - 'మానవలోకంలో నానెచ్చెలి అయిన ఒక రాజకుమారి ఉన్నది. ఆమె పేరు జితవతి. సత్యసంధుడూ, ధీమంతుడూ అయిన ఉశీనరరాజర్షి కుమార్తె ఆమె. యువతి, అందమైనది. అందంలో మానవలోకంలో ఖ్యాతి గడించింది. ఆమెకోసం దూడతో కూడా ఈ ఆవును తీసుకోవాలని నా కోరిక. వెంటనే ఆ ధేనువును తీసికొనిరండి. దానిపాలను త్రాగి, నానెచ్చెలి తానొక్కతే మానవులలో జరారోగాలు లేని వ్యక్తి అవుతుంది. మహాత్మా! ఈ నా కోరికను తీర్చాలి. నాకు ఇంతకన్న ప్రియమయినది లేదు. ఆమె మాటలు విన్న ఆ వసువు భార్యకోరికను తీర్చదలచి పృథువు మొదలయిన తన సోదరులతో కలిసి ఆ ఆవును అపహరించాడు. రాజా! తన భార్య మాటమేరకు ప్రవర్తిస్తున్న ఆ వసువు వసిష్ఠ మహర్షియొక్క తీవ్ర తపః ప్రభావాన్ని పరికించలేదు. ఆవును దొంగిలిస్తున్నాడే కానీ ముని కోపంతో స్వర్గభ్రష్టులం కావలసివస్తుందేమో అని ఆలోచించలేదు.

పండ్లను సేకరించుకొని ఆశ్రమపదానికి వచ్చిన వసిష్ఠునకు ఆశ్రమంలో ఆవు కానీ దూడ కానీ కనిపించలేదు. ఆ తరువాత తపోధనుడైన ఆ వసిష్ఠుడు ఆవుకై వెదికాడు. కానీ ఉదారబుద్ధిగల ఆ మహర్షికి ఆ ఆవు కనిపించలేదు. దివ్యదర్శనంతో వసువులు ఆ ఆవును దొంగిలించుకొని పోవటాన్ని గ్రహించి వసిష్ఠుడు కోపించి వెంటనే ఆ వసువులను శపించాడు. 'చక్కని తోకగలిగి పాలనిచ్చే నా ఆవును వసువులు దొంగిలించారు. కాబట్టి వారంతా మానవులుగా జన్మిస్తారు. దీనికి తిరుగులేదు.' ఇలా పూజ్యుడైన ఆ వసిష్ఠుడు క్రోధవశుడై వసువులను శపించాడు. వారిని శపించి ఆ మహాత్ముడు మరల తపస్సుమీదనే మనస్సు పెట్టాడు. వసిష్ఠుడు క్రోధావిష్టుడై ఎనిమిదిమంది వసువులనూ

శపించాడు. వసిష్ఠుడు శపించిన విషయం తెలిసి వసువులు మరల మహర్షి ఆశ్రమానికి వచ్చారు. వసువులు ఆ మహర్షిని అనునయించి కూడా సర్వధర్మవిశారదుడై ముని శ్రేష్ఠుడైన ఆ వసిష్ఠుని అనుగ్రహాన్ని పొందలేకపోయారు. ధర్మాత్ముడైన ఆ వసిష్ఠుడు "ధరుడు మొదలగు మీ అందరినీ శపించాను. కానీ సంవత్సరం లోపలే మీ కందరికీ శాపవిముక్తి లభిస్తుంది. అయితే ఎవని కారణంగా మీరంతా నాచేత శపించ బడినారో ఆ ద్యోవు మాత్రం దీర్ఘకాలం మానవలోకంలోనే నివసించవలసి ఉంటుంది. అది ఆయన కర్మఫలం. మీపై కోపించి నేనన్న మాటలు వ్యర్థం కావాలని నేను భావించటం లేదు. గొప్పమనస్సుగల ఈ ద్యోవు మానవ లోకంలో సంతానాన్ని మాత్రం పొందడు. సర్వశాస్త్రవిశారదుడై, ధర్మస్వరూపుడై తండ్రికి ప్రియాన్నీ, హితాన్నీ కలిగిస్తూ స్త్రీభోగాలను వదలి జీవిస్తాడు.' వసువులందరితో ఇలా పలికి ఆమహర్షి నిర్గమించాడు. అప్పుడు వసువులంతా కలిసి నాదగ్గరకు వచ్చారు. "గంగా! పుట్టినవారిని పుట్టినట్టుగా నీటిలో పడవేయి" అని వారు నన్ను అభ్యర్థించారు. నేను అంగీకరించాను. ఆ పని చేశాను. రాజశ్రేష్ఠా! ఈ విధంగా శాపగ్రస్తులయిన వారి శాపవిముక్తికై, మానవలోకంనుండి వారు బయటపడటానికై నేను మాట ఇచ్చిన మేరకు చక్కగా నిర్వహించాను. భారతా! ఈ ద్యోవసువు మాత్రం ఒంటరియై ఆ మహర్షిశాపంవలన మానవలోకంలో చిరకాలం నివసిస్తాడు.

(రాజా! ఇతనికి దేవవ్రతుడు, గంగాదత్తుడు అని రెండుపేర్లు. శాంతనుకుమారుడైనా గుణాలలో ఆయనను మించినవాడు. ఈ కుమారుడు పెద్దవాడైన తరువాత మరల నీ దగ్గరకు వస్తాడు. నేను కూడా నీవు పిలిచినప్పుడు నీ దగ్గరకు వస్తాను.)

ఇలా ఆ గంగానది ఆ కొడుకును తీసికొని అక్కడే అదృశ్యమై తన ఇచ్ఛవచ్చిన చోటికి వెళ్ళిపోయింది. ఆ ద్యోవు శాంతనుసుతుడై, గుణాలతో అతనిని మించినవాడై దేవవ్రతుడు, గాంగేయుడు కూడా అయ్యాడు. ఆపై శాంతనుడు కూడా బాధతో తన నగరానికి వెళ్ళిపోయాడు. ఆ శాంతనుని విశేష గుణాలను ముమ్ముందు వివరిస్తాను. భరతవంశస్థుడూ, మహాత్ముడూ అయిన ఆ రాజా మహాభాగ్యాన్నీ వివరిస్తాను. ఆయన ఇతిహాసమే ఉజ్జ్వలమయిన మహాభారతం.

100. సత్యవతీలాభోపాఖ్యానము (భీష్మప్రతిజ్ఞ).

శాంతనుమహారాజు బుద్ధిమంతుడు. దేవర్షులు, రాజర్షులు అతనిని సత్కరించేవారు. ధర్మస్వరూపుడు. మాట తప్పడని లోకంలో కీర్తినందినవాడు. పురుషశ్రేష్ఠుడూ, సత్యసంపన్నుడూ అయిన శాంతనునిలో దమమూ, దానగుణమూ, ఓర్పు, బుద్ధి, బిడియమూ, ధైర్యమూ,

ఉత్తమతేజస్సు ఉండేవి. ఈ విధంగా సద్గుణసంపన్నుడై, ధర్మార్థనైపుణ్యంగల ఆ శాంతనుమహారాజు భరతవంశానికీ, సమస్తప్రజలకూ రక్షకుడుగా ఉండేవాడు. శంఖం వంటి మెడ, విశాలమైన ఎగు భుజాలు, మదపుటేనుగు వంటి నడక గలిగి సార్థకమైన ఉత్తమ రాజలక్షణాలు గలవాడు శాంతనుడు. కీర్తిమంతుడైన ఆ రాజు నడవడిని చూచి ప్రజలంతా అర్థకామాలకన్న ధర్మమే ఉన్నతమైనదని నిశ్చయించుకొనేవారు. పురుషశ్రేష్ఠుడైన ఆ శాంతనునిలో సకలసద్గుణాలూ ఉన్నాయి. ధర్మవిషయంలో ఆయనకు సాటిరాగల రాజు మరొక్కడు లేడు. ధర్మవేత్తలలో అగ్రగణ్యుడై, ధర్మాత్ముడై ఉన్న ఆయనను రాజులందరూ రాజరాజుగా అభిషిక్తుని చేశారు. రాజులంతా శాంతనుని తమ రాజుగా, రక్షకుడుగా నియమించుకొనిన తర్వాత ఎవ్వరిలోనూ శోకం గానీ, భయం గానీ, సంతాపం గానీ లేకుండా పోయాయి. అందరూ సుఖంగా నిద్రించి సుఖంగా మేల్కొనేవారు. ఇంద్రతేజస్సు గలిగి కీర్తిమంతుడైన ఆ శాంతనుని అనుశాసనంలో ఇతర రాజులు కూడా యజ్ఞ దానక్రియలలో తమంతతాముగా ప్రవర్తించేవారు.

శాంతనుడు మొదలుగా గల రాజుల ఏలుబడిలో సర్వవర్ణాలవారూ నియమబద్ధంగా ధర్మాన్నే ప్రధానంగా భావించేవారు. క్షత్రియులు బ్రాహ్మణులను సేవించేవారు. వైశ్యులు క్షత్రియులను అనుసరించి నడిచేవారు. శూద్రులు బ్రాహ్మణ క్షత్రియులందు అనురాగం కలిగి వైశ్యులను సేవించేవారు. ఆ శాంతనుమహారాజు కురువంశస్థులకు చెందిన అందమైన ఆ హస్తినాపురాన్ని రాజధానిగా చేసి నివసిస్తూ, సముద్రపర్యంతం వ్యాపించి ఉన్న భూమిని పరిపాలించాడు. ఆ శాంతనుడు దేవేంద్రునితో సమానమైనవాడు. ధర్మవేత్త, సత్యవచనుడూ, ఋజువర్తనుడూ అయి దానధర్మతపస్సుల కలయికతో మహోజ్జ్వలకాంతితో శోభించే వాడు. ఆయన రాగద్వేషాలు లేనివాడు. చంద్రునివలె చూడముచ్చటైన వాడు. తేజస్సులో సూర్యసమానుడు, వేగంలో వాయుసమానుడు, కోపిస్తే యముడే. ఓర్పులో భూమితో సమానమైనవాడు. రాజా! శాంతనుడు పరిపాలిస్తున్నప్పుడు పశువులనూ, పందులనూ, జంతువులనూ, పక్షులనూ హింసించి చంపేవారే లేరు. ఆయన రాజ్యంలో బ్రహ్మజ్ఞానానికీ, ధర్మానికీ ప్రాధాన్యం. వినయసంపన్నుడైన శాంతనుడు కామరాగాలను విడిచి సమదృష్టితో ప్రజాపాలన చేయసాగాడు. దేవయజ్ఞ ఋషియజ్ఞ పితృయజ్ఞాల కొరకే కర్మల నారంభించేవాడు. అధర్మమార్గంలో ఏ ప్రాణినీ సంహరించేవాడు కాదు. దుఃఖించేవారికీ, దిక్కులేని వారికీ, పశుపక్షిజాతులలో పుట్టినవారికీ – సమస్తభూత కోటికీ కూడా ఆ రాజే తండ్రివంటివాడు. కురురాజులలో శ్రేష్ఠుడూ, రాజరాజూ అయిన శాంతనుని ఏలుబడిలో మాట సత్యాన్నీ, మనస్సు దానధర్మాలనూ ఆశ్రయించి ఉన్నాయి. ఆ శాంతనుడు ముప్పదియారు సంవత్సరాల వయస్సు వరకు స్త్రీలపై ఆసక్తిని పొందక వనాల్లో సంచరించేవాడు.

అటువంటి రూపం, అటువంటి ఆచారం, అటువంటి వ్యవహారం, అంతటి విద్య గలిగి వసువు అవతారమైన గాంగేయుడు దేవవ్రతుడను పేర ఆయన కుమారుడైనాడు. ఆ దేవవ్రతుడు మహాబలుడూ, మహాసత్త్వుడూ, మహావీర్యుడూ, మహారథుడు కూడా. లౌకికా లౌకికాలయిన అస్త్రశస్త్ర విద్యలలో నిష్ణాతుడు.

ఒకప్పుడు శాంతనుమహారాజు ఒక క్రూరమృగాన్ని బాణంతో చంపి గంగ ఒడ్డుకు వచ్చాడు. గంగలో కొంచెమే నీరుండటాన్ని గమనించాడు. దానిని చూచిఈ నదీలలామ ఎప్పటివలె ఎందుకు ప్రవహించటం లేదని శాంతనుడు ఆలోచించాడు. దానికి కారణాన్ని వెతుకుతూ ఆరాజు– విశాలశరీరుడై, రూపసంపన్నుడై అందంతో అలరారే ఒక యువకుని చూచాడు. ఆ యువకుడు దివ్యాస్త్రాలను అభ్యసిస్తున్న దేవేంద్రునిలా కనిపిస్తున్నాడు. తన తీక్ష్ణమైన బాణాలతో గంగాప్రవాహాన్ని అంతా అడ్డగించి ఉన్నాడు. ఆ తీరంలోనే సంచరిస్తున్న ఆ యువకునీ, అతిమానుషమయిన అతని చేష్టనూ చూచి శాంతను మహారాజు ఆశ్చర్యానికి లోనయ్యాడు. అంతకుముందు పసికందుగా ఉన్నప్పుడు మాత్రమే శాంతనుమహారాజు తన కొడుకును చూచి ఉన్నాడు. కాబట్టి ఇప్పు డతడు తన కొడుకును గుర్తుపట్టలేకపోయాడు. ఆ బాలుడు తన తండ్రిని చూచి మాయతో మోహింపజేశాడు. ఆ మోహంలో శాంతను డున్నప్పుడే వెంటనే అక్కడే అంతర్ధానమయ్యాడు. ఆ అద్భుత సంఘటనను చూచిన ఆ శాంతను మహారాజుకు ఏదో అనుమానం కలిగింది. వెంటనే కుమారుని చూపించమని గంగను అడిగాడు. అప్పుడు గంగ ఉత్తమరూపాన్ని ధరించి కొడుకును కుడిచేతితో పట్టుకొని వచ్చింది. అలంకృతుడైన ఆ బాలుని దేవవ్రతుని చూపించింది. ఆభరణాలు అలంకరించుకొని స్వచ్ఛమైన వస్త్రాలు ధరించి వచ్చిన ఆ గంగను అంతకుముందు చూచినా కూడా గుర్తు పట్టలేకపోయాడు.

గంగ ఇలా అన్నది– పురుషశ్రేష్ఠా! మహారాజా! నీవు గతంలో నా గర్భంద్వారా పొందిన ఎనిమిదవబిడ్డ ఇతడే. ఇతడు సర్వాస్త్రవేత్తలలో శ్రేష్ఠుడు. మహారాజా! నేను పెంచిన ఈ బిడ్డను స్వీకరించు. పురుషశ్రేష్ఠా! స్వీకరించి ఇంటికి తీసికొనిపో. ఈ బాలుడు పరాక్రమవంతుడు. వసిష్ఠుని దగ్గర షడంగాలతో కూడిన వేదాలను అభ్యసించాడు, అస్త్రవిద్యలు నేర్చాడు. మేటివిలుకాడు. యుద్ధంలో దేవేంద్రసమానుడు. దేవతలకూ, అసురులకూ కూడా నచ్చినవాడీ బాలుడు. శుక్రుడెరిగిన నీతి శాస్త్రాన్ని ఈ బాలుడు కూడా సంపూర్ణంగా తెలిసికొనినాడు. అదేవిధంగా అంగిరసుని కొడుకూ, సురాసురవందితుడైన బృహస్పతికి తెలిసిన శాస్త్రమంతా ఈ నీ కుమారుడు సాంగోపాంగంగా గ్రహించాడు. పరశురాముడు నేర్చిన అస్త్రవిద్య మొత్తం ఇతని యందు ప్రతిష్ఠింపబడింది. రాజా! రాజధర్మార్థకోవిదుడై మేటి విలుకాడైన ఈ నీ కుమారుని అప్పగిస్తున్నాను. వీరా! ఈ

వీరబాలకుని ఇంటికి తీసికొనిపో. ఆ రీతిగా చెప్పి గంగానది అక్కడే అదృశ్య మయినది. ఆమె అనుమతితో, సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ కుమారుని స్వీకరించి శాంతనుడు తన నగరానికి వెళ్లాడు. అమరావతివలె అందమైన తన నగరానికి వెళ్ళిన శాంతనుడు తనకు కోరికలన్నీ తీరిన వానినివలె సఫలమనోరథుని వలె భావించుకొన్నాడు. ఆ తరువాత అందరికీ అభయమీయగల గుణవంతుడూ, మహాత్ముడూ అయిన తన కుమారుని రాజ్యపాలనలో సహకారానికై యువరాజును చేశాడు. శాంతనుకుమారుడు దేవవ్రతుడు కీర్తిమంతుడై తన నడవడితో పౌరులనూ, తన తండ్రిని, రాజ్యాన్ని కూడా రంజింపజేశాడు. ఆవిధంగా అమితవిక్రముడైన ఆ రాజు కొడుకుతో కలిసి నాలుగు సంవత్సరాలు ఆనందంగా గడిపాడు. ఒకనాడు ఆ శాంతనుడు యమునాతీరంలోని వనానికి వెళ్ళాడు.

అప్పుడు ఆ రాజు వివరించి చెప్పటానికి వీలుకాని ఉత్తమసౌరభాన్ని ఆఘ్రాణించాడు. అది ఎక్కడనుండి వస్తున్నదో తెలియగోరి అంతటా సంచరింప సాగాడు. అప్పుడు దేవకాంతవలె ఉన్న ఒక బెస్త కన్నియను చూచాడు. కాటుక కన్నులుగల ఆమెను చూడగానే ఆ రాజు ఇలా అడిగాడు. 'భయశీలా! నీవెవర్తెవు ? ఎవరి పుత్రికవు ? ఏం చేస్తున్నావు?' ఆమె - నేను బెస్తకన్నియను. మహాత్ముడూ, దాశరాజూ అయిన మా తండ్రి ఆదేశాన్ని అనుసరించి ధర్మార్థమై నావను నడుపుతున్నాను. నీకు శుభమగుగాక అంది. అందం, మాధుర్యం, పరిమళం కలిగి దేవకాంతవలె కనిపిస్తున్న ఆమెను చూచి శాంతనుడు మోహించాడు. ఆమె తండ్రి దగ్గరకు వెళ్ళిఅప్పుడే ఆమెను వరించాడు. ఆ తర్వాత ఆ శాంతనుడు ఆమె తండ్రిని తనకై ఆమెను అడిగాడు. ఆ దాశరాజు శాంతనునకు ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు. 'రాజా! ఈ అందమయిన కూతురు పుట్టినప్పుడే తగిన వరునకివ్వాలని నేను సంకల్పించాను. కాని నా మనస్సులో ఒక కోరిక ఉంది. దానిని విను. అనఘా! నీవు సత్యవచనుడవు. ఈమెను ధర్మపత్నిగా పొందాలని నీవు నన్ను అడిగే పక్షంలో సత్యప్రమాణంగా నాకొకమాట ఇవ్వాలి. రాజా! ఆ నియమం మేరకు ఈ కన్యను నేను నీకివ్వగలను. నీకన్న మంచి వరుడు మరొకడు నాకు ఎప్పుడూ దొరకడు అన్నాడు. శాంతనుడు దాశా! నీ కోరికను విన్న తరువాత దానివిషయమై నిర్ణయిస్తాను. ఇవ్వదగినదయితే తప్పక ఇస్తాను. ఇవ్వదగనిదైతే ఏరీతిగానూ ఇవ్వను. అన్నాడు. దాశరాజు ఇలా అన్నాడు- 'మహారాజా! ఈమెయందు కలిగే కొడుకే నీ తరువాత రాజుకావాలి. మరెవ్వరూ పట్టాభిషిక్తులు కాకూడదు.' అన్నాడు. శాంతనుడు తీవ్రకామాగ్నితప్తుడైనా కూడా దాశరాజుకు ఆ వరాన్ని ఇవ్వటానికి ఇష్టపడలేదు. అప్పుడు శాంతనుడు ఆ దాశకన్యను గూర్చియే తలపోస్తూ హాస్తినపురానికి వెళ్ళిపోయాడు. కామవ్యధ అతనిమనస్సును చలింపజేసింది.

ఆ తరువాత ఒకరోజు శాంతనుడు ధ్యానముద్రతో ఏదో ఆలోచిస్తున్నాడు. అప్పుడు ఆయన కొడుకు దేవవ్రతుడు సమీపించి తండ్రితో ఇలా అన్నాడు. "అన్నివైపులనుండీ మీకు క్షేమమే. రాజులందరూ విధేయులే. అయినా సరే ఎప్పుడూ ఏదో ఆలోచనలో, ఆవేదనలో ఉండటానికి కారణమేమి ? రాజా! మీరు మౌనంగానే ఉంటున్నారు. ఏదో ఆలోచిస్తున్నారు. నాతో మాటాడటం లేదు. గుర్రంపై వాహ్యాళికి కూడా వెళ్ళటం లేదు. కాంతిని కోల్పోయి, పాలిపోయి, కృశించిపోతున్నారు. మీ వ్యాధి ఏమిటో తెలిస్తే దానికి ప్రతిక్రియ చేయగలను".కొడుకు మాటలకు శాంతనుడు ఇలా సమాధానం చెప్పాడు. 'నాయనా! నిజంగా ధ్యానమగ్నుడనై ఉన్నాను. ఆ చింత ఎటువంటిదో చెపుతాను. విను ఇంత విశాలవంశంలో నాకు నీవు ఒక్కడివే కొడుకువు. నీవు ఎప్పుడూ ఆయుధప్రయోగాలను అభ్యసించటంలోనే గడుపుతున్నావు. పురుషార్థాల కొరకే ఉద్యమిస్తున్నావు. కుమారా! ఈ లోకాలన్నీ అనిత్యాలన్న భావనతో నేను చింతాక్రాంతుడ నవుతున్నాను. గాంగేయా! నీకేదయినా విపత్తు కలిగితే ఇక మన వంశమే నిలవదు. నీవు ఒక్కడివే వందమందికొడుకులకన్న శ్రేష్ఠుడవు అన్నమాట నిస్సందేహం. నాకు కూడా వ్యర్థంగా మరలా వివాహమాడాలన్న కోరిక లేదు. కానీ వంశాభివృద్ధికి లోటు రాకూడదు గదా ! అందుకు మరల వివాహమాడాలని తలంపు. నీకు మేలు కలుగుగాక. ఒక్కడే కొడుకుంటే కొడుకులు లేనట్లే అని ధర్మవేత్తల అభిప్రాయం.

(ఒకే కన్నూ, ఒకే కొడుకూ ఉన్నా లేనట్లే. కన్నుపోతే శరీరం పోతుంది. కొడుకు పోతే వంశం నశిస్తుంది.)

అగ్నిహోత్రం కానీ, వేదవిద్య కానీ, అక్షయ శిష్య ప్రశిష్యపరంపర కానీ ఇవేమీ కూడా కొడుకులో పదహారవ భాగానికి కూడా సాటిరావు. ఈ సంతానప్రాధాన్యం మనుష్యులలోనే కాదు సర్వప్రాణులలో కూడా ఉంటుంది. మహాప్రాజ్ఞా! **వంతావం, కర్మ, విద్య, అన్నవి మూడూ జ్యోతులు.** వీటిలో కూడా సంతానమన్నది సర్వోత్తమం. ఈ విషయంలో నాకు సంశయం లేదు. వేదపురాణదేవతా సమ్మతమైన అభిప్రాయమిదే. నాలోని చింతకు కారణాన్ని నీకు అంతా స్పష్టంగా చెప్పాను. భారతా! నీవు శూరుడవు. మాట పడటానికి ఇష్టపడని వాడవు. ఎప్పుడూ శస్త్రాస్త్రాల అభ్యాసంలోనే కాలం గడిపేవాడవు. కాబట్టి యుద్ధంలో తప్ప మరొకరీతిగా నీ మరణాన్ని సంభావించలేము. అందుకే సంశయిస్తూ కూర్చున్నాను. నీకు ప్రమాదం జరిగితే తర్వాత వంశ మేమవుతుందో? ఇది నా దుఃఖానికి కారణం. ఏమీ మిగల్చకుండా నీకు చెప్పాను.' రాజు దుఃఖానికి కారణమైన ఆ విషయం మొత్తం గ్రహించి మహామతి అయిన దేవవ్రతుడు తన తెలివితో కూడా దానిని ఆలోచించాడు.

అప్పుడే వేగంగా తన తండ్రిమేలు కోరుకొనే వృద్ధుడైన మంత్రిదగ్గరకు వెళ్ళాడు. తండ్రి శోకానికి కారణాన్ని గూర్చి ఆయనను ప్రశ్నించాడు. అప్పుడా అమాత్యుడు వాస్తవాన్ని తెలియగోరుతున్న దేవవ్రతునకు శాంతనుడు ఎవరో కన్యను వివాహమాడదలచినట్లు చెప్పాడు.

(దీనితో మరీ కలతపడిన దేవవ్రతుడు తండ్రిసారథిని పిలిపించాడు. దేవవ్రతుని ఆజ్ఞతో శాంతనుని సారథి వచ్చాడు. మహాప్రాజ్ఞుడైన భీష్ముడు తన తండ్రి సారథితో ఇలా అన్నాడు. 'సారథీ! నీవు రథసారథివి కాబట్టి నాతండ్రికి మిత్రుడవు. రాజుగారి మనస్సు ఏ కన్యపై లగ్నమై ఉన్నదో నీవెరుగుదువా? నేనడిగినదానికి సరిగా సమాధానం చెప్తే ఆవిధంగానే నేను ఆచరిస్తాను. దానికి భిన్నంగా ప్రవర్తించను.' రథసారథి ఇలా చెప్పాడు - నరోత్తమా! దాశకన్యపై తండ్రికి మక్కువ గలిగింది. రాజుగారు ఆమెను వరించిన తర్వాత ఆమెతండ్రి 'ఈమెకు పుట్టిన కొడుకే తమ తర్వాత రాజు కావలసిం'దని కోరాడు. ఆ వరాన్ని ఇవ్వటానికి అప్పుడు తమ తండ్రి అంగీకరించలేదు. మరో విధంగా నేను నా కుమార్తె నివ్వనని ఆ దాశరాజు నిర్ణయం. ఉన్న విషయమిది. వివరించాను, వీరా! తర్వాత చేయవలసినది చేయండి.)

ఆ తర్వాత దేవవ్రతుడు వృద్ధులయిన క్షత్రియులను వెంటబెట్టుకొని దాశరాజు దగ్గరకుపోయి తండ్రికొరకు తాను దాశకన్యను వరించాడు. దాశుడు దేవవ్రతుని శాస్త్రోక్తరీతిలో పూజించి స్వాగతించాడు. రాజులమధ్య కూర్చొని ఉన్న దేవవ్రతునితో ఇలా అన్నాడు. 'యాచకశ్రేష్ఠా! నాకూతురు నివ్వటానికి రాజ్యమే శుల్కం. ఆమెకు కొడుకు పుడితే మీ తండ్రి తర్వాత ఆ కొడుకే రాజు కావాలి. శాంతనుని కుమారుడవైన నీవొక్కడవే అందరినీ రక్షించగలవాడవు. ధనుర్ధారులలో నీవే శ్రేష్ఠుడవు. అయినా సరే నీకు నామాట చెప్తున్నాను. ఇంతగా నచ్చిన కోరదగిన వివాహ సంబంధాన్ని కాదని ఎవరు బాధపడకుండా ఉండగలరు? సాక్షాత్తూ ఇంద్రుడైనా బాధపడవలసినదే. ఈ కన్య ఒక గొప్పవాని కూతురు. ఆయన గుణాలలో తమతో సమానమైన వాడే. ఆయన వీర్యంవలననే ఈ సుందరి సత్యవతి జన్మించింది. ఆయన ఎన్నోమార్లు మీ తండ్రిని గూర్చి చర్చించాడు. సత్యవతిని వివాహమాడటానికి ధర్మవేత్త అయిన శాంతనుమహారాజే తగినవాడని ఆయన అభిప్రాయం. మహాయశుడైన ఆ రాజర్షి శాంతనుడు సత్యవతిని ఇంతకుముందే గట్టిగా అడిగాడు. ఆయన అలా అడిగినా కూడా నేను కాదన్నాను. రాజా! ఆడపిల్ల తండ్రిని కాబట్టి కొంచెం చెప్తున్నాను. ఈ సంబంధం చేసికోవటమంటే బలవంతులతో శత్రుత్వాన్ని తెచ్చి పెట్టుకోవటమే అవుతుంది. అదే ఇక్కడ దోషం. పరంతపా! నిన్ను శత్రువుగా చేసికొనినవాడు గంధర్వుడైనా, రాక్షసుడైనా కావచ్చు కానీ నీవే కోపిస్తే ఎక్కువకాలం జీవించలేడు. రాజా! ఈ పెండ్లి జరిపించటంలో ఇదే దోషం. ఇంతకన్న మరేమీలేదు. పరంతపా! కన్యనివ్వటం,

ఇవ్వకపోవటంలో ఇదొక్కటే దోషం. అర్థం చేసుకో. నీకు మేలు జరుగు గాక!

దాశరాజు అలా అనగానే దేవవ్రతుడు తండ్రికోరిక తీర్చటానికై రాజులందరూ వింటుండగానే దానికి తగిన రీతిగా సమాధానం చెప్పాడు. 'నా ఈ సత్యప్రతిజ్ఞను విను. ఇటువంటిమాటలు చెప్పగలవాడు ఇంతవరకు పుట్టలేదు. ఇక పుట్టడు కూడా. నీవు కోరుతున్నట్లే నేను చేస్తాను. ఈమెకు పుట్టబోయే కొడుకే మాకు రాజవుతాడు.' దేవవ్రతుడు అలా అన్నతరువాత దాశరాజు రాజ్యంకోసం దుష్కరప్రతిజ్ఞ దేనినో కోరదలచుకొని మరలా ఇలా అన్నాడు. 'నీవే శాంతనుమహారాజుకు రక్షకుడవై ఇక్కడకు వచ్చావు. ధర్మస్వరూపా! ఈ కన్యపై నీకు పూర్తిగా అధికార మున్నది. ఏమడిగినా నీవివ్వగలవు. అన్నీ చేయగలవాడవు నీవు. సౌమ్యా! ఈ విషయంలో నేను మరికొంత మాటాడవలసి ఉంది. అది జాగరూకతతో విను. కన్యాబంధువుల స్వభావాన్ని బట్టి నేనీ విధంగా చెప్పబోతున్నాను. సత్యవతికోసం రాజుల సమక్షంలో నీవు చేసిన ప్రతిజ్ఞ నీకు తగినదే. అది తిరుగులేనిది. ఈ విషయంలో ఏవిధమయిన సంశయమూ లేదు. కానీ నీకు పుట్టబోయే కొడుకుల విషయంలోనే గొప్పసంశయం మాకుంది.' అన్నాడు. సత్యధర్మ పరాయణుడైన దేవవ్రతుడు దాశరాజు అభిప్రాయాన్ని గ్రహించి తండ్రికోరిక తీర్చదలచి అప్పుడిలా ప్రతిజ్ఞ చేశాడు. 'దాశరాజా! నా ప్రతిజ్ఞ విను. ఋషులు, దేవతలూ, అదృశ్యంగా ఉన్న ప్రాణులూ అందరూ వినండి . నావలె మాటివ్వగలవాడు మరొకడు లేడు. నేను సత్యం చెప్తున్నాను. తండ్రికోసం ఈ రాజులందరి సమక్షంలో పలుకుతున్నాను. నామాటను గ్రహించండి. రాజశ్రేష్ఠులారా! నేను ఇంతకుముందే రాజ్యాన్ని పరిత్యజించాను. ప్రస్తుతం సంతానసంబంధంగా కూడా నిర్ణయాన్ని తీసికొంటున్నాను. దాశరాజా! ఇప్పటినుండి నేను బ్రహ్మచర్యాన్ని స్వీకరిస్తాను. పుత్రులు లేకున్నా నాకు స్వర్గంలో అక్షయపుణ్యలోకాలు లభిస్తాయి.

(నేను పుట్టిననాటినుండి ఎటువంటి అసత్యమూ పలుకలేదు. నా దేహంలో ప్రాణాలు ఉన్నంతవరకూ సంతానాన్ని పొందను. నీ కుమార్తెను మా తండ్రికివ్వు. నేను రాజ్యాన్నీ, మైథునాన్నీ కూడా పూర్తిగా పరిత్యజిస్తున్నాను. దాశా! నేనిక ఊర్ధ్వ రేతస్కుడనై ఉంటాను. నీకు సత్యం చెప్తున్నాను.')

దేవవ్రతుని మాటను విని ధర్మాత్ముడైన ఆ దాశరాజుకు శరీరం పులకించి కూతురుని ఇస్తానని సమాధానం చెప్పాడు. అప్పుడు ఆంతరిక్షంలోని అచ్చరలూ, దేవతలూ, ఋషిగణాలు పూలవాన కురిపించారు. 'ఇతడు భీష్ముడ'ని ప్రకటించారు. ఆ తరువాత దేవవ్రతుడు తండ్రికోసం కీర్తిమతియైన ఆ సత్యవతితో "అమ్మా! రథమెక్కు. మన ఇంటికి పోదాం" అని అన్నాడు. ఆ విధంగా పలికి భీష్ముడు ఆమెను రథమెక్కించి హస్తినపురానికి వచ్చి శాంతనునకు నివేదించాడు. భీష్ముని ఆ దుష్కర కర్మను రాజులందరూ

కలిసి, విడివిడిగా ప్రశంసించారు. 'ఇతడు భీష్ముడ'ని పలికారు. శాంతనుడు భీష్ముడు చేసిన ఆ దుష్కరకర్మను గూర్చి విని ఆనందించి ఆ మహానుభావునకు స్వచ్ఛందమరణాన్ని వరంగా ఇచ్చాడు. 'అనఘా! నీవు జీవించదలచు కొన్నంతకాలం మృత్యువు నిన్నేమీ చేయలేదు. నీ అనుజ్ఞను పొందిన తరువాతనే మృత్యువు నీపై తన ప్రభావాన్ని చూపగలదు.'

101. చిత్రాంగద వృత్తాంతము.

(సత్యవతి చేదిరాజు కుమార్తె అనీ, దాశరాజు దగ్గర పెరిగిందనీ తెలిసి శాంతనుడు ఆమెను శాస్త్రోక్తంగా వివాహమాడాడు.)

వివాహమైన తరువాత శాంతనుమహారాజు రూపసంపన్న అయిన సత్యవతిని అంతఃపురంలో ఉంచాడు. కొంతకాలం తర్వాత సత్యవతి గర్భంలో శాంతనునకు ఒక కొడుకు పుట్టాడు. అతడు బుద్ధిమంతుడు, వీరుడూ, పరాక్రమవంతుడూ, నరశ్రేష్ముడు కూడా. పేరు చిత్రాంగదుడు. ఆ తర్వాత శాంతనుడు సత్యవతి ద్వారా మరొక కొడుకును కన్నాడు. అతడు విచిత్రవీర్యుడు. విచిత్రవీర్యుడు కూడా పరాక్రమవంతుడూ, మేటి విలుకాడు. పురుషశ్రేష్ముడైన విచిత్రవీర్యుడు యౌవనాన్ని పొందాక ధీమంతుడైన ఆ శాంతనుమహారాజు కాలధర్మాన్ని పొందాడు. శాంతనుడు మరణించగా భీష్ముడు సత్యవతి అనుమతితో అరిందముడైన చిత్రాంగదుని రాజును చేశాడు. ఆ చిత్రాంగదుడు పరాక్రమంతో రాజుల నందరినీ తిరస్కరించసాగాడు. తనతో సమానమైన మనుష్యుడొక్కడూ లేడని భావించాడు. మనుష్యులను, దేవతలనూ, రాక్షసులనూ ఆ విధంగా రెచ్చగొడుతున్న ఆ చిత్రాంగదునకు ఆదే పేరుగల బలిష్ముడైన ఒక గంధర్వరాజు తారసిల్లాడు.

(గంధర్వుడిలా అన్నాడు. 'రాజకుమారా! నాపేరు నీవు పెట్టుకొన్నావు కాబట్టి నాతో యుద్ధం చేయి. యుద్ధం చేయటమిష్టం లేకపోతే పేరు మార్చుకో. నీతో నేను యుద్ధం చేయదలచాను. పేర్లు సమానం కాబట్టే నేను నీ దగ్గరకు వచ్చాను. నా పేరుతో నిరర్థకంగా మాటాడే మనుష్యుడు నా దగ్గరనుండి క్షేమంగా వెళ్లగూడదు.')

ఆ గంధర్వరాజుతో కురుక్షేత్రంలో చిత్రాంగదునకు ఘోరయుద్ధం జరిగింది. శస్త్రవర్ష సమాకులమై, ఘోరమయిన ఆ యుద్ధంలో మాయతో ఆధిక్యాన్ని ప్రదర్శించి గంధర్వుడు చిత్రాంగదుని చంపివేశాడు. ఆ చిత్రాంగదుని చంపి గంధర్వుడు యుద్ధం ముగించి స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. ఆ చిత్రాంగదుడు మరణించగా భీష్ముడు అంత్యక్రియలు జరిపించాడు. అప్పుడు బాలుడై, ఇంకా యౌవనాన్ని పొందని విచిత్రవీర్యుని మహాబాహు వయిన భీష్ముడు రాజుగా చేశాడు. మహారాజా! అప్పుడు విచిత్రవీర్యుడు ఆ భీష్ముని మాట వింటూ వంశపారంపర్యంగా వచ్చిన రాజ్యాన్ని పరిపాలించాడు. ఆ విచిత్రవీర్య

మహారాజు ధర్మశాస్త్ర కుశలుడూ, శాంతను కుమారుడూ అయిన భీష్ముని ధర్మబద్ధంగా గౌరవించేవాడు. ఆ భీష్ముడు కూడా విచిత్రవీర్యుని సంరక్షించేవాడు.

102. విచిత్రవీర్య వృత్తాంతము.

చిత్రాంగదుడు మరణించాడు. విచిత్రవీర్యుడు భీష్మసత్యవతుల అభిప్రాయాన్ని అనుసరిస్తూ ఆ రాజ్యాన్ని పరిపాలించాడు. విచిత్రవీర్యుడు యౌవనాన్ని పొందాక సోదరుని చూచి భీష్ముడు అతనికి వివాహం చేయాలనుకొన్నాడు. ఆ తరువాత అప్సరలతో సమానమైన కాశిరాజ పుత్రికలు ముగ్గురు స్వయంవరంలో భర్తను ఎన్నుకొనబోతున్నారని భీష్ముడు విన్నాడు. ఆ తర్వాత భీష్ముడు-తల్లి అనుమతితో ఒకరథంలో వారాణసికి బయలుదేరాడు. అక్కడ అన్నిదిక్కులనుండి వచ్చి చేరిన రాజులనూ, ఆ కన్యలనూ కూడా శాంతనుకుమారుడైన భీష్ముడు చూశాడు. అప్పుడు అన్నివైపులనుండి రాజుల పేర్లను పరిగ్రహించి అందరికీ పరిచయం చేయసాగారు. ఆ అందరిలో అప్పటికి వృద్ధుడై ఒంటరిగా వచ్చినవాడు శాంతనుసుతుడైన భీష్ముడే. మిగుల అందగత్తె లయిన ఆ కన్యలు భీష్ముని చూచి కలతపడి వృద్ధుడన్న భావంతో దూరంగా వెళ్ళారు. అక్కడ చేరిన నీచస్వభావంగల రాజులు పరిహసిస్తూ భీష్ముని గూర్చి ఇలా హేళనగా అనుకొనసాగారు. "ముసలివాడు పరమధర్మ స్వరూపుడు. ముడతలు పడిన దేహం, నెరసిన వెంట్రుకలు. సిగ్గులేకుండా ఇక్కడి కెందుకు వచ్చాడో! పైగా భరతవంశశ్రేష్ఠుడు, ప్రతిజ్ఞ తప్పుతున్నాడు. ప్రజలకేం చెప్పగలడు. భీష్ముడు బ్రహ్మచారి అని లోకంమాత్రం నిరర్థకంగా ప్రసిద్ధి కల్పిస్తోంది." ఆ రాజుల మాటలు ఆలకించి భీష్ముడు మండిపడ్డాడు. భీష్ముడప్పుడు తానే స్వయంగా ఆ కన్యలను వరించాడు. వారిని తన రథంపైకి ఎక్కించుకొని యోధాగ్రగణ్యుడైన భీష్ముడు మేఘగంభీరధ్వనితో ఆ రాజులతో ఇలా అన్నాడు- 'కన్యలను యథాశక్తిగా అలంకరించి, గుణవంతుడైన వరుని పిలిపించి, ధనాదులతో పాటు కన్యాదానం చేయటం ఉత్తమమని పండితుల భావన. మరికొందరు గోవుల జంటను స్వీకరించి కన్యాదానం చేస్తారు. కొందరు నియతమయిన ధనాన్ని స్వీకరించి కన్యాదానం చేస్తారు. మరి కొందరు బలంతో కన్యల నపహరిస్తారు. కొందరు పరస్పరాంగీకారంతో దంపతులవుతారు. మరికొందరు స్పృహకోల్పోయిన స్త్రీని అపహరిస్తారు. మరికొందరు స్వయంగా స్త్రీపురుషులను ఒకచోటచేర్చి ప్రతిజ్ఞాపూర్వకంగా వివాహం జరిపిస్తారు. ఆవిధంగా భార్యను పొందుతాడు భర్త. కొందరు ఆర్షమైన పద్ధతిలో భార్యను పొందుతారు. ఈ విధంగా వివాహం ఎనిమిది రకాలని పండితభావన. గ్రహించండి. క్షత్రియులు స్వయంవరాన్ని ప్రశంసించి పాటిస్తారు. అందులో కూడా ఇతర రాజులందరినీ ఓడించి కన్యను కొనిపోగలిగితే అదే క్షత్రియులకు గొప్పదని

ధర్మవేత్త లంటారు. రాజులారా! ఈ కన్యలను బలవంతంగా ఇక్కడనుండి తీసికొని పోదలచాను. మీరు సర్వశక్తులూ ఒడ్డి గెలుపుకోసమో, ఓటమి కోసమో ప్రయత్నించండి. రాజులారా! యుద్ధానికి సిద్ధమై నేనున్నాను ఆ రాజులతో, కాశిరాజుతో ఈ విధంగా చెప్పి పరాక్రమశాలి అయిన ఆ భీష్ముడు ఆ కన్యలను తన రథమెక్కించుకొని, అందరినీ వీడ్కొని, ఆ కన్యలతో వేగంగా వెళ్ళిపోయాడు.

అప్పుడు ఆ రాజులందరూ అసహనంతో జబ్బచరుస్తూ పళ్ళు కొరుకుతూ ఒక్కపెట్టున లేచారు. వారు వేగంగా తమ ఆభరణాలను వీడి, కవచాలను ధరించసాగారు. ఆసమయంలో పెద్దకోలాహలం జరిగింది. ఆ తొందరలో వారు ధరిస్తున్న ఆభరణాలూ, కవచాలూ అటో ఇటో పడుతూ గగనసీమలోని తారలు రాలిపడినట్లు అనిపిస్తోంది. యోధుల కవచాలూ, భూషణాలూ చెల్లాచెద రయ్యాయి. క్రోధం, అమర్షం వలన వారి కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. సారథులు మంచిగుఱ్ఱాలను పూన్చి అందమైన రథాలను సిద్ధంచేశారు. ఆ వీరు లందరూ-అన్ని ఆయుధాలనూ సమీకరించుకొని, రథాలెక్కి, ఆయుధాల నెత్తిపట్టి, వేగంగా వెళ్తున్న భీష్ముని అనుసరించారు. అప్పుడు ఆ రాజులకూ, భీష్మునికీ మధ్య యుద్ధం జరిగింది. ఒంటరి వాడైన భీష్ముడు అంతమంది రాజులతో చేస్తున్న యుద్ధం భీకరమై, గగుర్పాటు కలిగేటట్లుంది. ఆ రాజులు భీష్మునిపై పదివేల బాణాలను ఒక్కసారిగా ప్రయోగించారు. వాటిని తన దగ్గరకు చేరకముందే విశాలమైన రెక్కలుగల బాణవర్షంతో మధ్యలోనే త్రుంచివేశాడు భీష్ముడు. ఆ తరువాత రాజు లందరూ భీష్ముని చుట్టుముట్టి మేఘాలు వర్షంతో పర్వతాన్ని కప్పివేసినట్టు బాణవర్షంతో ఆయనను కప్పివేశారు. భీష్ముడు ఆ బాణవర్షాన్ని అన్నివైపులా ఆపి మూడు మూడు బాణాలతో ఆ రాజుల నందరినీ గాయపరిచాడు. తరువాత ఒక్కొకరుగా అయిదు బాణాలను భీష్మునిపై ప్రయోగించారు. భీష్ముడు పరాక్రమించి రెండురెండు బాణాలతో వాటిని త్రిప్పికొట్టాడు. శరశక్తి సమాకులమైన ఆ యుద్ధం దేవాసురసంగ్రామం వలె భయంకరంగా, ఘోరంగా ఉంది. లోకవిఖ్యాతు లయిన ఆ వీరుల ధనుస్సులనూ, ధ్వజాగ్రభాగాలనూ. కవచాలనూ, తలలనూ వందలూ, వేలుగా భీష్ముడు ఆ యుద్ధంలో పడగొట్టాడు. రణరంగంలో రథచారియై ఇతరులను మించిపోతున్న నేర్పును, ఆత్మరక్షణవిధానాన్నీ శత్రువులు కూడా అభినందించారు. మేటివిలుకాడయిన భీష్ముడు యుద్ధంలో వారినందరినీ ఓడించి ఆ బాలికలతో పాటు స్వదేశానికి వెళ్ళిపోయాడు. మహారథు డయిన శాల్వరాజు భీష్ముని వెన్నంటి వచ్చి యుద్ధం చేయాలని ఆయనను ఎదిరించాడు. శాల్వరాజు అసాధారణ బలం గలవాడు. ఆడేనుగును వెన్నంటిపోతున్న గజపతిని మరొక గజరాజు వచ్చి దంతాలతో వెనుకభాగాన్ని చీల్చినట్టు

బలశాలులలో శ్రేష్ముడైన ఆ శాల్వరాజు స్త్రీని పొందాలన్న కోరికతో భీష్ముని వెనుకవచ్చి "నిలు నిలు" అని భీష్ముని నిరోధించాడు. శత్రుసంహర్త అయిన భీష్ముడు ఆ మాటలు విని, కోపంతో పాగలేని నిప్పువలె ప్రజ్వరిల్లుతూ ధనుర్బాణాలు చేతపట్టి నుదురు చిట్లిస్తూ నిలిచాడు. భీష్ముడు క్షాత్రధర్మాన్ని అనుసరించి భయసంభ్రమాలు లేకుండా రథాన్ని శాల్వుని వైపు మరలించాడు. భీష్ముడు వెనుకకు మరలటాన్ని చూచి, ఆ రాజులందరూ భీష్మశాల్వయుద్ధానికి ప్రేక్షకులయ్యారు. బలవిక్రమ సంపన్నులయిన ఆ భీష్మశాల్వులు మైధునేచ్ఛ గల బలిష్ఠులైన వృషభాలవలె ఒకరినొకరు ఎదిరించారు. శాల్వరాజు భీష్మునిపై వేగవంతాలయిన బాణాలను వందలు, వేలుగా కురిపించాడు. ముందుగా శాల్వుడే భీష్ముని నొప్పించటాన్ని చూసిన ఆ రాజులందరూ ఆశ్చర్యచకితులై 'భళా! భళా' అని శాల్వుని అభినందించారు. రాజు లందరూ యుద్ధంలో శాల్వుని నేర్పును చూచి, ఆనందించి, ఆ శాల్వరాజును మాటలతో ప్రశంసించారు. ఆ భీష్ముడు ఆ రాజుల మాటలు విని కోపించి 'నిలు నిలు' అని అరిచాడు. కోపంతో సారథితో ఇలా అన్నాడు- 'ఆ రాజున్న దిక్కునకు రథాన్ని నడుపు. గరుత్మంతుడు పామును చంపినట్టు ఇతనిని చంపివేస్తాను' అంటూ భీష్ముడు వారుణాస్త్రాన్ని చక్కగా ప్రయోగించి, శాల్వరాజు రథాశ్వాలను నాలుగింటిని కొట్టాడు. శాల్వరాజు ప్రయోగించిన బాణాలను తన బాణాలతో నిరోధించి, భీష్ముడు శాల్వుని రథసారథిని సంహరించాడు. ఆ తరువాత ఇంద్రాస్త్రంతో గుఱ్ఱాలను సంహరించాడు. భీష్ముడు ఆ బాలికలకోసం శాల్వుని ఓడించి, ప్రాణాలతో విడిచిపెట్టాడు. శాల్వుడు తన నగరానికి మరలిపోయాడు. ధర్మబద్ధంగా తన రాజ్యాన్ని పరిపాలించాడు. స్వయంవరాన్ని చూడటానికి వచ్చిన రాజులందరూ తమ తమ రాజ్యాలకు మరలి పోయారు. భీష్ముడు ఈ విధంగా ఆ బాలికలను గెలుచుకొని హస్తినాపురానికి బయలుదేరాడు. ఆ హస్తిననగరంలోనే ధర్మాత్ముడైన విచిత్రవీర్యుడు రాజ్యపాలన చేస్తుండేవాడు. శాంతనుని వలె ఆ భీష్ముడు కూడా రాజ్యపరిపాలన సాగించాడు. స్వల్పకాలంలోనే వనాలనూ, నదులనూ, పర్వతాలనూ, వివిధవృక్షాలను అతిక్రమించి ముందుకు దూసుకొని పోయేవాడు. యుద్ధంలో ఆ భీష్ముడు తాను గాయపడకుండా శత్రువులను గాయ పరచేవాడు. సోదరునకు ప్రియాన్ని చేకూర్చాలన్న భావనతో మహాబాహువైన ఆ భీష్ముడు కాశిరాజకూతుళ్ళను తన కుమార్తె లన్నట్లుగా తీసికొని కురురాజ్యాన్ని చేరాడు. తన పరాక్రమంతో తీసికొని వచ్చిన సర్వగుణసంపన్న లయిన ఆ కన్యలను భీష్ముడు చిన్నతమ్ముడయిన విచిత్రవీర్యునకు ఇచ్చాడు. జితేంద్రియుడూ, ధర్మజ్ఞుడూ, అయిన భీష్ముడు ఈ విధంగా అమానుషసాహసం చేసి తెచ్చిన ఆ కన్యలతో విచిత్రవీర్యునకు వివాహం జరిపించ నుపక్రమించాడు. సత్యవతితో చర్చించియే ఆ నిశ్చయం చేశాడు. వివాహం జరిపించబోయే సమయంలో కాశిరాజు

పెద్దకూతురు భీష్మునితో ఇలా అన్నది.

'నా మనస్సులో నేను ముందే వరించిన భర్త సౌభపతి శాల్వుడు. ఆయన కూడా నన్ను వరించాడు. మా తండ్రికోరిక కూడా ఇదే. ఆస్వయంవరంలో నేను శాల్వునే వరించేదాన్ని. ధర్మజ్ఞా! దీనిని గ్రహించి ధర్మానుసారంగా ఆచరించండి.' బ్రాహ్మణుల సమక్షంలో ఆ విధంగా చెప్పిన ఆ కన్యమాటలు విని, వీరుడైన భీష్ముడు వివాహవిషయంలో యుక్తియుక్తతను గూర్చి ఆలోచించాడు. వేదవేత్తలయిన బ్రాహ్మణులతో సంప్రదించి ఆ ధర్మాత్ముడు కాశిరాజు పెద్దకూతురు అంబను స్వేచ్ఛగా వెళ్ళటానికి అనుమతించాడు. భీష్ముడు శాస్త్రోక్తమైన కర్మతో చిన్న తమ్ముడు విచిత్రవీర్యునకు అంబిక, అంబాలికలను భార్యలను చేశాడు. వారిని పరిగ్రహించి, రూపయౌవన గర్వంతో ధర్మాత్ముడయిన విచిత్రవీర్యుడు కామాత్ము డయ్యాడు. అంబిక, అంబాలిక కూడా పదహారు సంవత్సరాల వయస్సు గలవారు. పుష్టిగా ఉన్నవారు. నల్లనికురులు గలవారు. వారి గోళ్లు ఎఱ్ఱగా ఎత్తుగా ఉన్నాయి. వారి పిరుదులూ, వక్షోజాలు బలిష్ఠంగా ఉన్నాయి. తమకు తగిన భర్త లభించాడని ఆ శుభాంగనలు ఆ విచిత్రవీర్యుని సేవించసాగారు. ఆ విచిత్రవీర్యుడు అశ్వినీకుమారుల వంటి రూపం గలవాడు. దేవతలతో సమానమైన పరాక్రమం గలవాడు. ఏకాంతంలో స్త్రీలకందరకూ మనస్సులో మోహాన్ని కల్గించగలవాడు. ఆ భార్యలతో పాటు ఏడు సంవత్సరాలు విహరించిన ఆ విచిత్రవీర్యుడు యౌవనంలోనే క్షయవ్యాధికి గురిఅయ్యాడు. అతని శ్రేయోభిలాషులు అందరూ ఆప్తులయిన వైద్యులద్వారా చికిత్స జరిపించినా ఆ విచిత్రవీర్యుడు సూర్యుడు అస్తమించినట్లు మరణించాడు. భీష్ముడు చింతాశోకాలకు లోనయి, తల్లి ఆదేశాలను అనుసరిస్తూ కురువంశశ్రేష్ఠులతో, ఋత్విక్కులతో కలిసి విచిత్రవీర్య మహారాజుకు ప్రేతకార్యాలను అన్నింటినీ చక్కగా జరిపించాడు.

103. భీష్మ సత్యవతీ సంవాదము.

తరువాత పుత్రవ్యామోహంతో సత్యవతి దీనురాలై, కోడళ్ళతో కలిసి విచిత్రవీర్యునకు ప్రేతకార్యాలు నిర్వహింపజేసింది. కోడళ్ళనూ, మేటియోధు డయిన భీష్మునీ ఊరడించింది. మహానుభావురా లయిన ఆమె ధర్మాన్నీ, తన మాతృవంశాన్నీ, పితృవంశాన్నీ, మనసులో ఉంచుకొని భీష్మునితో ఇలా అన్నది - 'కౌరవవంశజుడూ, కీర్తిమంతుడూ, ధర్మాసక్తుడూ అయిన శాంతనునకు పిండమూ, కీర్తి, వంశాభివృద్ధి అన్నీ ఇప్పుడు నీ చేతిలో ఉన్నాయి. పుణ్యకర్మలు చేస్తే స్వర్గలోకప్రాప్తి నిశ్చితం. సత్యవచనంలో ఆయుర్వృద్ధి నిశ్చితం. అదే విధంగా నీవు ధర్మబద్ధుడ వనటం కూడా నిశ్చితం. ధర్మజ్ఞా! నీకు ధర్మాలన్నీ తెలుసు.

ధర్మసూక్ష్మాలు తెలుసు. ధర్మవిస్తృతీ తెలుసు. వివిధవేదాలూ, వేదాంగాలూ నీవు చక్కగా ఎఱుగుదువు. నీ ధర్మబద్ధతా, కులాచారపరిపాలనమూ నేను గమనిస్తూనే ఉన్నాను. ఇబ్బంది గలిగినప్పుడు శుక్రాచార్య, బృహస్పతులవలె కర్తవ్యనిర్ణయం చేయటంలో నీవు మేటివి. కాబట్టి, ధర్మజ్ఞశ్రేష్ఠా! నీ మీద గట్టి నమ్మకంతో నిన్నొక పనికి నియోగించబోతున్నాను. ముందు దానిని విని, ఆపై ఆచరించవలసినది. నా కొడుకూ, నీకు తమ్ముడూ అయిన విచిత్రవీర్యుడు పరాక్రమవంతుడే గాక నీకు ఇష్టమయిన వాడు. చిన్నప్పుడే సంతానం లేకుండానే మరణించాడు. నీ సోదరుని భార్యలు, కాశిరాజు కుమార్తెలు మంచివారు. రూపయౌవనాలూ గలవారూ, సంతానాన్ని కోరుతున్న వారు కూడా. మహాబాహూ! మన వంశాభివృద్ధికై నా ఆజ్ఞతో వారియందు సంతానాన్ని పొందు. ఇది ధర్మబద్ధమయిన కార్యమే. రాజ్యపట్టాభిషేకం చేసికో. భారత ప్రజలను పరిపాలించు. ధర్మానుసారంగా పెండ్లిచేసికో. పితరులను నరకంలో పడవేయవద్దు. తల్లీ, మిత్రులూ అలా చెపితే పరంతపుడూ, ధర్మాత్ముడయిన ఆ భీష్ముడు ధర్మానుకూలమైన సమాధాన మిలా ఇచ్చాడు. 'అమ్మా! నీవు చెప్పినది ధర్మబద్ధమే. సందేహమేమీ లేదు. కానీ నేను పట్టాభిషేకం చేసికొనను. ఎప్పుడూ వివాహం కూడా చేసికొనను. రాజ్యస్వీకారం, సంతానోత్పాదనం – ఈ రెండు విషయాల్లో నేను చేసిన తీవ్రప్రతిజ్ఞ నీకు తెలుసు. సత్యవతీ! నీకు శుల్కంగా ఇవ్వటానికి ఈ విషయంలో జరిగినదంతా నీకు తెలుసు. ఆ ప్రతిజ్ఞలను పాటించటానికై మరొకసారి నానిర్ణయాన్ని చెప్తున్నాను. మూడు లోకాల ఆధిపత్యాన్ని అయినా, దేవతా సామ్రాజ్యాన్ని అయినా– ఈ రెండింటిని మించిన దేనినయినా వదలగలను కానీ సత్యాన్ని మాత్రం ఎప్పుడూ విడనాడను. భూమి గంధాన్ని వదలిపెట్టవచ్చు. నీరు రుచిని వీడవచ్చు. తేజస్సు రూపాన్ని కోల్పోవచ్చు. గాలి స్పర్శను విడనాడవచ్చు. సూర్యుడు వెలుగునూ, అగ్ని వేడినీ విడనాడవచ్చు. ఆకాశం శబ్దగుణాన్ని వదలిపెట్టవచ్చు. చంద్రుడు చల్లదనాన్ని విడనాడవచ్చు. **ఇంద్రుడు పరాక్రమాన్ని విడిచిపెట్టవచ్చు. యమధర్మరాజు ధర్మాన్ని వదలివేయవచ్చు. కానీ నేను ఏ రీతిగానూ సత్యపరిత్యాగానికి సిద్ధపడను.*** లోకవినాశం ఏర్పడినా, నాకు అమరత్వం సిద్ధించినా, మూడులోకాల ఆధిపత్యమూ లభించినా నేను నా ప్రతిజ్ఞను విడనాడను. భీష్ముడు ఆ విధంగా పలుకగా సత్యవతి ఇలా అన్నది– సత్యపరాక్రమా! నీ సత్యనిష్ఠ తెలుసు. నీవు తలచుకొంటే నీ తేజస్సుతో మరో మూడు లోకాలను సృష్టించగలవు అనీ తెలుసు. నాకోసమే నీవు చేసిన ఆ సత్యభాషణ కూడా తెలుసు. కానీ

---

* **విక్రమం వృత్రహో జహ్యాద్ ధర్మం జహ్యాచ్చ ధర్మరాట్ ।**
న త్వహం సత్యముత్సృష్టం వ్యవసేయం కథంచన ॥ 18

ఆపద్ధర్మంగా భావించి, నీవు ఈ రాజ్యభారాన్ని వహించు. నీ వంశపరంపర నశించనిరీతిగా, ధర్మపరాభవం కలుగనిరీతిగా నీ మిత్రులందరూ మెచ్చుకొనేటట్లుగా నీవు ఆచరించు. పుత్రకాంక్షతో దీనంగా ధర్మవిరుద్ధంగా మాటాడుతున్న సత్యవతితో భీష్ముడు మరలా ఇలా అన్నాడు 'ధర్మాన్ని పరిశీలించు. అందరినీ నాశనం చేయవద్దు. క్షత్రియుడు సత్యభ్రష్టుడు కావటం ఏ ధర్మపద్ధతిలో కూడా నప్పదు. శాంతనుమహారాజ సంతతి కూడా భూలోకంలో అక్షయంగా నిలవగల సనాతన క్షాత్రధర్మాన్ని చెపుతాను. దానిని విని ప్రాజ్ఞులయిన పురోహితులతోనూ, ఆపద్ధర్మవిషయంలో నేర్పరులయిన వారితోనూ సంప్రతించి, లోకాచారాన్ని కూడా గమనించి నిశ్చయించుకో.

104. వ్యాసుడు సత్యవతి ఆజ్ఞను పాటించుట కంగీకరించుట.

అమ్మా! భరతవంశంలో మరల సంతానవృద్ధికి ఉపాయాన్ని చెపుతాను. నామాట విను. గుణవంతుడయిన బ్రాహ్మణుని ఎవనినైనా ధనమిచ్చి నియమించు. ఆయన విచిత్రవీర్యుని భార్యలయందు సంతానాన్ని కంటాడు. అప్పుడు సత్యవతి నవ్వుతున్నట్లుగా, సిగ్గుపడుతూ మాటలు కూర్చుకొంటూ భీష్మునితో ఇలా అన్నది. ఆ మాటలలో కొంత సంకోచం కూడా ఉన్నది. 'భారతా! నీవు చెప్పినది సత్యమే. నీ మాది నమ్మకంతో మన వంశాభివృద్ధి కోసం నీకొక మాట చెప్తున్నాను. అటువంటి ఆపద్ధర్మాన్ని పరిశీలించి ఆ మాట నీకు చెప్పకుండా నేనుండలేను. నీవే మన వంశంలో ధర్మాత్ముడవు. నీవే సత్యస్వరూపుడవు, ఉత్తమగతివి కూడా. కాబట్టి నా మాట విని ఆపై కర్తవ్యాన్ని నిర్ణయించుకో

(భరతశ్రేష్ఠా! వసుమహారాజు పేరు నీవు వినిఉంటావు. పూర్వం ఆ మహారాజు శుక్రాన్ని ఒక చేప గర్భంలో భరిస్తే నేను జన్మించాను. పరమధర్మాత్ముడయిన దాశరాజు మా అమ్మను నీటి నుండి పట్టి నన్ను బయటకు తీశాడు. నన్ను ఇంటికి తీసికొనిపోయి కూతురుగా చేసికొన్నాడు.)

ఆ ధర్మాత్ముని నౌకనే నేను ధర్మార్థం నడుపుతుండేదాన్ని. అప్పుడే నాకు యౌవన మారంభమైంది. ఒక రోజు నావపై ఉన్నాను. ఆ సమయంలో ధర్మవేత్తలలో శ్రేష్ఠుడూ, ధీమంతుడూ, మహర్షి అయిన పరాశరుడు యమునా నదిని దాటటానికి పడవనెక్కాడు. నేను యమునను దాటిస్తుండగా కామార్తుడైన ఆ మునిశ్రేష్ఠుడు నాదగ్గరకు వచ్చి మధురవచనాలతో తన జన్మనూ, వంశాన్నీ తెలిపాడు. నేను దాశకన్యను అని నేను తెలిపాను. తండ్రి భయం ఒకప్రక్క, మహర్షి శాపభయం మరొకప్రక్క. అప్పుడు ఆ మహర్షి దుర్లభమైన వరాలనిచ్చి నన్ను ప్రోత్సాహించాడు. నేను తిరస్కరించలేకపోయాను. నేను ఇష్టపడకపోయినా అబలనైన నన్ను ఆ మహర్షి తన తేజస్సుతో లొంగదీసి కొన్నాడు. లోకాన్నంతా చీకటిలో ముంచి, నావలోనే నన్ను కలిశాడు. అంతకుముందు నాదగ్గర

చేపలకంపు కొడుతుండేది. ఆ ముని దానిని పొగొట్టి నాకే దివ్యపరిమళాన్ని ఇచ్చాడు. తరువాత ఆముని– "నీవీ యమునా ద్వీపంలోనే నా కారణంగా కలిగిన గర్భాన్ని వదలిపెట్టి మరలా కన్యగానే మిగిలిపోతా"వని అన్నాడు. ఆ గర్భంనుండి మహాయోగీ, మహాఋషి అయిన పారాశర్యుడు జన్మించాడు. నేను కన్యగా ఉన్నప్పుడే పుట్టిన ఆయనే ద్వైపాయనుడు. పూజ్యుడైన ఆ మహర్షియే తపశ్శక్తితో నాలుగువేదాలనూ విభజించి, లోకంలో వ్యాసత్వాన్ని పొందాడు. నల్లగా ఉన్నాడు కాబట్టి కృష్ణత్వాన్ని కూడా పొందాడు. సత్యవాదీ, శమాసక్తుడూ, తపస్వీ, పాపరహితుడూ అయిన ఆ మహాత్ముడు పుట్టగానే తండ్రితో పాటు వెళ్ళిపోయాడు. సాటిలేని వెలుగులు గల ఆయనను నేనూ, నీవూ పట్టుబట్టి నియమిస్తే ఆయన విచిత్రవీర్యుని భార్యలలో మంచిసంతానాన్ని కనగలడు. ఆపద వచ్చినపుడు నన్ను తలచుకొమ్మని ఆ పారాశర్యుడు అక్కడ నాతో పలికాడు. మహాబాహూ! నీకిష్టమయితే ఆయనను తలచుకొంటాను. భీష్మా! నీకిష్టమయితే ఆ మహాతపస్వి సరిగా విచిత్రవీర్యుని భార్యలకు సంతానాన్ని కలిగిస్తాడు.'

మహర్షి గురించి వినగానే భీష్ముడు చేతులు జోడించి ఇలా అన్నాడు – 'ధర్మం, అర్థం, కామం – ఈ మూడింటిని గురించి పదే పదే ఆలోచించి ధర్మాన్నీ, దానిఅనుబంధఫలితాన్నీ; అర్థాన్నీ, దాని అనుబంధఫలితాన్నీ; అలాగే కామాన్నీ దాని అనుబంధఫలితాన్నీ; విపరీత ఫలితాలనూ వేరువేరుగా ఆలోచించి నిశ్చయించే వాడే తెలివైనవాడు, ధీరుడు. నీవు చెప్పిన మాట ధర్మసహితమైనదీ, మన వంశానికి హితాన్ని కల్గించ గలది కూడా. శ్రేయస్కర మయిన ఈ పద్ధతి నాకు బాగా నచ్చింది.' భీష్ముడు అంగీకరించగానే సత్యవతి కృష్ణద్వైపాయన మునిని స్మరించింది. తల్లి తనను తలచినవదని గ్రహించి, ఆ బుద్ధిమంతుడు క్షణంలో వేదాలు వల్లిస్తూ ప్రత్యక్షమయ్యాడు. సత్యవతి తన కుమారుని విధిపూర్వకంగా అర్చించి, బాహువులతో కౌగిలించి, స్రవిస్తున్న పాలతో ఆయనను అభిషేకించింది. ఆ సత్యవతి చాలా కాలానికి కుమారుని చూచి కన్నీరు నింపుకొంది. సత్యవతి పెద్దకొడుకు వ్యాసుడు కమండలుజలాన్ని కలతపడిన ఆమెపై చల్లి, నమస్కరించి పలికాడు. 'ధర్మతత్త్వమెరిగిన తల్లీ! నీ కోరికను నెరవేర్చటానికి నేను వచ్చాను. నన్ను ఆదేశించు. నీకు ఏవిధంగా ప్రీతిని కల్గించాలి?' ఆ తరువాత పురోహితుడు ఆ పరమమునికి మంత్రపూర్వకంగా శాస్త్రోక్తరీతిలో పూజలు జరిపాడు. వ్యాసుడు వాటిని స్వీకరించాడు. శాస్త్రోక్తంగా, సమంత్రకంగా పూజలంది ఆ వ్యాసుడు ఆనందించాడు. ఆసనస్థుడైన ఆయనను సత్యవతి కుశలక్షేమసమాచారాన్ని అడిగి అతనివైపు చూస్తూ ఇలా పలికింది. 'తల్లిదండ్రులకు కొడుకులు పుడతారు. వారికి తండ్రి యజమాని, తల్లి కూడా అటువంటిదే సందేహం లేదు. బ్రహ్మర్షీ! విధివిధానాన్ని అనుసరించి నీవు నాపెద్ద

కొడుకువు. విచిత్రవీర్యుడు ఆ రీతిగానే నా చిన్నకొడుకు. తండ్రిని బట్టి భీష్ముడు అతని (విచిత్ర వీర్యుని) సోదరుడయినట్టు, తల్లిని బట్టి నీవు కూడా సోదరుడవే. నీవేమను కొంటున్నావో కానీ నా అభిప్రాయమిదే. సత్యవిక్రముడైన ఈ భీష్ముడు సత్యాన్ని పాటిస్తున్నాడు. రాజ్యపాలనయందు కానీ సంతానాన్ని పొందటంలో కానీ భీష్మునకు ఆసక్తి లేదు. కాబట్టి నీ సోదరుని పారలౌకిక హితాన్ని, వంశపరంపరనూ విచారించి ఈ భీష్ముని మాటమేరకూ, నా ఆదేశం మేరకూ, సర్వప్రాణులపై దయ ఉంచి వాటి సంరక్షణ కొరకూ కరుణతో నేను చెప్పినది విని నీవు చేయాలి. నీవు అనఘుడవూ, కోమల హృదయుడవూ. నీ చిన్న తమ్ముని భార్యలు దేవకాంతల వంటివారు. రూపయౌవనసంపన్నలు. ధర్మబద్ధంగా సంతానాన్ని అభిలషిస్తున్నవారు. వారియందు బిడ్డలను కను. నాయనా! ఈ వంశరక్షణకూ, అభివృద్ధికి అనురూపమైన సంతానాన్ని ఇవ్వటానికి నీవు సమర్థుడవు.' అపుడు వ్యాసుడిలా అన్నాడు. 'నీకు లౌకిక - అలౌకికధర్మాలు రెండూ తెలుసు. మహాప్రాజ్ఞీ! నీ బుద్ధి కూడా ధర్మనిబద్ధం. కాబట్టి నేను ధర్మకారణంగా నీ ఆదేశాన్ని మన్నించి నీ కోరిక తీరుస్తాను. ఇది సనాతనమైన ధర్మమే. సోదరుని కొరకు మిత్రావరుణులతో సమానమైన కొడుకులను ప్రసాదిస్తాను. ఆ రాణులిద్దరూ నేను చెప్పినట్టు సంవత్సరం పాటు నియమం తప్పకుండా వ్రతాన్ని ఆచరించాలి. అప్పుడు పరిశుద్ధులు అవుతారు. వ్రతపాలన చేయని ఏ స్త్రీ కూడా నా దగ్గరకు రాలేదు.' సత్యవతి ఇలా అన్నది. 'ఏంచేస్తే ఆ రాణులు వెంటనే గర్భవతులు కాగలరో ఆ ప్రకారం చెయ్యి. రాష్ట్రంలో రాజు లేకపోతే ప్రజలు అనాధలై నశిస్తారు. ధర్మార్థమయిన క్రియలన్నీ నశిస్తాయి. వానలు పడవు. దేవతానుగ్రహం ఉండదు. అరాజకంగా రాష్ట్రాన్ని పాలించటం కష్టం. కాబట్టి నీవు గర్భాధానం చేయి. భీష్ముడు పెంచి పోషిస్తాడు.'

వ్యాసుడిలా అన్నాడు. 'సోదరునకు వ్యవధిలేకుండా ఇప్పుడే పుత్రుని ప్రసాదించాలంటే ఆ రాణులు నా విరూపతను సహించగలగాలి. వారికి ఇది ప్రధానమైన వ్రతం. నా శరీరగంధాన్నీ, రూపాన్నీ, వేషాన్నీ, శరీరాన్నీ భరించగలిగితే అంబిక నేడే ఉత్తమ గర్భాన్ని పొందవచ్చు. మహాతేజోమూర్తి అయిన వ్యాసుడు సత్యవతితో అలా పలికి మరల "ఆ కౌసల్యను శుభ్రవస్త్రాలు ధరించి, అలంకరించుకొని శయ్యపై కలుసుకోనేందుకు ఎదురుచూడ" మను అనిచెప్పి అంతర్ధానమయ్యాడు. తరువాత సత్యవతి ఏకాంతంగా కోడలిని సమీపించి ధర్మార్థయుక్తమై, హితకరమైన మాటను చెప్పింది ఇలా- 'కౌసల్యా! ధర్మసంగతమయిన మాటను చెప్పబోతున్నాను. జాగరూకతతో విను. నా భాగ్యం నశించి భరతవంశ మిప్పుడు విచ్ఛిన్నం కాబోతోంది. అది స్పష్టంగా కనిపిస్తున్నదే. నశిస్తున్న పితృవంశాన్నీ, బాధపడుతున్న నన్నూ చూచి భీష్ముడు వంశాభివృద్ధికోసం నాకొక ఆలోచన చెప్పాడు. అది నెరవేరటం నీ చేతిలో ఉంది. వత్సా! నన్ను ఆ స్థితికి తీసికోనిపో. నశించిన భారతవంశాన్ని మరల

సముద్ధరించు. దేవేంద్రుని వంటి బిడ్డను కను. వాడు మన వంశానికి చెందిన ఈ మహారాజ్యభారాన్ని వహించగలుగుతాడు.' సత్యవతి ధర్మచారిణి అయిన అంబికను, ధర్మాన్ని ముందుంచుకొనియే ఎలాగో ఒప్పించి విప్రులనూ, దేవర్షులనూ, అతిథులనూ భోజనంతో తృప్తిపరచింది.

105. ధృతరాష్ట్ర-పాండు-విదురుల జననము.

ఆ తరువాత సత్యవతి తగిన వేళలో ఋతుస్నాత అయిన తన కోడలిని శయ్యపై కూర్చుండబెడుతూ మెల్లగా ఇలా అన్నది. 'కౌసల్యా! నీకొక బావ ఉన్నాడు. ఈరోజు ఆయన నీదగ్గరకు గర్భాధానానికై వస్తాడు. సావధానంగా ఎదురుచూడు. అర్ధరాత్రివేళ ఇక్కడకు రాగలడు.' అత్తగారి ఆ మాటను విని పవిత్రమైన ప్రక్కపై పరుండిన ఆ అంబిక మనస్సులో భీష్మునీ, ఇతర కురువంశశ్రేష్ఠులనూ తలపోసింది. ఆ తరువాత అంతకుముందే అంబికయందు నియోగింపబడిన సత్యవచనుడైన ఆ వ్యాసుడు దీపాలు వెలుగుతుండగా ఇంటిలో ప్రవేశించాడు. నల్లగా ఉన్న ఆ వ్యాసునీ, రాగిరంగులో ఉన్న జటలనూ, వెలుగుతున్న కళ్ళనూ, కపిల వర్ణంలోని గడ్డం మీసాలను చూచి ఆమె కళ్ళు మూసికొన్నది. తల్లికోరిక తీర్చదలచి ఆమెతో వ్యాసుడు సంగమించాడు. భయంవలన అంబిక అతనిని చూడలేకపోయింది. శయ్యాగారం నుండి బయటకు వచ్చిన వ్యాసుని "నాయనా! ఆమెకు గుణవంతుడైన రాజపుత్రుడు జన్మిస్తాడా?" అని అడిగింది. తల్లిమాటలు విని సత్యవతీనందనుడైన వ్యాసుడిలా అన్నాడు - 'పదివేల ఏనుగుల బలంగలవాడూ, పండితుడూ, రాజర్షి శ్రేష్ఠుడూ, మహాభాగుడు, మహాపరాక్రమ వంతుడు, మహాబుద్ధి అయిన కొడుకు పుడతాడు. ఆ మహాత్ముడికి కూడా వందమంది కొడుకులు పుడతారు. కానీ తల్లి దోషం వలన అతడు గ్రుడ్డివాడవుతాడు.' వ్యాసుని ఆ మాటలు విని తల్లి కొడుకుతో మరలా ఇలా అన్నది 'మహర్షీ! గ్రుడ్డివాడు కురురాజుగా తగినవాడు కాదు. దాయాదుల వంశాన్ని రక్షిస్తూ, వంశాన్ని అభివృద్ధి చేయగల వానిని మరొకనిని కురువంశరాజుగా ప్రసాదించాలి.' అలాగే అని మాట ఇచ్చి మహాయశస్వి అయిన వ్యాసుడు నిష్క్రమించాడు.

ఆ అంబిక ప్రసవవేళ సమీపించగా గ్రుడ్డికొడుకును కన్నది. మరల సత్యవతి రెండవకోడలితో మాటాడి ఒప్పించి ఇంతకుముందులాగానే వ్యాసమహర్షిని ఆహ్వానించింది. ఆ తరువాత అంతకుముందులాగానే వ్యాసుడు అంబాలిక దగ్గర చేరాడు. ఆమె కూడా ఆ మహర్షిని చూచి తెల్లబోయింది. భయపడి, తెల్లబోయి, విషాదంతో ఉన్న ఆమెతో సత్యవతీ సుతుడైన వ్యాసుడిలా అన్నాడు. 'వికారంగా కనిపిస్తున్న నన్ను చూచి తెల్లబోయావు

కాబట్టి నీకు పుట్టబోయే కొడుకు పాండువర్ణంతోనే ఉంటాడు. అతనిపేరు కూడా పాండుడే అవుతుంది.' ఆ మాటలు చెప్పి పూజ్యుడైన ఆ ఋషిపుంగవుడు వెళ్ళిపోయాడు. ఆపై బయటకు వచ్చిన కుమారుని చూచి సత్యవతి బిడ్డ గురించి అడిగింది. ఆయన మరల ఆ బాలుడు పాండురోగి అవుతాడని చెప్పాడు. సత్యవతి మరల మరొక బిడ్డకోసం అభ్యర్థించింది. అలాగే అని వ్యాసమహర్షి తల్లికి సమాధానమిచ్చాడు. ఆ తరువాత అంబాలిక ప్రసవవేళ సమీపించగానే పాండువర్ణం గల కొడుకును కన్నది. దివ్యకాంతితో వెలిగిపోతున్నట్లు పాండుడు కనిపించాడు. ఆ పాండురాజు కొడుకులు అయిదుగురూ మేటి విలుకాండ్రయ్యారు. ఆ తరువాత సత్యవతి ఋతుకాలంలో పెద్దకోడలిని వ్యాససంగమానికై నియోగించింది. దేవకాంతవంటి ఆమె ఆ మహర్షి రూపాన్నీ, శరీరవాసననూ, తలచుకొని బెదిరిపోయి అత్తగారి మాటను పాటించలేదు. ఆపై అంబిక తన దాసికి తన నగల నన్నింటినీ ధరింపజేసి, అచ్చరగా తీర్చి వ్యాసుని దగ్గరకు పంపింది. ఆమె తన చెంతకువచ్చిన మహర్షిని ఎదురేగి, నమస్కరించి ఆయన అనుమతితో శయ్యకు చేరి సత్కృతులు నెరిపి ఉపచారాలు చేసింది. మహర్షి ఏకాంతంలో ఆమెను కలిసి కామోపభోగంతో సంతుష్టిని పొందాడు. రాజా! తీవ్రవ్రతధారి అయిన ఆ వ్యాసమహర్షి ఆమెతో పరుండి లేచాడు. శయ్యనుండి లేస్తూ ఆమెతో ఇలా అన్నాడు – శుభాంగనా! ఇకపై నీవు దాసివి కావు. నీ కడుపున శ్రేష్ఠుడైన కొడుకు పుట్టబోతున్నాడు. అతడు పండితశ్రేష్ఠుడూ, ధర్మస్వరూపుడూ కాగలడు. ఆ బాలుడే విదురుడు. కృష్ణద్వైపాయనుని కొడుకు. తండ్రి ఒక్కడే కాబట్టి ఆ విదురుడు ధృతరాష్ట్రపాండు రాజులకు తమ్ముడయ్యాడు. మహాత్ముడైన మాండవ్యుని శాపం వలన ధర్ముడే విదురుడుగా పుట్టాడు. ఆయన అర్థతత్త్వం తెలిసినవాడూ, కామక్రోధాలను విడిచినవాడూ. కృష్ణద్వైపాయనుడు ఇది కూడా సత్యవతికి చెప్పాడు. అంబిక తనను మోసగించటాన్ని, దాసికి కొడుకు పుట్టబోవటాన్ని వివరించాడు. ఈవిధంగా వ్యాసుడు తల్లిఋణం, తీర్చికొని గర్భవృత్తాంతాన్ని ఆమెకు చెప్పి, అక్కడే మాయమయ్యాడు. విచిత్రవీర్యుని భార్యలయందు కృష్ణద్వైపాయనుడు అనుగ్రహించిన ముగ్గురు కొడుకులూ, దేవకుమారులవలె కురువంశవివర్ధకు లయ్యారు.

106. అణీమాండవ్యోపాఖ్యానము.

జనమేజయుడు ఇలా అడిగాడు. 'ధర్ముడు శాపాన్ని పొందవలసి నంత తప్పు ఏం చేశాడు? ఏ బ్రహ్మర్షి శాపం వలన శూద్రజాతియందు జన్మించాడు?' వైశంపాయనుడిలా అన్నాడు. 'మాండవ్యుడని ప్రసిద్ధికెక్కిన ఒకానొక బ్రాహ్మణు డుండేవాడు. అతడు ధీరుడూ,

సర్వధర్మజ్ఞుడూ, సత్యతపోనిష్ఠుడునూ. మహాతపస్వీ, మహాయోగీ అయిన ఆ మాండవ్యుడు ఆశ్రమద్వారం దగ్గర చెట్టుక్రింద ఊర్ధ్వబాహుడై మౌనవ్రతాన్ని స్వీకరించి ఉండేవాడు. ఆ మహర్షి తపస్సులో మునిగిఉండగా చాలా కాలానికి కొందరు దొంగలు దొంగలించిన సొమ్ముతో ఆ ఆశ్రమానికి వచ్చారు. అనేకసైనికులు తరుముతుండగా ఆ దొంగలు భయంతో ఆ మునికుటీరంలో దొంగిలించిన ఆ సొమ్మును ఉంచి, రక్షకులు అక్కడకు వచ్చేలోగా దాగుకొన్నారు. వారు దాగగానే వారిని వెంటపడి తరుముతున్న ఆ రక్షకులు వచ్చి ఆ ఋషిని చూశారు. అప్పుడా సైనికులు ఆవిధంగా ఉన్న ఆ తపోధనుని "ద్విజోత్తమా? దొంగలు ఎటువెళ్ళారు? అంతకన్న వేగంగా మేము వెళ్ళి వారిని పట్టుకొంటాం" అని అడిగారు. ఆరక్షకులు అలా అడుగుతున్నా ఆ తపోధనుడు మంచి కానీ, చెడు కానీ ఒక్కమాట కూడా పలుకలేదు. అప్పుడు రాజసైనికులు ఆశ్రమమంతా వెదకుతూ దాగి ఉన్న దొంగలనూ, అపహరించిన ద్రవ్యాన్నీ చూశారు. అప్పుడు ఆ రక్షకులకు ముని మీదనే అనుమానం కలిగింది. ఆయననూ, దొంగలనూ కూడా బంధించి రాజుకు నివేదించారు. ఆ రాజు దొంగలతో పాటు ఆ మునిని కూడా చంపవలసినదిగా ఆదేశించాడు. ఆ మహాతపస్వి ఎవరో తెలియని సైనికులు ఆయనను శూలంలో దించారు. మహారాజా! ఆ విధంగా సైనికులు ఆ మునిని శూలమెక్కించి, ఆ సొమ్మునంతా క్రైవసం చేసికొని, వెళ్ళిపోయారు. ఆ పై శూలంపై నున్న ఆ ధర్మాత్ముడు- బ్రహ్మర్షి-ఆహారం లేకపోయినా చాలాకాలం మరణించలేదు. ఆ మహర్షి ప్రాణాలను కాపాడుకొంటూ స్మరణమాత్రంతో ఋషులను తనదగ్గరకు పిలిపించుకొన్నాడు. శూలంపై తపిస్తూ తపస్సు చేస్తున్న ఆ మహాత్ముని చూచి తపోధను లయిన మునులు ఎంతో దుఃఖించారు. భారతా! వారంతా రాత్రివేళ పక్షులైవచ్చి తమశక్తి ననుసరించి ఆయనకు కనిపించి, ఆ ద్విజోత్తముని ఇలా అడిగారు. 'బ్రాహ్మణా! శూలంపై ఆరోపింపబడి ఇంతగా దుఃఖాన్నీ, భయాన్నీ అనుభవించవలసినంత గొప్ప పాపం మీరేం చేశారో వినాలనుకొంటున్నాం.'

107. మాండవ్యుడు యమధర్మరాజును శపించుట.

అపుడు ఆ మునిశ్రేష్ఠుడు "ఎవరిపై దోషాన్ని ఎత్తి చూపగలను. నాకు కీడు చేసిన వాడెవ్వడూ లేడు" అని ఆ తాపసులతో అన్నాడు. మహారాజా! రక్షకులు అక్కడ ఆ విధంగా శూలంపై చాలాకాలం కూర్చొని ఉన్న ఆ వృత్తాంతాన్ని అంతా యథాతథంగా రాజుకు తెలియజేశారు. ఆ రాజు వారి మాటలు విని మంత్రులతో కలిసి నిశ్చయించుకొని, ఆ విధంగా శూలంపై ఉన్న ఆ మునిసత్తముని ప్రసన్నుని చేసికొనబోయాడు. 'ఋషిశ్రేష్ఠా!

మోహంతోనో, అజ్ఞానంతోనో నేను అపకారం చేశాను. నాపై తమరు కోపగించవలదు. అనుగ్రహించవలసినదిగా కోరుతున్నాను.' రాజు ఈ విధంగా పలికిన తర్వాత మహర్షి ప్రసన్నుడైనాడు. అనుగ్రహించిన ఆ మునిని రాజు శూలాన్నుండి దింపించాడు. క్రిందకు దించి మొదలంటా శూలాన్ని శరీరం నుండి వేరు చేయాలని ప్రయత్నించాడు. కానీ మొత్తం బయటకు తీయలేక శరీరంలో ఉన్నంత మేర శూలాన్ని నరికించాడు. అప్పటినుండీ ఆముని శూలం ముక్కను శరీరంలోనే నిలుపుకొని జీవించాడు. తన తీవ్రతపః ఫలితంగా ఇతరులకు దుర్లభమయిన పుణ్యలోకాలను పొందాడు.

అణి (శూలాగ్రభాగం) శరీరంలోనే నిలిచిపోయింది, కాబట్టి అణీమాండవ్యుడని లోకప్రసిద్ధిని పొందాడు. పరమాత్మజ్ఞాని అయిన ఆ విప్రుడు చనిపోయాక యమధర్మరాజు భవనానికి వెళ్ళి, ఆసనంపై ఉన్న ఆయనను చూచి- నేను ఇంత ఫలితాన్ని ఈ రీతిగా అనుభవించటానికి కారణంగా నేను తెలియక చేసిన పెద్దనేరమేమిటి? వెంటనే నాకు వాస్తవ స్వరూపాన్ని తెలుపు. లేదా నా తపస్సు బలమెంతో చూడు- అంటూ నిందించాడు. ధర్మరాజు ఇలా అన్నాడు. 'తపోధనా! నీవు రెక్కల పురుగుల వెనుకభాగాన దర్భపోచలను గ్రుచ్చావు. దానివలన నీవీ ఫలితాన్ని పొందావు. బ్రహ్మర్షీ! **స్వల్పదానమయినా ఎన్నో రెట్లు ఎక్కువగా ఫలిత మిచ్చినట్టు స్వల్పమైన అధర్మం కూడా అనేక దుఃఖఫలాల నిస్తుంది.**' అణీమాండవ్యుడిలా అన్నాడు 'నేను ఏ వయస్సులో ఆ పని చేశానో నాకు ఉన్నదున్నట్లు చెప్పు.' నీవు చిన్నతనంలో ఆ పని చేశావని ధర్మరాజు తెలిపాడు. అణీమాండవ్యుడిలా అన్నాడు. 'బాలుడు పండ్రెండు సంవత్సరాల వయస్సు వచ్చేవరకు ఏ పని చేసినా అది తప్పుకాదని ధర్మశాస్త్ర నిర్ణయం. ఆ వయస్సులో బాలునకు ధర్మశాస్త్రాలు తెలియవు గదా! నేను చేసినది చిన్న తప్పే అయినా పెద్ద శిక్ష విధించావు. సర్వప్రాణివధ కన్న బ్రాహ్మణవధ పెద్దది. కాబట్టి ధర్మరాజా! మానవలోకంలో శూద్రుడవై నీవు జన్మిస్తావు. అంతేకాదు. నేటినుండి లోకంలో ధర్మఫలితాన్ని ప్రకటించే ఒక హద్దును కూడా ఏర్పాటు చేస్తున్నాను. పదునాలుగు సంవత్సరాల వయస్సు వరకు ఎవరికీ పాపమంటదు. ఆ తర్వాత పాపం చేసిన వారికే దాని ఫలిత ముంటుంది.' ఈ తప్పువలన మహాత్ముడైన అణీమాండ్యవుని శాపం వలన యమధర్మరాజు విదురుడుగా శూద్రుడై జన్మించాడు. ఆ విదురుడు ధర్మార్థకుశలుడు. లోభం, క్రోధం లేనివాడు. దీర్ఘదర్శి, శాంతిపరాయణుడు. కురువంశస్థుల, శ్రేయస్సు మీదనే ఆసక్తిగలవాడు.

గగయ్య గ్రంథాలయ
96351

ఇది ఆదిపర్వం మొదటిభాగం

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందం కొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.